కిం కర్తవ్యం?

ప్రత్యేక సంచిక

అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2014

విషయసూచిక

13/01/2014.

ప్రథమ భాగం: చేయవలసినదేమిటి

ద్వితీయ భాగం: దైనందిన అభ్యాసం

నళినికాంత గుప్తగారి ప్రసంగం:

"చేయువలసినదేమిటి?"

సృష్టి పరిణామచక్రం యుగాలలో పరిభ్రమిస్తూ ఉంటుంది; ఒక పరిభ్రమణం పూర్తి అవగానే ప్రళయం వస్తుందని చెప్పబడింది — అప్పటి చైతన్యస్థాయి లేదా ఆ చైతన్యం నుంచి అవతరించిన వివిద రకాల అస్తిత్వాలు నశించిపోతాయి, గతమంతా కొట్టుకుపోతుంది, సృష్టించబడినదంతా తుడిచిపెట్టబడి, నూతన శకం ఆరంభమవుతుంది.

మన కందరికీ అటువంటి ఒక యుగం గురించి తెలుసు, మనం దానికి సాక్షులం కూడా; నేను చెప్పేది, ప్రస్తుత యుగం గురించి, ఒక విధంగా గతించిపోయి, మృతమైపోయినా, ఇంకా వర్తమానంలో ఉన్నదే. మనకు పదార్థం ఈథర్ అనే తేలికై అంతటా వ్యాపించి ఉన్నదాని నుంచి పరిణమించిందని తెలుసు. జీవం మృతపదార్థం నుంచి ఉద్భవించింది, మనస్సు జీవం నుంచి పరిణమించింది. పూర్తిగా కచ్చితంగా తెలియకపోయినా, మనకు తెలిసిన విషయం, ఏ విధంగా జీవం జీవంలేని పదార్థం నుంచి వచ్చిందో లేదా మనస్సు మనస్సులేని జీవంలోకి ప్రవేశించగలిగిందో, అనగా జంతుజాలంలోకి అది 'ఏ విధంగా' నంటూ ఎన్నో ప్రశ్నలు, సాధ్యాసాధ్యాలతో కూడిన ఎన్నో సమాధానాలు.

మనం ఒక మాట చెప్పుకోవచ్చు. శ్రీఅరవిందులు, శ్రీమాత మనకు చెప్పింది, రెండు పద్ధతులున్నాయనే విషయం: ఒక పక్షంలో భవిష్య చైతన్యస్థాయి బీజం ప్రారంభం నుంచే ఇప్పుడున్నదానిలో నిక్షిప్తమై ఉన్నదనే విషయం, అది నిద్రాణస్థితిలో ఉండి ఉంటుంది; మరొక పక్షంలో పైనుంచి లేదా బ్రహ్మాండావరణ నుంచి లేదా ఎక్కడో ఒక చోట నుంచి, ఒక మెరుపు తాకిడి లేదా శక్తిలాగా బహిర్గతమవబోయే చైతన్యం వాతావరణంలోకి దిగివచ్చింది. అప్పుడు దాని ఒత్తిడికి నిద్రాణమై ఉన్న బీజం జాగృతమై, పైనున్న ఆత్మను కలవటానికి నిటారుగా పైకి లేచింది — ఆ రెండూ కలిసి ఒక కొత్త జీవితం వృద్ధికి అంకురార్పణ చేసాయి.

ఆ విధంగా పదార్థం నుంచి జీవం, జీవం నుంచీ మనస్సు — మనిషి పుట్టాడు. అవును, ఇప్పటి వరకు జరిగిన భూపరిణామక్రమంలో మనిషి శిఖరాగ్రాన ఉన్నాడు.

అతనిలో మనస్సు లేదా మానసిక చైతన్యం ఎంతగా అత్యున్నత స్థాయికి చేరగలదో అంత మట్టుకు చేరిందని చెప్పవచ్చు. అయినప్పటికీ, మనిషి పూర్తిగా మానసికజీవి కాడు, అతడు ఒక మానసిక జంతువు.

అతని ఆధారంలో మనస్సుకు పూర్తి ఆధిపత్యం లేదు; మానసిక శక్తిని నిజంగా పరిపాలిస్తూ దానికి ప్రభువై నడిపించేది జీవసూత్రం, అతనిలోని పశువు, అతని ప్రాణిక అస్తిత్వం, తిరిగి అది అతనిలో పరోక్షంగానున్న పశుప్రాయ పదార్థానికి బానిస. కనుక మనిషి, ఎంత మానసిక వైభవం ఉన్నప్పటికీ, అతడు ఒక ప్రమాదకరమైన ప్రాణి — ప్రమాదకరం ఎందువల్లనంటే, అతనిలోని ప్రాణికం అతని సొంత ఆత్మను నాశనం చేసే దిశగా అతనిని నడిపించడమే కాకుండా, అతని చుట్టూ వ్యాపించివున్న దానినంతా నాశనం చేసే దిశగా అతనిని ప్రోత్సహిస్తుంది. విశ్వమహాప్రకృతి చేసే వింతప్రయోగం మనిషి.

ఆ విధంగా ఇప్పటిదాకా, పరిణామంలోని వృద్ధి లేదా పురోగతి అంతా మహా అస్పష్టత నుంచి తక్కువ అస్పష్టతకూ, మహా అజ్ఞానం నుంచి తక్కువ అజ్ఞానానికీ, గొప్ప బాధ నుంచి తక్కువ బాధకూ, ఏదో వెనుక నుంచి — ఒక విధమైనది ఏదో, దాని అంతస్సారంలో ఆనందమూ, చైతన్యమూ, ఉనికినీ గురించిన భావన కలిగినది — ఈ గమనాని కంతటికీ మొదటి నుంచి చివరిదాకా ఆధారమౌతూ భద్రంగా కాపాడుతూ ఉన్నప్పటికీ, పరిణామగతి ఆ విధంగానే ఉంటూ ఉన్నది. అందులో వైభవోపేతమైన వెలుగు, స్వల్పకాలికమైన వైనప్పటికీ ఆనందం, సామరస్యతల వైభవోపేతమైన భావస్ఫోరకాలు, అత్యంత శ్రేష్ఠమైన శక్తి సృజనాత్మకతల మహా వెల్లువలు ప్రకటితమయ్యాయి; అయినా మొత్తం మీద, అది సృష్టిపరంగానూ లేదా రూపాత్మకమైన ఉనికిపరంగానూ సమగ్ర పరిపూర్ణతకు ఎంతో దూరంలో ఉన్నది. మనిషి సైతం పురోభివృద్ధిమార్గంలో అంతిమంగా తానే సర్వోన్నతుడని కలలు కనడు. అటువంటప్పుడు, తరువాత ఏమిటి?

తార్కికంగా తరువాతి అడుగు తప్పకుండా మనస్సును మించినదై ఉంటుంది — ఒక విధంగా ఇంకా శ్రేష్ఠమైనదాని మీదా, గొప్పదాని మీదా ఆధారపడి ఉండే సృష్టి అది. శ్రీఅరవిందులు ప్రకటించినదేమంటే అది కొత్త యుగం, కొత్త పరిణామ యుగం, సత్యం మీద ఆధారపడినది — సత్యంలో దాని వృద్ధి ఉంటుంది, దాని పురోభివృద్ధి సత్యం నుంచి అధికతర సత్యానికి, వెలుగు నుంచి అధికతరమైన

వెలుగుకు, ఆనందం నుంచి అధికతరమైన ఆనందానికి ఉంటుంది.

దానికి ప్రారంభంగా, కొత్త సత్యచైతన్యాన్ని — దానికి శ్రీఅరవిందులు అతిమనస్సని పేరు పెట్టారు, ఈ భూవాతావరణంలోకి కిందికి తీసుకురావాలి, ఫలితంగా సృష్టి అంతరాంతరాళాల్లోని లోలోతులలో దాగిన సత్యాన్ని అది మేల్కొలపగలదు. ఆ పనిని చేయడానికి శ్రీఅరవిందులు, శ్రీమాత మానవరూపంలో రెండు అర్ధగోళాలకు వారధిగా వచ్చారు. మానవమూసలో వారు మానవజాతికే కాకుండా — మానవచైతన్యంలోని అన్ని మూలకాలను — సమస్త భూప్రకృతిలో మానవరూపంతో ప్రాతినిధ్యం వహించిన సమస్తమునకూ ప్రాతినిధ్యం వహించారు. ఆ వచ్చేదానిని అందుకోవడానికి భూమి, మనిషి తరఫున తమ శరీరాలను వారు ఖాళీపాత్రలుగా పట్టి వుంచారు; దానిని వారు కిందికి పిలిచారు, ఈ వాతావరణంలో దానిని ప్రతిష్ఠించారు, అనంతరం తమను ఉపసంహరించుకున్నారు — ఎందుకనగా వారు ఏ పని కోసం భౌతికరూపాన్ని ధరించారో ఆ పని నెరవేరింది.

అవును, ఆ పని సఫలీకృతమైంది. ఇప్పుడు ఆ కొత్త చైతన్యం పరివ్యాప్తిచెంది, తన స్థానాన్ని నిలుపుకుంటుంది. అది మహాసత్య చైతన్యం; దాని ఉనికితోనే అది అజ్ఞాన, అసత్యాల కదలికలను భగ్నం చేస్తుంది, మహాసత్యానికి విరుద్ధమైన రూపాలను చెదరగొట్టి, కూల్చివేస్తుంది; దానిని ప్రతిఘటించేవాటిని, ఖండించేవాటిని నాశనం చేస్తుంది. అది తథ్యం.

శ్రీమాతారవిందులు వారి అపారమైన దయతో, మరింత ఎక్కువే చేశారు. అది ఒక్క దైవానికి మాత్రమే సాధ్యం: అంతిమంగా సత్యం ప్రభావం అసత్యం మీద ఏ విధంగా ఉంటుందో వారికి తెలుసు, కనుక వారు వారి ప్రేమాస్పదమైన చేతులను చాపి అజ్ఞానంలో కొట్టుకుమిట్టాడుతున్న శిశువులను విధి వినాశనం నుంచి తప్పించి, సత్యం రెక్కల నీడలోనే వారికి భద్రత కల్పించే ప్రయత్నం చేశారు; అయితే ఎవరు ఆ ఆశ్రయం పొందటానికి సుముఖంగా ఉంటారో వారికి మాత్రమే అది లభ్యమౌతుంది. మనుషులకు చేసే ఈ దివ్యసేవను వారికి అందించడంలో సహాయం చేయడానికి, కొన్ని — బహుళ సంఖ్యలో మాత్రం కాదు — ఆత్మలు ఆ అవతారమూర్తులతో పాటుగా ఏతెంచాయి.

శ్రీమాతారవిందులు తమ భౌతికరూపాలను, ఉనికిని వారికి నిచ్చెనలుగా ఎక్కడానికి సమర్పించారు — లేదు, వారిని పైకి ఎత్తుకుని తీసుకుపోవడానికి. ఏ

విధంగా గొంగళిపురుగు తన గూడును తెంచుకుని సీతాకోకచిలుకలాగా ఎగరటానికి మారిపోతుందో, ఆ విధంగా తమ అజ్ఞాన మానవచైతన్యాన్ని దులపరించుకుని, మానవ అస్తిత్వాలు అతిమానస ఆధ్యాత్మిక అస్తిత్వాలుగా ఎదగటానికి వారు అమరిక చేశారు — కాని, ఏం లాభం, మనిషి విఫలుడయ్యాడు. బహుశా, ఆ కొత్త భవిష్యవిధి అతనికి చాలా కొత్తదయిందేమో, ఆ వెలుగు ఇప్పటివరకు అంధకారానికి అలవాటుపడిన అతని కనులకు బైర్లు కమ్మేసిందేమో. బహుశా విధిలో ఇంకా గాఢత కలిగి ఆవశ్యకమైనవీ, నిగూఢమైన కారణాలూ ఉన్నవేమో. ఏది ఏమైనా, మనిషి విఫలుడయ్యాడు, మనిషి సహాయాన్ని తిరస్కరించాడు, దానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు; పురాణ గాథలలో రాక్షసుల మాదిరిగా ప్రవర్తించాడు, మనిషి కొత్త చైతన్యాన్ని తన స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలనుకున్నాడు; అతని మానవ ఆత్మ దివ్యసత్యాన్ని శిరసావహించడానికి తిరస్కరించింది; ఆ విధంగా మనిషి తనకు ఇవ్వజూపినదానిని తిరస్కరించాడు.

సమయం మించిపోయింది. శ్రీఅరవిందులు, శ్రీమాత దేహపరిత్యాగం చేశారు; కాని వారు భూమిని వీడలేదు. మనందరకు ఆధారమౌతూ, భద్రత కల్పిస్తూ, వారి సన్నిధి ఇంకా ఇక్కడే ఉన్నది. అది ఏ విధమైన ఆధారమంటే, మనం ఇంకా ఆ మహాసత్యానికి అంటిపెట్టుకునే విధంగా, మనం ఇంకా ఆ మహాసత్యానికి మన సేవను అందించే విధంగా వారి ప్రేమ, వారి సన్నిధి ఇంకా మనలను పరివేష్టించి, మనకు దన్నుగా ఉన్నది. వారు చేసేదంతా మన నిజమైన అస్తిత్వ క్షేమం కోసం, మన ఆత్మలను రక్షించటం కోసం. ఎవరైతే తమ ఆత్మ కోసం జీవిస్తారో, వారిని ఎప్పటి మాదిరిగానే శ్రీమాత కరాబ్జాలు ముందుకు తీసుకుపోతూనే ఉంటాయి.

కాని కొంత వ్యత్యాసం ఉంది.

మనం ప్రళయం గురించి చెప్పుకున్నాం; మీ చుట్టూ చూసినట్లైతే, మీకు అది కచ్చితంగా మొదలైందని అనిపిస్తుంది. కొత్త చైతన్యం, ముందుగానే ఊహించినట్లుగా, తన పని మొదలుపెట్టింది; దాని ఆగమనానికి అడ్డువచ్చే వాటన్నింటిని సంపూర్ణంగా నాశనం చేయడంతో దాని మొదటి దశ ప్రభావం ఆరంభమైంది. ప్రపంచమంతా సమస్యల కష్టాల సుడిగుండంలో చిక్కుకున్నట్లుగా తోస్తున్నది — క్రమబద్ధంగా నడిపించే సువ్యవస్థిత ప్రమాణాలన్నీ ఛిన్నాభిన్నమైపోతున్నాయి, ప్రభుత్వాలు కిందుమీదవుతున్నాయి, అసత్యం, అవినీతి మన మూలాలనే

తినేస్తున్నాయి, మనిషి దయ్యం పూనినట్లై, దాని ప్రేరణలతో, కోరికలతో ప్రవర్తిస్తూ, భూమండలం మొత్తాన్ని సర్వనాశనం చేసే దిశగా సాగిపోతున్నాడు.

మానవ ఆత్మ ఏమి కానున్నది? ఈ ఆత్మ ఏమిటి? అది దివ్యభాను కిరణం; అది తన సొంత లాభం కోసం కిందికి రాదు, అది కిందకు వచ్చేది ఎందుకంటే కింద నున్న అంధకారాన్ని ప్రకాశంతో పటాపంచలు చేసి, తన నిజప్రకాశాన్ని ప్రజ్వలింప జేయడానికే. ఆత్మలు ఇక్కడికి కిందికి దిగివస్తాయి, ఇక్కడ ఉన్న అజ్ఞానంతో, ఎరుక లేమితనంతో కలిసిపోయి నివసిస్తూ లేదా వాటిని వస్త్రంగా ధరిస్తూ, వాటిని సాధ్యమైనంతవరకు పరిశుద్ధపరచి, తేజోమయం గావించి, తదుపరి, ఆ పనిని తిరిగి కొనసాగించటానికి కొంతకాలం విశ్రాంతి తీసుకుంటాయి. ప్రళయం సంభవించి నప్పుడు, అవి తమ మూలస్థానమైన శ్రీమాత చైతన్యంలోకి వెనక్కి వెళ్ళిపోతాయి; ఇది అత్యంత సాహసోపేతమైన ప్రేమయాత్ర యొక్క అద్భుత రహస్యం. నేడు కూడా ఆత్మలు విశ్రాంతిలోకి వెళ్ళిపోతుంటాయి; అవి నశించవు. ఇప్పటి ఈ భూమి నాశనమైపోయినా, ఆత్మలు క్షేమంగా శ్రీమాత చైతన్యం ఒడిలో భద్రంగా సేదతీరుతాయి. బహుశా వాటితోపాటుగా రూపపరివర్తన చెంది, ఎరుకలోకి తీసుకు రాబడి పవిత్రం చేయబడి, తగిన అర్హతతో సిద్ధంచేయబడిన ఆ భూచైతన్య భాగాలు కూడా భద్రపరచబడతాయి. కాబట్టి, పని పూర్తిగా ముగిసిపోలేదు; ఎవరైనా ఎంతో కొంత భవిష్యత్తు కోసం ఇంకా భద్రపరచవచ్చు.

ఒకసారి ప్రళయం సంభవించడం లేదా సర్వనాశనం అయిన తర్వాత — అది జరగవలసినదే, ఆవశ్యకమైనదే — శిధిలాల నన్నింటిని తొలగించవలసినదే కదా. ఆ రెండు పనులు కలిసి చేయబడతాయి. వేదిక ఒకసారి శుభ్రపరచబడిన తర్వాత, నూతన సృష్టి, నూతన యుగం మొదలవుతుంది. ఇది ఈ విధంగా తయారయ్యే క్రమంలో, సహజంగానే మన మానవ భావనాపరంగా మనిషికి, భూమికి సంబంధించినంతవరకు చాలా వరకు నష్టమైపోతుంది. అదే విధంగా ఆశ్రమం కూడా; ఎందువల్లనంటే, ఆశ్రమం భూమికి కిరీటం కాబట్టి, అది తప్పించుకోలేదు. చెప్పాలంటే, ఇక్కడ జరగబోయేది అత్యంత తీవ్రతతో, ఉచ్ఛస్థాయిలో ఉండవచ్చు. కనుక మనం అనివార్యమైనదానిని ఒప్పుకుని తీరాలి, భవిష్యత్తులో జరగబోయేదానికై నిరీక్షించాలి.

అంటే దానర్థం, మనం నైరాశ్యంలో గాడాంధకారంలో నిరాధారులమై నిరీక్షిం

చటమా? ఎంతమాత్రం కాదు, ఎవరైతే, ఇంకా ఏదైనా మంచికోసం ఆకాంక్షిస్తారో వారు ఈ ఉద్యమానికి ఇంకా ఎక్కువగా సహకరించగలరు. ఈ నూతన ఆవిష్కారానికి తమను తాము సహాయం చేయడానికీ, సేవకూ సమర్పించుకోవచ్చును. మనిషి ఇంకా దానిని చేయగలడు. ఎందువల్లనంటే, వ్యక్తిగతంగా, ప్రత్యేకంగా ప్రతి మనిషి మొత్తం భూచైతన్యం యొక్క కేంద్రీకృతమైన బిందువు. అతడు తన చైతన్యంలో అభివృద్ధి సాధించితే, తనను తానుగా మరికొంత ఉన్నతికి ఉద్ధరించుకోగలిగితే, మరింత ఉన్నతోన్నతమైన చైతన్యానికి వృద్ధినొందితే, అది తప్పకుండా లాభ దాయకమే. కాని అతడు ఆ పనిని ఇతఃపూర్వం కంటె అధిక వ్యయప్రయాసలకు, కష్టాలకు ఓర్చి చేయవలసి ఉంటుంది; దానికి ఇంకా చాలా ఎక్కువగా తపస్సు నాచరించవలసిన అవసరం ఉంది. ఎందువల్లనంటే, శ్రీమాత తన శరీరంలో ఉన్నంత కాలం, ఆమె మనకు వీటన్నింటినీ సులభతరం చేసింది. కాని ఇప్పుడా పరిస్థితి లేదు.

నిజంగా ఆధ్యాత్మిక చైతన్యం కోరుకునేవారికి, ఆధ్యాత్మిక జీవనవిధానం కోరుకునేవారికి, ఎవరైతే నిజాయితీగా తమను తాము అధికాధిక ప్రయోజనాలకు తయారుచేసుకోవాలని కోరుకుంటారో, అటువంటివారు, విషయాలను గంభీరదృష్టితో తిలకించవలసి ఉంటుంది. వారికి అది ఒక సాధన, ఒక నిజమైన ఉద్యమం, ఎరుకతో తమను తాము సంసిద్ధం చేసుకోవడం. వారు గొప్ప గొప్ప మాటలను మరచిపోవటం చాలా మంచిది — గొప్ప పదాలైన అతిమనస్సు, ఊర్ధ్వమనస్సు, ఉన్నత మనస్సు మొదలైనవి. మనకు వాటి గురించి మట్లాడే హక్కుగాని, వాటి గురించి పిచ్చాపాటీగా మాట్లాడుకునే హక్కుగానీ లేదు. అవన్నీ కలలు, అందమైన కలలు, కాని మనం అందుకోలేనివి. అవి శ్రీమాతారవిందులకు చెందినవి. శ్రీఅరవిందులు తానే స్వయంగా చెప్పారు:

రజితాకాశంలో నేను నా కలలు పోగుచేశాను
స్వర్ణనీలముల మధ్య అచ్చోట మృదువుగ మడచి చుట్టిపెట్టి ఉంచినాను
నీ గురించి నేను కన్న మణిమయభూషిత కలలను.

"దైవపరిశ్రమ"

(A God's Labour)

శ్రీఅరవిందులు శ్రీమాతతో కలిసి ఆ కలలను అమర్చి, వాటిని జాగ్రత్తగా,

భద్రంగా తమలోనే పదిలపరచుకున్నారు. వారు వాటిని ఊర్ధ్వమనస్సులో ఉంచారు; అది వారి పని, వారి వ్యవహారం, దానితో మనకేం పని లేదు. ఆ కలలను శ్రీమాత తమ హృదయం లోనికి చేర్చారు; అవి వాటి సమయం వచ్చినప్పుడు వాటి సొంత లయబద్ధతతో వాస్తవికతను సంతరించుకుంటాయి.

అవును, మనం వాటి గురించి మథనపడ నక్కరలేదు. మనం మన లోపలికి దృష్టి సారించడం మంచిది, మనం నిజాయితీగా, మన ప్రకృతిలోనూ, చైతన్యం లోనూ, మన జీవనవిధానంలోనూ జంతువులలాగా ఉన్నాం, కాదు పశువులలాగా ఉన్నామనే సంగతి ఒప్పుకుందాం; మనం చైతన్యం నిచ్చెనలో అట్టడుగు మెట్టుమీద ఉన్నాం. మనం మన పనిని అక్కడి నుంచి మొదలుపెట్టాలి; ఆ అట్టడుగు నుంచి. అది అత్యంత భౌతిక చైతన్యం; శ్రీమాత భౌతిక శరీర సన్నిధి మనకు లేకపోవడం మూలంగా, మనం సరాసరి ఊబిలో మునిగిపోయాం; మొరటైన భౌతికం అనే బురదలో కూరుకుపోయాం. కనుక మన మా స్థాయి నుంచి శుద్ధపరచే ప్రక్రియను మొదలుపెట్టాలి, శరీరంతో మమేకమైన చైతన్యస్థాయి నుండి; మనం శరీరాన్ని, ప్రాణికాన్ని తప్పక శుభ్రపరచే ప్రయత్నం చేయాలి. మరి మనస్సునో? ఆహా, దానిని కూడా, మనస్సులోని ఉన్నతోన్నత సీమలను సైతం, వాస్తవికంగా అసలైన మనస్సును, కాని అది మన స్థాయికి చాలా పెద్ద విషయం. దానిని గురించి తర్వాత ఆలోచించవచ్చు.

శుద్ధిమార్గం గురించి చెప్పుకోవాలంటే, మనం దానిని పూర్తిగా మొదటి నుంచి మొదలుపెట్టాలి. రాజయోగంలో సిఫార్సు చేయబడిన మొట్టమొదటి బోధనలలో మాదిరిగా మనం సరాసరి శరీరంతో మొదలుపెట్టాలి, మనలోని భౌతిక భాగాలకు శిక్షణ నిచ్చి, విద్య గరిపి, మార్పుచేసి, కొత్తమూసలోకి ప్రవేశపెట్టాలి; మనం చిన్నపిల్లల లాగా నేర్చుకోవాలి: "పోట్లాడవద్దు", "చెడ్డమాటలు పలుకవద్దు", "దొంగతనం చేయవద్దు", "అబద్ధమాడవద్దు" మొదలైనవి. ప్రాచీన ఆధ్యాత్మిక శిక్షణా విధానంలో అవి ప్రాథమికమైనవి, ప్రధానమైనవి — రాజయోగంలో వాటిని యమనియమాలంటారు (అహింస, అస్తేయ మొదలైనవి). బౌద్ధులు కూడా తమ ఆధ్యాత్మిక శిక్షణను ఆ బోధలతోనే మొదలుపెట్టారు; వాటికి వారు "పంచశీల" అని పేరు పెట్టారు: మంచి నడవడి (వినయం) మొదలైనవి. ప్రత్యాహారం, ధ్యానం, ఏకాగ్రత అనేవి చాలా తర్వాత నేర్వబడేవి, ఆచరించేవి, ఒకరు చాలా ఉన్నతికి చేరుకున్న తరువాత.

సమాధి ఇంకా దాని మీదది. అందువల్లనే ప్రాచీన కాలాలలో ఎవరైనా ఆధ్యాత్మిక జీవితాన్ని అభిలషిస్తే, కేవలం శాస్త్రాలను అభ్యసించాలన్నా, దానికి మొదట అర్హత సంపాదించాలి — మొదట చిత్తశుద్ధి నలవరచుకోవాలి. చైతన్యం పరిశుద్ధపరచబడాలి.

శ్రీమాత భౌతికంగా శరీరధారణలో ఉన్నప్పుడు చెప్పేవారు, "ఈ రకంగా ప్రాథమిక స్థాయి నుంచి తపస్సు చేయవలసిన అగత్యం మీకు లేదు, నా శరీరం ఆధారంగా చేసుకుని మీరు ఒక్కసారిగా లంఘించి పైకి చేరగలరు". శ్రీమాత తన శరీరాన్ని మనం పైకి దూకగలగడానికి ఆసరాగా చేసుకోవడానికి అందించారు. కాని మనం దాని వలన లాభాన్ని అందుకోలేకపోయాం; మనం కేవలం దాని మీద దూకడం మాత్రమే చేశాం. శ్రీమాతకు మన వలన అఘాతాలే అయ్యాయి, మనం దేని దరిదాపులకూ వెళ్ళలేదు, కనీసం ఏమాత్రం ఉన్నతినీ పొందలేదు.

కాని నరక ద్వేషమూ, మానవుల అవమానాలు
సృష్ట్యాదిగా నాకు బహుమతులు.

— "దైవపరిశ్రమ"

(A God's Labour)

ఈసారి కూడా ఆమెకు అది తప్పలేదు. మనం ఏమాత్రం ఉద్ధతిని పొందలేదు — మనం పొందిన ఉన్నతుల కన్నా మనం పడిపోయిన సందర్భాలే మించిపోయి నాయి. మనం ఆ సువర్ణావకాశాన్ని పోగొట్టుకున్నాం. కనుక ఎవరైతే కేవలం ఆకాంక్షించటం మాత్రమే కాకుండా అంతరంగ పురోగతి, అంతరంగ వృద్ధిని నిజంగా కోరుకుంటారో, వారు తప్పక మొట్టమొదటి నుంచి ఆరంభించాలి.

సహజంగానే చాలామంది మానసికస్థాయిలోనే జీవిస్తూ, శాశ్వతంగా అక్కడే ఉండాలని కోరుకుంటారు. వారు ఇంకా అధికస్థాయికి సంసిద్ధులు కారు లేక అర్హత లేనివారై ఉంటారు. అటువంటి వారికి సాధ్యపడే ఉన్నతోన్నతమైన అభివృద్ధి మేధస్సుతో చింతించి, తర్కించి, వ్యాఖ్యానించటం లేదా తాత్త్వికపరమైన వ్యాపకమును కలిగి ఉండటం — అది వారి ఆదర్శం, లక్ష్యం, వారు చేరగలిగిన పరమోన్నత స్థితి; వారు గనక మానసికమైన చర్చలలో నిమగ్నమైతే వారికది సహాయకారి కావచ్చు. ఈ విధంగా, మేధోపరమైన జ్ఞానం సహాయంతో, వారు ఒక విధమైన భూవాతావరణాన్ని సృష్టించవచ్చు, మనస్సులో ఒక ఆధ్యాత్మిక ప్రతిబింబం కలిగించుకోవచ్చు. అది కూడా మంచిదే. బాహ్యప్రపంచంలో, ప్రత్యేకించి ఐరోపా,

అమెరికాలలో, ఎక్కడ ఆధునిక జీవితం, చైతన్యం మేధస్సులో కేంద్రీకృతమై వున్నదో, ఎక్కడ కేవలం మేధోప్రకాశం మాత్రమే వెలుగును చూపగలదో, జీవితానికి ప్రభువై ఉన్నదో, నిజమే, వారిని చర్చలతో, చింతనతో తర్కించి వ్యాఖ్యానించనీయండి; వారు కనీసం కొంత మానసిక జ్ఞానమన్నా పొందుతారు, మేధస్సుకు కొంత పరిశుద్ధత, స్పష్టత అలవరచుకుంటారు.

కాని ఎవరైతే అభ్యాసజ్ఞానంతోనూ, మనస్సును మెరుగుపరచటంతో పాటుగా చైతన్యాన్ని ఉన్నతపరచి పరివర్తనతో మార్పుచేయాలని కూడా ఆకాంక్షను కలిగి ఉంటారో, అటువంటివారికి, ఇప్పటి ఈ రోజున, ఒక తపస్సు, ఒక ఏకాగ్రత అవసరం అవుతుంది, వారి మొత్తం శక్తి, ఇచ్ఛల తీవ్రమైన ఏకాగ్రతను ఆ ఒక్క ఆకాంక్ష మీదా, ఆ ఒక్క కష్టసాధ్యమైన ప్రయత్నం మీదా ఉంచాలి. అటువంటివారు చేయవలసిన పని కేవలం ఆత్మ-పరిశుద్ధత, శరీర పరిశుద్ధత, ప్రాణిక పరిశుద్ధత, మొత్తం నిమ్న ఆధార చైతన్యములోని దాని భౌతిక భాగాలను, ప్రత్యేకించి దాని నిమ్నప్రాణిక భాగాలను వాస్తవ స్థితిగతులతో పునః సమీక్షించుకుంటూ పునర్వ్యవస్థీకరించాలి. ఆచరణాత్మకమైన జీవితంలో ఎవరైతే ఆధ్యాత్మికతను ఆశిస్తారో వారు తప్పక కిందికి అట్టడుగుకు వెళ్ళి శుద్ధి కార్యక్రమమును పూర్తి గావించవలసి ఉంటుంది.

మరి భవిష్యత్తు? దేని భవిష్యత్తు? వ్యక్తిగత ఆత్మ భవిష్యత్తు శ్రీమాత చేతులలో ఉంది. భవిష్యసృష్టి ఒక నవ్య దివ్య ఉషోదయం; అది తయారుగా ఉంది, భౌతికంలో అభివ్యక్తం కావటానికి సంపూర్తిగా తయారయి ఉంది, అది నిరీక్షిస్తున్నది, దాని రాక తథ్యం, ఏ శక్తీ దానిని ఆపలేదు. ఈ ధోరణిపై వేదిక శుభ్రపడే తరుణం కోసం అది సూక్ష్మభౌతికంలో నిరీక్షిస్తున్నది. ఎన్నో యుగాలుగా శాశ్వత ఉషస్సును కీర్తించిన ప్రాచీనుల కలలు సాక్షాత్కారించబడతాయి:

ఆహా, ప్రకాశము లన్నింటి పరమోత్కృష్ట దివ్యప్రకాశం వచ్చింది.
(రుగ్వేదం 1.113.1)

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మన యదార్థ అస్తిత్వం — దాని ఉపకరణాలు

మానవుడు తన యదార్థ స్వభావంలో... వ్యక్తిగతమైన, సామాజికమైన అనుభవం కోసం, విశ్వంలో ఆత్మాభివ్యక్తి కోసం మనోజీవశరీరాలను ఉపయోగించుకునే ఆత్మ. ఇది (ఆత్మ) వ్యక్తిగతానుభవం కోసం బాహ్య అస్తిత్వంగా తనని తాను పరిమితం చేసుకున్న అనంత అస్తిత్వం. ఇది అస్తిత్వానికి చెందిన జ్ఞానవైవిధ్యాన్ని, శక్తివైవిధ్యాన్ని ఆనందించడం కోసం చైతన్యానికి చెందిన పరిమిత రూపాలలో అభివ్యక్తమవుతూ తనను తాను నిర్ధారించుకున్న అనంత చైతన్యం. తననీ తన శక్తులనీ విస్తృతపరచుకుంటూ, కుదించుకుంటూ, మరుగుపరుచుకుంటూ, తనను తనే తిరిగి కనుక్కుంటూ, తన స్వభావానికి విరుద్ధమైనప్పటికీ పైకి కనపడనీయనంతగా తన ఉనికిలోని ఆనందాన్ని అనేక విధాలుగా పొందుపరచే అనంతమైన చైతన్యం. తనకు తానుగా ఇది శాశ్వతమైన సచ్చిదానందమే. కానీ, పరిమితంలో అనంతం చిక్కుకొని వెల్లడి కావడంలోని సంక్లిష్టత, విశ్వస్వభావంలోను, వ్యక్తిస్వభావంలోను ఆత్మ వహిస్తున్న వైఖరిగా కనపడుతోంది. శాశ్వతమైన ఈ సచ్చిదానందాన్ని, మనలోనే ఉన్న మన అస్తిత్వానికి చెందిన ఈ ప్రధాన ఆత్మను తెలుసుకోవడానికి, అందులో జీవించడానికి, దాని (ప్రధాన ఆత్మ) యధార్థ స్వభావాన్ని వెల్లడించడానికి, మన ఉపకరణాలైన దివ్యచైతన్య మనో జీవ శరీరాలలో దివ్యజీవనమార్గ సృష్టికి చెందిన ఆత్మపరిపూర్ణతా చైతన్యసూత్రానికి ఇది స్థిరమైన ఆధారం.

ఆత్మ, ప్రకృతి కర్మలలో అభివ్యక్తమవడానికి దివ్యచైతన్యం, మనసు, జీవం, శరీరాలనే నాలుగు ఉపకరణాలను ఉపయోగించుకుంటుంది.

(CWSA 24: 624-25; SABCL 21: 598-99)

శ్రీ అరవిందులు

మనం లక్ష్యంగా పెట్టుకున్న ఈ పరిపూర్ణతాస్థాయిని చేరినపుడు మనం అన్వేషించే సత్యంలో నాలుగు ప్రధాన అంశాలను గమనిస్తాం. అవి — ప్రేమ, జ్ఞానం, శక్తి, సౌందర్యాలు. సత్యానికి చెందిన ఈ నాలుగు ధర్మాలు మన అస్తిత్వంలో సహజసిద్ధంగా వెల్లడవుతాయి. యదార్థమైన స్వచ్ఛమైన ప్రేమకి చైత్యపురుషస్థితి; నిర్దుష్టమైన జ్ఞానానికి మనసు సాధనాలు. ప్రాణం, అజేయమైన శక్తిగా, బలంగా ప్రకటన

అవుతుంది. శరీరం, పరిపూర్ణ సౌందర్య సామరస్యాలకి అభివ్యక్తి అవుతుంది.
(CWM 12:8)

శ్రీమాత

అనువాదం; నాగరంజని

ఉత్తమమైన భావవ్యక్తీకరణకి ఉత్తమ ఉపకరణాలు

మనం రెండంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఒకటి — చైతన్యం, రెండు — చైతన్యాన్ని అభివ్యక్తం చేసే ఉపకరణాలు. ఉపకరణాలను గురించి తెలుసుకుందాం. ఆలోచనలకి స్థానమైన మానసిక అస్తిత్వం, అనుభూతులకి స్థానమైన భావోద్వేగ అస్తిత్వం, కర్మ చేసే శక్తికి స్థానమైన ప్రాణిక అస్తిత్వం, కర్మలు చేసే భౌతిక అస్తి త్వాలున్నాయి.

ప్రతిభావంతుడైన వ్యక్తి తన ప్రతిభ వల్ల ఎలాంటి వస్తువు నిచ్చినా కూడా, దానితో అందమైన వస్తువును సృష్టిస్తాడు. ఈ ప్రతిభావంతుడికే ఒక మెరుగైన ఉప కరణాన్నిస్తే, అతడొక అత్యద్భుత వస్తువును సృష్టిస్తాడు. ఉదాహరణకి, ఒక గొప్ప వాద్యకళాకారుడికి శృతి చేయలేని ఎందుకూ పనికిరాని 'పియానో' నిచ్చినా కూడా ఇంపైన సంగీతాన్ని సృష్టిస్తాడు. ఆ కళాకారుడికే శృతిబద్ధమైన మంచి 'పియానో' ఇస్తే, మరింత ఇంపైన సంగీతాన్ని సృష్టిస్తాడు.

పై రెండు ఉదాహరణలలో చైతన్యం ఒకటే. కానీ వ్యక్తీకరణకి మంచి ఉపకరణం అవసరం. అది, మానసిక, ప్రాణిక, చైత్యపురుష, భౌతిక సామర్థ్యాలు కలిగినదిగా ఉండాలి.

మంచి శారీరక నిర్మాణ సౌష్ఠవం కలిగినవాళ్లు జిమ్నాస్టిక్స్ చేసినట్లు శారీరక నిర్మాణం సరిగా లేనివాళ్లు మంచి శిక్షణ పొందినా కూడా జిమ్నాస్టిక్స్ చేయడం కష్టం.

మనసుకి సంబంధించిన విషయం కూడా ఇంతే. అతి మామూలు స్థాయికి చెందిన, లోపభూయిష్టమైన మనసు కలవాళ్ల కంటె, వ్యవస్థీకృతమైన, సంకీర్ణమైన, సంపూర్ణమైన, సున్నితమైన మనసు కలవాళ్లు భావాలను మేలైన విధంగా వ్యక్తీకరిస్తారు. అన్నిటి కంటే ముందు మన చైతన్యానికి సరైన శిక్షణ నివ్వాలి, మనలను గురించిన

చైతన్యం మనకుండాలి, మన ఆదర్శానికి అనుగుణంగా చైతన్యాన్ని వ్యవస్థీకరించు కోవాలి. కానీ అదే సమయంలో మనలో ఉన్న ఉపకరణాలని నిర్లక్ష్యం చేయకూడదు.

*

మన అస్తిత్వ పరిశుద్ధీకరణ, ఏకీకరణల కోసం పాటుపడుతున్నప్పుడే, మన అస్తిత్వం యొక్క పరోక్ష మరియు సాధన కుపయోగపడే భాగాలు పరిపూర్ణం కావడానికి చాలా జాగ్రత్త వహించాలి. ఉన్నత సత్యం అభివ్యక్తమైనప్పుడు దాని శక్తినీ, స్వచ్ఛతనీ భద్రపరచి ఆలోచనారూపంగా వెల్లడయ్యేందుకు అనువుగా ఉండే మృదువైన సమృద్ధమైన మనసు ఉండాలి. ఈ ఆలోచన మళ్ళీ మాటల ద్వారా వ్యక్తీకరించాలనుకున్నప్పుడు మనలో దానికి తగిన భావప్రకటనా శక్తి ఉండాలి. అప్పుడే ఆ మాటలు ఆలోచనని వక్రీకరించకుండా ప్రకటిస్తాయి. మన సర్వభావాలలో, సంకల్పానికి చెందిన సర్వక్రియలలో, మన సర్వకర్మలలో, మన అస్తిత్వానికి చెందిన సర్వగమనాలలో సత్యం ఏ సూత్రంలోనైతే ఇముడ్చామో అదే ప్రకటితం కావాలి. చివరిగా, ఈ గమనాలన్నీ వాటంతటవే నిరంతరమైన కృషితో అత్యున్నత పరిపూర్ణతని సాధించాలి.

శ్రీమాత

*

దివ్యస్థితి యొక్క లక్షణం కేవలం స్వేచ్ఛ మాత్రమే కాదు, పరిశుద్ధత, సౌందర్యం, పరిపూర్ణతలు కూడా. ఒక వైపు, మనలో సమగ్రమైన పరిశుద్ధత దివ్య అస్తిత్వాన్ని పరిపూర్ణంగా ప్రతిఫలింప చేస్తుంది, మరో వైపు, మన జీవితంలో దాని సత్య ధర్మాలు నిరంతరాయంగా వర్షింప చేస్తుంది. మన బాహ్య భాగాల సంక్లిష్ట ఉపకరణం సరైన పద్ధతిలో పనిచెయ్యడం సమగ్ర స్వేచ్ఛకు చెందిన నియమం. దీని వల్ల సమగ్ర సౌందర్యానుభవం కలుగుతుంది. ప్రపంచంలో సర్వంలో ఉండే ఆనందం. ప్రపంచానికి వేరుగా ఉండే ఆనందస్థితులు ఒకేసారిగా, దైవానికి చెందిన ప్రతీకలేనని గ్రహించ గలుగుతాం. ఇది (సమగ్ర పరిశుద్ధత) మన మానవజాతి సమగ్ర పరిపూర్ణతని దైవానికి ప్రతిరూపమైన దివ్యజాతిగా సంసిద్ధం చేస్తుంది. అస్తిత్వానికి చెందిన ఒక స్వేచ్ఛాయుత విశ్వజనీనతలో ప్రేమ, ఆనంద, జ్ఞాన, సంకల్ప శక్తుల క్రీడలో అహంకారరహిత సంకల్పపు కర్మలో ఈ సంసిద్ధత జరుగుతుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: డా. నాగరంజని

ప్రాణిక సత్త యొక్క వివిధ భాగాల చైతన్యం

మొదట నీ ప్రాణిక సత్త యొక్క వివిధ భాగాల యెడ చైతన్యం కలిగి ఉండు.

దోషరహితంగా నుండుటకు నువ్వు పని చెయ్యాలంటే మొట్టమొదట నీ యెడల నువ్వు చేతన కలిగి ఉండాలి. నీ ప్రాణిక సత్త యొక్క వివిధ భాగాలు, వాటి విభిన్న కార్యాల గూర్చి తెలుసుకోవాలి. ఈ భాగాల యొక్క భిన్నత్వాన్ని నువ్వు గుర్తించడం నేర్చుకున్నపుడు నిన్ను పని చెయ్యడానికి పురిగొలిపే నీ లోని కదిలికల మూలాన్ని, నీలో జరిగే విభిన్న ప్రేరేపణలని, విభిన్న ప్రతిచర్యలని, విరోధించే సంకల్పాలను క్షుణ్ణంగా తెలుసుకొనగలుగుతావు. శ్రద్ధగా చెయ్యవలసిన ఈ అధ్యయనం చాలా పట్టుదలను, సద్భావనను కోరుకుంటుంది. ఎందుకనగా, మానవుని స్వభావం ముఖ్యంగా అతని మానసిక ప్రకృతి, అతను ఆలోచించే, భావించే, చెప్పే, చేసేటటువంటి ప్రతిదానికి అనుకూలమైన వివరణ ఇచ్చే ఒక సహజ సిద్ధమైన ప్రవృత్తిని కలిగి ఉంటుంది. మనలోని ఈ కదలికలను అత్యంత జాగరూకతతో గమనించి, మన అత్యున్నత ఆదర్శం యొక్క ధర్మాసనము ముందుకు వాటిని ఉన్నవి ఉన్నట్లుగా తేగలిగి, నిష్కళంకమైన సంపూర్ణ సంకల్పంతో దాని నిర్ణయానికి సమర్పించగలిగినప్పుడు మాత్రమే మనలో ఎప్పుడూ పొరపాటు చెయ్యని వివేకము రూపుదిద్దుకుంటుందని ఆశించగలం. మనం నిజంగా ప్రగతి పథంలో పురోగమించి, మనం ఎందుకు సృష్టించబడ్డామో, ఈ భూమిపై మనం నెరవేర్చగల ధర్మమేమిటో అంటే మన అస్తిత్వం యొక్క సత్యాన్ని తెలుసుకునే సామర్థ్యాన్ని పొందినప్పుడు మనం క్రమం తప్పక ఎల్లయెడల మన అస్తిత్వ సత్యాన్ని వ్యతిరేకించే సమస్త విషయాల్ని బహిష్కరించాలి. ఈ విధంగా కొద్ది కొద్దిగా మన సత్తలోని అన్ని భాగాలు, అన్ని తత్వాలు ఒకే విధమైన క్రమంలో మన చైత్య కేంద్రము చుట్టూ పొందికగా అమర్చబడతాయి.

(CWM 12:3-4)

శ్రీమాత

అనువాదం: డా.వి. విజయలక్ష్మి

సాధనాలను శుద్ధపరచుట

శరీర శుద్ధి:

సహేతుకమైన, వివేచనాత్మకమైన శారీరక శిక్షణ ద్వారా మనం మన శరీరాన్ని దృఢంగాను, మృదువుగాను తయారుచేసుకోవాలి, అప్పుడే అది ఈ భౌతిక ప్రపంచంలో శక్తివంతమైన సాధనంగా ఉండి మన ద్వారా ఆ సత్యశక్తిని అభివ్యక్తి చేయగలదు.

నిజానికి శరీరం మనలని నియంత్రించ కూడదు. అది మన ఆదేశానుసారం మెలగాలి. స్వాభావికంగా అది అణకువ కల్గిన, నమ్మకమైన సేవకురాలు. అయితే దురదృష్టవశాత్తు అది తన యజమానులైన మనో ప్రాణికాల పట్ల తన కుండవలసిన వివేచనా శక్తిని అరుదుగా కలిగి ఉంటుంది. అది గుడ్డిగా వాటి ఆజ్ఞను పాటిస్తుంది., వాటికి విధేయత చూపుతుంది. తన బాగోగులను సైతం పట్టించుకోదు. మనసు దాని మూర్ఖపు సిద్ధాంతాలతోను, తన కఠినమైన, నిరంకుశ నిబంధనలతోను, ప్రాణికము తన ఉద్రేకాలతోను, మితిమీరిన ప్రవర్తనలతోను చెదిరిపోవుట ద్వారాను, అతి శీఘ్రంగా శరీరంలోని సహజ సంతులనాన్ని నాశనం చేసి, నిస్సత్తువను, అలసటను, అనారోగ్యాన్ని సృష్టిస్తుంది. శరీరానికి దేనికైనా అనుగుణంగా ఉండడానికి, భరించడానికి అద్భుతమైన సామర్థ్యం ఉంది. అది ఈ మనో ప్రాణ శక్తుల అనుశాసనం నుంచి స్వేచ్ఛను పొందాలి. అది నిరంతరం చైత్యపురుష కేంద్రంతో కలిసి ఉండడం వల్ల మాత్రమే సాధ్యమౌతుంది. అది మనం ఊహించినదాని కంటే ఎక్కువ పనులను చేయగలదు. ఇప్పుడు తనను పాలించే అజ్ఞానమైన, క్రూరమైన యజమానులకు బదులుగా, అది అస్తిత్వంయొక్క కేంద్రసత్యం చేత పాలించబడితే, దాని సామర్థ్యం మనలను ఆశ్చర్యపరుస్తుంది. ప్రశాంతంగా, నిశ్చలంగా, దృఢంగా, గాంభీర్యంగా అది ప్రతి నిమిషం తన నుండి అపేక్షించబడిన సామర్థ్యాన్ని ప్రదర్శించగలదు. అది విశ్వశక్తుల సంపర్కం ద్వారా కార్యాచరణలోనే విశ్రాంతిని పొంది శక్తిని తిరిగి పుంజుకొనుటను నేర్చుకుంటుంది. తన శక్తుల్ని ఎరుకతో, ప్రయోజనాత్మకంగా ఖర్చు చేస్తుంది. ఈ ధృడమైన సమతుల్యమైన జీవితం శరీరంలో ఓ నూతన సమగ్రతను అభివ్యక్తం చేస్తుంది. అది ఆ ఉన్నత స్థితులలోని సమగ్రతను ప్రతిబింబిస్తుంది. దాని వలన అవయవాల పొందిక, ఓ చక్కని ఆకృతి ఏర్పడుతుంది. ఆ సమగ్రత అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఎందుకంటె అస్తిత్వ సత్యం స్థిరంగా

నుండదు; అది నిరంతంర వృద్ధిచెందే పరిపూర్ణమైన సర్వతోముఖ సమగ్రతను ఆవిష్కరిస్తుంది. ఈ శరీరం ఈ సమగ్ర అభివృద్ధి యొక్క కదలికలను అనుసరించడం నేర్చుకోగానే ఒక నిరంతర రూపాంతర ప్రక్రియ ద్వారా కృశింపు, నశింపుల ఆవశ్యకతల నుండి తప్పించుకొనుట సంభవం అవుతుంది. అప్పుడు ఈ మృత్యువనే తిరుగులేని ధర్మానికి స్థానం ఉండదు.

ప్రాణిక శుద్ధి

మనలోని ప్రాణిక సత్తా ప్రేరణలకు, కోరిలకు, అత్యుత్సాహానికి, దౌర్జన్యానికి, క్రియాశీల శక్తికి, తీవ్ర నిరాశానిస్పృహలకు, ఉద్రేకాలకు, తిరుగుబాటుతనానికి స్థానం. అది ప్రతిదాన్ని కార్యరూపంలో పెట్టి నిర్మాణం చేపట్టి ఫలప్రదం చేయగలదు. అంతే సమర్థతతో అంతటిని నిర్మూలించి నాశనం చేయగలదు. ఆ విధంగా అది మనిషిలో క్రమశిక్షణకు లొంగని అత్యంత కష్టమైన భాగం. అది చాలా గొప్ప సహనం, పూర్ణ నిజాయితీతో చేయవలసిన సుదీర్ఘ పరిశ్రమ. ఎందుకంటే నిజాయితీ లేకుండా మొదలుపెడితే ప్రారంభంలోనే నిన్ను నీవు మోసం చేసుకుంటావు. అప్పుడు అభివృద్ధి కోసం నీవు చేసే కృషి వృధా అవుతుంది. ప్రాణికం యొక్క సహకారంతో అసంభవం అన్నది ఉండదు. అలాగే ఏ పరివర్తనైనా సాధించలేనిది కాదు. అయితే నిజానికి కష్టమైనది ప్రాణిక సత్తా యొక్క నిరంతర సహకారం లభించడమే. ప్రాణికం మంచి సాధనం, కాని తరచుగా తన స్వయం తృప్తినే అది వెతుక్కుంటుంది. అది పూర్తిగా కాని, పాక్షికంగా కాని లభించనప్పుడు ప్రాణికం విసుగుచెంది, చిరచిరలాడుతూ సమ్మె చేస్తుంది. దాని శక్తి పూర్తిగా అంతరించి దాని స్థానంలో మనుషుల పట్ల, వస్తువుల పట్ల అసహనం ప్రదర్శిస్తుంది. నిరుత్సాహం లేదా తిరస్కారం, కృంగుబాటు, అసంతృప్తి కల్గిస్తుంది. ఆలాంటి తరుణంలో మనం నిశ్శబ్దంగా, ఏ కార్యాచరణచేయకుండా ఉండడం మంచిది. ఎందుకంటె సరిగ్గా ఇలాంటి సమయాల్లోనే మనం తెలివితక్కువ పనులు చేస్తాం, నెలల తరబడి క్రమబద్ధంగా చేసిన అభివృద్ధిని కొన్ని క్షణాల్లో నాశనం చేసుకుంటాం. ఎవరైతే వారి చైత్యపురుష సత్తతో సంపర్కం కలిగి ఉంటారో వారికి ఇలాంటి సంకట స్థితులు తక్కువ కాలం, ఎక్కువ అపాయం కలిగించకుండా ఉంటాయి. ఆ చైత్యపురుష సంపర్కం వారిలోని ఆకాంక్ష జ్వాలను సజీవంగా ఉంచడానికి, చైతన్యం యొక్క ఆదర్శాన్ని సాకారం చేయడానికి సరిపో

తుంది. వారు ఈ చైతన్యం యొక్క సహాయంతో, వారి ప్రాణికంతో ఓ తిరగబడే బిడ్డతో వ్యవహరించినట్టు ఓర్పుతో, సహనంతో ఉండి, దానికి సత్యాన్ని, వెలుగును చూపి, దానిని నమ్మించి, మరుగున పడివున్న సత్ సంకల్పం దానిలో తిరిగి మేల్కొల్పాలి. ఆ విధమైన ఓర్పుతో కూడిన జోక్యం వలన ప్రతి సంక్షోభం ఒక నూతన వికాసంగా మార్చవచ్చు. గమ్యం వైపు మరో అడుగు ముందుకు వేయవచ్చు. అభివృద్ధి నిదానంగా ఉండవచ్చు, అటంకాలు పునరావృతం కావచ్చు. అయినా ధైర్యంతో కూడిన సంకల్పాన్ని నిలుపుకుంటే, ఏదో ఒక రోజు మనం విజయం తప్పక పొందుతామన్న భావం ధృడమై, ఆ సత్య-చైతన్య ప్రజ్వలిత ప్రకాశం ముందు అన్ని కష్టాలు కరిగి అంతరించిపోతాయనేది తథ్యం.

మనోవికసనం — మనశ్శుద్ధి

మానసిక పరికరం ఎంతో గొప్ప సహాయకారి కాగలదు. లేదా ఎంతో గొప్ప అవరోధం కాగలదు. మానవ మనస్సు తన సహజ స్థితిలో ఎల్లప్పుడూ పరిమితమైన దృష్టిని కలిగి వుంటుంది, సంకుచితంగా అర్థం చేసుకుంటుది. తన భావాల్లో మూర్ఖత్వాన్ని కలిగి ఉంటుంది. అందుచేత దాన్ని విస్తృతపరచడానికి, దాన్ని మృదువుగా, గాంభీర్యంగా మార్చడానికి నిరంతరం కృషి చేయవలసిన అవసరం ఉంది. అందువల్ల అన్ని విషయాలను అనేక కోణాలలో పరిశీలించవలసిన అవసరం ఉంది. దీన్ని సాధించడానికి ఓ ప్రయోగం ఉంది. అది ఆలోచనకు గొప్ప మృదుత్వాన్ని, ఉన్నత స్థితిని ఇస్తుంది. అది ఈ క్రింది విధంగా ఉంటుంది: ముందుగా స్పష్టంగా రూపొందించిన ఓ సిద్ధాంతపరమైన ప్రతిపాదనను తయారుచేయాలి. అంతే స్పష్టతతో దానికి ప్రతికూలమైన ప్రతిపాదనను రూపొందించాలి. ఆ తరువాత సావధానంగా ఆలోచించి ఆ సమస్యను విస్తృతపరచి లేదా అధిగమించి పరిశీలించి, అప్పుడు సమన్వయం కనుక్కునేవరకు ప్రయత్నిస్తూ — ఆ రెండు వైరుధ్యాలను మరింత విస్తృతంగా, మరింత ఉన్నత స్థాయిలో రెండింటిని కలుపుకున్న, ఆలోచనను కనుక్కునేవరకు కొనసాగాలి.

ఇదే రకమైన అనేక ప్రయోగాలు చేయవచ్చు. కొన్నింటికి స్వభావంపై ప్రయోజనకరమైన ప్రభావం ఉంటుంది. గనుక రెండు రకాలుగా లాభదాయకంగా పనిచేస్తుంది. ఒకటి మనసుకు శిక్షణ నిస్తుంది, రెండు సంవేదనలు, వాటి పరిణామాలపై ఆధిపత్యాన్ని

స్థాపిస్తుంది. ఉదాహరణకి నీవు నీ మనసు నెప్పుడు మనుషులు, విషయాలపై తీర్పు చెప్పనివ్వకూడదు. ఎందుకంటే మనసు జ్ఞానంతో కూడిన సాధనం కాదు. దానికి జ్ఞానాన్ని కనుక్కునే సమర్థత లేదు, కాని అది జ్ఞానం చేత కదలింపబడాలి. జ్ఞానం మానవ మనస్సును, ఆలోచనలను అధిగమించిన ఉన్నత సీమలకు చెందినది. ఆ పై నుంచి జ్ఞానాన్ని అందుకుని దాన్ని అభివ్యక్తి చేయడానికి మనస్సు అప్రమత్తంగా, నిశ్శబ్దంగా ఉండాలి. ఎందుకంటె అది రూపకల్పన చేసి, వ్యవస్థీకరించి, ఆచరించే పరికరం. పనుల్లోనే అది తన పూర్తి విలువను, నిజప్రయోజనాన్ని పొందగలదు.

చైతన్యం యొక్క అభివృద్ధికి ఎంతో సహాయకారి కాగల మరో అభ్యాసం ఉంది. ఏదైనా విషయంపై అంగీకారం కుదరనప్పుడు, అంటే అది ఓ నిర్ణయం తీసుకోవడంలో కాని లేదా ఓ పని చేయడంలో కాని — మనం మన స్వీయదృక్పథానికే, మన భావానికే కట్టుబడి వుండకూడదు. దానికి మారుగా ఎదుటివారి అభిప్రాయాన్ని అర్థం చేసుకుందుకు ప్రయత్నించాలి. వారితో వాదించకుండా, పోట్లాడకుండా, వారి స్థానంలో మనం ఉండి, ఇరువర్గాలను సంతృప్తిపరచే పరిష్కారాన్ని కనుగొనాలి. మంచి సంకల్పం ఉన్నవారికి ఎప్పుడూ తప్పక ఒక పరిష్కారం దొరుకుతుంది.

(CWM 12:58)

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ప్రాణికసత్త యొక్క ప్రతిభాగము తనదైన స్వభావాన్ని కలిగి ఉంటుంది లేదా ఒకే భాగంలో విభిన్న లక్షణాలు ఇమిడి ఉంటాయి.

(SABCL 22:233; CWSA 13: 5346)

శ్రీఅరవిందులు

పరిశుద్ధత అంటే యేమిటి? దానిని సాధించుకోవడం యెలా?

అపరిశుద్ధత ఉండే చోట్లు:

కార్యతత్పరత కలిగిన పరిశుద్ధతను మన అస్తిత్వంలో సాధించుకోవాలంటే, అపశృతుల సంగీతాన్ని పాడుతున్న ఉపకరణాల కార్యవిధానాన్ని పరిశుద్ధం చేయడం ప్రప్రథమ ఆవశ్యకత. మనిషిలోని అస్తిత్వానికి, ఆత్మకు దివ్యసత్యానికి స్వతహాగా యెటువంటి పరిశుద్ధతతోనూ అవసరం లేదు. కారణం, ఉపనిషత్తు చెప్తున్నట్లు కంటిచూపులోని దోషాల వల్ల ప్రభావితుడు లేదా కళంకితుడు కానటువంటి సూర్యుని వలె, తమ కార్యనిర్వహణలో, మనస్సు, హృదయం, దేహాల ఉపకరణాత్మక దోషాల వల్ల లేదా తడబాట్ల వల్ల ప్రభావితం కానంతగా అది సదా శుద్ధంగానే ఉంటుంది. మనస్సు, హృదయం, ప్రాణిక కామనాత్మ, దైహిక జీవితం అపరిశుద్ధతకు నిలయాలు. నిమ్నస్వభావానికి సంబంధించిన మోసపూరిత సంతసానందాలకు అది ప్రస్తుతం ఇస్తున్న న్యూనాధిక రాయితీలచే ప్రభావితం కాని పరిశుద్ధ కార్యవిధానంగా ఆత్మకార్య విధానం సాగాలంటే ముందుగా వాటిని చక్కదిద్దవలసి వుంటుంది.

వైరాగ్య పరిశుద్ధత: మాలిన్య మంటని శుద్ధ శ్వేతవర్ణాన్ని, మనం మంచిది కాదనుకొనే ఏ రూపంలోని కర్మనైనా, అనుభూతినైనా, భావన లేక సంకల్పాన్నైనా, సదా నిరాకరించడం ద్వారా పాపవిముక్తులమైనప్పటి స్థితిని సాధారణంగా పరిశుద్ధ అస్తిత్వం అంటాం. లేదా అత్యున్నతమైన వ్యతిరిక్త లేక నిష్క్రియ పరిశుద్ధత, పూర్తి భగవత్ పరితృప్తత, కర్మరాహిత్యం, మనస్సు కామనాత్మల కంపనాలను నిశ్చలం చేయడం, వైరాగ్య శిక్షణా విధానాలలో ఒక సర్వోత్కృష్ట శాంతికి దారి తీసే స్థితిని కూడా పరిశుద్ధ అస్తిత్వమని అంటాం. ఎందుచేతనంటే అప్పుడు ఆత్మ తన సారభూత నిష్కల్మష, సమస్త శాశ్వత పరిశుద్ధతలో కన్పిస్తుంది. దాన్ని పొందితే ఇంకా ఎక్కువగా చేయవలసింది గాని, భోగించవలసిందిగాని యేమీ వుండదు.

క్రియాశీల పరిశుద్ధత:

అస్తిత్వానికి సంబంధించిన పరిపూర్ణ ఆనందం పైనా, అంతరాత్మ ఉపకరణాత్మక, ఆత్మసంబంధిత స్వస్వభావం పైన గూడా ప్రతిష్ఠితమైన, ఇనుమడించిన, అత్యధిక శక్తివంతమైన, సంపూర్ణమైన, నిరాటంకంగా కొనసాగే కర్మకు సంబంధించిన అతి

కష్టతరమైన సమస్య మన కొకటుంది. మనస్సు, హృదయం, దేహం, ఇప్పుడు చేస్తున్న, ఇంకా ఎక్కువగా చేయబోయే దైవకర్మలున్నాయి. కాని వాటిని యిప్పుడు చేస్తున్నట్లుగా గాక దివ్యంగా చేయాలి. ఒక నాస్తిక, నిషేధాత్మక, నిష్క్రియ లేక వైరాగ్య పరిపూర్ణతను గాక, ఒక సానుకూల దృక్పథంగల, ఆస్తిక క్రియాశీల పరిశుద్ధతను లక్ష్యంగా చేసుకొన్న ఆకాంక్షపై సాధకుడు తన దృష్టి నుంచవలసిన సమస్య మొదట యిలా కన్పిస్తుంది. ఒక దివ్య వైరాగ్యస్థితి, పరమాత్మ యొక్క మచ్చలేని శాశ్వతత్వాన్ని ఆవిష్కరిస్తుంది. ఒక దివ్య కార్యశీలత దానికి ఒక సరియైన పరిశుద్ధమైన, పెడదారి పట్టని అంతరాత్మ మనస్సు, దేహం చేసే కర్మను దానికి జతచేస్తుంది.

కేవలం నైతిక పరిశుద్ధతే గాదు, సంపూర్ణ పరిశుద్ధత

పైగా, సంక్లిష్టమైన సమస్త ఉపకరణాత్మక యంత్రాంగం లోని ప్రతి ఉపకరణానికీ సంబంధించిన అంశాలన్నింటిలో ఒక సంపూర్ణ పరిశుద్ధతనే, సమగ్ర పరిపూర్ణత వాంఛిస్తుంది. నైతికతకు సంబంధించిన ఒక సంకుచిత నియమ నిబంధనలలోని పరిశుద్ధత గాదు దాని చరమస్థితి. నైతికత మన అస్తిత్వపు కామనాత్మతోనూ, బహిర్ముఖంగా కొనసాగే సక్రియ భాగంతోనూ వ్యవహరిస్తుంది, దాని క్షేత్రం, నడ వడికకు కర్మకు పరిమితమై వుంటుంది. అది కొన్ని కర్మలను కొన్ని కోరికలను, ప్రేరణలను, ఆసక్తులను నిషేధిస్తుంది, నిరోధిస్తుంది. అది కొన్ని లక్షణాలను, అంటే సత్యసంధత, ప్రేమ, ధార్మికత, కరుణ, పవిత్రతలను కార్యసరళిలో ప్రవేశపెడ్తుంది. ఈ పని పూర్తైనపుడు ఒక మంగళకరమైన పునాది యేర్పడినపుడు, పరిశుద్ధమైన సంకల్పం, అనింద్యమైన కర్మ చేసే అలవాటు కలిగినపుడు దాని పని పూర్తి అవుతుంది.

అటువంటి వ్యక్తి యెలా ప్రవర్తిస్తాడు?

సమగ్ర పరిపూర్ణత సిద్ధించినవాడు, మంచిచెడుల కతీతంగా వున్న పరమాత్మ శాశ్వత పరిశుద్ధతకు సంబంధించిన ఒక విశాలతర భూమికలో నివసించవలసి వుంటుంది. ఈ మాట కర్థం, సిద్ధి పొందిన వ్యక్తి మంచిగానీ, చెడుగానీ పట్టించుకొనకుండా కర్మ చేసి ఆత్మ ఈ రెండింటి యందు భేదమెంచదు అని చెప్పడానికి పూనుకొనే వేగిరపాటు బుద్ధితో ఒక నిర్ణయానికి రావడం కాదు. వ్యక్తిగత కర్మస్థాయిలో అది అసత్య ఆలోచన అనేది సుస్పష్టం. అది నిర్లక్ష్యంగా వ్యవహరించే అపరిపక్వ మానవ

స్వభావాన్ని కప్పిపుచ్చుకోవడమే అవుతుంది. ఈ ప్రపంచంలో మంచీ, చెడూ విడదీయరానంతగా, బాధా సంతోషాల్లాగా పెనవేసుకుపోయి వున్నాయి. ఏదేమైనా వర్తమానంలో అది సత్యం, ఒక సాధారణ భావంలో సమంజసమైన ప్రతిపాదన కావచ్చు, అయినప్పటికీ మానవజీవి మహనీయ ఆధ్యాత్మిక పరిణామపు సత్యం కాదది. అవశ్యంగా, అపరిపూర్ణమైన, యాంత్రికంగా కొనసాగే కార్యవిధానాల నుండి వెనుకకు తగ్గి విముక్త మానవుడు ఆత్మలో నివసిస్తాడు. చివరకు సమస్త కర్మ పరిసమాప్తి చెందే వైపు సాగే ఒక దశగా ఇది సాధ్యమైనప్పటికీ క్రియాశీల పరిపూర్ణతకు ఇదొక ఊరట కల్గించే విషయం కాదు. అతిమనస్సు ద్వారా కర్మ నిమిత్తం అతనిలో వ్యక్తిగత రూపం ధరించిన ఒక విశ్వజనీన సంకల్పంలా, దివ్య పరమాత్మ విశ్వాతీత శక్తి కార్యనిర్వహణలో సమగ్ర సిద్ధిని పొందిన సిద్ధుడు క్రియాతత్పరుడై నివసిస్తాడు అని దానర్థం. అందుచేత అతడు యే కర్మ చేసినా ఒక శాశ్వత జ్ఞానం, శాశ్వత సత్యం, శాశ్వత బలం, శాశ్వత ప్రేమ, శాశ్వత ఆనందాలు అత్యంతావశ్యక లక్షణంగల కర్మలుగా ఉంటాయి. లోనున్న ఆత్మ నుండి అవి అతని కర్మను నిర్దేశిస్తాయి, అంతేగాని అతని కర్మలు ఆత్మను నిర్దేశించవు, లేదా దానిని, కార్యవిధానపు నిర్ణీత పరిమాణానికి గాని లేక ఒక కఠిన కార్యరూపానికిగాని లోబడేటట్లు చేయవు. అతనిని వశపరచుకొని, అతనిపై పెత్తనం చేసే అలవాటుగా అయినదేదీ వుండదు. మహా ఉంటే కర్మ యెడల ఒక స్వేచ్ఛాయుతమైన నమనీయమైన ప్రవృత్తి రూపం వుంటే వుండవచ్చు. అతని జీవితం, మానవ జీవన విధానానికి సంబంధించిన ఏదో ఒక తాత్కాలిక రూపానికి తగినట్లు చేయబడినదిగా గాక, శాశ్వత ఊటల నుండి సరాసరి వచ్చే ఒక ప్రవాహంగా అవుతుంది. అతని సిద్ధి ఒక సాత్త్విక పరిశుద్ధతగా నుండక, ప్రకృతి గుణాల కతీతంగా ఉద్ధరించబడినదిగా, ఆధ్యాత్మికశక్తిగా, అధ్యాత్మికానందంగా, యేకత్వం, యేకత్వపు సామరస్యతగా వుంటుంది. బాహ్యాభిముఖంగా కనిపించే అతని కార్యాల పరిపూర్ణత ఈ ఆంతరిక ఆధ్యాత్మిక స్థితి, సార్వజనీనతల స్వీయవ్యక్తీకరణగా స్వేచ్ఛగా రూపొందుతుంది.

పరిశుద్ధత ఎందుకు అవసరం?

ఈ మార్పు కోసం మన మనస్తత్వానికి అతీత చేతనయైన ఆత్మ, అతిమనస్సు శక్తి అతనిలో సచేతనగా అయ్యేటట్లు అతడు చేసుకోవాలి. అతని ప్రస్తుత మనస్సు,

ప్రాణికం, భౌతిక అస్తిత్వం తనకు సంబంధించిన నిమ్నకార్యవిధానాన్నుండి విముక్తం కానంతవరకు అది అతనిలో పనిచేయదు. ఈ పరిశుద్ధత దానికి ప్రథమావశ్యకత.

అటువంటి పరిశుద్ధతను సాధించుకోవడ మెలా?

వేరు మాటల్లో, ఒక విధమైన బాహ్యకార్యరీతులు, వాటి నియమబద్ధీకరణ అన్య కర్మలు చేయకుండా వుండడం, లేదా నడవడికకు సంబంధించిన కొన్ని రూపాలను లేదా ప్రత్యేకమైన, మానసిక, నైతిక సామర్థ్యాలను ముక్తం చేయడంగా పరిశుద్ధతకు అర్థం చెప్పుకోగూడదు. అవి మనం చెప్పుకొనే అస్తిత్వపు అప్రాముఖ్య చిహ్నాలేగాని, అతిసారభూత శక్తులు గాదు, మొట్టమొదటి క్రియాశక్తులు గాదు. మన స్వభావపు ప్రాథమిక క్రియాశక్తులను ఒక విశాల మనోవైజ్ఞానిక దృష్టితో చూడాలి. మన అస్తిత్వపు రూపుదిద్దుకొన్న భాగాలను వివేచించాలి. వాటి అపరిశుద్ధత యొక్క మౌలిక దోషాన్ని, లేదా తప్పుడు చర్యను కనిపెట్టి సరిచేయాలి. అప్పుడు తక్కినదంతా, సరియైన విధంగా, సహజంగానే ప్రాప్తిస్తుంది అనేది ఖాయం. అపరిశుద్ధత లక్షణాలకు వైద్యం చేయకూడదు, లేదా చేసినా అది అప్రధానమైన అత్యల్ప సాయంగా మాత్రమే చేయాలి. అలా గాక లోతుగా రోగలక్షణాలను అధ్యయనం చేసిన తర్వాత దాని మూలాలను దెబ్బకొట్టాలి.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

(CWSA 24: 643-45; SABCL 21: 616-18)

దైవప్రభావాన్ని దక్క మరే యితరమైన ప్రభావాన్నీ అనుమతించకపోవడమే పరిశుద్ధత అంటే.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

(SABCL 23: 645)

చేయవలసిన పని

ప్రశ్న: సద్భావన తరంగములతో ఒకరు ప్రపంచానికి సహాయపడగలరా?

శ్రీమాత: శుభాకాంక్షలతో ఒకరు అనేక విషయాల్లో మార్పు తేగలరు. కాని, ఆ శుభాకాంక్ష, స్వచ్ఛంగా, నిర్మాలిన్యంగా ఉండాలి. ఒక ఆలోచనను పరిపూర్ణంగా స్వచ్ఛమైన ప్రార్థనను ప్రపంచంలోకి పంపినపుడు, అది దాని పని చేస్తుంది. కాని, ఇది ఎక్కడ ఉంటుంది? అది మానవబుద్ధి గుండా పోయినప్పుడు భ్రష్టుపట్టిపోతుంది. నీ అంతర చైతన్యం, అంతరజ్ఞానం యొక్క ప్రయత్నంతో, నీవు నీలో కోర్కెను నిజంగా అధిగమించగల్గితే, దానిని కరిగించి నిర్మూలించగల్గితే, ఇంకా, నీలోని అంతర సద్భావన, చైతన్యం, వెలుగు, జ్ఞానం ద్వారా నీలో కోర్కెను నీవు కరిగించ గల్గితే, వ్యక్తిగతంగా నీవు — అన్నిటి కంటె ముందు — వంద రెట్లు ఎక్కువ సుఖంగా ఉండగలవు, నీ కోర్కెను నీవు తృప్తిపరిచినదాని కంటె, అప్పుడు దాని ప్రభావం అద్భుతంగా ఉంటుంది. ప్రపంచంలో దాని చర్య ప్రతిచర్యలను నీవు ఊహించలేవు. నీవు సృష్టించిన కంపనాలు వ్యాప్తి చెందుతూ ముందుకు పోతూ ఉంటాయి. మంచుబంతిలా ఇవి వృద్ధిచెందుతూ ఉంటాయి. నీ శీలంలో సాధించిన విజయం ఎంత చిన్నదైనా, అది ప్రపంచమంతటా సాధించవచ్చు.

ఇప్పుడు నేను చెప్పిందాట్లో అర్థం ఇదే. అంతరంగ నైజంలో మార్పు లేకుండా బాహ్యంగా చేసే పనులు — స్కూళ్ళు, ఆసుపత్రులు వంటివి, — ఆడంబరం కొరకే, గొప్పగా ఉన్నాను, అనే అనుభూతి పొందడం కొరకే., కాని, బాహ్యంగా గుర్తించబడని ఈ చిన్న పనులు వ్యక్తిని అధిగమించి శతకోటి రెట్లు అధికంగా, గొప్ప గెలుపు సాధిస్తాయి. వాని చర్యలు గోప్యంగా ఉన్నప్పటికీ నీలో కలిగే ప్రతి బూటకపు చాంచల్యం, సత్యానికి వ్యతిరేకమైనది, దివ్యజీవనాన్ని నిరాకరించడమౌతుంది. సత్యం కొరకు నీవు చేసే చిన్ని ప్రయత్నాలకు, చెప్పుకోదగినంత ఫలితాలుంటాయి. వాటిని తెలుసుకున్నామనే తృప్తికూడ ఉండనివాటికి వ్యక్తిగతం కాని స్పష్టమైన సాధారణ ఫలితం ఉంటుంది.

నీవు నిజంగా ఏదైన మంచి చేయదలచుకుంటే, నీవు చేయదగ్గ ఉత్తమమైన పని ఏదంటే, యిటువంటి చిన్న విజయాలను, మనస్ఫూర్తిగా, ఒకదాని తరువాత

మరియొకటి సాధించడమే. ఈ విధంగా నీవు ప్రపంచానికి చేతనైనంత గరిష్ఠమైనవి చేయగలవు.

ప్రశ్న: మనవిజయం ప్రపంచమంతటి విజయం కాగలదా?

శ్రీమాత: అంతటి ప్రపంచాన్ని మార్చలేదు. ఎందుకనగా నీ గెలుపు ప్రపంచంతో పోలిస్తే చాలా చాల చిన్నది. ప్రపంచాన్ని అంతా మార్చేందుకు దాని శక్తి సరిపోదు. ఇట్టి విజయాలు శతకోటి కావాలి. కాని అది (చిన్న గెలుపు) ఇతరవాటితో కలిసిపో తుంది. అది తెస్తుంది ప్రపంచానికి ఒక సామర్థ్యాన్ని — పని చేసే సామర్థ్యాన్ని, దారుఢ్యాన్ని. కాని ఇది ఫలవంతంగా పనిచేయడానికి శతాబ్దాలు పట్టవచ్చు. ఫలవంతం కావడానికి సమయం యెంత పడుతుందనేది నిష్పత్తికి చెందిన విషయం. నీ చుట్టుప్రక్కలవారితో కూడా దీనిని నీవు ప్రయత్నించవచ్చు. ఇది ఇంకా కష్టతరమైనది. నీవు పరిపూర్ణంగా నిజాయతీ కలిగి ఉండాలి. ఫలితం ఆశించి చేయకూడదు. కేవలం నీ ఆకాంక్ష గెలుపును మాత్రమే కోరుకోవాలి. ఇలా నీవు గెలుపొందితే, అది నీ చుట్టుప్రక్కల ఉన్నవారిపై ఫలితం చూపగలదు. కాని దానిలో బేరమాడే అంశం ఉంటే — నీవు వేరే ఏదో ఫలితం ఆశించితే — "నేను నా లోపాలను అధిగ మించాలనుకుంటా, కాని అతడూ తన లోపాల నధిగమించాలి" — అప్పుడది పని చేయదు. ఇది వ్యాపారస్తుని దృక్పథం. "ఇది నీకిస్తా, కాని దానిని నేను తప్పకుండా తీసుకుంటా" — అది అంతటిని పాడుచేస్తుంది. ఇక్కడ నిజాయితీగాని, స్వచ్ఛతగాని లేదు. అది బేరమాడటం.

నీ నిజాయితీ, ఆకాంక్ష, నీ ధ్యేయంలో దేనినీ మిళితం చేయకూడదు. దైవంపై ప్రేమ, సత్యం, పరిపూర్ణత కొరకు మాత్రమే నీవు పనిచేస్తావు. ఏ ఇతర భావం, లక్ష్యంతో నీవు పనిచేయవు. అది తెస్తుంది ఫలితాలు.

(CWM 5:19-20)

శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

నీవు పరిపూర్ణంగా ఉంటే తప్ప, ఎవరైనా పరిపూర్ణంగా ఉండాలని ఆశించవద్దు.

— శ్రీమాత

కార్యాచరణలో అనుకూల, ప్రతికూల అనుభవాలు

ప్రశ్న: అనుభవాలలో అనుకూల, ప్రతికూల భాగాలంటే ఏమిటి?

సమా: ఆహ్, చూడు పాపా, నిన్ను అభివృద్ధి చెందనీయక అడ్డుపడే లోపాలు నీలో వుంటాయి. కనుక ప్రతికూల భాగమేమిటంటే, నీ లోపాలను తొలగించే ప్రయత్నం చేయడం. నీవు ఫలానా విధంగా నుండాలి అనే లక్షణాలు కొన్ని వుంటాయి. ఆ విధంగా నిన్ను నీవు మలచుకోవాలి. ఫలితం పొందడం కోసం ఆ లక్షణాలను నీలో పెంచుకోవాలి. కనుక, ఇది అనుకూల భాగం. ఉదాహరణకు నీలో ఒక లోపం ఉంది. నిజాన్ని చెప్పకూడదు, సత్యాన్ని చూడకూడదు, మాట్లాడకూడదు అనే ఈ తప్పుడు అలవాటుతో పోరాటం చెయ్యి. అది అసత్యాన్ని నీ చైతన్యం నుంచి తిరస్కరించటం ద్వారా, సత్యం పలకకూడదనే అలవాటును నీ నుంచి తొలగించుకొనుటకు ఉద్యమించు. ఇది జరగాలంటే సత్యం మాత్రమే పలకాలనే అలవాటును నీలో స్థిరంగా నెలకొల్పుకోవాలి. ఇంకా దానిని మనస్సుతో సదా గ్రహిస్తూ సత్యాన్నే చెప్తూ ఉండాలి. ఒకటి ప్రతికూలమైనటువంటి లోపాలను తిరస్కరించటం, ఇంకొకటి అనుకూలమైన మంచి లక్షణాలను నెలకొల్పుకోవటం.

ప్రతిదీ ఇలాగే చేసుకోవాలి. ఉదా: నీ అస్తిత్వంలోని ఒక భాగంలో అలవాటుగా ఉన్న తిరుగుబాటుతనం, అజ్ఞానం, అహంభావం, అర్ధరహితమైన తిరస్కరణలు, ఉన్నత భూమికల నుంచి వచ్చేవాటిని తిరస్కరించే విధంగా ఉంటాయి. ఈ వ్యతిరేకతలతో పోరాటం సల్పుటకు, అవి ప్రకటితం కాకుండా వాటిని ఆపాలి. నీ ప్రకృతి నుంచి స్వభావాన్నుంచి వాటిని తొలగించాలి. దీనికి బదులుగా నీలో సానుకూల సమర్పణ, అంతర్దృష్టి, పవిత్రీకరణ, ఆత్మసమర్పణ, దైవశక్తులతో కలసి భాగస్వామ్యంగా ఉండాలనే తపన నీలో నెలకొల్పుకోవాలి. ఇది సానుకూల దృక్పథం. అర్థమైందా!

మరో మారు అదే విషయం: కోపంగా ఉండేవాళ్లు, కోపోద్రేకంతో రెచ్చిపోయే అలవాటున్నవాళ్ళు, ఆ కోపస్వభావాన్ని వదిలించుకొనుటకు తమ అస్తిత్వం నుంచి కోపం తాలుకు స్పందనలను త్రోసివేయాలి. కోపాన్ని తిరస్కరించాలి. కోపోద్రేక ప్రకంపనలను అస్తిత్వంలోకి రానివ్వకూడదు. వీటి స్థానంలో సానుకూలమైన నిర్వికార ప్రశాంతతలతో కూడిన నిశ్చలతను, లోపంలేని సహనాన్ని, ఇతరుల ఉద్దేశాలను

అర్థం చేసుకోవటము అనే లక్షణాలతో భర్తీ చేయాలి.

ప్రశ్న: మధుమయి మాతా, వ్యక్తి తన విధేయతను అధోప్రకృతి నుంచి బదిలీ చేయాలనటంలో ఆంతర్యమేమి?

సమా: దీనర్థం నీకు తెలీదా? సామాన్యంగా, సామాన్య వ్యక్తుల విషయంలో, సామాన్య జీవితంలో, బాహ్యప్రకృతిలో పురుషుడు ప్రకృతిబద్ధుడై ఉంటాడు. అతడు ఆమెకు బానిస. అందువలన శ్రీఅరవిందు లంటారు, ఈ బానిసత్వం నుంచి వ్యక్తి విముక్తి పొందడం సరిపోదు. ఆయన ఇంకా అంటారు, వ్యక్తి విధేయతా తత్వాన్ని కలిగి ఉండాలి, కాని ప్రకృతికి బద్ధుడుగా కాక, దానికి బదులుగా దివ్యమాతకు విధేయుడుగా ఉండాలి. దానర్థం, వ్యక్తి తనకంటే నిమ్న మైనదానికి విధేయతను చూపుటకంటే, తనకంటే ఉన్నతమైనదాని పట్ల విధేయతను కలిగి వుండాలి. అనగా వ్యక్తి తన విధేయతను నిమ్నం నుంచి ఉన్నతాలకు బదిలీ చేయమని అర్థం.

అర్థమైందా? లేదా? బహుశా ఎవరో శ్రీఅరవిందులకు వ్రాసుంటారు. అది అతని ఆత్మ, ప్రకృతి నుంచి పూర్తిగా స్వేచ్ఛను కోరుతుందని. దానికి జవాబుగా శ్రీఅరవిందులంటారు: కాదు, అది సరిపోదు. స్వేచ్ఛను పొందితే అది సగం పని మాత్రమే జరిగినట్లవుతుంది. నీ విధేయత అలాగే ఉంటుంది. కాని ప్రకృతితో సంబంధం కలిగి ఉండడానికి బదులు దివ్యమాత కోసం ఆ విధేయత కలిగి ఉండాలి. అనంతరం, వారు వీటి మధ్య తేడాను వివరిస్తూ అంటారు.... దివ్యమాతను ప్రకృతిగా గుర్తించకూడదు. సహజంగా అంతలో కొంత దివ్యమాత తత్వం ఉంది. ప్రతిదాని వెనక దివ్యమాత యొక్క అంశ ఉంటుంది. కాని ప్రకృతే దివ్యమాత అని అనుకోకూడదు.

(CWM 7:202-04)

శ్రీమాత

అనువాదం: త్రివేణి

చేతనను విస్తృత పరచుట

ఏదో ఒకదానితో నీవు విసుగు చెందినపుడు, ఏదో ఒకటి నిన్ను బాధించినపుడు లేదా ఏదైనా అయిష్టమనిపించినపుడు నీవు అనంతకాల గమనాన్ని, అపార శూన్యతను గురించి ఆలోచన ప్రారంభిస్తే గతించినదాని నల్లా అలాగే రాబోయే సమస్తాన్ని గూర్చి యోచిస్తే, ఈ ఒక్క క్షణం అనంతత్వపు కేళిలో మనం తీసుకొనే ఒక చిన్న శ్వాస మాత్రమే అనిపిస్తుంది. అంతే కాకుండా అనంతమైన కాలప్రవాహంలో నిన్ను కలవరపరచినది చాలా హాస్యాస్పదంలా కన్పిస్తుంది. దానిని గురించి యోచించే సమయం కాని, దానికొక స్థానంకాని, ప్రాముఖ్యత కాని లేవు. ఎందుకంటే అనంతమైన కాలంలో ఈ ఒక్క క్షణం ఎంతదని? దీనిని గూర్చి తెలుసుకోగలిగితే... అయితే ఎలా? ముందు అపరిమితమైన ఈ అనంతత్వంలో అతి చిన్నదైన భూమిపై వసించే స్వల్పజీవిగా మనలని మనం చూడగలిగి, ఈ లిప్తమాత్రపు చైతన్యం ఏదైతే ఈ క్షణం నిన్ను బాధిస్తున్నదో, అయిష్టత కలిగిస్తున్నదో అది కూడా నీ ఉనికిలో క్షణికమేనని, నీవు కూడా గతంలో ఎన్నింటిగానో వున్నావని, భవిష్యత్తులో కూడా ఎన్నింటిగానో వుంటావని, నిన్ను ఏవైతే ఇబ్బందుల పాలు చేస్తాయో వాటన్నింటినీ బహుశ ఓ పది సంవత్సరాలలో మరిచిపోతావు లేదా జ్ఞప్తికి వచ్చినప్పుడు వీటికి బంధీవై ప్రాముఖ్యత ఎందుకు ఇచ్చావని నీవు అనుకుంటావని ముందుగా అర్థం చేసుకోగలిగి, ఈ అనంతతలో స్వల్పజీవివైన నీ ఉనికి క్షణం మాత్రమేనని, క్షణమాత్రమే కాదు సూక్ష్మాతిసూక్ష్మమైనదని తెలిసికోగలగాలి. అంతేగాక ఈ ప్రపంచమంతా ఇంతకు పూర్వం వికసించి వున్నదని, ఇకపై కూడా మరో మారు వికసిస్తుందని, అలా నిరంతరం జరుగుతుంటుందని తెలుసుకోగలిగితే, అప్పుడు హఠాత్తుగా నీకు జరిగిన సంఘటనలకు విలువనిచ్చి ఎంత చులకనయ్యావో నీకు తెలుస్తుంది. నిజంగా నీకు గాని, నీ జీవితానికి గాని, నీకు జరిగేదానికి గానీ ప్రాముఖ్యత నివ్వడం ఎంత హాస్యాస్పదమో నీవు తెలుసుకుంటావు. మూడు నిముషముల వ్యవధిలో దీనినంతా సమీక్షించగలిగితే అసంతుష్ట విషయాలన్నీ తుడిచిపెట్టుకొని పోతాయి. లోలోతులలో తిష్టవేసిన వ్యధ సైతం తుడిచిపెట్టుకపోతుంది. చేయవలసినది కేవలం నిన్ను నీవు ఈ అనంతంలో, ఈ శాశ్వతత్వంలో నిలుపుకొని వీటిపై ఏకాగ్రత నొందడం మాత్రమే. ప్రతివేదన దూరమైపోతుంది. దాని నుండి పరిశుద్ధంగా బయటపడ



శ్రీమాత



శ్రీఅరవిందులు

తావు. ఈ రకంగా చేస్తే ప్రతివారు తమ బాధల పంజరాల నుండి ఘోరమైన దుఃఖాల నుండి అన్నింటి నుండి విముక్తం కాబడతారని నేను చెబుతున్నాను. అయితే దీన్ని సరైన రీతిలో సాధన చేయగలిగితే తక్షణమే నీ అల్ప అహంకారం నుండి దూరం కాబడతావు.

*

ఒక సంకుచితమైన, పరిమితమైన ఆలోచన, ఇచ్ఛ చేతనలో ఒక పేటికలో మూసుకొని పోయి వున్నానని నీవు భావించినపుడు మిక్కిలి విశాలమైనదానిని గూర్చి యోచన చేయడం ప్రారంభించాలి. ఉదాహరణకు, సముద్రంలోని అపారమైన నీటిని గమనించు. నీతో పోల్చి చూసుకొని సాగరం ఎంత దూరతీరాలకు అన్ని వైపులా ఈ విధంగా (అమ్మ తన చేతులను చాస్తారు) విస్తరించివున్నదో నీవు వాస్తవంగా ఆలోచిస్తే, అది ఎంత విస్తారమై వున్నదో తెలుస్తుంది. నీవు కనీసం దాని ఆవలి తీరాన్ని చూడలేవు, దాని గమ్యాన్ని నలుదిశలా ఎంతగా సాగినా తాకలేవు. ఎందుకంటె అది విశాలమైనది, అనంతమైనది, అవధిలేని జలధి అది. ఈ విశాలమైన, గుహ్యమైన అనంత జలధిపై నీవు తేలియాడుచున్నానని భావించడం అతి తేలికైన పద్ధతి. అప్పుడు నీ చేతనను స్వల్పంగానైనా విస్తృతం చేయగలవు.

(CWM 6: 344-46)

శ్రీమాత

అనువాదం: బాషా

మన స్వీయచేతన యొక్క నాలుగు గోడల మధ్య తప్పించుకోజాలని విధంగా బందీవై ఉన్నట్లైతే అది నిజంగా దుఃఖకరం, విచారసాగరంలో మునిగిపోవడం. అయితే అనంతత్వం మన కోసం తెరచి ఉన్నది. మనం చేయవలసిందల్లా దానిలో మునిగిపోవడమే, మమేకం కావడమే.

(CWM 17:188)

శ్రీమాత

ప్రాణికసత్త శుద్ధిపరచుట

ప్రశ్న: అమ్మా ! పోయినసారి మీరు చెప్పారు మనలో చీకటి అంశం ఒకటుంటుం దని; అది మనకు సలహాలనిస్తుంది. మనలను పిచ్చిపనులు చేసేలా చేస్తుంది అని. కాబట్టి మన కెప్పుడైతే దాని ఎరుక కలిగిందో, వెంటనే దానిని బయటకు లాగివేయాలని చెప్పారు. దానిని బయటకు లాగివేయడం అనటంలో అర్థం... ఉదాహరణకు ఒక వ్యక్తి ఎప్పుడైతే అది తనతో పిచ్చిపనులు చేయించడానికి వస్తుందని గ్రహిస్తాడో అప్పుడు అతడు సంకల్ప ప్రయత్నంతో, అది చెప్పేదానిని చేయడం మానుకొంటే అతడు దానిని తనలో నుండి తీసివేసాడని అనవచ్చా?

సమా: ఆ వ్యక్తి దానిని అణచిపెట్టాడు.

ప్రశ్న: అయితే దానిని తీసివేయడమెలా?

సమా: దానికి ఏం చెయ్యాలంటే అన్నింటి కంటె ముందు దానిని గురించి లోతుగా తెలుసుకోవాలి. సరిగ్గా నీ కళ్ళెదుట దానిని నిలబెట్టి దానిని నీ చేతనకు జోడించిన బంధాలను తెంచివెయ్యాలి. ఇది అంతర్గత మనోవిజ్ఞానానికి చెందిన పని. వ్యక్తి తనను తాను జాగ్రత్తగా పరిశీలించుకొన్నట్లయితే గ్రహించగలడు. ఉదాహరణకు, నిన్ను నీవు పరిశీలించి చూచుకొన్నట్లయితే ఒక్కో రోజు నీవెంతో ఉదారంగా వున్నట్లు గమనిస్తావు. ఈ విషయాన్నే తీసుకొందాం. దానిని అర్థం చేసుకోవడం సులభం. నీ సంవేదనల్లో, నీ అనుభూతుల్లో, నీ ఆలోచనల్లో చివరకి భౌతికమైన వస్తువుల పట్ల కూడా అత్యంత ఉదారతతో వ్యవహరిస్తావు, అనగా ఇతరుల లోపాల్ని వాళ్ళ ఉద్దేశాల్ని, బలహీనతల్ని ఆఖరికి వాళ్ళ అసహ్యకరమైన చేష్టల్ని కూడా అర్థం చేసుకొంటావు. ఇదంతా గమనిస్తావు, అయినా ఎంతో ఔదార్యంతో, చక్కని భావాలతో నిండిపోతావు. "సరే, ప్రతి ఒక్కరూ, వారికి చేతనయినంత ఉత్తమంగా చేస్తారు". ఆ విధంగా నీకు నీవు చెప్పుకుంటావు.

మరో రోజు, లేక బహుశా మరో నిముషంలోనే నీలో ఒక రకమైన కాఠిన్యం స్థిరత్వం, తీవ్రంగా విమర్శించి పగను ద్వేషాన్ని రగిల్చే చేదు నైజం, చెడు చేసి నవాడు శిక్షింపబడాలనే ధోరణి, ప్రతీకారవాంఛ లాంటి వన్నింటిలో ఇంత క్రితం ఉన్న స్థితికి పూర్తిగ విరుద్ధమైన స్థితి నీలోనే వున్నట్లు గుర్తిస్తావు. ఏదో ఒక రోజు ఎవరైనా నీకు చేటు చేస్తే "ఫర్వాలేదులే, అతడికి తెలియదు", లేదా "ఇంతకు

మించి అతడేమి చేయలేడు" లేదా "అది అతడి నైజం" లేదా "అతడు అర్థం చేసుకోలేకపోయాడు"... అంటావు. ఇంకొక రోజు లేదా మరో గంటకే "అతను కచ్చితంగా శిక్షింపబడాలి. దానికి అతడు తగిన మూల్యం చెల్లించాలి, అతడు తప్పు చేశాడు కాబట్టి అది అతడికి తెలిసివచ్చేలా చెయ్యాలి..." అని ఒక రకమైన ఆవేశంతో పలుకుతావు. అన్నింటిని హస్తగతం చేసుకోవాలని, వాటి నన్నింటినీ నీ కోసమే అట్టి పెట్టుకోవాలని కోరుకుంటావు. ఈ విధంగా అసూయ, ఈర్ష్య, సంకుచిత ధోరణి మొదలైనవి నీలో దాగి వుంటాయి. ఇది క్రితం కల్గిన భావస్రవంతికి వ్యతిరేకమైన స్థితి. ఇదే నీలోని చీకటి పార్శ్వం. కాబట్టి ఆ స్థితి కల్గినప్పుడు దానిని చూసిన క్షణాన "అది నేనే" నని అనకుండా "అది నేను కాదు, అది నా నీడ, దానిని నాలో నుండి తొలగించుకోవాలి" అన్నట్లయితే, అతడిలోని మరో పార్శ్వానికి చెందిన వెలుగును ఈ చీకటి కోణం పైకి తీసికొచ్చినట్టు. రెండు భిన్న పార్శ్వాలను ఎదురెదురుగా నిలపడానికి ప్రయత్నిస్తాడు. కానీ గొప్ప తీక్షణమైన వెలుగును ప్రసరింపజేయడం ద్వారా ఆ పార్శ్వాన్ని అణచి వుంచడానికి చూస్తాడు. మొదట దానిని తగినంత దూరంగా వుంచవలసి వస్తుంది. పిమ్మట అది తిరిగిరానంత దూరానికి దానిని తరిమివేయ వలసి వుంటుంది. కొన్ని సందర్భాలలో ఈ చీకటి పార్శ్వాన్ని మార్చివేయడం సాధ్యమే కాని అది చాలా అరుదుగా జరుగుతుంది. కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఈ వ్యక్తిత్వ పార్శ్వంపై లేదా ఈ నీడపై తీక్షణమైన వెలుగును ప్రసరింపజేసి దానిని రూపాంతరం చెందించవచ్చు. అప్పుడది నీ నిజమైన అసలు వ్యక్తిత్వంగా పరివర్తనం చెందుతుంది.

ఇది ఎంతో అరుదైన విషయం, కాని చేయవచ్చు. "ఇది నేను కాదు, ఇలా ఉండటాన్ని నేను కోరుకోవడం లేదు. ఇట్లాంటి వైఖరి నాకొద్దు. దీనితో నాకెలాంటి సంబంధం లేదు. ఇది నాలో వుండకూడదు. ఇది నా స్వభావానికి విరుద్ధమైనది." అని అనడం ఎంతో మంచిది. అలా నీలోని విరుద్ధ పార్శ్వాన్ని బలవంతంగా నెట్టి దూరంగా తరిమివేయడం వల్ల మొత్తానికి దాని నుండి విడిపోవచ్చు.

అయితే తన లోపల జరిగే ఘర్షణను చూసుకోగలిగినంత స్వచ్ఛంగా, చిత్తశుద్ధితో వుండాలి. మామూలుగా ఈ విషయాల పైన దృష్టిని నిలపడు మనిషి, ఒక తీవ్రత నుండి మరో తీవ్రత వైపుకు పయనిస్తాడు. దీనినే యింకా తేలిగ్గా చెప్పాలంటే: ఒక రోజు నేను మంచివాడిని, మరుసటి రోజు చెడ్డవాడిని అని నీవే అంటుంటావు. ఇది

చాలా సహజం కూడా... అఖరికి ఒక గంట పాటు నీవు మంచివాడివి, మరో గంటలో దుష్టుడివి, ఒక్కొక్కసారి రోజంతా మంచిగా వుంటావు. అంతలో చెడ్డవాడి వవుతావు., క్షణంలోనే పరమ దుర్మార్గుడి వవుతావు. క్రితం ఎంత ఉత్తముడిగా వున్నావో అంత ఎక్కువ దుష్టుడి వవుతావు. అయితే దీనిని ఎవరూ గమనించరు. హింసాత్మక మైన, దుష్టమైన హేయకరమైన ఆలోచన లెన్నో మనస్సును దాటుకుంటూ పోతాయి. సాధారణంగా ఈ అంతర్గత వ్యవహారంపై దృష్టి పెట్టడు మనిషి. కానీ ఆ ఆలోచన వచ్చీ రావడంతోనే దానిని ఇలా గట్టిగా పట్టుకోవాలి (శ్రీమాత చేసి చూపిస్తారు) దానిపై వెలుగు పడేటట్టు పట్టుకొని "లేదు నిన్ను కావాలనుకోవడం లేదు. నాకు నీవు వద్దు. దీనితో నాకు పని లేదు. ఇక్కడ నుండీ నీవు తక్షణమే వెళ్ళిపోతున్నావు. మళ్ళీ నీవు తిరిగిరావు." ఈ విధంగా చెప్పాలి. (కొద్దిసేపు నిశ్శబ్దం తరువాత) ఇది ఒక రకమైన అనుభవం. ఇది నిత్యం మనిషికి ఎదురయ్యేది ఎప్పుడైతే గొప్ప ఆకాంక్ష, గొప్ప ఉత్సాహంగల చలనాలు కలుగుతాయో, దివ్యలక్ష్యం పట్ల సచేతనుడౌ తాడో, దైవం కోసం పరితపిస్తాడో, దైవకార్యంలో భాగం పంచుకోవాలనే ఇచ్ఛతో వుంటాడో, ఎప్పుడైతే తనలో నుండి తాను గొప్ప శక్తితో ఉత్సాహంతో పైకుబికి వస్తాడో... అప్పుడే కొన్ని గంటల పిమ్మట అల్పాతి అల్పమైన వాటికోసం దుఃఖితు డవడం, అల్పమైన, సంకుచితమైన విలువలేని నీచమైన స్వలాభాపేక్ష చూపడం లాంటి నిస్తేజమైన వాంఛకు బద్ధుడౌతాడు. అంతకు మునుపు వున్న ఉదాత్తమైన స్థితి అదృశ్యమైపోతుంది. అది ఇక అతడిలో ఉండి ఉండనట్లు అయిపోతుంది. వైరుధ్యాలకే పూర్తిగా అలవాటు పడ్డాడీ మనిషి. ఈ విషయాలపై ధ్యాస పెట్టడు. అందువలన ఈ రెండు విభిన్న స్థితులు ఇరుగు పొరుగువాళ్ళ లాగా ఎంతో సౌక ర్యవంతంగా కలసి జీవిస్తాయి. మొట్టమొదట వాటిని కనుగొని అవి చేతనలో లోలోనే కలసిపోకుండా నిరోధించాలి. వెలుగు నుండి నీడను వేరు చేయాలి. తరువాత నీడ నుండీ విడిపోవాలి.

(CWM 6:262-64)

శ్రీమాత

అనువాదం హర్షవర్ధన్

నడతను మార్చడానికి దారి తీసే మెట్లు

మొదట చైతన్యాన్ని కలిగి ఉండడం, తరువాత నియంత్రణ, వాటిపై నిరంతర ఆధిపత్యం కలిగి ఉండడం వలన నడతను మార్చుకోవచ్చు. నడతలోని పరివర్తన అనేది చివరి విషయం. చెడ్డ అలవాట్లని, పాత అలవాట్లని వదిలిపెట్టడానికి నడత మారడానికి చాలా సమయం పడుతుంది.

తరచు నిరాశా నిస్పృహలతో కృంగిపోయే ఎవరినైనా మనం ఉదాహరణగా తీసుకోవచ్చు. కావాలనుకున్నట్లుగా ఏదైనా జరగనప్పుడు వారు కృంగిపోతారు. కాబట్టి మొదట వారికి తమ నిరాశా నిస్పృహలను గూర్చి, వాటి కారణాల గురించి, అంత సులభంగా వారు నిరాశకు ఎందుకు గురి అవుతున్నారన్నది వారికి తెలియాలి. ఆ చైతన్యం వారికి కలిగినప్పుడు ఆ నిరాశా నిస్పృహలపై నియంత్రణ కలిగి ఉండి, వాటికి తగిన కారణాలున్నప్పుడు కూడా కృంగిపోకుండా ఉండాలి. తమ నిరాశానిస్పృహలపై విజయాన్ని సాధించి అవి రాకుండా ఆపగలగాలి. చివరగా, తగినంత దీర్ఘకాలం ఈ విధంగా జరిగితే, స్వభావం నిరాశా నిస్పృహలకు లోను అయ్యే అలవాటును కోల్పోయి, ఇదివరలో మాదిరిగా ప్రతిస్పందించదు. వారి నడత మార్పు చెందుతుంది.

(CWM 4: 340-44)

శ్రీమాత

సామాన్య మానవునిలో అనేకమైన విషయాలు అతని చేతనకి తెలియనివి ఉంటాయి. కారణం, ప్రాణికం వాటిని మనస్సు నుండి దాచిపెట్టి, కార్యకారణభూతమైన శక్తి ఏదన్నది మనస్సుని గ్రహింపనీయకుండా వాటిని తృప్తిపరుస్తూ ఉంటుంది. ఆ విధంగా విషయాలు పరహితేచ్ఛ, లోకోపకారము, సేవ మొదలైన పేర్ల మీద లేదా ఆ కారణాలు చెప్పి జరుగుతాయి. ఈ కారణాల వెనక అహంకారం దాగి వుండి అదే వాటన్నిటికి దారితీస్తుంది. యోగసాధనలో తెర వెనుక నున్న రహస్య ప్రేరణని వెలికి తీసి, బహిర్గతమొనర్చి, దాని నుండి విముక్తి పొందాలి.

(SABCL 24:1297)

శ్రీఅరవిందులు

అనువాదం: డా. వి. విజయలక్ష్మి

మానసిక ప్రేరణలతో వ్యవహరించే పద్ధతుల క్రమం

ఎవరికైతే వాళ్ళు చేసే తెలివితక్కువ పనుల గురించి వాళ్ళకి తెలిసినప్పటికీ, ఆ ఎరుక ఉన్నప్పటికీ, ఎవరికైతే ఆ ఎరుక వున్నప్పటికీ తమని తాము ఆ పనులు చెయ్యకుండా అదుపు చేసుకోలేని అశక్తులు. ఎందుకంటే వారికి వాటిని అదుపులో ఉంచటానికి తగినంత మానసికశక్తి లేదు గనుక.

అయితే మనస్సుకు ఎప్పుడూ వాటిని అదుపులో పెట్టగలిగినంత బలం వుండదు. అన్ని విషయాల్నీ అన్ని వైపుల నుంచి చూడడానికి తయారుచేయబడిన పరికరం మాత్రమే మనస్సు. అందుచేత మనసు విషయాన్ని ముందుగా ఒక కోణం నుంచి, తరువాత మరొక కోణంనుంచి గమనించినప్పుడు, దానికి కలిగిన ప్రేరణను తట్టుకోగల సంకల్పబలం వుంటుందని ఎలా అనుకోగలం? అప్పుడది అంటుంది. "ఆ అదలాగే ఉంటుంది. అలాగే ఎందుకు ఉండకూడదు?" అప్పుడు నీ సంకల్పానికి చోటెక్కడ?

అక్కడ నేను చెప్పినట్టు ఈ భౌతిక మనస్సు సాధారణంగా నిమ్నప్రాణిక చైతన్యం, దాని కదలికలతో ఒక రకమైన అనుబంధం కలిగి వుంటుంది. నిమ్నప్రాణికం ఏవో కోరికలు మానసిక ప్రేరణలు అభివ్యక్తం చేస్తుంది. దానికి పదార్థ మనస్సు వచ్చి సహాయం చేసి అవన్నీ సమంజసమేనని సమర్థిస్తుంది. ప్రతి విషయాన్ని వివరించడానికి, ప్రతి విషయాన్ని సమర్థించడానికి, సంతోషకరమైన కారణాలను చూపి మెప్పించడానికి అదెప్పుడూ ఒక మార్గాన్ని కనిపెడుతుంది.

కేవలం చైతన్య పురుషసత్త మాత్రమే అందులో జోక్యం చేసుకోగల శక్తి కలిగినది. నీ మనసు నీ చైత్యపురుషసత్తతో అనుబంధం కలిగి వుంటే, అది చైత్యపురుష సత్త ప్రభావాన్ని స్వీకరిస్తే, అప్పుడది ఆ నిరోధాన్ని నిర్వహించడానికి తగినంత బలాన్ని కలిగి వుంటుది. ఏది ఒప్పో, ఏది తప్పో దానికి తెలుసు. సరైనదేదో తెలుసుకొని ఇష్టపడితే, అది ప్రతిరోధాన్ని ఏర్పాటుచేసి, పోరాడి జయించగలదు. కాని దానికొకటే షరతు. అది చైత్యపురుష సత్తతో అనుబంధం కలిగి వుండాలి.

అత్యంత అందమైన సిద్ధాంతాలతో పాటు కాక ఎన్నో విషయాలు తెలిసినవాడే కావచ్చు, అందరు మెచ్చుకొనే ఆదర్శాలున్నవాడు కావచ్చు, కానీ అవన్నీ అతనికి మానసిక ప్రేరణ నిరోధించ శక్తిగల సంకల్పాన్ని సమకూర్చలేవు. ఒకసారి మీరెంతో స్థిర నిశ్చయంతో ఉంటారు. అదలాగే ఉండాలని నిర్ణయిస్తారు. ఉదాహరణకి ఏదో

పని చేయకూడదని, అక్కడికది స్థిరంగా నిర్ణయించబడింది. మీరు ఆ పని చేయరు. హఠాత్తుగా, ఎలా జరిగిందో, ఏం జరిగిందో మీకు తెలియదు. కాని మీరు ఏమి నిర్ణయించలేరు! అయితే వెంటనే ఆ పని చేయడానికి మీలో ఒక అద్భుతమైన కారణం స్పష్టంగా స్ఫురిస్తుంది. అందుకు ఎన్నో కారణాలు ఉంటాయి కాని ఎల్లప్పుడూ ఒక సాకు మాత్రం దొరుకుతుంది. "సరే, ఈసారి నేనిది చేసినా, కనీసం అది చెడ్డదని నాకు నమ్మకం కలుగుతుంది, అందువల్ల అదెప్పటికీ చెయ్యను. ఇదే ఆఖరుసారి". ఇది తనకు తాను ఎప్పుడూ చెప్పుకొనే అందమైన సాకు. "నేను యిది చేస్తున్నది ఆఖరుసారి. ఇప్పుడు నేను చేస్తున్నది ఆ పని చాలా చెడ్డది అని, అది చేయకూడనిదని కచ్చితంగా తెలుసుకోవడానికే. ఇకపై ఆ పని చేయను. ఇదే చివరిసారి". ప్రతిసారి ఇదే చివరిసారి అంటూ మళ్ళీ అలాగే మొదలుపెడతారు.

మీరు దృఢంగా ఇలా నిశ్చయించుకున్నప్పుడు మాత్రమే అది చెయ్యకుండా వుండడం జరుగుతుంది. "సరే, ఈసారి అలా చెయ్యకుండా వుండడానికే నేను ప్రయత్నిస్తాను. అది ఎంత మాత్రం చెయ్యను. ఈసారి అలా చెయ్యకుండా వుండడానికే నేను ప్రయత్నిస్తాను. అది ఎంత మాత్రం చెయ్యను. అలా చెయ్యకుండా ఉండడానికి నా శక్తినంతా ధారపోస్తాను." అలా ఇందులో మీరు కనీసం ఏ కొద్ది విజయం సాధించినా అది ఎక్కువే. పెద్ద విజయం కాదు కాని అతి చిన్న విజయం, అతి పాక్షిక విజయం. మీరు ఏది చేయాలని పరితపించారో, దానిని చేయరు. కాని ఆ తపన, ఆ కోరిక, ఆ ఉద్వేగం అన్నీ అలాగే ఉంటాయి. మీలో అవి సుడులు తిరుగుతూ ఉంటాయి. కాని బాహ్యంలో మీరు నిరోధిస్తారు. "నేను అది చేయకూడదు. నేను చలించను. నేను నా కాళ్ళు, చేతులు కట్టేసుకోవలసి వచ్చినా, నేనది చెయ్యను". ఇది ఒక పాక్షిక విజయం అయినప్పటికీ పెద్ద విజయం . ఎందుకంటే దానివల్ల మరోసారి మీరు ఇంతకంటే మరి కొంచెం ఎక్కువ విజయం సాధించగలరు. చెప్పేదేమిటంటే నీలో తీవ్ర ఉద్వేగాలన్నింటినీ ఆలాగే ఉంచుకొనే బదులు వాటిని కొంచెం నెమ్మదించేలా చెయ్యడానికి ప్రయత్నించాలి. మొదట్లో వాటిని నెమ్మదిగా శాంతపరచాలి. కష్టంతో ప్రయత్నించాలి. అవి చాలా కాలం ఉంటాయి, పునరావృతమౌతాయి. మిమ్మల్ని ఇబ్బంది పెడతాయి, విసిగిస్తాయి, మీలో గొప్ప చికాకు పుట్టిస్తాయి. ఇవన్నీ ఉంటాయి. కానీ అన్నిటినీ మీరు సమర్ధవంతంగా నిరోధించి "నేనేదీ చెయ్యను, ఎంత ఖర్చైనా సరే, ఒక రాయిలాగ నిలబడతాను" అన్నట్లయితే

అప్పుడవి కొద్ది కొద్దిగా పలచబడి పోతాయి. అప్పుడు మీరు రెండో వైఖరిని తెలుసుకోవడం మొదలిడుతారు. "నా చైతన్యం అటువంటి విషయాలకి అతీతంగా ఉండాలని అనుకుంటున్నాను. ఇప్పటికీ చాలా పోరాటాలు పొంచి వుంటాయి. కాని నా చైతన్యం వాటికి అతీతంగా నిలబడగలిగితే నెమ్మది నెమ్మదిగా అవి ఎప్పటికీ తలెత్తని సమయం ఒకటి వస్తుంది." మీరు పూర్తిగా స్వేచ్ఛ పొందినట్టు భావించగలిగే ఒకానొక తరుణం ఉంటుంది. కనీసం దాన్ని కనుగొనలేరు. అది అలా ఉండిపోతుంది. అలా జరగడానికి చాలా సమయం పట్టవచ్చు. లేదా అతి త్వరగా అయినా కావచ్చు. అది ఆ వ్యక్తి గుణగణాల శక్తి మీద ఆకాంక్ష యొక్క చిత్తశుద్ధి మీద ఆధారపడి ఉంటుంది. కాని ఏ కొంచెం చిత్తశుద్ధి గలవారికైనా, ఈ పద్ధతిలో తమకి తాము అంకితమై ప్రయత్నిస్తే విజయం సాధిస్తారు. అందుకు సమయం పడుతుంది. మొదటి విషయంలో వారు విజయం సాధిస్తారు. ప్రకటించకుండా వుండుటలో భూమ్మీద ఉన్న అన్ని శక్తులూ భావప్రకటన వైపే మొగ్గుతాయి. ఈ శక్తులన్నీ తమని తాము అభివ్యక్తం చేసుకోవాలనే లక్ష్యంతోనే వస్తాయి. కాని మీరు వాటిని ఆటంకపరచి అభివ్యక్తం కానివ్వకపోతే ఆ ఆటంకాలన్నీ తొలగించుకోడానికి ఒకానొక సమయంలో ప్రయత్నిస్తాయి. చివరికి అవి అలసిపోయి అభివ్యక్తం కానందున అవి వెనక్కి తగ్గి నిన్ను ప్రశాంతంగా ఉండనిస్తాయి.

అందుచేత మీరెప్పుడూ ఇలా అనొద్దు. "నేను మొట్టమొదట నా ఆలోచనల్ని పరిశుద్ధం చేసుకుంటాను, నా శరీరాన్ని పరిశుద్ధం చేసుకుంటాను. నా ప్రాణికాన్ని పరిశుద్ధం చేసుకుంటాను. ఆ తరువాత నా కార్యాచరణని పరిశుద్ధం చేసుకుంటాను."

అది సాధారణ పద్ధతి కాని అదెప్పటికీ ఫలించదు. అత్యంత క్రియాశీలమైన క్రమపద్ధతి, బయట నించి ప్రారంభించేది. "మొట్టమొదటి విషయం నేనది చెయ్యనే చెయ్యను. తరువాత అది చెయ్యాలని అసలు కోరుకోను. తరువాత అన్ని ప్రేరణలకి నేను తలుపులు మూసేస్తాను. నా దృష్టిలో వాటికి ఉనికి లేదు. ప్రస్తుతం అన్నిటికీ అతీతంగా ఉన్నాను నేను." ఇదే యదార్థమైన క్రమం, సమర్థవంతమైన క్రమం. మొదట చెయ్యకుండా ఉండటం తరువాత దేనిపై కోరిక లేకపోవడం. అటు పిమ్మట అది చైతన్యంలో నుంచి పూర్తిగా వెడలిపోతుంది.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

ప్రాణికము ఉద్ధరింపబడాలి గాని అణచివేయబడ కూడదు

"మన విధానంలోని వైఖరి 'నిగ్రహ' మనబడే బలవంతపు అణచివేత కాదు", నమ్మకం కుదరని ప్రాణికసత్తను బలవంతంగా ఒప్పించే మానసిక నిబంధనగాని, సిద్ధాంతంగాని కాదు. ఇది పరమసత్యం. అలాగని ప్రాణికాన్ని దాని ఇష్టారాజ్యంగా వ్యవహరించనీ యడం కూడ కాదు. పాటించవలసిన విధానం నిర్బంధకరమైనది కాకూడదు. అంతర్గత మార్పును కలిగించేదిగ వుండాలి. ఈ విధానంలో నిమ్నప్రాణికం ప్రాణిక కోర్కెల లక్ష్యాల నుండి విడివడిన ఉన్నత చైతన్యం ద్వారా వికసనమొంది పరివర్తన చెందు తుంది. అయితే యీ సాధనలో నిమ్నప్రాణిక కోర్కెల సంతృప్తికి తక్కువ ప్రాధాన్యత కలిగిన వైఖరి నవలంభించాలి, వాటిపై ఆధిపత్యం పొందాలి, అవి చేసే కోలాహలంలో పడి సతమతమవకుండా, ఆహారవిహారాది విషయాలలో మితిమీరకుండా సంయమం పాటించాలి. నిమ్నప్రాణికానికి కూడ దానికుండే ప్రయోజనం దాని కుంది. దానిని అణగద్రొక్క కూడదు, మార్చాలి. పూర్తిగా హస్తగతం చేసుకోవాలి. మన నియంత్రణలో నుంచుకొని సత్కార్య నిర్వహణకు వినియోగించాలి. అప్పుడే సంపూర్ణ సత్ప్రయోజనం సాధ్యపడుతుంది.

(SABCL 23:860; CWSA 35:474)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఓ ప్రభూ, నన్ను నా మనసు యొక్క భ్రాంతి నుండి కల్పనా జగతి నుండి విడిపించు. నా చేతనను పరమ చైతన్యంతో మమేకం కానీ, అదే నీ చైతన్యం గనుక.

శ్రీమాత

అంతర్గత వివేచన

వ్యక్తికి తన కదలికల మూలం గురించిన స్పష్టమైన అవగాహన అవసరం, ఎందుకనగా అస్తిత్వంలో వైరుధ్యభరితమైన నీచశక్తు లుంటాయి. అవి నిన్ను అటు నిటు నెట్టుచూ నీలో అలజడిని సృష్టిస్తాయి. నిన్ను నీవు జాగ్రత్తగ పరిశీలించుకుంటే, నీవు యే కొద్దిపాటి కలవరపరచే పనిచేసినా నిన్ను నీవు సమర్థించుకోగల ఓ కారణాన్ని నీ మనసు తక్షణమే అందిస్తుంది. మనసుకు ప్రతి విషయాన్ని సుందరంగా తీర్చిదిద్దే శక్తి వుంది. ఈ పరిస్థితుల్లో యెవరికైనా వారిని వారు తెలుసుకోవడం కష్టం. తెలుసు కోవాలంటే ఆ పనిని చిత్తశుద్ధితో చేయగలగాలి. అప్పుడే మానసికసత్త లోని చిన్న చిన్న లోపాలన్నీ స్పష్టంగా గ్రహించగలుగుతావు.

నీ మనసులో నీవు రోజంతా చేసిన చర్యలను, నీకు కలిగిన ప్రతిస్పందనలను నెమరేసుకుంటూ కూర్చుంటే నీవు ముందుకు సాగలేవు. ఈ సమీక్ష నిన్ను ముందుకు కొనిపోవాలంటే, నిన్ను నీవు న్యాయనిర్ణేతగా వ్యవహరించునట్లు చేయగలిగే వెలుగును, నీలో అత్యుత్తమమైన, తేజోవంతమైన, ఆదరణీయమైన అభివృద్ధిని, మనసారా ప్రేమించే లక్షణాన్ని ప్రతిబింబించే దేమున్నదో. దానిని వెదకాలి. దానిని ఒక లక్ష్యంగా నీ ముందు నిలుపుకొని ముందుగా నీ చర్యలను, అనుభూతులను, ఆలోచనలను తెరపై సినిమా చూసినట్లుగా గమనించి వాటన్నింటిని సమన్వయపరచుటకు ప్రయత్నించి, అవి ఒకదాని నొకటి అనుసరించుటలోగల కారణమేమిటో కనుగొనాలి. విషయాలను ప్రకటిస్తున్న నీ ముందున్న ఆ తెరను చూస్తే కొన్ని చిత్రాలు స్పష్టంగా, మసకబారనివిగ కనిపిస్తాయి. అందుకు విరుద్ధంగా కొన్ని చిత్రాలు, కాస్త మసకగ, మరికొన్ని పూర్తిగ మసకబారి నల్లగా, అసహ్యంగా కనిపిస్తాయి. ఈ పనిని చిత్తశుద్ధితో ఒక క్రీడలాగ చేసినట్లయితే, ఫలానా పరిస్థితుల్లో యీ విధంగా భావించి అలా చేయవలసి వచ్చింది అని గ్రహిస్తావు. నీ తెలివితేటలకు, నీ ఆత్మనిగ్రహానికి ప్రతీకగా లక్ష్యమొకటి నీ ముందుంది. నీవు చేపట్టిన చర్య నీ లక్ష్యాని కనుగుణంగా వుందా లేదా? ఉన్నట్లయితే అది తెరపై మసకబారినట్లు కనిపించదు. అది స్పష్టంగా వుంటుంది. దానిని గురించి విచారించ నవసరం లేదు. అనుగుణంగా లేకపోతే తెరపై మసకబారి నట్లుగా కనిపిస్తుంది. ఎందుకని మసకబారింది? ఆ చర్యలో సంకల్పానికి ఆత్మజ్ఞానానికి, ఆత్మనిగ్రహానికి వైరుధ్యమైనది ఏమున్నది? చాలా వరకు దానికి కారణం అచేతన

అని అర్థమౌతుంది. ఈ విషయాన్ని మనసులో అచేతనకు చెందిన విషయాల వరుసలో భద్రంగా దాచి, ఇకపై యేదైనా చేయబోయే ముందు చేతనతో నుండుటకు ప్రయత్నించాలనే ధృఢనిశ్చయానికి వస్తావు. తదితర విషయాల్లో ఒక అయోగ్యమైన, అల్పమైన, అజ్ఞానపరమైన అహంకారం నీ చర్యను, నీ ఆలోచనను వక్రీకరించుటకు కారణమని గమనిస్తావు. ఆ అహంకారాన్ని నీలోని వెలుగులో నిలిపి, నిన్ను నీవిలా ప్రశ్నించుకోవాలి, "నన్ను అలా చేయించడానికి, అలా ఆలోచించింప చేయడానికి, దానికేం హక్కుంది?" అందుకు అందే యేదో ఒక చిల్లర సమాధానాన్ని అంగీకరించడానికి బదులు నీ అంతరంగంలో వెతికితే యేదో ఒక మూల యిలా ఆలోచించి చెప్పేది కనిపిస్తుంది. "ఆహా, లేదు, దానిని తప్ప దేనినైనా అంగీకరిస్తాను" అని. అందుకు కారణం ఒక అల్ప స్వాతిశయమని, ఒక అహంకారపూరిత అనుభూతి అని మరెన్నో కారణాలున్నాయని తెలుసుకుంటావు. అప్పుడు నీ లక్ష్యం యొక్క వెలుగులో వీటిని క్షుణ్ణంగా పరిశీలించి యిలా ప్రశ్నించుకుంటావు, "ఈ కదలికను ఆదరించుట ఈ నా లక్ష్యసిద్ధికి, నా అన్వేషణకు అనుగుణమైనదా కాదా, ఈ సందేహాస్పద విషయం నివృత్తి అయ్యేంతవరకు దీనిని నా అంతర్గత వెలుగు ముందుంచుతాను". ఇక నాటకం సుఖాంతమైనట్లే. కాని రోజంతా గడిచిన నాటక మింకా ముగింపుకు రాలేదు. కారణం, ఆ వెలుగులో పరిష్కరింపబడాల్సిన ఘట్టాలు యింకా చాలా వున్నాయి గనుక. అయితే ఈ క్రీడను కొనసాగిస్తే — చిత్తశుద్ధితో చేసే యీ ప్రక్రియ ఒక క్రీడే అవుతుంది — ఓ ఆరు నెలల్లో నిన్ను నీవే గుర్తించలేవు, ఇలా అనుకుంటావు, "ఏమిటీ? నేనలా వున్నానా! అది అసాధ్యమే!"

నీవు ఐదేళ్ళ పసివాడివయినా, ఇరవై యేండ్ల పడుచువాడివయినా లేక అరవై యేండ్ల వృద్ధుడవైనా ప్రతి విషయాన్ని నీ అంతర్గత వెలుగులో పరిశీలించి నిన్ను నీవు పరివర్తన గావించుకోవచ్చు. ఏ అంశాలు నీ లక్ష్యానికి అనుగుణంగా నుండవో, అవి సాధారణంగా పూర్తిగా విసర్జనీయమైనవిగా నుండవు; కేవలం అవిఉచితమైన రీతీలో నుండకపోవుటయే అందుకు కారణమని గ్రహిస్తావు. నీ అనుభూతులు, ఆలోచనలు, ప్రేరణలు, వగైరా అంతర్గత వెలుగైన చైత్య కేంద్రం చుట్టూ క్రమబద్ధీకరించినట్లయితే అంతర్గత అస్తవ్యస్థత అంతా ఒక తేజోమయస్థితిగా మారుతుంది.

ఒక ప్రాచీన ఋషి ప్రవచించింది:

"పాపమనేది లేనే లేదు — ఉన్నది సంయమన లోపం మాత్రమే"

"చెడు అనేది లేనే లేదు, కేవలం విషయాలు ఉచితరీతిలో నుండకపోవుటయే"
(CWM 4:38-40)

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ఉదాసీనమైన మరియు క్రియాశీలమైన జాగరూకత

మెలకువ కలిగి చిత్తశుద్ధితో వుండి తన్ను తాను కాచుకోవడమే జాగరూకత. ఎప్పుడూ హఠాత్పరిణామానికి లోను కాకూడదు. నీవు సాధన చేయాలని కోరుకుంటే నీ జీవితంలో ప్రతి క్షణం, నీ లక్ష్యం వైపు అడుగువేయడానికి, నిద్రలోకి జారుకోవడానికి లేక వెనుకకు మళ్ళి "ఇప్పుడే కాదు, తరువాత" అని నీకు నీవు చెప్పుకొని మార్గ మధ్యంలో చతికిలబడటానికి, దేనినైనా చేయడానికి నీకు అవకాశం వుంది.

జాగరూకత కలిగి వుండడమంటే, నిన్ను క్రిందికి దిగజార్చేదానిని ఎదిరించి నిలబడటమే కాదు, అన్నింటిని మించి, చురుకుగా అభివృద్ధి చెందటానికి ఒక బలహీనతను అధిగమించడానికి, ఒక ఆకర్షణను నిరోధించడానికి, కొత్తది ఏదైనా నేర్చుకొనే అవకాశం చేజార్చుకోకుండా వుండటానికి, దేనినైనా సరిదిద్దే అవకాశాన్ని పోగొట్టుకోకుండా వుండటానికి, దేనిపై నైనా ఆధిపత్యం సంపాదించటానికి, కలిగే అవకాశాలను పోగొట్టుకోకుండా వుండడం. జాగరూకతతో ఉండగలిగితే ఏళ్ళ తరబడి చేసే కర్మలను కొలది దినములలోనే నిర్వర్తించగలవు. నీవు జాగరూకతతో వున్నచో, జీవితంలో సంభవించే ప్రతి పరిస్థితిని, చేసే ప్రతి కర్మను, ప్రతి కదలికనూ, నీ లక్ష్యాన్ని చేరటానికి ఒక అవకాశంగా మార్చగలవు.

జాగరూకత రెండు రకాలు, క్రియాశీలము, ఉదాసీనము. ఒక పొరపాటు చేయబోతున్నా, నీవు తీసుకుంటున్న నిర్ణయం సరైనది కాకపోయినా, నీవు శక్తిహీనుడవౌతున్నా, లేక ఆకర్షణకు లోనౌతున్నా, నిన్ను హెచ్చరించే జాగరూకత ఒకటి, రెండవది క్రియాశీల జాగరూకత. అది అభివృద్ధి చెందడానికి అవకాశాన్ని వెతుకుతుంటుంది. ప్రతి పరిస్థితిని తొందరగా ఎదగటానికి ఉపయోగించే అవకాశాన్ని అన్వేషిస్తుంది. నిన్ను నీవు నిమ్నస్థాయికి దిగజారిపోకుండా నిరోధించుకొనుటకు త్వరితగతిని ఎదుగుటకు మధ్య వ్యత్యాసమున్నది.

అవి రెండూ నిశ్చయంగా అవసరమే మరి. జాగరూకత లేనివాడు, మృతిచెందిన వాడవుతాడు. అతడు తన ఉనికికి, జీవితానికి వున్న యదార్థ ప్రయోజనంతో సంబంధం కోల్పోయాడన్న మాట.

అందువలన, కాలం, పరిస్థితులు, జీవితం అన్నీ వృధాగా గడిచిపోతాయి. నీవు ఏమీ సమకూర్చుకోలేవు. నీ మత్తులో నుంచి మేల్కొనేసరికి, తప్పించుకొనుట సులభం కానటువంటి ఒక సొరంగంలో పడిపోయినట్లుగా వుంటుంది.

(CWM 3:202-03)

శ్రీమాత

అనువాదం: కవితా రెడ్డి

మనసును శుద్ధపరచుట — నాలుగు దశల క్రమం

సాధారణ మానవ జీవితం ప్రస్తుత ప్రపంచంలో మనసు చేతనే పాలించబడుతుంది. అందువలన మనసును నియంత్రించటం అతి ముఖ్యమైన విషయం. మనసును వికసింప చేయటానికి, నిగ్రహించటానికి మన మొక అంచెలవారీ క్రమశిక్షణను అనుసరించవలసి ఉంది. అందుకు నాలుగు అంచెలలో కొనసాగే ప్రక్రియను అనుసరించాలి.

ఈ నాలుగు దశలు వెనువెంట వస్తూ ఉంటాయి. ఇది ముగింపుకు వచ్చేసరికి ఏకకాలంలో సంభవించవచ్చు. మన ఆలోచనలను గమనించటం మొదటి దశ. ఆలోచనలపై నిఘా ఉంచటం రెండవది, మీ ఆలోచనలను అదుపు చేయగలగటం మూడవది. మీ ఆలోచనలపై ఆధిపత్యాన్ని కలిగి ఉండటం నాలుగవది.

*

మనో నైర్మల్యాన్ని సాధించటానికి పరంపరగా వచ్చే నాలుగు దశ లుంటాయని ముందుగానే చెప్పాను. శుద్ధమైన మనస్సు సహజంగానే తప్పు టాలోచనలను దరి చేరనివ్వదు. ఈ ఫలితాలను పొందటానికి అవసరమైన ఆలోచనలపై సంపూర్ణమైన ఆధిపత్యం అనేది నేను చెప్పిన నాలుగు దశలలో చిట్టచివరి సిద్ధి. మొదటిది మీ మనసును గమనించటం.

మీ ఆలోచనలను పరిశీలించటాన్ని అంత తేలికైన విషయంగా భావించవద్దు. అందు నిమిత్తం ముందుగా మిమ్మల్ని మీరు ఆలోచనల నుండి వేరు చేసుకోవాలి.

సాధారణంగా సామాన్య వ్యక్తి తన ఆలోచనల నుండి తనను వేరుగా గుర్తించడు. అతడు ఆలోచిస్తున్నాడనే విషయమే అతనికి తెలియదు. అలవాటు ప్రకారం ఆలోచిస్తూ ఉంటాడంతే. అకస్మాత్తుగా అతన్ని నువ్వేం ఆలోచిస్తున్నావని అడిగితే దాని గురించి అతని కేమీ తెలియదు. నూటికి తొంభై అయిదు శాతం అతని సమాధానం 'నాకు తెలియదు' అనే వస్తుంది. వ్యక్తి చేతనతో ఆలోచనా స్రవంతి పూర్తిగా మమేకమై ఉంటుంది.

ఆలోచలను గమనించటానికి మొదటిగా చేయవలసినది ఒక అడుగు వెనకకు వేసి వాటి వైపు దృష్టి సారించాలి. మీ చైతన్యపు కదలికను ఆలోచనా కదలికను ఒక దానిని మరొకటిగా పొరబడకుండా మిమ్మల్ని మీరు ఆలోచనల నుండి వేరు చేసుకోవాలి. ఇలా మీ ఆలోచనలని మీరు గమనించాలి అన్నప్పుడు అది చాలా సరళమైన విషయమని మీరు నమ్మకండి. అది మొదటి మెట్టు మాత్రమే.

*

"అతను నన్ను అవమానించాడు. అతను నన్ను కొట్టాడు. అతడు నన్ను అగౌరవ పరిచాడు, అతడు నన్ను దోచుకున్నాడు". యిలాంటి ఆలోచనలను పెంచి పోషించే వారు వాళ్ళ ద్వేషాన్నెప్పుడూ శమింప చేసుకోలేరు.

ధమ్మపదం ముందుగా ఏమని చెప్తుతుందంటే చెడు ఆలోచనలు దుఃఖాన్ని కలిగిస్తాయి, మంచి ఆలోచనలు ఆనందాన్ని కలిగిస్తాయి అని. ఇపుడు ఎటువంటి ఆలోచనలు దుష్టమైనవో సోదాహరణంగా చెప్పి మన దుఃఖాన్ని ఎలా నివారించాలో వివరిస్తుంది మొదటి ఉదాహరణ. నేను దానినే తిరిగి చెపుతున్నాను. 'అతడు నన్ను అనమానించాడు, నన్ను కొట్టాడు. నన్ను అగౌరవ పరచాడు, నన్ను దోచు కున్నాడు'. దీనికి మరొకటి కూడా జత చేస్తుంది 'ఇటు వంటి ఆలోచనలను పోషించేవారు తమ ద్వేషాన్ని ఎప్పటికీ శమింప చేసుకోలేరు' అని.

మనం మన మానసిక క్రమశిక్షణను మానసిక వికాసం యొక్క నాలుగు దశల క్రమంపై ఆధారపడి ప్రారంభించాం. ఈ శిక్షణలో నాలుగు వరుస క్రమంలో వచ్చే దశలున్నాయని విశదీకరించినది మీరు జ్ఞాపకం ఉంచుకున్నారని భావిస్తున్నాను. అవి గమనించటం, నిఘా ఉంచటం, నియంత్రించటం, ఆధిపత్యం. చివరి పాఠంలో మనలను మన ఆలోచనల నుండి వేరు చేసుకొని ఒక శ్రద్ధగల ప్రేక్షకుడిలా గమనించ గలగాలని నేర్చుకున్నారని ఆశిస్తున్నాను.

ఈ రోజు మనం ఆలోచనలపై నిఘా ఉంచటమెలాగో నేర్చుకుందాం. ముందుగా వాటిని చూడాలి. తరువాత వాటిని కాపలా కాయాలి. ఒక వివేకవంతుడైన న్యాయ మూర్తిలా వాటిని చూడటం నేర్చుకోండి. అందు వలన ఏది మంచో, ఏది చెడో, ఏవి ఉపయోగకరమైన ఆలోచనలో, ఏవి అపాయకరమైనవో, ఏవి నిర్మాణాత్మకమయి విజయం వైపు నడిపే ఆలోచనలో, ఏది ఓటమిని కలిగించి వెనుకకు మరల్చే ఆలోచనలో తెలుసుకోవాలి. ఈ వివేచనా శక్తిని మన మిపుడు పెంపొందించుకోవాలి. ధమ్మపథం మనకు ఉదాహరణల నిస్తుంది. మనం స్వయంగా ఆలోచనలను ఏవి మంచివి ఏవి చెడ్డవీ అనేవి గుర్తించటం నేర్చుకోవాలి, నేను చెప్పినట్లు అందుకు మీకు ఆలోచనలను పరిశీలించటం తెలియాలి, ఒక వివేకవంతమయిన న్యాయమూర్తిలా, అంటే సాధ్యమయి నంత నిష్పక్షపాతంగా. అది అత్యంత అవశ్యకమైన స్థితి.

*

'అతను నన్ను అవమానించాడు. అతడు నన్ను కొట్టాడు. అతను నన్ను అగౌరవపరి చాడు, అతడు నన్ను దోచుకున్నాడు' యిటువంటి ఆలోచనలను పోషించనివారు ద్వేషాన్ని వర్ధిల్లనీయరు.

ఇది మొన్న మనం చదివినదానికి ప్రతిరూపం. ఇది కేవలం ద్వేషపూరితమయిన ఆలోచనలకు సంబంధించినదని గ్రహించండి. ఎందుకనగా అసూయ, ద్వేషాలు, మానవుల దుఃఖానికి చాలా విస్తృతమైన కారణాలు.

కానీ ఈ ద్వేషాన్ని తప్పించుకొనుట యెలా? విశాలమైన, ఉదారమైన హృదయం కచ్చితంగా ఉత్తమమైన మార్గం. కానీ అది అందరికీ అందుబాటులో ఉండదు. మన ఆలోచనలను నియంత్రించుకో గలగటం మరింత సార్వజనీనమైన ప్రయోజనాన్ని కలిగి ఉండవచ్చు.

ఆలోచనలను అదుపు చేసుకోవటం మానసిక క్రమశిక్షణయొక్క మూడవ మెట్టు. మన చేతనలోని వివేకవంతమయిన న్యాయమూర్తి ఏవి ఉపయుక్తమయినవో, ఏవి అపాయకరమైన ఆలోచనలో గుర్తించినపుడు మనలోని అంతరంగ రక్షకుడు కేవలం అంగీకార యోగ్యమైన ఆలోచనలను మాత్రమే అనుమతిస్తాడు. అవాంఛనీయ అంశాలను అనుమతించడు.

ఆజ్ఞాపూర్వకంగా ఈ రక్షకుడు ప్రతి చెడుతలంపును సాధ్యమయినంత వెనుకకు త్రోసివేస్తాడు.

ఈ అనుమతి, తిరస్కారాల కదలికలనే మనం ఆలోచనా నియంత్రణ అని పిలుస్తాం.
(CWM 3:183-86)

శ్రీమాత
అనువాదం: డా. సరోజా ప్రసాద్

మనసులో శాంతిని ఎలా నిలపాలి?

ప్రశ్న: తల్లీ, "తన చేతనను ఉన్నతస్థితి యందుంచుట" అనగా ఉన్నతమైన ఆలోచనలు కలిగి వుండటానికి చేసే ప్రయత్నం అని అర్థమా?

సమా: దీనిని ఒక వాస్తవము అనేకన్న పర్యవసానము అనుట సముచితము. చేతనను ఉన్నతస్థాయి యందు నిలిపినపుడు, అది ఒక వడపోసే పరికరంగా పనిచేసి ఉన్నత భావములను మాత్రమే అంగీకరిస్తుంది. మరి అది ఒక పర్యవసానమే గాని వాస్తవం కాదు. చేతనను ఉన్నతస్థాయి యందుంచుట అనగా అస్తిత్వపు నిమ్నస్థితిగతుల కన్నా మెరుగైన స్థాయిలో పైన నిలబెట్టుట. వెలుగునందు, శాంతమునందు, ఉన్నత విజ్ఞానము నందు, సామరస్యత నందు చేతనను ఉంచుట అది, అనగా తన చేతనను తన అస్తిత్వమందు అవకాశమున్నంత మేరకు ఒక ఉన్నత స్థాయి యందుంచుట. అట్టి స్థాయి యందు చేతనను నిలిపి వుంచినట్లయితే, సహజంగానే దాని కందే ఆలోచనలన్నీ ఉన్నత స్థాయికి చెందినవే అవుతాయి. ఆలోచన చేతన యొక్క ధర్మాల్లో ఒకటి. అది చేతనయొక్క మూలద్రవ్యము కాదు. ఆలోచనలు లేని చేతనా స్థితి ఒకటున్నది, అంతకన్నా మరింత ఉన్నతమైన చేతనాస్థితి కూడా మరొకటున్నది. దాని యందు అసలు ఆలోచనలే ఉండవు. మాటల్లోను, ఆలోచనల్లోను వ్యక్తపడని ఒక పరిపూర్ణ విషయ పరిజ్ఞానాన్ని ఆ చేతన పొంది ఉండగలదు.

ప్రశ్న:"ఆలోచన కేవలం ఒక రకమైన క్రియాశీలత. పైనుండి దిగివచ్చినపుడే శాంతిని మరింత సులభంగా స్థాపించవచ్చును" ఇక్కడ పైనుండి అంటే ఏమిటి?

సమా: చేతన యొక్క ఉన్నత సీమల నుండి అని అర్థము. చేతన యొక్క ఉన్నత

సీమలకు నీవు ఉన్మీలుడవై వుండి, శక్తిపై నుండి దిగివచ్చిందంటే అతి సహజంగా అది అధోలోక సీమలలో ఒక శాంతిని స్థాపిస్తుంది. ఎందుచేతనంటే, అవి ఈ దిగివచ్చే ఉన్నతశక్తి వల్లనే సాధించబడతాయి. ఇది మనస్సు యొక్క ఉన్నత సీమల నుండో లేక ఆ పైనుండో, లేదా అతిమనస్సు నుండైనా దిగివస్తుంది. అంచేత యీ శక్తి మరియు చేతన దిగివచ్చి, అధోభూమిక యొక్క చేతన యందు ప్రవేశించినపుడు, ఈ చేతన సహజంగానే శాంతపడుతుంది. ఎలాగుంటుందంటే అది తనను పరివర్తించే ఉన్నత వెలుగు యొక్క ముంపునకు ఆక్రమణకు లోనైనట్లుంటుంది.

నిజానికి, ఎవ్వరి మనస్సులోనైనా స్థిరమైన శాంతిని స్థాపించుట కిదొక్కటే మార్గము. ఇది ఊర్ధ్వసీమలకు వ్యక్తి ఉన్మీలుడగుటకు, మరియు, ఉన్నత చేతన, శక్తి, వెలుగు, నిరంతరం అధోమనస్సులోకి దిగి ప్రవేశించి దానిని వశపరచుకొనుటకై ఉద్దేశింపబడినది. ఇది జరిగినప్పుడు అధోమనస్సు ఎల్లప్పుడూ ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉండగలదు, ఎందువల్లననగా, ఆ దిశగా యిదొక్కటి మాత్రమే పనిచేసి వ్యక్తియందు పూర్తిగా వ్యాపిస్తుంది. ఊర్ధ్వభూమికల నుండి దిగివచ్చి మనస్సున చొచ్చుకొనిపోయే ఈ శక్తితో మనస్సు చురుకుగా లేనపుడు సైతం వ్యక్తి పనిచేయగలడు, మాట్లాడగలడు, యింకా వ్రాయగలడు. ఆ తరుణంలో మనస్సు ఒక పనికి రాని పనిముట్టుగా తయారవుతుంది. వాస్తవానికి శాంతిని స్థాపించుట కిదొక్కటే మార్గము. ఒక్కసారి ఈ క్రియ జరిగితే శాంతి స్థిరపడిపోయినట్లే; మనస్సు ఆ పైన చలించదు. ఆ శక్తి మనస్సులో వ్యక్తమైనప్పుడు దాని ప్రేరణతో మాత్రమే మనస్సు పనిచేస్తుంది. అది ఒక నిశ్శబ్ద ప్రశాంత క్షేత్రస్థితిని పోలి వుంటుంది. ఆ శక్తి వచ్చినప్పుడు ప్రకృతిశక్తుల యందు కదలికలను కలిగించి వాటిని వినియోగపరుస్తుంది. మనస్సు ఎటువంటి ఆందోళనా కలుగనీయకుండా దాని ద్వారా వ్యక్తపడుతుంది. అది మాత్రం ఎంతో ప్రశాంతంగా నుంటుంది.

ప్రశ్న: మధుమయా మాతా! చేతన యందున్న అస్పష్ట విషయాలను ఏ విధంగా తొలగించగలం?[1]

సమా: ఆకాంక్షతో నిమ్నస్వభావ ప్రేరణలను తిరస్కరించుటతో ఉన్నతశక్తిని ఆహ్వానించుటతో — వాటిని తొలగించవచ్చును. నీవు కొన్ని మానసిక చలనాలను ఆమోదించకపోతే, వ్యక్తపడవని తెలుసుకుంటే సహజంగానే అవి శక్తిహీనమై తప్పుకుంటాయి. నీవు క్షుద్ర విషయాసక్తిని ప్రదర్శించకపోతే అది మెల్ల మెల్లగా అదృశ్యమవుతుంది.

చేతననుండి అటువంటి నిమ్నస్థాయికి చెందిన విషయాలే ఖాళీ అవుతాయి. మనసా, వాచా, కర్మలందు వాటికి ఎలాంటి ఆదరణ చూపక వాటిని తిరస్కరించాలి. ప్రేరణ, ఆలోచనలు, ఆవేశములు వచ్చినపుడు వాటిని వ్యక్తపరచక ప్రక్కకు నెట్టివేసి, ఒక అంతర్గత ఆకాంక్షతో చలించక నిలబడితే, క్రమేణా అవి వాటి శక్తిని కోల్పోయి రావటం మానేస్తాయి. దానితో చేతన నిర్మలమై నీచమైన కదలికలు లేకుండా ఖాళీ అవుతుంది.

ఉదాహరణకు అనవసరపు టాలోచనలు ప్రవేశించాయనుకో, నీవు వాటని ఆసక్తిగా చూచినా, వాటి కదలికలను పట్టించుకొనుటకు ఉత్సాహం చూపినా అవి రావటం ఎప్పటికీ మానవు. నీకు గనుక అవాంఛనీయ సంవేదనలు, అనుభూతులు ఉన్నా అంతే అవుతుంది. వాటి వైపు దృష్టి మళ్ళించినా, నీ మనస్సును వాటిపై నిలిపినా, సరదాకు వాటిని తట్టి చూచినా అవి రావటం మానవు. వాటిని ససేమిరా రావద్దు, ఛీ, పో. అంటేనే కొంత సమయం తరువాత ఆగుతాయి. నీకు చాలా ఓర్మి, పట్టుదల ఉండాలి.

నీవు గొప్ప ఆకాంక్షతో, ఒక ఉన్నత శక్తితోనైనా పైనుండి దిగివచ్చే వెలుగుతో నైనాలేక చైత్యపురుషుని ప్రభావంతోనైనా సంపర్కమేర్పరుచుకొని ఈ నిమ్నకదలికలను దానికి సంధానపరచగలగితే, అవి సహజంగానే తొందరగా ఆగిపోతాయి, కాని నీవు నీ ఆకాంక్షతో వాటిని రాబట్టుటకు పూర్వమే నీ ఓర్మి పట్టుదలతోనే వాటిని తిరస్కరించుట ద్వారా ఆ కదలికలను కట్టడి చేయగలవు. నీకు యిష్టము లేని ఆలోచనలు వచ్చినట్లయితే, వాటిపై ఎటువంటి దృష్టిని నిలువక, వాటిని తుడిచివేస్తే, అవి కొంతకాలము తరువాత రానే రావు. కాని దీనిని నీవు పట్టుదలతో శ్రద్ధగా చేయాలి.

(CWM 6:328-30)

శ్రీమాత

అనువాదం డా. దామెర్ల వెంకటేశ్వరరావు

[1]"నిశ్చలతను నిలుపుకో. అది కొంత తడవు నిరర్థకమైనదిగా వున్నా ఫరవాలేదు. పట్టించుకోకు. ఖాళీ చేయవలసిన పనికిరాని చెత్తాచెదారముతో నింపబడిన భాండమువలె ఉంటుంది, చేతన, అది మరల వాస్తవమైన, నూతనమైన, సరైన స్వచ్ఛమైన విషయాలతో నింపబడేటంత వరకు కొద్దిసేపైనా దానిని ఖాళీగానే ఉంచాలి."

(SABCL 23:640)

శ్రీఅరవిందులు

హృదయాన్ని శుద్ధిపరచుట

నీవు ప్రయత్నిస్తున్న హృదయ పరిశుద్ధతలో అసాధ్యమేమీ లేదు. హృదయం యెప్పుడైతే శుద్ధపరచబడిందో అంతకు పూర్వం అసాధ్యమనిపించిన విషయాలన్నీ, యిప్పుడు ఆచరించలేమని నీకనిపిస్తున్న అంతరంగ సమర్పణతో పాటు, సుసాధ్యమౌతాయి.

వినమ్రత, ఓర్పు హృదయంలో గాఢంగా నాటుకున్నప్పుడు యితర విషయాలు విశ్వాసం లాంటివి, అటు పిమ్మట అతిసహజంగా అనుసరిస్తాయనేది అనుభవైకవేద్యం. వీటి వరప్రసాదమైన చైత్యపురుష వెలుగు, సంతోషం ఒక్కసారి స్థిరపడినట్లయితే ఆ స్థితిని యితర శక్తులు ఆవరించుట అంత సులభం కాదు, నిర్మూలించుట అసలు సాధ్యపడనే పడదు. ఇది సర్వసాధారణంగా కలిగే అనుభవం.

పరిశుద్ధపరచటం, పవిత్రీకరించటం — రెండూ సాధనకు కావలసిన అతి ముఖ్య అవసరాలు. శుద్ధపరచటానికి పూర్వమే అనుభవాలు సిద్ధించినవారికి అపాయాలకు లోనయ్యే అవకాశం మెండుగా వుంటుంది. వారి మార్గం సుగమం కావాలంటే ముందుగా హృదయాన్ని శుద్ధిపరచటం చాలా మంచిది. ఆ కారణంగానే స్వభావంలో చైత్యపురుష మార్పు జరగాలని నా సిఫార్సు, దాని అర్థం, హృదయశుద్ధి జరగాలని: హృదయం పూర్తిగా భగవంతుని వైపు మళ్ళించాలి అని: మనసును, ప్రాణికాన్ని అంతస్సత్తా, అనగా అంతరాత్మ నియంత్రణకు లోబరచాలి అని. సర్వకాల సర్వావస్థల యందు అంతరాత్మను యెదురుగా నిలుపుకున్నప్పుడే, యెవరికైనా చేయవలసిందేమిటో, వర్జించవలసిందేమిటో, ఆలోచనాసరళిలో, అనుభూతిలో, ఆచరణలో తప్పుడు విషయాలేమిటో, యదార్థమైన విషయాలేమిటో తెలుసుకునేందుకు అంతరంగం నుండి సరైన మార్గదర్శనం లభిస్తుంది. అయితే, చైతన్యం ఎంత మేరకు శుద్ధి చెందుతుందో, అంతమేరకే అంతరంగ సూచన వెలువడుతుంది.

సూక్ష్మపద్ధతులంటే నా అర్థం, అవి మానసిక పద్ధతులని, యాంత్రికమైన ప్రక్రియలు కావని — ఉదాహరణకు, హృదయంలో ఏకాగ్రత,ఆత్మసమర్పణ, స్వయంశుద్ధి, అంతర్గత విధానాల ద్వారా చైతన్య మార్పిడి లాంటివి. దీని భావన బహిర్ముఖమైన మార్పుండదని కాదు. బహిర్ముఖమైన మార్పు కూడ అవసరమే కాని అది అంతర్ముఖ మార్పులో భాగంగా నుండాలి. అంతరంగంలో కల్మషంగాని, కాపట్యంగాని, వున్నట్లు

యితే, బహిర్ముఖ మార్పు సార్థకం కాదు. కాని నిజాయితీగల అంతర్ముఖ కర్మాచరణ జరుగుతుంటే బహిర్ముఖ మార్పు దానికి చేదోడై ప్రక్రియను వేగవంతం గావిస్తుంది. హృదయ పరిశుద్ధతకు స్వచ్ఛమైన సద్భావన అతి ముఖ్యం. అత్మవంచన కూడదు, దైవంతోగాని, స్వయంగాగాని, గురువుతోగాని దాపరికం కూడదు, తన క్రియాకలాపాల పట్ల సరైన వైఖరి, అవి తిన్నగా సాగాలనే స్థిరసంకల్పం వుండాలి. దైవాన్వేషణ జీవిత పరమావధిగా చేయుటకు సిద్ధపడి వుండాలి: అందుకు సమయం పట్టినా ఫర వాలేదు. హృదయాన్ని పరిశుద్ధపరచటం ఒక చక్కని గణనీయమైన సిద్ధి. ఆ ప్రయత్నంలో యెవరైనా తమలో మార్పు చెందవలసిన విషయాలున్నాయని తెలుసుకుంటే అధైర్యపడి నిరాశ చెందడంలో ఉపయోగం లేదు. దృఢమైన సంకల్పం, యదార్థమైన వైఖరి గనుక వున్నట్లయితే, అంతరంగంలో అంతర్దృష్టి ప్రారంభమౌతుంది. సూచనలు అందుట ప్రారంభమై సుస్పష్టంగా, సంక్షిప్తంగా అపార్థానికి చోటివ్వకుండా వికసిస్తాయి. దానితోపాటు వాటిని అనుసరించగలిగే శక్తి కూడ నీలో పెరుగుతుంది. అప్పుడు నీ గురించి నీవు సంతృప్తి చెందేందుకు ముందుగానే, దైవం నీ పట్ల సంతృప్తి చెంది, మానవాళి యే మహోన్నత పరిణామాన్ని ఆకాంక్షిస్తున్నదో అది పరిపక్వత నొందకుండా తనను తన అనుయాయులను హానిపరచకుండా దైవం తాను వేసిన రక్షణ తెరను తొలగించుట ప్రారంభిస్తాడు.

(SABCL 23: 902-04)

శ్రీఅరవిందులు

అందుగులపాటి కైలాసపతి

పరిశుద్ధత, ఏకాగ్రత — రెండూ కావాలి

దైవసత్యాన్ని మనలో చక్కగా ప్రతిబింబించేటట్లు చేసుకోవడమే మానసికసత్త పరిశుద్ధత లోని ఉద్దేశము. ప్రతిబంధకమేమీ లేకుండా స్వచ్ఛమైన పాత్రగా, నేర్పరితనంతో ఉంటే దానిలో దైవత్వాన్నీ, దివ్యప్రభనూ నింపవచ్చు. అప్పుడు దివ్యప్రకృతి అందు ఆవహించి, దాన్ని చక్కగా మలుచుకొని దివ్యకార్యాలకై ఉపయోగించగలదు. ఇప్పటిదాకా మానసిక సత్త తన మనోమయ, దైహిక దృష్టిలో ప్రపంచంలో రేగుతున్న గందరగోళాన్ని మాత్రమే ప్రతిబింబిస్తోంది. ఆ కారణంగా అది అయోమయ నిమ్న ప్రకృతి అస్తవ్యస్తతకు ఒక మార్గంగా అయింది. పైగా అదంతా ప్రతిబంధకాలతో, కల్మషాలతో కూడి దైవత్వం పనిచేయడానికి వీలులేని పరిస్థితిలో ఉంది. దానితో మన సత్త అంతా పూర్తిగా అపరిపూర్ణతతో, వైకల్యంతో ఉన్నత ప్రభావాలకు లొంగ కుండా మొండిగా ఉండి తెలివితక్కువ, నీచప్రయోజనాలకు ఉపయోగపడుతోంది. అంతే కాకుండా అది ప్రపంచాన్ని కూడా తారుమారుగా ప్రతిబింబిస్తుంది; ఇక దైవాన్ని ప్రతిబింబించే సామర్థ్యం దానికి లేనే లేదు.

ఏకాగ్రత చాలా అవసరము. ప్రథమంగా ఇంద్రియాలు ఆడించినట్లుగా ఆడుతూ, శాఖోపశాఖలుగా ఉండే కోరికల కనుగుణంగా పలు దిక్కుల్లో పోయే ఆలోచనా ప్రవాహాన్ని అనుసరించి వెళ్ళే చంచల స్వభావంగల మనస్సునూ, సంకల్పాన్నీ, ఇంకా దీనికి ప్రతిస్పందించే బాహ్యమనసునూ ఒక దిశలో నడిపించాలంటే ఏకాగ్రత కావాలి. సంకల్పాన్ని, ఆలోచనా సరళిని అన్నింటికి ఆధారంగా నుండే శాశ్వతమైన, వాస్తవమైనదానిపై స్థిరంగా నిలపాలి. ఇందుకు తీవ్రమైన ప్రయత్నంతో పాటు, ఏకోన్ముఖంగా సాగే ఏకాగ్రత అవసరం. ఆ తర్వాత మనకీ సత్యానికీ మధ్యన సాధారణ మనస్తత్వం వల్ల ఏర్పడిన తెరను తొలగించటానికి ఏకాగ్రత అవసరము. బాహ్యజ్ఞానం సాధారణమైన దృష్టితో గ్రహించవచ్చు, కానీ అంతర్గతంగా గుప్తమై యున్న మహోన్నత సత్యాన్ని గ్రహించాలంటే ఏకాగ్రచిత్తమైన మనస్సుతోనూ ఏకాగ్రమైన సంకల్పంతోనూ మాత్రమే సిద్ధిస్తుంది. అంతే కాక అలా సిద్ధించినదాన్ని వదలకుండా నిరంతరం సురక్షితంగా దానితో ఐక్యమైపోవాలి. ఎందుకంటే ఒక విష యాన్ని సంపూర్ణంగా తెలుసుకొని నీ స్వంతం చేసుకోవాలంటే తాదాత్మ్యం ఒక్కటే మార్గము. వాస్తవం కోసం పూర్తి ఏకాగ్రతతో అనుచానమైన శుద్ధచింతన ద్వారా

పొందగలిగిన గొప్ప ఫలితమే అది. సహజసిద్ధంగా పునర్వికాసంలేని అజ్ఞాన మనస్తత్వం ఉన్నప్పుడు మనకీ దైవానికీ మధ్యన ఉండే వేర్పాటునూ, తెరనూ ఛేదించాలంటే అనుసరించవలసిన విధానం ఇదే.

(శిష్యులకు వ్రాసిన ఉత్తరాలకు జవాబుల నుండి సేకరణ)

అన్నిటి కంటే ముందర స్వచ్ఛత ఉండాలనే రాజయోగుల వాదన సరైనదే. నేను చెప్పేది కూడా అదే, యోగసమన్వయంలో ఏకాగ్రతతోపాటు స్వచ్ఛతను కూడా ముందుగా చేర్చాను. ఇది చేయనప్పుడు ఏ అనుభవాలు కానీ సిద్ధులుగానీ గమ్యానికి చేర్చలేవు అనే సంగతి నిన్ను నీవు పరిశీలించుకుంటే బాగా తెలుస్తుంది. అవన్నీ (అనుభవాలు వగైరా) ఏ నిమిషాన్నైనా సమసిపోవచ్చు — నీ ప్రాణికం అపరిశుద్ధంగా అహంభావముతో నిండిపోయి ఉన్నప్పుడు.

*

సాధనలో మానసిక, నైతిక నియంత్రణ కాకుండా ఆధ్యాత్మికమైన ఆధిపత్యం ఉండాలి. మానసికమైన నియంత్రణ అసమగ్రము, అది నియంత్రిస్తుంది కానీ స్వేచ్ఛ నివ్వదు. చైత్యకము, ఆధ్యాత్మికము మాత్రమే విముక్తిని ప్రసాదించగలవు. సాధారణ జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి మధ్య నున్న ముఖ్యమైన తేడా ఇది.

*

చైత్యాంశ తనలో బలపడినప్పుడే ఎవరైనా గూడా పైనున్న తన కేంద్రస్థ పురుషునితో చైతన్యవంతమైన సంబంధం ఏర్పరుచుకోగలరు. అది జరిగి కేంద్రస్థ పురుషుడు స్వభావంలోని వివిధ వైఖరులను వ్యవస్థీకరించటానికీ, నియంత్రించటానికీ తన చైతన్యానికి ఇచ్ఛను ప్రయోగించినప్పుడు మాత్రమే నిజమైన ఆధ్యాత్మిక సంనియమేంద్రత ఏర్పడుతుంది. అది మొదట చెప్పిన అసమగ్ర మానసిక, నైతిక నియంత్రణకు పూర్తి వ్యతిరేకము.

శ్రీఅరవిందులు

అనువాదము: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

సాధనలో సాధారణ మార్గం

మనస్సును ప్రశాంతమయం చేసి, ఆధ్యాత్మిక అనుభవం కలగాలంటే మానవప్రకృతిని పవిత్రం చేసి సన్నద్ధం చేయాలి. దీనికి కొన్నిసార్లు చాలా సంవత్సరాలు పట్టుతుంది. సక్రమ వైఖరితో చేసే పని దానికి అత్యంత సులభమైన మార్గం. అంటే కోరిక, అహం లేకుండా పనిచేయడం, అన్ని కోరికల డిమాండ్ , అహం కదలికల్ని త్రోసిపుచ్చడం ముఖ్యం. జగన్మాతకు నివేదనగా పనిచేయాలి. ఆమెను స్మరిస్తూ, ఆమె శక్తిని వ్యక్తం చేయాలని ప్రార్థించాలి. అంతర్గత నిశ్శబ్దంలోనే కాకుండా, చర్యలో కూడా ఆమె సాన్నిధ్యం, ఆమె కర్తృత్వాన్ని గుర్తించాలి.

*

రెండు సంభావ్యతలు ఉన్నాయి. వ్యక్తిగత ప్రయత్నం ద్వారా పవిత్రీకరణ. దీనికి చాలా కాలం పడుతుంది. ఇది ఒకటి. రెండవది భగవంతుని కారుణ్యం ప్రత్యక్షంగా పనిచేయడం. తన చర్యలో ఇది సాధారణంగా వేగవంతంగా పనిచేస్తుంది. భగవంతుని కృప కోసం సంపూర్ణ సమర్పణ కావాలి. ఆత్మసమర్పణ అవసరం. పరమ ప్రశాంత మైన మనస్సు అవసరం. భగవంతుని శక్తి పనిచేయడానికి అవకాశం ఇవ్వాలి. ప్రతి సోపానం వద్ద భగవంతుని శక్తిని బలపరుస్తూ దానికే అంటిపెట్టుకోవాలి. మనస్సు మాత్రం నిలకడగా, శాంతంగా ఉండాలి.

*

సాధన సాగిపోవడానికి కొంత పవిత్రీకరణ తప్పనిసరి. మరింత సంపూర్ణమైన పవి త్రీకరణ మరీ మంచిది. ఆత్మసిద్ధులు రావడం ప్రారంభమైనప్పుడు అవి పెద్ద కష్టం లేకుండా కొనసాగుతాయి. ఎటువంటి పతనం, వైఫల్యం ఉండవు. పవిత్రీకరణ తొలి అవసరమే. అంతర్గత అనుభవం ప్రారంభం కావడానికి ముందు కొన్నింటిని పరిత్యజించవలసి వుంటుంది. కాని ముఖ్యమైన అవసరం ఏమిటంటే చైతన్యాన్ని సన్నద్ధం చేయాలి. అప్పుడు ఉన్నతశక్తి మరింత స్వేచ్ఛగా ప్రతిస్పందించడం జరుగుతుంది.

ఈ సన్నద్ధం చేసే కార్యక్రమంలో చాలా ఉద్వేగాలు అవసరం అవుతాయి. అవి కవిత, సంగీతం. ఇవి సహాయపడతాయి. దానికి శ్రవణం, మననంగా పనిచేస్తాయి.

ప్రజ్వరిల్లిన భావలహరి తీవ్రతరంగా ఉన్నప్పటికీ అది సహజమైన 'నిది ధ్యాసన' మవుతుంది.

చైత్యపురుష సంసిద్ధత, మానస, ప్రాణిక అహానికి చెందిన మొరటు రూపాలు తొలగించడం, మనోహృదయాలను గురువుకు సమర్పించడం, ఇంకా చాలా విషయాలు ఎంతగానో సహాయపడతాయి. ద్వంద్వాల నుండి, అహం నుండి పూర్తి స్వేచ్ఛ పొందడం, పరిపూర్ణత్వం అనివార్యమైన ప్రాథమిక సూత్రం కాదు. ఆధ్యాత్మిక ప్రతిస్పందనలు, స్వీకారం సంభవం చేసే సన్నద్ధత, అంతస్సత్తా దృఢత్వం అది.

*

నిమ్నప్రకృతి గూర్చి, దాని ప్రతిబంధనాలు గూర్చి పదే పదే ఆలోచించడం పొరపాటు. ఇది సాధనలో నిష్క్రియాత్మక కోణం — వాటిని గమనించి పవిత్రం చేయాలి. అవి చాలా ముఖ్యమైనవని వాటిని గూర్చి ఆలోచించడం సహాయకారి కాదు. అధిరోహణ అనుభవంలోని క్రియాత్మక పార్శ్వం మరింత ముఖ్యమైనది. క్రియాత్మక అనుభవాన్ని అధిరోహింపచేయకుండా, నిమ్నప్రకృతిని పూర్తిగా పవిత్రం చేయాలని నిరీక్షిస్తుంటే సాధకుడు ఎప్పటికీ నిరీక్షిస్తూనే వుండాలి. నిమ్నప్రకృతిని పవిత్రీకరించిన కొలదీ, ఉన్నత ప్రకృతి అధిరోహణం తేలిక కావడం నిజమే. ఉన్నత ప్రకృతి మరింత అధిరోహించినప్పుడు, నిమ్నప్రకృతి మరింత పవిత్రం అవుతుందనడం మరింత నిజం.

సంపూర్ణ పవిత్రీకరణకాని, శాశ్వత, పరిపూర్ణ అధిరోహణకాని ఒకేసారి సంభవించవు. అందుకు సమయం తప్పనిసరి. అది సహనంతో కూడిన పురోగతి. ఈ రెండూ (పవిత్రీకరణ, అధిరోహణ) ఒకదాని ప్రక్క ఒకటి పురోగమిస్తుంటాయి. ఒకదానితో ఒకటి సమన్వయం కావడానికి మరింత దృఢంగా మారతాయి — అది సాధనలో సాధారణ మార్గం.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

(SABCL 23: 533, 591, 905, 906)

చివరి పేజీ

మన స్వభావం యెలాంటిదంటే, అది సంకల్పాన్ని లోపభూయిష్టం చేయడమేగాక బుద్ధిని కూడ అజ్ఞానావృతం గావిస్తుంది. దాని శక్తి కూడ అల్పమైనది. అయితే దివ్యశక్తి అనే దొకటున్నది. దానిని మనం నమ్మితే అది మనలోని లోపాలతో పాటు మన శక్తులను కూడ దైవోన్ముఖం జేసి, దైవకార్యార్థం వినియోగించునట్లు చేస్తుంది. మనం మన తక్షణ లక్ష్యసాధనలో విఫలమైనట్లయితే అందుకు కారణం దైవసంకల్పమే. చాలాసార్లు మనకు కలిగే వైఫల్యంగాని, దుష్ఫలితంగాని ఓ సత్వరమైన సంపూర్ణ విజయం అందుబాటులోకి తెచ్చే ఫలితాని కన్నా మిన్నయైన ఒక వాస్తవ సత్ఫలితానికి బాట నేర్పరుస్తుంది. మనం బాధపడుతున్నామంటే, అందుకు కారణం మనలోనిదేదో ఒక అపూర్వమైన ఆనంద సంభావ్యతకు సిద్ధపడవలసి వున్నదన్న మాట. మన అడుగులు తడబడుతున్నాయంటే, అది చివరకు చక్కగా నడచుటలోగల రహస్యమేమిటో తెలుసుకొనుట కన్నమాట. ప్రశాంతతను, పవిత్రతను, పరిపూర్ణతను సాధించటానికైనా, తీవ్రమైన తొందరపాటు తగదు. మనకు ప్రశాంతత కావాలి. కాని అది స్వయంకృతాపరాధ ఫలితంగా శక్త్యుత్సాహాలను కోల్పోయి, చచ్చుబడి వికలమైనందున రిక్తమై, పతనావస్థకు పడిపోయిన ప్రశాంతత కాకూడదు. మనకు పవిత్రత కావాలి. కాని అదొక శూన్యమైన, నిస్తేజమైన, కఠినమైన, నిరాశావహ పవిత్రత కాకూడదు. మన నుండి పరిపూర్ణత అపేక్షించబడుతుంది, కాని అది సంకుచిత పరిధులకు పరిమితం చేయబడినదో లేక సర్వదా స్వయంపూరకమగు దైవానుశాసనం అహేతుకంగా నిరోధింపబడినప్పుడు మాత్రమే సమకూరే పరిపూర్ణత కాకూడదు. మన లక్ష్యం దివ్యప్రకృతిలోకి మారడం కావాలి. అయితే ఆ దివ్యప్రకృతి మానసికపరమైనదో లేక నైతికపరమైనదో కారాదు, అదొక ఆధ్యాత్మికపరమైన స్థితి కావాలి. ఆ స్థితిని సాధించుట కష్టం, బౌద్ధికంగా వూహించుట కూడా కష్టమే. మన కార్యనిర్వహణకు, మన యోగానికి అధినాథుడైన దైవానికి చేయవలసినదేమిటో తెలుసు. ఆతనిని తన స్వీయమార్గంలో, స్వీయపద్ధతిలో ఆ పనిని మనలో నిర్వర్తించనీయాలి.

(CWSA 23:246-47; SABCL 20:234)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి జానకి

ప్రాణిక సత్త యొక్క వివిధ భాగాల చైతన్యం

మొదట నీ ప్రాణిక సత్త యొక్క వివిధ భాగాల యెడ చైతన్యం కలిగి ఉండు.

దోషరహితంగా నుండుటకు నువ్వు పని చెయ్యాలంటే మొట్టమొదట నీ యెడల నువ్వు చేతన కలిగి ఉండాలి. నీ ప్రాణిక సత్త యొక్క వివిధ భాగాలు, వాటి విభిన్న కార్యాల గూర్చి తెలుసుకోవాలి. ఈ భాగాల యొక్క భిన్నత్వాన్ని నువ్వు గుర్తించడం నేర్చుకున్నపుడు నిన్ను పని చెయ్యడానికి పురిగొలిపే నీ లోని కదిలికల మూలాన్ని, నీలో జరిగే విభిన్న ప్రేరేపణలని, విభిన్న ప్రతిచర్యలని, విరోధించే సంకల్పాలను క్షుణ్ణంగా తెలుసుకొనగలుగుతావు. శ్రద్ధగా చెయ్యవలసిన ఈ అధ్యయనం చాలా పట్టుదలను, సద్భావనను కోరుకుంటుంది. ఎందుకనగా, మానవుని స్వభావం ముఖ్యంగా అతని మానసిక ప్రకృతి, అతను ఆలోచించే, భావించే, చెప్పే, చేసేటటువంటి ప్రతిదానికి అనుకూలమైన వివరణ ఇచ్చే ఒక సహజ సిద్ధమైన ప్రవృత్తిని కలిగి ఉంటుంది. మనలోని ఈ కదలికలను అత్యంత జాగరూకతతో గమనించి, మన అత్యున్నత ఆదర్శం యొక్క ధర్మాసనము ముందుకు వాటిని ఉన్నవి ఉన్నట్లుగా తేగలిగి, నిష్కళంకమైన సంపూర్ణ సంకల్పంతో దాని నిర్ణయానికి సమర్పించగలిగినప్పుడు మాత్రమే మనలో ఎప్పుడూ పొరపాటు చెయ్యని వివేకము రూపుదిద్దుకుంటుందని ఆశించగలం. మనం నిజంగా ప్రగతి పథంలో పురోగమించి, మనం ఎందుకు సృష్టించబడ్డామో, ఈ భూమిపై మనం నెరవేర్చగల ధర్మమేమిటో అంటే మన అస్తిత్వం యొక్క సత్యాన్ని తెలుసుకునే సామర్థ్యాన్ని పొందినప్పుడు మనం క్రమం తప్పక ఎల్లయెడల మన అస్తిత్వ సత్యాన్ని వ్యతిరేకించే సమస్త విషయాల్ని బహిష్కరించాలి. ఈ విధంగా కొద్ది కొద్దిగా మన సత్తలోని అన్ని భాగాలు, అన్ని తత్వాలు ఒకే విధమైన క్రమంలో మన చైత్య కేంద్రము చుట్టూ పొందికగా అమర్చబడతాయి.

(CWM 12:3-4)

శ్రీమాత

అనువాదం: డా.వి. విజయలక్ష్మి

శ్రీమాత చిహ్నం

ప్రత్యేక సంచిక

అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2014

విషయసూచిక

చిహ్నం అనగానేమి?

ఒక భూమిక పైన మరియొక భూమిక యొక్క వాస్తవాన్ని వ్యక్తము చేయు రూపము చిహ్నమని నాకు అర్థమైంది. మాటకు, పతాకము ఒక దేశము యొక్క చిహ్నము. కాని, సాధారణంగా రూపములన్నీ చిహ్నములే. మన ఈ శరీరములు మన వాస్తవ జీవాత్మకు చిహ్నము. ప్రతి ఒక్క రూపము ఒక ఉన్నత సత్యమునకు చిహ్నమే. చిహ్నములు రకరకాలుగా ఉన్నాయి:

1. వేదఋషులు తమ పరిసరముల నుండి సంగ్రహించిన వస్తుజాలముతో కూర్చిన సంప్రదాయ గుర్తులున్నాయి. గోవు వెలుగునకు ప్రతీకగా నిలుస్తుంది, ఎందుకనగా 'గోవు' అను మాటకు అర్థము, 'కిరణము' 'ఆవు' అని చెప్పబడింది. గోవు ఆ ఋషులకు చాలా విలువైన సంపద — అది వారి జీవితాన్ని పోషించేది, మరి, దొంగిలించబడి దాచివేయబడే ప్రమాదము కూడ కలదు కనుక, ఒకసారి అట్లని గుర్తింపబడినచో, ఆ చిహ్నము కలకాలము సజీవంగా నిలిచి వుంటుంది.

2. దేనినైతే శాశ్వత చిహ్నములని మనము పిలువవచ్చో అవి కావాలని ఎంపిక చేసుకున్నటువంటివి కావు. మరి మనస్సులో సమాలోచన చేసి రూపకల్పన చేయబడి నవీ కావు. సహజంగా అవి మన దైనందిన జీవితం నుండి, అవి మన సాధారణ జీవితమార్గాన్ని ప్రభావితం చేసే పరికరముల నుండి ఉత్పన్నమవుతాయి. మన ప్రాచీను లకు యోగమార్గానికి పర్వతం చిహ్నంగా ఉండేది — స్థాయిపై స్థాయి, శిఖరంపై శిఖరం....


3. కొన్ని చిహ్నములు స్వశక్తిని, అంతర్గత పొందికను కలిగి ఉంటాయి. అటు లనే, ఆకాశము లేక వ్యోమము, అనంతుడైన బ్రహ్మము సర్వత్రా వ్యాపించి ఉన్నాడను విషయాన్ని తెలిపే ప్రతీకగా ఉన్నది. ఏ జాతీయ భావంలోనైనా అది ఒకే సత్యాన్ని తెలియజేస్తుంది. అదే విధంగా సూర్యుడు విశ్వవ్యాప్తంగా అతిమానస వెలుగు లేక ఆధ్యాత్మిక విద్యకు ప్రతీకగా నిలుస్తాడు.

4. ఇక అంకెలు లేక అక్షరములు మానసిక చిహ్నాలుగా ఉంటాయి. ఒకసారి వాటికా గుర్తింపు రూఢి అయినచో అవి కూడా క్రియాశీలమై ఉపయోగపడవచ్చు.

ఆ విధంగానే రేఖాగణిత చిత్రాలు అనేక రీతుల్లో వివరించబడ్డాయి.
(SABCL 23:954)

శ్రీఅరవిందులు
అనువాదం: దామెర వేంకటేశ్వరరావు

శ్రీమాత యొక్క చిహ్నం



కేంద్రంలోని వృత్తం జగజ్జనని మహాలక్ష్మిని సూచిస్తుంది.

దాని చుట్టూ మధ్యభాగంలో ఉన్న నాలుగు దళాలు ఆ జనని నాలుగు శక్తులు. వాని చుట్టూ ఉన్న పన్నెండు దళాలు ఆమె విశేష గుణాలు.

*

ఈ శ్వేతపద్మ చిహ్నం అతీత చైతన్యానికి ప్రతీక. ఇందులోని కేంద్రభాగంలో శ్రీమహాలక్ష్మి విశ్వజనని రూపంలో సంస్థితమై యుంటుంది. ఆ జనని నాలుగు శక్తులు, పన్నెండు విశేషణాలు చుట్టూ ఆవరించి ఉంటాయి.

*

ఈ పద్మం యొక్క కేంద్రకం దివ్యచైతన్యాన్ని సూచిస్తుంది.

దివ్యజనని నాలగు శక్తులే ఆ కేంద్రం చుట్టూ ఉన్న నాలుగు దళాలు.

వాటి చుట్టూ ఉన్న పన్నెండు రేకులు ఆమె క్రియాశీలక విశేషణాలు.


(CWM 2nd ed, 13:64-65)

శ్రీమాత

*

15-3-1934

ప్రధాన విషయం ఏమిటంటే చుట్టూ ఉన్న పన్నెండు దళాలు పన్నెండు స్పందనల ప్రతీకలు. ఇది సాధారణ నియమం. ఇవి ఆమె శక్తుల పరిపూర్ణ వికాసానికి దోహదపడ



శ్రీమాత

తాయి. శ్రీమాత శిరస్సు యొక్క ఊర్ధ్వభాగంలో మనం చూచే ఈ పన్నెండు విశేషణాలు ఆదిత్యుని పన్నెండు కిరణాలు, ('ఏడు' కావు) పన్నెండు గ్రహాలు కూడా!

(CWSA 32:598)

శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

సర్వోన్నత జగజ్జనని, మహాశక్తి

(పరాత్పరుని చేతన, శక్తి)

జగన్మాతకు చతుర్విధ మహాశక్తులున్నాయి. అవి ఆమె దివ్య మహత్వపు మూర్తీభవించిన వ్యక్తిత్వాలు, అంశలు, అభివ్యక్త మూర్తరూపాలు. ఈ శక్తుల ద్వారా ఆమె సమస్త జీవుల్ని అధిష్ఠించి, వర్తిస్తుంటుంది. ప్రపంచాలలో తన సృష్టులను క్రమబద్ధం చేస్తూ సమరస ప్రదీప్తం చేస్తుంటుంది. తన శతసహస్ర శక్తులను నిర్దేశిస్తుంటుంది. జగన్మాత ఒక్కరే, కాని మన ముందుకు భిన్నరూపాలలో సాక్షాత్కరిస్తుంటుంది. ఈ లోకాలలో ఆమె మహత్కార్యాన్ని నిర్వహించే శక్తులు, వ్యక్తిత్వాలు అనేకం. ఆమె కాంతి ప్రసారాలు, విభూతులు అనేకానేకం. ఎవరిని మనం ఆదిమాతగా ఆరాధిస్తున్నామో, ఆమె సమస్త సృష్టిని అధివసించి ఉండే దివ్యచైతన్య మహనీయశక్తి మహత్వం, లోకాతీత దివ్యచిచ్ఛక్తి స్వరూపిణి. ఈ రూపంలో ఆమె ఏకమే కాని ఆమెకు అనేక సముజ్వల పార్శ్వాలు ఉన్నాయి. ఆమె గమనాన్ని అనుసరించడం ఎంతటి వేగవంతమైన మనస్సుకైనా, స్వేచ్ఛాప్రదీప్తమైన ఎంతటి అనంత ప్రజ్ఞకైనా అసంభవం. జగన్మాత పరాత్పరుని చిచ్ఛక్తి. తాను సృజించిన సర్వలోకాలకు అతీతంగా భాసిస్తుంటుంది. పైన ఉన్నా ఆమె అవతారాల ద్వారా ఆమె విధానాలను గ్రహించవచ్చు.

తాను సృజించిన జీవకోటిని ఏ రూపాలందు అభివ్యక్తం కావడానికి ఆమె సమ్మతించునో, ఆ దేవత రూపాల స్వభావం, క్రియల ద్వారా కూడా ఆమె విధానాలను అధికంగా మనం చూడవచ్చును. ఎందుకనగా దేవతల స్వభావం మరింత విస్పష్టం,

మరింత పరిమితం.

జగన్మాత చైతన్యం మూడు విధాలుగా వుంటుంది. మనను, జగత్తును ధరించి ఉన్న చైతన్యశక్తితో స్పర్శను పొంది దానిలో ప్రవేశించినప్పుడు ఆ త్రివిధ చైతన్యం గ్రహించగలము.

విశ్వాతీత ఆద్య మూల పరాశక్తి ఒక రూపం. ఆమె విశ్వానికి అతీతంగా వుండి పరాత్పరుని నిత్య అనభివ్యక్త నిగూఢ రహస్య రేఖతో సృష్టిని అనుసంధిస్తుంది. ఇక రెండవది విశ్వజనీన మహాశక్తి. ఈ రూపంలో ఆమె సమస్త జీవులను సృష్టిస్తుంది, తనలో ధరిస్తుంది, వాటిలో ప్రవేశిస్తుంది. ఈ అసంఖ్యాక ప్రక్రియలను, బలాలను నడుపుతుంది. మూడవది, వైయక్తిక శక్తి (వ్యష్టిరూపం). ఈ రూపంలో ఆమె పై రెండు విశాలతర అస్తిత్వ విధానాలకు ఒక ఆకృతి కల్పించి, రూపధారిగా వాటిని సజీవమూ, మనకు సన్నిహితమూ చేస్తుంది. అలాగే మానవ వ్యక్తిత్వానికి, దివ్య ప్రకృతికి నడుమ మధ్యవర్తిత్వం నెరుపుతుంది.

ఆద్యపరాశక్తి అయిన జగన్మాత సర్వప్రపంచాలకు అతీతంగా మెరిసిపోతుం టుంది. ఆమె తనలో పరాత్పరుడ్ని ధరించి ఉంటుంది. ఆమె ఒక్కతే నిరపేక్ష మహాశక్తికి, అనిర్వచనీయ సాన్నిధ్యానికి ఆశ్రయం ఇస్తుంది. అభివ్యక్తం చేయవలసిన మూలసత్యాలను ధరించి, లేక క్రిందికి పిలిచి, ఆ సత్యాలు నిక్షిప్తమై ఉన్న నిగూఢ రహస్య సీమల్లో నుండి వాటిని తన అనంత చేతన కాంతిలోకి కొనివచ్చి ఆమె తన సర్వశక్తి చేతస్సులో, నిస్సీమ ప్రాణంలో వాటికి ఒక శక్తి రూపం ఇస్తుంది, విశ్వంలో ఒక శరీరం ప్రసాదిస్తుంది. పరాత్పరుడు ఆమెలో శాశ్వత సచ్చిదానంద రూపాన అభివ్యక్తమై ప్రజ్వరిల్లుతుంటాడు.

ఈ పరమ పురుషుడు ఆమె ద్వారా లోకాలలో శివశక్తి రూపంలో ఏకమూ, ద్వి విధము అయిన చేతన గానీ, పురుష ప్రకృతి రూపాన ద్వివిధమైన తత్త్వంగా అభి వ్యక్తమవుతాడు. అతడు దివ్యలోకాలలో, దివ్యభూమికలలో పరమ దేవతలతో వారి శక్తులతో ఆమె సమకూర్చిన శరీరాలలో వుంటాడు. చివరకు అతడు జ్ఞేయ లోకాలలో తదితర అజ్ఞేయలోకాలలో సర్వం తానై ఆమె వల్ల ఆకృతి దాల్చి వుంటాడు. ఇలా సర్వమూ పరమ పురుషునితో ఆమె జరిపే లీల మాత్రమే. సర్వమూ బహ్మములోని నిగూఢ రహస్యాలను ఆమె సాధించే అభివ్యక్తియే, అనంతం అద్భుతాలకు ఆమె సమకూర్చే అభివ్యక్తియే. సర్వమూ ఇలా ఆమెయే. ఏలనగా, సర్వమూ దివ్యచిచ్ఛక్తి

అవిభాజ్య అంశమే. (సత్యాన్ని అనుసరించి) ఆమె నిర్ణయించింది, పరమేశ్వరుడు అనుమతించింది తప్ప ఇక్కడ గానీ మరెక్కడైనా ఏదీ ఉండజాలదు. ఆమె పరమేశ్వరుని చేత ప్రజ్వలితమై, దేన్ని దర్శిస్తుందో, దర్శించి తన సృజనశీల ఆనందంలో బీజరూపాన దేన్ని నిక్షేపిస్తుందో, అది తప్ప మరేదీ రూపం దాల్చదు.

జగన్మాత చైతన్యంలో రెండవ అంశ విశ్వజనీన శక్తి, విశ్వమాతృరూపిణి. ఆ పరాశక్తి చేతనతో ఆ పరాశక్తి నిర్మించిన జగాలలోనికి పరమ పురుషుడి నుండి ఏది ప్రసారమవుతుందో దాన్ని మహాశక్తి నిర్వర్తిస్తుంది. జగన్మాత సన్నిధి సర్వలోకాలకు దివ్యమహత్వంతోనూ, సర్వపోషకమైన దివ్యశక్తి, దివ్య మహితానందాలతోనూ నింపివేస్తుంది. అలా చేయకపోతే ఆ లోకాలు జీవించలేవు. దేనిని మనం ప్రకృతి అని పిలుస్తున్నామో, అది విశ్వ మహాశక్తి అత్యంత బాహ్య కార్యనిర్వాహక రూపం మాత్రమే. ఈ మహాశక్తి ఇట్టి ప్రకృతికి గల బలాలు, ప్రక్రియల సామరస్యాన్ని తీర్చిదిద్దుతుంది, ప్రకృతి వ్యాపారాలను ప్రేరేపిస్తుంది. వాటి మధ్య సంచరిస్తుంది. దేనిని చూడగలమో, దేని అనుబంధాన్ని పొందగలమో లేక దేన్ని సజీవం చేయగలమో, అట్టి సర్వంలోనూ, నిగూఢంగాను, వ్యక్తంగానూ ఉండి సంచరిస్తుంది. లోకాల ఒక్కొక్క మండలానికి అనగా ఒక్కొక్క విశ్వానికి ఒక్కొక్క మహాశక్తి ఉంటుంది. ఒక వ్యవస్థలోని ప్రతి లోకమూ దాని మహాశక్తి ఖేలనమే కాని మరేమీ కాదు.

ఈ మహాశక్తి ఆ విశ్వ మండలంలో విశ్వాతీత జనని, విశ్వ అంతరాత్మగానో, విశ్వ వ్యక్తిత్వంగానూ ఉంటుంది. జగన్మాత తన అంతర్దర్శనంలో దేనిని వీక్షిస్తుందో, తన శక్తిసౌందర్యాల కుహరంలోకి దేనిని సమీకరిస్తుందో, తన ఆనందంలో దేనిని సృజించిందో, ఆ ప్రతి లోకమూ ఒక అద్భుతమే.

కాని జగజ్జనని దివ్యశక్తి సృష్టిలో అనేక భూమికలు, అనేక సోపాన పంక్తులున్నాయి. సంపూర్ణ అభివ్యక్తిలో మన మొక భాగం మాత్రమే. ఈ అభివ్యక్తి శిఖరంలో అనంత అస్తిత్వ ప్రపంచాలు, చైతన్యం, శక్తి ఆనందాలతో పరవశించే లోకాలు ఉన్నాయి. వాటికి అతీతంగా జగజ్జనని అనాచ్ఛాదిత శాశ్వత శక్తిగా భాసిస్తుంటుంది. ఈ లోకాలలో సర్వ జీవులు ఒక అవర్ణనీయ పరిపూర్ణత్వంలో, ఒక అపరివర్తనీయ ఏకత్వంలో జీవిస్తుంటాయి. కారణం ఆమె వారిని సదా తన ఒడిలో క్షేమంగా రక్షిస్తుంది. ఈ లోకాల కంటె మనకు సమీపంలో పరిపూర్ణ అతిమానస సృష్టి నిండిన లోకాలు వున్నాయి. వీటిలో ఆది జనని అతిమానస మహాశక్తిగా ఉంటుంది. ఈ మహాశక్తి దివ్య

మైన సర్వజ్ఞ సంకల్పం, సర్వశక్తి జ్ఞానాలతో కూడిన దివ్య ప్రభావ మహత్తు.

ఈ సంకల్ప జ్ఞానాలు ఈ మహాశక్తి అద్భుత కార్యాలందు సర్వదా ప్రత్యక్షం గానూ, ప్రతి ప్రక్రియలో సహచ పరిపూర్ణంగానూ విరాజిల్లుతాయి. ఇట్టి లోకాలలో సర్వగతులు సత్యం వేసే అడుగులే. సర్వజీవులూ దివ్యకాంతిమయ ఆత్మలు, శక్తులు, శరీరాలే. సర్వ అనుభవాలు ప్రగాఢ, నిరపేక్ష ఆనంద సాగరాలు, వెల్లువలు, తరంగాలే, కాని ఇక్కడ మనం నివసించే భౌతిక భూమికలో అజ్ఞానమయ లోకాలు ఉన్నాయి. ఇవి తమ చేతనలో మూలం నుండి వేరుచేయబడిన మనోమయ, ప్రాణమయ, పదార్థమయ లోకాలు. ఈ అజ్ఞాన ప్రపంచాలకు పృథివి ఒక అర్థవంతమైన కేంద్రం. అలాగే ఈ పృథివీ పరిణామం ఒక నిర్ధాయక ప్రక్రియ. ఎంతో అంధకారం, సంఘర్షణ, దోషాలతో కూడిన ఈ భూలోకం సైతం తన రహస్య లక్ష్యానికి మహాశక్తి చేతనే నడుపబడుతున్నది.

అజ్ఞానమయమైన మన త్రివిధ లోకాల మహాశక్తిగా జగజ్జనని మధ్యవర్తి లోకంలో భాసిస్తుంటుంది. ఈ భూమిక పైన అతిమానస లోకాల అతిమానసశక్తి, సత్య జీవనం, ఇక్కడకు కొనిరావలసిన సత్యసృష్టి ఉంటాయి. ఈ భూమికకు దిగువన దైహిక, ప్రాణిక, మానసిక చైతన్య స్తరాలతో ఏర్పడిన ఆరోహణాత్మక, అవరోహణాత్మక అనుక్రమణిక ఉంటుంది. ఈ అనుక్రమణిక ద్వివిధ రూపంగల నిచ్చెనవలె క్రిందికి దిగుతూ జడపదార్థంలోని నిశ్చేతనలోకి దిగజారి నిక్షిప్తమై, నిద్రాణమై వుంటుంది. ఇక పైకి తిరిగి అధిరోహిస్తూ ప్రాణం, ఆత్మ, మనస్సుల ప్రఫుల్లనం ద్వారా పరాత్పరుని అనంతత్వంలోకి తిరిగి అడుగిడుతుంది. జగజ్జనని దేనిని వీక్షిస్తుందో, సంవేదిస్తుందో, తన నుండి వెలికి గుమ్మరిస్తుందో, దానిని బట్టి ఈ ప్రపంచంలోనూ, భువన పరిణామం లోనూ వెలయనున్న దానిని నిర్ణయిస్తూ ఆమె దేవతలకు పైన వర్తిస్తుంది. ఆమె శక్తులు, వ్యక్తిత్వాలు కార్యనిర్వహణ కోసం ఆమె నుంచి బహిర్గతమై, ఆమె ఎదురుగా నిలబడి పనిచేస్తాయి. ఇక ఆ శక్తుల అవతార కిరణాలను ఆమె క్రిందనున్న నిమ్నలోకాల లోకి పంపుతుంది. ఈ శక్తులు ఈ లోకాల చాలనంలో కల్పించుకుని, పాలించతగిన వాటిని పాలిస్తాయి, పోరాడి జయించవలసినవాటిని జయిస్తాయి. ఈ ప్రపంచాల యుగచక్రాలను తిప్పుతూ నడుపుతాయి.

చివరికి ఆ లోకాల సమష్టి, వ్యష్టి పథాలను నిర్దేశిస్తాయి. ఈ దివ్య అంశాలు ఆమె అనేక దివ్యరూపాలు, వ్యక్తిత్వాలు. ఈ అంశల యందే ఆమెను భిన్న నామాలతో

మానవులు యుగయుగాలుగా ఆరాధిస్తున్నారు. ఈ అంశల (అవతార కిరణాలు) ద్వారానే కాక, ఆమె తన విభూతుల ద్వారా కూడ మానవలోకానికి సన్నిహితమవు తున్నది. అలా సన్నిహితమయ్యేందుకు తన శక్తులూ, అంశల ద్వారా ఆమె ఎలా ఈశ్వరుని విభూతులకు మనోశరీరాలను కల్పిస్తూ, వాటిని రూపొందిస్తున్నదో, అలాగే తన స్వీయ విభూతులకు కూడ మనోశరీరాలను రూపకల్పన చేసుకుంటుంది. ఈ విభూతుల ద్వారా ఆమె భౌతిక లోకంలోనో, మానవచైతన్యం మారువేషంలోనో తన శక్తి గుణసన్నిధుల ఒక దీప్త కిరణాన్ని అభివ్యక్తం చేయగలుగుతుంది. భువన రూపక దృశ్యాలన్నీ ఆమె చేతనే ఒక పథకం ప్రకారం రూపకల్పన చేయబడి ప్రద ర్శించబడుతున్నాయి. ఈ నాటకంలో విశ్వదేవతలు ఆమెకు సహాయకారులు, ఆమె ఆచ్ఛాదిత నటీమణిగా పనిచేస్తుంది.

జగజ్జనని పైనుంచి మాత్రమే సర్వాన్ని పాలించడం లేదు. ఈ నిమ్న త్రివిధ విశ్వంలోకి ఆమె అవరోహిస్తున్నది కూడ. ఆమె అమూర్త రూపిణి. ఇచ్చట సర్వశక్తులు, అజ్ఞాన కర్మబంధాలు సైతం ఆమెయే. ఆవృతమై ఉండే తన క్షీణశక్తి ఆమెయే, అల్పమైన పదార్థంలో ఆమె సృజన రూపాలే, ఆమె ప్రకృతి నిర్మితమైన శరీరమే, ఆమె ప్రకృతి శక్తియే. అనంతం సంభావ్యతలలో దేనికో సంకల్పించి నెరవేర్చడాన్ని అభివ్యక్తం చేయ పరమాత్మ నిగూఢ ఆదేశంచేత ప్రేరితమై, మహాయజ్ఞానికి (ఆత్మ పరిత్యాగానికి) అంగీకరించి, అజ్ఞాన భూమికకు చెందిన ఆత్మను దాని రూపాలను తన ముసుగుగా ధరించింది. వ్యక్తిగతంగా కూడ ఆమె ఈ త్రివిధ ప్రపంచంలో అవరోహించడానికి వెనుకాడ లేదు. అంధకారాన్ని వెలుగు లోనికి నడపడానికి దానిలోకి దిగివచ్చింది. అనృత భ్రమలను సత్యంలోకి మార్చడానికి వాటిలోకి దిగివచ్చింది. మృత్యువును దివ్య అమృత జీవనంగా మార్చడానికి వచ్చింది. ఈ ప్రపంచ వేద నను, దాని కఠోర శోకసంతాపాలను తన సముదాత్త ఆనంద ప్రవాహంలో అంతరింప చేయడానికి ఆమె ఇటు నడిచి వచ్చింది. తన పిల్లలపై తనకుగల ప్రగాఢ ప్రేమాతిశయం చేత, ఈ చీకటి రూప వేషం ధరించడానికి అంగీకరించింది. అనృత అంధకారాల అసుర శక్తుల దాడులను, చిత్రహింసలకు గురిచేసే శక్తుల ప్రభావాలను భరించడానికి తననుతాను కుంచించుకుని ఒక మెట్టు దిగి వచ్చింది.

మరణానికి మారుపేరైన జనన మార్గాల గుండా నడిచివచ్చింది. సృష్టిలోని బాధలను, దుఃఖాలను, తనపై వేసికొన్నది. కారణం, అలా చేస్తేనే ప్రకాశం, ఆనందం,

సత్యం, నిత్య అమృత జీవనాల స్థాయికి సృష్టి సముద్ధరించబడగలదని భావించింది. ఈ మహోన్నత త్యాగాన్ని పురుషయజ్ఞంగా పిలుస్తుంటారు. కాని ఇంకా లోతుగా పరిశీలిస్తే ఇది ప్రకృతి ఆత్మాహుతి, జగజ్జనని మహా పరిత్యాగం.

(CWSA 32: 14-27)

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

అమ్మ యొక్క చతుర్విధ మహాభివ్యక్తులు

ఈ విశ్వానికి మార్గదర్శనం చేసి నడిపించుటలోను, ఈ జగన్నాటకంలో వ్యవహరించే తీరులోను, అమ్మ యొక్క చతుర్విధ మహాభివ్యక్తులతో పాటు, ఆమె చతుర్విధ శక్తులు, వ్యక్తిత్వాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఒకటి, ఆమె ప్రశాంత వైశాల్యతను, వివేచనాత్మక గ్రహణశక్తిని, అక్షయ కారుణ్యాన్ని, అతిశయ సార్వభౌమత్వాన్ని, సర్వంసహ పాలనా దక్షతను ప్రతిబింబిస్తుంది. మరొకటి, ఆమె అత్యద్భుత శక్తిసామర్థ్యాన్ని, ప్రబల తీవ్రోత్సాహాన్ని, వీరోచిత చిత్తవృత్తిని, అప్రమేయ సంకల్పశక్తిని, ప్రచండవేగాన్ని, జగాన్ని కంపింపచేసే శక్తిని మూర్తీభవిస్తుంది. మూడవది, ఆమె ప్రబలమైన, మధురాతి మధురమైన, అత్యద్భుత సౌందర్య సామరస్యాలతో కూడిన, పొందికైన, తీవ్ర లయబద్ధత కలిగి నానావిధ సూక్ష్మ సంపదలతో కూడిన, మంత్రముగ్ధులను గావించే తీవ్ర ఆకర్షణను, అందచందాలను కలిగి వుంటుంది. నాల్గవది, అన్ని విషయాలను సంపూర్ణమైన సన్నిహిత జ్ఞానంతో, శ్రద్ధాసక్తులతో, లోపరహితంగా కార్యాచరణ గావించి, ప్రశాంతమైన, నిర్దిష్టమైన పరిపూర్ణతను సంతరించుకొని వుంటుంది. వివేకం, శక్తి, సామరస్యత, పరిపక్వత వీటి యొక్క ప్రత్యేక లక్షణాలు. అమ్మ యొక్క అభివ్యక్తులు తమతో పాటు ఈ లక్షణాలను లోకంలోకి కొనివచ్చి, వాటి విభూతులను మానవాకారంలో అభివ్యక్తం గావించి, ఎవరైతే వారి ఊర్ధ్వగమనంలో దివ్యస్థాయికి ఎదిగి వారి లౌకిక స్వభావాన్ని దివ్యమాత సజీవ ప్రత్యక్ష ప్రభావానికి ఉన్మీలనం చేసుకోగలరో, వారిలో ప్రతిష్ఠిస్తాయి. ఈ నాలిగింటిని మనం మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అని పిలుస్తాం.

మహేశ్వరి

మహాసామ్రాజ్యశాలిని అగు మహేశ్వరి ఇచ్ఛకు, ఆలోచించే మనసుకు పైనుండే విశాల సీమలో సుఖాసీనురాలై వుంటుంది; ఆ రెంటిని శుద్ధపరచి ఉన్నత స్థాయికి ఎదుగునట్లు చేస్తుంది లేదా అంతకన్నా మిన్నయైన వైభవాన్ని వాటికి సమకూరునట్లు చేస్తుంది. ఎందుకనగా ఆమె మనలను అధిమానస అనంతత్వాలకు, విశ్వవిశాలతకు, దివ్యతేజోమయ ప్రాభవానికి, అత్యద్భుత జ్ఞానభాండాగారానికి, నిత్యసత్య శక్తుల అప్రమేయ గమనానికి ఉన్మీలనం చేసే మహాశక్తిశాలిని, జ్ఞానవిశారద, పరమశాంతమూర్తి, మహోన్నత, మహాద్భుత నిత్యనిశ్చలమూర్తి. సమస్త జ్ఞానరాశి అయినందున ఏదీ ఆమెను కదల్చలేదు. ఆమె తెలుసుకోవాలనుకున్నది ఏదీ ఆమె నుండి దాయబడదు. సర్వవిషయాలు, సర్వజీవులు, వాటి స్వభావాలు, వాటిని కదిలించేవి, లోకన్యాయం, దాని సమయాలు, గతంలో ఏ విధంగా నుండింది, ప్రస్తుతం ఏ విధంగా నున్నది, భవిష్యత్తులో ఏ విధంగా నుండాలి అన్న విషయాలన్నీ ఆమెకు సుగ్రాహ్యం. దేనినైనా ఎదురొడ్డి అదుపులో నుంచుకోగలదు. అంతులేని ఆమె విస్తార వివేక సంపదకు, అత్యున్నత శక్తికి ఎదురొడ్డి చివరిదాకా నిలవగల సామర్థ్యం ఎవరికీ లేదు. సమతుల్యత, సహనం, స్థిరసంకల్పశక్తితో, మనుషులతో వారి వ్యక్తిగత స్వభావాన్ని బట్టి, ఇతర విషయాలతో, సంఘటనలతో, వాటి బలాబలాల తీవ్రతను, వాస్తవికతను బట్టి వ్యవహరిస్తుంది. ఆమెకు పక్షపాతం లేదు; పరమాత్మ అదేశాలను పాటిస్తుంది. ఆ క్రమంలో కొందరిని ఉన్నతస్థాయికి జేరుస్తుంది, కొందరిని పాతాళానికి దిగజారుస్తుంది, మరి కొందరిని తన నుండి దూరంగా అంధకారంలోకి నెట్టివేస్తుంది. ఆమె వివేకవంతులకు మరింత ఉన్నతమైన, మరింత ప్రకాశవంతమైన వివేకాన్ని అందిస్తుంది; దూరదృష్టి గలవారిని తన సలహామండలిలో చేర్చుకుంటుంది; ప్రతికూలురపై వారి ప్రాతికూల్యత పర్యవసానాన్ని మోపుతుంది; అజ్ఞానులను, మూఢులను వారి అంధత్వస్థాయి కనుగుణంగా నడిపిస్తుంది. ప్రతి మనిషిని, అతని విభిన్న తత్త్వాల ఆకాంక్ష మేరకు, అంటే ప్రతిఫలాల కనుగుణంగా అతనితో వ్యవహరిస్తుంది. అలాంటివారు బాగుపడుటకు అవసరమైన వత్తిడిని పెంచుతుంది లేదా వారి కిష్టమైన అజ్ఞానబద్ధమైన సిరిసంపదలతో ఓలలాడుటకో లేక నాశనమొందుటకో, వారి కర్మకు వారిని వదలివేస్తుంది. ఎందుకనగా ఆమె అన్నింటికీ అతీతమైనది. దేనికీ బంధింపడనిది,

దేనికీ వశపడనిది. అయినప్పటికీ,ఆమెకు ఎవరికీ లేనంతగా జగన్మాతృ హృదయం వుంది. ఆమె కరుణ అపారం, అక్షయం. ఆమె దృష్టిలో అందరూ ఆమె బిడ్డలే. అందరూ ఆ ఏకైక భగవంతునిలో భాగాలే — అసురులు, రాక్షసులు, పిశాచాలు, తిరుగుబాటుదారులు, విరోధులతో సహా. ఆమె తిరస్కారాలు కూడా తాత్కాలిక నిలుపుదలలే. ఆమె విధించే శిక్షలు సైతం కారుణ్యాభరిత ప్రసాదాలే. అయితే, ఆమె కరుణ ఆమె వివేచనాశక్తిని నిర్వీర్యం చేయదు, ఆమె కార్యాచరణను నిర్దేశిత మార్గం నుండి తప్పించదు. ఎందుకనగా విషయాలలోని సత్యసంధత ఒక్కటే ఆమెకు ప్రీతిపాత్రమైనది. జ్ఞానం ఆమె శక్తి యొక్క కేంద్రస్థానం. మన అంతరాత్మను, మన ప్రకృతిని, దివ్యసత్య దిశగా రూపొందించడమే ఆమె ధ్యేయం, ఆమె ప్రయత్నం.

మహాకాళి

మహాకాళి స్వభావం వేరుగా ఉంటుంది. అది విశాలత్వం కాదు, ఔన్నత్యం. ఆమె ప్రత్యేక లక్షణం వివేకం కాదు, శక్తి, బలం. ఆమెలో ఒక మితిమీరిన తీవ్రత, సాధించితీరాలనే తీవ్రతపన, ప్రతి పరిమితిని, అడ్డంకిని పటాపంచలు చేయాలనే దైవికమైన ఉగ్రత వున్నాయి. ఆమె దివ్యత్వం అంతా తీవ్ర ఆవేశాత్మక కర్మాచరణ రూపంలో అత్యంత వైభవోపేతంగా అభివ్యక్తమౌతుంది. కర్మాచరణను వేగవంతం చేయడానికి, శీఘ్రగతిని సాఫల్యతను సమకూర్చే ప్రక్రియను చేపట్టడానికి, వడివడిగా గురి తప్పకుండా పరిష్కార ప్రహారాన్ని ప్రయోగించడానికి. సర్వాన్ని కూడగట్టుకొని ఎదిరించి నిలిచి దాడి చేయడానికి, ఆమె సర్వదా సంసిద్ధమై వుంటుంది. అసురులకు ఆమె వదనం అతి భీకరం; దైవద్వేషుల పట్ల ఆమె వైఖరి భయానకంగాను, నిర్దాక్షిణ్యంగా వుంటుంది. ఆమె వెనుకంజ వేయని విశ్వయోధ. అపరిపూర్ణతను అసలు సహించలేదు. మనిషిలోని అసమ్మతి వైఖరితోను, మూర్ఖపు అజ్ఞానభరిత అస్పష్టతలతోను ఆమె కఠినంగా, కరకుగా వ్యవహరిస్తుంది. మోసం, దగా, అసత్యం, ద్వేషం పట్ల ఆమె తక్షణం ఆగ్రహోదగ్రురాలవుతుంది. దుస్సంకల్పంపై కొరడాను వెంటనే ఝుళిపిస్తుంది. దైవకార్య నిర్వహణలో అజాగ్రతను, బద్ధకాన్ని ఆమె భరించలేదు. అకాల నిద్రావస్థలో మునిగిపోయేవారిని, పనీపాటా లేకుండా వృథాగా తిరిగేవారిని అవసరమైతే నొప్పించేలా గట్టిగా చరిచి జాగరూకులను చేస్తుంది. వేగవంతమైన, సూటిగా నుండే, యథార్థమైన ప్రేరణలు, దాపరికంలేని వాస్తవికమైన కదలికలు,

దీపశిఖలా పైకెగసే ఆకాంక్ష, మహాకాళి గమనాలు. ఆమె శక్త్యోత్సాహం విశృంఖలం. ఆమె దృష్టి, సంకల్పం, గరుడ పక్షి గగనవిహారాన్ని బోలిన ఎత్తులో సుదూర తీరాలకు విస్తరించేవిగా నుంటాయి. ఆమె చరణాలు ఊర్ధ్వమార్గంలో వడివడిగా కదులుతాయి. ఆమె కరాబ్జాలు శిక్షించడానికి, రక్షించడానికి సర్వదా సంసిద్ధమై వుంటాయి. కారణం, ఆమె కూడా ఒక మాతృమూర్తి; ఆమె ప్రేమ కూడా ఆమె ఆగ్రహమంతటి తీవ్రతను కలిగి వుంటుంది. ఆమె దయ అపారము, ఉద్వేగభరితము. ఆమె సంపూర్ణ శక్తితో కలుగజేసుకుంటే, డొల్లబారిన వస్తువులు ఎలాగయితే తృటిలో తునాతునకలు జేయబడతాయో, అదే విధంగా సాధకునికి ఎదురయ్యే అవరోధాలు లేదా ప్రతికూలతలు నిర్వీర్యం చేయబడతాయి. ప్రతికూలురకు ఆమె ఆగ్రహం భయంకరమైనది గాను, బలహీనులకు, పిరికివారికి ఆమె వొత్తిడి బాధాకరమైనదిగా తోస్తే, ఉత్తములు, శకిమంతులు, ఔదార్యవంతులు ఆమెను ప్రీతితో ఆరాధిస్తారు. ఎందుకనగా ఆమె ఆఘాతాలు వారిలోని అవిధేయ విషయాలను శక్తివంతంగాను పరిపూర్ణ సత్యంగాను మారుస్తాయి; పెడసరంగా, వక్రంగా నున్న వాటిని సరళమైనవిగా, సక్రమమైనవిగా చేస్తాయి. కళంకితము లోపభూయిష్టమైనవాటిని బయటకు నెట్టివేస్తాయి. ఆమె అండదండలు కొరవడితే ఒక్క రోజులో పూర్తయ్యే పనికి కొన్ని శతాబ్దాలు పట్టవచ్చు. ఆమె ఉనికి లేనట్లయితే బ్రహ్మానందం విస్తారమమైనదిగానో, గంభీరమైనది గానో లేక మృదుమధురమైనదిగానో, సుందరమైనదిగానో అనిపించవచ్చుగాని, దాని స్వచ్ఛమైన అపారతలో నుండే ఆనందమయ తేజోవికాసాన్ని కోల్పోతుంది. జ్ఞానానికి ఆమె అపారమైన వశీకరణ శక్తిని ప్రసాదిస్తుంది. సౌందర్య సామరస్యతలకు మరింత మహోన్నతంగా ఎదగగల చలనాన్ని జతగూరుస్తుంది. నీరసంగా సాగుతున్న కఠిన శ్రమను మెరుగుపరచి, దాని శక్తిని ద్విగుణీకృతం గావించి, సాఫల్యతా మార్గాన్ని సుగమం చేస్తుంది. మహత్తరమైన పారవశ్య పరాకాష్టకు, మహోన్నతమైన శిఖరాగ్ర స్థాయికి, మహోదాత్తమైన లక్ష్యానికి, సువిశాలమైన భవిష్య మనో దర్శనాలకు ఇసుమంత కొరత ఏర్పడినా ఆమె సంతృప్తి చెందదు. దైవికమైన విజయోత్సాహశక్తి ఆమెదైనందున, సాఫల్యతా సిద్ధి భవిష్యత్తులో ఎప్పుడో కాకుండా వెంటనే లభ్యమవ్వాలంటే, అది ఆమె ఉద్రేకపూరితమైన ఉత్సాహభరిత శీఘ్ర అనుగ్రహ వరప్రసాదలబ్ధి వలననే సాధ్యపడుతుంది.

మహాలక్ష్మి

దివ్యమాత అభివ్యక్తులు కేవలం వివేకము, శక్తి మాత్రమే కావు. ఆమె ప్రకృతిలో అతి సూక్ష్మ మైన రహస్య అంశ కూడా ఒకటి వున్నది. అది లేనట్లయితే వివేకం గాని శక్తిగాని అసంపూర్ణంగా మిగిలిపోతాయి, పరిపూర్ణత పరిపూర్ణం కాదు. వాటికి పైగా శాశ్వత సౌందర్యమనబడే అంతు చిక్కని దైవికమగు సామరస్యతల రహస్యము, ప్రబలమైన సార్వజనీన సమ్మోహనశక్తి, సర్వవస్తు సముదాయాన్ని, సర్వశక్తులను, సర్వజీవులను ఆకర్షించి ఒక్క త్రాటిపై నిలిపి, గోప్యంగా నున్న బ్రహ్మానందం తెర చాటునుండి వాటన్నింటిని తన రూపంలో లయబద్ధ విన్యాసం సలుపటానికి వీలుగా కలిపి ఏకం చేసే శక్తి వున్నది. ఇది మహాలక్ష్మి. దేహధారులైన జీవుల హృదయాలకు ఇంతకు మించిన ఆకర్షణగల దైవికశక్తి వేరొక్కటి లేదు. ఐహిక ప్రవృత్తి అత్యంత అల్పమైనదిగా నుండుట వలన అది మహేశ్వరి దరిదాపులకు చేరడానికిగాని అమెను తనలో ఇముడ్చుకొనుటకుగాని, ఆమె నిశ్చల నీరవత ఔన్నత్యాలు అడ్డుగా నిలుస్తాయి. ఇక మహాకాళి విషయంలో ఐహిక ప్రవృత్తి ఎంత బలహీనమైనదంటే, అది ఆమె తీవ్రతను, ప్రబలమైన గాంభీర్యతను అసలు భరించలేదు. అందువలన అందరూ మహాలక్ష్మి వైపుకి ఆనందంగా, అమితంగా ఆకర్షితులౌతారు. ఆమె అందరినీ మంత్ర ముగ్ధులను గావించేటంతగా మత్తెక్కించే మాధుర్యాన్ని వారిపై విరజిమ్ముతుంది: ఆమె సాన్నిధ్యం అపారమైన ఆనందాన్ని సమకూరుస్తుంది: హృదయంలో ఆమె అనుభూతి ఉనికిని విస్మయానంద పారవశ్యకతకు లోను చేస్తుంది. సూర్యుని నుండి వెలుగులా, అనుగ్రహము, ఆహ్లాదము, ఆర్ద్రిత ఆమె నుండి ప్రవహిస్తాయి; ఎక్కడైతే ఆమె తన అత్యద్భుత చూడ్కులను గాని తన దరహాస చంద్రికల అభినందనలను గాని వర్షింపజేస్తుందో అక్కడ అంతరాత్మ ఆకట్టుకోబడి బందీయై అంతులేని మహదానందపు అగాధాల్లో మునిగిపోతుంది. ఆమె కరస్పర్శ అయస్కాంత ఆకర్షాణాశక్తిని కలిగి వుంటుంది. దాని అతీంద్రియమైన మృదుమధుర ప్రభావం మనోప్రాణ శరీరాలను సున్నితంగా సంస్కరిస్తుంది. ఆమె తన పదకమలాలను ఎక్కడ మోపితే అక్కడ బ్రహ్మానంద పారవశ్యకత అత్యద్భుతంగా కాలువలై పారుతుంది.

అయినప్పటికీ, ఈ మంత్రముగ్ధయగు దివ్యశక్తి తాకిడిని ఎదుర్కొనుట గాని, దాని సాన్నిధ్యంలో నిలుచుట గాని అంత సులభం కాదు. మనసు అంతరాత్మల

యొక్క ఆలోచనలు అనుభూతుల యొక్క, ప్రతి ఒక్క బాహ్య చర్య కదలిక యొక్క, జీవితము పరిసరాల యొక్క సామరస్యత సౌందర్యాలను మహాలక్ష్మి గాఢంగా అపేక్షిస్తుంది. ఎక్కడైతే గుప్తమైన జగదానంద లయబద్ధ గమనాలతో అనుబంధం వుంటుందో, ఎక్కడైతే సర్వతోముఖమగు దివ్యసౌందర్యం, సామరస్యత, ఐక్యతలకు, దైవోన్ముఖంగా ఆనందంగా సాగే అనేక జీవితాల పిలుపుకు ప్రతిస్పందన లభిస్తుందో, అట్టి వాతావరణంలో వసించడానికి ఆమె సమ్మతిస్తుంది. క్షుద్రమైన, అల్పమైన, హీనమైన, స్వల్పమైన, నీచమైన, మలినమైన, క్రూరమైన, నాసిరకమైన పరిసరాలలో ఆమె అడుగిడడానికి అసహ్యపడుతుంది. ఎక్కడైతే ప్రేమ, సౌందర్యం ఉండవో లేక ఉండటానికి విముఖత చూపుతాయో అక్కడ ఆమె అడుగు పెట్టదు. ఎక్కడైతే అవి అల్పమైనవాటితో మిళితమై వికృతంగా మారుతాయో, అక్కడ ఆమె వెంటనే వెనుతిరగటానికి ఉపక్రమిస్తుంది లేదా తన విభూతులను ప్రసాదించదు. స్వార్థం, ద్వేషం, అసూయ, కల్మషం, ఈర్ష్య, తగవులాటలతో నిండిన హృదయాలలో ˈను, వంచన, దురాశ, కృతఘ్నతలతో కలుషితమైన హృదయాలలోను, తీవ్ర మనో కామన, కుసంస్కార వాంఛలతో, భక్తి దిగజారిన హృదయాలలోను వసించుటకు ఆ దివ్యసుందర కరుణామయి దేవత సుముఖత చూపదు. ఒక దైవికమైన ఏవగింపుతో ఆమె తిరోగమిస్తుంది. కారణం, అలాంటి వాతావరణంలో వసించడానికి ఆమె పట్టుపట్టదు, ప్రయత్నం కూడా చేయదు లేదా ఈ చేదు, విషపూరిత దుష్ట పరిణామాలు తిరస్కరించబడి తన ఆహ్లాదభరిత ప్రభావం పునరావృతమయ్యే వరకు వేచి వుంటుంది. వైరాగ్యపు లేమినిగాని, కఠోర నియమానుసరణను గాని, హృదయంలో రేకెత్తే తీవ్ర ఆవేశాలను గాని, అంతరాత్మ యొక్క, జీవితంయొక్క సుందరఘట్టాల నిరోధ నను గాని ఆమె హర్షించదు. ఎందుకనగా ప్రేమ, సౌందర్యాల ద్వారానే ఆమె మనుషులపై దైవిక భారాన్ని మోపుతుంది. ఆమె పరమోత్కృష్ట సృష్టి విలాసంలో, జీవితం ఒక సుసంపన్నమైన అతిలోక సుందర కళాకృతిగా రూపుదిద్దుకుంటుంది. సమస్త సృష్టి ఒక పునీతమైన ఆనంద రసభరిత కవితలా ప్రభవిస్తుంది. విశ్వసంపదలన్నీ ఒక పరమార్థ ప్రయోజనానికై మేళవించబడతాయి. అతి సామాన్యమైన సర్వ సాధారణ వస్తువులు సైతం ఆమె అంతరంగ ఐక్యతా ప్రవృత్తితోను, ఆమె ఆత్మస్ఫూర్తితోను అత్యద్భుతం గావించబడుతాయి. హృదయాంతర్గతమైన వివేకాన్ని అత్యద్భుత పరాకాష్ఠ స్థాయికి కొనిపోయి జ్ఞానాతీతమైన పరమానంద పారవశ్యకత యొక్క

ఆధ్యాత్మిక రహస్యాలను వెల్లడి చేస్తుంది; దైవంపై నుండే తీవ్ర ఆకర్షణను భక్తితో సంధానపరుస్తుంది; శక్తి సామర్థ్యాలకు వాటి కర్మల ప్రభావాన్ని తగు మోతాదులో పొందికగా నుంచగల లయబద్ధతను నేర్పుతుంది; పరిపూర్ణత చిరకాలం మనగలిగేలా ఒక అనిర్వచనీయ శక్తిని దానికి ఆపాదిస్తుంది.

మహాసరస్వతి

మహాసరస్వతి జగన్మాతయొక్క దివ్య కార్యనిర్వాహక మహాశక్తి, ఆమె పరిపూర్ణత, క్రమబద్ధతల స్ఫూర్తి. అమ్మ చతుర్విధ ప్రతిరూపాలలో కల్లా చిన్నది. కార్యనిర్వహణలో ఆమె నైపుణ్యత అమోఘం. భౌతిక ప్రకృతికి అతి సన్నిహితమైనది. మహేశ్వరి విశ్వశక్తుల గమనాలను నిర్ధారిస్తే, మహాకాళి వాటి శక్తి, ప్రేరణలను క్రియోన్ముఖం గావిస్తుంది. మహాలక్ష్మి వాటి లయగతులను పరిమాణాలను కనుగొంటుంది. అయితే మహాసరస్వతి వాటి వ్యవస్థీకృత వివరాల పైన, కర్మాచరణపైన, వివిధ బాగాల పరస్పర సంబంధాలపైన, వివిధ శక్తుల క్రియాశీల సంయోగం పైన, అంచనా తప్పని సిద్ధి సాఫల్యతల పైన నియంత్రణ కలిగి వుంటుంది. శాస్త్రిజ్ఞానం, హస్తకౌశలం, సాంకేతిక నైపుణ్యం ఆమె పరిధి లోనివి. ఆమె అనుయాయులకు ఆవశ్యకమైన, కచ్చితమైన జ్ఞానాన్ని, సూక్ష్మబుద్ధిని, సహనాన్ని, ఒక సమగ్ర నైపుణ్యతగల శ్రామికుడికుండే అంతర్బుద్ధిని, హస్తలాఘవాన్ని, వివేచనా దృష్టిని ప్రసాదిస్తుంది. ఈ దివ్యశక్తి బలీయమైనది, అలుపెరుగనిది, జాగరూకత సమర్ధత గల నిర్మాణ నైపుణ్యత గలది, లోకాలను వర్గీకరించగలది. ప్రపంచాన్ని రూపాంతరం గావించి, నూతన ప్రకృతి నిర్మాణ కార్యక్రమం చేపట్టుటలో ఆమె కార్యాచరణ అత్యంత శ్రమతో కూడుకొన్నదై నిర్దిష్టమైనదిగా నుంటుంది. మన ఓర్పు లేమికి నెమ్మదిగా, విసుగు పుట్టించేదిగా కనిపించినా, అకుంఠిత దీక్షతో, సమగ్రంగా, అకళంకంగా కొనసాగుతుంది. ఎందుకనగా ఆమె కర్మాచరణలోని సంకల్పం, శ్రద్ధ, చురుకుదనం, పట్టుదలతో కూడి వుంటయి. మనపై ఆదరణతో, ప్రతి చిన్న అంశాన్ని గమనించి, సానుభూతితో పరిశీలిస్తూ, ప్రతి ఒక్క దోషాన్ని, వెలితిని, వక్రతను, అసమగ్రతను కనిపెడుతుంది. ఇప్పటి వరకు నెరవేర్చబడిన పనిని, చేయాల్సివున్న మిగతా పనిని కచ్చితంగా పరిశీలించి అంచనా వేస్తుంది. ఎంత చిన్నదైన, అల్పమైన విషయాన్నైనా ఆమె గమనించి తీరుతుంది. ఎంతగా గ్రహించ వీలుకానిదైనా, లేక

మరుగునపడినదైనా, గుప్తమైనదైనా, ఆమె దృష్టిని తప్పించుకోలేదు. ప్రతి వస్తువును దాని నిజ ఆకృతి పొందే వరకూ మలిచి, నిర్దేశిత స్థానంలో నిలిపి, దాని కచ్చితమైన ప్రయోజనాన్ని పొందేవరకు ఆమె శ్రమిస్తుంది; వస్తువులను సేకరించి పొందికగా, నేర్పుగా అమర్చడంలో కావలసిన అన్ని అవసరాలపై దృష్టిని సారిస్తుంది. ఎన్నుకోవలసిందేమిటో, తిరస్కరించవలసిందేమిటో ఆమె అంతర్బుద్ధికి విదితమే. సరైన ఉపకరణాన్ని, సరైన సమయంలో, సరైన పరిస్థితుల్లో, సరైన విధంగా నిర్ధారిస్తుంది. అశ్రద్ధను, నిర్లక్ష్యాన్ని, బద్ధకాన్ని ఆమె అసహ్యించుకుంటుంది. అరకొరగా, తొందరపాటుగా, అస్తవ్యస్తంగా చేసే పనిని, వైకల్యతను, అసంపూర్ణతను, గురితప్పటను, మోసపూరిత అనుసంధానాన్ని, ఉపకరణ సామర్థ్య దురుపయోగాన్ని, పనిచేయకుండా వుండటం లేదా సగంలో వదలివేయటాన్ని ఆమె నిరసిస్తుంది; అవి ఆమె స్వభావానికి విరుద్ధమైనవి.

ఆమె కర్మాచరణ పూర్తి అయినప్పుడు, ఏదీ విస్మరించబడదు, ఏ భాగం కూడా అనుచిత స్థానంలో ఉంచబడదు, వదలివేయబడదు లేదా లోపభూయిష్టంగా ఉంచబడదు. సర్వమూ సంపూర్ణంగా, దృఢంగా, కచ్చితంగా, శ్లాఘనీయంగా నుంటుంది. సమగ్ర పరిపూర్ణతకు రవ్వంత తక్కువైనా ఆమె సంతృప్తి నొందదు. ఆమె సృష్టి యొక్క పరిపూర్ణత కోసం అవసరమైతే అనంతకాలం శ్రమించడానికి ఆమె సిద్ధపడి వుంటుంది. అందువలన అమ్మ శక్తులన్నింటిలోకి మనిషితోను అతని వేనవేల దోషభూయిష్ట కర్మలతోను దీర్ఘకాలిక బాధననుభవించేది ఆమెయే. దయతో, చిరుదరహాసంతో సన్నిహితంగా సహాయపడుతూ, తేలికగా విముఖత నొందకుండా లేక నిరూత్సాహపడకుండా, పదే పదే వైఫల్యం ఎదురైనా పట్టు వదలకుండా, సంకల్పం ఏకాగ్రమైనదిగా, నిష్కపటమైనదిగా, శ్రద్ధతో కూడినదిగా వుండాలనే షరతుపై, మనం వేసే ప్రతి అడుగులోను ఆమె చేయూత నిచ్చి రక్షణ కల్పిస్తుంది. కారణం, ద్వంద్వమనస్సును ఆమె సహించదు. ఆమె వ్యంగ్య ధోరణి, నాటకీయత, ఆత్మవంచన, ఆడంబరాల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుంది. మన కోరికలకు ఆమె తల్లి, మన కష్టాలలో ఆమె స్నేహితురాలు, అవిశ్రాంత, ప్రశాంత హిత బోధకురాలు, సలహాదారు. కాంతులు విరజిమ్మే మందహాసంతో విచారం, దుఃఖం, నిరాశ, నిస్పృహ మేఘాలను చెదరగొడుతూ, సర్వదా సహాయం అందుబాటులో నుంటుందని జ్ఞప్తికి తెస్తూ, నిత్య సత్య సూర్యకాంతి సదా మనపై ప్రసరిస్తుందనే విశ్వాసం కలుగుజేస్తూ,

ఉన్నతమైన సమగ్ర స్వభావ దిశగా మనలను ప్రోత్సహించే తీవ్రమైన అవిచ్ఛిన్న ప్రేరేపణను దృఢంగా, నెమ్మదిగా, తదేక దీక్షతో మనకు కలుగ జేస్తుంటుంది. ఇతర దివ్యశక్తుల కృషి సాఫల్యత సర్వం ఆమెపై ఆధారపడి వుంటుంది. కారణం అందుకు అవసరమగు దృఢమైన మూలాన్ని ఆమె స్థిరపరుస్తుంది, వివరణ అంశాలను విస్తృతపరుస్తుంది, రక్షణ ఆచ్ఛాదనను పటిష్టం గావిస్తుంది.
(CWSA 32:17-26)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

దివ్యమాత యొక్క ఇతర మహావ్యక్తిత్వాలు

వీటి కన్న వేరైన దివ్యమాత మహావ్యక్తిత్వాలు ఉన్నాయి కాని, వాటిని క్రిందికి తీసుకొనిరావటం ఇంకా కష్టం; భూచైతన్య పరిణామంలో అవి అంత ప్రముఖంగా ముందరకు వచ్చి నిలబడలేదు. వాటిలో దివ్యచైతన్య సాక్షాత్కారానికి అనివార్యమైన సాన్నిధ్యాలు ఉన్నాయి. అన్నింటికన్న మిన్నగా ఉండేది, పరమ దివ్యప్రేమ నుంచి ప్రవహించే ఆ అద్భుతమైన శక్తివంతమైన పారవశ్యానికి ఆనందానికి; దివ్యచైతన్య భావానికి చెందిన అత్యున్నత ఔన్నత్యాలకు, పదార్థానికి చెందిన అత్యంత నిమ్న అగాధాలకు మధ్య అంతరాన్ని తానొక్కటి మాత్రమే పూరించగల ఆనందానికి; అద్భుతమైన అత్యంత దివ్యజీవితానికి కీలకమై, ఇప్పుడు కూడా తన నిగూఢతల నుంచి విశ్వంలోని ఇతర శక్తులన్నింటి కార్యాన్నీ బలపరుస్తున్న ఆనందానికీ; చెంది న ఆమె వ్యక్తిత్వానికి సంబంధించినది. కాని పరిమిత అహంకారయుక్త అస్పష్ట మానవ ప్రకృతి ఈ మహాసాన్నిధ్యాలను స్వీకరించటానికి గాని వాటి బ్రహ్మాండమైన కార్యాన్ని బలపరచటానికి కాని అర్హమైనది కాదు. ఈ నాలుగూ పరివర్తన పొందిన మనోజీవశరీరాలలో వాటి సామరస్యాన్ని స్వేచ్ఛను ప్రతిష్ఠించినప్పుడు మాత్రమే ఈ ఇతర అపురూప శక్తులు భూగమనంలో అభివ్యక్తం కాగలవు, దివ్యచైతన్య కర్మ సాధ్యం కాగలదు; ఆమె వ్యక్తిత్వాలన్నీ ఆమెలో కలిసికొని అభివ్యక్తం అయినప్పుడు, వాటి ప్రత్యేక వర్తనం సామరస్య ఏకత్వంగా మారినప్పుడు, ఆమెలో అవి తమ దివ్యచైతన్య దివ్యరూపాల వద్దకు పైకి లేచినప్పుడు, అమ్మ దివ్యచైతన్య మహాశక్తిగా

వెల్లడి అవుతుంది; తన తేజోమయ అతీతత్వాలను, వాటి అనిర్వచనీయ ప్రదేశం నుంచి ప్రవాహంగా క్రిందికి తెస్తుంది. అప్పుడే మానవ ప్రకృతి క్రియాశీల దివ్య ప్రకృతిగా మార్పుచెందుతుంది; ఎందుచేతనంటే, దివ్యచైతన్య సత్య-చేతనకు సత్య-శక్తి కి చెందిన ప్రధాన రేఖలన్నీ ఏకసూత్రమై జీవనవీణను శాశ్వతుని లయలకు అనుగుణంగా అమర్చటం జరుగుతుంది.

నీలో ఉండవలసిన మూడు విషయాలు

ఈ పరివర్తనను నీవు కోరినట్లైతే కుంటిసాకుగాని, ఎదురుతిరగటం గాని లేకుండా నిన్ను నీవు అమ్మ చేతులలో ఆమె శక్తుల చేతులలో ఉంచుకొని ఆమె పని నీలో నిరాటంకంగా జరిగేటట్లు చూడు. నీలో మూడు విషయాలుండాలి; చైతన్యం, మృదుత్వం, దాపరికంలేని సమర్పణ. నీ మనస్సులో అంతరాత్మలో హృదయంలో జీవితంలో శరీరంలోని జీవకణాలలో సైతం చైతన్యం కలిగి ఉండాలి. అమ్మను ఆమె శక్తులను ఆమె వర్తనాన్ని తెలిసి ఉండాలి; కారణం ఆమె నీ అస్పష్టతలోను స్పృహలేని భాగాలలోను క్షణాలలో పనిచేయగలిగేదే అయినా నీవు ఆమెతో జాగృత సజీవ సంబందం కలిగి ఉండటంతో సమానం కాదు. నీ సమస్త ప్రకృతి ఆమె స్పర్శకు మృదువైనది కావాలి — ప్రశ్నించి, శంకించి, తన జ్ఞానానికి మార్పుకు తానే శత్రువు అయిన స్వయం సమృద్ధ అజ్ఞానమనస్సు ప్రశ్నించినట్లుగా ప్రశ్నించటం కాకూడదు; ప్రతి దివ్యప్రభావానికి తన మొండి కోరికలను దుష్టభావాన్ని అడ్డంగా నిలిపే మానవునిలోని ప్రాణిక్స్థితి తన స్వీయగమనాల మీదనే పట్టు పట్టినట్లు పట్టుబట్టడం కాకూడదు; స్వల్పత్వంలోని అంధకారంలోని సుఖానికి అంటిపెట్టుకొని నిర్జీవ నిత్యకృత్యాన్ని జడ అలసత్వాన్ని గాఢనిద్రను భంగపరచే ప్రతిస్పర్శకు గగ్గోలుపెట్టే మానవుని భౌతికచైతన్యం అసమర్థతతో బుద్ధిమాంద్యంతో తమస్సులో పాతుకొని అడ్డగించినట్లు అడ్డగించటం కాకూడదు. దాపరికం లేని నీ అంతర్బాహ్య అస్తిత్వం చేసే సమర్పణ ఈ మృదుత్వాన్ని నీ ప్రకృతిలోని అన్ని భాగాలలోనికి తీసుకుని వస్తుంది; పైనుంచి ప్రవహిస్తూ వచ్చే వివేకానికి, ప్రకాశానికి, శక్తికి, సామరస్య సౌందర్యాలకు, పరిపూర్ణతకు, నీవు తెరచుకొని ఉండడంవల్ల నీలో ప్రతిచోట చైతన్యం మేల్కొంటుంది. చివరకు శరీరం కూడ మేల్కొని ఇక అంతర్గతంగా మాత్రమే ఉండని తన చైతన్యాన్ని దివ్యచైతన్య పరమచైతన్య శక్తితో ఏకం చేస్తుంది, ఆమె



శ్రీమాత

శక్తులన్నీ పైనుంచి క్రిందినుంచి చుట్టుప్రక్కల నుంచి వ్యాపిస్తున్నట్లు అనుభూతి పొందుతుంది; పరమ ప్రేమానందాలకు పరవశించిపోతుంది.

జాగ్రత్తగా నుండు

కాని జాగ్రత్తగా ఉండు. స్వల్పమైన, భూమికి చెందిన, నీ మనస్సుతో, దివ్య మాతను అర్థం చేసుకోవాలని, అంచనా వేయాలని ప్రయత్నించకు; తనకు మించి ఉన్న విషయాలను కూడ తన పద్ధతులకు ప్రమాణాలకు, తన సంకుచిత హేతుకరణాలకు పొరపాటు అభిప్రాయాలకు, అడుగులేని తన దుస్సాహస అజ్ఞానానికి, తన అల్ప ఆత్మవిశ్వాసపూర్వక జ్ఞానానికి లోనుచేయటం అంటే దానికి ప్రేమ. సగం వెలుగు అస్పష్టత అనే చెరసాలలో బందీ అయిన మానవ మనస్సు దివ్యశక్తి అడుగులలోని బహుముఖ స్వేచ్ఛను అనుసరించలేదు. ఆమె దర్శనకర్మల శీఘ్రత సంశ్లిష్టత తడబడుతూపోయే దాని అవగాహనను మించి ఉంటాయి; ఆమె గమన ప్రమాణాలు దాని ప్రమాణాలు కావు. అతి త్వరగా మార్పుచెందే ఆమె అనేక విభిన్న వ్యక్తిత్వాలు, ఆమె లయలను చేయటం, భగ్నం చేయటాలు, ఆమె వేగత్వరణాలు విలంబనాలు, ఒకదాని సమస్యతో ఒక విధంగా మరొకదాని సమస్యతో మరొక విధంగా వ్యవహరించ టాలు, ఇప్పుడు ఈ విధానాన్ని మరొకప్పుడు ఆ విధానాన్ని చేపట్టటం విడిచి పెట్టటాలు, వాటిని దగ్గరగా చేర్చటాలు దానికి విభ్రమం కలిగిస్తాయి. అజ్ఞాన వ్యూహం నుంచి పరమ శక్తి దివ్యతేజస్సు వైపుగా పైకి పరిభ్రమిస్తూ దూసుకొనిపోయే మార్గాన్ని అది గుర్తించదు. ఆమెకు నీ అంతరాత్మనే తెరచి ఉంచు. పురుష స్వభావంతో ఆమెను భావించటంతో తృప్తి పొందు; సత్యానికి సూటి ప్రతిస్పందన గలిగిన పురుష దర్శనాన్నొక్కదానితోనే ఆమెను చూడు. అప్పుడు అమ్మ తానే వాటి పురుషాంశాలవల్ల నీ మనోహృదయ భౌతికచైతన్యాన్ని సందీప్తం చేసి వాటికి కూడా ఆమె విధానాలను స్వభావాన్ని వెల్లడిస్తుంది.

సర్వజ్ఞతను సర్వశక్తులను గురించిన మన అసంస్కృత ఉపరితల భావాల ప్రకారమే దివ్యశక్తి ఎప్పుడూ వర్తించాలని అజ్ఞాన మనస్సు వాంఛించే పొరపాటు జోలికి పోకు. కారణం, మన మనస్సు ప్రతి మలుపునా అద్భుతశక్తి, సులభవిజయం, మిరుమిట్లుగొలిపే ఔజ్జ్వల్యం తన్ను ప్రభావితం చేయాలని గోలచేస్తుంది. అలా లేకపోతే అక్కడ దివ్యత్వం ఉన్నదంటే అది నమ్మదు. అమ్మ అజ్ఞానంతో అజ్ఞాన

క్షేత్రాలలో వ్యవహరిస్తున్నది; అక్కడకు ఆమె అవరోహించింది గాని సొంతం పైన లేదు. తన అజ్ఞానాన్ని శక్తిని పాక్షికంగా మాటుపరుస్తుంది, పాక్షికంగా వెల్లడి చేస్తుంది; తరచుగా తన ఉపకరణాలనుంచి వ్యక్తిత్వాలనుంచి వాటిని వెనుక నిలిపి పట్టి, అనుసరించి, అన్వేషించే మనస్సుగా, ఆకాంక్షించే పురుషునిగా, పోరాటం సరిపే ప్రాణికస్థితిగా, బంధిత బాధాగ్రస్త భౌతిక స్వభావంగా వాటిని పరివర్తన చేస్తుంది. ఒక పరమ ఇచ్ఛ విధించిన షరతులున్నాయి. తటాలున కోసిపారవేయక విప్పవలసిన అనేక చిక్కుముడులున్నాయి. పరిణామగతమైన ఈ భూప్రకృతిని అసురుడు రాక్షసుడు ఆక్రమించి ఉన్నారు. వారిని వారి షరతుల ప్రకారమే, ఎంతో కాలంగా వారి అధీనంలో ఉన్న మాన్యంలో పరిధిలోనే ఎదుర్కొని జయించాలి; మనలోని మానవత్వం దానికి ఎంతో దూరంగా అతీతంగా ఉన్న రూపం వద్దకు హఠాత్తుగా పైకెత్తటానికి వీలులేనంత బలహీనంగా అస్పష్టంగా ఉన్నది. దానిని నడిపించి, దాని పరిమితులను అధిగమించటానికి దానిని సిద్ధం చేయాలి. దైవచైతన్యము శక్తి ఉన్నాయి, ప్రతిక్షణం, శ్రమ పరిస్థితులలో ఏది అవసరమో దానిని చేస్తాయి, సర్వదా ఆదేశితమైన అడుగు వేస్తాయి, అపరిపూర్ణత మధ్యలో, రావలసి ఉన్న పరిపూర్ణతను రూపొందిస్తాయి. కాని దివ్యచైతన్యం దిగివచ్చినప్పుడు మాత్రమే ఆమె దివ్య చేతనాశక్తిగా దివ్యచేతనా ప్రకృతులతో వ్యవహరించగలదు. నీ మనస్సునే నీవు అనుసరిస్తే అమ్మ నీ ఎదురుగా అభివ్యక్తం అయినా గూడా అది గుర్తించలేదు. నీవు వెంబడించవలసింది నీ మనస్సును కాదు, అంతరాత్మను. సత్యానికి బదులిచ్చే నీ అంతరాత్మనేగాని బాహ్యాకృతుల దగ్గరకు దూకే నీ మనస్సును కాదు. దివ్యశక్తిని నమ్ముకో. ఆమె నీలోని దైవసదృశ అంశాలను విముక్తం చేసి అన్నింటినీ దివ్యప్రకృతి ప్రకటనలుగా రూపొందిస్తుంది.

దివ్య చైతన్య పరివర్తన

భూచేతనా పరిణామంలో దివ్యచైతన్య ఆదేశితం, అనివార్యం; కారణం దాని ఊర్ధ్వముఖ ఆరోహణ అంతం కాలేదు, మనస్సే దాని చివరి శిఖరం కాదు. కాని ఆ మార్పు వచ్చి రూపుదాల్చి నిలిచిపోవటానికీ, ప్రకాశం వచ్చినప్పుడు దానిని కాదనకుండా గుర్తించే ఇచ్ఛతో కూడిన, క్రింది నుంచి వస్తున్న పిలుపు కావాలి; పైనుంచి పరమాత్మ అనుమతి కావాలి. అనుమతికి పిలుపుకు నడుమ మధ్యవర్తిత్వం జరిపే శక్తి దివ్యమాతకు చెందిన సాన్నిధ్యము, శక్తి. మూతను పగులగొట్టి, ఆచ్ఛాదనను

చింపివేసి, పాత్రను రూపుదిద్ది, అస్పష్టత అసత్యం మృత్యువు బాధలతో కూడిన ఈ ప్రపంచంలోకి సత్యాన్ని, ప్రకాశాన్ని, దివ్యజీవనాన్ని, అమృతుని ఆనందాన్ని క్రిందికి తీసికొనిరాగలది అమ్మశక్తియే కాని ఏ మానవ ప్రయత్నంగాని తపస్సు కాని కాదు.

శ్రీఅరవిందులు

(శ్రీ తెన్నేటి పూర్ణచంద్రరావు రచించిన 'అమ్మ' పుస్తకం నుండి సేకరింపబడినది)

పన్నెండు విశేష గుణాలు

జనవరి 19, 1972

ఇంతకు మునుపు మనం కలిసినప్పుడు పన్నెండు విశేషగుణాల కోసం వెతుకుతున్నానని నేను చెప్పాను. (శ్రీమాత ఒక కాగితాన్ని బయటకు తీస్తారు). ఇదిగో ఇక్కడ ఉంది, ఎవరో వెతికిపెట్టారు:

చిత్తశుద్ధి	నమ్రత	కృతజ్ఞత	పట్టుదల
ఆకాంక్ష	గ్రహణశక్తి	అభివృద్ధి	ధైర్యం
మంచితనం	ఉదారత	సమత్వం	శాంతి

మొదటి ఎనిమిది దైవం వైపు మన వైఖరికి సంబంధించినవి.

ఆఖరి నాలుగు మనుష్యజాతి వైపు మన వైఖరికి సంబంధించినవి.

శ్రీఅరవిందులు వ్రాసినది కూడా మనకు దొరికింది (పన్నెండు పూరేకులతో కూడిన రంగుల[1] పటం):

కేంద్రం మరియు నాలుగు శక్తులు — తెలుపు.

---

[1] పాఠకులకు కుతూహలం కలిగించే విషయం, శ్రీఅరవిందుల ప్రకారం, ఈ రంగులకు సర్వసాధారణంగా ఈ క్రింద చెప్పబడిన అర్థప్రాధాన్యత ఉంటుంది, అసలైన అర్థం వీటికి అనుగుణంగా మారవచ్చు, అవి — "క్షేత్రం, రంగుల పొంతన, రంగు లక్షణం, దాని గాఢత, క్రీడించే శక్తులను బట్టి": ఎరుపు = భౌతికం; నారింజ రంగు = భౌతికంలో అతిమానసం; పసుపు = ఆలోచించే మనస్సు; ఆకుపచ్చ = జీవితం; నీలం = ఉన్నత మనస్సు; ఊదా = దైవం దయ లేక అనుగ్రహం; బంగారు రంగు = దివ్యమహాసత్యం; తెలుపు = శ్రీమాత కాంతి, లేదా దివ్యచైతన్యం

పన్నెండూ మూడు వర్గాలలో, వివిధ రంగులలో:

మొదటి వర్గం ఎరుపు, నారింజ రంగుకు మారుతూ పసుపు రంగులోకి, తరువాతి వర్గం పసుపు ఆకుపచ్చకు మారిపోతూ, దాని నుంచి నీలంలోకి, మూడవ వర్గం నీలం ఊదారంగుకు మారిపోతూ, దాని నుంచీ ఎరుపులోకి, తెలుపు అంతగా నప్పదనుకుంటే కేంద్రానికి బంగారు రంగు (పొడి) వేయవచ్చు.

(శ్రీఅరవిందులు, మార్చి 20, 1934)

(మదర్స్ ఎజెండా నుంచి)

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

చిత్తశుద్ధి

మొదట గ్రహించవలసిన విషయం తనను తాను మోసగించుకోకూడదు. ఏ వ్యక్తికైనా తాను దైవాన్ని మోసగించలేననేది తెలిసిన విషయం; చాలా తెలివిగల రాక్షసులు సైతం దైవాన్ని మోసగించలేరు. అయినప్పటికి ఒక వ్యక్తికి ఆ విషయం అవగతమైనప్ప టికీ, తన జీవితంలో చాలా తరచుగా, ఒక రోజులోని దినచర్య మొత్తంలో, తటాలున, చాలా మట్టుకు అప్రయత్నంగానే, తనకు తెలియకుండానే తనను తాను మోస గించుకునే ప్రయత్నం చేస్తున్నానని అతనికి కనపడుతుంది. అతడు తాను చేసినదానికీ, తన మాటలకూ, తన చేతలకూ ఎల్లప్పుడూ తనకు అనుకూలమైన వివరాలను సమకూర్చుతాడు. మొదట జరిగేది అది. సహజంగా, మానవులు తగవులాటలలో వచ్చే సమాధానం "అది వాడి తప్పు" అనేదాని గురించి నేను మాట్లాడటం లేదు, నేను దైనందిన జీవితంలోని అత్యల్పమైన విషయాలను గురించి మాట్లాడుతున్నాను.

ఒక పిల్లవాడు తలుపును ఢీ కొట్టడం చూశాను, ఆ పిల్లవాడు వెంటనే తలుపును గట్టిగా ఒక్క తన్ను తన్నాడు! ఇది కూడా అటువంటిదే. ఎల్లప్పుడూ అవతల మనిషి తప్పునే ఎంచటం జరుగుతుంది. అవతల మనిషే తప్పు చేసాడని అనడం జరుగుతుంది. నీవు బాల్యదశను దాటి వుండినప్పుడు కూడా, నీకు ఏ మాత్రం వాదనాపటిమ ఉన్నా, నీవు చాలా మూర్ఖంగా తప్పించుకోజూస్తావు: "అతడు

అది చేయకపోతే, నేను ఇది చేసి ఉండేవాడిని కాదు". కాని యదార్థంలో, అది పూర్తిగా దానికి వ్యతిరేకంగా వుంటుంది.

దీనినే నేను చిత్తశుద్ధితో ఉండటం అంటాను. నీవు ఎవరితోనైనా ఉన్నపుడు, నీవు చిత్తశుద్ధిని కలిగివుంటే గనక, నీ తక్షణ ప్రతిక్రియ సరైనది చేయటమే అయి ఉండాలి, నీతో ఉన్నవారు ఆ విధంగా చేయకపోయినప్పటికీ. సర్వసాధారణమైన ఉదాహరణ, చాలా కోపం వచ్చే మనిషినే తీసుకోండి; అతడిని బాధపెట్టే మాటలకు బదులుగా, నీవేమీ మాట్లాడవు, నీవు నిశ్చలంగా ఉంటావు, నీవు ఆ కోపాన్ని నీకు అంటించుకోవు. ఇది చేయడం తేలికైన పనేనా అని నీలో నీవు చూసుకోవాలి. ఇది చాలా ప్రాథమిక దశ, నీవు చిత్తశుద్ధితో ఉన్నావా లేదా అనేది తెలుసుకోవడానికి ఇది చాలా చిన్న ప్రారంభం. ప్రతిదానితోను తగులుకుంటూ దానిని సంక్రమింప జేసుకునేవారిని గురించి నేను మాట్లాడటం లేదు, మొరటు హాస్యమాడేవారిని లేదా ఇతరులు చేసే మూర్ఖపు పనులను చేసేవారిని గురించి సైతం.

నేను చెప్పేది శ్రద్ధగా ఆలకించండి: మీరు సునిశిత దృష్టితో మీ వైపుకు మీరు దృష్టి సారిస్తే, వందల కొద్దీ కాపట్యాలకు మీలో మీరు అంటిపెట్టుకుని ఉండటాన్ని చూస్తారు. సర్వసాధారణమైన మీ వైఖరిలో మీరు చిత్తశుద్ధితో ఉండటానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, అది ఎంతో కష్టంతో కూడుకున్నదనే విషయం మీకు తెలుస్తుంది.

*

పరిపూర్ణంగా చిత్తశుద్ధితో ఉండాలంటే, అత్యావశ్యకంగా ఉండవలసింది, మీలో ఎటువంటి పక్షపాత వైఖరీ, ఎటువంటి కోరికా, ఎటువంటి ఆకర్షణా, ఎటువంటి అయిష్టతా, ఎటువంటి సానుభూతి లేక అసహ్యమూ, ఎటువంటి బంధమూ, ఎటువంటి వికర్షణా ఉండకూడదు. విషయాల గురించిన అవగాహనలో ఒక వ్యక్తికి అవన్ని వాటి స్థానాలలో పదిలంగా ఉన్నాయనే సంపూర్ణమైన, సమగ్రమైన దృష్టి ఉండాలి. అన్నింటి యెడ సమానవైఖరి కలిగి ఉండాలి: అది సత్యదృష్టిని కలిగి ఉండే తత్వం.

*

చిత్తశుద్ధి అంటే అస్తిత్వ కదలిక లన్నింటినీ ఉన్నతోన్నత చైతన్యస్థాయికి, అప్పటికే తాను అందుకున్న సాక్షాత్కార స్థాయికి పైకెత్తటం.

అసిత్వం మొత్తంలోని అన్ని భాగాలకూ, కదలికలకూ దివ్యేచ్ఛ కేంద్రం చుట్టూ ఏకీకరణలోనూ, సామరస్యతలోనూ నిర్దిష్టతను చిత్తశుద్ధి కలిగిస్తుంది.

ఎప్పుడెప్పుడు చిత్తశుద్ధి ఉంటుందో నీకు సమాధాన మివ్వటానికి సహాయం, మార్గ దర్శనం, అనుగ్రహం అనేవి ఎల్లప్పుడూ అక్కడ ఉంటాయి, నీవు ఎక్కువ కాలం పొరపాటుపడే అవకాశం ఉండదు.

(CWM 5:6; 8:398; 14:65; 3:192)

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

నమ్రత

ఒక విషయం యొక్క ఆవశ్యకత గురించి ఎప్పుడూ చెప్పబడింది, కానీ అది ఎల్లప్పుడూ అపార్థం చేసుకోబడింది. అది నమ్రత యొక్క ఆవశ్యకత. తప్పు మార్గంలో తీసుకోబడి, తప్పుగా అర్థం చేసుకోబడి, తప్పుగా ఉపయోగించబడింది. నువ్వు వీలయితే వినయంగా ఉండాలి, అయితే సక్రమమైన మార్గంలో మాత్రమే అలా ఉండాలి. అన్నింటినీ మించి తప్పుడు మార్గంలో మాత్రం కాదు, ఎందుకంటే అది నిన్ను ఎక్కడికీ చేర్చదు. అయితే ఒక విషయముంది, నువ్వు ఆడంబర ప్రదర్శన అనే కలుపు మొక్కను నీ నుండి బయటకి పెకిలించగలిగతే, అప్పుడు వాస్తవంగా నువ్వు ఎంతో కొంత చేసినట్టవుతుంది. కానీ అది ఎంత కష్టమో తెలిస్తే, నువ్వు ఒక్క విషయం కూడా సక్రమంగా చేయలేవు. నీకు ఒక మంచి ఆలోచన రాదు, ఒక మంచి చలనాన్ని పొందలేవు, లోన స్వాతిశయంతో కూడిన ఒక స్వయం-తృప్తితో (ఇది వున్నదనే ఎరుక కూడా లేకుండా) ఉబ్బిపోకూండా పురోభివృద్ధిని కొంచెం కూడా సాధించలేవు. అప్పుడు ఆ స్వాతిశయాన్ని గట్టిగా కొట్టి పగులకొట్టడానికి బద్ధుడవై వుండాలి. అయినప్పటికీ విరిగిన ముక్కలు ఇంకా మిగిలివుండి తిరిగి మొలకెత్తడం ప్రారంభిస్తాయి. వ్యక్తి తన జీవితం మొత్తం ఇలా శ్రమ పడుతూనే వుండాలి. మళ్ళీ మళ్ళీ నమ్మడానికి వీలు లేనంతగా పైకి లేస్తున్న ఈ కలుపుమొక్కను పూర్తిగా పెకలించి వేయటానికి శ్రమపడటం ఎప్పుడూ మరచిపోకూడదు. నువ్వు అది పోయిందని భావించి ఎంతో వినయంగా "ఇది చేసింది నేను కాదు, ఇది దైవం చేసినట్లుగా భావిస్తున్నాను. దైవం అక్కడ లేకపోతే నేను ఏమీ కాను" అని అంటావు.

అలా ఆలోచించిన మరుక్షణమే, అలా ఆలోచించినందుకు స్వయంతృప్తి చెందుతావు.

ప్రశ్న: వినయంగా ఉండటానికి సక్రమమైన మార్గమేది, క్రమం తప్పిన మార్గమేది?

జవాబు: ఇది చాలా సామాన్యమైన విషయం. 'వినయంగా ఉండు' అని చెప్పబడినపుడు, వెంటనే 'ఇతరుల ముందు వినయంగా ఉండాలి' అని అనుకుంటారు, కానీ అటువంటి నమ్రత యుక్తమైనది కాదు. నిజమైన నమ్రత అంటే దైవం ముందు వినయంగా వుండటం; అనగా, కూడా దైవం లేకుండా తాను ఏమీ కాడు, ఏమీ చేయలేడు, ఏమీ అర్థం చేసుకోలేడు అన్న ఒక స్పష్టమైన, కచ్చితమైన సజీవ చైతన్యంతో వుండటం. ఒక వేళ వ్యక్తి అసాధారణ మేధతో అన్ని విధాల అర్హుడైనప్పటికీ, దివ్యచైతన్యంతో పోల్చినపుడు అది నిరర్థకమే. ఎప్పటికీ ఈ జ్ఞానంతో వుండాలి. ఎందుకంటే అప్పుడు మాత్రమే వ్యక్తి ఎల్లప్పుడు నిజమైన గ్రహణ సామర్థ్యం గల వైఖరి కలిగి వుంటాడు. అది దైవానికి వ్యతిరేకంగా వ్యక్తిగత డాంబికాలు లేని వినయంతో కూడిన గ్రహణ సామర్థ్యం.

ప్రశ్న: అమ్మా! మనం ఏదైనా ప్రయత్నం చేసినపుడు స్వయంతృప్తితో ఆత్మ స్తుతి చేసుకుంటూ, ఈ కృషితో సంతుష్టి చెందేది మనలో ఏదో వుంది. అది ప్రతి విషయాన్ని చెడగొడుతుంది. దీనిని ఎలా విడపించుకోవాలి?

జవాబు: ఆహా, ఇది ఏమి చేస్తున్నదీ చూసేది ఒకటి వుంటుంది. ఒక వ్యక్తి ఒక పనిని చేస్తున్నపుడు అక్కడ ఎల్లప్పుడూ గమనించే వారొకరుంటారు. కొన్నిమార్లు ఆ వ్యక్తి గర్వంగా వుంటాడు. కచ్చితంగా ఇది చాలామటుకు శ్రమలోని బలాన్ని తీసివేసుకుంటుంది. పని చేస్తున్నప్పుడు, ఇంకా జీవితం గడిపే విధానంలో, వ్యక్తి తనను తాను గమనించుకునే అలవాటును కలిగి వుండాలి. తనను తాను గమనించుకోవటమనేది ఆవశ్యకమేగానీ, పూర్తి నిజాయితీతో, బాహ్యప్రేరణ లేకుండా సహజంగా వ్యవహరించడం ఇంకా ఎక్కువ ఆవశ్యకమని తలుస్తాను. తను చేస్తున్న పనిపట్ల చాలా శ్రద్ధ కనపరచాలి. ఎప్పుడూ తనను తాను గమనించుకుంటూ, తాను చేస్తున్నది చూసుకుంటూ, కొన్ని మార్లు తనను తాను కఠినంగా విమర్శించుకుంటూ వుండకూడదు. వాస్తవానికి ఇలా ఉండటం చాలా వరకు తనను తాను సంతృప్తితో వెన్ను తట్టుకోవడమంత పనికిమాలిన చర్య. ఈ రెండు చర్యలూ గర్హించతగ్గవే. వ్యక్తి తన ఆకాంక్షలో ఎంత నిజాయితీగా వుండాలంటే, అతనికి తాను ఆకాంక్షిస్తున్నట్లుగా కూడా తెలియకూడదు, అతనే ఆకాంక్ష కావాలి.

ఒక్క నిముషం, ఒకే ఒక్క విషయం నువ్వు ఇలా వుండగలిగితే కొన్ని సంవత్సరాల అనుభవాన్ని నీవు సమకూర్చుకోవచ్చు. వ్యక్తి ఎప్పుడైతే తనను తాను ఉన్నతుడనని భావించకుండా వుంటాడో, అహంకార భావంతో చేసే పనిని అదే వైఖరితో చూడటం మానివేస్తాడో, తానే చర్యగా మారుతాడో, అన్నింటికన్నా ఎక్కువగా ఆకాంక్షలో అలా వుండగలిగితే, అది నిజంగా చాలా మంచిది. ఆకాంక్షిస్తున్న వ్యక్తి లేనంతవరకూ, అది ఒక పూర్తి ఏకాగ్రతగల ప్రేరణతో దూకుడుగా సాగే ఆకాంక్ష అయివుంటుందో, అప్పుడు నిజంగా అది చాలా దూరం పోతుంది. లేకపోతే దీనిలో ఎప్పటికీ కొంత స్వాతిశయం, కొంత స్వయంతృప్తి, కొంత ఆత్మన్యూనత వంటి అన్ని రకాల అల్పవిషయాలు ఎదురై మొత్తం నాశనం చేస్తాయి.

(CWM 5:44-45; 6:402)

శ్రీమాత

అనువాదం: సునీత శేఖర్

కృతజ్ఞత

చెదరని భక్తిని సదా అనుసరిస్తుండాల్సిన కదలిక మరొకటి వుంది. అదే దైవం యొక్క ఉనికి పట్ల ఒక విధమైన కృతజ్ఞతాభావం, దైవంయొక్క ఉనికిపై నీలో ఉన్న అత్యంత ఉన్నతమైన ఆనందాన్నిచ్చే అద్భుత కృతజ్ఞతా భావం. మనం చూసే ఈ విశ్వంలో దుష్టత్వం మాత్రమే లేదు. దైవం అనేవాడు కూడా ఉన్నాడన్న భావన మనకి ఆతడిపై కృతజ్ఞతాభావాన్ని కల్గిస్తుంది. ఏ చిన్న సంఘటన ద్వారానో మనకి దైవం యొక్క ఉనికితో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, ఆ ఉన్నత వాస్తవంతో సంపర్కం కల్గినపుడు, మన హృదయం ఓ గాఢమైన, అద్భుతమైన ఆనందంతో నిండుతుంది. అలాంటి కృతజ్ఞతా భావం అన్నింటిని మించిన పరమానందాన్ని రుచి చూపిస్తుంది.

ఆ కృతజ్ఞతా భావన ఇచ్చే ఆనందానికి సరిసమానమైన మరో ఆనందం లేదు. ఒక పక్షి పాట వింటాం, ఓ ముగ్ధంగా ఉన్న పుష్పాన్ని చూస్తాం. ఒక చిన్న పాపను చూస్తాం, ఒక ఉదారమైన చర్యను గమనిస్తాం, ఒక మధురమైన వాక్యాన్ని చదువుతాం, సంధ్యారాగాన్ని తిలకిస్తాం, ఏదైనా కావచ్చు.... అప్పుడు ఒక్కసారిగా నీలో ఉదయించే భావోద్వేగం — అది నిజానికి చాలా లోతైనది, చాలా గాఢమైనది

— ప్రపంచం దైవాన్ని అభివ్యక్తపరుస్తుందని, ఈ ప్రపంచానికి ఆలంబనగా వెన్నంటి నడిపించే దైవం వున్నాడని.

*

చర్చికి కాని, గుడికి కాని నిజమైన ధార్మిక భావనతో, భక్తితో వెళ్ళేది బహుకొద్దిమంది — వారు ప్రార్థించడానికీ, లేదా దైవాన్ని ఏదో అడగడానికీ వెళ్ళరు... వారు వెళ్ళేది దైవానికి తమను తాము సమర్పించుకుందుకు, కృతజ్ఞతలు అందించడానికి, ఆకాంక్షకు, అర్పణకు మాత్రం వెళ్తారు. ఆలాంటివారు కోటి కొక్కరుంటారు.

*

కృతజ్ఞతతో ఉండడం అంటే — మన లోటుపాట్లు, మన అజ్ఞానం, అపార్థం చేసుకోడం, మన అహంకారం, మన నిరసన, ప్రతిఘటనలను పట్టించుకోకుండా, అత్యంత చేరువైన మార్గంలో ప్రతివారిని వారి దివ్యలక్ష్యం వైపు నడిపించే ఆ అద్భుత దివ్య కృపని ఎన్నడూ విస్మరించకపోవటం.

కృతజ్ఞతా భావం యొక్క పవిత్ర జ్వాల మన హృదయంలో నిరంతరం వెచ్చగా, తీయగా, వెలుగులు విరజిమ్ముతూ సర్వ అహంకారాన్ని, అస్పష్టతలని కరగించడానికి నిరంతరం జ్వలిస్తూ వుండాలి. ఆ పరాత్పరుని కృప ఏదైతే సాధకుడిని అతడి గమ్యానికి చేర్చగలదో, ఆ దివ్యకృపపై కృతజ్ఞతా భావం నిరంతరం కొనసాగాలి. ఆ కృపయొక్క కార్యాచరణను గురించి మరింత కృతజ్ఞతా భావంతో ధన్యవాదాలు తెలుపుతూపోతే, అతడికి గమ్యం చేరువ అవుతుంది.

*

అన్ని కదలికలలోకి ఏ కల్తీ లేని, అహంకారం సోకని, అకళంకమైన మహదానందాన్ని సమకూర్చేది బహుశా సహజసిద్ధమైన కృతజ్ఞతా భావన.

అది చాలా ప్రత్యేకమైనది. అది ప్రేమ కాదు. అది ఆత్మసమర్పణ కాదు, అపారమైన మహదానందభరిత భావనతో ఎంతో నిండైనది.

అదొక అత్యంత ప్రత్యేకమైన ప్రకంపన. దానికదే సాటి. అది నిన్ను తృప్తిపరుస్తుంది, ఎంతో అధికాధికమైనది. మానవచేతనకు చేరువైన అన్ని కదలికలలోకి, ఇది నిన్ను నీ అహంకారం నించి నిస్సందేహంగా బయటపడేసే కదలిక...

దాని పరిశుద్ధ స్థితిలో ఆ ప్రకంపనంలో భాగం కాగలిగితే వెంటనే నీవు దానిని దివ్యప్రేమతో సమానమైన గుణసంపన్నతను కలిగిన ప్రకంపనగా గుర్తిస్తావు: దానికి

దిశానిర్దేశం లేదు. చివరికి దివ్య్రపేమ యొక్క అతి ముఖ్యమైన ప్రకంపనలో ఛాయా మాత్ర రూపం కృతజ్ఞత

(CWM 8:40; 6:194-95; White roses Message of 26-6-1964, The Spiritual Significance of Flowers part 1, p. 122)

శ్రీమాత

అనువాదం: డి. సత్యావాణి

ధృఢమైన పట్టుదల

అత్యంత ముఖ్యమైన సుగుణం విడువని పట్టుదల, ఓరిమి. అది... ఒక రకమైన చక్కని అంతర్గతమైన ప్రసన్నచిత్తవృత్తి. అది నీవు నిరుత్సాహపడకుండా, నీవు విచారపడకుండా కష్టాలన్నింటినీ చిరునవ్వుతో ఎదుర్కొనుటలో సహాయపడుతుంది. దీనిని యింకా బాగా వ్యక్తపరచడానికి ఆంగ్లంలో పద మొకటున్నది. అదే... సంతోషము. దీనిని గనుక నీ అంతరంగంలో నిలుపుకోగలిగితే దాని వెలుగుతో నీ ప్రగతి పథంలో అడ్డుతగిలేందుకు ప్రయత్నించే ఈ దుష్టప్రభావాలను యింకా బాగా ప్రతిఘటించి వాటితో పోరాడగలదు.

*

వ్యక్తి తన స్థిరమైన విశ్వాసాన్ని తనలో తనకు తానుగా కనుగొనాలి. ఏ పరిస్థితిలోనైనా నిలుపుకోవాలి, ఎన్ని కష్టనష్టాలకైనా ఓర్చి తన మార్గంలో తాను చివరిదాకా పయనించాలి. గెలుపన్నది అంతులేని ఓరిమిగలవారికే వుంటుంది. అన్ని రకాల వ్యతిరేకతలున్నప్పటికీ వ్యక్తిలోని నిగ్రహాన్ని, సహనాన్ని నిలబెట్టుకోవడానికి కావలసిన ఆధారమన్నది పటిష్టంగా వుండాలి. ఒక్క ఆలంబనం మాత్రమే సుస్థిరమైనది. అది నిజమైన వాస్తవికత. పరమ సత్యానికి చెందినది. ఇతర ఆధారాల కోసం చూడటం నిరుపయోగం. విఫలం చెందనిది ఇది ఒక్కటే

*

ఓరిమి యొక్క మరో రూపం విశ్వాసపాత్రత. వ్యక్తిలోని ధృఢసంకల్పం యెడల విశ్వాసం కలిగి వుండుట. సంకల్పించినదానిలో విశ్వాసాన్ని కలిగి వుంటటం. వ్యక్తి

ఒక నిర్ణయం తీసుకుంటే అతను తన నిర్ణయానికి విశ్వాసపాత్రుడుగా నుంటాడు. ఇదే ఓరిమి.

*

ఒక వేళ నీవు నిరాశచెందకుండా, నా వల్ల కాదని వదలివేయకుండా, కష్టాలను ఎదుర్కోలేకపోతున్నట్లయితే — ఎందుకంటే అది చాలా కష్టమని, ఎదుర్కొనే సమర్థత లేదనీ — సరే ఎదురుదెబ్బలు తింటూ, ఇంకా ప్రయత్నాలు కొనసాగిస్తుంటే... ఆ కష్టాలను నీలోనే అణచిపెట్టుకొని, నీలోని లోపాలకి ఫలితంగా నీవు దెబ్బలు తిని అట్లాగే వాటిని నీలోనే అణిచిపెట్టి నీరసపడిపోకుండా ముందుకు సాగిపోతున్నా, నీవు చాలా దూరం పోలేవు; తొలి మలుపులో ఎక్కడైతే నీ కలవాటైన జీవితం కను మరుగైపోతుందో నీవు నిరాశచెంది, ఆటనుండి తప్పుకుంటావు.

దీని అత్యంత భౌతికపరమైన రూపం ఈ పట్టుదల. అదే పనిని అవసరమైతే వెయ్యిమార్లు మళ్ళీ మళ్ళీ ప్రారంభించడానికి దృఢనిశ్చయంతో నుంటే తప్ప — నీకు తెలుసా. ఎందరో నిరాశతో నా దగ్గర కొస్తారు: "ఆ పని అయిపోయింది అనుకొన్నాం కానీ అది మళ్ళీ మొదటి కొచ్చింది." అని. దానికి నేనిలా చెబుతాను: "అసలు అదేమి కాదు. బహుశ నీవు మళ్లీ దానిని మొదలుపెట్టాలి. వందసార్లు, రెండువందల సార్లు లేదా వెయ్యిసార్లు; ఒక్క అడుగు ముందుకేసి, హమ్మయ్య ఫర్వాలేదులే అనుకొంటావు. కానీ ఎప్పుడు కూడా అదే కష్టాన్ని పునః ప్రాప్తం చేసేది ఏదో ఒకటి వుంటుంది. సమస్యను పరిష్కరించాను అని అనుకొంటావు, కానీ దానిని మళ్ళీ ఇంకొకమారు పరిష్కరించాల్సి వస్తుంది. కొద్దిపాటి తేడాతో మరోలా తిరిగి తటస్థిస్తుంది. కాని సమస్య మాత్రం అదే". కాని నీవు నిశ్చయంగా అది వేలాదిసార్లు వెనుకకు మరలి వచ్చినా నేను దానిని వేలాదిసార్లు చేసితీరుతాను, సాధించి తీరుతాను అన్న ధృఢనిశ్చయానికి రాకపోతే నీవు యోగాన్ని చేయలేవు. అట్టి ధృఢనిశ్చయం అత్యావశ్యకం. అనవరతమైన గట్టి పట్టుదలతోనే కష్టాలను జయించగలడు మనిషి. వాటి నుండి పారిపోవడం వల్ల కాదు. ఈ రకమైన ధృఢమైన పట్టుదలతో గెలుపు తథ్యం. అత్యంత సహనశీలురకే విజయం ప్రాప్తిస్తుంది. ఎప్పుడూ

ఏ పనినైనా ఎంత ఉత్తమంగా చేయగలవో అంత ఉత్తమంగా చెయ్యి. భఘవంతుడు ఫలితాన్ని చూసుకొంటాడు.

శ్రీమాత

అనువాదం: సి. హెచ్. హర్షవర్ధనరాజు

ఆకాంక్ష

ఆకాంక్ష ఉన్నత విషయములకై అస్తిత్వము యొక్క పిలుపు; దైవము కొరకు ఉన్నత మైన వాటన్నింటి కొరకు అస్తిత్వము యొక్క పిలుపు.

*

ఆకాంక్ష ఒక కోరిక రూపంలో ఉండకూడదు; అంతరంగంలోని అంతరాత్మకు స్పంద నగా నుండాలి; దైవం వైపు మళ్ళడం కోసం, దైవాన్వేషణ కోసం నిశ్చలమైన స్థిర సంకల్పంగా నుండాలి.

*

ఆదర్శ సాధకుడు బైబిల్ వాగ్వైఖరితో ఇలా చెప్పగలగాలి: "ప్రభువు కొరకు నా హృదయపూర్వక ఉత్సుకత నన్ను హరించి వేసింది.". పరమ ప్రభువుకై ఇలాంటి ఉత్సుకత — ఉత్సాహం — దివ్యఫలితాల కొరకు మొత్తం ప్రకృతి యొక్క తీవ్ర తరమైన ఉత్సాహం, వ్యాకులత, దైవం కొరకు హృదయంలో ఆతురత — అది అహాన్ని కబళించి వేస్తుంది. తాను గాఢంగా వాంఛిస్తున్న సంపూర్ణమైన విస్తృత అభిప్రాయ స్వీకరణకు అడ్డుగా నున్న అల్పమైన సంకుచిత పరిమితుల వలయాన్ని ఛేదిస్తుంది; సార్వజనీనమైనందున అధికతర మౌతుంది; అత్యున్నతమైనందున, విస్తృతమైన, శ్రేష్టమైన, వ్యక్తిగత ఆత్మను, ప్రకృతిని అధిగమిస్తుంది.

*

మానవునిలోని ఆధ్యాత్మిక ఆకాంక్ష స్వాభావికము, ఎందుకనగా, జంతువులా కాకుండా అతనికి తన అసంపూర్ణతల, పరిమితుల గురించిన అవగాహన వున్నందున, తాను ఇప్పుడున్న స్థితిని మించినది ఇక మీద పొందవలసినది ఏదో ఉన్నదనే భావన కలిగివున్నందువలన.

ఆ విధమైన పరిణతి చెందిన భావనగల మనస్సు భౌతికపదార్థ పరిణామములో జోక్యం చేసుకోవడం ప్రారంభమయ్యేవరకు — అది సజీవ అస్తిత్వం యొక్క ప్రగాఢ కోరిక లేక సంకల్పం లేక ఉద్దేశం మేరకుగాని, తనను తాను తెలుసుకోవాలనే ఆకాంక్షతోగాని కాకుండా అధోచేతన లేక అంతఃచేతన ద్వారా ప్రకృతి యొక్క స్వయంచాలక కర్మాచరణతో జరగాలి – మనిషి తన స్వంత చేతనకన్నా ఉన్నత స్థాయికి చెందిన చేతన ఒకటి ఉంటుందని, పరిణామాత్మకమైన లైంగిక సంయోగ భావన అతని మనస్సు, జీవితం యొక్క వివిధ పార్శ్వాలలో ఉన్నదని, తనను తాను అధిగమించాలనే ఆకాంక్ష అతనిలో అంతర్లీనంగా వున్నదని గ్రహించగలుగుతాడు.

శ్రీఅరవిందులు

*

మాటలను మించిన, ఆలోచనలను అధిగమించిన ఒక తీవ్రమైన ఆకాంక్ష జ్వాల, స్థిరంగా, జాజ్వల్యమానంగా సదా ప్రజల్వరిల్లుతుండాలి.

*

ప్ర: నిజమైన ఆకాంక్ష అనగా ఏమిటి?

జ: పక్షపాతం, స్వార్థం మిళితంగాని ఆకాంక్ష

*

నీవు చైతన్యపూరితమైన ఆకాంక్షగల స్థితిలో, చిత్తశుద్ధితో ఉన్నట్లయితే నీ ఆకాంక్షకు చేదోడుగా నీ చుట్టూ అన్ని విషయాలు, ప్రత్యక్షంగానో పరోక్షంగానో, సక్రమంగా అమర్చబడతాయి. అది నీవు పురోగమించడానికైనా కావచ్చు, ఏదో ఒక వినూత్న విషయంతో నీవు సంపర్కమొందటానికైనా కావొచ్చు, లేదా నీ ప్రకృతి నుండి తొలగి పోవలసినదానిని తొలగించుటకైనా కావచ్చు. ఇది ఒక అసాధారణమైన విషయం. నీవు నిజంగా ఒక యదార్థమైన తీవ్ర ఆకాంక్షతో ఉన్నట్లయితే, ఆ ఆకాంక్ష సఫలీకృతమయ్యేటందుకు తోడ్పడని పరిస్థితి అంటూ ఉండదు. సర్వం సమకూరుతుంది. ఒక సంపూర్ణమైన సమగ్ర చైతన్యం నీ చుట్టూ సమస్త విషయాలను పొందికగా ఏర్పాటు గావించినట్లుగా, ప్రతి ఒక్క విషయమూ అమరుతుంది.

శ్రీమాత

అనువాదం: కవితా రెడ్డి

గ్రహణశీలత

గ్రహణశీలత అంటే దివ్యశక్తిని స్వీకరించే సామర్థ్యం; దాని ఉనికిని గ్రహించి అందులోని దివ్యమాత సన్నిధిని అనుభూతి చెందడం; మన దృష్టి, ఇచ్ఛ, కార్యాచరణను నడిపించుటలో దివ్యశక్తి పనిచేయుటకు వీలుకల్పించడం.

ఈ ఉన్మీలనంలోని అంతరార్థం, అధికతరమైన దివ్యచైతన్యం మన స్వభావమంతటిని ఏదైతై అసమగ్ర చేతనామయ మర్త్యజీవునాన్ని ముందుగానే అన్ని వైపులా ఆవరించి ఉన్నదో దానిని విస్తృతంగా తెరిచి వుంచి స్వభావమంతటిలో, అన్ని స్థాయిలలో, అన్ని భాగాలలో అపరిమితంగా స్వీకరించడం.

(SABCL 23:695; CWSA 12:169)

శ్రీఅరవిందులు

*

నా ప్రేమ సదా నీ వెన్నంటే ఉంది. దాని అనుభూతి నీవు చెందలేదంటే దానిని అందుకునే శక్తి నీకు లేదన్న మాట. నీ స్వీకరణలోని కొరతను తగ్గించాలి. అందుకై నిన్ను నీవు ఉన్మీలనం గావించాలి. తన్ను తాను ఉన్మీలనం గావించుకోవాలంటే, తనను తాను సమర్పించుకుంటేనే సాధ్యపడుతుంది. ఎంతో కొంత సచేతనంగా శక్తులను దివ్యప్రేమను నీ వైపు రాబట్టుకొనే ప్రయత్నం నీవు కచ్చితంగా చేస్తున్నావు. అయితే ఆ పద్ధతి అంత మంచిది కాదు. ఎలాంటి పథకం వేయకుండా, ఏమీ ఆశించకుండా నిన్ను నీవు సమర్పణ గావించుకో. అప్పుడే స్వీకరించే శక్తి నీకు వస్తుంది.

*

జ్వాలను వెలిగించే పని నీది కాదు. నీకు నేను చెప్పినట్లుగా, నేను దానిని సదా వెలిగిస్తూనే వున్నాను. దానిని స్వీకరించేందుకు కేవలం నీవు ఉన్మీలనం చేసుకోవాలి, దానిని విశ్వసనీయతతో కాపాడుకోవాలి.

*

ప్రశ్న: అమ్మా! గ్రహణశీలతనేది దేనిపై ఆధారపడి ఉంటుంది?

అన్నింటి కంటే ముందు అది అతని నిజాయతీపై ఆధారపడి ఉంటుంది. అతను నిజంగా స్వీకరించాలని ఆశిస్తున్నాడా. ఆ తరువాత నిజాయితీ, నమ్రతలు ప్రధాన అంశాలు అని నేను విశ్వసిస్తాను. స్వాతిశయం కన్నా ఎక్కువగా నిన్ను మూసి

వుంచేది వేరొకటి లేదు. నీవు స్వయంతృప్తి చెందివున్నప్పుడు నీలో ఏదో కొరవడి వున్నదని, నీవు తప్పులు చేస్తున్నావని, నీవు సమగ్రంగా లేవని, ఇంకా అలాంటి లొసుగులు నీలో వున్నాయని ఒప్పుకోనటువంటి స్వాతిశయం నీలో వుంటుంది. నీకు తెలుసా, నీ స్వభావంలో ఈ విధంగా బిగుసుకుపోయి, ఒప్పుకోనివ్వక పోయేది ఒకటుందని, అది స్వీకరించడానికి నీకు అడ్డుగా నిలుస్తుందని. ఏదేమైనా నీవు దానిని తొలగించడానికి ప్రయత్నించి, స్వీకరించే అనుభవం పొందాలి. సంకల్పబలంతో, అస్తిత్వంలోని అణుమాత్ర భాగాన్నైనా ఇలా ఒప్పుకొనేందుకు ప్రయత్నిస్తే "ఆహా! నిజమే నేను తప్పు చేశాను. నేనలా ఉండకూడదు, అలా చేయకూడదు, ఆ విధంగా భావించకూడదు. అవును, అది పొరపాటే," నేను ఇప్పుడు చెప్పినట్లు నిన్ను చాలా బాధిస్తూ, ప్రారంభమౌతుంది; కాని పట్టుబట్టి దానిని నిలుపుకోగలిగితే, వెంటనే తెరుచు కుంటుంది., విచిత్రమైన కాంతి వెల్లువ నీలో ప్రవేశిస్తుంది. ఆ తరువాత నీవు ఎంతో సంతోషపడతావు. ఎంతగా సంతోషపడతావంటే నిన్ను నీవు ప్రశ్నించుకుంటావు, ఇలా: "ఎందుకని ఇంత కాలం మూర్ఖంగా దీన్ని నిరోధించాను".

(CWM 14:148; 17:126; 6:117)

శ్రీమాత

అనువాదం: బాషా

పురోగతి

మానవజీవితానికి ఆవశ్యకమైనదీ, కోరదగినది ప్రగతి సూత్రమే. అంతేకానీ స్తబ్దస్థితి కాదు; అట్లాగని ఎడతెగకుండా కొత్తదనం కోసం పరుగులు తీయటమూ కాదు. అతిశయించే ఆత్మసత్వం దిశగా నిరంతర పయనం సాగించడం; ఆ పయనం వ్యక్తి ఆలోచనల్లోనూ, వ్యక్తిగత జీవితంలోనూ మాత్రమే కాక సంఘపురోగతిలోనూ, సాముదాయక కృషిలోనూ జరగాలి. ఇంకా మార్పుదిశగా, ఆదర్శమూ, సంఘనిర్మాణము, స్వభావము, పరిపూర్ణతల దిశగా ఉద్యమించడంలో నిరంతర పురోగమనంగా ఉండాలి.

*

అంతర్గత పురోగతి జరగాలంటే మొదట చేయవలసింది తన స్వభావంలోని ఏ

భాగంలో తప్పుడు ప్రవృత్తి ఏర్పడినా వెంటనే దాన్ని గుర్తించగలగాలి — అది తప్పుడు ఆలోచనగానీ, తప్పుడు భావన గానీ, తప్పుడు ప్రసంగం కానీ లేదా తప్పుడు చర్య కానీ కావచ్చు — ఏది సత్యానికీ, ఉన్నత చైతన్యానికీ, ఉన్నత వ్యక్తిత్వానికీ, దైవమార్గానికీ భిన్నమై ఉంటుందో అది తప్పు అవుతుంది, దానిని గుర్తించాలి, ఆ గుర్తించినదాన్ని సమర్థించడం గానీ, కప్పిపుచ్చడం గానీ చేయకుండా దైవానికే అర్పించాలి; అంటే దివ్యకాంతి, కరుణలు వాటిపై ప్రసరించి వాటి స్థానంలో సరైన ప్రవృత్తి, దివ్యచైతన్యం ఏర్పడేటట్లుగా దైవానికి అర్పించాలి.
(SABCL 15:164; 23:662)

శ్రీఅరవిందులు

*

సృష్టిలో దైవప్రభావం ప్రసరించిందనడానికి గుర్తు పురోగతి.

*

ప్రాపంచిక జీవితపు ఉద్దేశం పురోగమనం: పురోగమించటం ఆపేశామంటే అది మృత్యువే. పురోగమించకుండా నీవు గడిపే ప్రతి క్షణం మృత్యువుకి దగ్గరగా వేసే ఒక్క అడుగు అవుతుంది.

*

నీవు ఏ నిమిషాన్నైతే తృప్తిపడి ఆకాంక్షించడం ఆపేస్తావో అ క్షణం నించి మరణిం చడం ప్రారంభిస్తావు. జీవితం ఒక గమనం, జీవితం ఒక కృషి, ముందుకు కదలిపోవటం, భవిష్యత్తులోని ఆవిష్కరణల కోసం సాధించబోయేవాటి కోసం అనుసరించే ఆరోహణా పథము. విశ్రాంతి కోరడం కన్నా ప్రమాదకరమైనది వేరేమీ లేదు.

*

నేర్చుకోడానికి ఎప్పుడూ ఏదో ఉంటుంది, అలాగే పురోగమించటానికి కూడా; ప్రతి సందర్భంలోనూ నేర్చుకునే పాఠం ఏదో ఉంటుంది, పురోగమించే అవకాశం ఉంటుంది.

*

ప్రగతి: తనదైన ప్రతిదానినీ, తనకున్న ప్రతిదానినీ ప్రగతి మార్గంలో దూసుకెళ్ళడం కోసం వదలిపెట్టడానికి ప్రతి క్షణం సంసిద్ధంగా ఉండటమే ప్రగతి.

*

ఎల్లప్పుడూ దైవానికి దగ్గరవటమే నిజమైన పురోగతి.
(CWM 15:75,77)

శ్రీమాత
అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

ధైర్యము

ఏ విధంగానూ భయమన్నది లేకపోవడమే ధైర్యము.

*

పృథ్వీపైన దైవకార్యాన్ని నాశనం చెయ్యాలని కోరే దైవ విరుద్ధమైన శక్తుల నుండి నేరుగా సంక్రమించే కొన్ని తీవ్ర కల్మషాలలో భయమనేది ఒకటి. నిజంగా యోగసాధన చెయ్యాలనుకునేవారి మొట్టమొదటి కర్తవ్యం వారి చైతన్యం నుండి భయమనేదాని నీడను కూడా రానివ్వకుండా తమ పూర్తి శక్తిసామర్థ్యాలతో పూర్తి నిజాయితీతో పూర్తి ఓరిమితో దానిని నిర్మూలించాలి. ఈ మార్గంపై నడవాలనుకునేవారు భయమనేదాని వలన తమలో తాము కుంచించుకునేలా చేసే అన్ని స్వల్ప, అల్ప, క్షుద్ర, దౌర్బల్యపూరిత అసహ్యకర విషయాలలో మనసు లగ్నం కానీయకుండా, పట్టుదలతో బెదరకుండా ఉండాలి.

కొండంత సాహసం, సంపూర్ణ త్రికరణశుద్ధి, చిత్తశుద్ధితో గూడిన ఆత్మసమర్పణ, లాభాపేక్ష లేకుండుట, తిరిగి పుచ్చుకోవాలనే ఆలోచన లేక ఇచ్చుట, రక్షింపబడాలనే ఆలోచనలేని నమ్మిక, సాక్ష్యాధారాలు లేకనే ఉండే విశ్వాసమనేవి ఈ మార్గంపై పయనించడానికి అనివార్యమైనవి. ఇవి మాత్రమే నిజంగా మిమ్మల్ని అన్ని ప్రమాదాల నుండి కాపాడతాయి.

*

సమగ్ర ధైర్యం: ఏ స్థితిలోనైనా, ఏ అపాయకర పరిస్థితిలోనైనా, ప్రశాంతంగా, స్థిరంగా ఉండగలిగే దృక్పథం.

*

ఒక కొవ్వొత్తి ఇంకొక కొవ్వొత్తిని వెలిగించగలిగినట్లే, ఎవరయితే ధైర్యం కలిగి

వుంటారో వారు ఇతరులకి ధైర్యాన్ని ఇవ్వగలరు.

*

తమ తప్పుల్ని గుర్తించడమనేది అత్యుత్తమ ధైర్యం.

*

ఒకసారి మనం ధైర్యం ఉత్తమోత్తమ లక్షణాలలో ఒకటనేదాని విషయమై మాట్లాడినట్లు జ్ఞాపకం. కాని ఈ ధైర్యానికి అర్థం మహోన్నత సాహసానికై ప్రీతి, అభిరుచి. సర్వశ్రేష్ఠ సాహసానికైన ఈ అభిరుచి మిమ్మల్ని గుప్పెట్లో బిగించి, దైవాన్ని కనుగొనడం, కలుసుకొనడం, అంతకన్న గొప్పదయిన దైవసిద్ధి అనే కార్యాలకి ఎటువంటి పర్యవసానాలను పరిగణించకుండా, ఎటువంటి బిడియము లేకుండా వెనుకకు తగ్గడమనేది సంభావ్యతను లెక్కించకుండా సాహసించునట్లు చేస్తుంది. వెనుకకు తిరిగి చూడకుండా, ఒక్క క్షణమైనా 'ఏమి జరగబోతోంది' అని అడగకుండా మీరు ఆ సాహసకార్యానికి ఒడిగడతారు. ఏమి జరగబోతున్నది? అని మీరు అడిగితే, ఏదో పోగొట్టుకుంటామేమోనన్న, నిలకడ కోల్పోతామేమోనన్న భయంతో అక్కడే చిక్కుకుపోయి, ఆ స్థలంలోనే పాతుకపోయి ఎప్పటికీ ప్రారంభించలేరు.

*

అభివృద్ధిలో జాప్యం జరగవచ్చు. తరచూ పూర్వపు స్థితి పునరావృతం కావచ్చు. కాని సాహసోపేతమైన సంకల్పం నిలుపుకుంటే ఏదో ఒకనాడు విజయాన్ని సాధించి, కష్టాలన్నీ సత్యపర చైతన్య కాంతి ముందు కరిగి మాయమవడం చూడగలరు.

(CWM 2nd Ed, 10:284; 8:261-62; 14:181,182,; 8:40; 12:7)

శ్రీమాత

అనువాదం: డా. విజయలక్ష్మి

మంచితనము

జనం ఇలా అనుకోవడం నేను చాలా సార్లు విన్నాను. "నేనిప్పుడు మంచిగా ఉండడానికి ప్రయత్నిస్తున్నందున అందరూ నన్ను చెడుగా చూస్తున్నట్టున్నారు." ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని మంచిగా నడచుకుంటూ మంచివాళ్ళమని అనిపించు కోవాలని మంచిగా ఉండకూడదు, అని మీరు తెలుసుకోవాలి. అంతేకాదు ఎదుటి వాళ్ళు మీ పట్ల మంచిగా ఉన్నారు కాబట్టి మీరు వాళ్ళ పట్ల మంచిగా ఉండాలి అని కూడా అనుకోకూడదు. మంచిగా ఉండటానికే మంచిగా ఉండాలి.

నిరంతరం మనం నేర్చుకోవలసిన పాఠం అదే. ఎంత మంచిగా పనిచేయగలరో అంత మంచిగా చేయాలి,చేతనైనంత మంచిగా చేయాలి. ఫలితాన్ని మాత్రం ఆశించకూడదు. ఫలితాన్నాశించి ఎప్పుడూ ఏ పనీ చెయ్యకూడదు. ఒక మంచి పని ఫలితాన్నాశించి చేస్తే, మంచిగా మారడం వల్ల జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుందనుకుంటే, ఆ మంచిపనిలోని విలువలన్నీ దూరమయిపోతాయి.

మంచితనంపై నున్న ప్రేమ వల్ల మంచిగా ఉండాలి. న్యాయంపైని ప్రేమ వల్ల న్యాయంగా వ్యవహరించాలి. నిర్మలత్వంపై ప్రేమ వల్ల నిర్మలంగా ఉండాలి. పక్షపాతం లేకుండా ఉండుటపై ఆసక్తి ఉన్నందువలన పక్షపాత వైఖరి లేకుండా నుండాలి. అలా ఉండగలిగినప్పుడే ఆ మార్గంలో ముందుకు పోగలవు.

*

యోగసాధన చెయ్యాలంటే ఈ చైతన్య పరివర్తన యోగం ఏదైతే అత్యంత కష్టతరమైనదో — మనిషి భువిపైకి వచ్చింది అందుకేనని భావించినప్పుడే, తన ఉనికికి కారణం అదే, అది తప్ప మరేమి చేయకూడదు అనే భావన ఉన్నప్పుడే, ఎంత కష్టపడవలసి వచ్చినా ఎంత బాధ, ఎంత సంఘర్షణకు లోనైనా, అది ముఖ్యం కాదు. "ఇదే నేను కోరుకున్నది, ఇతరమైనదేదీ కాదు" అని అనుకుంటే అది వేరు. అలా కాకపోతే ఈ విధంగా నేనంటాను: "హాయిగా ఉండు, మంచిగా ఉండు, నీ నుంచి ఆశించేది అది మాత్రమే. అంతే చాలు. మంచిగా నుండు అనటంలో అర్థం, అవగాహన గలిగి, ఏ పరిస్థితుల్లో నువ్వు జీవిస్తున్నావో అది అసాధారణమైనవని తెలుసుకోగలిగి సాధారణ జీవితం కంటె ఉన్నతంగా జీవించడానికి, ఇది వరకు కంటే ఉత్తమంగా జీవించడానికి నిజాయితీగా జీవించడానికి ప్రయత్నించు. కొంత

ఈ చైతన్యాన్ని, ఈ కాంతిని, ఈ మంచితనాన్ని వాటికవి ప్రపంచానికి వశదపరుచుకోనియ్యి. అది చాలా బాగుంటుంది".

*

నోటి కందిన మిఠాయి కంటే, ఒక మంచి పని హృదయానికి ఇంకా తియ్యగా ఉంటుంది. ఒక్క మంచి పని కూడా చెయ్యని రోజు, ఆత్మరహితమైన రోజు.

*

ఎవరైనా సరే, మంచి సంకల్పంతో ఉండాలి. హృదయం నిరంతరం ప్రేమతో నిండి ఉండాలి. వాటిని అందరిపైనా సమానంగా ప్రశాంతంగా వర్షింపనీయాలి.

*

అలుపెరుగని ఔదార్యం, నిర్మల దృష్టి, ఇంకా సర్వతోముఖమైన అవగాహన వ్యక్తిపరమైన ప్రతిక్రియల కతీతంగా ఉండడం, భగవంతుని ప్రేమించటానికి, భూమి మీద దైవాన్ని సేవించడానికి ఉత్తమ మార్గాలు.

(CWM 3:264-65; 7:200; 15:225; 14:186-87)

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

ఔదార్యము

ఉదాత్త గుణం, ఔదార్యం, జీవాత్మ యొక్క దివ్యమైన, పవిత్రమైన, అంబర మంత ఉన్నతమైన లక్షణాలు; అవి కొరవడితే, పాతాళగృహంలో ఓ పురుగునో, ఓ అనామకుడినో చూసినట్టుగా వుంటుంది.

'ఆలోచనలు, సూక్తులు' — శ్రీఅరవిందులు

ఉదాత్త గుణం అనగా వ్యక్తిగత లాభనష్టాల బేరీజును తిరస్కరించుట ఔదార్యం అనగా ఇతరులను సంతృప్తిపరుచుటలో తాను సంతృప్తిని పొందుట.

ప్రశ్న: మహాలక్ష్మిని గురించి శ్రీఅరవిందులు అంటారు: "లేమి అన్నది ఆమె రాకను నివారిస్తుంది" అని.

జవాబు: అవును, లేమి, ఔదార్యం కొరవడడం, ఉత్సాహం కొరవడడం, ఔన్నత్యం కొరవడడం, ఆంతరిక ఐశ్వర్యం లేకపోవుట, కాఠిన్యం, నిరాదరణ, ముడుచుకుపోవటం వంటివన్నీ మహాలక్ష్మి రాకను నివారిస్తాయి. అనంతమైన ధనరాశుల్ని కలిగి ఉండటం కాదు, ఇక్కడి ప్రశ్న. అత్యంత ధనవంతుడు కూడా మహాలక్ష్మి దృష్టిలో ఘోరమైన దరిద్రుడు కావచ్చు. ఔదార్యం నిండిన హృదయంగల కడు బీదవాడు ఆమె దృష్టిలో సంపన్నుడు కావచ్చు.

ఏ లక్షణాలుగాని బలం, శక్తి, ఔదార్యంగాని లేనివాడే బికారి. దానికి తోడు అతడు దుఃఖితుడుగా, దురదృష్టవంతుడుగా నుంటాడు. అంతే కాదు, వ్యక్తి ఎప్పుడు అసంతుష్టుడిగా ఉంటాడంటే అతనిలో ఔదార్యం లేనప్పుడు. వారిలో వారు ముడుచుకపోయి, వస్తువులను, విషయాలను తమ వైపు త్రిప్పుకోవాలని అనుకుంటారో, విషయాలను, లోకాన్ని తమ దృష్టితోనే చూడాలని కోరుకుంటారో — వారు సంతోషంగా ఉండలేరు. వ్యక్తి ఎప్పుడైతే నిస్వార్థంగా ఔదార్యంతో తనను తాను సమర్పించుకుంటాడో అతను ఎప్పటికీ సంతోషంగా ఉంటాడు. ఎప్పుడూ దుఃఖంతో ఉండడు. పుచ్చుకోవాలనే కోరికగలవాడే దుఃఖంతో వుంటాడు, తనకు తాను ఇచ్చుకునే వారు సంతోషంతో ఉంటారు.సమర్పించుకొనే వాడు ఎప్పుడు దుఃఖితుడు కాడు.

*

ప్రశ్న: ఔదార్యగుణం సత్యం యొక్క వికృత రూపమా?

జవాబు: అవును, ఈ మనుష్యుల గుణాలన్ని వారి వెనకనున్న సత్యం యొక్క వికృత రూపాలే. నీవు ఏవైతే మంచి లక్షణాలు, దోషాలు, అని అంటావో అవి అన్నీ వెనక నున్న వాటి వికృతరూపాలే. అది ఇదీ కాకుండా వేరేదో కూడ కావచ్చు. ఔదార్యం వెనక నున్న సత్యం గురించి చెప్పాలంటే, అది విస్తరిస్తున్న శక్తుల కదలిక, కాని ఈ శక్తులు ఒక క్రమపద్ధతిలో వ్యాప్తి చెందుటకు ముందుగా అవి ఒక చోట కేంద్రీకరించబడాలి. అందువలన ఒకే విధమైన కదలికలుగల స్పందనల క్రమంలో కేంద్రీకరించబడి వ్యాప్తి చెందుతాయి. మరల మరల కేంద్రీకరించబడటము, వ్యాప్తి చెందుతూ ఉండటము జరుగుతూ ఉంటుంది. కాని శక్తులను కేంద్రీకరించకుండా ఎప్పుడూ వ్యాపింప చేయాలని నీవు కోరుకుంటే కొంతకాలం గడచిన తరువాత వ్యాపింపజేయుటకు అక్కడ శక్తులు ఏమీ మిగలవు. అన్ని రకాలైన శక్తులకు ఇది వర్తిస్తుంది.

*

నేను నైతిక ఔదార్యం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. సంతోషంగా ఉండాలంటే, ఉదాహరణకు నీ తోటివాడు తన లక్ష్యాన్ని సాధించినందువలన సంతోషపడతాడు. స్వార్థం లేని ధైర్యసాహసంతో కూడిన ఒక చర్య, ఒక విలక్షణమైన త్యాగం, తమదైన అందాన్ని కలిగి ఉంటాయి. అవి నీకు ఆనందాన్నిస్తాయి. నైతిక ఔదార్యం ఇతరుల నిజమైన విలువను, శ్రేష్టతను గుర్తించేదిగా నుంటుందని చెప్పవచ్చు.

(CWM 10:282; 4:403-04; 5:356; 4:30)

శ్రీమాత

అనువాదం: త్రివేణి

సమత్వము (సమభావము)

ప్రశాంతమైన చలించని మనోప్రాణికస్థితి 'సమత్వం'. చుట్టూ జరిగే విషయాలు, ఇతరులు మనను అనే మాటలు, చేసే చేతలు మనని బాధపెట్టకుండా, మనం కలతపడకుండా ఉండగలగడం 'సమత్వం'. వ్యక్తిగత భావాల వక్రీకరణ నుంచి విముక్తమైన చూపుతో విషయాలన్నింటినీ సూటిగా చూడగలగడం, వాటి వెనక ఏముందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం; అవి ఎందుకు జరుగుతాయో, వాటినించీ ఏం నేర్చుకోవాలో తెలుసుకోవడం, అవి మనలో ఉన్న 'దేనికి' ప్రతికూలంగా వచ్చాయో తెలుసుకోవడం; వాటి వల్ల మనకి కలిగే అంతరంగ ప్రయోజనం, అభివృద్ధి ఏమిటో తెలుసుకోవడం, కోపం, ప్రతి విషయానికీ తొందరగా కలత చెందే స్వభావం, గర్వం, కోరిక మొదలైన మిగిలిన అన్ని ప్రాణిక గమనాల మీద ఆత్మనియంత్రణ సాధించడం – ఈ విషయాలు మనలోని భావోద్రేక అస్తిత్వాన్ని వాటి గుప్పిట్లో పెట్టుకొని అంతరంగ ప్రశాంతతని భగ్నం చేయ్యడాన్ని, ప్రాణిక గమనాల వేగిర పాటుతో, నిమ్నప్రేరణల ప్రేరేపణతో మాట్లాడడాన్ని, పనిచెయ్యడాన్ని అను మతించకపోవడం, ఎప్పుడూ ప్రశాంతమైన అంతరంగ నిశ్చల మనస్కతతో మాట్లాడటం, పనిచెయ్యడం 'సమత్వం'. సంపూర్ణంగా పరిపూర్ణమైన 'సమత్వాన్ని' సాధించడం అంత తేలికైన పని కాదు. కానీ, మన అంతరంగ స్థితికీ, బాహ్య గమ నాలకి ఇది ఆధారంగా ఉండడం కోసం అధికాధికంగా మనం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి.

మనుషులనీ, వాళ్ళ స్వభావాలనీ, వాళ్ళ పనులనీ, వాళ్ళని నడిపించే శక్తులనీ సమదృష్టితో చూడడం 'సమత్వం'. ఈ సమదృష్టి మన చూపులోని, మన నిర్ణయాలలోని వ్యక్తిగత భావాన్ని, మనసుకుండే పక్షపాతాన్ని తొలగించి వాటి అసలు సత్యాన్ని తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. వ్యక్తిగత భావన మనుషులు చేసే కర్మలనే కాక, చాలాసార్లు వాటి వెనకలేని వాటిని కూడా ఉన్నట్టు వక్రీకరించి చూపిస్తుంది. దీనివల్ల అపార్థాలు, తప్పు నిర్ణయాలు సంభవిస్తాయి. నిజానికి వీటిని రాకుండా చెయ్యవచ్చు. చిన్న విషయాలు ప్రధాన స్థానాన్నాక్రమిస్తాయి. జీవితంలో నేను చూసిన వాటిలో సగానికి పైగా జరిగే దురదృష్టకరమైన సంఘటనలన్నీ ఈ కారణం వల్ల జరిగేవే. సాధారణ జీవితంలో వ్యక్తిగత భావన, సున్నితత్వం ఆత్మరక్షణ

కోసం అవసరమవ్వచ్చు, కానీ అక్కడ కూడా మనుషులనీ, జరిగే విషయాలనీ, ఒక శక్తిమంతమైన విశాలమైన సమదృష్టితో చూడడమే సరైన ఆత్మరక్షణ పద్ధతి అని అనుకుంటాను. వీటిని జయించి, ప్రశాంతమైన ఆత్మశక్తితో జీవించడం సాధకుడి పురోగతిలో ప్రధానాంశం.

'సమత్వం' అంటే మళ్లీ ఒక కొత్త అజ్ఞానం, కొత్త అంధత్వం కాదు; సమత్వం అస్పష్ట దృష్టిని కోరదు, వర్ణ వైవిధ్యాన్ని తుడిచిపెట్టడానికి పూనుకోదు. విషయాలలో తేడా ఉంటుంది. అభివ్యక్తిలో వైవిధ్యం ఉంటుంది. ఈ వైవిధ్యాన్ని ప్రేమ-ద్వేషం, ఆరాధన-తిరస్కారం, సహానుభూతి-విరోధం, ఆకర్షణ-వికర్షణలనే పాక్షికమైన, పొరపాటు భావనలతో నిండిన మసకబారిన చూపుతో చూసినప్పటికంటే, ఈ మసకని తొలగించి చూసినపుడు ఈ వైవిధ్యాన్ని సరిగ్గా గమనించగలం. ఈ వైవిధ్యం వెనక వసిస్తున్న సర్వసంపూర్ణుడు, నిశ్చలుడు అగు భగవంతుని మనం సర్వదా చూడాలి, అనుభూతి పొందాలి, తెలుసుకోగలగాలి. ఆ దివ్యత్వం మన నుండి గోప్యంగా ఉన్నట్లైతే, కనీసం ఆ అభివ్యక్తి ప్రయోజనాన్ని, దాని అవసరాన్ని విశ్వసించాలి. ఆ అభివ్యక్తి మన మానవ ప్రమాణాలకి సామరస్యంగా, పరిపూర్ణంగా కనపడినా, లేక అసత్యంగా, దుష్టత్వంగా కనపడినా సరే, ఆ అభివ్యక్తిని విశ్వసించవలసిందే.
(SABCL 23: 661-62; 20:212)

శ్రీ అరవిందులు

అనువాదం: డా. తెన్నేటి నాగరంజని

శాంతి

వ్యక్తిలో దైవం ఉనికి యొక్క తొలి సంకేతం శాంతి.

*

మీ అస్తిత్వపు లోతులలో, నీ హృదయాంతరాళంలో దైవం ఉనికి సదా తేజోమయంగా, ప్రశాంతంగా, ప్రేమ, జ్ఞానాలతో నిండి ఉంటుంది. మిమ్మల్ని ఆ ఉనికితో మమేకం చేసి ప్రకాశవంతము, జాజ్వల్యనమానమైన చైతన్యంగా పరివర్తన చెందించటానికి అది అక్కడ ఉంటుంది.

నేను, నువ్వూ కలిసి నీ వ్యక్తిత్వపు ఉపరితలంలోని బాహ్యమైన అలజడిని నిశ్శబ్దం చేద్దాం. ఆ నిశ్శబ్దత, ప్రశాంతతలో నువ్వు ఆ ఆంతర్యపు వైభవంతో ఐక్యమవగలుగుతావు.

అప్పుడు ఆ రోజు నీ నూతన జన్మ యొక్క శుభదినం అవుతుంది.

*

ప్రశ్న: అమ్మా! నన్ను మరింత శాంతియుతంగా చెయ్యండి.

సమా: నువ్వు శాంతిని కోల్పోయినట్లు భావించినపుడల్లా పైకి వినిపించకుండా నీలో నీవే పదే పదే మననం చేసుకోవాలి, అదే సమయంలో నన్ను తలచుకుంటూ.

"నా హృదయమా! శాంతి... శాంతి". దీనిన స్థిమితంగా చెయ్యాలి. ఆ ఫలితంతో ప్రసన్నతను పొందుతావు.

*

రోజులో కనీసం రెండుసార్లయినా 'మౌనంగా' ఉండటం సాధన చేయటం చాలా మంచిది. కానీ అది నిజమైన మౌనం కావాలి. కేవలం మాట్లాడకుండా ఉండటం కాదు.

*

శాంతి, నిశ్చలతలు అస్వస్థతకు మంచి ఔషధం. మన శరీర కణాలలోకి శాంతిని కొనితెచ్చుకో గలిగినపుడు మనకి పూర్తిగా నయం అయిపోతుంది.

శాంతి అనేది ఒక నిశ్చల నీరవత; ఇంకా లోతుగా, మరేదో సానుకూలమయిన ప్రశాంత తరంగరహిత దివ్య ఆనందంతో రమారమి సరి సమానమయినది.

*

ఒక దృష్టితో చూసినట్లయితే ఈ జడత, ప్రశాంతత అనేవి తమస్సు, సామముల యొక్క ప్రకాశవంతమూ, తమోమయమయిన పరస్పర ప్రతిరూపాలు మాత్రమే. ఉన్నత ప్రకృతి శాంతిలో విశ్రమిస్తుంది. నిమ్నప్రకృతి శక్తిని సడలించుటలోను, అవచేతన తమస్సుల దిశగా తిరిగి రావటంతో విశ్రమిస్తుంది.

*

ఉన్నత ఆధ్యాత్మిక చేతన యొక్క దివ్యశాంతి, దివ్యశక్తి, దివ్యతేజస్సు, దివ్యానందము అందరిలో ఊర్ధ్వతలంలో ఆచ్ఛాదితమై ఉన్నాయి. అవి దిగిరావటానికి ఊర్ధ్వ ముఖంగా కొంత తెరుచుకోవటం అవసరం. ఈ అవరోహణకు మనసులో నిశ్శబ్దం, అవనతమయ్యే దివ్యప్రభావానికి విశాలము కొంత ఏకాగ్రమైన ఉదాసీనత ఉత్తమ మయిన పరిస్థితులుగా ఉంటాయి.

శ్రీఅరవిందులు

అనువాదం: డా. సరోజా ప్రసాద్



పాండిచ్చేరికి శ్రీమాత ప్రథమ ఆగమనము

మరియు శ్రీమాతారవిందుల ప్రథమ సమాగమము

శతవార్షికోత్సవ ప్రత్యేక సంచిక

శ్రేయోన్ముఖ ఆధ్యాత్మికత

అఖిల

అఖిల భారత పత్రిక — మార్చి 2014

1.5/3/28

పాండిచ్చేరిలో 1914, మార్చి 29 న చోటుచేసుకున్న శ్రీమాతారవిందుల ప్రథమ సమాగమ శతవార్షికోత్సవ ప్రత్యేక సంచిక.

ఈ భువిపైన అతిమానస ఆవిర్భావం సాఫల్యం చెందించే క్రియాశీల ఆధ్యాత్మికత యొక్క నూతన శకారంభానికి ఈ సమావేశం నాంది పలికింది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీమాతారవిందులు పలికిన మాటలను సేకరించి ఈ సంచికలో ప్రచురించడమైనది. పాఠకులు దివ్యజీవనంలోకి ఎదుగుట కోసం క్రియాశీల ఆధ్యాత్మికత స్పర్శానుభూతి పొందగలరని ఆశిస్తున్నాము.

విషయసూచిక

క్రియాశూన్యమైన ఆధ్యాత్మికత
— క్రియాశీలమైన ఆధ్యాత్మికత

శ్రీఅరవిందులు మన కోసం అవతరించి, బోధించింది:

మహాసత్యాన్ని తెలుసుకొనే విధానంలో, భూమిని త్యజించవలసిన ఆవశ్యకత లేదు; ఒక వ్యక్తి తన ఆత్మను తెలుసుకోవటానికి జీవితాన్ని వదలివేయవలసిన అగత్యం లేదు; పరమాత్మతో సంబంధం పెట్టుకునే విధివిధానంలో ప్రపంచాన్ని విసర్జించవలసిన అవసరం లేదు, లేదా తమ విశ్వాసాలకు పరిమితిని విధించుకోవలసిన అవసరమూ లేదు. పరమాత్మ సర్వే సర్వత్రా ఉన్నాడు, ఆయన దాగి ఉన్నాడంటే... దానికి కారణం మనకు ఆయనను కనుగొనాలనే పరితాపం లేకపోవడమే.

మనం కేవలం చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్షతో, బలమైన తాళంతో గట్టిగా మూసి బంధించినటువంటి మనలోని కవాటాలను తెరచి చూడగలిగితే... అక్కడున్న ఆ దివ్యమైనదేదో, అది జీవితం మొత్తం ప్రాధాన్యతనంతా మార్చివేస్తుంది.

*

చరిత్రలో ఒకప్పుడు, మరీ ఎప్పుడో కాక కొంతకాలం క్రితం:

మనిషి ఆధ్యాత్మిక ఆకాంక్ష, ఒక నిశ్శబ్దమైనటువంటి, ఏ కార్యకలాపాలూ లేనటువంటి స్తబ్ధతతో కూడిన శాంతిని కోరుకుంటూ, ప్రాపంచిక బంధాలన్నింటిని తెగతెంపులు చేసుకుని, కచ్చితంగా పోరాటం నుంచి తప్పించుకునే మిషతోనే జీవితం నుండి పారిపోయి సంఘర్షణలకు అతీతంగా ఉండాలనే ఉద్దేశంతో అన్ని ప్రయత్నాల నుండి తప్పించుకునిపోయిన కాలం వుండింది. అదే ఆధ్యాత్మిక ప్రశాంతతైపోయి, అందులో ఎటువంటి ఉద్రేకాలూ, సంఘర్షణలూ, అన్ని రకాల పెనుగులాటలూ, ప్రయత్నాలూ అనేవి లేకుండాపోగా; ఆ స్థితినే అసలైన, ఆధ్యాత్మిక దివ్యజీవనానికి ఉన్న ఒక వ్యక్తీకరణగా తలంచటం జరిగింది. దానినే భగవదనుగ్రహంగా, దైవసహాయంగా, దైవం జోక్యం చేసుకోవటంగా అనుకోవడం జరిగింది. ఇంకా ఇప్పటికీ, తీవ్రపరితాపం, ఉద్రేకం, అధిక రక్తపోటు ఉత్పన్నం చేసే అధిక ఉద్రేకం ఉంటున్నటువంటి ఈ కాలంలో, సర్వోత్కృష్టమైన ఈ శాంతినే, అన్నింటిలోకి

అందుకోగలిగిన అత్యుత్తమమైన సహాయంగా, ఆహ్వానించదగిన ఉపశమనంగా, అందరూ ఆశించే ఓదార్పుగా, దానినే కోరుకుంటున్నారు. చాలామందికి మాత్రం అదే ఇంకా నిజమైన దైవజోక్యానికీ, దైవానుగ్రహానికీ సూచనగా ఉంది.

వాస్తవంలో, ఒక వ్యక్తి ఎటువంటి సాక్షాత్కారాన్ని కోరుకున్నా, అతడు ఈ పరిపూర్ణమైన చెక్కుచెదరని ప్రశాంతిని తనలో స్థిరపరచుకోవడంతో మొదలుపెట్టాలి. దీని ఆధారంగానే తాను పనిచేయాలి; కాని, ఒక వ్యక్తి తనకు మాత్రమే ప్రత్యేక్షమైనటువంటి, వ్యక్తిగతమైన, స్వార్థపూరితమైన విముక్తిని కోరుకుంటే తప్ప, అతడు అంతటితో ఆగిపోలేడు. దివ్యానుగ్రహపు మరియొక దృక్పథం ఉంది, అది అభివృద్ధికి సంబంధించింది, అది అన్ని అడ్డంకుల మీద విజయం సాధించి తీరుతుంది, మానవ జాతిని నవ్యసాక్షాత్కారానికి ముందుకు నెడుతుంది, కొత్త ప్రపంచానికి తలుపులు తెరుస్తుంది. ఎంపిక చేసిన కొద్దిమందికి మాత్రమే దివ్యసాక్షాత్కారంతో లాభం పొందడం సాధ్యమయ్యే రీతిలో కాకుండా, వారి ప్రభావం కారణంగా, వారి ఉదాహరణ కారణంగా, వారి శక్తి కారణంగా మిగిలిన మానవజాతికి నవ్యమైన, ఇంకా మెరుగైన పరిస్థితులను తీసుకురాగలదు.

ఇది భవిష్యత్తులో, ఇప్పటికే భవిష్యద్దర్శనం గాంచిన సంభావ్యతలకు సాక్షాత్కార మార్గాలను తెరవగలదు. ఏ వ్యక్తులైతే ఎరుకతోనూ లేక ఎరుక లేకుండానూ నవ్యశక్తులకు ఉన్మీలనం చెందుతారో, ఆ భాగం మానవజాతి మొత్తం ఉన్నపళంగా ఉన్నత అంతస్తులోకి, అధికతరమైన సామరస్యతతో నిండిన, పరిపూర్ణ జీవనంలోకి పైకెత్తబడుతుంది... ఒక వేళ వ్యక్తిగతమైన పరివర్తన ఎల్లప్పుడూ అనుమతించబడక పోయినా లేక సాధ్యపడకపోయినా ఒక విధమైన ఉన్నతి సార్వత్రికంగా అందరికీ కలిగించబడుతుంది. సమస్తం సామరస్యం చేయబడుతుంది. దాని వలన ఒక కొత్త శ్రేణి, ఒక కొత్త సామరస్యత ఏర్పరచబడి, ప్రస్తుత వ్యవస్థ యందలి అస్తవ్యస్తత, సంఘర్షణ మాయమైపోయి, సమస్తమూ సామరస్యతలో పనిచేయడానికి దోహదపడే పద్ధతికి ప్రతిష్ఠాపన జరుగుతుంది.

దీని ప్రభావ పర్యవసానాలు వ్యతిరేక మార్గంలో మనోజోక్యంతో జీవితంలో సృష్టించబడిన అన్ని వక్రబుద్ధులనూ, వికారాలనూ, కృతకమైన వాటన్నింటి కారణంగా అధికమైన మొత్తం ఈతిబాధల నన్నింటినీ, దైన్యాన్నీ, నైతిక దారిద్ర్యాన్ని, నీచమూ, ఏవగింపూ కలిగించే మానసికస్థితితో మొత్తం మానవజీవితాన్ని వికృతపరచే వాటన్నిం

టినీ తొలగించే పనికి మొగ్గుచూపుతాయి. అదంతా తప్పక అదృశ్యమైపోవాలి.

*

ప్రశ్న: ప్రియమైనమాతా 'క్రియాశీల సాక్షాత్కారం' అంటే ఏమిటి?

ఇది కర్మలలో అభివ్యక్తమైనదాని సాక్షాత్కారం. ఏ పనులూ చేయని స్థితిలో ఒక సాక్షాత్కారం ఉంది. అది వారు ధ్యాననిమగ్నులై ఉండగా వచ్చేది, అందులో నుంచి వారు బయటకు రారు, కదలరు; ఇంకొకటి క్రియాశీల సాక్షాత్కారం. అది నీ చేతల నన్నింటినీ, నీ కదలికల నన్నింటినీ, నీ వ్యవహార పద్ధతి నంతటినీ, నీ స్వభావాన్నీ పరివర్తన గావిస్తుంది. మొదట చెప్పిన సాక్షాత్కారంలో, నీ బాహ్య అస్తిత్వం ఎప్పటి మాదిరిగానే ఉంటుంటే, ఏదీ మార్పు చెందదు. సాధారణంగా అది కర్మల సంభావ్యతల నన్నింటినీ నాశనం చేస్తుంది, ఆ వ్యక్తి ఇక ఏ పనినీ చేయ లేడు, అతడు స్థిరంగా కూర్చుని మాత్రమే ఉంటాడు.... రెండవ సాక్షాత్కారం, అది ప్రతిదానినీ మార్చివేస్తుంది, నీ స్వభావాన్నీ, నీవు వ్యవహరించే పద్ధతినీ, నీవు పనిచేసే పద్ధతినీ, నీ పనుల నన్నింటినీ, అంతేకాక నీ పరిసరాలను సైతం, చివరకు నీ ఉనికి నంతటినీ, మొత్తం నీ అస్తిత్వాన్నీ మార్చివేస్తుంది: ఇది క్రియాశీల సాక్షాత్కారం. దానికి పరాకాష్ఠ శరీర పరివర్తన.

కొంతమంది వారి మేధస్సును పరివర్తన చేయడానికి ముందే, శరీర పరివర్తన చేయ ప్రయత్నిస్తారు. అది పూర్తిగా అస్తవ్యస్తతకు దారి తీస్తుంది, అది వారిని చప లత్వంలో ముంచేస్తుంది. ఏ వ్యక్తి అయినా మొదట తప్పక తన ఆలోచనలనూ, మొత్తం తన మనస్సునూ, తన మానసిక కార్యకలాపా లన్నింటినీ మార్పుచేసి, ఉన్నతోన్నతమైన జ్ఞానంతో వ్యవస్థీకరించాలి. అదే సమయంలో ఆ వ్యక్తి తప్పక తన స్వభావాన్నీ, తన ప్రాణిక కదలిక లన్నింటినీ, తనలో కలిగే ప్రవృత్తుల ప్రేరణల నన్నింటినీ, తన ప్రతిచర్యల నన్నింటినీ పరివర్తన చేయాలి. చిట్టచివరికి, ఈ రెండూ జరిగిన తర్వాత, కొంతవరకైనా ఇది జరిగిన తర్వాత, అప్పుడు తన శరీరకణాల పరివర్తన గురించి ఆలోచించడం ప్రారంభించవచ్చు, కాని చివరన ప్రారంభించ కూడదు. ఆరంభదశ నుండే ప్రారంభించాలి....

ప్రశ్న: ప్రియమైన మాతా, 'క్రియాశీల దిశగా' అంటే ఏమిటి?

అది ఇప్పుడు చెప్పినదే. యోగం లోని ఈ దిశ.

రెండు దృక్పథాలున్నాయి: ఒకటి చలనం లేని స్థితి, అది సంసిద్ధం చేసేది;

రెండవది క్రియాశీల స్థితి, అది చర్యలను పరివర్తన చేసే దృక్పథం క్రియోన్ముఖం గావించేది. క్రియాశీలమంటే చురుకైన శక్తిని కలిగి ఉండటం: దానర్థం ముందుకు తోసి కర్మను చేయించే ప్రేరణ, కర్మాచరణ
(CWM 2nd Ed. 9:374, 298-99,; 7:201-02)

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

క్రియాశీలమైన ఆధ్యాత్మికత — శాశ్వతత్వం వైపు వేసే మరో అడుగు

ప్రకృతి సిద్ధంగా ఉంది. ఆధ్యాత్మిక ఆకాంక్ష మానవుని అంతరంగంలో సహజంగా ఉంటుంది. అతడు మృగంవలె కాక తనలోని అసంపూర్ణతలకు, పరిమితులకు ఎరుకతో ఉంటాడు. తను ఇప్పుడున్న స్థితి కంటె పొందాల్సినది ఏదో ఉందని భావిస్తాడు. తన్ను తాను అధిగమించాలన్న తపన ఈ జాతిలో సర్వదా సంపూర్ణంగా సజీవంగా ఉంటుంది.

శ్రీఅరవిందులు (దివ్యజీవనం Vol. 19, pp. 842-43)

తన్ను తాను ప్రత్యక్షంగా పరిశీలించుకోగల ఈ మానసిక సమర్థతే మానవుల నడతలో ప్రత్యేకంగా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అది సుస్పష్టం. మృగం సహజంగా, యాంత్రికంగా జీవిస్తుంది. తన జీవనాన్ని తాను గమనించుకోగలిగినా అది చాలా స్వల్పము, గణనీయం కాదు. అందువల్లనే అది విచారం లేకుండా శాంతంగా ఉంటుంది. ఒక ప్రమాదం వలనో లేదా అనారోగ్యం వలనో ఒక జంతువు బాధపడినా, దానిని పెద్దగా గమనించకపోవడం వలన, అది చాలా తక్కువ బాధ ననుభవిస్తుంది. అది తన చైతన్యం మీద, భవిష్యత్తు మీద ఆ ప్రభావాన్ని మోపదు. తన అనారోగ్యం గురించి కాని, తన ప్రమాదం గురించి కాని విషయాలను ఊహించుకోదు.

మనిషిలో మాత్రం నిరంతరం ఏం జరుగుతుందోనని విచారపడడం ప్రారంభమవుతుంది. ఆ విచారమే అతడి క్షోభకు ఏకైక కారణం కాకపోయినా, అదే ముఖ్య కారణం. ఈ విధంగా చైతన్యాన్ని ఎదుటి విషయంపై ఆపాదించడం వలన ఆందోళన,

బాధాకరమైన ఊహలు, విచారం, క్షోభ, భవిష్య ఆపదల గురించి చింతతో ఎక్కువగా మానవులు — అతి తక్కువ ఎరుక కలిగి ఉన్నవారే కాదు, ఎక్కువ ఎరుకతో ఉన్న వారు కూడా — నిరంతరం క్షోభకు గురౌతారు. మనిషి అధిక చైతన్యంతో వుండడం వలన, ఉదాసీనంగా వుండలేడు, అలాగని, ముందు ఏం జరుగబోతోందో తెలుసుకునే టంత చైతన్యం అతనికి లేదు. తప్పు చెప్తున్నానేమో అనే భయం లేకుండా ఈ పృథ్విపై నున్న జీవు లన్నింటిలోకి అత్యంత దుఃఖభాజనమైన జీవితాన్ని అనుభవించేది మనిషేనని కచ్చితంగా చెప్పగలం. మానవుడు ఆ విధంగా ఉండటానికి కారణం అతడు ఆటవికస్థితికి చెందిన పూర్వీకుల వారసత్వాన్ని కలిగి ఉండటం వల్లనే కావచ్చు, కాని అది చాలా బాధాకరమైన స్థితి. దాన్ని అధిగమించడం అన్నది ఈ ఆధ్యాత్మికమైన సమర్థతతో మనిషి ఉన్నత స్థాయి కెదిగి ఆతనిలోని పాశవిక అచేతనా స్థితి స్థానంలో, ఆధ్యాత్మిక అతిమానస-చైతన్యాన్ని ఉంచడంతో అతడి అస్తిత్వంలో మానవ జీవితం యొక్క లక్ష్యాన్ని చూడగల శక్తి ఏర్పడుతుంది. అంతేకాకుండా ఆ సాధన యొక్క పరాకాష్ట స్థాయిని అందుకొని దానితో పాటు ఉన్నత ఆధ్యాత్మిక శక్తులపై దృఢమైన విశ్వాసం ఏర్పడి దానికి తన సంపూర్ణ అస్తిత్వాన్ని సమర్పణ చేసి, తన్ను తాను అర్పించుకొని, తన జీవిత బాధ్యతను, భవిష్యత్తును, ఆ ఉన్నత శక్తుల కర్పించి నిర్విచారంగా ఉండగలడు.

నిజం చెప్పాలంటే మన కేమాత్రం తెలియని మన ఉనికికి మనమే బాధ్యత వహించడం, దానిని గురించి ఏమాత్రం తెలుసుకునే సాధనం మన వద్ద లేకపోవడం అనగా సమస్యలను పరిష్కరించే మార్గాలు తెలియకపోవడం అన్న పరిస్థితి దారుణమైనది. మృగం తనకులేని ఏ సమస్యలు పెట్టుకోదు; అది కేవలం జీవిస్తుంది. దాని సహజాతాలు దాన్ని నడిపిస్తాయి. అంతర్గతమైన జ్ఞానంగల తనను అధిగమించిన ఓ సామూహిక చేతనాశక్తి మీద అది ఆధారపడుతుంది. అది అప్రయత్నంగా జరిగి పోతుంది, దాని సంకల్పంతో ప్రయత్నం చేయనక్కర్లేదు, దాని జీవితానికి అది బాధ్యత వహించదు, అది విచారించదు. తనపైన తాను ఆధారపడాలన్న భావంతో మనిషి జన్మించాడు కాని అందుకు కావలసిన జ్ఞానం లేకపోవడం వలన ఫలితం నిరంతర దుఃఖం. ఈ దుఃఖం అంతం కావడం అన్నది అతడు తనను మించిన ఉన్నత చైతన్యానికి సంపూర్ణంగా అంకితం చేసుకొని, తనను తాను దాని కప్పగించు కొని, తన బాధలను ఆ ఉన్నతశక్తి చేతుల్లో పెట్టి, తన జీవితాన్ని నడిపించి, అంతటిని

వ్యవస్థీకరించమని, సర్వం ఆ శక్తి చేతుల్లో పెట్టినప్పుడు సంభవిస్తుంది.

దానికి కావలసిన జ్ఞానం లేకుండా ఏ సమస్యకైనా పరిష్కారం ఎలా దొరుకు తుంది? దురదృష్టకరమైన విషయం ఏమిటంటే మనిషి తన సమస్యలన్నీ పరిష్కరించు కుందామన్న నమ్మకంతో ఉంటాడు.... కాని దానికి కావలసిన జ్ఞానం అతడికి లేదు. అదే అతడి సమస్య లన్నింటికి, అతడి కష్టాలన్నింటికి మూలకారణం. నిరంతరం అతన్ని వెంటాడే ప్రశ్న 'నేనేం చెయ్యాలి?' దీనిని మరింత క్లిష్టమైన ప్రశ్న వెంబడిస్తుంది, 'ఏం జరగబోతోంది?' అన్నది, దానితో పాటు దానికి సమాధానం చెప్పలేని నిస్సహా యత, అసమర్థత తోడవుతుంది.

అందుకే ఆధ్యాత్మిక శిక్షణ లన్నింటిలోను ముఖ్యమైనది — మొత్తం మన బాధ్యతని సంపూర్ణంగా సమర్పణ గావించడం, ఓ ఉన్నత విధానం మీద ఆధారపడడం అనే ప్రధాన ఆవశ్యకతతో ప్రారంభమౌతుంది. లేకపోతే శాంతి అన్నది అసంభవం. అయినా సరే, మనిషి అభివృద్ధి చెందడానికి తనకేం తెలియదో దాన్ని కనుక్కోవడానికి, తనేం కాలేదో అది పొందగలగటానికి అతనికి చైతన్యం ఇవ్వబడింది. అందుకే ఈ కదలిక లేని, నిష్క్రియమైన శాంతి కన్న ఓ ఉన్నతస్థితి ఉన్నదని చెప్పబడింది. అది తాను పురోగమించాలనే సంకల్పానికి కావలసిన సంపూర్ణ విశ్వాసం కలిగి వుండడం, అన్ని ఆందోళనలను, ఫలితాలను గురించి, పరిణామాలను గురించి చింతను వదిలించుకుని ముందుకు సాగడానికి చేసే కృషిని కాపాడుకోవడం. ఇదే నిశ్చలమైన పద్ధతుల కన్న ఒక్క అడుగు ముందుకు వేయడం.

ఈ నిశ్చలమైన పద్ధతులు మనిషిని జీవన గమనం నుండి దూరం చేస్తాయి; కర్మాచరణను తిరస్కరిస్తాయి, మనిషిని ఒక చలనరహిత స్థితిలోకి దిగజారుస్తాయి. అందుకు కారణం, ప్రశాంతత లేకుండా అంతరంగ సాక్షాత్కారం సాధ్యపడదనీ, బాహ్యపరిస్థితుల వలన సమస్యలు సృష్టించబడతాయనీ, సమస్యల పరిష్కారానికి కావలసిన జ్ఞానం లేనందు వలన జీవితం నుండి తిరోగమించాలనే భావన ఉదయిం చడం వలన, ఈ స్థితి నుండి బయటపడి 'ఒక్కడుగు ముందుకు వేయాలి'.

ఆ క్రమంలో దాని తర్వాత పద్ధతి: ఆ సమస్యను ముఖాముఖి ఎదుర్కోవడం, అది కూడా ఒక ప్రశాంతమైన, సర్వసమగ్రమైన విశ్వాసం, ఏదైతే సర్వ విజ్ఞానమయమైన అత్యంత ఉన్నత శక్తిగా మనలను నడిపిస్తోందో దాన్ని విశ్వసించడం. అప్పుడు కార్యాచరణను వదిలివేయడానికి బదులుగా, శక్తివంతమైన, చైతన్యవంతమైన ఉన్నత

శాంతితో కార్యాచరణను కొనసాగించడం.

దీనినే జీవితంలో దైవ జోక్యం అనే నూతన అంశంగా, ఈ అస్తిత్వంలో దివ్యశక్తుల జోక్యానికి ఓ ఉన్నత విధానంగా, ఆధ్యాత్మిక సాక్షాత్కారానికి నూతన విధానంగా చెప్పవచ్చు.

(CWM 9:303-05)

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఆధ్యాత్మికమనగా నేమి?

ఆధ్యాత్మికమనగా:

ఈ మనస్సు కంటే, జీవితం కంటే, గొప్ప వస్తువొకటున్నదని గుర్తించుట. మనోప్రాణికములు మామూలు స్థాయి కంటె గొప్ప చైతన్యం కొరకు ఆకాంక్షించుట.

మానవాత్మ ఈ హీన ప్రకృతి నుండి పొంగిపొరలి బైటకి వచ్చి అతనిలోని గొప్ప రహస్యచేతన వైపు పయనించుట.

(SABCL 14:65)

ఆధ్యాత్మికమనగా:

అహంకారం కంటే భిన్నమైన మరోచైతన్యాన్ని గురించి తెలుసుకొనుట.

అందులోనే నివసించుట.

అంతకంతకు దానిచే ప్రభావితమగుట.

విశాలమైన, అనంతమైన స్వయంభువు.

అహంకారరాహిత్యములను పొందుట

(SABCL 23:877)

ఆధ్యాత్మికమనగా:

మేధాసంపత్తిగాని, ఆదర్శముగాని,

నైతికవాదముగాని, నిరాడంబరతగాని,

మతపరాయణతగాని, ఆవేశముగాని,

వీటి సంపుటి గాని కాదు.

ఈ లక్షణాలన్నీ మనోవికాసానికి, జీవితానికి కావలసిన విషయాలే. కాని ఆధ్యాత్మిక జీవితానికి మట్టుకు మనిషిని సంస్కరింపజేయు మొదటి దశ మాత్రమే.

ఇవన్నియు మానసిక పరిణామ దశకు చెందిన విషయాలు మాత్రమే — ఆధ్యాత్మిక పరిణామము గాని, అనుభూతి గాని, సిద్ధి గాని కానేరవు.

ఆధ్యాత్మిక లక్షణములు:

నీ అంతరంగిక సత్యమును,

నీ మనస్సు, శరీరము, జీవితముల కంటే ఇతరమైన ఆత్మ, అధి ఆత్మ, అంతరాత్మల అనుభూతులను పొందుట.

విశ్వవ్యాప్తమైన సత్యమును

మనలో కూడ వున్న సత్యమును

తెలుసుకోవలెనన్న ఆకాంక్ష;

దానితో సాంగత్యము జెంది తానితో ఐక్యమగుట.

తదాకాంక్ష, తత్ స్పర్శ, తదైక్యత వలన మారి, నూతనముగా సంభూతమై, నూతనతత్వము, నూతనాత్మ, నూతన రూపమును దాల్చుట.

మన యావత్ ప్రకృతి అటు వైపు మరలి, పరిణమించి, రూపాంతరీకరణము చెందుట.

(SABCL 19:857)

శ్రీ అరవిందులు

అనువాదం: డా. ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

ఆధ్యాత్మికమనగా:

సర్వోత్తమ ఆత్మస్థాయిని, సర్వేశ్వరుడిని, సర్వాన్ని తనలో ఇముడ్చుకున్న ఏకతను తెలుసుకొని, దానిలో జీవించుటకు, జీవితాన్ని సర్వతోముఖంగా, సాధ్యమైనంత సర్వోన్నత ప్రమాణాలకు పెంచుటకు ప్రయత్నించుట.

(SABCL 14:433)

ఆధ్యాత్మికమనగా:

మనిషి యొక్క, అతని ఆత్మ యొక్క విస్తృతమైన, ఉన్నతమైన, సత్యమైన చేతనలో ఆధారితమైన విశిష్ట, నూతన ఆంతరిక జీవనసరళి.

తద్వారా మనిషి సకల సృష్టిని విశ్వంలోను, తన జీవితంలోను క్రమానుసారంగా

సిద్ధించే ఆత్మసాక్షాత్కారంగాను, రూపాంతరీకరణం సాధ్యపడే క్షేత్రంగాను స్వీక రిస్తాడు.

ఆ పరివర్తనలో సృష్టి యొక్క దివ్యసంవేదన విదితమౌతుంది, దాని అంతర్నిహిత శక్తులు సంపూర్ణంగా వికసిస్తాయి. ప్రస్తుత అసంపూర్ణ రూపాలు దివ్యమైన సంపూర్ణ రూపాలుగా మారుతాయి.

మనిషి తన అస్తిత్వం యొక్క ఉన్నత సంభావ్యతలను చూచుటకే గాక వాటిని జీవితంలో అనుభవైకవేద్యం గావించటానికి ప్రయత్నిస్తాడు.

(SABCL 9:251)

ఆధ్యాత్మికమనగా:

దివ్య పరిపూర్ణత సర్వదా మనకు ఊర్ధ్వంగా నుంటుంది. అయితే మనిషి చేతనలో దైవికంగా మారి, ఆచరణలోను, జీవితంలోను, అంతర్ముఖంగాను, బహిర్ముఖంగాను దివ్యజీవన శైలిని అనుసరించుట ఆధ్యాత్మిక మనబడుతుంది.

ఆధ్యాత్మికమనే పదానికి, పైనిచ్చిన అర్థాలకన్నా అల్పమైన అర్థాన్నిచ్చేవన్నీ అయోగ్యమైన తడబాటుతనంతో గాని లేక మోసపూరితంగా గాని ఆపాదించబడిన అర్థాలు.

*

ఆధ్యాత్మిక జీవితమంతా, సూత్రప్రాయంగా, దివ్యజీవన స్రవంతిలోకి ఎదుగుటయే.
(SABCL !5:247}

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దివ్యజీవనంలోకి ఎదుగుట

దివ్యజీవనానికి సంబంధించిన పనులతో ఆధ్యాత్మికంగా వ్యవహరించుటలో కష్టాలు తలెత్తడానికి కారణం అజ్ఞానావృతమైన ప్రయోజనాల కోసం జీవితేచ్ఛ ఒక బూటకపు కామనాత్మను, దివ్యకాంతితో తేజరిల్లే నిజమైన ఆత్మకు ప్రత్యామ్నాయంగా సృష్టించడం. ప్రస్తుతం జీవితంలో జరిగే పనులన్నీ ఈ కామనాత్మ వలననే ప్రేరేపించబడి, పిమ్మట చెరుపబడుతున్నట్లుగా కనిపిస్తున్నది. నైతికమైనవి, ధార్మికమైనవేగాక, సానుభూతి, పరోపకారం, స్వార్థత్యాగం, స్వప్రయోజనాల విస్మరణ లాంటి లక్షణాలుగల పనులు కూడా కామనాత్మ ప్రేరితాలే. కామనాత్మ ఒక ప్రత్యేకపరచబడిన అహంకారం మూర్తీభవించిన జీవాత్మ. దాని సహజ ప్రవృత్తులన్నీ ఒక ప్రత్యేకమైన స్వయం ప్రాధాన్యతను ఆశిస్తాయి. అవి బహిరంగంగానో లేక ఆకర్షణీయమైన ముసుగుల మాటునో స్వయంవృద్ధికి, స్వంత అనుభవానికి, స్వీయ ఆనందానికి, గెలుపుకు, ఆధిపత్యానికి సదా ప్రేరేపిస్తుంటాయి. వ్యాకులత, అస్తవ్యస్తత, వక్రీకరణ లాంటి శాపగ్రస్త లక్షణాలు దివ్యజీవనం నుండి తొలగింపబడాలంటే, యదార్థమైన ఆత్మ, చైత్యపురుష సత్తకు ప్రధాన పాత్ర నివ్వవలసి వుంటుంది, బూటకమైన కామనాత్మ, అహంకారం అంతరించాల్సి వుంటుంది. దాని అర్థం జీవితాన్ని బలవంతంగా దాని సాఫల్యతకు సహజమైన మార్గానుసరణను నిరోధించడం కాదు. కారణం, బాహ్యజీవిత కామనాత్మ వెనక మనలో ఒక అంతర్గతమైన, యదార్థమైన ప్రాణిక సత్త ఒకటి వుంది. దానిని అంతరించనీయకుండా ప్రస్ఫుటమయ్యేలా వ్యక్తపరచబడి దివ్యప్రకృతి శక్తిగా దాని నిజకార్యాచరణ కోసం స్వేచ్ఛగా వదలివేయాలి. మనలోని అంతరాత్మ అజమాయిషీలో యదార్థమైన ప్రాణిక సత్త ప్రాధాన్యత పొంది వుండుట ప్రాణశక్తి దివ్యలక్ష్య సాఫల్యతకు ఆవశ్యకమైన స్థితి. ఈ లక్ష్యాలు వాటి మూలసారంలో యథాతథంగా నున్నా, అంతరంగ చాలనాశక్తిలోను, బాహ్యప్రవర్తనా సరళిలోను మార్పుచెందుతాయి. దైవికమైన ప్రాణశక్తి కూడా అభివృద్ధి చెందడానికి ఒక సంకల్పంగా పనిచేస్తుంది: స్వయం ప్రాధాన్యత శక్తిగా కూడా ఉపకరిస్తుంది. అయితే, ఆ ప్రాధాన్యత మన అంతర్గతంగా నున్న దైవానిది. కాని ఉపరితలంలో వ్యక్తపడే అల్పమైన తాత్కాలిక వ్యక్తిత్వానిది కాదు. అది దోహదపడేది యదార్థమైన దివ్యలక్షణ సమన్వితుడగు వ్యక్తిగా, ప్రధాన జీవిగా, అవ్యక్తుడుగా నున్న, అవినాశుడైన దివ్య

పురుషుడు ఎవరైతే అహంకారం అంతరించినపుడు, దాని ప్రాధాన్యత క్షీణించినప్పుడు మాత్రమే వ్యక్తమౌతాడో, అట్టి పరమ పురుషుడిగా ఎదగటానికి. ఇదే జీవిత పరమార్థం: అభివృద్ధి, అయితే అది దివ్యప్రకృతిలోని జీవలక్షణాభివృద్ధి, తనకు తానుగా మనో ప్రాణ శరీరాలలో స్థిరపడి వృద్ధి చెందేది; స్వాధీనత, అయితే అది అన్ని విషయాలు దైవం స్వాధీనంలో నుండుట మరియు అన్ని విషయాలకు దైవం స్వాధీనుడై నుండుట, గాని అహంకారజనిత కోరికలకు కాదు; సుఖానుభవం, విశ్వంలోని దివ్యానందాన్ని ఆస్వాదించుటలో గల సుఖానుభవం; అజ్ఞానాంధకార శక్తులతో విజయవంతమైన పోరాటరూపంలో చోటు చేసుకునే యుద్ధం, విజయం, ఆధిపత్యం; ఒక సంపూర్ణ ఆధ్యాత్మిక స్వరాజ్యము మరియు అంతర్ముఖ ప్రకృతి పైన, బాహ్య ప్రకృతిపైన నియంత్రణ; దివ్యజ్ఞానం, దివ్యప్రేమ, దివ్యసంకల్పాలతో అజ్ఞాన క్షేత్రాలపై విజయం. *(CWSA 23:175-76)*

శ్రీఅరవిందులు
అనువాదం: హర్షవర్ధన్

నిర్వాణము — దివ్యజీవనం దిశగా ఒక అడుగు

అసలీ నిర్వాణమంటే ఏమిటి. సనాతన బౌద్ధ సిద్ధాంతం ప్రకారం అదొక విచ్ఛిన్నత — అక్కడ ఆత్మ లేదు కాబట్టి ఆత్మ విచ్ఛిన్నత కాదు — అది మానసిక మిశ్రమపు లేక మనం ఎవరినైతే 'మనము' అని వ్యవహరించుకుంటామో ఆ వివిధ అనుబంధాల లేక సంస్కారాల సమాఖ్యపు విచ్ఛిన్నత. మాయావాద వేదాంతం ప్రకారం అది విచ్ఛిన్నత కాదు, అవాస్తవికం, అసత్యం అయిన వ్యక్తిత్వం, పరబ్రహ్మంలో లయం కావడము. ఆ విధంగా లయించి అదృశ్యమయేది ప్రత్యేక వ్యక్తిత్వమనబడే అనుభవము, వ్యక్తిత్వభావన; సత్యమైన దివ్యకాంతిలో అబద్ధపు వెలుగు సమసిపోవడమేనని చెప్పవచ్చు. ఆధ్యాత్మిక అనుభవం కలిగినప్పుడు కొన్నిసార్లు అనంతమైన విశ్వచైతన్యంలో ప్రత్యేక వ్యక్తి భావన పూర్తిగా నశించిపోయిన భావన; ఇక అప్పుడు ఒకప్పటి వ్యక్తి మిగిలేది విశ్వచైతన్య ప్రవాహానికి ఒక మార్గంగా, విశ్వశక్తికీ దాని చర్యలకు ఒక కేంద్రంగా మాత్రమే. అది కాక సర్వాతీతమైన అస్తిత్వం, చైతన్యం దేనిలోనైతే

విశ్వాన్ని గురించిన, వ్యక్తిని గురించిన సంవేదన అంతరిస్తుందో దానిలో వ్యక్తిత్వం కోల్పోయినటువంటి అనుభవం కావచ్చు. ఇంకా చెప్పాలంటే అది విశ్వచర్య ఎరుక కల్గి వాటికి ఊతనిచ్చే ఒక సర్వోత్కృష్ట స్థితిలో ఉండవచ్చు. ఇంతకీ మనం వ్యక్తి అని ఎవని నంటున్నాము? సాధారణంగా మనం అలా వ్యవహరించేది సహజ సిద్ధమైన అహంకారాన్ని. అది మనస్సు, శరీరాలలో తన కార్యక్రమాన్ని నడిపించటం కోసమై ప్రకృతి ఏర్పాటు చేసిన ఒక ఉపాయనము. ఈ అహాన్ని రూపుమాపితే కానీ పూర్తి విమోచనం సాధ్యం కాదు. అయితే స్వయంగా వ్యక్తిగానీ, ఆత్మగానీ అహం కాదు. వ్యక్తిగత ఆత్మే ఆధ్యాత్మిక సత్త. దాన్నే భగవంతుని శాశ్వతమైన అంశగా చెపుతారు, భగవంతుడే అనేక రూపాలై తన సృష్టికి ఆలంబనగా ఉంటున్నట్లు కూడా చెపుతారు. అసలైన ఆధ్యాత్మిక వ్యక్తి అది. మనం మన అహంభావాన్నీ, విభక్త వ్యక్తులమనే భావాన్నీ తొలిగించుకొని సర్వాతీత పరదైవంతోనూ, సకల జీవరాసుల తోనూ ఏకత్వాన్ని పొందగలిగినప్పుడు ఈ అసలైన ఆధ్యాత్మిక వ్యక్తి దర్శనం అవుతుంది. ఆ విధంగా మాత్రమే దివ్యజీవనం సాధ్యపడుతుంది. దీనికి మొదటి మెట్టు నిర్వాణము. మనం విభక్తమైన ప్రత్యేక వ్యక్తులమనే అసత్య భావం తొలిగిపోవ టమే మనం శాశ్వతులమై శాశ్వతంగా దైవంలో దివ్యజీవనం గడపటానికి అవసరమైన ముఖ్య నిబంధన. దానిని మనం ఈ జీవితంలోనే, ఈ లోకంలోనే సాధించవచ్చు.

*

నేను నమ్ముతున్న సత్యం: 1) అసత్యాన్నీ అజ్ఞానాన్నీ నిరోధించి జ్ఞానం వైపుకీ, అంధకారాన్ని నిరోధించి వెలుగులోకీ, అహంకారాన్ని నిరోధించి దైవత్వంలోకీ, అపరిపూర్ణతను కాదని పరిపూర్ణత్వంలోకి నడిపించడమే.

2) నేను నమ్ముతున్న సత్యం: కేవలం నిజమైన భక్తీ, మానసికాభివృద్ధీ మాత్రమే కాదు, జ్ఞానము, పవిత్రత, దైవశక్తి, ప్రశాంతత మొదలైన వాటి నన్నిటినీ మానసిక, భావావేగ, ప్రాణిక రూపాల నుంచి దాటి వాటి అతిమానసిక వాస్తవానికి చేర్చడం.

(SABCL 22:46-47; 23:1049)

శ్రీఅరవిందులు

అనువాదం అమరవాది ప్రభావతి, అమరవాది వేంకట రామశాస్త్రి

అహం స్థానంలో దివ్యచేతనను ప్రతిష్ఠించాలి

మానవజాతి ప్రప్రథమంగా సృష్టించబడినప్పుడు దానిని యేకం చేసిన మౌలికాంశం అహం. అహం చుట్టూ ఆ జాతి అస్తిత్వపు వివిధ దశలు ఏర్పరచబడ్డాయి. కాని యిప్పుడు అతీత మానవజాతి ప్రాదుర్భావానికి సన్నాహం జరుగుతోంది. అందుచేత అహం అంతర్ధానమై చైత్యపురుషునికి ద్వారాలు తెరవాలి. మానవునిలో దైవం వ్యక్తం గావడానికి, దైవజోక్యం వల్ల నెమ్మదిగా ఈ చైత్యపురుష నిర్మాణం జరిగింది.

చైత్యతత్వ ప్రభావంతో మనిషిలో దైవం అభివ్యక్తమౌతాడు. ఆ విధంగా ఆ ప్రభావం అతీత మానవజాతి ఆగమనాన్ని సిద్ధం చేస్తుంది.

చైత్యతత్వం అమరం. ఈ చైత్యతత్వం ద్వారా భువిపై అమరత్వం అభివ్యక్తం కాగలుగుతుంది.

కనుక యిప్పుడు అతి ముఖ్య విషయమేమిటంటే, వ్యక్తి తన చైత్యపురుషుని కనుగొనాలి, దానితో యేకం కావాలి, దానిని అహం స్థానంలో ప్రతిష్ఠించాలి. అప్పుడు అహం పరివర్తన చెందేటట్లుగాని లేదా అంతర్థానమయ్యేటట్లుగాని ఒత్తిడికి గురి అవుతుంది.

*

నీ విప్పుడీ క్షణాన భువి మీద ఉండడానికి కారణం, ఒకానొకప్పుడు నీవు దానిని కోరుకున్నావు — నీ కది ఎంత మాత్రం గుర్తు లేదు. కాని నాకు తెలుసు — అందుచేత నీ విక్కడున్నావు. మంచిది, ఇప్పుడు నీవు సాధించవలసిన మహత్కార్య శిఖర స్థాయికి యెదగాలి. సమస్త బలహీనతలను, పరిమితులను నీవు జయించితీరాలి, అందుకు నీవు పోరాడాలి. అన్నింటిని మించి నీవు నీ అహానికి 'నీ కాలం ముగిసింది' అని చెప్పి తీరాలి. అహంలేని జాతి, అహం స్థానంలో దివ్యచేతనగల జాతి, మనకు కావాలి. అదిగో, అది మనకు కావలసింది: జాతి తనకు తానుగా అభివృద్ధి చెందుటకు వీలు కలిపించే దివ్యచైతన్యము; అతిమానస జీవి జన్మించుట.

*

"దైవం అభివ్యక్తమౌతున్న విషయం ప్రపంచం తెలుసుకొను గాక", అని నేను ఆమంత్రిస్తున్నాను.

శ్రీమాత

తనను మనిషి తెలుసుకోవాలని భగవంతుడు యెదురు చూస్తున్నాడు. అదే సమయంలో మనిషి ఆయన కోసం ప్రతి చోటా అన్వేషిస్తున్నాడు, దైవ ప్రతిరూపాలను తయారుచేసుకొంటున్నాడు. కాని ఈ కాలమంతా అతను తన స్వకీయ, మనస్సు-అహం, ప్రాణ-అహంల ప్రతిరూపాలను మాత్రమే యదార్థంగా కనుగొని ప్రతిష్ఠించి ఆరాధిస్తున్నాడు. ఈ మూలాధార అహం రద్దైనప్పుడు, ఈ అహం కోసం వేట ఆగిపోయినపుడు, మనిషికి తన బాహ్య, అంతర జీవితంలో ఆధ్యాత్మికతను సాధించే ప్రప్రధమ అవకాశం లభిస్తుంది. కాని అది చాలదు, అదొక ప్రారంభం మాత్రమే. అది ముందుకు పోవ వీలుగాని ప్రవేశం వంటిది గాక యదార్థ ద్వారం అవుతుంది.

అహాన్ని కోల్పోవడం ద్వారా పరమాత్మను కనుగొనాలని ఆధ్యాత్మిక మానవుడు అన్వేషిస్తాడు. సమస్త మందూ యేకైకమై వున్న, పరిపూర్ణమై వున్న, ప్రతిదాని యందూ సంపూర్ణంగా వున్నదానిలో నివసించడం ద్వారా, దాని పరిపూర్ణతకు ప్రతిరూపంగా యెదగాలని — అతని స్వభావపు సర్వాలింగక, సార్వత్రికతతో దాని సచేతన పరిధితో ఐనప్పటికీ అది వ్యక్తిగతానుభవమే అనే విషయం గుర్తుపెట్టుకోవాలి — ఆధ్యాత్మిక మానవుడు ఆకాంక్షిస్తాడు.

*

దేహమే తాననే భావానికి కట్టువడిపోయి వున్న మానసిక, ప్రాణిక అహానికి రూపకల్పన చేయడం, తన ప్రగతిశీల పరిణామంలో వైశ్వ ప్రాణం పడిన మహా ప్రసవవేదన. ఎందుచేతనంటే పదార్థం నుండి ఒక సచేతన వ్యక్తిని సృజించడానికి వైశ్వ ప్రాణం కనుగొన్న ఉపాయం పరిణామం. పరిమితీకరించే ఈ అహాన్ని నామరూపాలు లేకుండా చేయడం అనేది ఒక షరతు. ఈ వైశ్వప్రాణమే తన దివ్యకార్యం నెరవేరడానికి కనుగొన్న మార్గం ఇది. ఎందుచేతనంటే సచేతన వ్యక్తి, ఆ విధంగా మాత్రమే తన విశ్వాతీత ఆత్మను గాని లేక యధార్థ దివ్యపురుషునిగాని కనుగొన గలడు.

*

వ్యక్తిత్వాన్ని సంతరించుకొనే దశను మనం దాటిపోయినప్పుడే మనం నిజమైన దివ్యవ్యక్తులం అవుతాం.

అహం సహాయకారి; అహం ఆటంకం.

శ్రీఅరవిందులు

అనువాదం కె. వి. రావు

జీవితంలో క్రియాశీల ఆధ్యాత్మికత పాత్ర

కళ, సాహిత్య రంగాలలో లేదా రాజకీయ, సామాజిక జీవితాలలో ఆధ్యాత్మికత అనగా ఏమిటి? 'ఆధ్యాత్మిక టంకారము' అని ఇటీవల ప్రస్తుతించబడుతున్న లక్షణము కళకు, సాహిత్యానికి సోకినట్లయితే, అవి పరిపుష్టి చెందుతాయా? సామాజిక, రాజకీయ సమస్యలు ఆధ్యాత్మిక స్పర్శతో పరిష్కరించబడతాయా? ఇలా ప్రశ్నించడం జరుగుతున్నది. మన దేశ చరిత్రలోని నేటి దశలో ఒక భారతీయుడి నోట ఇలాంటి అజ్ఞానజనితమైన ప్రశ్నలు వెలువడటం విస్మయం కలిగిస్తున్నది. చిరకాలంగా పాతుకు పోయిన పాశ్చాత్య నాగరికతా ప్రభావం ఇందుకు కారణం. పాశ్చాత్యుల భావనలో మతాభినివేశము ఆధ్యాత్మిక జీవనంలో ఒక పార్శ్వమైతే, మేధోచింతన, లౌకిక జీవనము మరొక పార్శ్వము. ఈ రెండూ పూర్తిగా విభిన్నమైన విషయాలనీ, వాటి అనుసరణ వాటికి మాత్రమే ప్రత్యేకమైన మార్గాలలో, ప్రత్యేక సూత్రాల మేరకు కొనసాగాలని వారనుకుంటారు. భారతదేశం తన ఆదర్శాన్ని పాటించడంలో ఊహా జనిత ఆధ్యాత్మిక దిశగా పయనిస్తున్నదని, ఆ విధంగా క్రియోన్ముఖతకు, వాస్తవికతకు దూరమై, సంస్కరణ వికాసానికి వ్యతిరేకము, ప్రగతి నిరోధకము, మార్మికము, మతపరమైన మూఢవిశ్వాసాలకు బలి అవుతున్నదనీ, తత్కారణంగా ఆధునిక ప్రపంచ తాకిడులను తట్టుకొని నిలబడగలిగే దక్షతగల, సుస్థిరమైన దేశంగా ఎదగడానికి అవసరమైన తార్కిక, ఆధునిక మార్గాలను విస్మరిస్తున్నదని వారు భావిస్తారు. అందుకోసం, ఆధ్యాత్మికానుబద్ధమైన సూత్రంపై ఆధారితమైన పునరుజ్జీవనమనగా ఏమిటో వారికి తెలియజెప్పే ప్రయత్నం చేయాలి.

అందుకని ముందుగా, ఆధ్యాత్మికతను మనం ఏ విధంగా పరిగణిస్తామో వివరించాలి. ఆధ్యాత్మికత అనగా, ప్రాపంచిక జీవితాన్ని ఒక ఐహిక శూన్యతగా భావించి అందరమూ వీలైనంత వేగంగా మతానికి చెందిన సన్యాసులుగా మారి మన సామాజిక జీవనసరళిని ఓ మఠంలోనో, గుహలోనో, కొండమీదో వసించడానికి వీలుగా తీర్చిదిద్దు కుంటామని కాదు. అభ్యున్నత ఆదర్శాలను విస్మరించి, మానవజాతి సమిష్టి పురోగతికి తోడ్పడని లక్ష్యంతో సాగే జడ జీవన సరళికి మారిపోతామనీ కాదు. భారతీయ మనోవైఖరి పూర్వకాలంలో కొంతవరకు ఆ విధంగా వుండి వుండవచ్చు. కాని అది భారతీయుల ధృఢమైన, సంపూర్ణమైన వైఖరిగా ఎప్పుడూ ఉండలేదు. ఆధ్యాత్మికత

అనగా జాతీయ అస్తిత్వ విధానాన్నంతా ఒక ప్రత్యేక మతపరమైన పరిమిత సిద్ధాంతాలకో, ఆచారాలకో, సూత్రాలకో అనుగుణంగా మలచడం కాదు. ప్రాచీన సమాజాలు అలాంటి ప్రయత్నాలు తలపెట్టి వుండవచ్చు; అలాంటి భావనలు పాత మానసిక అలవాట్లు, సాహచర్యం మూలంగా కొందరిలో ఇంకా కొనసాగుతుండవచ్చు. కానీ అలాంటి పరిణామం ఇప్పుడు చోటు చేసుకొనుట అసాధ్యం. కారణం, అత్యంత వైరుధ్య భరితమైన సాంప్రదాయాలు కలిగిన మూడు విభిన్న మతాలు, హిందూ, ఇస్లామ్, క్రైస్తవ మతాలు – వాటి శాఖోపశాఖలకు ఆశ్రయమిస్తున్న మన దేశంలో, అది ఎంత మాత్రం సాధ్యపడదు. ఆధ్యాత్మికత ఏ ఒక్క మతానికన్నా విస్తృతమైనది. ప్రస్తుతం మతానికి సంబంధించి మనలో కలుగుతున్న ఆధునిక విశాల భావాల నేపథ్యంలో, ఎంత గొప్ప మతమైనా విశ్వవ్యాప్తి చెందిన ఏకైక మతానికి ఒక శాఖగా నుంటుంది గాని అంతకు మించి కాదు. శాశ్వతుడగు దైవం గురించి దివ్యత్వం గురించి, సర్వోన్నతమైన ఆత్మను గురించి, ఏకత్వ మూలం గురించి, మానవ జీవిత విలువలను శాశ్వతమైన దైవిక విలువలతో సరిసమానం చేసే ప్రయత్నాన్ని ముమ్మరం చేయడం గురించి, భవిష్యత్తులో మనిషి పడే ప్రయాస మనకు అర్థమవుతుంది.

అయితే, మానవజీవితపు ఏ ఉన్నత లక్ష్యాన్నిగాని మన ఆధునిక ప్రపంచపు ఏ తీవ్ర సమస్యను గాని, ఎలాంటి మానవ చర్యను గాని, అభివృద్ధి సాధించాలని, విస్తృతమవ్వాలని, ఆనందోత్సాహాలను, కాంతిని, శక్తిని, పరిపూర్ణతను ఇనుమడింపజేయాలని, జీవాత్మకు సాధారణంగానో లేక అంతర్గతంగానో, స్వాభావికంగానో ఉండే కోరికను నెరవేర్చే మార్గాలను గాని మన పరిధి నుండి బహిష్కరించడం మన ఉద్దేశం కాదు. మనసు లేని ఆత్మను, శరీరం లేని ఆత్మను కలిగి వుండుట మానవ లక్షణం కాదు. అందువలన మానవుని ఆధ్యాత్మికత మనసునుగాని, ప్రాణాన్నిగాని, శరీరాన్నిగాని చులకన చేయగూడదు. అందుకు భిన్నంగా వాటిని అత్యంత గణనీయమైనవిగా, అత్యధిక ప్రాముఖ్యత గలవిగా పరిగణించాలి. కారణం, అవి మనిషిలోని ఆత్మయొక్క సచేతనా స్థితికి ఉపకరణాలు గనుక. ప్రాచీన గ్రీకు సంస్కృతి గాని, ఆధునిక శాస్త్రీయ దృక్పథంగాని మనో ప్రాణ శరీరాల పటిష్ఠతకు, అభివృద్ధికి, శక్తికి ఎంత విలువ నిచ్చాయో ప్రాచీన భారతీయ సంస్కృతి కూడ అంతే విలువ నిచ్చింది — వాటి లక్ష్యం వేరై యుండవచ్చు, ఉద్దేశం ఉన్నతమైనదిగా నుండవచ్చు

— అందువలన వీటికి దోహదపడే అన్ని విషయాలను వాటి సమున్నత పరిపూర్ణతకు తోడ్పడే వాటిని సంపూర్ణంగా అనుమతించింది. హేతుబద్ధమైన శాస్త్రపరిజ్ఞానానికి, తత్వజ్ఞానానికి చెందిన కార్యాచరణకు, ఉత్తమాభిరుచిగల అస్తిత్వ సంతృప్తికి, సర్వ కళల అభివృద్ధికి, శారీరక ఆరోగ్య దారుఢ్యాలకు, జాతియొక్క భౌతిక, ఆర్థిక స్థోమతకు, సౌలభ్యతకు, సమృద్ధికి ఉపకరించే అన్ని ప్రక్రియలకు మార్గం సుగమం చేసింది. కొందరు మనకు నమ్మజూపినట్లుగా దారిద్ర్యం అనేది ఏనాడు కూడ భారతదేశానికి నమూనాగా లేదు, ఆమె ఆధ్యాత్మికతకు, సైనిక, రాజకీయ, సామాజిక శక్తిసామర్థ్యాలకు పేదరికం గాని, లేమిగాని ముఖ్య భూమికలుగా నుండలేదు. వారి లక్ష్యం ఉన్నతమైనది, వారు ఏర్పాటు చేయాలనుకున్న పునాది ధృఢమైనదే కాక విస్తృతమైనది కూడ. ఈ ప్రాథమిక సాధనాలపై వారు అపారమైన శ్రద్ధాసక్తులు వహించారు. నేటి భారతం కూడా తప్పనిసరిగా, సంకీర్ణ పరిస్థితులకు సరిపడు సాధనా సంపత్తితోను, వినూత్న విస్తృత భావజాల ప్రేరణతోను, అదే లక్ష్యాన్ని అనుసరిస్తుంది. అయితే ఆమె కృషి యొక్క, కర్మాచరణ యొక్క పరిధిగాని, ఆమె మనస్సు యొక్క సౌకుమార్యం గాని, వైవిధ్యం గాని సన్నగిల్లవు, పోతే పాతవాటి కన్నా మెరుగుపడతాయి. ఆధ్యాత్మికతకు కొన్నింటిని బహిష్కరించి ప్రత్యేకతను నిలుపుకొనే అగత్యం లేదు: తన సంపూర్ణతలో అన్నింటినీ తనలో కలుపుకో గలదు, కలుపుకుంటుంది కూడా.

అయితే, ఉనికిని గురించిన ఆధ్యాత్మిక దృష్టికి, పూర్తిగా భౌతికపరమైన, మానసికపరమైన దృష్టికి మధ్య చాలా వ్యత్యాసం వుంది. ఆధ్యాత్మిక దృష్టి మనో ప్రాణ శరీరాలను మానవుని కున్న మార్గాలుగా పరిగణిస్తుంది కాని అతని లక్ష్యాలుగా కాదు; అంతే గాక అతని ఆఖరి, అత్యున్నత సాధనాలుగా కూడా పరిగణించదు; వాటిని ఆతని బాహ్య సాధన కుపకరించే వ్యక్తిత్వంగా పరిగణిస్తుంది కాని ఆతని సంపూర్ణ అస్తిత్వంగా కాదు. అన్ని పరిమితమైన వాటి వెనక అనంతత్వాన్ని చూస్తుంది; అనంతత్వాని కున్న అధికతర విలువల ప్రమాణంతో పరిమితమైన వాటి విలువలను అంచనా వేస్తుంది. విలువల అంచనా తప్పు అయినట్లయితే వాటి యదార్థ విలువను కనుగొనుటకు ప్రయత్నం కొనసాగిస్తుంది. మనిషికి ప్రపంచానికి వెనుక పైకి కనిపించని వాస్తవికతనే గాక వాటిలో అంతర్గతంగా నున్న వాస్తవికతను అది గమనిస్తుంది. మనిషిలోని అంతరాత్మను, జీవాత్మను, ఈ దైవికమైన విషయాన్ని అతనిలోని

అత్యధిక ప్రాముఖ్యత గలదిగా పరిగణిస్తుంది. మనిషిలో నున్న మిగతావన్నీ, ఏదో విధంగా, దానిని బహిర్గతం గావించి వ్యక్తపరచడానికి ప్రయత్నించాలి. ఈ అంతరాత్మను, జీవాత్మను, ప్రపంచమందున్న దైవిక ఉనికిని అన్ని రూపాలలోను చూసి గుర్తించడటానికి మనిషి సర్వదా ప్రయత్నించాలి; తన ఆలోచనను, జీవితాన్ని దానితో ఏకం గావించి, అందులో తన తోటివారితో ఐక్యతను పొందుటకు ప్రయత్నించాలి. ఇది విషయాలపై మనకున్న సాధారణ దృక్పథాన్ని తప్పక మారుస్తుంది. జీవిత లక్ష్యాలన్నింటిని కాపాడుకొనుటలో కూడా వేరొక సంవేదనను, మార్గాన్ని సమకూరుస్తుంది.

మనం శారీరక శక్తిని ఆరోగ్యాన్ని, లక్ష్యంగా పెట్టుకుంటాం. అయితే, ఏ ప్రయోజనాన్ని ఆశించి? స్వప్రయోజనం కోసం అనేది మామూలు సమాధానం. ఎందుకంటే వాటిని పొంది వుండుటలో ప్రయోజన ముంది గనుక, లేదా సుదీర్ఘ కాలం జీవించాలని లేక మేధోపరమైన, ప్రాణికమైన, మానసికమైన సంతృప్తులకు ధృఢమైన ఆధారం ఏర్పడాలని. అవును, ఒక విధంగా స్వప్రయోజనం కోసమే అయినా అందులోని అంతరార్థం భౌతికం కూడా ఆత్మ యొక్క అభివ్యక్తి అని, దాని పరిపూర్ణతను సాధించడంలో ప్రయోజనమున్నదని, అది సంపూర్ణ మానవ జీవిత ధర్మంలో ఒక భాగమని. అంతకు మించి మనిషిలోని దివ్య ఆత్మను కనుగొని వ్యక్తపరచుటకు కావలసిన ఉన్నత కర్మాచరణకు పునాదిని వేసే ప్రయోజనం కూడా వున్నది. 'శరీరం ఖలు ధర్మసాధనం' అన్న ప్రాచీన సంస్కృత నిర్వచనం లాగా శరీరం కూడా ధర్మాచరణ సాఫల్యతకు ఒక ఉపకరణమని, మన అస్తిత్వపు దైవాను శాసనమని మన విశ్వాసం. సాధారణ దృష్టిలో మన యొక్క మానసిక, భావోద్వేగ, రసజ్ఞత లక్షణాలను పెంపొందించాలి. ఆ విధంగా వాటికి అధిక సంతృప్తి చేకూరవచ్చు లేదా అవి అలా వృద్ధి చెంది సంతృప్తి పడాలనేది మానవుని సున్నిత స్వభావం కావచ్చు. ఎందుకనగా ఆ విధంగా జరిగినట్లయితే అతను మరింత హుషారుగా నున్నట్లు, సఫలీకృతుడైనట్లుగా భావిస్తాడు. అంతేకాక, ఈ విషయాలన్నీ కూడ ఆత్మ యొక్క అభివ్యక్తులు, తమ దైవిక విలువలను అతనిలో అన్వేషిస్తున్న విషయాలు. వాటి పెరుగుదల, సూక్ష్మబుద్ధి, నమ్యత, శక్తి, తీవ్రతల వలన లోకంలో నున్న దివ్య వాస్తవికతకు చేరువ కాగలిగి, వివిధ రకాలుగా దానిపై పట్టు సాధించి, చివరకు తన యావత్ జీవితాన్ని దానితో ఐక్యం చేస్తాడు, దానికి అనుగుణంగా మలుస్తాడు.

సాధారణ దృక్పథంలో 'నైతికత' అనగా సమాజ మనుగడను కొనసాగించే నియమ బద్ధంగా తీర్చిదిద్దబడిన వ్యక్తిత్వం, సామాజిక నడవడి, తోటివారితో మేలైన, హేతు బద్ధమైన సంయమంతో కూడిన, సానుభూతిగల, ఆత్మనియంత్రణతో కూడిన వ్యవహార శైలిని పాటించుట. అయితే ఆధ్యాత్మిక దృష్టిలో నీతి నియమావళి దీనికన్నా మిన్న యైనది; మన కార్యాచరణలోను, ముఖ్యంగా మన అస్తిత్వ స్వభావంలోను, దివ్య వ్యక్తిత్వాన్ని వికసింపచేసి, మనలను దైవిక ప్రకృతి లోకి ఉద్ధరించే సాధనము.

ఇతర కార్యాలు, లక్ష్యాల విషయంలో కూడా ఆ మాదిరిగానే జరుగుతుంది. ఆధ్యాత్మికత వాటన్నింటిని తన అక్కున చేర్చుకొని వాటికి ఒక ఉన్నతమైన, దివ్య మైన, అర్థవంతమైన ఆశయాన్నిస్తుంది. తాత్విక చింతన పాశ్చాత్య పరిభాషలో సృష్టి యొక్క ప్రాథమిక సత్యాలపై హేతువాద వెలుగులో జరిగే నిష్పాక్షిక విచారణ. ఈ విచారణ ఫలితం మనకు శాస్త్రపరిజ్ఞానం అందించే వాస్తవాంశాలను గమనించుట వలన గాని లేక సహేతుకంగా ఋజువు చేయబడిన విషయాలను తార్కిక దృష్టితో పరిశీలించుట వలన గాని లేక రెండు విధానాలను కలిపి పాటించుట వలన గాని తెలుతుంది. అయితే, ఆధ్యాత్మిక దృక్కోణంలో, సృష్టిలోని సత్యం అంతర్ దృష్టి వలన గాని, ఆంతరంగిక అనుభవం వలన కనుగొనబడాలి గాని కేవలం తార్కికమైన, శాస్త్రపరమైన పరిశీలనతో కాదు. తత్వశాస్త్ర విధి అఖండిత జ్ఞానమార్గాల ద్వారా సమకూరిన వివరాల సంకలనాన్ని ఆ ఏకైక సత్యంతో, ఆ ఏకైక పరమోత్తమ సార్వత్రిక యదార్థతతో, అనుసంధించుట. చివరిగా అది ఆధ్యాత్మిక సిద్ధికి మరియు మానవజీవి తన దైవికమైన ప్రకృతిలో భాసించుటకు నిజమైన ప్రయోజనం అందిస్తుంది. విజ్ఞానశాస్త్రం స్వతహాగా విశ్వాత్మను గురించి, ఆతని వ్యవహార శైలిని గురించి విపులమైన వివరాలను అందించగలిగే లోకజ్ఞానంగా పరిణమిస్తుంది. ప్రప్రథమంగా అది కేవలం భౌతికజ్ఞానము, దాని కర్మాచారణ ఫలితాలకో లేక భౌతికశక్తి లేక పదార్థజ్ఞానంపై ఆధారితమైన ప్రాణిక, వ్యక్తిగత, మానసిక విషయ పరిజ్ఞానానికో పరిమితం కాదు. ఆధ్యాత్మికతను సంతరించుకున్న సంస్కృతి నూతన క్షేత్రాలలో పరిశోధనకు అవకాశము కల్పిస్తుంది; నూతన మరియు ప్రాచీన మానసిక శాస్త్ర పరిజ్ఞానము, ఫలితములు ఆత్మ నుంచి ప్రారంభమైన వాటిని ప్రథమ సత్యంగా పరిగణించి, మానసిక శక్తి నుండి, అంతకన్నా మిన్న అయిన దాని నుండి ప్రారంభమై జీవితంపైన, పదార్థంపైన ప్రభావం చూపడానికి అవకాశమిస్తుంది. కళ, సాహిత్యాల

ప్రాథమిక లక్ష్యం సౌందర్య జిజ్ఞాసను సంతృప్తి పరచి, జీవితంపై మేధకున్న భావాలను, వాటికి భావనాశక్తి యొక్క ప్రతిస్పందనలను కళాత్మకంగా రూపొందించే మనిషి యొక్క దివ్యప్రకృతి యొక్క చిత్రాలను సృష్టించడం. అయితే, ఒక ఆధ్యాత్మిక సంస్కృతిలో అవి మనిషిలోను, దివ్యప్రకృతిలోను గోప్యంగా నున్న ఉన్నత విషయాలను, లోతైన ఆధ్యాత్మిక, విశ్వగత సౌందర్యాన్ని కూడ వెల్లడించే లక్ష్యాన్ని నిలుపుకుంటాయి.

రాజకీయాలు, సమాజము, ఆర్థిక వ్యవస్థ మానవజీవిత ప్రాథమిక విధానంలో మనుషుల సమిష్టి జీవనానికి, ఉత్పత్తికి, వారి కోర్కెల సంతృప్తికి, ఆనందానికి, వారి శారీరిక, ప్రాణిక, మానసిక స్థోమత అభివృద్ధికి తోడ్పడే కేవలం ఒక ఏర్పాటు. అయితే, ఆధ్యాత్మిక లక్ష్యం వీటికి మిన్న నైనది. మొదటిది, జీవితానికి ఒక ప్రణాళికను రూపొందించి, దాని పరిధిలో మనిషి తన నిజ ఆత్మను, తన దైవాంశాన్ని అన్వేషించి వాటిలోకి ఎదుగునట్లు చేయుట; రెండవది, జీవితంలో ఉనికిని గురించిన దైవిక ధర్మానికి అధికంగా కట్టుబడి వుండుట; మూడవది, వెలుగు, శక్తి, శాంతి, ఐక్యత మరియు జాతి యావత్తు ఎదగడానికి ప్రయత్నిస్తున్న మానవాళి దివ్యప్రకృతి సామరస్యతల దిశగా సమిష్టిగా ముందుకు సాగుట. ఆధ్యాత్మిక సంస్కృతి అన్నా, జీవితంలో ఆధ్యాత్మికతను పాటించుట అన్నా, అర్థం ఇదే, అంతకు మించి ఎక్కువగాని, తక్కువగాని కాదు.

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మానవజాతి సమస్యలకు పరిష్కారం

ఆధ్యాత్మికోన్నతికి మనిషి ఒక్కసారి తన సమ్మతిని ఇవ్వగలిగితే ప్రతీదీ మార్పుచెందు తుంది. కాని, అతని మానసిక, ప్రాణిక, భౌతికప్రకృతి అందుకొప్పుకోదు. పైగా ఎదురు తిరుగుతుంది. అతను తన మూర్ఖత్వాన్నే ప్రేమిస్తాడు.

దైవమే మన అస్తిత్వపు నైజం. ఈ మనోప్రాణికదైహికాలు దాని కురూపములు, దాని ముసుగులు; కాని స్వరూపమునందు దానికి పాత్రలు. ఆధ్యాత్మికుడవటం మాత్రమే సరిపోదు. అది స్వర్గానికి వెళ్లగలిగే ఎన్నో ఆత్మలను తయారుచేస్తుంది. కాని, ఈ భూప్రపంచాన్ని ఎలా వున్నదో అలాగే వదలివేస్తుంది. అదే కాక, మోక్షం ద్వారా విమోచనం పొందుదామనుకోడం కూడా ఆమోదయోగ్యం కాదు.

ప్రపంచానుభవానికి వచ్చిన విప్లవాలు మూడు. గట్టి ఫలితాన్నిచ్చేవి, భౌతిక పరమైనవి అయితే, నైతికపరమైనవి, మేధాసంపత్తికి సంబంధించినవి, పరిధిలో అపారమైన విస్తృతి కలిగినవై, ఇంకా ఎక్కువ ఫలితాల నొసగగలవి. కాని, ఆధ్యాత్మిక తకు సంబంధించినది శ్రేష్ఠమైన విత్తనాలు నాటడం వంటిది.

ఈ త్రిపుటి (మనోప్రాణికదైహికాలు) మార్పు గనుక ఒక దానితో ఒకటి ఏకమై పరిపూర్ణమైన అనుసంధానంతో జరిగితే దోషరహితమైన పని జరుగుతుంది. కాని, మానవ మనోశరీరాలు అతివేగంతో తోసుకువచ్చే గట్టి ఆధ్యాత్మిక తీవ్రతను పరి పూర్ణంగా పట్టి వుంచలేవు. దానిలో చాలా భాగం తునాతునకలైపోగా, మిగిలినదానితో చాలా మట్టుకు భ్రష్టుపట్టిపోతుంది. ఎన్నో మేధోపరమైన, భౌతికపరమైన మన పృథ్వికి సంబంధించిన విప్లవాత్మకమైన పరిణామాలు జరగడానికి అవసరమైనది, అతిపెద్ద ఆధ్యాత్మిక వ్యవసాయం నుంచి పొందే కొద్ది ఫలితం.

ప్రతి మతం మానవజాతికి ఉపకారం చేసింది. ప్రకృతి ఆరాధననే చెప్పే మతం మానవునిలో సౌందర్యపిపాసను, జీవితంలో విశాలత్వాన్ని, ఉన్నతిని, అనేక రకాలైన పరిపూర్ణతలకు సంబంధించిన లక్ష్యాన్ని అతనిలో ఎక్కువ చేసింది. క్రీస్తుమతం దైవప్రేమ, దాతృత్వాల దృష్టి నిచ్చింది. బౌద్ధమతం వివేకం, నమ్రత, పవిత్రతలతో మహోదాత్తంగా వుండే పద్ధతిని చూపించింది. జూడో మతం, ఇస్లాం మతం మతనిబద్ధ తతో కర్మల నాచరించడం, పరమోత్సాహంతో ఆరాధించడం ఎలాగో చెప్పాయి. హిందూమతం మహోత్కృష్టమైన, ప్రగాఢమైన ఆధ్యాత్మిక అవకాశాలను బహిర్గతం

చేసింది. ఈ దైవపరమైన దృశ్యాలన్నీ ఒకదాని నొకటి పెనవేసుకొని, మరొకదాని లక్షణాలతో మమేకమైపోతే, అప్పుడు అది గొప్ప కార్యానికి శుభారంభమవుతుంది.[1] కాని మేధావుల సిద్ధాంతాలు, మతమౌఢ్యపు అహం దాని దారికి అడ్డు.

మతాలన్నీ ఎన్నో ఆత్మలను ఉద్ధరించాయి. కాని ఏ మతం కూడా ఇప్పటికీ మానవజాతిని ఆధ్యాత్మీకరించ లేకపోయాయి. దానికి మతాల, ఇతర వర్గాల అవసరమే లేదు. కావలసినదల్లా, మొక్కవోని, సర్వసమగ్రమైన ప్రయత్నంతో కూడిన ఆధ్యాత్మిక ఆత్మపరిణామం.

ఈ రోజుల్లో ప్రపంచంలో మనం చూసే మార్పులను వాటి ఆదర్శాలతో, ధోరణులతో పరికిస్తే అవి మేధోపరమైనవిగా, నైతికపరమైనవిగా, భౌతికపరమైనవిగా కనపడతాయి. ఆధ్యాత్మిక విప్లవం తన సమయం కోసం వేచియున్నది. మధ్య మధ్యలో కొన్ని అలలను పైకి ఎగసిపడేస్తున్నది. అది వచ్చేవరకు మిగతావాటి అంతరార్థం అర్థం కాదు. అంతవరకు, ఇప్పుడు జరుగుతున్న విషయాలకు సంబంధించిన అన్నిరకాల వివరణలు, మానవ భవితవ్యం గురించిన భవిష్యవాక్కులు వ్యర్థప్రసంగాలు. ఎందువల్ల నంటే, దాని (ఆధ్యాత్మిక విప్లవం) స్వభావం, శక్తి, గతి రాబోయే మానవజాతికి సంబంధించి నూతన కల్పాన్ని నిర్ణయిస్తుంది.

(SABCL 16:393-94)

శ్రీఅరవిందులు

అనువాదం: డా. టి. ప్రసన్నకృష్ణ

[1] శ్రీమాత వివరణ:
మానసిక చైతన్యంలో ఈ విషయాలు క్రమబద్ధీకరించబడవు, సిద్ధాంతీకరించబడవు. అందుకు అవసరమైనది వీటిని అధిగమించి ఈ ఆలోచనకు వెనుకనున్న భావాన్ని కనుగొనాలి. శ్రీఅరవిందులు ఒక ఉదాహరణను ప్రస్తావించారు. మానవ ప్రయత్నపరంగా, ఆకాంక్ష పరంగా, అనుభవపరంగా ప్రతి మతము దేనికి ప్రతిరూపంగా నిలుస్తున్నదో అది తెలుసుకోవాలి. ఈ మతాలు బయటకి మేధోపరమైన భావనలుగా, కచ్చితమైన నియమాలుగా కనిపిస్తాయి. వీటిని ఆ మాదిరిగా పరిశీలించే బదులు, వాటి అంతర్గత లక్షణాలు, అవి ప్రతిబింబించే సిద్ధాంతాలను బట్టి పరిశీలించినట్లయితే, వాటిని ఏకీకరించుటలో కష్టం వుండదు. అవి పరస్పరం ఒకదాని నొకటి పూర్ణం గావించుకొనే మానవ పురోగతి యొక్క వేర్వేరు అంశాలు.

(CWM 9:75) *అనువాదం: అందుగులపాటి కైలాసపతి*

పూర్ణయోగం అంటే ఏమిటి?

పూర్ణయోగం అంటే ఏమిటి? అది సంపూర్ణ భగవత్ సిద్ధి, సంపూర్ణ ఆత్మోపలబ్ధి, మన అస్తిత్వపు పూర్ణ సాఫల్యం, మన చైతన్యసిద్ధి, మన ప్రకృతి పూర్ణ పరివర్తన. మరో చోట చిరంతన పూర్ణత్వపు సిద్ధి పొందడం కాకుండా, ఇక్కడ ఈ భూమి మీదనే పూర్ణ జీవన పరిపూర్ణత్వం.

ఇదే లక్ష్యం. దీనిని అనుసరిచే పద్ధతి కూడా అదే పూర్ణత్వ స్థాయిలో ఉంటుంది. అనుసరించే పద్ధతిలో పూర్ణత్వం లేకుండా, ఒక పూర్ణలక్ష్యం సాధించలేము. ఆత్మ పరిపూర్ణంగా భగవంతుని వైపు ఉన్ముఖం కావడం, భగవంతునికి ఉన్మీలనం కావడం, మన అస్తిత్వపు ఆత్మార్పణ, ప్రకృతిలో అన్ని భాగాలు సమర్పించుకోవడం, విధానాలు, కదలికలు అన్నీ సమర్పించుకోవడం — వీటివల్ల ఆత్మసిద్ధి సాధ్యపడుతుంది.

మన మనస్సునూ, సంకల్పాన్ని, హృదయాన్ని, జీవితాన్ని, శరీరాన్ని, బాహ్య, అంతర్గత అస్తిత్వాన్ని, మన అతీత చైతన్యాన్ని, మన అవచేతనాన్ని, మనలోని చైతన్యవంతమైన భాగాలను అర్పించుకోవాలి. అవన్నీ ఆత్మసిద్ధికి ఉపకరణాలు కావాలి. పరివర్తనకు, సిద్ధికి క్షేత్రం కావాలి. తేజో ప్రక్రియలో పాల్గొనాలి. మానవ చైతన్యం, ప్రకృతి, దైవ ప్రకృతి చైతన్యంగా మారాలి.

ఇది పూర్ణయోగ లక్షణం.

*

పూర్ణయోగం అనేక పార్శ్వాలుగల ఏకైక ఆత్మవికాసం, ప్రకృతి అభివృద్ధి. దీని ఫలితంగా పూర్ణ దివ్యసత్యం యొక్క ఏకైక సర్వాంగీణ సంసిద్ధి. పూర్ణ దివ్య అను భవం. సమస్త అస్తిత్వపు, ప్రకృతిలోని ప్రతి విభాగపు పూర్ణ పరివర్తన, మార్పు కూడా అందులో భాగమై ఉంటుంది. అజ్ఞానమయమైన మానవ మనో, ప్రాణిక, భౌతిక ప్రకృతిలోని భాగాలన్నీ ఒక దానితో ఒకటి ముడివేయబడిన సమాహారం మన అస్తిత్వం. అది అతిమానస, ఆధ్యాత్మిక చైతన్య స్రవంతిగా పరివర్తన చెందు తుంది. అనంత విశ్వజనీన, సర్వ సంపూర్ణ సంకల్పం, ప్రేమ, ఆనందం, జ్ఞానం — వాటి సామరస్యపు దివ్య ఐక్యతా రాగంగా మారుతుంది.

*

విశ్వాన్ని గూర్చి విపులీకరిస్తూ, ఆధ్యాత్మిక పరిణామమనే ప్రముఖ సత్యం మన

జీవితానికి పరమార్థమని చెప్పాను.

అది శిఖరారోహణ ధారావాహిక. భౌతిక రూపం, చైతన్యం నుండి ప్రాణిక శ్రేణి, జీవాత్మతో అస్తిత్వం ప్రభావితం అయివుంటుంది. అక్కడ నుండి పూర్తిగా వికాసం చెందిన మనిషిలో సిద్ధించిన మానవశ్రేణి. అక్కడ నుండి మనసు పైన గల పరిపూర్ణ చైతన్యానికి ప్రయాణం. అటు పిమ్మట అతిమానస చైతన్యంలోకి, అతిమానస అస్తిత్వంలోకి, సత్యచేతనలోకి అధిరోహణ. అది ఆధ్యాత్మిక అస్తిత్వపు పూర్ణచైతన్యం.

మనస్సు మన చివరి చైతన్య స్ఫ్పృహగల అభివ్యక్తీకరణ కాదు. ఎందుకంటే మనస్సు మూలతత్వంలో జ్ఞానం కోసం అన్వేషించే అజ్ఞానం. ఒక అతిమానస సత్యచైతన్యమే మనకు పూర్ణ ఆత్మజ్ఞానాన్ని, ప్రపంచ జ్ఞానాన్ని అందివ్వగలదు. దీని ద్వారానే మన నిజమైన అస్తిత్వాన్ని చేరుకోగలం. అప్పుడే ఆధ్యాత్మిక పరిణామం సఫలీకృతం అవుతుంది.

*

నా యోగం మాత్రమే అన్ని కోణాలలో సరి కొత్త యోగమని నేను అనలేదు. దానిని పూర్ణయోగం అని అన్నాను. దాని అర్థం పాత యోగాలలోని సారం, వివిధ ప్రక్రియలు తనలో జీర్ణం చేసుకొంటుంది.

నేను ప్రతిపాదించిన యోగం ఏదో వినూత్నమైనది అని నేను ఎన్నడూ అనలేదు. దానిని పూర్ణయోగమని అన్నాను. దాని అర్థం అది ప్రాచీన యోగాల సారాన్ని, పద్ధతులను స్వీకరిస్తుందని. కొత్తదనం దాని లక్ష్యంలో ఉంది. దాని దృక్పథంలో ఉంది. దాని ప్రక్రియ సర్వస్వంలో ఉంది.

పాత యోగాల పునరుక్తి నా దృష్టిలో చాలదు. ఇంతవరకు ఎవరూ సాధించలేని దానిని సాధించాలని నా ఉద్దేశం. గతకాల ఆధ్యాత్మిక ప్రయత్నాల సహజమైన, రహస్యమైన నిర్దేశిత ఫలితమే అయినా ఇంతవరకు దానిని ఎవరు సమగ్రంగా దర్శించలేదు.

పాత యోగాలతో పోల్చితే అది కొత్తది — 1) ఎందుకంటే ప్రపంచాన్ని, జీవితాన్ని దాటి స్వర్గానికో, నిర్వాణానికో అది ప్రయాణించదు. కాని జీవిత, అస్తిత్వాలను మార్చడం దాని లక్ష్యం. యాదృచ్ఛికమో, నిమ్నస్థితియో కాదు. సుస్పష్ట, కేంద్రీయ లక్ష్యం అదే. ఇతర యోగాలలో అవరోహణ ఉంటే, అది కేవలం మార్గంలో యాదృచ్ఛికమే లేదా ఆరోహణ నుండి ఫలితంగా వస్తుంది. ఆరోహణే ముఖ్యం. ఈ యోగంలో

అధిరోహణమే మొదటి సోపానం. కాని అది అవరోహణకు సాధన మాత్రమే. అధిరోహణ వల్ల కొత్త చైతన్యం అవరోహిస్తే, అదే సాధనకు ముద్ర! ముడి. తంత్ర, వైష్ణవ మతాలు జీవితం నుండి విముక్తితో ముగుస్తాయి. దీనిలో జీవన సాఫల్యతే లక్ష్యం.

2) వ్యక్తి కోసం వ్యక్తిగతంగా ఆత్మసిద్ధిని పొందడం లక్ష్యం కాదు. కాని భువన చైతన్య వికాసం కోసం లబ్దిని పొందడం ప్రధాన లక్ష్యం. అది విశ్వజనీనమైనది. విశ్వాతీతమైనది కాదు.

భువన-ప్రకృతిలో నేరుగా క్రియాదీప్తంకాని ఒక చైతన్యశక్తి ప్రవాహాన్ని (అతిమానస) భువికి అవరోహింప చేయడం లక్ష్యం. ఆధ్యాత్మిక జీవనంలో సైతం ఇంకా వ్యవస్థీకృతం చేసి, నేరుగా క్రియాదీప్తం చేయవలసి యున్నది.

3) ఒక సమగ్రమైన, పూర్ణమైన లక్ష్యం నిర్దేశించుకొని, ఆ ప్రయోజనాన్ని సాధించడానికి ఒక విధానాన్ని ప్రకటించడం (వాగ్దానం చేయడం) ఈ యోగంలో నూతనాంశం. ప్రకృతి, చైతన్యం సర్వ సమగ్ర పరివర్తన కోసం పాత పద్ధతులు చేపట్టి, కర్మలో భాగం చేసి, ఇతర పద్ధతులను ప్రస్తుత సహాయ హస్తంగా పరిగణించడం ఇందులో ముఖ్యాంశాలు. ఈ పద్ధతి పాతయోగాలలో ప్రతిపాదించలేదు, సిద్ధించలేదు. నేను కనుగొని వుంటే, మార్గాలను నిర్మిస్తూ, నా కాలాన్ని వృథా చేసుకొని వుండేవాడిని కాను. గత 30 సంవత్సరాల అన్వేషణలు, అంతర్గత సృష్టిలో నా లక్ష్యాన్ని అతి తేలికగా, భద్రంగా ఇంతకు ముందే వున్న ప్రజలకు చూపిన మార్గాలలో, పరిపూర్ణమైన పద్ధతిలో నేను త్వరగా చేరి వుండేవాడ్ని.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

ఆధ్యాత్మిక జీవితం ఎలా జీవించాలి?

ఆధ్యాత్మిక జీవితం జీవించడమంటే మనిషి తనలో ఉన్న ఇంకొక ప్రపంచానికి తెరుచుకోవడమే. అది మనిషి చైతన్యాన్ని అటు నుంచి ఇటు మార్చడం. సాధారణ మానవుని చైతన్యం, అత్యంత అభివృద్ధి చెందినవారిలోనైనా, గొప్ప ప్రతిభావంతులలోనైనా, అంతే కాదు గొప్ప గుర్తింపు గలవారిలోనైనా సరే, ఒక బహిర్ముఖమైన కదలిక. శక్తులన్నీ బహిర్ముఖంగా నిర్దేశింపబడినవే. మొత్తం చైతన్యం బహిర్ముఖంగా వ్యాప్తి చెందినదే. ఏదైనా అంతర్ముఖమయిందంటే, అది చాలా తక్కువ, చాలా అరుదు. కించిత్ భాగం మాత్రమే, ఏవో ప్రత్యేక పరిస్థితులలోనో, తీవ్ర అఘాతం సంభవించి నందువల్లనో జరుగుతుంది. చైతన్యం యొక్క బహిర్ముఖ కదలికలు కొంతవరకైనా మార్పు చెందుతాయనే ఉద్దేశంతో జీవితం కల్పించే అఘాతాల వలన కూడా సంభవిస్తుంది.

ఆధ్యాత్మిక జీవితం గడిపిన వారందరూ ఈ అనుభవం పొందినవారే. ఒక్కసారి హఠాత్తుగా వారి అస్తిత్వంలో ఏదో అటు నుంచి ఇటు మారినట్టు అనిపిస్తుంది. హఠాత్తుగా ఒకోసారి పూర్తిగా అంతర్ముఖమైపోయినట్లు, అదే సమయంలో ఉన్నత దిశగా పరిణామం జరుగుతున్నట్లు, అంతర్ముఖంగా ఉన్నతమైన మార్పు చెందినట్లుగా అనిపిస్తుంది. అయితే అది బాహ్యంగా, 'పైకి' కాదు. భౌతికంగా బయటికి తెలిసే ఔన్నత్యాలు కావు. వాటికంటే వేరైన ఏవో ఇతరమైన ఉన్నతస్థాయిలో అంతర్ముఖంగా లోలోపల, లోతుగా జరిగే పరిణామం.

ఎప్పుడైతే జీవిలో ఇలా పూర్తిగా మార్పు సంభవించిందో, అక్కడితో అంతా ముగిసిపోయినట్టే. ఇంక మనిషి అన్వేషించేదేమీ లేదు. కేవలం గమనించడమే. ఇంక రాబట్టవలసినది ఏమీ ఉండదు, అంతా తెలుసుకోబడేదే. ఎంత మాత్రం పాకులాడ నక్కర లేదు, నేరుగా గమ్యం చేరుకోవటమే. ఎప్పుడైతే ముందుకు పోయాడో పరమ సత్యమొక్కటే పని చేస్తుందని, పరమేశ్వరు డొక్కడే సంకల్పిస్తాడని, తెలుసుకుంటాడని, ఆచరిస్తాడని, ఇదంతా మనుషుల ద్వారా జరుగుతుందని తెలుసుకొని అందులో జీవిస్తాడు. అప్పుడు తప్పు జరిగే అవకాశంఎలా ఉంటుంది? దైవం చెయ్యాల్సిందేదో చేస్తాడు. ఎందుచేతనంటే అదే చెయ్యాలని ఆతడి సంకల్పం గనుక.

మన తప్పుడు దృష్టికి ఇవన్నీ అర్థం కాని పనులే. కాని వాటికో అర్థముంది, ఒక లక్ష్యముంది. ఎక్కడికి చేర్చాలో అక్కడికి కొనిపోతాయి.

*

నీ ఆలోచనల్ని అదుపు చెయ్యడం ద్వారా వాటిని నీ సాధన వైపు మళ్లించడం ద్వారా, నీ కార్యకలాపాలను నియంత్రించడం ద్వారా, వాటిని కూడా సాధన వైపు మళ్లించడం ద్వారా, అన్ని కోరికలను, పనికిమాలిన బాహ్యంలో చేసే సాధారణ చర్యలకు ఉద్వాసన చెప్పడం ద్వారా, ప్రగాఢమైన అంతరంగ జీవనం ద్వారా, సాధారణ విషయాలు, సాధారణ ఆలోచనలు, సాధారణ ప్రతిచర్యలు, సాధారణ కార్యకలాపాల నుండి నిన్ను నీవు దూరం చేసుకోవడం ద్వారా, నీకు అనువైన వాతావరణాన్ని నీ చుట్టూ సృష్టించుకోగలవు.

ఉదాహరణకు, ఏదో అక్కర్లేని విషయం చదవడం, పనికిమాలిన బాతాఖానీ కొట్టడం, ఏదో ఓ పని చెయ్యడానికి బదులు, దివ్యమార్గాన్ని అనుసరించడానికి తోడ్పడే పుస్తకాలే చదవవచ్చు. దైవాన్ని గుర్తించడానికి తోడ్పడే మార్గంలో నడిపించగలిగే పనులు మాత్రమే చెయ్యాలి. కోరికలు, ప్రలోభాలు, బాహ్యవిషయాలకి సంబంధించిన వాటి మీదకి దారితీసే ఆలోచలను మానుకుని, నీ మానసిక జీవిని ప్రశాంతంగా ఉంచాలి. ప్రాణిక జీవిని శాంతపరచాలి. బయటి నుంచి ప్రవేశించే వ్యతిరేక భావాల్ని నిరోధించాలి. నీ చుట్టూ వున్న మనుషుల కార్యకలాపాలను పట్టించుకోవద్దు. ఈ విధంగా ఎవరూ నీ జోలికి రాకుండా, ఏదీ నిన్ను ప్రభావితం చెయ్యలేని ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించుకోవాలి. అప్పుడు ఏ పరిస్థితులలోను, ఎప్పటికీ దేనిమీదా ఆధారపడని, స్వేచ్ఛగా పనిచేసే ఆధ్యాత్మిక వాతావరణంలో జీవించగలవు. ఎందుకంటే నీ ఆద్యాత్మిక వాతావరణ ఆవరణలో నువ్వు సురక్షితంగా ఉంటావు. అలా అటువంటి వాతావరణాన్ని ఏర్పరుచుకోగలరు. దృష్టిని సంపూర్ణంగా ఆధ్యాత్మిక దిశగా మళ్ళించుకుని, ఆధ్యాత్మిక జీవితానికి దోహదపడే విషయాలు మాత్రమే చదువుతూ, ఆధ్యాత్మిక జీవితం వైపు నడిపించే పనులు మాత్రమే చేస్తూ, నీకు కావలసిన వాతావరణాన్ని నీవు సృష్టించుకోగలవు. కాని సహజంగా, నువ్వు అన్ని ద్వారాలు తెరిచిపెట్టినట్టయితే, జనాలు చెబుతున్నదంతా వింటూ, వీళ్లు చెప్పింది అనుసరిస్తూ, వాళ్ళ స్ఫూర్తిని తీసుకుంటూ, బయటి విషయాలపై కోరికలతో నిండి వుంటే, నీ కోసం నువ్వు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించుకోలేవు.

మిగిలిన వాళ్ళకు లాగే నీకు కూడా సాధారణ వాతావరణమే మిగులుతుంది.

*

ఒక యోగికి అవసరమయిన, నిజమైన ఏకైక లక్షణ మేమిటంటే, కావలసిన విధంగా మలచుకోగల తత్వంతో, దివ్యాజ్ఞను శిరసావహించుటకు సిద్ధంగా ఉండటం — ఆ ఆజ్ఞ ఏదైనా సరే. అతనికి ఏదీ విడిచిపెట్టలేనిది కాదు. ఏదీ బరువు కాదు. తరచుగా ఆధ్యాత్మిక జీవితం గడపాలనుకునేవాళ్ళ ప్రథమ ప్రేరణ సర్వాన్ని వదిలివేయాలని వుంటుంది. అది దైవానికి సమర్పించడానికి కాదు, తమకున్న భారం నించి విముక్తులు కావడానికి. సిరిసంపదలున్నవారు, ఖరీదయిన వస్తువులు కలిగి విలాసాలకు అలవాటైన వారు, దైవం వైపు దృష్టి మరలగానే వాటి నుంచి దూరంగా పారిపోవాలనుకుంటారు, లేదా వాళ్ళు చెప్పేదేమిటంటే తాము బంధాలనించి తప్పుకుంటున్నామని. కాని అలా అనుకోవడం తప్పు. నీ దగ్గరున్న ధనం, వస్తువులు నీకు చెందినవి అని అనుకోకూడదు. అవి దైవానివి. అనుభవించమని పరమాత్మ ఆజ్ఞాపిస్తే వాటిని అనుభవించు, కాని మరుక్షణం సంతోషంగా నవ్వుతూ విడిచిపెట్టి రావడానికి సిద్ధంగా ఉండాలి.

ప్రశ్న: ప్రియమాతా. మా నిజమైన ఆధ్యాత్మిక జీవితం ఎక్కడ ప్రారంభమవుతుంది?

సమా: మనిషి తన చైత్యపురుషలో గల దివ్యత్వంతో అంతరంగ సమాచార వ్యవస్థ ఏర్పరుచుకున్నప్పుడు నిజమైన ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమవుతుంది. చైత్యపురుషుడి దివ్యసమక్షాన్ని చైతన్యంలో అనుభవించినప్పుడు, నిరంతరం చైత్యపురుషునితో సంభాషణ చేయగలిగినప్పుడు ఆధ్యాత్మిక జీవితం ప్రారంభమవుతుంది. అంతకు ముందు కాదు. అసలైన ఆధ్యాత్మిక జీవితమది

చైత్యపురుష సత్తతో మనిషి ఐక్యమైనప్పుడు, దివ్యసమక్ష చైతన్యం కలిగినప్పుడు, దివ్యసమక్షం నుండి తన పనికి ప్రేరణ పొందినప్పుడు, తన సంకల్పం భగవత్సంకల్పంతో కలిసి పనిచేయడానికి సంసిద్ధమైనప్పుడు, అదే ఆధ్యాత్మిక జీవితపు మొదటి అడుగు అవుతుంది.

అంతకు ముందు సాధకుడు కేవలం ఆధ్యాత్మిక జీవితాన్ని ఆకాంక్షించేవాడే గాని ఆధ్యాత్మిక జీవితం జీవిస్తున్నవాడు కాదు.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి



ఆధ్యాత్మిక పునర్జననం

ఆధ్యాత్మిక పునర్జననమంటే గత సాంగత్యాలను, పరిస్థితులను నిరంతరంగా విస ర్జించుతూ, క్షణక్షణం క్రొత్త జీవితాన్ని ప్రారంభించడం లాంటిది. అది గత కర్మబంధం లేకుండా జీవించటం. మరో విధంగా చెప్పాలంటే ప్రకృతి యొక్క కార్యకారణ సంబంధం నుండి విముక్తి పొందటం. ఈ విధంగా, గత కర్మలు, సాంగత్యాల స్మృతుల నుండి విజయవంతంగా బయటపడినప్పుడు, వాటిల్లో దొర్లిన పొరపాట్లు, అనాలోచిత చర్యలు, తప్పులు, అవివేక కర్మలు ఏవైతే మన స్మృతులలో కొన సాగుతుంటాయో, రక్తం పీల్చే జలగల్లాగా మనలను పట్టి పీడిస్తుంటాయో, వాటి నుండి విముక్తి లభించి స్వేచ్ఛానందాన్ని పొందగలం. ఈ విముక్తి కేవలం ఊహాతీత మైనది మాత్రమే కాదు, అది సారభూతమైన ధృఢమైన నిజం. మనం నిజంగా సర్వస్వతంత్రులం; మనల నేదీ బంధించలేదు, ప్రభావితం చేయలేదు, ఏ బాధ్యత ప్రభావానికీ లోను కాము. మనం గతాన్ని నిరర్థకం గావించాలన్నా, కేవలం పశ్చా

త్తాపం లాంటి వాటితో ప్రయోజనం లేదు. జ్ఞానసమృద్ధమైన స్మృతిపథంలో, గత కర్మబంధాల నుండి విడివడాలి, మార్పుచెందని గతం అసలు ఉండిందా అనే విషయం మరిచిపోవాలి. పునర్జననమంటే, మొదట మనం దైవంతో మమేకమై, గతకర్మ ప్రతిక్రియను నుండి శాశ్వతంగా ముక్తమవ్వాలి. మానసిక శక్తిని గురించి అవగాహన లేకుండా, అది చేయలేము. ఒక్కసారి మనలో భగవదర్పితమైన అంత రాత్మను గురించిన ఎరుక కలిగినట్లయితే, సర్వబంధ విముక్తి లభిస్తుంది. ఆ స్థితిలో కొత్త జీవితం ప్రారంభమవుతుంది. అప్పుడు గతమనేది మనలను అంటిపెట్టుకుని వుండదు. ఆధ్యాత్మిక పునర్జననము పతాకస్థాయిలో ఎలా పరిణమిస్తుందంటే, విశ్వం మొత్తం క్షణక్షణం అంతమవుతూ క్షణక్షణం సృష్టించబడుతుండటం లాంటి అనుభవం సంప్రాప్తిస్తుంటుంది.

శ్రీమాత

అనువాదం: రామినేని సుందరరామయ్య


శ్రద్ధాంజలి

శ్రీయుతులు కర్రా వేంకటేశ్వర్లుగారు, 'అఖిల' మాజీ సంపాదకులు, 2013 డిసంబరు 8 న శ్రీమాతారవిందుల సన్నిధిని చేరుకున్నారు.

శ్రీ వేంకటేశ్వర్లుగారు 1930 జూన్ 3 న విజయనగరంలో జన్మించారు. వారు చిరకాలం ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, D.E.O గా విద్యా రంగంలో సేవలందించి పదవీ విరమణ గావించారు. మొదటి నుండి శ్రీమాతార విందుల ప్రబోధాలకు ప్రభావితులై, ఆ స్ఫూర్తితో విజయనగరంలో శ్రీఅరవిందో సొసైటీ కేంద్రం స్థాపించి, కార్యదర్శిగా శ్రీమాతారవిందుల ఆదర్శాలను ప్రజా బాహుళ్యంలో విస్తృత ప్రచారం గావించుటకు జీవితాంతం శ్రమించారు. శ్రీమాతారవిందుల సేవలో భాగంగా 'అఖిల' మాసపత్రికకు 2006 నుండి 2011 వరకు సంపాదకులుగా వ్యవహరించారు. ఆ విధంగా శ్రీమాతరవిందుల సాహిత్య సంపదను తెలుగు పాఠకులకు అందించటంలో కృతకృత్యులైనారు. వారి అనువాదాలు, రచనా శైలి సంచికను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుటకు తోడ్పడి, పాఠకుల మన్ననలను పొందాయి. 'అఖిల' కార్యవర్గంతో పాటు, పాఠకలోకం వారి స్మృత్యార్థం శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

శ్రీమాత శారీరక యోగసాధన

1956-1973



అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2014

పరిచయ వాక్యాలు

1956-73 మధ్య కాలంలో శ్రీమాత తమ శిష్యుడైన సత్-ప్రేమ్‌తో, ఎన్నో విష యాలతో పాటు, ఆ సమయంలో తమకు కలుగుతున్న యోగానుభవాల్ని గురించి కూడా తరచూ ప్రసంగిస్తుండేవారు. ఈ పర్యాలోచనలు లేక అనుభవాలు, ఈ వ్యాఖ్యలు ఈ రూపాంతరీకరణ మార్గంలో సంకేతాతాత్మక సూచనల లాంటివి — దైహికంగా కొనసాగే యోగప్రక్రియలను స్థిరపరచేవి. ఒక విధంగా ఇవి ఇంకా చేయవలసిన ప్రయత్నాల గురించిన సూచనలని కూడా అనవచ్చు.

ఈ ప్రసంగాలను సత్-ప్రేమగారు గ్రంథస్తం గావించి, 12 సంపుటాలుగా ఫ్రెంచి భాషలోను, ఆంగ్లంలో 'ది మదర్స్ అజెండా' అనే పేరుతో ప్రచురించారు.

శ్రీమాత స్వయంగా తమ యోగం గురించి చేసిన వ్యాఖ్యానాలను ఆ సంపుటముల నుండి ఇటీవలి కాలంలో సంగ్రహించడమైనది. నూతన దివ్యచైతన్య ఆవిష్కరణకు అనువైన విధంగా తమ దేహాన్ని స్థిరపరచుట కోసం ఆమె చేపట్టిన యోగాభ్యాసానికి చెందిన అంశాలు 2012 డిసెంబరు మాసంలో రెండు సంపు టాలుగా — ఒకటి 422 పేజీలు, రెండవది 460 పేజీలు — 'ది మదర్స్ యోగ, 1956-73' అన్న పేరుతో ప్రచురించబడ్డాయి.

ఈ రెండు సంపుటాలలోని కొన్ని భాగాలను ఎంపికచేసి ఈ సంచికలో ప్రచు రించడమైనది.



శ్రీమాతారవిందుల దర్శనము

మొదటి అతిమానస సాక్షాత్కారం

(ఆశ్రమ క్రీడాప్రాంగణంలో 1956 ఫిబ్రవరి, 29 నాడు జరిగిన సామూహిక ధ్యాన సమావేశంలో జరిగినది)

ఫిబ్రవరి 29, 1956

ఈ సాయంకాలం వాస్తవికమైన, భౌతికమైన దివ్యసాక్షాత్కారం మీ మధ్యన ఆవిష్కృతమయ్యింది. నేను విశ్వాన్ని మించిన స్వర్ణాకృతిని దాల్చి ఒక బ్రహ్మాండమైన, దృఢమైన స్వర్ణమయ ద్వారానికి ఎదురుగా నిలుచున్నాను. ప్రపంచాన్ని దైవం నుండి వేరు చేసే ద్వారం అది.

ఆ ద్వారాన్ని చూస్తున్నప్పుడు ఒక తృటిమాత్ర ప్రేరణతో నాకు అవగాహన కలిగి స్థిరపరచుకున్నాను, 'సమయం ఆసన్నమయింది' అని. రెండు చేతులతో ఒక బలమైన బంగారు సుత్తిని ఎత్తి ఆ ద్వారంపై ఒక వ్రేటు, ఒకే ఒక వ్రేటు వేసాను. ద్వారం వ్రయ్యలయింది.

వెంటనే అతిమానస దివ్యకాంతి, దివ్యశక్తి, దివ్యచేతన ఒక అవిచ్ఛిన్న ప్రవాహంలా భువిపైకి లంఘించింది.

(Vol. 1, p. 69)

సెప్టెంబరు 29, 1956

...ఒక కాంతి; అది అతిమానసపు బంగారు వన్నె గల కాంతి లాంటిది కాదు, కాని ఒక రకమైన ఉష్ణరహిత ప్రకాశం. రాత్రి వేళ అయినట్లయితే అది భౌతికంగా కనిపించేదని అనుకుంటాను.

...అది నా భౌతిక శరీరం కన్నా సాంద్రమైనది: భౌతిక శరీరం నాకు దాదాపు అవాస్తవమైనదిగా తోచింది — లేశమాత్రమైనదిగా, వ్రేళ్ళ సందుల గుండా జారిపోయే ఇసుక రేణువుల లాంటిదిగా.

...నేను అవాక్కయిపోయాను: మాటలు ఎంతో అల్పమైనవిగా, సంకుచితమైనవిగా, జ్ఞానశూన్యమైనవిగా అనిపించాయి.

...దానిని సిద్ధింపచేసుకొనడానికి క్రమానుసారంగా చోటు చేసుకున్న ఏర్పాట్లను,

కొన్ని పూర్వ అస్తిత్వాలలో నేను గమనించాను.

నాకు అనేకానేక శిరస్సులున్నట్లు అనుభూతి కలిగింది.

...ఫిబ్రవరి, 29 న కలిగిన అనుభవం సాధారణమైనది, కాని ఇది మాత్రం ప్రత్యేకంగా నా కోసమే ఉద్దేశించబడినది.

...ఇది నా కెన్నడూ కలుగని అనుభవం.

...అతిమానస శరీరం ఏ విధంగా నుంటుందో నేను చూడటం ప్రారంభమయింది.

...దైవికమైన సృష్టిధర్మం భౌతికచేతనతో సంయోగమందిన సమయంలో నాకు దాదాపు ఈ విధమైన అనుభవమే కలిగింది. అయితే అది గ్రహించ వీలుగానంతటి సూక్ష్మ మైనది. కాని ఈ అనుభవం మాత్రం భౌతికమైనది — శరీరంలో చోటు చేసుకున్నది.

...ఈ అనుభవం నేను పొందినది కాదు, నేను గ్రహించినది కాదు. నేనే అది.

...అది నా నుండి ప్రసరించింది: వేల వేల మిణుగురు రవ్వలు అందరిలోకి చొచ్చుకపోయాయి. అక్కడ వున్న ప్రతి ఒక్కరిలోకి ప్రవేశించడం నేను చూసాను.

... మరొక అడుగు.

(Vol I, p. 85)

సెప్టెంబరు 16, 1958

(శ్రీమాత తాము దర్శించిన మంత్రముల గురించి ప్రస్తావించారు)

అయితే ఇప్పుడు దర్శనం కాబోతున్న దేమిటి? నాకు ఈ సంస్కృత మంత్రం ఎడతెగకుండా వినిపిస్తుంది:

'ఓం నమో భగవతే'.

అది నన్ను నలువైపులా పరివేష్టించి యున్నది, అన్ని జీవకణాలను అంటిపెట్టుకొని యున్నది. ఒక్క ఉదుటున అవన్నీ ఊర్ధ్వదిశగా ఎగిసిపడుతున్నాయి. వాటితో పాటు నారదుల మంత్రం కూడా:

'నారాయణ, నారాయణ...'

(నిజానికి అది ఒక దైవ ఆజ్ఞాపన. దాని అర్థం: 'ఇప్పుడు నేను కోరినట్లు నీవు

చేయాలి' అని. అయితే అది హృదయం నుండి వచ్చింది కాదు.)

అయితే, అది ఏమై ఉంటుంది?

అది కేవలం ఓ మెరుపులా తటాలున ఎగిసిపడుతుంది; అత్యంత శక్తివంతమైనది. శక్తి మాత్రమే దేనినైనా చేయగలదు. ప్రేమ, ఇసుకలో పారే నీటిలా అదృశ్యమవుతుంది. మనుషులు దివ్యానంద పారవశ్యంలో నిలుచుండిపోతారు... ఏదీ చలించదు! శక్తి అవసరమవుతుంది — శివునిలా వివిద భంగిమలలో తాండవమాడుతూ...

నాకు ఈ మంత్రదర్శన మయినప్పుడు, దానికి స్వాగతం, వీడ్కోలు పలికితే, అందులో అర్థం: 'స్వాగతం: దైవం ఉనికి ఇక్కడ వున్నది, దివ్యకాంతి ఇక్కడ విల సిల్లింది', వీడ్కోలు: 'నేను వెళ్ళడం లేదు, నేను ఇక్కడనే ఉంటాను' అని.

అయినా, నాకు ఈ మంత్రదర్శన మయినప్పుడు ఏదో జరుగుతుందని నా నమ్మకం.

ప్రస్తుతానికి, అది సూత్రాలు, మంత్రాల లోకి, మన శరీరంపైన సూటిగా ప్రభావం చూపేది, అన్ని కణాలను అంటిపెట్టుకొనేది, తక్షణమే ఇలా చేసేది, (శరీరాన్ని ముందుకు, వెనుకకు, అటూ ఇటూ కదలిస్తారు) ఈ సంస్కృత మంత్రం, 'ఓం నమో భగవతే'.

నేను ధ్యానానికి కూర్చున్న వెంటనే, కేంద్రీకరించడానికి ప్రశాంతమైన ఒక్క క్షణం దక్కిన వెంటనే అది మొదలయ్యేది ఈ మంత్రోచ్చారణతోనే. శరీరంలోను, శరీరకణాల్లోనూ ఒక ప్రతిస్పందన కలుగుతుంది: వాటిలో కదలికలు ప్రారంభమౌతాయి.

'నమో' అనే పదంలోని మొదటి అక్షరం హ్రస్వాక్షరంగా ఉచ్ఛరించబడుతుంది — 'నఃమో' లో 'న' లాగా; చివరి పదం 'భ-గ-వ-తే' గా ఉచ్ఛరించబడుతుంది.

ఈ విధంగా జరిగింది: ఒకతను పెట్టె నిండా సామాన్లతో తిరిగివచ్చి వాటిని నాకు చూపించడం ప్రారంభించాడు. అలా చూపిస్తుంటే అతని ఉత్సాహం మితిమీరి వాతావరణం ఉక్కిరిబిక్కిరిగా తయారయింది. నాకు తలనొప్పి పుట్టింది, అసహ్యా మేసింది. తదుపరి ఆ స్థితి నివారించుటకు ధ్యానించాలని కూర్చోగానే మంత్రం ప్రారంభమయింది.

అది ఇక్కడి నుండి ఆవిర్భవించింది (శ్రీమాత తమ నాభి చక్రాన్ని చూపిస్తారు) ఈ విధంగా, ఓం నమో భగవతే, ఓం నమో భగవతే. అది చాలా తీవ్రంగా సాగింది. ఆ ధ్యానం కొనసాగిన పావుగంట సేపు, అంతా దివ్యకాంతితో నిండిపోయింది!

చిక్కటి ఛాయ వున్న చోట, అది బంగారు పూత పూసిన కంచులా, కొన్ని చోట్ల దాదాపు ఎఱ్ఱగా, ఛాయ ఉజ్వలంగా వున్న చోట స్ఫటికంలా తెల్లగా మెరుస్తుండింది. **ఓం నమో భగవతే, ఓం నమో భగవతే.**

మరో రోజున (పైనున్న స్నానాల గదిలో నేనున్నప్పుడు) అది సాక్షాత్కరించింది. అది నా శరీరాన్నంతా ఆక్రమించింది. ఆ విధంగానే దీప్తివంతమయింది. నా శరీరంలోని కణాలన్నీ కంపించసాగాయి. ఎంత శక్తివంతంగా అనుకున్నారు! అందువలన అన్నింటిని, అన్ని కదలికలను ఆపివేసాను. ఆ ప్రకంపన స్థాయిని పెరగనిచ్చాను. ఆ ధ్వని విస్తరిస్తున్నకొద్దీ ప్రకంపనలు కూడ విస్తరిస్తున్నాయి, విశాలమవుతున్నాయి. శరీరకణాలన్నీ తీవ్ర ఆకాంక్షతో నిండిపోయి... శరీరమంతా ఉబ్బిపోయినట్లుగా — భరించలేనంతగా; శరీరం పెట్లిపోతుందేమో అనుకున్నాను.

ఆ స్థితిలో జీవనం కొనసాగించడానికి గాను అన్నింటి నుండి తమను తాము ఉపసంహరించుకున్నవారిని అర్థం చేసుకున్నాను.

దానికి ఎంతో రూపాంతరీకరణ గావించే శక్తి ఉంది! అది మరింతగా కొనసాగినట్లయితే, ఏదో జరుగుతుందని, శరీరకణాల సమతుల్యతలో మార్పు లాంటిది — నాకు అర్థమయింది.

దురదృష్టవశాత్తు నేను దానిని కొనాసాగించ లేకపోయాను. కారణం... నాకు సమయం లేకుండింది — బాల్కనీ దర్శనానికి ముందుగా సంభవించినందువలన, నాకు ఆలస్యమయ్యేటట్లుండింది. నా కెవరో చెప్పినట్లనిపించింది, 'అది చేయడానికి ఏమీ లేనివారికి ఉద్దేశించబడింది' అని. అప్పుడు అనుకున్నాను, 'నేను నా పనికి చెందినదానిని' అని. నెమ్మదిగా వెనక్కు తగ్గాను, బ్రేకులు వేసాను. ఆ కార్యక్రమం అంతటితో ఆగిపోయింది. కాని మిగిలిపోయిందేమిటంటే, ఎప్పుడు ఈ మంత్రం పునశ్చరణ చేసినా... అన్నీ కంపించడం ప్రారంభమౌతుంది.

అందువలన ప్రతివారు వారిపై వ్యక్తిగతంగా పనిచేయగలిగేదేదో దానిని కనుగొనాలి. నేను భౌతికస్తరంలో జరిగేదానిని గురించి మాత్రమే చెపుతున్నాను. ఎందుకనగా, మానసికంగాను, ప్రాణికంగాను జీవి యొక్క అంతరంగ భాగాలన్నింటిలోను ఆకాంక్ష సర్వదా స్వయం సిద్ధమై వుంటుంది. నేను భౌతిక స్తరం గురించి మాత్రమే చెపుతున్నాను.

అందుకని, నీ మంత్రాలకు, నీవు వాటితో ఏమి చేయదలచావో అన్న దాని

మీద అంతా ఆధారపడి వుంటుంది. నేను ఒక చిన్న మంత్రానికే మొగ్గు చూపుతాను, ముఖ్యంగా బహుసంఖ్యాకంగాను, అతి సహజంగాను పునరుక్తం చేయబడాలని అనుకునేవి — ఒకటో, రెండో పదాలు లేక మూడు పదాలు మించనివి. ఎందుకంటే, వాటిని మీరు అన్ని సందర్భాలలో వాడగలగాలి. ఉదాహరణకి, ఒక ప్రమాదం సంభవించ బోతున్నప్పుడు, అది ఆలోచించకుండా, అప్రయత్నంగా, స్ఫురించి, తటాలున పైకి రావాలి. అది లోనుండి అతి సహజంగా, ఓ ప్రతిస్పందనలాగా, వెలువడాలి. అప్పుడే మంత్రానికి సంపూర్ణ శక్తి కలుగుతుంది.

నా విషయంలో, ఏ రోజుల్లోనైతే నాకు ప్రత్యేకమైన కార్యక్రమాలుగాని ఇతర అడ్డంకులుగాని లేకుండా వుంటాయో (నేను మామూలు రోజులు అని అనేవి, నేను మామూలుగా వుండే రోజులు) ఆ రోజుల్లో నేను చేసే ప్రతి పనీ, నా శరీర కదలికలన్నీ, నేను పలికే మాటలన్నీ, నా చేష్టలన్నీ ఈ మంత్రంపైనే ఆధారితమై వుంటాయి.

'ఓం నమో భగవతే... ఓం నమో భగవతే'

అన్ని వేళల్లో, అన్ని కాలాల్లో

ఇది మామూలు పరిస్థితి. ఇది సూక్ష్మ భౌతిక వాతావరణాని కన్నా తీవ్రమైన, అధిక వాస్తవికమైన వాతావరణాన్ని కలుగజేస్తుంది. అది ఎలాగుంటుందంటే... ఒక మాధ్యమం నుండి ప్రసరితమయ్యే ఉష్ణరహిత ప్రకాశంలా ఉంటుంది. అంతే గాక అది ఒక గొప్ప కర్మాచరణను, అతి గొప్ప కర్మాచరణను గావించవలసి వుంటుంది: అది ఒక ప్రమాదాన్ని నివారించగలదు. అంతేగాక, అది నిన్ను సర్వదా అంటిపెట్టుకొని వుంటుంది.

కాని దానితో నీవేమి చేయాలనుకున్నావో, నీవే తెలుసుకోవాలి.

సత్-ప్రేమ్: ఆకాంక్షను నిలుపుకొనడానికి, గుర్తుంచుకొనడానికి — మనం అతి సులభంగా మరిచిపోతాం గనుక —ఒక విధమైన అలవాటుగా, స్వయం చాలకంగా పనిచేసేదిగా, ఏదైనా...?

శ్రీమాత: నీవు దర్శించినవి, నీకు సజీవ అనుభూతిని కలిగించినటువంటి మంత్రాలు నీ వద్ద లేవా? లేక ఆ మంత్రాలు దీర్ఘమైనవా?

సత్-ప్రేమ్: అవును, అవి దీర్ఘమైనవే. అతను నాకు శ్రీమాత మంత్రమేదీ ఇవ్వలేదు. ఆ మంత్రాలున్నాయి గాని, నాకు ఏమీ ఇవ్వలేదు. నాకు తెలియదు, నాపై వాటి ప్రభావం ఎక్కువగా లేదు. అది ఏదో అత్యంత మానసికమైనది.

శ్రీమాత: అందువల్లనే అది నీలో నుండే వెలువడాలి.

(నిశ్శబ్దం)

ఈ మంత్రం, 'ఓం నమో భగవతే', నాకు కొంత కాలం తరువాత దర్శనమయింది. కారణం, నా కనిపించింది... నాదైన మంత్రం నా కవసరమని తలచాను, అనగా ఒక అనుకూలమైనది, దేహంతో ఈ లోకంలో నిర్వహించవలసిన పనితో సామరస్యత గలది. సరిగ్గా ఆ సమయంలోనే అది దర్శనమయింది. నిజానికి, అవసరానికి అందిన సమాధానంగా దానంతట అది సమకూరింది. అందువలన, అవసరమని నీవు భావిస్తే నీ బుర్రలో కాదు, ఇక్కడ (శ్రీమాత హృదయం మధ్య చూపిస్తారు), అది వచ్చి తీరుతుంది.

ఒక రోజున, అయితే నీకు మాటలైనా వినవస్తాయి లేదా అవి నీ హృదయం నుండి పొంగి పొర్లుతాయి... అదే గనక జరిగితే, దానిని నీవు అంటిపెట్టుకోవాలి.

(Vol I, p.194)

జూలై 24-25, 1959

శరీరంలోనికి అతిమానసశక్తి యొక్క మొదటి చొరబాటు.

ఒక వాస్తవికమైన, శాశ్వతమైన సూక్ష్మభౌతిక శరీరంలో శ్రీఅరవిందులు సజీవులై ఉన్నారు.

(Vol. I, p.194)

ఏప్రిల్ 13, 1962

(నెల రోజుల విపత్కర పరిస్థితి గడిపిన అనంతరం శ్రీమాత ఒక అసాధారణమైన నిశ్చితమైన అనుభవానికి లోనై, మొదటిసారి వారి సందేశాన్నిచ్చారు. ఆమె మిద్దెపై తన గదిలో మంచంపై విశ్రమించి వున్నారు. చిక్కి శల్యమైపోయారు. ఉదయం షుమారు 10 గంటలైంది. దూరాన స్కూలు పిల్లల ఆటల సందడి వినవస్తుంది. ఆమె కంఠస్వరంలో చాలా మార్పు కనిపిస్తున్నది.)

రాత్రి నాకు విశ్వయోగమని మనం పిలిచే దానిని గురించి సంపూర్ణ అవగాహన కలిగి హఠాత్తుగా మేల్కొన్నాను. దివ్యప్రేమ లయబద్ధంగా స్పందిస్తూ సాక్షాత్కరిస్తుండింది. ప్రతిస్పందన ప్రపంచాన్ని దివ్యప్రేమలో మరింత ముందుగు

కొనివస్తున్నది. అవి నిత్యసత్యమైన అత్యద్భుత దివ్యప్రేమ యొక్క ప్రతిస్పందనలు, కేవలం దివ్యప్రేమవి. దివ్యప్రేమ సాక్షాత్కారంలోని ప్రతిస్పందన విశ్వాన్ని మరింత ముందుకు కొనిపోతున్నది.

చేయవలసిన కార్యంచేయబడిందనే ధృఢవిశ్వాసంతో పాటు అతిమానస సాక్షాత్కారం కూడా సిద్ధించింది.

ప్రతిదీ దివ్యపురుషునికి చెందినదే; ఏదీ వ్యక్తిగతమైనది కాదు.

ఇది కొనసాగుతుండింది, అవిచ్ఛన్నంగా.

చేయవలసిన కార్యం చేయబడిందనే ధృఢవిశ్వాసం సమకూరింది.

అసత్యం వలన కలిగిన పరిణామాలన్నీ అదృశ్యమయినాయి. మరణం, అస్వస్థత, అజ్ఞానం ఒక భ్రమగా, ఒక అవాస్తవికతగా, ఉనికి లేనివిగా అనిపించాయి... కేవలం దివ్యప్రేమ, దివ్యప్రేమ మాత్రమే ఉండింది — అపారమైనది, తీవ్రమైనది, అత్యద్భుతమైనది, సర్వాన్ని కూడగట్టుకున్నది.

ఏ విధంగా, ప్రపంచంలో ఏ విధంగా వ్యక్తపరచాలి? వైవిధ్యం మూలాన అది అసాధ్యంగా కనిపించింది. అయితే తరువాత సాధ్యపడింది: ఈ లోకం అతిమానస సత్యాన్ని తెలుసుకోవాలని నీవు అంగీకరించావు... "అది తప్పకుండా. సంపూర్ణంగా, సమగ్రంగా అభివ్యక్తమవుతుంది". అవును, అవుతుంది.

కార్యం నెరవేరింది

(సుదీర్ఘ నిశ్శబ్దం)

వ్యక్తిగత చైతన్యం తిరిగి కలిగింది. అది ఒక పరిమితిని గురించిన భావన. బాధ యొక్క పరిమితి. ఆ చైతన్యం లేని వ్యక్తి ఉండడు.

విజయం తథ్యమనుకుంటూ, మళ్ళీ ప్రయాణం సాగిస్తాం.

స్వర్గధామాలు విజయధ్వానాలతో మార్మోగుతున్నాయి

సత్యమొక్కటే నిలిచి వుంటుంది. సత్యమొక్కటే సాక్షాత్కరించాలి. ఇంకా ముందుకు, ముందుకు పోదాం!

ఓ జగదీశ్వరా, ప్రణామాలు. జగత్ ప్రభూ, నీకు జయం.

(నిశ్శబ్దం)

ఇక ఇప్పుడు పని ప్రారంభిద్దాం.

ఓర్పు... సహనం... సంపూర్ణ సమభావన, అచంచల విశ్వాసం.

(నిశ్శబ్దం)

నేనేమి చెప్పినా, అనుభవాన్ని మించింది ఏమీ లేదు. ఏమీ లేదు, మాటలు తప్ప మరేమి లేదు.

మన చేతన గూడా అలాంటిదే. పూర్తిగా భగవంతుని చైతన్యం లాంటిదే. అందులో మార్పు లేదు. ఏ మాత్రం మార్పు లేదు.

మానవుడే దేవుడు, మానవుడే దేవుడు, మానవుడే దేవుడు.

(నిశ్శబ్దం)

తరువాత మరింత విపులంగా చెప్తాను. ఉపకరణం ఇంకా సిద్ధంగా లేదు. ఇది ప్రారంభం మాత్రమే.

(*శ్రీమాత తరువాత ఈ మాటలు జోడించారు.*)

ఈ అనుభవం కనీసం నాలుగు గంటల పాటు ఉండింది. చాలా విషయాలున్నాయి. వాటిని గురించి తరువాత చెప్తాను.

Vol. 3: p. 131)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

డిసెంబరు 21, 1963

నా క్రియాశీల చైతన్యంలోని సూక్ష్మ మైన అత్యవసరమైన, స్పష్టతతో కూడిన మనోదృశ్యం గల వివేచనాశక్తిని తుడిచివేయాలనే భావనను ఏదో అదృశ్యశక్తి కలిగిస్తూ వుంది. ఆ మనోదృశ్యం, సూక్ష్మదర్శినిలో స్పష్టంగా కనిపించేటంత స్పష్టమైనదిగా నుంది. అనవసరమైన వాటిని వదిలించుకొనడానికి ఇది తోడ్పడుతుంది. కాని ప్రస్తుతం దీనిని మరుగున పరచి, క్రియాశీల చైతన్యాన్ని స్వయంగా నిరంతరం, ప్రత్యేకంగా అవసరమైనదానిని మాత్రమే గుర్తించాలనే సంకల్పం ఒకటి ఏర్పడింది.

దీని అర్థం, తీసివేయడానికి, తిరస్కరించడానికి, పరివర్తన గావించడానికి, నిర్మాణం గావించడానికి కదలిక లున్నాయని, నిర్మాణాత్మక కదలికలను చేపట్టడానికి సమయ మాసన్న మైందని.

శారీరక చేతన ఇంకా బెరుకుగానే వుంది; ఎంత బెరుకుగా నంటే, తనపై తనకు ఇంకా నమ్మకం కుదరలేదు. నిరంతరం జాగరూకతతో, మెలకువగా, గమనిస్తూ,

పరిశీలిస్తూ వుండకపోతే అభ్యంతరకరమైన భావాలు తన మనసులో దూసుకు పోతా యేమో అనే భావన దానికి కలిగింది. ఈ భావనే ఆటంకమైపోతుంది. అందుకే జాగ్రదావస్థలో మెళకువతో నుండాల్సిన అగత్యం మరింతగా ధృవపడింది. విమర్శ అవసరం లేదు. గమనించకూడని వాటిని గమనించకు — గమనించవలసిన వాటినే గమనించు.

అదే పొందవలసిన విజయం — గొప్ప విజయం.

ఆగష్టు 7, 1965

ఈ ఉదయం దాదాపు ఓ గంటసేపు ఒక అనుభవం కలిగింది: భౌతికమైన మనస్సు యొక్క నిజమైన వైఖరి, నిజమైన పాత్రను గురించి — ఆచరణలో, ఆలోచనలో కాదు, ఆసక్తికరంగా వుండింది. ఓ రకమైన ఆనంద తన్మయత్వం... అది మనోనిశ్చలత్వానికి, బాహ్యం నుండి ప్రసరించి అనుక్షణం దానిని కదిలించే (లేక ఎప్పుడు కదిలించకూడదో అప్పుడు కదిలించే అలవాటున్న) భావజాలానికి మధ్య నున్న సంబంధం. అటువంటి అనుభవాలు కలిగాయి. వాటిలో మొదటిది మీ తోటి సంబంధం; అనారోగ్య స్థితి నుండి ఏ విధంగా బయటపడాలి, చైతన్యం ఎలా వికసించాలి, మీ అస్తిత్వం యొక్క సంపూర్ణ సంయమనం ఎలా సమకూరాలి, ఈ నూతన అనుభవం దాని నంతా ఎలా మార్చగలదు, అనే వాటిని గురించి.

ఆ ఆలోచన ఓ గంట సేపు కొనసాగింది. అది ఉదయం నాలుగున్నర, ఆరుగంటల మధ్య కలిగింది.

అయితే అది చాలా ఆసక్తికరంగా నుండింది! నాకు తెలుసొచ్చింది:నాలో నేనిలా అనుకున్నాను 'జీవితం ఇలా ఎప్పుడూ కొనసాగితే మనం దేనిని గురించైనా ఎందుకు ఫిర్యాదు చేయాలి'.

జీవితంలో సరిపడని, దుఃఖకారకమైన ప్రభావాలన్నీ అంతరించిపోవుటయే గాక, (మామూలు పరిభాషలో బాధ అంతరించిందని) జీవియొక్క పురోగతికి ఆత్మ చైత న్యంతో తోడ్పడితే అది ఎంత అద్భుతంగా నుంటుంది!

నేను మాట్లాడేటప్పుడు అది అనుభవాన్ని ఆపుతుంది. అది పునరావృతం కావడానికి నేను కొంతసేపు ఆగాలి. అయితే అది అదే మాదిరిగా పునరావృతమవదు. దాని అర్థం ఆ రోజు కలిగిన అనుభవం ఆ రోజుతోనే సరి. నేను దానిని ప్రస్తావించాను.

ఇక అది అంతటితో సరి. నేను అంతకన్నా మెరుగైన అనుభవం కోసం ముందుకు సాగాలి. మాట్లాడకుండా ఉన్నట్లయితే, ఆ అనుభవాన్ని కొంతకాలం నిలుపుకోవచ్చు — దాని ప్రభావం అంతరించే వరకు. మాట్లాడగానే దాని కాలం తీరిపోతుంది. అది గతంతో కలిసిపోతుంది. నూతనానుభవం కోసం ముందుకు సాగవలసిందే.

ఏదో శక్తి నన్ను నూతనానుభవం వైపుకి ఎల్లప్పుడూ నెట్టుతూ వుంటుంది — ఒక్కో అడుగు ముందుకు నెట్టుతుంటుంది. మంచిదే!

సత్-ప్రేమ్: అది దేనిని గురించి? అది భౌతికమైన మనస్సు పనేనా?

అమ్మ: అది ఒక మనోవైఖరి.

సత్-ప్రేమ్: అది భౌతికమైన మనోభావనేనా?

అమ్మ: అది మనోభావనే. కాని కావాలని కోరినది కాదు. లేక సమిష్టిగా వాంఛించినది కాదు. ఆలాంటిదేమీ కాదు; కేవలం అది తనకు తానుగా అర్థం చేసుకున్నది.

అది నిశ్శబ్దంగా వుంటూ కార్యాచరణ గావించుట నేర్చుకున్నది. నిశ్శబ్దంగా నుంటూ కార్యాచరణ గావించుట ఎంత అభినందనీయం!

(నిశ్శబ్దం)

నేను దానిని వ్యక్తపరచినపుడల్లా, అది గతంలోకి దూరంగా జరిగిపోతుంటుంది. (శ్రీమాత సత్-ప్రేమ వైపు చూసి) ఏదో అడగాలనుకున్నావు? అడుగు.

సత్-ప్రేమ్: నేను అడగాల్సిన ప్రశ్న ఏమీ లేదు. మీరు చెపుతున్న దాంట్లో లీనమైపోయాను.

(శ్రీమాత కొనసాగించారు)

భౌతిక మనస్సు ఒక దీర్ఘమైన వృత్తాకారం బోలి వుంటుంది. దాని ననుసరించడం ఎంతో శ్రమ, విసుగుతో కూడుకున్న పని. అయినా కొన్ని వారాలుగా దాని దైనందిన కార్యక్రమాన్ని, యాంత్రికంగా కొనసాగే పనులను అనుసరించడం ప్రారంభించాను. నేను చాలా సార్లు చెప్పాను, ఈ భౌతిక మనస్సు ఓటమి వైపే దారితీస్తుందని, ఎల్లవేళలా నిరాశావాది అని, అనవసర జోక్యం చేసుకుంటుందని, సణుగుతుంటుందని, అసంతృప్తి, అపనమ్మకం, అవిశ్వాసాలకు సతమతమవుతుంటుందని. ఒక వేళ ఎప్పుడైనా సంతృప్తిపడి సంతోషంగా వుండే సందర్భం వచ్చినా వెంటనే దానికి, "ఇక చాల్లే ఆపు, ఏదో ఆపద మళ్ళీ దాపురిస్తుంది" అనే భావన కలిగి ఖిన్నపరుస్తుంది. ఈ విధంగా రోజులు, వారాలు నిరంతరమైన పనిలో గడిచిపోయాయి. చివరకు

ఎల్లప్పుడూ ఆత్మనివేదనతో ముగిసిపోయేది. ముందుకు సాగే అవకాశం మొదలయ్యే ముందు, ఏం జరిగిందో అంతా చెప్పాలి. ఉదాహరణకు, జపము, మంత్రోచ్చారణ ఒక నియమావళిగా ప్రారంభమై, ఒక సంతృప్తి కలిగిన స్థితికి మారింది. (అయినప్పటికీ విధి నిర్వహణా బాధ్యత కొనసాగింది). అక్కడి నుండి అది ఒక విధమైన అవిచ్ఛిన్న సంతృప్తి స్థితిగా మార్పుచెంది, ఆ స్థితి తరచుగా, నిరంతరం, మరింత సమగ్రంగా కలుగుతుండాలనే కోరిక (మామూలు కోరిక కాదు. కాని ఒక సంకల్పం, ఒక ఆకాంక్షగా) కూడా కలిగింది. అటు పిమ్మట ఈ స్థితిని అస్థిరపరచుటకు తటస్థించే ఆలోచనలనుగాని ఇతరమైన వాటినిగాని అసహ్యించుకొని నిరాకరించుటతో పాటు పనులపైనా, మనుషులపైనా కర్తవ్య నిర్వహణ బాధ్యతా భావన ఉదయించి ఒక గందరగోళ పరిస్థితికి దారితీసింది. చివరిగా అది ఎప్పుడూ పరిస్థితులు మంచిగా మారాలనే ఆకాంక్షతో దైవానికి అర్పించటంతో ముగిసేది. ఇదంతా ఒక దీర్ఘకాల అభివృద్ధి ప్రణాళిక.

ఈ మధ్యనే, కేవలం దైవసంకల్పానికి అనుగుణంగానో లేక వలిత్రీకరించబడి నందువలననో ఓర్పుతో అంగీకరించబడిన కార్యాల పట్ల సమత్వభావన కనబరచాలనే ఒక విధమైన సంకల్పం కలిగింది. ఇంతలోనే ఒక స్వేచ్ఛాయుతమైన మనఃపూర్వక స్థితి వలన కలిగిన భావనతో, కార్యాచరణ ఏ వైఖరితో గావించాలో అర్థం కావడం మొదలై, ఆ కార్యాలు అభ్యుదయాత్మకమైనవిగా తోచినవి. ఇదంతా చాలా క్రమానుసారంగా చోటు చేసుకుంది. అటు పిమ్మట ఈ ఉదయం ఈ అనుభవం కలిగింది.

(నిశ్శబ్దం)

ఆ అనుభవాన్ని ఈ విధంగా వ్యక్తపరచవచ్చు: నిశ్శబ్దం వుండగల శక్తిని అలవరచుకోవటం: పై నుండి దివ్యప్రేరణ కలిగినప్పుడు మాత్రమే ఏ విషయాలలోనైనా జోక్యం చేసుకోవటం; ఏ పనిలోనైనా, అది దివ్యజ్ఞాన ప్రేరితమైనప్పుడు మాత్రమే జోక్యం చేసుకోవటం.

దీని వలన ఈ భౌతిక మనస్సు యొక్క ప్రయోజన మేమిటో సరిగ్గా అర్థమయింది. ఎందుకనగా, చైతన్యంలో ఏదో ఒక మూల శ్రీఅరవిందుల వాక్యం ప్రతిధ్వనిస్తుంటుంది. దాని ప్రకారం భౌతిక మనస్సు ఒక అసాధ్యమైన పరికరం. దానిని బహుశా వదిలించుకోవాలి కాని అది వదలకుండా వున్నది. ఏదో పొరపాటున్నదని అనిపించింది: ఎంతగా విమర్శించినా, ఎంతగా నివేదించినా, ఎంతగా చీదరించుకున్నా, ఎంతగా తిరస్కరిం

చినా, అది భద్రంగా నిలిచి వుంది. అయితే, అది నెమ్మది నెమ్మదిగా పరివర్తన చెందుతున్నది. ఇప్పుడు మొదటి అడుగు పడింది, పరివర్తన పథంలో తొలి అడుగు — దాని యాంత్రిక కార్యాచరణ ఆగిపోయిన అనుభవంతో, అనగా మానసిక వికల్పం అంతరించి మనస్సు ప్రశాంత పడ్డది.

ఇది నాకు ఉదయం కలిగిన అనుభవం.

ఇదే ఆఖరి స్థితి అని నేను అనటం లేదు. ఆ స్థితికి చాలా దూరంగా ఉన్నాము. అయితే, అది మరింత అదుపులో వుందని అనవచ్చు. ఈ భౌతిక మనస్సు నిలిపివేత బహుశా గంటా రెండు గంటలు కొనసాగి వుండవచ్చు. నాకు సరిగ్గా గుర్తు లేదు, కాని దాని కార్యాచరణ అంత యాంత్రికంగా మాత్రం లేదు, అన్ని విషయాలు నిశ్చేష్టగా పడిపోయే లాంటి మానసిక స్తబ్దత, మీకు తెలిసే వుంటుంది; దానిని ఇప్పుడు ఈ భౌతిక మనస్సుతో సాధించవచ్చు. అది నిశ్చేష్టగా పడిపోతుంది.

ఇది ప్రారంభం మాత్రమే, కేవలం ప్రారంభం.

అయితే, అది రూఢి అయిందని నిశ్చయమయింది. అది కొన్ని నిముషాల పాటు జరిగినా, అంతకన్నా ఎక్కువ సమయం కొనసాగ గలదని నిశ్చయంగా చెప్పవచ్చు. పర్యవసానంగా, ఈ భౌతిక మనస్సు పరివర్తన చెందే దానిలో ఒక భాగమవుతుంది.

ఆ స్థితి మనకు గొప్ప శక్తి నిస్తుంది. అది ఆగిపోయినప్పుడు, దివ్యప్రేమ ప్రకంపనలు సమృద్ధిగా అభివ్యక్త మవుతాయి.

అది ఈ ఉదయం అత్యంత మహిమాన్వితంగా సంభవించింది.

ఈ విషయాన్ని గూర్చి తరువాత ఆలోచిద్దాం.

జనవరి 21, 1967

ఇదమిద్ధంగా చెప్పలేని విషయమేదో జరుగుతున్నది.

ఈ శరీరం దాని పనులను అది యాంత్రికంగా, సహజంగా, అలవాటుగా చేసుకొని పోతుంటుంది. దానికి వాటి యొక్క ప్రాముఖ్యతగాని, ఉపయోగంగాని పట్టవు. ఏవి ముఖ్యమైన విషయాలు, ఏవి ఆసక్తికరమైన విషయాలు అనే మానసిక లోక ప్రాణిక విచక్షణాదృష్టి దానికి లేదు. అయితే, జీవకణాలు ఇప్పుడు చైతన్యవంతంగా ఎదిగి, నిలకడగా నిలుచుని, తాము ఎలా పనిచేస్తున్నది తమను తాము గమనించడం

ప్రారంభించాయి. "దీనంతటి ప్రయోజన మేమిటి?" అని ప్రశ్నించుకుంటున్నాయి. పిమ్మట ఒక ఆకాంక్ష కలిగింది: "ఏ విధంగా, నిజంగా విషయాలు ఏ విధంగా నుండాలి? మా ప్రయోజనమేమి, మా ఉపయోగమేమిటి, మా మూలమేమిటి? మా జీవనాధారము, మా జీవన ప్రమాణము ఎలా గుండాలి?" ఈ ప్రశ్నలను మానసికంగా వ్యక్తపరిచినప్పుడు, ఈ విధంగా అనవచ్చు: "మాకు దైవికస్థితి అబ్బినట్లయితే, మేమెలాగుంటాము? ప్రస్తుత స్థితికి దైవికస్థితికి మధ్య వ్యత్యాసమేమిటి? దైవికస్థితి ఎలాగుంటుంది?" ఇలా అనుకునేది, ఆలోచించేది వేలకొలది చిన్న చిన్న కణాలతో కూడిన ఒక భౌతిక సముదాయం. అయితే ఏ ఒక్క కణానికి ఒక ప్రత్యేకత లేదు. అన్నీ కలసికట్టుగా వుంటేనే, ఒక కార్యాచరణకు ఆధారభూతంగా వున్నప్పుడే, వాటికి సార్థకత ఏర్పడుతుంది, ఆలోచనాశక్తి ఏర్పడి ఒక ఏకత్వస్థితి సిద్ధిస్తుంది.

ఆ స్థితి ఏమిటి అనేది ఇంకా అనిర్వచనీయమే. ఈ అన్వేషణలో ఒక అవిచ్ఛిన్నమయిన అవగాహన, ఒక దృశ్యమాన భూమిక, అనేక రంగుల కలయిక గల వెలుగు గోచరిస్తుంది. ఆ రంగులు దొంతరలుగా ఏర్పరచబడి లేవు, వివిధ రంగుల చుక్కల సమాహారంగా వుండింది. సుమారు రెండు సంవత్సరాల క్రితం కొందరు తాంత్రికులను కలిసినప్పుడు అలాంటి వెలుగును నేను చూసాను. అది భౌతిక ప్రపంచాన్ని తాంత్రికులు గమనించే 'తాంత్రిక వెలుగు' లాంటిది అని అనుకున్నాను. కాని ఇప్పుడు నాకు అది నిరంతరం కనిపిస్తున్నది, అన్నింటిలోను కనిపిస్తున్నది. బహుశా అది పదార్థమును దాని అసలు రూపంలో చూడటమేమో. సాధ్యమైనన్ని అనేక రంగులు ఒక్కటిగా కూర్చబడినా ఒక దానితో ఒకటి కలిసిపోకుండా, మెరిసే చుక్కల్లా ఒక్క చోట కనిపిస్తున్నాయి. ప్రతి పదార్థము ఇదే విధంగా తయారయినట్లుగా అనిపిస్తున్నది. నే నింకా నిర్ధారణకు రాలేదుగాని బహుశా ఇదే ఆ స్థితి యొక్క అసలు స్వరూపమేమో! ఏది ఏమైనా అది దాని యొక్క మరికొంత చైతన్యవంతమైన లక్షణం.

కళ్ళు మూసినా, తెరచినా నే నెల్లప్పుడూ అదే చూస్తున్నాను. ఇది దేహానికి సంబంధించిన చిత్రమైన అవగాహన. అదే సమయంలో సున్నితత్వం, మార్పు చెందుటకు అవకాశం కలిగించే రూపం. ఆకృతుల బిరుసుతనంలో కొంత తగ్గుదల కూడా ద్యోతకమవుతుంది. దేహానికి సంబంధించి మొదటిసారిగా ఇటువంటి మార్పే కనిపిస్తోంది. దేహం ఇది వరకులా కాక ఏదో సున్నితమైన మార్పులకు లోనవుతున్న



ట్లుగా వుంది. మనం స్థిరమైన స్థితిని నిలుపుకుంటే దేహం తన పూర్వపు కఠినత్వాన్ని మార్చుకొని మెత్తబడి తన రూపం మార్పునకు అవకాశాన్ని కల్పిస్తున్నట్లున్నది.

బహుశా ఇదే భౌతికస్థాయిలో దైహిక మార్పునకు అవకాశం కలిగించటం కావచ్చు. అనగా, పూర్వపు బిరుసుతనం ఇప్పుడు మెత్తబడి మార్పునకు అవకాశ మివ్వడమన్న మాట. ఇది మొదట్లో చాలా విచిత్రంగా కనిపిస్తుంది, కాని శరీరం మార్పుచెందడానికి కొంచెం కొంచెంగా అలవాటుపడుతూ వుంది. కష్టతరమైన దేమిటంటే, ఒక స్థితి నుండి మరొక స్థితికి మార్పుచెందే క్షణం. ఈ మార్పులన్నీ క్రమక్రమంగా చోటు చేసుకుంటున్నా, కొన్ని సెకన్ల పాటు "ఊహించ లేకపోయామే" అని అనుకునే స్థితి మార్పు జరిగే క్షణంలో చోటు చేసుకుంటుంది.

ఈ విధంగా పాత అలవాట్లు, అనుభవాలు పూర్తిగా అంతరించిపోతాయి. ఈ మార్పు అన్ని విషయాల్లోను సంభవిస్తుంది — రక్తప్రసారం, జీర్ణక్రియ, శ్వాస — అన్నింటిలోను. అయితే మార్పు జరిగే క్షణంలో, ఒక దాని స్థానంలో మరొకటి తటాల్న వచ్చి కూర్చుంటుందని కాదు, రెండింటి మధ్య ఒక విధమైన స్వేచ్ఛా చలన స్థితి ఏర్పడుతుంది... కష్టమంతా అక్కడే వుంది. కేవలం ఆ భగవంతుని పైనుండే అచంచలమైన ప్రకాశవంతమైన, నిరంతర, స్థిరమైన ధృడవిశ్వాసం. ఆతని యదార్థ ఉనికి యందలి విశ్వాసం వలన మాత్రమే ఈ వ్యవహారమంతా యథాతథంగా కొనసాగుతుంది.

ఈ మార్పు కోసం ఇప్పటి వరకు ఎన్నో ప్రయత్నాలు సముద్రపు అలల లాగా ముందుకు వచ్చి, వెనక్కి తగ్గినట్లు, సర్వసాధారణ అస్తిత్వ పోకడలు, అలవాట్లు, కదలికలు ఎన్నో చోటు చేసుకున్నాయి. దేహము, దేహచైతన్యము యావత్తు గత మార్గాలలోకి తిరోగమించి భద్రతకు భంగం వాటిల్లకుండా చూసుకొన్నది. అయితే ఇప్పుడు, శరీరానికి ఆ విధంగా చేయకూడదని నచ్చచెప్పడం జరిగి, "సరే, ఇక అంతరించడమే జరగాలంటే, అంతరించడమే జరగనీ", అని సమాధాన పడుతుంది. ఏదైతే అదే కానీ అనే అంగీకారానికి వచ్చింది.

భౌతికమనస్సులో ఇలా జరిగినప్పుడు (కొన్ని సంవత్సరాల క్రిందనే ఇది జరిగిందని గమనించాను) మానసికంగా మనుషులు తాము పిచ్చివాళ్ళమై పోతున్నా మేమో అనే భావన కలిగి, వారు భయభ్రాంతు లవుతారు. (భయం వలన అలా జరుగుతుంది.) అందుకని తమను తాము రక్షించుకోవటానికి సహజ జ్ఞానాన్ని

ఆశ్రయిస్తారు. భౌతికంలో జరిగేదానికి ఇది సమానం. మామూలుగా వుండే నిలకడను కోల్పోయిన అనుభూతి కలుగుతుంది. అందుకే చాలా కాలం మనస్సు తన గత కాలపు అలావాట్ల వెనుక దాక్కోవటానికి ప్రయత్నిస్తుంది. అప్పుడు నీవు ప్రశాంతంగా వున్నా ననుకుంటావు, కాని జీవకణాలు ఈ పాత పద్ధతిని ఇంకా సహించే స్థితిలో లేవు. "ఏది ఏమైనా సరే, ఈ మార్పు యొక్క పర్యవసానం చూడాల్సిందే" అనే నిర్ణయాని కొచ్చాయి. ఇదొక గొప్ప సాహసం.

దీని వలన మన మెలా ఉండబోతున్నాము? ఎలా ఉండబోతున్నాము? అని మన మనుకుంటే, జీవకణాలు "మేమెలా ఉండాలి? మేమెలా ఉంటాము?" అని అడుగుతున్నాయి.

ఇది గొప్ప ఉత్కంఠ గొలిపే స్థితి.

(Vol. 8: p. 30)

జనవరి 24, 1968

అంతరంగికంగా సంపూర్ణ మార్పు సంభవిస్తున్నది... మనం చూస్తాము. మన మింకా మార్పు చోటు చేసకుంటున్న సమయంలోనే ఉన్నాము.

యాంత్రికంగా మార్పు లేకుండా ఉండే స్థితి మారిపోతూ వుందని, నా గట్టి నమ్మకం. ఇది మొట్టమొదట మారుతుంది, ఈ యాంత్రికంగా మార్పులేని స్థితి ఏదైతే గతంలో అవసరమయిందో... మీ కర్థమయిందా, మామూలు భౌతిక జీవనం అధికంగా యాంత్రికంగా నుండేది; సరే, ఆ స్థితి ఇప్పుడు అంతరిస్తున్నది. ఈ యాంత్రిక భౌతిక పరిస్థితి మారితే గానీ మనం క్రొత్త మానసిక యుగంలోకి అడుగు పెట్టలేము. అయితే ఈ మార్పు చెందటం కష్టతరమైన పని. అదీ అసలు విషయం.

(Vol. 9, p. 34)

అనువాదం: రామినేని సుందరరామయ్య

ఏప్రియల్ 23, 1968

అది చాలా చాలా కుతూహలం కలిగించే విషయం, చాలా వింతైన విషయం. విచిత్రమైన సంవేదన... అది ఆ విధంగా ఎంత సేపు ఉందో, నాకు తెలియదు, చాలా సమయం, కాని గత కొన్ని దినాలుగా అది చాలా తీవ్రతరం అవుతూ,

ఎంతో కచ్చితంగా ఉంది... ఆ సంవేదన ఈ విధంగా ఉంది (శ్రీమాత సందిగ్ధ స్థితిలో వేలాడుతున్నట్లుగా సంజ్ఞ చేసారు), అస్తిత్వం పాత విధానం నుండి మరలి పోయినట్టుగా (అది వ్యక్తిగతంగా కాదు — భూమండలం మొత్తానికి సంబంధించినదని అనుకోవచ్చు), చిట్టచివరి అంచుకు చేరినట్లుగా — చిట్టచివరి అంచునే చేరింది — నవ్య పద్ధతి కలిగిన అస్తిత్వంలోకి ప్రవేశిస్తున్నట్లుంది; ఆ అస్తిత్వ సంవేదన... ఈ విధంగా అంటూ (అదే సంజ్ఞను రెండు ప్రపంచాల మధ్య వేలాడుతున్నట్లుగా చూపిస్తారు).

పూర్తిగా పాతపద్ధతిలోని అస్తిత్వం (అనుభూతి కలిగే పద్ధతి, ఆలోచనా విధానం, చైతన్యస్థితి కూడా) చూడబడింది... అది అంత కచ్చితంగా, ఏదో వికృతంగానూ లేక దోషభూయిష్టంగానూ కాదు, కాని ఏదో అటువంటిదే — కాని అది కాదు: అది మానవ పద్ధతిలోని అస్తిత్వం. అది తప్పనిసరిగా తీవ్రమైన మానసికాభివృద్ధి ఫలితంగా రూపుదిద్దుకున్న అస్తిత్వ పద్ధతి.

వృద్ధి పొందుతున్నదేదో సుస్పష్టం — మహాచైతన్యం. అది మాటలలో ఏ మాత్రం వివరించి చెప్పలేనిది లేక నిర్వచించలేనిది లేక... ఏ మాత్రం అది కాదు, అది — మహాచైతన్యం (లేదా ఏదో ఒక మాదిరిగా ఒకరికి అది ఏమిటో అనుభూతి కలుగుతుంది) అది మహాచైతన్య స్థితి. కాని అది ఇంకా ఖండ చైతన్యం, అది (నేను ''ప్రయత్నం చేస్తున్నాను' అని చెప్పలేను, ఎందువల్లనంటే అక్కడ ప్రయత్నమంటూ ఏమీ లేదు), అది సంపూర్ణ చైతన్యంలోకి మార్పు చెందుతున్నది. కనుక అది సంధి స్థితి (అదే వేలాడుతున్న సంజ్ఞ). అయినప్పటికీ అది ఇంకా చైత న్యమే (కచ్చితంగా అది ప్రత్యేకమైనదీ, వ్యక్తిపరమైనదీ కాదు, కాని ముక్కలుగా ఉన్నది లేక ఇంకొక విధంగా చెప్పాలంటే, అది ఇంద్రియ గోచరం), అది ఒక చైతన్యం, తాను సంయోగమనే గమనం 'ఎరుకను' కలిగింది. అది ఇంకా అదే, పూర్తి సంయోగం కాదు.

కాబట్టి అది అన్ని విధాలైన అనుభవాలకు ఆలవాలమైంది.

అది (ఆ కొత్త స్థితి) ఏకాగ్రత వలన సిద్ధించినది కాదు లేక మరే విధంగానూ కాదు: అది అస్తిత్వం సహజ పద్ధతి, చిట్టచివరి మార్పులేని స్థితి. కాని అక్కడ ఇంకా విభజన లున్నాయి, అంటే అది ఏ విధంగా ఉందంటే ఒక చైతన్యం మరొకదాన్ని పరిశీలిస్తున్నట్లుగా ఉంది, మరొకటి మొదటి రెండింటిని పరిశీలిస్తున్నట్లుగా — అదంతా

ఇంకా... (అటూ ఇటూ కదులుతున్న సంజ్ఞ). రెండు వేర్వేరు చైతన్యాలు — ఒక దాని నొకటి పరిశీలించే క్రీడగా, ఒకదాని నొకటి ఇంద్రియ గోచరం చేస్తున్నట్లుగా. కనుక అది ఇంకా అసలైనది కాదు.

అదంతా ఈ శరీరంలో జరుగుతున్నది. బహుశా శరీరంలోని వివిధ భాగాలలో జరుగుతున్నదేమో నాకు తెలియదు. అక్కడ 'చైతన్యపుటంతస్తులు' ఉన్నాయి లేక కొన్ని శారీరక ధర్మాల ననుసరించి హెచ్చుతగ్గులుగా పూర్తి తాదాత్మ్యత లున్నాయి — నాకు తెలియదు. కింద, ఇంకా మానసిక ప్రభావానికి సంబంధించిన గ్రహించలేని గత కాలపు విలక్షణానుభూతు లున్నాయి, మనం వాటిని అలవాటుగా 'ఉన్నత' మనస్సు అని పిలుస్తాం (అంతర్బుద్ధి వగైరా). అటు పిమ్మట, చుట్టుపక్కల అంతటా, మొత్తం శక్తుల క్రీడ, సూచనలు, రూపాలు అన్నీ బయటి నుంచి వచ్చేవి. నేను 'బయట నుంచి' అన్నాను కాని 'బయట నుంచి' అనే అనుభూతి లేదు, అటువంటి సంవేదన లేదు, 'ఇక్కడ ఈ మనుషులు', 'అక్కడ ఆ మనుషులు' అనే ఇంద్రియ సంవేదన లేదు — అది ఆ విధంగా లేదు, ఏ మాత్రమూ లేదు, కనీసం శరీరానికి కూడా లేదు.

(శ్రీమాత ఆకస్మికంగా చివరి దాకా సాగిపోయే దీర్ఘ ధ్యానంలోకి వెళ్ళిపోయారు)

(Vol. 9, p. 112)

జూన్ 8, 1968

బహుశా కొన్ని గంటలు (నేను దానిని పట్టించుకోలేదు గనక నాకు సరిగ్గా సమయం తెలియదు), చైతన్యం తిరగబడిందా అన్నట్లుగా (నాకు ఏ మాట వాడాలో కూడా తెలియటం లేదు), నాకు సరిగ్గా తెలియదు, కేంద్రమంటూ ఏదీ లేదు, ఏ కేంద్రం చుట్టూ సమస్తం వ్యవస్థీకృతమైందో అటువంటి కేంద్రమేదీ లేదు; దానర్థం, తన చుట్టూ సమస్తమూ వ్యవస్థీకృతమైన చైతన్యంలాగా దివ్యచైతన్యం లేదు — అది ఆ విధంగా లేదు, అది ఆ విధంగా లేనే లేదు... అది... ఒక విధంగా అసాధారణంగా సులువైనదీ, అదే సమయంలో అసాధారణంగా సంక్లిష్టమైనటువంటిది కూడా.

(శ్రీమాత చాలా సేపు మౌనంగా ఉన్నారు)

ఇప్పుడు కేవలం దాని జ్ఞాపకమే ఉంది, కనుక ఇది ఏ మాత్రం అది కానే కాదు. ఇది జ్ఞాపకం చేసుకోడానికి చేసే ప్రయత్నమే.

కనీసం విభజన సాధ్యాసాధ్యాల సంవేదన కూడా లేదు. నేనిప్పుడు దర్శిస్తాను (శ్రీమాత తన కనులు మూసుకున్నారు). అది ఒక ఐక్యత లాగా ఉంది, లెక్కలేనన్ని వాటితో కలిసిపోయిన ఐక్యతలాగా ఉంది — అవి లక్షల కోట్లు తెలుస్తున్నదా — లెక్కలేనన్ని ప్రకాశ బిందువులు. ఒకే చైతన్యం — ఒకే ఒక్క చైతన్యపు, తమకు తాము ఎరుక కలిగిన, లెక్కలేనన్ని ప్రకాశ బిందువులు.

అది కచ్చితంగా బుద్ధిహీనతలా కనిపించింది, కాని అది బిందువు లన్నింటి మొత్తం కాదు, అర్థమైంది కదా! అది కాదు, మొత్తం కానే కాదు: అది ఏకత్వం, కాని లెక్కించ లేనటువంటి ఏకత్వం. మనం వాడే మాటలే దానిని తెలివిమాలిననదానిగా చేస్తున్నాయి.

అసాధ్యం. భాష సరిపోదు.

(Vol. 9, p. 158)}

జనవరి 4, 1969

ఒకటవ తారీకు, నిజంగా ఏదో వింత జరిగింది... అది కేవలం నేను మాత్రమే అనుభూతి పొందలేదు, ఇతరులు కొంతమంది కూడా ఆ అనుభూతి పొందారు. అది సరిగ్గా అర్ధరాత్రి తరువాత మొదలైంది, కాని నేను 2 గంటలకు అనుభూతి పొందాను. మిగతావారు ప్రొద్దున నాలుగు గంటలకు అనుభూతిపొందారు. అది... నేను దాని గురించి కిందటిసారి కొన్ని మాటలు చెప్పాను, కాని ఆశ్చర్యం కలిగించే విషయ మేమిటంటే అది ఏదీ నేను ఊహించినదాని కనుగుణంగా లేదు (నేను దేనినీ ఊహించలేదు)... లేదా నేను ఇది వరకు అనుభూతి చెందిన వాటి కనుగుణంగా లేదు. అది ఏదో పూర్తిగా భౌతికం, అంటే. పూర్తిగా బాహ్యానికి సంబంధించినది — పూర్తిగా వెలుపలిది — బంగారు రంగుతో ప్రకాశించింది. అది చాలా బలంగా ఉంది, అధిక శక్తియుతంగా ఉంది. కాని దాని లక్షణం చిరునవ్వుతో కూడిన ఔదార్యం, ఒక ప్రశాంతమైన సంతోషం, ఒక విధమైన వికసనపు ఉల్లాసం, ప్రకాశం. అది ఒక రకంగా "సంతోషదాయకమైన కొత్త సంవత్సరం". ఒక శుభాకాంక్ష లాంటిది. అది నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తిందని చెప్పాలి.

అది ఉన్న సమయం — నేను కనీసం మూడు గంటలు అనుభూతి చెందాను. తరువాత నేను దానిని పట్టించుకోవడం మానివేశాను; ఏమయిందో నాకు తెలియదు.

కాని నేను దాని గురించి కొన్ని మాటలు చెప్పాను, ఇంకా ఇద్దరు ముగ్గురితో చెప్పాను. వారందరూ ఆ అనుభూతి చెందారు. దానర్థం, అది పూర్తిగా భౌతికం. వారందరూ ఆ విధంగా ఒక విధమైన సంతోషాన్ని పొందారు. కాని అది ప్రీతిదాయకమైన, శక్తివంతమైన సంతోషం... ఆహా, ఎంతో మాధుర్యం, ఎంతో చిరునవ్వు, ఎంతో ఔదార్యం... ఒక విధమైన... అది ఏమిటో నాకు తెలియదు. అది ఏమిటో నాకు తెలియదు, కాని అది ఒక విధమైన ఔదార్యం. కాబట్టి అది ఒక విధంగా మనిషికి చాలా దగ్గరైనది. అది ఎంతో వాస్తవికంగా ఉంది! ఎంతో వాస్తవికం. ఏదో రుచి దానికి ఉన్నట్లుగా ఎంతో వాస్తవికంగా ఉంది: తరువాత ఇద్దరికి లేక ముగ్గురికి చెప్పాను తప్ప, నేను దానిని ఏమాత్రం పట్టించుకోలేదు: వారందరూ దాని అనుభూతి చెందారు. ఇప్పుడు, అది కలిసిపోయిందో లేదో అనేది తెలియదు... అది వెళ్ళిపోలేదు, అది వచ్చింది వెళ్ళిపోవటానికే అన్నట్లు అనుభూతి నివ్వలేదు.

అది మామూలుగా నేను అనుభూతి చెందేవాని కంటె బాహ్యమైన అనుభూతి, చాలా అధికంగా బాహ్యం లోనిది... ఏమాత్రం మానసికమైనది కాదు, నా ఉద్దేశం 'వాగ్దానం' లాంటి భావన లేదు... అది ఒక విధమైన... నా సొంత అభిప్రాయం ఏమిటంటే అది ఒక అపారమైన వ్యక్తిత్వం, అపారమైనది. అర్థం దానికి భూమి చాలా చిన్నది, ఈ విధంగా (*శ్రీమాత ఒక చిన్న వస్తువును తన అరిచేతుల మధ్య ఉంచింది ఒక బంతిలాగా*), ఒక అపారమైన వ్యక్తిత్వం, ఎంతో ఔదార్యం గలది, ఇటు వైపు వచ్చింది... (*శ్రీమాత తన అరిచేతుల మధ్య నున్న చిన్న బంతిని పైకి నెమ్మదిగా ఎత్తుతున్నట్లుగ చూపించింది*). అది సహాయం చేయడానికి వచ్చే వ్యక్తిగతదైవంగా (అయినప్పటికీ అది.... నాకు తెలియదు) అనుభూతి నిచ్చింది. ఎంత ధృఢత్వం! అదే సమయంలో ఎంతో మాధుర్యం కలిగినది, ఎంతో గ్రహణశక్తి కలిగినది.

అది పూర్తిగా బాహ్యం లోనిది: శరీరం ప్రతి చోటా దాని అనుభూతిని పొందింది, ఈ విధంగా ప్రతి చోటా (*శ్రీమాత తన ముఖాన్ని, చేతులను స్పృశించారు*).

అది ఏమిటయ్యుంటుంది? నాకు తెలియదు.

అది సంవత్సరం ఆరంభం. అది ఏ విధంగా ఉందంటే ఎవరో ఒకరు, ఒక దైవం స్థాయిలో నున్నవారు 'సంతోషదాయకమైన సంవత్సరం' అని చెప్పటానికి

వచ్చినట్లుంది, మొత్తం శక్తితో సంతోషదాయకమైన సంవత్సరంగా చేయబూనినట్లుగా ఉంది. అది ఆ విధంగా ఉంది.

కాని అది ఏమిటి?

ఎంతో వాస్తవికంగా ఉంది.

నాకు తెలియదు.

అది... అది వ్యక్తిత్వమా (ఎందువల్లనంటే దానికి రూపం లేదు, నేను ఏ రూపాన్నీ చూడ లేదు, కేవలం అది తనతో తీసుకువచ్చిన (శ్రీమాత తన వేళ్ళతో వాతావరణాన్ని స్పృశించిన అనుభూతిని చూపింది) సంవేదన, అనుభూతి, ఈ రెండూ — సంవేదనా, అనుభూతి, నేను అది అతిమానస వ్యక్తిత్వం అయ్యుంటుందా అని ఆశ్చర్యపడ్డాను... తరువాత అది భౌతికరూపాలలో అభివ్యక్తం అవుతుందేమో?

అప్పటి నుంచి, శరీరం — ఈ శరీరం — అనుభూతి పొందుతున్నది (అంతటా దానితో చొచ్చుకుపోయింది, ఎంతో ఎక్కువగా) అది ఎంతో ఎక్కువగా సంతోషం పొందుతున్నది, తక్కువ ఏకాగ్రతతో, ఎక్కువైన సంతోషంలో, చిరునగువుతో విస్తరిస్తూ జీవిస్తున్నది. ఉదాహరణకు, అది తేలికగా మాట్లాడగలుగుతున్నది. అక్కడ ఒక సుస్వన. నిరంతరం ఔదార్యం ఉట్టిపడే సుస్వనం. ఒక చిరునవ్వుతో, తెలిసిందా, ఔదార్యం ఉట్టిపడే చిరునవ్వుతో, అదంతా ఎంతో గొప్పశక్తితో... నాకు తెలియదు.

నీ కేమీ అనుభూతి కలుగలేదా?

సత్ప్రేమ్: ఆ రోజు నాకు పూర్తిగా సంతృప్తి చెందిన అనుభూతి కలిగింది.

ఆ, అదే! అవును, సరిగ్గా అదే.

అది ఏమయినా అతిమానస వ్యక్తిత్వమా?... అతిమానస శరీరం కలిగే వారంద రిలో అది అవతరిస్తుందా...?

అది ఉజ్వలంగా, చిరుదరహాసంతో, దాని మహత్త్వశక్తి వలన ఎంతో ఔదార్యంతో ఉంది: నేను ఆ విధంగా చెప్పానంటే దానర్థం, సాధారణంగా, మనిషిలో ఔదార్యం ఒక విధంగా స్వల్పంగా బలహీనంగా ఉంటుంది, అంటే అర్థం, అది యుద్ధం గాని, సంఘర్షణ గాని అభిలషించదు. కాని ఇది ఆ విధంగా ఏమాత్రమూ లేదు! ఆ ఔదార్యం తనకు తాను బలంగా ప్రభావం చూపించేటటువంటిది (శ్రీమాత తన రెండు పిడికిళ్ళనూ కిందికి తీసుకువచ్చి కుర్చీ చేతుల మీద ఆనించి చూపింది).

అది నాలో ఆసక్తిని రేకెత్తించింది, ఎందువల్లనంటే అది పూర్తిగా కొత్తగా ఉంది,

ఎంతో వాస్తవికంగా ఉంది. ఇంత వాస్తవంగా ఉంది (శ్రీమాత కుర్చీ చేతులను తాకి చూపించింది), సాధారణంగా భౌతిక చైతన్యం ఏ విధంగా తనకు 'అన్యమైనవి' గా పరిగణిస్తుందో, అంత వాస్తవంగానూ ఉంది. అంటే అది ఏదో అంతరంగ అస్తిత్వమైన చైత్య అస్తిత్వం నుంచి రాలేదని అర్థం: అది సరాసరి శరీరం మీదకు వచ్చింది.

అది ఏమిటి?... అవును, అది అదే కావచ్చు... అది జరిగినప్పటి నుంచి శరీరం ఒక విధమైన ధృఢవిశ్వాసంలో ఉంది, ధృఢవిశ్వాసం. అది ఎలా ఉందంటే ఇక ఏమాత్రం తెలుసుకోవాలనే ఆందోళనా లేక తెలుసుకోవడం సాధ్యం కాదు అనే వాటికి ఆస్కారం లేనటువంటి ధృఢవిశ్వాసంలో ఉంది. "అది ఏమయ్యుంటుంది? ఈ అతిమానస భౌతికం దేనిని పోలివుంటుంది?" శరీరం అచ్చెరు వొందుతోంది. "భౌతికంగా ఏ విధంగా ఉంటుంది", ఇప్పుడు, అది ఏమాత్రం దానిని గురించి ఆలోచించడం లేదు, అది సంతోషంగా ఉంది.

ఎంతో హాయిగా ఉంది.

సత్ప్రేమ్: *తయారయి సిద్ధంగా ఉన్న శరీరాలలో అంతటా అది చొచ్చుకు పోతుందా?*

అవును... నేను ఆ విధంగానే అనుకుంటున్నాను, అంతే. రూపుదిద్దుకున్న ఆ ఆకృతి అంతటా చొచ్చుకుపోయి, తనకు తాను వ్యక్తమవుతుందని నేను అనుకుంటు న్నాను — అంతటా చొచ్చుకుపోయి, తనకు తాను వ్యక్తపరచుకోవటం — శరీరాలలో... అవి అతిమానస శరీరాలవుతాయి.

లేక, బహుశా... బహుశా అతిమానవుడు? నాకు తెలియదు, ఆ రెంటికీ మధ్య బహశా అతిమానవుడు. అది ఎంతగానో మానవసంబంధమైనదే కాని దివ్యత్వం పాళ్ళు వున్న మానవుడు. నీ కర్థమయిందనుకుంటాను. బలహీనతలు, నీలినీడలు లేని మనిషి; అది అంతా ప్రకాశమానం — అది అంతా కాంతి, చిరుదరహాసం... అదే సమయంలో మాధుర్యం.

అవును, బహుశా అతిమానవుడు

Vol.. 10, p. 18

ఆగష్టు 2, 1969

నేను 'సావిత్రి' రెండవ పుస్తకం చదువుతున్నాను. అది చక్రవర్తి పరివర్తన, అతని అనుభవం అనుకుంటాను. నేను ఎప్పుడో చాలా కాలం క్రితం చదివాను, నాకు గుర్తు లేదు, ఏ మాత్రం లేదు; ఇప్పుడు మళ్ళీ నేను దానిని చదువుతున్నాను... అది పూర్తిగా ఇప్పుడు నా శరీరం ఏ అనుభవాన్ని పొందుతున్నదో అదే వర్ణనను కలిగి ఉంది! అ..సా...ధారణం. నేను ఇప్పుడు మళ్ళీ చదవగానే, స్తబ్ధురాలి నయ్యాను.

అది ఎలా ఉందంటే, నా శరీరం పూర్తిగా దానిని కాపీ చేస్తున్నదా అని అనిపించే 'టట్లుగా! నాకు పూర్వం చదివినది ఏ మాత్రం గుర్తు లేదు, అణుమాత్రం కూడా... అంటే దానర్థం శ్రీఅరవిందులు దానిని దర్శించారనే — ఆయన దానిని చూశారా, లేక దాని అనుభవం పొందారా? ఏమో నాకు తెలియదు... దానినే వారు భౌతిక అస్తిత్వ అతిమానసీకరణగా పరిగణించారు, 'సావిత్రి'లో, అది నీకు గుర్తుందా?

Vol. 10, p. 277

సెప్టెంబరు 10, 1969

నాకు చెప్పటానికి ఏమీ లేదు.

నా శరీరం అసాధారణ అనుభవాల గుండా సాగిపోతున్నది, కాని అవి చెప్పగూడనివి... అన్ని విధాలైన పరిస్థితులలోను — లెక్కలేనన్ని పరిస్థితులలో — ఒక వ్యక్తి మృత్యుముఖం వైపు ఏ విధంగా సాగిపోతాడు, అతడు జీవితం వైపు ఏ విధంగా సాగిపోతాడు అనేది చూపిస్తున్నట్లుగా ఉంది; ప్రతిదానితోను, ప్రతిదీ, తెలుస్తున్నదా, శరీరంలో ప్రతి భాగం, ప్రతి శరీర అవయవం, ప్రతి పనీ, ఒక దాని తరువాత ఒకటి — చెప్పటం అసాధ్యం, అది చెప్పకూడనటువంటిది.

అది చాలా ఆసక్తిదాయకం.

కాని ఈ శరీరం చాలా విచిత్రంగా నిర్మాణం చేయబడింది, ఎందువల్లనంటే, అది బాహ్యంలో దుష్టసంసర్గం పొందిన ప్రతిసారీ, అనగా, బాధపెట్టాలనే ఇచ్ఛ, నాశనం చేయాలనే ఇచ్ఛ, హాని కలిగించాలనే ఇచ్ఛ మొదలైనవాటితో, సంసర్గం కలిగినప్పుడు, దానికి అర్థం కాదు, అప్పుడు, దానికి... అది ఒక విధమైనటువంటి

శిశురోదోనను కలిగిస్తుంది, తెలిసిందా: "అది ఎలా అవుతుంది?..." అది ఒక కార్యార్థం వినియోగించబడింది, కాని...

(నిశ్శబ్దం)

దానితో పాటుగా ప్రతి నిమిషం వివిధ సంవేదనలు (సహజంగానే, అవి శరీరానివి) అందుకునే విషయంలో దానిని గురించి మొత్తం బోధన జరిగింది, యోగసాధన చేసేటప్పుడు మీకివ్వబడిన బోధన లాంటిది: ఆలోచనల విషయంలో, ప్రతి క్రియలలో, అనుభూతులూ అటువంటి అన్ని విషయాలలో వైఖరి ఎలా ఉండాలో బోధించబడింది, అవలంబించాల్సిన నిజమైన వైఖరి ఎలా గుండాలో బోధించబడింది (అదంతా గతంలో). ఇప్పుడు మళ్ళీ ప్రతి అంశం గురించీ అదే విధంగా వివరంగా బోధించ బడింది. ప్రతి సంవేదన విషయంలోనూ వైఖరి ఏ విధంగా ఉండాలి: ప్రతి సంవేదన — ప్రతి సంఘటన, జరిగే ప్రతిదీ, ప్రతి సంసర్గమూ. అది ఎంతో జాగ్రత్తతో పరిశ్ర మతో కూడుకున్న పని, ప్రతి అంశమూ దాని వివరాలతో, అదంతా సర్వసాధారణ వైఖరితో కలిసి కొనసాగింది; కాని, ఆ సర్వసాధారణ వైఖరిని శరీరం ఎప్పుడో అంగీకరించి గ్రహించినది, అది స్థిరంగా కుదురుకున్న విషయం — ఇప్పుడు ఇది, సాధ్యమవటానికి చేసే పని, ఇది, ప్రతి నిమిషం ఎంతో జాగ్రత్తతో పరిశ్రమతో కూడుకున్న పని... అదేమంత ఆసక్తిదాయకమైంది కాదు. కేవలం శరీరం మాత్రమే ఆసక్తి కనబరుస్తోంది; అయినప్పటికీ, అదే మాత్రమూ ఆకర్షించబడటం లేదు — అది ఒక విధంగా జాగ్రత్తతో పరిశ్రమతో కూడుకున్నది, జాగ్రత్తతో పరిశ్రమతో కూడుకున్న పని. చర్యలలోని వైఖరులకు జరిగే ప్రతిక్రియలు — ప్రజలు ఏమంటారు అనేది కాదు, అది కానే కాదు, కేవలం వారి హావభావాలు, వారి వైఖరులు, అవన్నీ. అసలైన శారీరక వైఖరిని నిరంతరం కలిగి ఉండటం ఎలా.

అది జాగ్రత్తతో, పరిశ్రమతో కూడుకుని దీర్ఘకాలం పట్టే పని.... అందులో ఆకర్షించేది ఏదీ లేదు.

Vol. 10, p. 325

నవంబరు 15, 1969

ఏమయినా ప్రత్యేక విషయం మోసుకొచ్చావా?... నా కంటూ, నాకేమీ లేదు, ఏదో చాలా చిన్న విషయం తప్ప, అది రాత్రి జరిగింది, మొట్టమొదటిసారి జరిగింది,

ఎడతెగకుండా 2 గంటలు (నేను మాత్రం కేవలం ఎప్పుడూ ఏ విధంగా ఉంటానో ఆ విధంగానే ఉన్నాను) ఆ మహాశక్తి... నేను స్పాంజిలా ఉన్నట్లుగా అనిపిస్తుంది. నాకు దానిని గురించి ఏ విధంగా చెప్పాలో తెలియటం లేదు: అదేమీ 'పైనుంచి' వస్తున్నట్లు లేదు లేక ఈ విధంగానూ లేదు సమాంతరంగా (సంజ్ఞ), కాని అది వచ్చింది — నేను ఒక గొట్టంలాగ వున్నాను. అది ఆగిపోకుండా – ఆగిపోకుండా బయటకు పోతూనే ఉన్నది... ఒక గంట సమయం, ఆ మహాశక్తి, అత్యధికమైనటువంటి బంగారురంగుతో, బయటకు వెళ్తూనే ఉన్నది, తరువాత ఆది ప్రపంచమంతటా పరచుకున్నది. నేను దానిని మొదటిసారి భౌతికంగా అనుభూతి పొందాను — నేను భౌతికంగా అనుభూతి పొందాను. దానికి అంతటి అసాధారణమైన శక్తి ఉంది! ఈ శరీరం ఏ విధంగా ఉందంటే.... నేను ఒక నీటి కుళాయి లేక ఒక గొట్టంలా, అర్థం అయ్యిందా, కాని అది కచ్చితంగా ఒక నిర్దిష్టమైన ప్రాంతం నుంచి రాలేదు: నేను అందులో మునిగిపోయానా అని అనిపించే విధంగా, తరువాత, నా గుండా అది పోతూనే, పోతూనే ఉంది (శ్రీమాత తన *గుండా* ప్రతి చోటా అది పరుచుకున్నటువంటి సంజ్ఞను చేసింది) ఈ రోజున తెల్లవారు ఝామున 2 గంటలకు పైగా అది ఆ విధంగా పోతూనే ఉన్నది, అది, ఒకటీ నాలుగూ మధ్య (నాకు సరిగ్గా తెలియదు); అది ఆ విధంగా రెండున్నర గంటలకు పైగా జరిగిందని నేను అనుకుంటాను. నేను ఆ మహాశక్తిని చూశాను. అది భూమిని తాకటానికి ఈ శరీరం కేవలం ఒక త్రోవగా మాత్రమే పనిచేసింది — ఆ మహాశక్తి వచ్చింది, తరువాత అది బయటకు పోయి, పరచుకుంది. అది వెళ్ళింది.... నేను అదంతా చూశాను, పిలిచిన వారందరి వైపుకు వెళ్ళడం నేను చూశాను. దానికి నిర్దేశన పూర్తిగా ఎరుక కలిగిన చైతన్యంతో చేయబడింది, నేను మట్టుకు.... ప్రశాంతంగా, (నవ్వు), నేను ఒక గొట్టంలాగా మాత్రమే ఉన్నాను.

కేవలం ఇది మాత్రమే చెప్పదలచుకున్నాను.

అది భౌతికంగా జరగడమనేది అదే మొదటిసారి, అది భౌతికమైనది.

Vol. 10, p. 425

అనువాదం: డా, త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

జూలై 1, 1970

మొదటిసారిగా ఒక ఆసక్తికరమైన అనుభవం కలిగింది. అది నిన్న లేక మొన్న కావచ్చు (నేను మరచిపోయాను). 'ఆర్' సరిగ్గా నా ముందు ఇక్కడే మోకాళ్ళపై కూచొని వుంది. ఆమెను మించి (యెనిమిది *అంగుళాల* యెత్తును సూచిస్తూ) వున్న ఆమె చైత్యపురుషుని చూచాను. ఆమె భౌతిక దేహం కన్న చైత్యపురుషుడు యెత్తు వుండగా చూడడం ఇదే మొదటిసారి. అది స్త్రీయో, పురుషుడో చెప్పలేని లింగరహిత జీవి. అదెప్పుడూ అలాగా వుండి వుండవచ్చు, నాకు తెలియదు, కాని ఆ సమయంలో నేను ఆ విషయాన్ని చాలా స్పష్టంగా గ్రహించాను. "ఈ చైత్య పురుషుడే గదా అతిమానసజీవి రూపంగా తయారయ్యేది" అని నాలో నేను అను కొన్నాను.

దాన్నలా చూచాను. ప్రత్యేక రూపురేఖ లున్నాయి గాని మరీ కొట్టొచ్చినట్లు స్పష్టంగా లేవు. పురుష లేక స్త్రీ కాని జీవి అనీ, ఇద్దరి లక్షణాలు కలగలసి వున్న జీవి అనీ చాలా స్పష్టంగా తెలిసింది. ఆ జీవి ఆమె కన్న పొడుగ్గా వుంది. ఆమె భౌతిక దేహాన్ని మించి అన్ని వైపులా (దాదాపు యెనిమిది అంగుళాల పెద్దదిగా) వుంది. ఆమె నా యెదుట అలా వుంది (సంజ్ఞ). దాని రంగు... అది గనుక పదార్థ దేహానికి బాగా దగ్గరగా వస్తే ఆరోవిల్ రంగు (నారింజ) అవుతుంది. ఒక తెర వెనుక నుండి కన్పించునట్లుగా పేలవంగా, మృదువుగా వుంది. మరీ అంత కచ్చితంగా లేదు, కాని అదే రంగు. దానికి జుత్తు కూడా వుంది, కాని... అది మరేదోగా వుంది. మరో సారి కన్పిస్తే ఇంకా బాగా చూస్తానేమో.

కాని నా కది చాలా ఆసక్తి కలిగించింది. ఎందుకనంటే ఆ జీవి నాతో ఇలా చెప్పాలనుకొంటున్నట్లు అన్పించింది. "అతిమానస జీవి యెలా వుంటుందో అని ఆశ్చర్యపోతున్నావు గదూ — ఇదిగో ఇక్కడుంది చూడు!" అదక్కడుంది. అది ఆమె చైత్యపురుషుడు.

చైత్యపురుషుడు దృగ్గోచరమౌతాడు... అది పరిణామానికి అవిచ్ఛిన్నంగా కొనసాగే సామర్థ్యాన్నిస్తుంది అనేది యిట్టే తెలిసిపోతోంది. అదెవరికైనా తెలుస్తుంది. ఏదీ నిర్హేతుకం కాదనే, ప్రతిదాని వెనుక ఒక దివ్య ప్రామాణికత వున్నదనే ఒక స్పష్టమైన అవగాహనను ఈ సృష్టి మనకు కలిగిస్తుంది. అది మన మానవ ప్రామాణికత

లాంటిది గాదు, మన ప్రామాణికతల కంటె చాలా చాలా వున్నతమైన ప్రామాణికత అది. నేను దాన్ని చూచినపుడు ఆ ప్రామాణికతకు పూర్తి సంతృప్తి కలిగింది. అది కూడా 'ఆర్' ఇక్కడున్నపుడు, ఏ మాత్రం నీడ పడకుండా అతిమానస వెలుగు లోనికి (నా ద్వారా) పోవడం నా కనుభవమైంది. 'ఆర్' కు అటువంటి దేమైనా వుందేమో నాకు తెలియదు. ఈ సారి ఆ దర్శనం నిజంగా ఆసక్తిని కలిగించింది. బాగా ఆసక్తి కలిగింది. ప్రశాంతంగా "కాని నీవు దాని వెంట... సరే ఇదిగో, ఇది అది" అని నాకు చెప్పింది.

ఈ దేహంలో నుండి మనస్సుకు, ప్రాణికానికి ఉద్వాపన చెప్పి చైత్యపురుషుడిని యెందు కుండనివ్వవలసి వచ్చిందో అపుడు నా కర్థమైంది. (గతంలో చైత్యపురుషుడు సహజంగానే సమస్త చలనాన్నీ నియంత్రించాడు. అదేం క్రొత్త కాదు, అపుడు యిబ్బందు లెంతమాత్రం లేవు. తమ అభిప్రాయాలను, తమ వైఖరులను జోడించే మనస్సుకు, ప్రాణికానికి సంబంధించిన సంక్లిష్టతలన్నీ మటు మాయమైనాయి) అందుచేత "ఆఁ, అదీ సంగతి. ఈ చైత్యపురుషుడే అతిమానస జీవిగా తయారు గావాలి," అనే విషయం నా కర్థమైంది.

చూడ్డాని కదెలా వుంటుందో తెలుసుకోవాలని నేనెన్నడూ చింతించ లేదు. కాని నేను దాన్ని చూచినపుడు అర్థం చేసుకొన్నాను. దాన్ని చూచాను, ఇంకా చూస్తున్నాను. నాకు జ్ఞాపకం వుంది. దాని జుత్తు దాదాపు యెరుపు రంగులో ఉంది, చిత్రంగా వుంది. (అది యెర్ర జుత్తుగాదు, కాని అలా కన్పించింది) అదెలా కన్పించిందో! యెంతో చక్కటి రూపం, నాజూకుగా వుంది... ఓహ్ అది అసాధరణం, అసాధరణంగా వుంది!

నా కళ్ళు తెరుచుకొనే వున్నాయని నీకు తెలుసుగా, అది దాదాపు భౌతిక దృష్టి. అప్పుడెవరైనా అర్థం చేసుకోవచ్చు! అన్నీ ఒక్కసారిగా, సమస్త సందేహాలు మటుమాయమైనయాయి. అంతా స్పష్టపడింది, తేలికగా.

(మౌనం)

సదా జీవిస్తూ వుండిపోయేది, కచ్చితంగా చెప్పాలంటే చైత్యపురుషుడే. అది వాస్తవరూపం ధరించడం అంటే మృత్యువుతో పనిలేకపోవడమే. కాని 'పని లేకపోవడం'... దేనితోనో పనిలేకపోవడం అంటే, అది పరమ సత్యాని కనుగుణంగా లేకపోవడమన్న మాట. అలా లేనిదే నెమ్మదిగా అంతర్థానమైపోతుంది — చైత్యపురుష

రూపం లోనికి రూపాంతరీకరణ చెందడానికి శక్తి చాలనిది, చైత్యసత్తలో భాగం కాలేనిదంతా అంతర్థానమౌతుంది.

చాలా ఆసక్తికరంగా వుంది.

సెప్టెంబరు 1, 1971

కేవలం దైవం వల్లే మనగలిగేటట్లు ఈ దేహానికి బోధించాను. ప్రతిదానికీ దైవం మీదే ఆధారపడేటట్లు దానికి నేర్పాను, పూర్తిగా, సంపూర్ణంగా ప్రతిదాన్ని, దేన్నీ మినహాయించకుండా, ప్రతిదానికీ దైవం మీదే ఆధారపడేటట్లు ఈ దేహానికి నేర్పాను... దేని కోసమో ఒత్తిడి కూడా వుంది. చేతన తన అత్యున్నత స్థాయిలో దైవచేతనతో అనుసంధానమైనవుడు మాత్రమే, అస్తిత్వం కలిగి వున్న స్పృహ ఉంటోంది. అది అసాధారణ రీతిలో తీవ్రతరమైంది. భౌతికం రూపాంతరం చెందినపుడు, అది అత్యంత ఘనిష్టంగా, మార్పు చేయనలవి గానట్లు — సంపూర్ణమైనట్లు అవుతుంది తెలుసా. అది యెంతో ఘనిష్టం... దైవంలో వుండటం, ఆయన వల్లనే, ఆయన కోసమే ఉనికిలో వుండడానికే... సాధారణ చేతనలో కాదనేది స్పష్టమే, కేవలం, కేవలం మానవచేతనలో ఉండడానికి, ఆ (మహోన్నత) చేతనకు మధ్య యెంతో గొప్ప భేదం వుంది. అదెంత గొప్పదంటే ఒక చేతన మరో చేతనకు మరణసదృశంగా కన్పిస్తుంది. అదలా వుంటుంది గనుక, భౌతిక సాక్షాత్కారం నిజంగా ఒక ఘనిష్టమైన సాక్షాత్కారమని అర్థం.

ఊర్జం అలా కేంద్రీకరించడం మొదలైంది. (అది రూపుదాల్చడానికి ఇంకా చాలా దూరం వుంది, కాని...) ఆ విషయాలెలా వుంటాయో, అవగాహన ఆరంభమైంది. నిజంగా... నిజంగా అద్భుతం. అంతే గాదు యెంతో శక్తివంతం. ఒక శక్తి, చేతనలో ఒక వాస్తవికత, మరింక దేనికీ, నిర్ద్వంద్వంగా మరింక దేనికీ లేవు — ప్రతిదీ ప్రాణిక లేక మానసికమైనదిగా, అస్పష్టంగా, అవాస్తవికంగా కన్పిస్తుంది. అదే సమయంలో, ఇది ఘనిష్టం (అమ్మ, తమ గుప్పిళ్ళను బలంగా బిగిస్తారు) అదెంతో ధృఢమైనది.

(*అమ్మ అంతరంగం లోనికి పయనిస్తారు*)

అభివ్యక్తం కావాలనుకొనే పరాశక్తిని భరించగల ఒక భౌతిక జీవిని సృజించడంలోనే కష్టమంతా వున్నదని అనిపిస్తోంది. దైహిక చేతనలన్నీ అభివ్యక్తం అయ్యే, అన్నింటినీ

అతిశయించే పరాశక్తి ధాటికి నిలబడలేనంత బలహీనమైనవి, పెళుసైనవి. అందుచేత దేహం దానికి అలవాటు పడవలసి వున్నది. అటువంటి, ఒక అద్భుతమైన క్షితిజ క్షణిక ఆకస్మిక దర్శనం అది అనిపిస్తుంది, కాని అది సర్వాతిశయమైన అద్భుతం. దేహమెంత వరకు భరించగలదో అంత వరకు మాత్రమే స్వీకరించ అనుమతించబడింది.

తదనుగుణంగా దేహంలో కొంత సవరణ జరగాలి. విశ్రాంతి, ఆహారం విషయంలో అది బాగా స్పష్టంగా తెలుస్తుంది. (ముఖ్యంగా ఆహారం విషయంలో) అవి చాలా విచిత్రం... మార్పిడి... మార్పిడి జరుగుతున్న మధ్య కాలంలో అది చాలా విచిత్రంగా వుంటుంది.

తగిన నమ్యత దేహాని కున్నదా? నాకు తెలియదు. అది నమ్యతకు సంబంధించిన విషయం. నిలద్రొక్కుకొని (*తన ద్వారా ఏదో ప్రవహించిపోతున్నట్లు అమ్మ సంజ్ఞ చేస్తారు*) అభివ్యక్తం కావాలనుకొంటున్న పరాశక్తికి ఏ విధమైన అవరోధాన్ని కలిగించకుండా అది ప్రసారం చేయగలిగి వుండాలి.

దర్శనాలన్నీ కేవలం భవిష్యత్ పర్యవసానాలు. అందుచేత... పైకి కన్పించే ఆకారం అన్నింటి కన్నా చివరకు మార్పు చెందుతుంది.

నవంబరు 27, 1971

(*అమ్మ, ఒక కాగితాన్ని సత్ప్రేమ్‌కు యిస్తారు*) నాకు నిన్న కలిగిన అనుభవం యిది. (*అమ్మ కనులు మూసుకొని చిరునవ్వు చిందిస్తారు*) హఠాత్తుగా నేను చూచాను — ఈ ప్రపంచాన్ని మరో విధంగా చూచాను. ఒక్క క్షణం పాటు, ఆకస్మికంగా... ప్రపంచాన్ని దైవం చూచే విధంగా నేను చూచాను. అర్థమైందా? మానవదృష్టి యెంత మాత్రం లేదు. ఎంతో అద్భుతమైనదాన్ని దేన్నో చూచాను... అదెంతో అద్భుతంగా వుంది, దాన్ని వర్ణించలేను. ఆ తరువాత నెమ్మదిగా మానవ చేతన తిరిగి వచ్చింది... ఓహ్! (*అమ్మ రెండు చేతుల్తో తమ నుదుటిని పట్టుకొంటారు*)

"దైవానికి మానవులందరి యెడల సమాన ప్రేమ వుంది. చాలామందిని దివ్య ప్రేమను గ్రహించకుండా చేసేది చేతనకు సంబంధించిన అస్పష్టత" అని అన్నాను. ఆ తరువాత ఈ అనుభవం, ఇంతకు ముందు నీకు చెప్పిన అనుభవం కలిగింది.

"...పరమ సత్యం అద్భుతం. మన అవగాహనలోనే అది వికృతం అవుతుంది".

అవును. ఆకస్మికంగా జరిగినట్లు... కొద్ది క్షణాలు దైవం చూచేటట్లు నేను ప్రపం

చాన్ని చూచాను. దానికి... మాటలు లేవు, అది అవర్ణనీయం. అపుడు నా కర్థమైంది. మొత్తం స్పష్టమైంది. స్పష్టం, సుస్పష్టం.

వ్యక్తిగత చేతన కూడా దైవానుభవాన్ని పొందాలని, దైవం కోరుకొంటున్నాడని నేను చెప్పిన విషయం నీకు గుర్తుందా, ఇది అదే. వ్యక్తిగత చేతన (నాకు ఆ విషయం తెలుస్తూనే వున్నది గనుక) ప్రపంచాన్ని చూస్తోంది... అకస్మాత్తుగా, దైవానికి ప్రపంచం యెలా వుంటుందో అలా తయారై కన్పించింది... అది అవర్ణనీయం.

అది చేతనతోనే ప్రారంభం కావాలనేది స్పష్టమే. తరువాత, కొద్ది కొద్దిగా వస్తువులు అలా తయారవుతాయి, అంటే అర్థం, దైవం వాటి నెలా యెరుగుతాడో అలా తమను తాము యెరుగ గలుగుతాయి.

డిశెంబరు 8, 1971

చేయవలసిన పనిలో మార్పు లేదు. దేహం ఒక... (ఏమిటి) ఒక అనుసంధాన కేంద్రం (అమ్మ *తమ లోనుంచి సాగిపోయే ఒక ప్రవాహ మార్గాన్ని సంజ్ఞతో చూపిస్తారు*) లా వుంది. కాని ఆ విషయం దానికి తెలియకుండానే అదలా తయారైంది. కారణం ఆ చర్య చాలా విశాలమైనది — అది చాలా విశాలం, సంక్లిష్టం — చేతనకు అన్ని వివరాలూ తెలియవు. దివ్య క్రియాశక్తి పని చేస్తున్నదనే సంవేదన మాత్రమే వుంటుంది. అంతే. అది మారదు, రేబవళ్ళు నిరంతరం కొనసాగుతుంటుంది.

నా రాత్రులు. నిద్రపోతున్నాననే భావనే కలుగదు. కాని నాకు తెలియకుండానే కాలం అలా గడచిపోతోంది. కేవలం దివ్యక్రియాశక్తులు (అమ్మ) నా ద్వారా సాగిపోతున్నాయి. కాని అవి యేం చేస్తాయో నాకు తెలియదు. (అమ్మ) నా ద్వారా పోతున్నాయనేది మాత్రం తెలుసు, అంతేగాక యిక్కడా, అక్కడా కేంద్రీకరిస్తున్నాయి. కాని నాకేం ఆతురత లేదు. పని చేస్తుండే క్రియాశక్తులు సాగిపోవడానికి యేదీ అవరోధం కలిగించకుండా వుండేందుకు, ఆ ప్రక్రియ నిరాటంకంగా కొనసాగడానికి చాలా ప్రశాంతంగా వుండడమనే భావనలే వుంటున్నాయి.

గంటల తరబడి, రోజుల తరబడి అది అదే విధంగా వుంటోంది. తెలియకుండా కాలం గడచిపోతున్నదనే భావన వుంటోంది. ఎంతో కాలం కాదు, కాదు... (అమ్మ *తమ అంతరంగం లోనికి పయనించారు*).

మార్చి 25, 1972

సత్ప్రేమ్: ఒక రోజు మీ, మార్పు చెందుతున్న దేహాన్ని దర్శించిన మీ అనుభవాన్ని గురించి సుజాత నాకు చెప్పింది.

అమ్మ: అవును. నేనలా వున్నాను. అది నేనే. నన్ను నేను అద్దంలో కాదు చూచుకొంది. నన్ను నేను ఇలాగే చూచుకొన్నాను. (*తమ దేహం వంక చూడ్డానికి అమ్మ తమ తలను వంచి చూపారు*) నేను అలా... కేవలం అలా వున్నాను.

అదే మొదటిసారి. ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో అనుకొంటున్నాను. అది పూర్తిగా సహజంగా, అంటే నన్ను నేను అద్దంలో చూచుకోలేదు. అది అత్యంత సహజంగా వుంది. నేనేం చూచానో అదే నాకు గుర్తుంది. (*గుండెల దగ్గర్నుండి నడుం వరకూ అని అమ్మ సంజ్ఞ చేసారు*) నేను పలుచటి వలువలనే కప్పుకొని వున్నాను, కనుక నేను చూడగలిగాను. మొండెం అంటే గుండెల దగ్గర్నుండి నడుం వరకూ మాత్రం చాలా భిన్నంగా వుంది. అది స్త్రీదీ గాదు, పురుషుడిదీ గాదు. కాని మనోహరంగా వుంది. నా రూపం చాలా చాలా కోమలంగా, నాజూకుగా వుంది గాని సన్నగా లేదు. చర్మం చాలా తెల్లగా, ఇప్పటి దేహచర్మం లాగానే వుంది. అదొక మనోహరమైన రూపం. అది స్త్రీదో, పురుషుడిదో చెప్పగలిగిన రూపం కాదు. లింగభేదం అంతర్ధానమైంది.

(*అమ్మ తమ హృదయస్థానాన్ని చూపుతూ*) ఇక్కడ కూడా అంతే. అంతా బల్లపరుపుగా వుంది. ఎలా వివరించాలో నాకు తెలియడం లేదు. ఇప్పుడున్న ఆకారాన్ని గుర్తు చేసే ఒక బాహ్య రేఖారూపం మాత్రమే వుంది, కానిఏ ఆకృతులూ లేవు, పురుషునిలాగా కూడా యెత్తుపల్లాలు లేవు. (*అమ్మ తమ హృదయ ప్రదేశాన్ని స్పృశిస్తారు*) చాలా తెల్లని చర్మం, చాలా మృదువుగా వుంది. చెప్పాలంటే అసలు పొత్తి కడుపు పొట్ట లేదనే చెప్పాలి. ఉన్నదంతా నాజూకుగా వుంది.

నేనేం ప్రత్యేక శ్రద్ధ చూపించలేదు, ఎందుకని, నేనదే గనుక. అది నాకు చాలా సహజమైనదిగా అనుభూతి కలిగింది. అలా సంభవించడం ఇదే మొదటిసారి. అది మొన్నటి రాత్రి, కాని నిన్న రాత్రి నేనేం చూడ్డం జరగలేదు. ఇప్పటి వరకూ అదే మొదటిసారి, చివరిసారి కూడా.

సత్ప్రేమ్: కాని ఈ రూపం సూక్ష్మ భౌతికం లోనిది కదా, కాదా?

అమ్మ: సూక్ష్మభౌతికంలో అది ఇతఃపూర్వమే ఉండి ఉండాలి.

సత్ప్రేమ్: కాని అది భౌతికంలోని కెలా వస్తుంది?

అమ్మ: అదే సమస్య, నాకు తెలియదు... నాకు తెలియదు... నాకు తెలియదు. అంతే గాదు, మన కిప్పుడున్న సంక్లిష్ట జీర్ణవ్యవస్థకు సంబంధించినది గాని, విసర్జనా విధానానికి సంబంధించనదేదీ గాని ఎంత మాత్రం లేదు. ఆ రీతిగా అది పనిచేయదు.

కాని, యెలా? ఆహారం యిప్పటికే చాలా భిన్నంగా వుంటోంది అనేది, ఇంకా యింకా అలా తయారవుతుందనేది స్పష్టం. ఉదా: గ్లూకోజ్, లేదా విస్తృతమైన జీర్ణప్రక్రియ అవసరం లేని పదార్థాలు. కాని యెలా, స్వయంగా దేహం మారిపోతుంది? ఆ విషయం నాకు తెలియదు, నాకు తెలియదు.

అదెలా జరిగిందో తెలుసుకోవాలని నేను చూడలేదు. ఎందుకనంటే అది నాకు చాలా సహజంగా అనిపించింది. అందుచేత దాన్ని సవివరంగా విశదీకరించలేను. అది పురుషుని లేదా స్త్రీ దేహం కాదు, అని మాత్రం చెప్పగలను. స్థూలరూప రేఖాకారం దాదాపు ఒక యౌవన వ్యక్తి రూపంలా వుంది. అది (అమ్మ గాలిలో ఒక రూపాన్ని చిత్రిస్తారు) మూపుతో, ముందు భాగంతో ఒక మానవరూపాన్ని సూచన మాత్రంగా తెలుపుతోంది. దాన్ని కేవలం సూచిస్తోంది.

నేను దాన్ని చూచాను గాని... నీవు నిన్ను చూచుకొంటున్నట్లుగానే, నేను దాన్ని చూచాను. నన్ను నేను అద్దంలో కూడా చూచుకోవడం గాదది. నన్ను నేను కప్పుకొనడాని కుపయోగించే ఒక పలుచని వస్త్రం లాంటిది అప్పుడు కూడా నా మీదున్నది.

నే నుండే దలాగే. (అందులో ఆశ్చర్యపడవలసిందేం లేదు) నేను సహజంగా అలాగే వుంటాను.

సూక్ష్మభౌతికంలో అది అలా వుంటుంది.

సత్ప్రేమ్: ఒక దాన్నుండి మరొకదానికి మారడమే మార్మిక ప్రక్రియ.

అమ్మ: అవును యెలా? చింపాంజీ మనిషిగా మారడంలో వున్న మార్మికత లాంటిదే యిది కూడా.

సత్ప్రేమ్: ఓహ్! అలా కాదమ్మా! దాని కంటె యెంతో బ్రహ్మాండమైనదిది, ఎంతో బ్రహ్మాండమైనది, ఎందుకనంటే, చింపాంజీకి మనిషికి మధ్య అంతగా భేదం లేదు.

అమ్మ: కన్పించే ఆకారంలో సైతం అటువంటి భేదం కూడా లేదు. (*అమ్మ గాలిలో ఒక రూపాన్ని చిత్రీకరిస్తారు*) భుజాలు, చేతులు, కాళ్లు, ఒక దేహం, ఒక మొండెం వున్నాయి. మనకున్న వాటి లాంటివే. ఒకటి మాత్రం...

సత్ప్రేమ్: అవును, కాని నేను చెప్పేదేమిటంటే, చింపాంజీ పనిచేసే విధానం, మనిషి పనిచేసే విధానం ఒకటే అని.

అమ్మ: ఒకే విధం

సత్ప్రేమ్: అవును బాగానే వుంది. అవి జీర్ణం చేసుకొనేది, శ్వాసించేది, ఒకే రీతిగా వుంటుంది. కాని యిక్కడ...

అమ్మ: కాదు యిక్కడ కూడా శ్వాసించడం వుండాలి. భుజాలు కొట్టొచ్చినట్లు విశాలంగా వున్నాయి. (సంజ్ఞ) అది విశేషం. అదీ ముఖ్యం. కానీ వక్షస్థలం స్త్రీది కాదు, పురుషుడిదీ గాదు. కేవలం దాన్ని గుర్తు చేసేటట్లుంది. మిగతాదంతా — పొట్ట, పొత్తికడుపు, మిగతావి — ఒక రేఖాకారం మాత్రమే, బాగా బక్క పలుచని పొందికైన రూపం. మన దేహాల నిప్పుడు ఏ పనుల కుపయోగిస్తున్నామో ఆ పనులకు కాదు అనేది స్పష్టం.

రెండు భేదాలున్నాయి, పూర్తిగా భిన్నమైనవవి. ఒకటి సంతానోత్పత్తి. అదింకెంత మాత్రం సాధ్యం కాదు. రెండు ఆహారం. ఈనాటి మన ఆహారం కూడా చింపాజీలు లేదా ఆదిమ మానవుల ఆహారం లాంటిది కాదు. కాబట్టి ఇప్పుడున్నంత జీర్ణప్రక్రియ అంతా అవసరం లేని ఆహారాన్ని మనం కనుగొనవలసి వచ్చేటట్లు కన్పిస్తోంది... అది కచ్చితంగా ద్రవాహారం కాదు, అలా అని ఘనపదార్థం కూడా కాదు. అదీ గాక నోరు సమస్య కూడా వుంది — దాన్ని గురించి నాకు తెలియదు — మరి దంతాల సంగతేమిటి? నమలడం అనేది సహజంగానే అవసరం లేదు. కనుక పళ్ళు, దంతాల అవసరం కూడా ఎంత మాత్రం వుండదు. కాని వాటి స్థానంలో ఏదైనా వుండాలి. మోము యెలా వుంటుందో కించిత్తు అభిప్రాయం కూడా లేదు. కాని చాల వరకు యిప్పుడున్న దానిలాగా కాకుండా ఉండదనిపిస్తోంది. నిజానికి బాగా మారిపోయేది, శ్వాస — అదే అతి ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఆ జీవి దాని మీదే యెక్కువ ఆధార పడ్తుంది.

సత్ప్రేమ్: అతడు బహుశా ఊర్జాన్ని సరాసరి జీర్ణించుకొంటాడేమో?

అమ్మ: చింపాజీకి, మనిషికి మధ్య వచ్చిన మధ్యంతర జీవుల లాగానే. అవును,

బహుశా ఎక్కువ కాలం జీవించలేని మధ్యంతర జీవులు వస్తాయేమో. ఇతః పూర్వం లేనిదేదో సంభవించవలసి వున్నదేమో నాకు తెలియదు.

సత్ప్రేమ్: అవును

(మౌనం)

సత్ప్రేమ్: అది వాస్తవమయ్యే సమయం చాలా దగ్గర పడిందనే ఒక సంవేదన కలుగుతోంది.

అమ్మ: అవును, కాని యెలా

సత్ప్రేమ్: అవును, యెలా, మనకు తెలియదు.

అమ్మ: (*అమ్మ తన దేహం వంక చూపుతూ*) ఇది మార్పు చెందబోతున్నదా? ఇది మారాలా లేదా గతానికి సంబంధించిన అంటే చనిపోవడం, తిరిగి జన్మించడం అనే సాధారణ విధానాన్ని అనుసరించాలా... నాకు తెలియదు. జీవితం నిరాటంకంగా కొనసాగుతుంది అనేది యధార్థమే, అందుకు తగిన ఉదాహరణలు కూడా వున్నాయి. కాని... నాకు తెలియదు. నాకు తెలియదు.

సత్ప్రేమ్: రూపాంతరీకరణానికి బదులు మరో దేహం ఘనీభవించడం జరుగుతుందేమోననే సంవేదన కొన్ని సమయాల్లో నాకు కలుగుతోంది.

అమ్మ: ఆహ్! కాని యెలా?

సత్ప్రేమ్: ఆ ప్రకియ సైతం మనకు తెలియదు. ఈ దేహం మరొకటిగా అవ్వడానికి బదులు, ఆ మరో దేహం, ఈ దేహం స్థానాన్ని తీసుకొంటుంది.

అమ్మ: అవును, కాని యెలా?

సత్ప్రేమ్: అవును, యెలాగో నాకు తెలియదు.

(మౌనం తర్వాత)

అమ్మ: నిజమే, రెండు రాత్రుల క్రితం నాకున్న దేహం అర్థం చేసుకోగలిగిన విధంగా దర్శనీయం అయితే... కాని యెలా? ధ్యానించాలనుకొంటున్నావా?

(అమ్మ ధ్యానంలో కెళతారు)

మనకేం తెలియదు. 'శూన్యం' ను యెలా తెలుసుకోవడం? ఆశ్చర్యం!

(సత్ప్రేమ్ లేచి వెళ్ళడానికి సిద్ధమౌతుంటే సుజాత అమ్మ దగ్గర కొస్తుంది)

సుజాత: 'రూపాంతరీకరణ' అనే కవితలో శ్రీఅరవిందులు వ్రాసిన మొదటి పంక్తులు మీకు తెలుసుగదా అమ్మా!

నా శ్వాస ఒక సూక్ష్మ లయబద్ధ ప్రవాహమై సాగిపోవు
అది నా అంగాంగముల నొక దివ్యశక్తితో నింపు.

అమ్మ: అవును, శ్వాస చాలా ముఖ్యం. 'అదొక ప్రచండ శక్తి'

సుజాత: 'ప్రచండ శక్తి' అవునమ్మా!

(అమ్మ సుజాత బుగ్గలను నిమురుతుంది)

మార్చి 30, 1972

సత్ప్రేమ్: అమ్మా మీ క్రియాశక్తి అత్యంత తీవ్రంగా ఇప్పుడు పనిచేస్తున్న విషయం మీకు తెలుసా?

అమ్మ: అవును, నాకు తెలుసు, నాకు తెలుసు. ఇప్పుడూ, యెప్పుడూ ఆ దివ్య క్రియాశక్తిని చూస్తూనే వున్నాను. అది 'నా' శక్తి కాదు. అది దైవ క్రియాశక్తి. నేను ప్రయత్నిస్తాను. ఇలా వుండడానికి ప్రయత్నం మాత్రమే చేస్తాను. *(ఒక వాహకంగా అన్నట్లు సంజ్ఞ చేస్తారు)* కేవలం, కేవలం ఒక ప్రసార మాధ్యమంగా సాధ్యమైనంత పారదర్శకంగా, సాధ్యమైనంత నిర్వ్యక్తికంగా ఉండడానికి ఈ దేహం ప్రయత్నిస్తోంది. అప్పుడే దైవం యేం చేయాలనుకొంటే, దాన్ని చేయగలుగుతాడు.

(మౌనం)

సత్ప్రేమ్: ఆ విషయం చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకనంటే ఏ సమస్యనైనా మీ ముందుంచినప్పుడు తత్ క్షణమే పనైపోతుంది.

(మౌనం)

అమ్మ: ఇచటకి నా మొట్టమొదటి రాకకు నిన్నటితో యాభై యెనిమిది సంవత్సరాలు నిండాయి. ఈ యాభై యెనిమిది సంవత్సరాలూ 'దాని కోసం' నేను పని చేస్తూనే వున్నాను. అవతరించే క్రియాశక్తులకు అవరోధం కలిగించకుండా ఉండేందుకు దేహం, అర్థపారదర్శకంగా, పూర్తి పారదర్శకంగా తయారుగావడానికి, వీలైనంత వరకు అభౌతికం గావడానికీ, ఈ యాభై యెనిమిది సంవత్సరాల నుంచీ పని చేస్తూనే వున్నాను.

ఇపుడు, ఇపుడు దేహమే స్వయంగా తన కణాలన్నింటితో సహా దానిని కోరుతోంది. ఇపుడు జీవితంలో దాని యేకైక మహాకార్యం అదే.

ఏ విధమైన వికృతిని కలిగించకుండా తన ద్వారా క్రియాశక్తులు సాగిపోనివ్వగలిగే

సంపూర్ణ పారదర్శక మూలకాన్ని ఒకదాన్ని భువిపై సృజించడానికి ప్రయత్నించాలి.

నవంబరు 8, 1972

ఒక క్షణం సేపు — కొద్ది సెకన్లు మాత్రమే — నాకు అతిమానస చేతన లభించింది. అదెంతో అద్భుతంగా వుంది. దాన్ని గనుక యిప్పుడు చవి చూడడం జరిగితే, మరో విధంగా జీవించాలని తలచనే తలచం అనేది నా కర్థమైంది. మనం ఆ ప్రక్రియలో... (*పిండిని పిసుకుతూ కలబెడ్తున్నట్లు*) శ్రమతో కూడుకొన్న పరివర్తన ప్రక్రియలో వున్నాం. పరివర్తన, పరివర్తన ప్రక్రియ... ఒక విధమైన ఉదాసీనతతో నీవు గ్రహించవచ్చు. (యెలా విశదీకరించాలో నాకు తెలియడం లేదు) కాని ఆదెక్కువ కాలం వుండదు. ప్రామాణికంగా చెప్పాలంటే — అత్యంత కష్టభూయిష్టం. కాని ఆ చేతన యెంతో అద్భుతం తెలుసా! అది చాలా ఆసక్తికరమైనది, ఎందుచేతనంటే సంపూర్ణ శాంతిలో కూడా ఒక విధమైన 'అతి తీవ్ర' క్రియాకలాపం వుంది. కాని అది కొద్ది సెకన్లు మాత్రమే వుంది.

(*మౌనం, అరచేతులను పైకి త్రిప్పుతారు*)

మరీ నీ సంగతి.

సత్ప్రేమ్: అది సంపూర్ణ చేతనేనా?

అమ్మ: అది నమ్మలేనంత అత్యద్భుతం. సమస్త వ్యతిరేకతలను సమం గావించేటంత నమ్మలేని అద్భుతం. అవును, ఒక సంపూర్ణ అలౌకిక క్రియాకలాపం... పరిపూర్ణ శాంతితో కలిసి వుంటుంది. కాని ఇవి కేవలం మాటలే.

(*మౌనం*)

సత్ప్రేమ్: 'దానితో' సంపర్కం పెట్టుకొనేందుకేది సహాయపడ్తుంది? అన్నీ దాటి అచటికి చేరుకోడానికి, అచట వుండడానికి సరిగ్గా ఏది కారణం?

అమ్మ: నాకు తెలియదు, కారణం, నేను సదా — నా చేతన 'మొత్తం', దేహచేతనతో కలిపి యెల్లపుడూ ఆ వైపు... (నివేదన చేస్తున్నట్లు సంజ్ఞ) అని దైవం అనుకొంటున్నదానికి (నివేదన). అది కూడా 'ప్రయత్నం' లేకుండా, అర్థమైందా?

సత్ప్రేమ్: అవునవును.

(*అమ్మ తమ అంతరంగంలో మునిగిపోతారు*)

అనువాదం: కె. వి. రావు

ఫిబ్రవరి 28, 1973

అమ్మ: ఎలా వున్నావు

సత్ప్రేమ్: నాకు బాగా తెలీదు.

అమ్మ: అంత బాగా లేవా?

సత్ప్రేమ్: నాకు తెలీదు.

(అమ్మ నవ్వుతారు)

సత్ప్రేమ్: ఏ మార్గంలో నడుస్తున్నామో, అది ఏమాత్రం తెలియనట్లుగా వుంది.

అమ్మ: నాకూ తెలియదు!... నాకూ తెలియదు.

కాని అది ఒక ప్రయోజనాన్ని ఆశించి జరుగుతోందని తెలుసు. అది ఒక ప్రయోజనం కోసమని నాకు తెలుసు, అందుకే నేను విచారించటం లేదు. మనం దాన్ని మనసు ద్వారా తెలుసుకుంటాం — అది పూర్తిగా నిరర్థకమైనది. శ్రీఅరవిందులు చెప్పినట్లుగా అది అసత్యం నుంచి సత్యం వైపు కొనసాగుతుంది. అయితే, అతి మానసం సత్యం నుండి సత్యం వైపు కొనసాగుతుంది. దానికి ఈ మానసిక పద్ధతితో ఏమాత్రం సంబంధం లేదు. అది నాకు తెలుసు. నేను సంపూర్ణంగా నిశ్చలంగా నున్నప్పుడు, ఇక్కడ ఎవరూ నా ఏకాంతాన్ని భంగపరచనపుడు — అప్పుడు... (అమ్మ కళ్లు మూసుకుంటారు) ఓ రకమైన స్థితి వస్తుంది... అది క్రమంగా పెరిగి ఓ విస్తృత ప్రకాశంలోకి ... (అమ్మ నిశ్శబ్దంగా నవ్వుతారు) ప్రవేశిస్తావు... అక్కడ ప్రశ్నకు చేటు లేదు.

(అమ్మ సత్ప్రేమ్ చేతులను తీసుకుని మళ్ళీ ఆ స్థితిలోకి వెళతారు)

Vol. 13, p. 369

మార్చి 31, 1973

సత్ప్రేమ్: ఆ నూతన చైతన్యం గురించి, నేను ధ్యానమగ్నమైన లేక ఉదాసీన వైఖరిని తెలుసుకోగలను., కాని దాని యొక్క చైతన్యస్థితిని లేదా క్రియాశీల అంశాన్ని అంత బాగా తెలుసుకోలేను. అది ఏ విధంగా పని చేస్తుందో బాగా

తెలుసుకోలేను — దాని ధ్యానమగ్న స్థితిని అర్థం చేసుకోగలను. కాని అది ఎలా పని చేస్తుంది?

అమ్మ: నాకు తెలీదు. దానిని గురించిన ఊహ కూడా లేదు.

సత్ప్రేమ్: మీరు పని చేస్తారా లేక ఆ చైతన్యంలో ఉంటారా...

అమ్మ: అవును నేను పని చేస్తాను. నీవు అడిగిన దాంట్లో అర్థమేమిటి? ... అవును, నేను పని చేస్తాను!

సత్ప్రేమ్: ఉదాహరణకి మీరు అంతర్ముఖమైనపుడు, అంతరంగంలో లీనమైనపుడు...

అమ్మ: నేను అప్పుడు మరింత మెరుగ్గా పని చేస్తాను — నేను అంతర్ముఖమైనట్లుగా కనిపిస్తాను. కాని అది కాదు. అందరూ ఆ పొరపాటే చేస్తారు.

సత్ప్రేమ్: అవును, నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను.

అమ్మ: నేను ఆ విధంగా ఏకాగ్రతలో ఉన్నపుడు, నేను అంతర్ముఖమైట్టు కాదు, నేను మరో రకమైన చైతన్యంలో ఉన్నట్టు దాని అర్థం.

అది చాలా విస్తృతం... విస్తృతం... విస్తృతం... విస్తృతం

సత్ప్రేమ్: అవును, అయితే ఆ చైతన్యం యొక్క క్రియాత్మకత వైపు నేను తెలుసుకోలేనిది...

అమ్మ: కాని దానికి మరో వైపు లేదు! అది ఒక చైతన్యం (పైనుంచి వత్తిడి ఉన్నట్టు సంజ్ఞ)... దానికి ఏ వైపు లేదు, అది ధ్యానమగ్నం గాని, క్రియాత్మకం గాని కాదు — అది ఒక చైతన్యం... (పై నుంచి వత్తిడి ఉన్నట్టు సంజ్ఞ) ఈ ప్రపంచంపై వత్తిడి తెస్తున్న ఓ చైతన్యం.

(నిశ్శబ్దం)

చూడు, నువ్వు దాన్ని మానసికంగా అర్థం చేసుకుందామని చూస్తున్నావు, అది సాధ్యం కాదు — అసాధ్యం. నీవు ఆ చైతన్యంలోకి ప్రవేశించినపుడే అది ఏమిటో తెలుసుకోగలవు. దానికి ధ్యానమగ్నం కావడం, లేక క్రియాశీలం కావడం, కాని అంతర్ముఖం గాని బహిర్ముఖం గానీ లేవు — అదంతా మరోదాని చేత ఆక్రమించ బడుతుంది — దాన్ని నేను వర్ణించలేను... దాన్ని వర్ణించడానికి మాటలు చాలవు.

సత్ప్రేమ్: ఉదాహరణకి, వ్యక్తిగతంగా, నేను ఆ చైతన్యంలోకి వెళ్ళాలని

ప్రయత్నించినపుడల్లా, నాకు ముఖ్యంగా కలిగే అనుభవం ఉనికి లేకపోవడం.

అమ్మ: ఆహా! అది కాదు!

సత్ప్రేమ్: నేను అనేది వ్యక్తిగతమైన ఉనికి లేకపోవడం.

అమ్మ: అది కాదు...

సత్ప్రేమ్: అది విశాలమైనది, విస్తృతమైనది, కాని అక్కడ వ్యక్తి మిగలడు, వ్యక్తిగతమైనది ఉండదు.

అమ్మ: కాదు, అలా ఉండదు — నాకు అదంతా గతంలోనిది — (నిశ్శబ్దం)

అవును, నీవు అనేదేమిటో నాకు అర్థమయింది....

Vol. 13, p. 384

ఏప్రిల్ 11, 1973

... అమ్మా, ఈ ఏప్రిల్ 24 దర్శనానికి మీరు మాకొక సందేశం ఇవ్వాలి.

(కొంత నిశ్శబ్దం తరువాత)

అమ్మ: నాకు ఈ ఆలోచన వస్తున్నది.

మానవచైతన్యాన్ని అధిగమించి,

మాటల నధిగమించి,

ఓ సర్వోత్కృష్ట చైతన్యమా.

— విశిష్ట వాస్తవమా,

మార్పులేని పరమ సత్యమా... (అమ్మ దాన్ని సవరించి)

దివ్యసత్యమా...

Vol. 13, p. 398

అనువాదం: సత్యవాణి

9/5/2014

సాధన ఎచ్చటైన సాధ్యమే

అఖిల భారత పత్రిక

మే 2014

9/5/2014

విషయసూచిక

గమనిక

మార్చి 2014 'అఖిల' సంచికలో కవరు పేజీ మీద "క్రియోన్ముఖ ఆధ్యాత్మికత" అని ఉండాలి. కాని అచ్చు పొరపాటులో 'త్రియోన్ముఖ ఆధ్యాత్మికత' అని పడింది. కావున సవరించుకోవలసినదిగా ప్రార్థన.

సంపాదకుడు

యోగమంటే ఏమిటి?

సకల మానవాళినీ తనలో వహించిన ఆ భగవంతునితో మనలో నున్న మానవీయత సంస్పర్శను కలిగించుకోవడమే యోగము. ఇంకా పరిమిత మానవత నిరవధిక దైవత్వంతోనూ, ఇప్పటికే కొంత పరిణతి చెందుతున్న అపరిపూర్ణ మానవీయత సాధించతగ్గ పరిపూర్ణత ఏదైతే ఇంతవరకూ సిద్ధించలేదో, దానితో అనుబంధం పెట్టుకోవడమే యోగము.

(CWSA 12:333)

*

పరిపూర్ణత్వమంటే యోగపరిభాషలో నిరీశ్వర నిమ్నప్రకృతిలో నుంచి ఉన్నత దివ్యప్రకృతిలోకి ఎదగడమేనని చెప్పవచ్చు. జ్ఞానపరంగా చెప్పాలంటే అంధకార మయమై భగ్నమొందిన మన నిమ్నప్రకృతిని తొలగించివేసి ఉన్నతతర వ్యక్తిత్వ స్థితిలోకి అడుగిడటం, ప్రకృతి మీదనే ఆధారపడటం, లేదా మన అపరిపూర్ణ స్థితిని సంపూర్ణ తేజోమయ ఆధ్యాత్మిక వ్యక్తిత్వంగా రూపాంతరీకరించడమైనా కావచ్చు.

*

యోగమంటే ద్వంద్వాల నుండి విముక్తి పొందడమే. యోగికి సమదృష్టి ఉంటుంది కాబట్టి సుఖదుఃఖాలు, కోపతాపాలు, మమతాద్వేషాలు, ఇష్టాయిష్టాలు మొదలైన ద్వంద్వాలకు బద్ధులు కారు. సుఖము వల్లకానీ, దుఃఖము వల్లకానీ, కష్టనష్టాల వల్ల కానీ క్రుంగిపోరు. వారు దైహిక బంధాలకు అతీతంగా ఉంటారు. ఎందువల్లనంటే ఏ మానవుని వలనా సుఖాన్నికానీ, దుఃఖాన్నికానీ పొందరు; వారి బలానికీ, ఆనందానికీ, సంతోషానికీ మూలాలు వారి వద్దనే ఉంటాయి.

*

యోగమంటే ఐక్యత. యోగానికి పరాకాష్ట ఆత్మ పరమాత్మలో ఐక్యం కావడము. ప్రస్తుత మానవ ప్రకృతిని శాశ్వతమైన పరమ దైవప్రకృతిలో ఐక్యం గావించడమూ.

ఐక్యత పెరుగుతున్నకొద్దీ యోగము ఉత్కృష్టమవుతుంది. ఐక్యత ఎంత సంపూర్ణంగా ఉంటే యోగం అంతగా సంపూర్ణమవుతుంది.

*

యోగమంటే కేవలం భావజాలం కాదు. అది ఒక అంతర్గతమైన ఆధ్యాత్మిక అనుభవము.

ఏవో కొన్ని మతవిశ్వాసాలకుగానీ, ఆధ్యాత్మికభావాల పట్లగానీ ఆకర్షితులైనంత మాత్రాన ఏ విధమైన ఫలసిద్ధి కలుగదు. యోగమంటే చైతన్యస్థితిలో మార్పు. కేవలం మానసికమైన కార్యక్రమాలేవీ కూడా చైతన్యాన్ని మార్చలేవు; అవి మనసులో మాత్రం కొంచెం మార్పు తేగలవు.

*

యోగలక్ష్యము చైతన్యంలో మార్పు; తద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఆధ్యాత్మికాను భవాన్నీ పొంది చివరకు భగవంతునిలో ఐక్యం కావడము.

*

ఆ పరమ పురుషుని గురించి విభిన్న మైన భావన లున్నాయి. ప్రతి ఒక్క భావన ఒక్కొక్క ప్రత్యేక సంప్రదాయనికి చెంది ఉంటుంది, దేని ప్రత్యేక సిద్ధాంతాలు, ప్రత్యేక నియమాలు దాని కుంటాయి. అయితే అవన్నీ కూడా పాక్షికమైన అసంపూర్ణ వ్యవస్థలే; వాటి సిద్ధాంతాల వరకూ అవి పూర్తిగా ఉన్నప్పటికీ అవి మానవ జీవితాన్నీ, ప్రకృతినీ పూర్తిగా స్పృశించవు. అవి మనిషిని ప్రాపంచిక జీవితానికి దూరం చేస్తాయి కాబట్టి జీవితంపై విరక్తి చెంది చిదానందస్థితిని అన్వేషించే ఏ కొద్దిమందికో ఉప యోగంగా ఉంటాయి. స్థూలంగా మానవాళికి ఇటువంటి యోగవిధానాలు ఏ రకమైన సందేశాన్నీ ఈయలేవు. సంపూర్ణ యోగమంటే ప్రపంచంలో అంతటా భగవంతుని దర్శిస్తూ, సకల మానవాళినీ సమదృష్టితో పరికించేదిగా ఉండాలి. ఇంకా జీవితాన్ని ఉనికిని దివ్య చైతన్యంతో నింపుతూ మానవుని వ్యక్తిత్వాన్ని ఉత్కృష్టపరచడమేకాక మానవజాతి నంతటినీ పరిపూర్ణత దిశగా నడిపించడము. అదే పరిపూర్ణ యోగము.

(*CWSA* 12: 334-35) శ్రీఅరవిందులు

*

నీ భవిష్యత్తు విషయమై నీవు పూర్తి చైతన్యవంతుడివి కావడానికి యోగము నీకు సహాయం చేస్తుంది. అంటే ఈ విశ్వంలో నీ ప్రయోజనమేమిటో తెలియజేస్తుంది. ఈ వర్తమానంలోనే గాక భూతకాలంలో ఏమై ఉన్నదో, భవిష్యత్తులో ఏమి కానుందో కూడా తెలియజేస్తుంది.

(CWM 6:448) శ్రీమాత

అనువాదము: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

పూర్ణయోగం

ఇది అసిత్త్వమును పరివర్తనమును చేసే యోగం, కేవలం అంతరంగ పరమాత్మను లేక ఆ దైవాన్ని మాత్రమే సిద్ధించుకోగలిగే యోగం కాదు. అయినప్పటికీ ఆ రక మైన సిద్ధి దీనికి ప్రాథమికంగా ప్రాతిపదిక. అది లేకపోతే ఏ పరివర్తనం సాధ్యం కాదు. ఈ పరివర్తనలో నాలుగు ప్రాథమిక అంశాలున్నాయి, చైత్యోన్మీలనం, అతీం ద్రియ మార్గం గుండా పయనించడం, ఆధ్యాత్మిక విమోచన, అతిమానస పరిపూర్ణత. ఈ నాలుగింటిలో దేనినైనా సాధించలేని పక్షంలో, ఈ యోగం అసంపూర్ణమైన దవుతుంది.

(CWSA 12:368)


*

మన యోగం పరివర్తన యోగం, కాని అది మొత్తం చైతన్యాన్ని పైన శిఖరాగ్ర స్థాయి నుంచి కిందికి అట్టడుగు స్థాయి వరకు మొత్తం ప్రకృతిని, దానిలో దాగి ఉన్న అంతరంగ భాగాల నుంచి అత్యంత సుస్పష్టమైన శారీరక గమనాల వరకు పరివర్తన చేయడం. అదేమీ నైతిక మార్పు కాదు లేక మతమార్పిడి కాదు, పూజనీయమైన ఋషిత్వం కాదు, లేక కఠోర నియమ నియంత్రణ కాదు, పవిత్రమైన పరిశుద్ధతను పొందడం లేక మనం ఎదుర్కొనవలసిన జీవన, ప్రాణ గమనాలను అణచివేయడమూ కాదు, లేక భౌతికతకు ఘనతను కల్పించడం కాదు, లేక బలవంతంగా నిగ్రహించడం లేక తిరస్కరించడం కాదు. మేము ఊహించేది తక్కువ స్థాయి నుంచి గొప్ప స్థాయికి, నిమ్నత్వం నుండి అధికమైన ఉన్నతికి, ఉపరితలం నుంచి లోతైన గాఢ చైతన్యంలోకి మార్పు — వాస్తవానికి అది సాధ్యమైనంత విస్తారతకు, మహోన్నత స్థితికి, అత్యంత గాఢతకు చేరడం, పూర్తిగా మార్పు నొందడం, సమస్త అస్తిత్వం దానిలోని మూలపదార్థంతో, రాశితో, ప్రతి సూక్ష్మ అంశ వివరణతో ఇప్పటి వరకు సాక్షాత్కరించుకోని దివ్యప్రకృతి ఉనికిలోకి మౌలికంగా పునర్నిర్మాణం జరగడం

(CWSA 12: 371)

శ్రీఅరవిందులు

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



విధి అని పిలువబడే అరాచకతపు చిక్కు పరిస్థితిలో నైనా, మృత్యువు, పతనమనే తీవ్రబాధలో నైనా బారగా సాచి ఉంచిన ప్రభు హస్తం మన జీవితాల మీద ఉన్న అనుభూతి కలుగుతుంది.

(Savitri ,CWSA 33:59) శ్రీఅరవిందులు

పూర్ణయోగ లక్ష్యం

మన యోగలక్ష్యం ఆత్మ-పరిపూర్ణత, ఆత్మ-పరిత్యాగం కాదు. యోగి అనుసరించ డానికి రెండు మార్గాలు నిర్దేశించబడ్డాయి:

1. విశ్వం నుంచి ఉపసంహరణ
2. విశ్వంలో పరిపూర్ణత

మొదటిది కఠోర నియమపాలన ద్వారా సంప్రాప్తిస్తుంది. రెండవది తపస్సువల్ల సిద్ధిస్తుంది.

మొదటిది ఉనికిలోని పరమేశ్వరుని కోల్పోయినందువల్ల సాధ్యమౌతుంది. రెండవది ఉనికిలోని పరమేశ్వరుని మనం సుసంపన్నం చేయడం మూలంగా సిద్ధిస్తుంది.

మనది పరిపూర్ణతా పథమగు గాక, కాని పరిత్యజించేది కాకుండు గాక; మన లక్ష్యం యుద్ధంలో గెలుపగు గాక, కాని సమస్త సంఘర్షణల నుంచి తప్పించుకుని పారిపోయేది కాకుండు గాక....

భగవంతుడు మహామాయ ద్వారా తనలో విశ్వాన్ని సృష్టించాడు; కాని మహా మాయకు వేదార్థం భ్రాంతి కాదు, అది వివేకం, జ్ఞానం, సమర్థత, చైతన్యంలో విస్తృతమవటం, 'ప్రజ్ఞాప్రశ్రితపురాని'. సర్వశక్తివంతమైన మహా వివేకం విశ్వాన్ని సృజించింది, అదేమీ ఏదో ఒక అనంతస్వాప్నికుని వ్యవస్థీకృత దోషం కాదు; అది సర్వజ్ఞుని ఆధిపత్యశక్తి, అభివ్యక్తత లేక ఆ ఆధిపత్య శక్తి తనంతట తాను తనలో దానిని నిగూఢంగా దాచి ఉంచినది లేక దాని స్వయం ఆనందం. అది, స్వతంత్రుడైన, నిరపేక్ష బ్రహ్మ మీద స్వయంగా ఆయనదైన అజ్ఞానం విధించిన నిర్బంధం కాదు...

ఈ విశ్వం భగవంతుని అస్తిత్వంలోని ఆతని సొంత కదలిక; మనం ఆయన కదలిక ప్రక్రియలకు మొత్తంగా, దన్నుగా నిలిచే విశ్వచైతన్య కేంద్రాలం, గ్రంథులం....

మనం భగవంతుని కదలికను ముందుకు నడిపించెదము గాక, ఆయన క్రీడను సలిపెదము గాక, ఆయన సూత్రీకరించిన దానిని సాధించెదము గాక, ఆయన సామరస్యతను అమలుపరచెదము గాక, ఆయన వ్యవస్థలో మన ద్వారా ఆయనను వ్యక్తపరచెదము గాక. ఇది మన సంతోషం, మన ఆత్మ-సుసంపన్నత...

(CWSA 12:96-97)

*

పరిపూర్ణతను సాధించి తీరాలి, సామరస్యతను సముపార్జించాలి.

అపరిపూర్ణత, పరిమితి, మృత్యువు, దుఃఖం, అజ్ఞానం, పదార్థం

అన్నీ కేవలం సూత్రంలోని మొదటి అంశాలు మాత్రమే — మనం అంతకు మించిన విశాలమైన అంశాలను సాధ్యం చేసుకునేవరకు, సూత్రసముదాయాన్ని తిరిగి వ్యాఖ్యానించుకుని సుస్పష్టంగా అర్థం చేసుకునేవరకు అది బుద్ధిగ్రాహ్యం కాదు; అవి సంగీతకారుడు తన వాద్యమును శ్రుతి చేయుటలో మొట్టమొదట సంభవించే అపశృతులు.

అపరిపూర్ణత నుంచి మనం పరిపూర్ణతను నిర్మించాలి.

పరిమితి నుంచి అనంతాన్ని కనుగొనాలి

మృత్యువు నుండి అమృతత్వాన్ని పొందాలి.

దుఃఖం నుంచి దివ్యానందాన్ని తిరిగి పొందాలి.

అజ్ఞానం నుంచి దివ్య ఆత్మ-జ్ఞానాన్ని రాబట్టాలి.

పదార్థం నుంచి పరమాత్మను బయల్పరచాలి.

ఈ విధంగా మన కోసం, మానవజాతి కోసం కృషి చేసి సాధించడం మన యోగాభ్యాస లక్ష్యం.

(CWSA 12:97)

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఏ విధంగా ప్రారంభించాలి

ఇంటి దగ్గరే నీ పనులు కొనసాగిస్తూనే సాధన చేయవచ్చు — చాలామంది ఆ విధంగానే చేస్తారు.

ప్రారంభంలో అవసరమైనవి ఏమిటంటే:

* శ్రీమాతను సాధ్యమైనంత ఎక్కువగా తలచుకోవడము.
* నియమిత ప్రకారం ప్రతిరోజూ హృదయంలో ఆమెపై కొంత సమయం కేంద్రీకరించడము.
* ఆమెను దివ్యమాతగా సాధ్యమైనంతగా భావించడము.
* ఆమె నీలోనే ఉన్న భావన పొందాలని ఆకాంక్షించడము.
* నీ పనులన్నీ ఆమెకు సమర్పించుకుంటూ —
* నీలో నుండి దారి చూపిస్తూ నీ బాధ్యత వహించవలసిందిగా ఆమెను ప్రార్థించడము.

ఈ ప్రాథమిక దశ చాలా కాలం కొనసాగవచ్చు; అయినప్పటికీ దృఢమనస్సుతో మనస్ఫూర్తిగా కొనసాగిస్తే మెల్లమెల్లగా మనఃస్థితి మారుతూ సాధకునిలో ఒక కొత్త చైతన్యం వెల్లివిరుస్తుంది, లోన ఉన్న శ్రీమాత ఉనికీ తన స్వభావంలో తన జీవితంలో ఆమె ప్రభావమూ ప్రస్ఫుటంగా తెలియడం ప్రారంభిస్తుంది. అది కాకపోతే ఆత్మసిద్ధికి దారితీయగల ఏదో ఒక ఆధ్యాత్మికానుభవమైనా కలుగవచ్చు.

(శ్రీఅరవిందుల శతజయంతి గ్రంథము 32 నుంచి)

*

ధ్యానమంటే ఏమిటనుకుంటున్నావు? కళ్ళు మూసుకొని మనస్సును కేంద్రీకరించడమా? అది సత్యచైతన్యాన్ని క్రిందకు ఆహ్వానించే ఒక పద్ధతి మాత్రమే. సత్యచైతన్యంతో ఏకమవటం కానీ, ఆ అవరోహణ తనలో తెలుసుకోవడమనేది కానీ అన్నిటిలోకీ ముఖ్యము. నాకు జరిగినట్లు అది సనాతన సాంప్రదాయ పద్ధతిలో కాకుండా జరిగితే మరీ మంచిది. ధ్యానం ఒక పద్ధతి మాత్రమేనని చెప్పవచ్చు. అసలైన సాధన నడుస్తున్నప్పుడు, పని చేస్తున్నప్పుడు, లేక మాట్లాడుతున్నప్పుడు కూడా జరుగుతూ ఉంటుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

సాధారణ జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు

మనం నిత్యం బయట చేసే పనిలో అహం దాగుకొని వుంటుంది. తనను కనుగొనలేనంతగా దాచుకోగలిగినందుకు అది తనలో తానే సంతృప్తి పడి వుంటుంది. కాని సాధన వత్తిడి కలిగినపుడు అది తనను తాను బహిరంగ పరుచుకొనక తప్పని స్థితి యేర్పడుతుంది. అపుడు చేయవలసిందేమిటంటే దానిని తిరస్కరించి తనకు తానుగా స్వేచ్ఛను పొంది, కేవలం దైవాన్నే కర్మలక్ష్యం చేసుకోవాలి.
(CWSA 35:813)

*

మరో చేతనలో నివసించే జనంతో నిరంతర సంపర్కంలో వున్న వ్యక్తి యోగిక వాతావరణాన్ని నిలిపి వుంచుకోవడం అంత తేలికైన విషయం కాదు. బాహ్య, ఆంతరచేతనలో సంపూర్ణ పునాదిని కలిగి వున్నపుడు మాత్రమే సమస్తవిధ పరిసరాల్లోనూ అలాంటి వాతావరణం పూర్తిగా నిలిపి వుంచుకోగలుగుతాడు.
(CWSA 35:812)

*

కోపం, కోరిక, పేరాశ, స్త్రీ వ్యామోహం వగైరా ప్రాణిక కదలికలు సాధారణ జీవితంలో సహజమనీ, ఆమోదయోగ్యమైనవనీ, న్యాయసమ్మతమైనవనీ, మానవస్వభావంలో భాగమేననీ ప్రజలు ఆమోదిస్తారు. సమాజం వాటికి ఊతమివ్వనంత మేరకు లేదా వాటిని ఏ మేరకు కొన్ని నిర్ణీత పరిమితులలో లేదా ఒక సమంజసమైన కట్టుబాటుకు లేదా పరిమాణానికి పరిమితం చేసి అదుపులో వుంచుకొనాలని అభిలషిస్తుందో ఆ మేరకు వాటిని సాంఘిక నైతికతకు లేదా ఆచారానికీ తగినట్లు నియంత్రించాలని జనం ప్రయత్నిస్తారు.... తద్విరుద్ధంగా, వీటిని పూర్తిగా జయించాలనీ, వీటిపై పూర్తి అధికారాన్ని సాధించాలనీ ఆధ్యాత్మిక జీవన విధానాలన్నీ పట్టుబడతాయి. సాధకులలో సంఘర్షణ మరింత అధికంగా అనుభూతం గావడానికి కారణం సాధారణ మనుష్యులలో కన్నా సాధకులలో మరింత బలీయంగా ఇవి పైకి లేవడం గాదు. నియంత్రణకు పట్టుబట్టే ఆధ్యాత్మిక మనస్సుకు యెదురు తిరుగుతూ, గత జీవితంలో లాగే నూతన జీవితంలో గూడా కొనసాగాలని వాంఛించే ప్రాణిక కదలికలకు మధ్య చెలరేగే సంఘర్షణ తీవ్రతే కారణం....

సాధనలో మానసిక లేక నైతిక నియంత్రణ స్థానంలో ఆధ్యాత్మిక ప్రభుతను ప్రవేశపెట్టాలి. ఎందుచేతనంటే మానసిక నియంత్రణ పాక్షికం మాత్రమే. అది నియంత్రిస్తుంది గాని ముక్తం చేయలేదు. అలా చేయగలిగేది చైత్యపురుష తత్త్వం, ఆధ్యాత్మిక తత్త్వం మాత్రమే. ఈ విషయంలో సాధారణ ఆధ్యాత్మిక జీవితాల మధ్య ఉండే ప్రధాన భేదం యిదే.
(CWSA 28:420-21)

*

మనకు సంబంధించినంత వరకు సాధారణ జీవితం వాస్తవం, అది వున్నది, పచ్చి నిజం. కానీ ఆ జీవితం అవిద్యామయం. ఆధ్యాత్మిక దృక్కోణం నుండి చూస్తే అది అసత్యం మీద ఆధారపడి వున్నట్లు తెలుస్తుంది. కాబట్టి దాన్ని విసర్జించాలనడం తర్కబద్ధమే. లేదా మనం దానితో కొంత సంపర్కం పెట్టుకొని వుండవలసిన అవసరం వుంది, కాని అది కూడా మన పనికి అవసరమైనంత వరకే, సాధ్యమైనంత తక్కువ స్థాయిలోనే వుండాలి. అసత్యం నుండి ఆధ్యాత్మిక సత్యం లోనికి మనం మన జీవితాన్ని మరల్చాలి. అజ్ఞానమయ జీవితాన్ని ఆధ్యాత్మిక జీవనంగా మార్చాలి. మనం తట మనం దాన్ని సాధించడంలో సఫలమయ్యేంత వరకు ప్రాపంచిక అవిద్యా జీవితం నుండి విడివడి వుండడం మంచిది. లేకపోతే దాని చుట్టూ వున్న అంధకార కాసారాలలో నెమ్మదిగా పెరుగుతున్న మన ఆధ్యాత్మిక చిరుజ్యోతి మునిగి పోవచ్చు. ప్రస్తుత స్థితిలో కూడా సాధనా కృషి కష్టభూయిష్టమైనది. ఈ అవిద్యా జీవితం నుండి విడివడక పోయినట్లైతే ఆ కృషి పదింతలు కష్టభూయిష్టమౌతుంది.
(CWSA 35:813)

*

అవును, ఈ సాధనలో ఆకాంక్ష, తిరస్కృతి, అమ్మ స్మరణ, అమ్మకు సమర్పణ గావడం అనేవి ప్రధానోపాయాలు అనే విషయం పరమ సత్యం. తన స్వకీయ సాధనతో తన కొరకే అతిమానసాన్ని అన్వేషించడం అనేది శుద్ధ అవివేకం అనేది కూడా సత్యం. ఆ విషయాన్ని నేను ప్రారంభంలోనే చెప్పాను, ఈ మధ్య కూడా అదే విషయాన్ని మరీ మరీ నొక్కి చెప్పాను. పురోభివృద్ధి, అనుభవాలు వగైరాలను వాటి కోసమే వాటిని లేదా అహం కోసం కాంక్షించడం సాధకునికి సరైన వైఖరి కాదని, అవి సాధనా పర్యవసానంగా లభించేవి లేక తదనుబంధమైనవని, దైవంతో యేకం

గావడమే ప్రప్రధాన లక్ష్యంగా చేసుకోవాలనేది కూడా సత్యమే. సాధకుడు గనుక 'స్వ' కు ప్రాధాన్యత నిచ్చేవాడైతే, అహంకారికుడై వుంటే, అజ్ఞానియై వుంటే, చివరకు ధ్యానం, అంతర్దర్శనం, యోగంలో దాదాపు తక్కినదాన్నంతా కూడా దురుపయోగం చేయడం జరుగుతుంది. అంతమాత్రానికి ధ్యానం, అంతర్దర్శనాలు వగైరాలు ప్రయోజనం లేనివని గానీ, సాధనలో వాటి జోలికి పోకూడదని అర్థం కాదు.

ఒకసారి నీవు దివ్యజననిని సదా గుర్తుంచుకోగలిగిన స్థాయికి చేరుకొంటే, నీవు చేసే ప్రతి పనీ దైవం నుండే జాలువారుతుంది, కనుక నీవు చేసే పనేదైనా, దానిని పట్టించుకోవలసిన పనిలేదనేది ప్రమాదకర సిద్ధాంతము. అది వ్యక్తి స్వభావం నుండి బహిష్కరించబడి తీరవలసిన అనేక విషయాలను తిరస్కరించడానికి బదులుగా అనుమతించినట్లు అవుతుంది.

ఒక స్వేచ్ఛాజీవితం ప్రతి వానికి ప్రతి దశలోనూ మంచిదనడం కన్నా ఏ విధంగానూ ప్రతి వానికీ ప్రతి దశలోనూ ఒక విశ్రాంత బాహ్యజీవితం మంచిదని చెప్పలేం. ఏ విధమైన కట్టుబాట్లులేని ఒక స్వేచ్ఛామయ, ఉల్లాసవంతమైన నిరంతర సామాజిక జీవనం వల్ల కలిగే హాని ఏమిటంటే, అలా జీవించే వ్యక్తి, పూర్తిగా, లేదా చాలా వరకు, ఆంతరిక జీవితమంటూ లేని మామూలు, సాంసారిక జీవనం సాగించే వ్యక్తిగా అయిపోతాడు. ఆంతరిక వికాసంలేని, దైవానికి సంపూర్ణ ఆత్మార్పణగావడాని కడ్డుపడే సర్వవిధ ప్రాణిక ఆదానప్రదానాలు ఆ జీవితంలో భాగమై పోతాయి. పూర్తిగా విశ్రాంత జీవితం వల్ల కలిగే నష్టమేమిటంటే అది అతనిని ఏకపక్ష జీవిగా, తనలో తానే మూసుకుపోయిన, బాహ్యస్మృతి లేకుండా అంతర్ముఖ ఆలోచనల్లో మునిగిపోయినవాడిగా, ప్రాపంచిక విషయాల్లో స్థిరత్వంలేని వ్యక్తిగా చేస్తుంది. దాని పర్యవసానంగా అతడు అనారోగ్యానికి, ఆత్మ విభ్రమానికి లోనయ్యే ప్రమాదముంటుంది. బాహ్యవిషయాలను ప్రక్కకు నెట్టివేయకుండా వెనుకకుతగ్గి నిలబడి వాటిని ఒక నూతన చేతనతో, నూతన దృష్టితో గమనిస్తూ, ఈ నూతన చేతన నుండి వాటిపై పనిచేస్తూ అధికాధికంగా ఆంతరంలో జీవించి ఉత్తమ మధ్యే మార్గాన్ని అనుసరించుట ఉత్తమం. ఒక చేతన నుండి మరో చేతనకు మారే ఈ ప్రక్రియలో భాగంగా బాహ్య సంబంధాలకు పూర్తిగా ఉద్వాసన చెప్పకుండా వాటిని వీలైనంత వరకు తగ్గించుకోవడం అనేది కొంతమందికి కొన్ని దశల్లో అవసరం ఉంటుంది. ఈ

విషయంలో ఒక జవదాటరాని నియమాన్ని విధించలేము.
(CWSA 32:137-38)

శ్రీఅరవిందులు
అనువాదం: కె. వి. రావు

శ్రీఅరవిందాశ్రమం వెలుపల సాగే సాధన

చిట్ట చివరిగా ప్రతి వ్యక్తి ఇక్కడికి వచ్చి పాండిచ్చేరి ఆశ్రమంలో చేరాలని అనుకోవడం ఒక పెద్ద పొరపాటు. శ్రీమాత ఉద్దేశ్యం అది కాదు. అదీ కాక అది భౌతికంగా కూడా సాధ్యం కాదు. సాధించవలసిన కార్యం ఒక్క పాండిచ్చేరికి మాత్రమే పరిమిత మైనది కాదు.
(CWSA 35:815)

*

ఆశ్రమానికి వెలుపల వుండి కూడా యోగసాధన చేయడం సంభవమే. ఉత్తర, దక్షిణ భారతదేశంలో ఆ విధంగా సాధన చేసేవారు చాలామంది ఉన్నారు.
(CWSA 32:106)

*

ఈ అంతరంగ సంస్పర్శ, అంతరంగ సహాయం దూరంగా ఉండి కూడా చక్కగా అందుకోవచ్చు.... ఆ విధంగా సహాయం పొందుతున్న మా అనుయాయులు కొందరు ఫ్రాన్సులో కూడా ఉన్నారు. అందులో కొంతమంది మాతో చాలా దగ్గిర ఆంతరంగిక సంబంధం స్థిరపరచుకుని వారి ఆధ్యాత్మిక సాధన, అనుభవాల్లో మా సాన్నిధ్యసహకారాల ఎరుక గలిగి సాధన చేస్తున్నారు.
(CWSA 32:107)

*

ఇక్కడ అభ్యాసం చేస్తున్న యోగం యొక్క లక్ష్యం ఒక ఉన్నత చైతన్యానికి ఎదగడం, మరే సామాన్య ఉద్దేశ్యాలు లేకుండా అదే ఉన్నత చైతన్యంలో జీవించడం. దాని అర్థం జీవితంలోను, చైతన్యంలోను మార్పు కలగడం. కాని అందరూ

వారి సామాన్య జీవితం నించి పూర్తిగా విడివడి వుండే పరిస్థితులు కలిగి ఉండరు. అందువలన వారు వారి సామాన్య జీవితాన్నే వారి ప్రాథమిక ఆధ్యాత్మిక శిక్షణలో, అనుభవానికి భూమికగా, స్వీయ శిక్షణా కేంద్రంగా భావిస్తారు. అయితే వారు దాన్ని కేవలం అనుభవానికి కేంద్రంగా భావించి, వారి జీవన విధానంలోని సామాన్య కోరికలు, అనుబంధాలు, ఆలోచనల నుండి స్వేచ్ఛను పొందాలి; లేనట్లయితే అవి వారి సాధనకు భారంగా, ఆటంకంగా మారుతాయి.

(CWSA 28:422)

*

ప్రశ్న: నేను యోగసాధన చేస్తున్నానా అన్నది నాకు అర్థం కావటం లేదు; నేను పూర్ణయోగ సాధన చేస్తున్నానని అనవచ్చా?

శ్రీమాత దిశగా మరలిన వారందరూ నా యోగాన్ని చేస్తున్నవారే. పూర్ణయోగాన్ని ఏ వ్యక్తి కూడా తానే 'చేయగలనని' అనుకోవడం గొప్ప పొరపాటు — అంటే ఈ యోగంలోని అన్ని పార్శ్వాలను స్వయంగా నిర్వహించగలగడం ఏ మానవమాత్రుడికీ సాధ్యం కాదు. ఎవరైనా చేయగలిగినది తనను తాను శ్రీమాత హస్తగతం గావించుకొని సేవాభావంతో, భక్తితో, ఆకాంక్షతో ఆమెకు తెరుచుకుని ఉండడమే. అప్పుడు శ్రీమాత ఆమె దివ్యశక్తి ప్రకాశాలతో వారిలో పనిచేసి వారు సాధన చేయడానికి తోడ్పడుతుంది. ఓ గొప్ప పూర్ణయోగి కావాలనీ, అతిమానసజీవి కావాలనీ ఆశించడం గాని, సాధనలో ఎంత ముందుకు వెళ్ళామన్న విషయం మీదే దృష్టి పెట్టడంగాని పొరపాటే. సరైన వైఖరి ఏమిటంటే సంపూర్ణంగా శ్రీమాతకు మనలను మనం భక్తితో సమర్పించుకుని, నీవు ఏమి కావాలని ఆమె కోరుతుందో అది కావాలని కోరుకోవడం. మిగిలినదంతా ఆమె నిర్ణయాన్ననుసరించి నీలో జరుగుతుంది.

(CWSA 32:151-52)

*

ప్రశ్న: ఒక విలేఖరి తన లేఖలో మీ నుంచి ఆధ్యాత్మిక దీక్ష పొందవచ్చా, అది సంభవమా అని అడుగుతున్నాడు.

ఆధ్యాత్మిక దీక్షను పొందడానికి ఒక ఔపచారిక పద్ధతి అంటూ ఏమీ లేదు, అంగీకారం చాలు.

(CWSA 35:551)

*

మంత్రదీక్ష ఇక్కడే తీసుకోవటడం అవసరమని, అందుకోసం అతను ఇక్కడికి రావాలను కొన్న నీ స్నేహితుని ఆలోచన పూర్తిగా పొరపాటు. ఈ యోగంలో ఏ మంత్రం ఇవ్వబడదు. అంతరంగ చేతనను శ్రీమాతకు తెరుచుకుని ఉంచడమే నిజమైన ప్రారంభ దీక్ష. అది ఆకాంక్ష ద్వారాను, మానసిక, ప్రాణికాలలోని అశాంతిని, అస్థిరతని తొలగించుకోవడం ద్వారా మాత్రమే పొందగలం. ఇక్కడికి రావడం అన్నది దానిని పొందడానికి మార్గం కాదు.

(CWSA 35:825)

శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

సరైన లౌకిక జీవన వైఖరి

లోకంలో జీవనం కొనసాగిస్తున్నప్పుడు, ఆశ్రమంలో మాదిరిగా వ్యవహరించ లేరు. ఇతరులతో కలసి మెలసి వుండాలి. కనీసం పైకి కనిపించే విధంగానైనా ఇతరులతో సాధారణ సంబంధాలున్నట్లుగా మెలగాలి. అంతఃచేతనను దైవానికి ఉన్మీలనం గావించి అందులోకి ఎదగడం ముఖ్యం. అలా చేస్తూపోతే సాధన యొక్క అంతర్గత తీవ్రతకు అనుగుణంగా, ఇతరుల వైపు మన వైఖరిలో మార్పు చోటు చేసుకుంటుంది. అన్నీ అధికాధికంగా దైవపరమైనవిగా కనిపిస్తాయి. అనుభూతులు, ఆచరణలు మొదలైన వన్నీ గత బాహ్య ప్రతిస్పందనల ప్రేరణతోగాక నీలో వృద్ధి పొందుతున్న చైతన్యంతో ప్రభావితమౌతాయి.

(CWSA 23:869)

*

సాధారణ వృత్తి వ్యాపారాలలో మునిగి, సామాన్య పరిసరాలలో జీవితం గడుపుతూ, ఆధ్యాత్మిక జీవన సరళికి తమను తాము సంసిద్ధపరచు కొనగోరేవారు అవలంభించవలసిన అత్యుత్తమ మార్గం, గీతా ప్రభోదితమగు సంపూర్ణ సమానత, సమత, నిరపేక్షతలను పాటిస్తూ, ప్రస్తుతం అపారమైన అజ్ఞానాంధకార బంధుర పరిస్థితులలో చిక్కుకొని వున్నప్పటికీ, దైవమనే వాడున్నాడని, దైవసంకల్పమే అన్నింటి

లోను పని జేస్తున్నదనే ధృఢ సంకల్పం కలిగి వుండడం. ఈ స్థితికి పైగా జీవితం అందుకోవాలని ప్రయాసపడే దివ్యతేజోమయ, దివ్యానందమయ స్థితి వుంది. ప్రతి జీవిలోను, ప్రకృతిలోను ఆ స్థితి ఏర్పడి స్థిరపడటానికి ఉత్తమమైన మార్గం ఈ ఆధ్యాత్మిక సమానతలో ఎదగడమే. అయిష్టమైన, అనంగీకారమైన విషయాల వలన తారసపడే కష్టాలను కూడా ఇది పరిష్కరిస్తుంది. అసంతుష్టినంతా ఈ సమతా స్ఫూర్తితో ఎదుర్కోవాలి.

(CWSA 23: 869)

*

సాంసారిక జీవితం అలజడి అలముకొన్న క్షేత్రం లాంటిది. సరైన మార్గంలో సంసారం గడపాలంటే జీవితాన్ని, కార్యక్రమాలను, దైవార్పితం గావించి, అంతరాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించాలి. మనస్సు ఎప్పుడైతే నిశ్చలమౌతుందో, దివ్యమాత జీవితానికి ఆసరాగా నిలుచున్నదనే భావన ధృఢపడుతుంది. అప్పుడు సర్వమూ ఆమె హస్తగతం గావించాలి.

(CWSA 23:870)

*

ప్రాపంచిక జీవితంలో శాంతిని అవిచ్ఛిన్నంగా పొందటం సులభం కాదు. అంతర్ముఖంగా జీవితం కొనసాగిస్తూ, బాహ్య కార్యక్రమాలను కేవలం అస్తిత్వపు ముఖద్వార అలంకారార్థంగా పరిగణించితే తప్ప అది సాధ్యపడదు.

(SABCL 23:870)

*

ఆశ్రమంలో మాదిరిగానే రక్షణ, సహాయం అందుబాటులో నుంటాయి. నీవు చేయవలసిన దల్లా కేవలం నిన్ను నీవు వాటికి ఉన్మీలనం గావించుకొని, అంతర్ముఖుడవై జీవనం కొనసాగిస్తూ, దైవసాన్నిధ్యము, దైవశక్తి యొక్క అనుభూతిని పొందుటకుగాను మరింత అధికంగా చైతన్యవంతుడ వగుటకు ప్రయత్నించాలి.

ఇక బొంబాయి వాతావరణం విషయంలో, అంతర్ముఖంగా దానికి దూరంగా నుండు — ఇతరులతో కలసి మెలసి వున్నప్పుడు సైతం. దానిని నీకుగా నీవు నివాస మేర్పరుచుకున్న అంతరంగ ప్రపంచానికి చెందనిదానిగా, బాహ్యప్రపంచానికి చెందినదానిగా పరిగణించు. ఇలాంటి వేర్పాటు భావాన్ని పెంచుకోగలిగితే, దాని

దైనందిన ఒత్తిడి ఎంతగా నున్నా, అది నిన్ను వ్యాకులపరచలేదు.
(CWSA 35:811-12)

*

ఆశ్రమంలోని పనికీ, బయట ప్రపంచంలోని పనికీ, కచ్చితంగా తేడా వుంటుంది. బయటి ప్రపంచపు పని ఏమాత్రం ప్రత్యేకించి దైవపరమైనది కాదు. అది సర్వ సాధారణంగా ప్రపంచంలో నెరవేర్చబడే మామూలు పని. అయినప్పటికీ, దానిని ఒక శిక్షణగా స్వీకరించి, కర్మయోగ స్ఫూర్తితో నెరవేర్చాలి. ఇక్కడ ముఖ్యంగా పరిగణించాల్సింది, అది ఎలాంటి పని అని కాదు, అది ఏ స్ఫూర్తితో నిర్వర్తించాలని. అది గీత యొక్క స్ఫూర్తితో నిర్వర్తించబడాలి — నిరపేక్షగా, నిర్వ్యామోహంగా, వికర్షణకు లోను గాకుండా, సాధ్యమైనంత పరిపూర్ణంగా, స్వకుటుంబ శ్రేయస్సు కోసమో, స్వప్రయోజనం కోసమో లేక అధికారుల మెప్పుకోసమో కాక కేవలం నెరవేర్చబడటానికే అది నీ చేతికి అప్పగించబడిందనే స్ఫూర్తితో నిర్వర్తించాలి. అది కేవలం అంతరంగ శిక్షణాక్షేత్రమే తప్ప, అంతకు మించి మరేమీ కాదు. దీనిలో మూడు విషయాల్లు నేర్చుకోవలసి వుంటుంది — సమత్వం, నిరపేక్షత, అంకితభావం. పని చేయడమనేది కేవలం పని చేయాలని మాత్రమే చేసేది కాకూడదు. ఆ పనిని చేయటం, పనిచేసే విధానం, రెండూ దైవార్పితం గావించాలి. ఆ స్ఫూర్తితో నెరవేర్చినట్లయితే, అది ఏ పని అయినా ఫరవాలేదు. ఆ విధంగా ఎవరికి వారు ఆధ్యాత్మికంగా శిక్షణ నిచ్చుకొన్నట్లయితే, అప్పుడు ఎవరైనా దైవం కోసం (ఆశ్రమానికి చెందిన పని లాంటిది) అప్పగించబడిన ఎలాంటి అసాధారణమైన పనినైనా, ఏ నాడైనా, సక్రమ మార్గంలో నెరవేర్చడానికి సంసిద్ధులై వుంటారు.
(CWSA 35:753-54)

*

నిర్వర్తించ వలసిన పని ఏ విధంగా నిర్వర్తించాలో తెలుసుకోవటం బాహ్యామనస్సుకు మించిన పని. జ్ఞానదీప్తి, అనుభవము పెంపొందిన రోజున అది తెలుసుకోవడం ప్రారంభిస్తుంది. బాహ్యామనస్సుకు తనంతట తానుగా తెలుసుకోవటం కష్టతరమే గాక తలకు మించిన పని. అది కేవలం ఇష్టపూర్తిగా సన్నద్ధమై, ఆకాంక్ష, విశ్వాసం, నిశ్చలతతో పనిజేయుటకు ఉద్యుక్తమై వున్న దివ్యశక్తికి చేదోడుగా నుండగలదు.
(CWSA 32:157)

అయితే, ఏ సాధకునిలో కూడ ఈ విషయాలు అవిచ్ఛిన్నంగా కొనసాగవు. ఆకాంక్ష తాత్కాలికంగా ఆగిపోవచ్చు. విశ్వాసం చెదరిపోవచ్చు. నిశ్చలత చలించవచ్చు — అయినప్పటికి, దివ్యమాత ఆదుకొనుటకు అందుబాటులో నుంటుంది కాని సాధకుడు దీక్షను సడల నీయకూడదు. సమకూరే సాఫల్యత ఆ దీక్షాతత్పరత సానుకూలతను నిరూపిస్తుంది.

విరమించడం మాత్రం ఎప్పటికీ చేయకూడని పని

(CWSA 32:157)

*

బాహ్య పరిస్థితులకు మన అంతరంగ ప్రతిస్పందన వున్నంతగా అంతర్గత ఆధ్యాత్మికాభివృద్ధి వాటిపై ఆధారపడదు. ఆధ్యాత్మికానుభవ అంతిమ నిర్ణయం అన్ని వేళలా ఆ విధంగానే వుంటుంది. ఆ కారణంగానే మనం ఉచితమైన వైఖరి నవలంభించి దానిని గట్టిగా అనుసరించాలనే పట్టుదలతో నుంటాము. అది బాహ్య పరిస్థితులపై ఆధారపడని అంతర్గత పరిస్థితి, సమత, నిశ్చలత నెలకొని వుండే స్థితి. ఆ స్థితి తక్షణ అంతరంగ, ఆనందమయ స్థితిని కలిగించకపోయినా సర్వదా జీవితంలోగాని ఆఘాతాలను, అటుపోట్లను అనుభవించే ఉపరితల మనస్సులో మనుగడ సాగించటానికి బదులు, మరింత అంతర్ముఖంగా పయనించి, అంతరంగపు లోతుల్లో నుండి బయటి ప్రపంచాన్ని గమనించగలిగేటట్లు చేస్తుంది. అలాంటి అంతరంగ స్థితి సిద్ధించినప్పుడే వ్యక్తి ఐహిక జీవితానికన్నా, అలజడి కలిగించే దాని శక్తులకన్నా బలమైన శక్తిని పుంజుకొని, గెలుపొందే ఆశలను పెంచుకోగలడు.

అంతరంగంలో ప్రశాంతంగా నుంటూ, ఆటంకాలను ఛేదిస్తూ ముందుకు దూసుకు పోవాలనే ధృఢసంకల్పంతో, కష్టాలకు, ఒడుదుడుకులకు చలించకుండా నిరుత్సాహ పడకుండా నుండగలుగుట ఈ దివ్యమార్గంలో నేర్చుకోవలసిన ప్రాథమిక విషయాల్లో ఒకటి. ఆ విధంగా గాక మరే విధంగా చేసినా, చైతన్య అస్థిరతను ప్రోత్సహించడమౌతుంది. ఏ అనుభవాన్ని నిలుపుకో లేకపోతున్నానని అసంతృప్తి ప్రకటిస్తున్నావో దానికి దోహదపడి నట్టవుతుంది. నీవు అంతరంగంలో ప్రశాంతంగా నిలకడగా వున్నప్పుడే అనుభవాలు తిన్నగా నిబ్బరంగా కొనసాగగలవు — అయినా, ఆటంకాలు, హెచ్చుతగ్గులు లేని సమయాలు లేకుండా వుండవు. అయితే, ఇవి సరైన రీతిలో సంస్కరించబడితే, సాధనలో తిరోభావ సమయాలు జీర్ణించుకొని

ఇముడ్చుకోగల సమయాలుగా మార్పు చెందుతాయి.
(SABCL 23:650-51)

*

బాహ్యంలో నెలకొని వున్న పరిస్థితుల కన్నా ఒక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనటం ముఖ్యం. ఎవరైనా దానిని సాధించుటతో పాటు తమదైన ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించుకొని, ఆధ్యాత్మిక వాయువులు పీలుస్తూ ఆ వాతావరణంలో జీవించగలగాలి. అభివృద్ధికి కావలసన యదార్థమైన స్థితి అదే.
(SABCL 23:650-51)

*

ఆత్మసమర్పణను ఆచరణాత్మకంగా అనుసరించగలిగేవారు తేజోమయ మార్గాన్ని అనుసరించగలరు. మొదట అది హృదయ కేంద్ర సమర్పణగా, అటు తరువాత అస్తిత్వపు అన్ని భాగాలలో చోటు చేసుకునే సర్వ సంపూర్ణ ఆత్మ సమర్పణ అవు తుంది. సాధకులు హృదయ కేంద్ర సమర్పణ తత్పరతను సిద్ధింపజేసుకొని దానిని నిలుపుకోగలిగితే, దైవంపై సంపూర్ణ విశ్వాసంతో జీవితంలో తటస్థించే సాధక బాధ కాలన్నీ దైవప్రసాదితాలుగా, ఆనందంగా స్వీకరించగలిగితే, వారి జీవిత మార్గం తేజోమయ మవడమే గాక, సక్రమ రీతిలో కులాసాగా సాగుతుంది. వారు సర్వ బాధా విముక్తులు కాకపోవచ్చు — ఏ సాధకుడికీ అది సాధ్యపడదు — కాని అంత రంగ మార్గ నిర్దేశనంపై గట్టి నమ్మకంతో, దానినే అధికంగా అనుసరిస్తూ, అలాంటి తేజోమయ మార్గం లభ్యం కాకపోయినా అలాంటి అంతరంగ మార్గనిర్దేశనం అందక పోయినా, బాధపడకుండా, బేజారు కాకుండా బాధలను భరించ గలుగుతారు. దైవం కలిగించే సాధక బాధకాలన్నీ — నిజానికి ఆతని చేష్టలు మనకు అర్థం కాక పోయినా — మన మంచి కోసమేననే అవగాహన ధృవిశ్వాసంతో కూడి దివ్యానంద మయ భక్తిపారవశ్యకత లేక ఆధ్యాత్మిక ఆశావాద ప్రవృత్తి గలవారు కూడా ఆ మార్గాన్ని అనుసరించగలుగుతారు. అయితే అందరికీ ఆ స్వభావం వుండదు. అధిక శాతం ఆ భావనకు దూరంగా నుంటారు. సర్వసంపూర్ణ ఆత్మ సమర్పణేకాక ప్రాథమికమైన హృదయకేంద్ర సమర్పణ కూడా సిద్ధించడం అంత సులభం కాదు, దానిని సర్వదా నిలుపుకోవడం మన మానవ ప్రకృతికి అత్యంత క్లిష్టమైన పని. ఇది లేనట్లయితే, ఆత్మవిమోచన సాధ్యపడదు. అందువలన ప్రత్యామ్నాయంగా అనుశాసిత

నియమాలను శిరసావహించి పాటించాలి, లేదా ఒక కఠినమైన, కష్టతరమైన శిక్షణను పూర్తి చేయాలి.

(SABCL 24:1621)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

కేవలం ధ్యానం చేయడంతో స్వభావంలో మార్పు కలుగ జేయవచ్చుననేది మన అనుభవం కాదు. అలాగే బాహ్య కార్యకలాపాల నుండి, కర్మాచరణ నుండి విరమణ పొందితే ఎక్కువ లాభం చేకూరదని సాధకుల అనుభవం. అనేక సందర్భాలలో అది హానికరంగా పరిణమించింది కూడ. కొంత మేరకు ఏకాగ్రత వహించడం, ఒక హృదయాంతర్గత అభిలాష జనించటం, శ్రీమాత సమక్షంతో పాటు పైనుండి అవరోహించే దానికి చైతన్యాన్ని ఉన్మీలనం గావించటం, ఇందుకు అవసరం. కాని, కర్మాచరణ, కృషి. రెండూ లోపిం చినట్లయితే స్వభావంలో నిజమైన మార్పు కలుగదు. కర్మాచరణ, కృషితో పాటు వ్యక్తులతో సంబంధ బాంధ వ్యాలు నెరపడంలో వుంటుంది స్వభావ మార్పుకు అసలు పరీక్ష. ఇక ఒకరు చేసే పని విషయాని కొస్తే, ఉన్నతమైన లేక హీనమైన పనులంటూ లేవు. చేయబడే పనిని శ్రీమాతకు సమర్పణా భావంతో, శ్రీమాత నుద్దేశించి, శ్రీమాత శక్తికి లోబడి చేసినట్లయితే, అన్ని పనులూ సమా నమే.

(CWSA 32:252)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులవాటి కైలాసపతి

సులువైన మార్గం: శ్రీమాత అనుంగు బిడ్డగా నుండు

తల్లిబిడ్డల సంబంధం లోని అర్థం తల్లి బిడ్డను ప్రేమించటమే కాదు, బిడ్డ కూడా తల్లిని ప్రేమించి, ఆమె ఆదేశాలను పాటించాలి అని. నీవు శ్రీమాతకు అనుంగు బిడ్డగా నుండాలనుకుంటే, అందుకు మొట్టమొదట చేయాల్సింది నిన్ను నీవు ఆమెకు హస్తగతం గావించుకోవటం, ఆమె సంకల్పాన్ని అనుసరించటం, ఆమె ఇచ్ఛను ఉపేక్షించకుండా వుండటం — విముఖతతో ఎదురించకూడదు. ఇదంతా నీకు చాలా బాగా తెలుసు. అయితే దానిని ఎందుకు ఖాతరు చేయవు?

బిడ్డ యొక్క ప్రాణిక వాంఛ ఎలాంటిదైనా దానిని నెరవేర్చాలనటం నిజమైన మాతృప్రేమ అంగీకరించదు; ఎందుకనగా అది బిడ్డకు కీడు కలుగచేస్తుందని ఆమెకు తెలుసు. ప్రాణిక ప్రేరణకు లొంగిపోకుండా నీ నిజస్ఫూర్తిని అనుసరించి నిన్ను నీవు శ్రీమాత ఇచ్ఛకు వాహికగా మలచుకో — ఎందుకనగా నీవు నీ నిజ అస్తిత్వంలో ఎదగాలని ఆమె సర్వదా సంకల్పిస్తుంటుంది గనుక.

(CWSA 32:460)

*

చైత్యపురుషు సత్త సాఫల్యత, దాని జాగృతీకరణ, దానిని ప్రధానంగా నీ ముందు ఉంచుకొనుట, చాలా వరకు దైవంతో వ్యక్తిగత సంబంధం, భక్తి, ప్రేమ, విశ్వాసం, ఆత్మార్పణ, మనో ప్రాణ భౌతిక అహంభావాల విభాజిత, ఆదిపత్య పట్టుదలల నిరాకరణ ఎంత మేరకు పరిణతి చెందాయి అనే వాటిపై ఆధారపడి వుంటుంది.

(SABCL 22:344)

శ్రీఅరవిందులు

*

నీవు అన్ని విషయాలను మనఃపూర్వకంగా, నిర్భయంగా నాకు చెప్పాలి. అన్ని విషయాలు దాపరికం లేకుండా నాకు చెప్పటం, నిన్ను నాకు చేరువ చేస్తుంది.

(CWM 7:13)

శ్రీమాత

అనువాదం; అందుగులపాటి కైలాసపతి

దివ్యచైతన్య మార్పుకి ఎన్నుకోవలసిన మార్గం

ప్రశ్న: ఎప్పటికైనా నేను దివ్యచైతన్యాన్ని సాధించగలుగుతానా అని నా ఆశ్చర్యం.

1. ప్రశాంతమైన మనసు చైతన్యాన్ని సుగమం చేస్తుంది.
2. మనో ప్రశాంతత, నాతోనూ, దివ్యమాతతోనూ నిరంతరం సంబంధం కలిగి ఉంటే అన్నీ తెలికొతాయి, నేరుగా జరుగుతాయి — ఉన్నత చైతన్య సాక్షాత్కారం పొందడానికి 'ఇదొక్కటే మార్గం'.
3. దివ్యచైతన్య సాక్షాత్కారానికి ఈ విధానం పనికి రాదనుకోవడం పొరపాటు. 'దివ్యచైతన్య మార్పు దిశగా వెళ్ళాలంటే ఇదొక్కటే మార్గం.'
4. ఈ మార్గం సరైనది కాదేమోనన్న సంశయంతో వేరే మార్గాలను అనుసరించడం వల్ల, మళ్ళీ అయోమయంలో, పూర్తిగా అనిశ్చితులలో మునిగిపోతావు.
5. ఒకే ఒక్క మార్గాన్ని అనుసరించు — అది నీకు నేను చూపించిన మార్గం. ఈ మార్గంలో వెళితే నువ్వు కోరుకుంటున్న విశాలత్వాన్ని చేరతావు. అనేక దారుల్లో వెళుతుంటే, వచ్చేది అయోమయమే తప్ప విశాలత్వం కాదు.
6. నిమ్నప్రకృతిలో ఎన్నో ఉన్నాయి. కానీ అవన్నీ అసామరస్యంగా ఉన్నాయి. వాటిని అనుసరించడమంటే, అసామరస్యాన్ని, అయోమయాన్ని, వ్యవస్థీకృత లోపాన్ని, పోరాటాన్ని అనుసరించడమని అర్థం. ఉన్నత ప్రకృతిలో గొప్ప విశాలత్వం ఉంది. నిమ్నప్రకృతిలో ఉన్నదాని కంటే ఇంకెంతో ఉంది. అక్కడున్నదంతా, సామరస్యం, వ్యవస్థీకృతం, ప్రశాంతత. అందుకనే ఉన్నత చైతన్య ప్రకృతికి దారి చూపించే 'మార్గాన్ని మాత్రమే' అనుసరించాలి.
7. ఈ మార్గాననుసరించేటప్పుడు అసహనం ఉండకూడదు. ఎందుకంటే సంపూర్ణ జ్ఞానం ఒక్కసారిగా రాదు. ప్రశాంతమైన మనసుతో నాతో, దివ్యమాతతో సంబధం ఏర్పరుచుకోవాలి. నీలో సత్యప్రకాశాన్నీ, శక్తినీ పని చెయ్యనివ్వాలి. కాలం గడిచేకొద్దీ సంపూర్ణమైన జ్ఞానం వస్తుంది. నీలో సత్యం వృద్ధి అవుతుంది.

భూచైతన్య పరిణామంలో 'దివ్యచైతన్య మార్పు' రావడం నిర్ణయమైపోయింది. అది అనివార్యం. ఎందుకంటె దాని ఊర్ధ్వముఖ ఆరోహణ ఇఁకా పూర్తి కాలేదు. ఈ ఆరోహణా క్రమంలో 'మనసే' చేరవలసిన చివరి శిఖరం కాదు. ఆ దివ్యచైతన్య

మార్పు రావచ్చు, రూపాన్ని ధరించి నిరీక్షిస్తుండవచ్చు. ఈ మార్పును గుర్తించాలనే ఇచ్ఛతో కూడిన పిలుపు కింది నుంచి తప్పని సరిగా రావాలి. దివ్యప్రకాశం వచ్చినప్పుడు నిరాకరించకు. పైనుంచి పరమాత్మ అనుమతి కూడా తప్పనిసరిగా ఉండాలి. పరమాత్మ అనుమతి, పిలుపుల మధ్య అనుసంధాన శక్తి దివ్యమాత శక్తి. మానవుడి పాత్రకున్న పై కప్పును భిన్నం చేసి, మూసి ఉన్న తెరను చీల్చి, పాత్రను సంసిద్ధం చేసి, అస్పష్టత, అసత్యం, మృత్యువు, వేదనలతో నిండిన ప్రపంచంలోకి సత్యప్రకాశాలని, దివ్య జీవితాన్ని అమృత ఆనందాన్ని తీసుకురావడానికి, కేవలం, మానవప్రయత్నం, తపస్సులు మాత్రమే చాలవు. దివ్యమాత శక్తి మాత్రమే ఈ పని చేయగలదు.

(CWSA 32:26)

శ్రీఅరవిందులు

అనువాదం: డా. టి. వి. నాగరంజని

బాహ్యంలోని రణగొణ ధ్వనిని నిశ్శబ్దం చెయ్యి,
దైవసహాయాన్ని ఆకాంక్షించు;
అది వచ్చినప్పుడు దానికి సమగ్రంగా తెరుచుకో
దాని కర్మకి సమర్పణ చేసుకో.
నీ పరివర్తనని అది శక్తిమంతంగా నిర్వహిస్తుంది.

(CWM 15:87)

శ్రీమాత

అనువాదం: డా. టి. వి. నాగరంజని

కర్మాచరణలో దైవస్మృతి, దైవచైతన్యం

పరమాత్మ ఉనికిలో సర్వదా జీవించు. ఈ ఉనికే నిన్ను కదిలించేది, నువ్వు చేసే ప్రతి కార్యాన్ని జరిపించేది అన్న భావనలో జీవించు. నీ కదలిక లన్నింటినీ దానికే సమర్పించు. ప్రతి మానసిక చర్య మాత్రమే కాక, ప్రతి ఆలోచనను, ప్రతి అనుభూతిని, అతి సామాన్య బాహ్యచర్యలైన తినటం లాంటివి కూడా. నువ్వు తింటున్నపుడు దైవం నీ ద్వారా తింటున్నట్లుగా భావించాలి. ఆ విధంగా అన్ని చలనాలనూ దివ్య జీవితంలోకి సమీకరించినపుడు నీలో విభజనకు బదులుగా ఏకత్వాన్ని కలిగి వుంటావు. అప్పుడు నీ స్వభావంలో ఒక భాగం మాత్రమే దైవదత్తమై మిగిలినదంతా సాధారణ విషయాలలో నిమగ్నమై వుండదు. నీ మొత్తం జీవితం దైవదత్తం అవుతుంది. క్రమేపీ నీలో ఒక సమగ్రమైన రూపాంతరీకరణ సిద్ధిస్తుంది.

*

ప్రయత్నా లన్నింటిలో, అవి మేధోపరమైనవైనా, క్రియాశీలమైనవైనా అనుసరించవలసిన లక్ష్యం 'దైవస్మృతి కలిగి వుండాలి, దైవార్పణ గావించాలి'. ఇది కూడా నీకు ఒక అత్యుత్తమ క్రమశిక్షణ అవుతుంది. ఇది నిన్ను మూర్ఖమైన ఉపయోగం లేని పనులను చేయకుండా అడ్డుపడుతుంది.

(CWM 3:23,24,26)

శ్రీమాత

*

ధ్యానంలో నిశ్శబ్దంగా కూర్చున్నపుడు ఎవరికైనా గుర్తుంచుకోవటం, చైతన్యంగా వుండటం సులభం. పనిలో నిమగ్నమైవున్నప్పుడు ఇది కష్టమవుతుంది. పనిలో గుర్తుంచుకోవటం, చైతన్యంతో వుండటం అంచెలంచెలుగా రావాలి. ఇదంతా ఒక్కసారిగా రావాలని ఊహించకూడదు. ఎవ్వరు కూడా ఇదంతా ఒక్కసారిగా పొందలేరు. ఇది రెండు విధాలుగా వస్తుంది. మొదటిది ఏదైనా పని చేస్తున్నప్పుడు ప్రతిసారి శ్రీమాతను గుర్తుంచుకుని ఆమెకు ఆ పనిని అర్పించడం అభ్యసించినట్లయితే పనిచేస్తున్న సమయమంతా కాదు (పని ప్రారంభించడానికి ముందు లేక ఎప్పుడు గుర్తుకు వస్తే అప్పుడు) నిదానంగా అది సులభమై, నీ స్వభావంలో అలవాటుగా మారుతుంది. రెండవది ధ్యానం వలన ఒక అంతర్ చైతన్యం వృద్ధి చెందడం

ప్రారంభమవుతుంది. ఇది కొంత కాలం తరువాత హఠాత్తుగా కాకుండా యాంత్రికంగా ఇంకా ఎక్కువ స్థిరపడుతుంది. దీనిని బాహ్యంగా పని చేస్తున్నదాని నుండి వచ్చే ఒక ప్రత్యేక చైతన్యం లాగ భావిస్తాము.

ప్రప్రధమంగా ఈ ప్రత్యేక చైతన్యాన్ని పనిచేస్తున్నపుడు అనుభవించలేము. పని ఎప్పుడైతే ముగుస్తుందో అప్పుడు వెనుక నుండి సర్వదా అది గమనిస్తున్నదనే భావన కలుగుతుంది. అటు తర్వాత పనిచేస్తున్నపుడు కూడా అలాంటి భావన కలగడం ప్రారంభమౌతుంది. మనలో రెండు భాగాలు ఉన్నట్లుగా, ఒకరు వెనుక నుండి గమనిస్తూ, సహకరిస్తూ, శ్రీమాతను గుర్తు చేసుకుంటూ, ఆమెకు అర్పించుకుంటూ, ఇంకొకరు పనిచేస్తున్నట్లుగా వుంటుంది. ఇది ఎప్పుడు మొదలవుతుందో అప్పుడు సత్యచైతన్యంతో పనిచేయడం ఇంకా సులువవుతుంది.

మిగిలినదంతా కూడా ఇలాగే జరుగుతుంది. అంతర్ చైతన్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారానే మనం మాట్లాడే విషయాలన్నీ క్రమబద్ధం చేయబడుతాయి. ఉదాహరణకు అస్తిత్వంలోని ఒక భాగం పనిచేయడానికి ఉత్సాహం కలిగి వుంటుంది. ఇంకొకటి ప్రశాంతతలోని స్తబ్దతను అనుభవిస్తూ పనికి ఎక్కువగా ఉన్ముఖం కాదు. ఆ సమయంలో ఏది బయటకి వస్తుందో దాని మీద నీ మనః స్థితి ఆధారపడుతుంది. అందరి విషయములో అలాగే ఉంటుంది. రెండింటినీ కలపటం చాలా కష్టం. కానీ అవి రెండూ పునరైక్యమయ్యే సమయం ఒకటి వస్తుంది. ఒకటి అంతర్ముఖంగా ఏకాగ్రత వహిస్తే, మరొకటి కర్మాచరణకు ప్రోత్సహించబడుతుంది. స్వభావంలో రూపాంతర పరిణామం చోటు చేసుకొనుట, అస్తిత్వంలో సామరస్యం లేని అన్ని విషయాలను క్రమపరచుట సాధన నెరవేరుస్తుంది. కనుక నీలో ఈ విషయాలను గమనించి నువ్వు నిరుత్సాహపడవలసిన అవసరం లేదు. ఇవన్నీ తనలో కను గొననివారంటూ ఉండరు. ఇదంతా సాధకుడి స్థిరమైన సమ్మతితో, అతని పిలుపు మేరకు అంతరంగంలోని దివ్యశక్తితో ఏర్పాటు చేయబడతాయి. సాధకుడు తనంతట తానే ఇదంతా చేయలేడు. కానీ లోపలున్న దివ్యశక్తి ప్రమేయంతో అంతా చేయ బడుతుంది.

శ్రీ అరవిందులు

అనువాదం: వి సునీత శేఖర్

దైవసాక్షాత్కారాన్ని గ్రహించగల భూమికగా ఉండు

ప్రశ్న: శ్రీమాత! ఉదాహరణకు ఎవరైనా దురంగా మరింత దూరంగా దూకటానికై ప్రయత్నించినట్లు, దైవకార్య నిర్వహణలో వ్యక్తి ఏ విధంగా మెలగాలి?

శ్రీమాత: ఓహ్! సారీ! ఎవరైనా దూకటం అంటూ చేస్తే అది అందులోని ఆనందం కోసం కాదు. అలా చేయటం వలన అది తన కార్యకలాపాలను సమర్థవంతంగా నెరవేర్చే పరికరంగా రూపొందించుకొని, దైవం నుండి అందే శక్తులను సరిగ్గా అందుకొని వాటిని ఆవిష్కరించాలని.

అంతే కాదు. ప్రతిదానిని, వ్యక్తి చేసే ప్రతి పనిని, ఈ భావనతోనే చేయాలి. లేని యెడల నీ కివ్వబడిన అవకాశంతో లాభం పొందలేవు. నీకు అంది వచ్చిన పరిస్థితులతోను లాభం పొందలేవు. ఇంతకు ముందు నీకు విపులంగా చెప్పానా లేదా. అన్ని విషయాలలోను తన ఉనికిని చాటడానికి. అన్ని కదలికలలోను అభివ్యక్తమగుటకు దివ్యచేతన ఇక్కడ సాక్షాత్కరించిందని. అయితే నీ వైపు నుండి, నీవు చేస్తున్న ప్రయత్నములన్నీ, నీవు సాధిస్తున్న అభివృద్ధి అంతా, ఆ దివ్యచేతనను నీవు అందుకొనుటకు, దానిని ప్రకటించుటకు, మరింత సమర్థవంతంగా నెరవేర్చుటకేనని నిన్ను నీవు సమాధానపరచుకుంటే, సహజంగానే నీ పని మరింత మెరుగ్గా, వేగంగా నెరవేర్చబడుతుంది. నిజం చెప్పాలంటే, ఇదంతా చాలా ప్రాథమిక స్థితి అని నా కనిపిస్తున్నది. మరో విధంగా కూడా వుండగలదనేది నా కాశ్చర్యం కలిగిస్తున్నది.

(CWM 6:269)

శ్రీమాత

*

దివ్యశక్తి ప్రేరణ మార్గదర్శి మాత్రమే కాదు. నీ ద్వారా జరిగే పనులన్నింటిని తానే నిర్వహిస్తున్నది. నీ కదలికలన్నీ ఆమె నుండే ప్రారంభమౌతాయి. నీ శక్తులన్నీ ఆమెవే. నీ మనో ప్రాణ శరీరాలు ఆమె సచేతన ఆనందమయ కార్యాచరణ పరికరాలు, ఆమె లీలా వినోద సాధనాలు, ఈ భౌతిక ప్రపంచంలో ఆమె సాక్షాత్కార భూమికలు.

శ్రీఅరవిందులు

అనువాదం: కవితా శ్రీధర్

జీవితం మొత్తం రూపాంతరీకరించబడాలి

పూర్ణయోగంలో జీవితం ఆసాంతం, అతి సూక్ష్మ స్వల్పాతి స్వల్ప అంశం వరకూ పరివర్తింపబడాలి, దివ్యీకరించబడాలి. ఇక్కడ నిరర్థకమైనది, ఉదాసీనమైనది అంటూ ఏదీ లేదు.

"నేను ధ్యానం చేసేటప్పుడు, తత్వజ్ఞాన సంబంధిత సాహిత్యం చదివేటప్పుడు, తత్ సంబంధిత సంభాషణలు వినేటప్పుడు దివియ వెలుగుకు ఉన్మీలనమై దానిని స్వాగతించే స్థితిలో ఉంటాను; తరువాత మిత్రులను చూడ్డానికనో లేక వ్యాహ్యాళికనో వెళ్ళినప్పుడు ఆ స్థితిని గురించి పూర్తిగా మరిచిపోగలను. ఈ వైఖరిని మొండిగా అనుసరించుటలో అర్థం, నీవు పరివర్తన చెందకుండా ఉన్నట్లే. ఇహ నిజమైన తాదాత్మ్యత నీలో కలుగదు. నీవు ఎల్లప్పుడూ విడివడి వుంటావు. మహా అయితే ఆ మహోన్నతమైన జీవన కొసమెరుపులు మాత్రమే అందుకోగలవు."

ఎందుకనగా కొన్ని అనుభవాలు, సాక్షాత్కారాలు నీవు చేసే ధ్యానంలోనో లేదా నీ అంతర్గత చైతన్యంలోనో తటస్థించినా, నీ శరీరం, నీ బాహ్యజీవితం మాత్రం మార్పుచెందకుండా అలానే వుండిపోతాయి. ఆంతరిక వికాసము — దేహాన్నిగాని, బయటి జీవితాన్నిగానీ లెక్కలోనికి తీసుకోనిది — గొప్పగా ఉపయోగకారి కాదు. అది ప్రపంచాన్ని యధాతథంగా వుంచేస్తుంది. ఇప్పటి వరకూ ఇది నిరాటంకంగా కొనసాగుతూ వచ్చింది. ఎంతో గొప్ప శక్తివంతమైన సిద్ధిని పొందినవారైనా ప్రాపంచిక జీవితం నుండి తిరోగమించి, ఏ చీకుచింతా లేని ఆంతరిక నీరవ శాంతిలో వుండిపోయారు. ఈ లోకాన్ని దాని స్వంత పోకడలకూ, దాని వేదనకూ, మూర్ఖత్వానికి దానిని వదలివేసారు. ఎట్లాంటి మార్పుకూ ప్రభావితం కాకుండా, ఈ భౌతిక అస్తిత్వ స్తరంలో రాజ్యమేలుతూ, అజ్ఞానం, మృత్యువులు కొనసాగుతున్నాయి.

ఈ రకమైన ఆదర్శమన్నది దానిని కోరుకొనేవారికి మంచిదే కావచ్చు, కానీ అది మన యోగం కాదు. ఈ ప్రపంచాన్ని దాని పోకడలన్నింటినీ దైవపరం గావించాలని, దైవసాక్షాత్కారం ఈ భూమిపై జరగాలని మనం అభిలషిస్తున్నాం. కానీ ఆ దైవమిక్కడే రాజ్య మేలాలని కాంక్షిస్తే, మనదైన దానిని, మనం చేసేదానిని, మనతో సహా, సమస్తం దైవానికే అర్పించి తీరాలి. ఏది కూడా అప్రధానమైనదని లేక బాహ్య జీవితము, దాని అవసరాలు దివ్యజీవనంలో భాగం కాదనే ఆలోచన కలుగ కూడదు.

అలా ఆలోచించిన పక్షంలో మన మెప్పుడూ ఎక్కడున్నామో, ఎలా వున్నామో అలానే ఉండిపోతాం. ఈ బాహ్య ప్రపంచాన్ని గెలుపొందడ మన్నది ఉండదు. స్థిరంగా చేయాలనుకున్నది ఏది చేయబడదు.

(CWM 3:24-25)

*

ప్రశ్న: మానసిక కదలికలు, బౌద్ధిక అనుసరణలపై దృష్టి పెట్టినప్పుడు కొన్ని సందర్భాలలో దైవస్పర్శను విస్మరించడం లేదా కోల్పోవడం ఎందుకు జరుగుతుంది?

జవాబు: ఎందుకంటే నీ చేతన యింకా విభాజితమై వున్నది. ఆ దైవం నీ మానసంలో పూర్తిగా స్థిరపడలేదు. దివ్యజీవనం నీలో పూర్తిగా ప్రతిష్ఠింపబడలేదు. కాకపోతే ఎంతమేరకైనా ఈ విషయాలపై కేంద్రీకరించి నప్పటికీ, దైవంపై ఆధారపడి, సహాయం స్వీకరిస్తున్న అనుభూతిని నీవు పొందగలవు.

ప్రశ్న: పని ప్రారంభంలో దైవ స్ఫురణ వుంటుంది. కానీ పనిలో పూర్తిగా నిమగ్నమైనప్పుడు దైవాన్ని మరిచిపోవడం జరుగుతుంది. మరి నిరంతరం దైవాన్ని జ్ఞప్తి యందుంచుకోవడం ఎలా?

జవాబు: ఈ స్థితి ఏదైతే మన యోగం యొక్క నిజమైన లక్ష్యమై వున్నదో, దాని అంతిమ పరిపూర్ణ సాఫల్యత కోసం తక్కినదంతా సమాయత్తపరిచే ఒక పూర్వ ప్రయత్నమౌతున్నదో, అది ఒక చైతన్యం. ఆ చైతన్యంలో దైవం మనతో లేకుండా ఏది చేయాలన్నా అసాధ్యమే అవుతుంది. అప్పుడిక దైవం నీతో లేనప్పుడు నీవు చేసే పనికి మూల వనరు మాయమైపోతుంది. జ్ఞానమూ, శక్తి సర్వమూ అదృశ్యమైపోతాయి. కానీ నీవు ఉపయోగించే శక్తుల్ని నీ స్వంత శక్తులుగా తలచేంతవరకూ ఆ దైవ మందించే ఊతాన్ని కోల్పోవు.

యోగసాధన ప్రారంభంలో దైవాన్ని తరచుగా మరిచిపోతూనే వుంటావు. కానీ ఒక ధృఢమైన ఆకాంక్షతో నీ స్మరణను పెంచుకొంటూ పోతూ మరుపు తగ్గించుకొంటావు. కానీ ఇది తీవ్రమైన శిక్షణగానో, కఠోరమైన ఒక విధి నిర్వహణగానో జరుగకూడదు. చక్కని ప్రేమతో నిండు సంతోషంతో జరగాలి. దీని వల్ల అతి త్వరగానే నీవు చేసేది ఏదైనా దానిలో క్షణక్షణం దైవసన్నిధి అనుభవించ లేకపోతు

న్నప్పుడు ఆ ఒక్కొక్క క్షణం ఒక ఏకాకిలా, ఒంటరిగా, దిగులుగా, దుర్భరంగా భావించే స్థితి కలుగుతుంది.

నీ వెప్పుడైనా దైవసాన్నిధ్యాన్ని అనుభవించకుండా సులభంగా చేయగలుగుతున్నావంటే, అక్కడ నీ వర్థం చేసుకోవలసింది నీలోని ఆ ప్రత్యేక స్థాయిని లేక భాగాన్ని దైవానికి సమర్పించలేదని. ఇదిగో ఈ విధంగానే సామాన్య ప్రజానీకం దైవం అవసరమన్న అనుభూతి చెందకనే జీవించేస్తుంది. కానీ దివ్యజీవనాన్ని కాక్షించే వాడికి ఇది భిన్నంగా అనిపిస్తుంది.

దైవంతో పూర్తిగా మమేకమై వున్నట్లుగా నీవు గ్రహించినప్పుడు, దైవం నీ నుండి లిప్తపాటు వైదొలగినా, చప్పున ప్రాణాలు విడుస్తావు. ఎందుకంటే యిప్పుడు 'దైవం' నీ ప్రాణానికి ప్రాణం, ఆతడే నీ మొత్తం ఉనికికి ఏకైక, సంపూర్ణమైన ఆలంబన. దైవం లేకుండా ఏదీ వుండదు.

ప్రశ్న: యోగం తొలి దశల్లో సాధారణ స్థాయికి చెందిన పుస్తకాలు ఏవైనా సాధకుడు చదవడం మంచిదేనా?

జవాబు: పవిత్ర గ్రంథాలు చదువుతున్నా దైవానికి ఎంతో దూరంలో వుండవచ్చు. అలాగే ఎలాంటి వివేకశూన్యమైన పుస్తకాలు చదువుతున్నా, దైవంతో అవిభాజ్యంగా అతడి స్పర్శలోనే వుండవచ్చు. పరివర్తనానికున్న చేతన రుచిని చవి చూడనంతవరకూ పరివర్తిత చైతన్యం దాని పోకడలను గూర్చిన అవగాహన అన్నది సాధ్యం కాదు. దైవంతో తాదాత్మ్యం అన్న చైతన్యపథం ఒకటున్నది. నీవు గమనించినదానిని గ్రహించి, నీవు చదివినదంతా ఆనందించగలవు — పనికిరానివి, ఆసక్తి కలిగించనవి చదివి కూడా.

వినీ వినినంతనే పరుగులు పెట్టే కర్ణకఠోరమైన, అపశ్రావ్యమైన సంగీతాన్ని కూడ ఆకర్ణించగలవు. ఇక్కడ నీవు ఆలకించేది దాని బాహ్యమైన కూర్పును కాదు సుమా, దాని వెనుక నున్న భావనా రూపాన్ని ఆస్వాదిస్తావు. కానీ శ్రేష్టమైన సంగీతానికీ, నిమ్నస్థాయీ సంగీతానికి మధ్యనున్న వ్యత్యాసాన్ని, విచక్షణ కోల్పోకుండా, ఆ రెండింటిలోనూ అభివ్యక్తమయ్యేదానిని ఆస్వాదించగలవు. ఈ సమస్త లోకంలో తనదైన చరమ సత్యమూ, ఆధారమూ దైవంలో నెలకొననిదంటూ ఏదీ లేదు. కనిపించే వాటి భౌతికమైన, నైతికమైన లేదా కళాత్మక లక్షణాలతో ఆగిపోకుండా వాటి వెనుక వాటి లోలోపల వున్న దివ్యాత్మతో, దివ్యస్ఫూర్తితో స్పర్శ ననుభవించగలిగితే,

మామూలు భావనకు పేలవంగా, బాధాకరంగా, అసంగతంగా అనిపించే వాటి ద్వారా కూడా, సౌందర్యానందాల్లోకి చేరుకోగలవు.

(CWM 3:26-27) శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

మానసిక ఆందోళన — ఆధ్యాత్మిక శక్తిపై నమ్మకం

ప్రత్యేకంగా మనిషికి వ్యక్తిత్వాన్నిచ్చేది తనకు తాను తన జీవనశైలిని గమనించుకోగల సామర్థ్యము. జంతువులు బాహ్య ప్రేరణ లేకుండా, సహజంగా స్వయం చాలకంగా జీవిస్తుంటాయి. అవి తమను తాము స్వయంగా గమనించుకున్నా అది చాలా స్వల్పమైన, గుర్తించలేనంత ప్రమాణంలోనే ఉంటుంది. అందువలననే అవి ప్రశాంతంగా, బాధపడకుండా ఉండగలుగుతాయి. ఒక వేళ ఒక జంతువు అనారోగ్యం వలననో, ప్రమాదం వలననో బాధకు గురి అయితే అది దానిని గమనించకపోవటం వలన దాని వేదన కనీస స్థాయికి తగ్గించబడుతుంది. తన చేతనలోకి, భవిష్యత్తులోకి ఈ బాధను నిలువరించి ఉంచుకోకపోవటం వలన, తన అస్వస్థత. ప్రమాదం గురించి అతిగా ఊహించుకోకపోవటం వలన, ఆవేదన కనీస స్థాయికి తగ్గించబడుతుంది.

కానీ మనషి విషయంలో 'ఏమి జరుగుతుందో' అనే నిరంతరమైన చింత ప్రారంభమవుతుంది. ఈ చింత, కేవలమదే కాకపోయినా అతని వ్యధకు ముఖ్యమైన కారణమవుతుంది. ఈ కర్మణ చేతన వలన ఆందోళన, బాధాపూరితమైన ఊహలు, చింత, చిత్రహింస, భవిష్యత్తులో జరగబోయే విపత్తులు ముందుగా ఊహించటం మొదలుపెడతారు.

దీనితో ఎక్కువమంది మనుషులు, కనీస చేతన కాక గరిష్ఠమయిన చేతన కలిగినవారు ఒక ఎడతెగని దుఃఖంలో జీవిస్తూ ఉంటారు. ఉదాసీనంగా ఉండటానికి జాగృతమైన చేతనగల మానవుడు సిద్ధపడడు. కానీ జరగబోయేదేమిటని తెలుసకునేంత చేతన నతడు కలిగి ఉండడు. వాస్తవానికి, భూమి మీద ప్రాణులన్నింటిలోకి మనిషి అత్యంత దౌర్భాగ్యస్థితిలో ఉన్నాడని నిర్భయంగా చెప్పడంలో పొరపాటు లేదని చెప్పవచ్చు.

తన పూర్వీకుల నుండి సంక్రమించిన అనువంశిక స్థితి వలన మానవుడు అలా ఉండటం సంభవించింది, కానీ అది చాలా బాధాకరమైన స్థితి. కేవలం ఆధ్యాత్మిక శక్తితో ఒక ఉన్నతస్థాయికి ఎదిగి పశుప్రాయమైన అచేతన స్థానంలో ఆధ్యాత్మికమైన ఉన్నత చేతనను ప్రతిష్ఠించగలిగినప్పుడు వ్యక్తిలోనికి ఈ మనుగడ యొక్క అసలు గమ్యాన్ని వీక్షించగల శక్తి, ఈ ప్రయత్నం యొక్క ఫలితాన్ని ముందుగానే దర్శించగల సామర్థ్యమే కాక — బాధలన్నిటిని విడిచి వ్యక్తి త నజీవితపు బాధ్యతలను, భవితను, తన సర్వస్వాన్ని ఒక అత్యున్నత ఆధ్యాత్మిక శక్తికి సమర్పణ చేసుకొని నిశ్చింతగా ఉండగలుగుటను, సుస్పష్టంగా చూడగల విశ్వాసాన్ని కలిగి ఉండాలి.

తన చేతన కన్నా మిన్నయైన ఉన్నత చేతనకు సంపూర్ణంగా సమర్పణ గావించుకున్నప్పుడే దుఃఖానికొక ముగింపు సాధ్యం. వ్యక్తి తన బాధలనూ, తన జీవితాన్ని నడిపించే సంరక్షణా బాధ్యతను, అన్నిటిని వ్యవస్థీకరించే పనిని సంపూర్ణ విశ్వాసంతో ఆ శక్తి చేతిలో పెట్టవచ్చు.

అవసరమైన జ్ఞానం లేకుండా ఒక సమస్య ఎలా పరిష్కారమవుతుంది? దురదృష్టకరమైన విషయమేమిటంటే మనిషి తన సమస్య లన్నిటినీ తనే పరిష్కరించుకోగలనని నమ్ముతాడు. కానీ అతనికి అందుకు అవసరమయిన జ్ఞానం ఉండదు. అతని కష్టాలకదే మూలము, ప్రారంభము కూడా. అది 'నేనేం చెయ్యాలి' అనే ప్రశ్నను నిరంతరం లేవనెత్తుతూ, అంతకన్నా తీవ్రమయిన మరొక ప్రశ్నకు దారి తీస్తుంది, 'ఏం జరుగబోతుంది'. అదే సమయంలో అందుకు సమాధానం ఇవ్వలేని అసమర్థత కూడా అక్కడ ఉంటుంది.

ఈ కారణం చేతనే అన్ని ఆధ్యాత్మిక శిక్షణలు, అన్ని బాధ్యతలను, ఆ ఉన్నత శక్తికి సమర్పించి, దాని పైననే ఆధారపడటంతో ప్రారంభమవుతాయి, లేకపోతే శాంతి అసాధ్యమవుతుంది.

తరువాతి అడుగు అన్నీ తెలిసిన, మిమ్మల్ని నడిపించగల ఆ ఉన్నత శక్తితో సంపూర్ణమయిన నమ్మకంతో కలిగిన అచంచల విశ్వాసంతో సమస్యను ఎదుర్కోవటం. అప్పుడు కర్మను త్యజించడానికి బదులు ఒక ధృఢమైన, శక్తివంతమైన, ఉన్నతమైన ప్రశాంతస్థితిలో ఆచరణ సాధ్యమవుతుంది.

దీనినే జీవితంలో దైవ జోక్యంగా, మనుగడలో వినూత్న దివ్యశక్తుల జోక్యంగా

ఆధ్యాత్మిక సిద్ధి యొక్క ఒక నూతన దృక్కోణంగా చెప్పవచ్చు.

(CWM 9:303-305) శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

బాహ్యప్రపంచానికి కనపడని జీవితంతో చైతన్యానుబంధం

మంచి ఆహారం, ఖరీదయిన జీవితం, బాహ్యప్రపంచంలోని సుఖాలను అనుభవించాలనే ఆసక్తిగల మనిషికి తనను గురించిన ఎరుకను పొందటం, బయటకు కనపడని తన జీవితంతో చైతన్యానుబంధం ఏర్పరచుకోవడం ఆసక్తికరమనిపించవు. జరిగిపోయిన రోజును గూర్చి ఆలోచించినప్పుడు మనిషి, ఆ రోజు వస్తుపరంగా లాభం పొందినా కొంత సంతోషం పొందినా, భౌతిక తృప్తి కలిగినా అది విజయవంతమైన రోజుగా భావిస్తాడు. దానికి విరుద్ధంగా ఎదురు దెబ్బలు, అపజయాలు కలిగి, చేసినది మూర్ఖపు ఆలోచనలని జీవితం గుణపాఠం చెప్పినా, భగవంతుని గుర్తించి, కృతజ్ఞత తెలపక 'జీవితం అన్ని వేళలా వినోధభరితం కాదు' అని భావిస్తాడు.

మనిషి అంతర్ దృష్టితో, నిజమైన జీవితం అంటే ఏమిటి అనే ఆలోచనతో హృదయాంతరాళంలోకి తొంగి చూస్తే, విషయ సుఖాల వైపు పరుగిడుతూ, భౌతిక వస్తువులను కూడబెడుతూ అవి తన జీవితాన్ని సులభతరం చేస్తాయి, అదే నిజమైన సంతోషం అనే భావనలో అంతరంగ జీవిత వాస్తవికతను విస్మరిస్తాడు. అంతర్ దృష్టితో భగవంతుని శోధించి, గుర్తించాలి అనే భావన తిరిగి పొందడానికి గట్టి కృషి, సాధన అవసరం. అప్పుడు తన ఇష్టాయిష్టాలకు వ్యతిరేకంగా లక్ష్యసాధన దిశ అవగతమై జీవితం యొక్క అర్థం, ఆవశ్యకతలు తెలుస్తాయి. బహుశా మనిషి బాహ్యపరిణామాలు తనకు అనుకూలంగా లేనప్పుడు మాత్రమే తనని నడిపించే అతీత శక్తి లేదా భగవంతుని గూర్చి చింతన చేస్తాడేమో. ఆ దిశగా వెళ్లడానికి అపారమైన దీక్ష, పట్టుదల చాలా అవసరం.

సామాన్య గొర్రెల కాపరి రాత్రివేళ ఆరుబయట తన మందను కనిపెడ్తూ, నక్ష త్రాల ద్వారా భవిష్యత్తులో జరుగబోతున్నదానిని తెలుసుకొని ప్రకృతి సౌందర్యాలను

ఆస్వాదిస్తూ, ప్రశాంత జీవనాన్ని ప్రతిబింబిస్తున్న విషయాలను గ్రహించి, సామాన్య జీవన సౌరభాన్ని, శాంతిని అనుభవించేవాడు. దురదృష్టకరంగా ఒకటి పొందాలంటే ఇంకొకటి త్యాగం చేయవలసిన స్థితి. కానీ నేను అంతర్ముఖ జీవనశైలిని గూర్చి మాట్లాడుతున్నానంటే నూతన ఆవిష్కారాలను వ్యతిరేకించినట్లు కాదు. వస్తుప్రపంచ రహస్యాల అవగాహనతో వికసితులమై జీవితాలను ఎంత అసహజంగా, మూర్ఖంగా మార్చివేసుకున్నామో, అనవసరపు కోర్కెలను పెంచి సహజ సౌందర్య పిపాసను కోల్పోయామో!

బహుశా కాలచక్రంలో పైకి ఎదగడం కొనసాగించే సమయమాసన్నమైనదేమో! విషయపరంగా సముపార్జించిన జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక ప్రగతి పునాది చేసుకుని, తెలుసుకున్న సృష్టి రహస్యాలను వాడుకుంటూ, సుదూర తీరాలను కలుపుతూ పరమాణువులో నిక్షిప్తమైన పరమ సత్యాన్ని పునః ప్రదర్శించటానికి ఇదే సరైన సమయమేమో!

(CWM 3:205-206)

శ్రీమాత

అనువాదం: టి రాజకుమారి

మీరు నిజంగా దైవాన్ని ప్రేమిస్తే — నిశ్చలంగా ప్రశాంతంగా ఉండటం ద్వారా దానిని నిరూపించండి. ప్రతివారికి జీవితంలో సంభవించేవన్నీ ఒక అంశాన్ని బోధించటానికి దైవం నుండి వచ్చినవే. వాటిని మనం సరైన వైఖరితో తీసుకున్నప్పుడు మనం త్వరితగతిని ప్రగతి చెందుతాం.

అలా చేయటానికి ప్రయత్నించండి.

(CWM 14:219) శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

భగవంతుని పిలుపుకు, దివ్యతేజానికి విశ్వసనీయత కలిగి యుండుట

ఆత్మ జ్యోతి పట్ల, భగవంతుని పిలుపు పట్ల విశ్వాసం కలిగి ఉండాలి అంటే... నా సలహా ఎన్ని కష్టాలు, బాధలు వచ్చినా చెడు సలహాలను, కోరికలను, వ్యామోహాలను వ్యతిరేకించి పరమ సత్యము యొక్క దివ్యతేజం యొక్క బలంతో ఎదు ర్కోవాలి. అనుమానం, నిరాశలకు లోనైనప్పుడు, 'నేను భగవంతునికి చెందినవాడిని, విఫలం కాను, ఈ శరీరాన్ని అమృతత్వం వైపు నడిపించడానికి శ్రీమాతారవిందులు తమ బిడ్డగా నన్ను ఎంచుకున్నారు. నేను నా పట్ల, వారి పట్ల నిజాయితీగా ఉండాలి. అప్పుడే నేను కింద పడినా లేవగలను. నాకు విజయం కచ్చితంగా లభిస్తుంది' అని అనుకోవాలి. పనికిరాని కోరికలను విడిచి, మరో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని, 'ఇది చాలా అద్భుతమైన సత్యం, ఇదొక్కటే నాలోని అంతరాత్మని సంతృప్తి పరచగలదు. ఇది నన్ను అన్ని ఒడిదుడుకులకు, పరీక్షలకు తట్టుకుని దివ్యమైన ప్రయాణంలో ఒడ్డుకు చేర్చగలదు'. ఇదే నే చెప్పే భగవంతుని పిలుపు పట్ల, దివ్యతేజం పట్ల విశ్వాస నీయత అంటే.

శ్రీఅరవిందులు

అనువాదం టి. రాజకుమారి

ప్రాపంచిక పరిస్థితుల్లో యోగసాధన చేయుట కష్టం. అయితే అది బహు సమగ్రమైనది, సంపూర్ణమైనది

ప్రశ్న: "జీవన మనుగడకు చేసే సంపాదన సాధారణ నీతినియమాలకు అనుగుణంగా వుండాలా లేక మరింత కఠినంగా వుండాలా?" అన్న ప్రశ్నను *బయటున్న స్నేహితులు నన్ను అడుగుతుంటారు.*

సమా: నీ స్నేహితుడు గైకొన్న జీవిత దృక్పథంపై ఇది ఆధాపడి వుంటుంది. సాధకుడు కావాలనుకున్నవానికి సాధారణ నీతినియమావళి వల్ల ఏమీ ప్రయోజన ముండదు. సాధారణ జీవితాన్ని గడిపే సాధారణ వ్యక్తి అడిగే ప్రశ్న ఇది. కాదంటారా? ఒక దేశంలో నివసించే వ్యక్తి ఇబ్బంది పడకుండా వుండాలంటే ఆ దేశనియమాలను పాటించవలసిందే. కాని సాధారణ జీవితంలో వ్యావహారిక ప్రయోజనమే వుంటుంది. అందువల్ల వాటిని సాధారణంగానే పరిగణిస్తారు. సాధన చేసి దివ్యమైన జీవితంలో అడుగు పెట్టాలనుకున్న క్షణంలో వాటి విలువలు మారిపోతాయి. సాధారణ జీవితంలో నీవనకున్న నిజాయితి ఇచట నిజాయితీగా అనిపించదు. అంతేగాక తద్విరుద్ధంగా కన్పిస్తుంది. సాధారణ జీవితంలో వాడే భాషను ఇచట ఎంత మాత్రం ఉపయోగించ లేరు. దివ్యమైన జీవితానికి ఆత్మార్పణ చేసుకోవాలనుకున్నవారు చిత్తశుద్ధితో చేయాలి. ఏ స్వలాభాపేక్ష లేకుండా పూర్తిగా ఆత్మార్పణ చేయాలి. కేవలం దివ్య శక్తిపై ఆధారపడి నీ సర్వస్వాన్ని సమర్పించుకోవాలి. అపుడు ప్రతిదీ పూర్తిగా మారుతుంది. ప్రతిదీ తారుమారవుతుంది, కదా? నేనిప్పుడు పుస్తకంలో చదివిన అంశం యోగసాధన చేసేవారికి మాత్రమే వర్తిస్తుంది. ఇతరులకు వర్తించదు. వారికి అర్థమవదు. అర్థంలేని భాష అవుతుంది. కాని సాధకులకు అది తప్పనిసరి. మన మింతవరకు చదివిన దాంట్లో వుండే సారాంశమిదే. దివ్యజీవనంలో ఒక పాదం ఒక చోట, మరో పాదం మరొక చోట వుండకూడదు. భిన్నమార్గాల్లో పయనించే పడవలపై నిలబడకూడదు. 'ద్వంద్వ జీవితాలను' గడపకండి. ఏదో ఒకటి వదులుకోవాలి. రెండింటిని అనుసరించకూడదు. ఇదే శ్రీఅరవింద మహాశయులు నుడివింది.

జీవిత పరిస్థితుల నుండి బయటపడాలని కాదు దీని అర్థం. అంతర దృక్పథం పూర్తిగా మారిపోవాలి. అలవాటు ప్రకారం ఏదో చేస్తుంటాము. ఆ చేసేది అంతః దృక్పథంతో చేయాలి. యోగసాధన చేయటానికి ఆశ్రమాలకు వెళ్లాలని ఏకాంతంలో

వుండాలని, సర్వసంగ పరిత్యాగం చేయాలని చెప్పటం లేదు. ప్రాపంచిక పరిస్థితులలో యోగసాధన చేయటం బహు కష్టమన్నది సత్యం. అయితే ఆ యోగసాధన మరింత పరిపూర్ణమై, సమగ్రమైనదిగా వుంటుంది. ఎందుకంటే వ్యక్తి ప్రతి క్షణం, సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. సర్వసంగ పరిత్యాగులకు ఏకాంతవాసులకు ఈ సమస్యలు ఎదురుకావు. ఒకవేళ ఎదురైనా, అవి అతి స్వల్పం. జీవితంలో అన్ని రకాల కష్టాలు వస్తుంటాయి. నీ చుట్టూ వున్నవారి అవగాహన లేమితో ప్రారంభమవుతాయి. వాటి నెదుర్కొనుటకు సిద్ధంగా వుండాలి. ఓర్పు కలిగి వుండాలి. ఉదాసీనంగా వుండాలి. కాని యోగంలో ఇతరులు ఏమంటారో, ఏమనుకుంటారో అన్న భావం ఎంత మాత్రం రానీయకూడదు. ప్రారంభించడానికి ఇది తప్పక పాటించాలి. నీ గురించి లోకులు ఏమనుకున్నా, ఏమన్నా, ఎలా చూసినా లెక్కచేయకూడదు. మనుషుల అభిప్రాయం నీకు ముఖ్యం కాదు. అది నిన్నే మాత్రం అంటకూడదు. సర్వసంగ పరిత్యాగం చేయటం, ఏకాంతంలో వుండి యోగసాధన చేయటం కంటె సాధారణ పరిస్థితుల్లో చేయటం బహు కష్టం. సుళువైన వాటిని సాధించటానికి మన మిక్కడ లేము — మార్పును ఆశించనివారికి వాటిని వదిలేయండి.

శ్రీమాత

అనువాదం: ఎ. క్రిష్ణ



నిత్య జీవనంలో ఆధ్యాత్మిక ఆచరణ

అఖిల

అఖిలభారత పత్రిక

జూన్ 2014

8/6/2014

విషయసూచిక

యువతకు — ప్రేమతో అమ్మ

చూడండి, దురదృష్టకర విషయమేమిటంటే, మీ గురించిన విషయాల్లోనే మీరు నిమగ్నమై వుండటం. మీ వయసులో నేను అలాగే నా చదువులో మునిగి వుండేదాన్ని — మనస్సు కెక్కించుకోవటం, నేర్చుకోవటం, అర్థం చేసుకోవటం, తెలుసుకోవటం. అది నా ఆసక్తిగా నుండేది, అది నా తీవ్ర వాంఛ కూడా. మమ్ములను ఎంతగానో ప్రేమించే మా అమ్మ — నా సహోదరుణ్ణి, నన్ను — కోపావేశాలతోగాని, అసంతృప్తిగాకాని, సోమరిగాకాని వుండనిచ్చేది కాదు. మేము ఏదో విషయం గురించి ఫిర్యాదు చేయాలని, అసంతృప్తిగా వున్నామని చెప్పడానికి వెళ్తే, ఆమె నవ్వుతూ మందలించి, "ఏమిటీ మూర్ఖత్వం? ఎగతాళిగా వుందా? వెళ్ళి పని చూసుకోండి, మనసు బాగుంది, బాగా లేదు అనే విషయం పట్టించుకోవద్దు, అది ఏమాత్రం బాగుండదు", అనేది.

మా అమ్మ అన్నది సరైనదే. నాకు క్రమశిక్షణ గరపినందుకు, చేస్తున్న పనిపై మనస్సును నిలపడం వలన నన్ను నేను మరచిపోకుండా నుండే ఆవశ్యకతను నేర్పినందుకు, నేను ఆమెకు సర్వదా కృతజ్ఞురాలిని.

ఇది నీకు చెప్పింది ఎందుకంటే, నీవు ఆరాటపడటానికి కారణం నీవు నీ గురించిన విషయాల్లోనే అధికంగా నిమగ్నమై వుండటం. అలా కాకుండా, నీవు ఏ పనినైతే చేస్తున్నావో (చిత్రలేఖనము లేక సంగీతము) దానిపై ధ్యాసను ఎక్కువగా నిలిపినట్లయితే, ఇంకా సంస్కరించబడని నీ మనస్సును వికసింప చేసినట్లయితే, అజ్ఞానిగా, సంస్కారహీనుడిగా నుండుటకు బదులుగా మనిషికి అత్యావశ్యకమైన జ్ఞానమూలాలను నేర్చుకోగలిగితే, చాలా బాగుంటుంది.

క్రమబద్ధంగా రోజుకు ఎనిమిది నుంచి తొమ్మిది గంటలు శ్రమించినట్లయితే, నీవు ఆకలిగొంటావు, కడుపారా భోంచేస్తావు, హాయిగా నిద్రిస్తావు. నీ మనస్సు బాగుందా లేదా అని ఆలోచించే సమయం వుండదు.

నీకీ విషయాలు అత్యంత ప్రేమాదరణతో చెప్తున్నాను. అర్థం చేసుకుంటావని ఆశిస్తాను.

(CWM 2 Ed, 12:130) శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

వృత్తికి — అంతఃకరణకి మధ్య వైరుధ్యం

ప్రశ్న: మద్యం, మత్తుపానీయాల నాణ్యత, అభివృద్ధికి సంబంధించిన పరిశోధనా ప్రయోగశాలలో ఓ సంవత్సరం నుంచీ నేను పని చేస్తున్నాను. నేను ఉంటున్న ఈ దక్షిణ ఫ్రాన్స్‌లో, అధిక జనాభా యొక్క జీవనం ఈ మద్యానికి సంబంధించిన వ్యవసాయం, వర్తకం మీదే ఆధారపడి ఉంటుంది. ఈ మద్యం మానవులకు గొప్ప హానికారియని, అందులో ప్రేంచివారికి మరింత అపాయకరమని నాకు రూఢిగా తెలుసును గనుక, నేను మద్యం సేవించను. అందువల్ల నేను చేస్తున్న వృత్తి కారణంగా, నా అంతఃకరణ విభేదిస్తున్నది. నా అంతఃకరణ అడ్డు పడుతున్నందున, నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను, ఈ వాతావరణంలో సహకరిస్తూ నా పని కొనసాగించనా? అని.

ఇక్కడ కొన్ని సూచనలున్నాయి, అవి నీ సమస్యకు బహుశా పరిష్కారం చూపిస్తాయేమో.

సలహాలిచ్చేవారి లాగానే నేనూ నీకు చెప్పగలను. అయితే పరిష్కారం మాత్రం నీ వొక్కడి పైనే ఉంటుంది. ఎందుకంటే, ఆ పరిష్కారానికి నిర్దిష్టమైన నిబంధన అనేది లేదు. ప్రతి సందర్భం భిన్నమైనది, ప్రతి వ్యక్తి భిన్నమైనవాడే. ప్రత్యేకించి ఓ వ్యక్తి విషయంలో కూడా అతడి యొక్క కార్యాచరణ, ఆతడనుసరించే పద్ధతి, అతడి అంతరంగ చైతన్యస్థితి మీద, అతడు సాధించిన అభివృద్ధి మీద ఆధారపడి ఉంటుంది.

అయితే ఇది నీకు తృప్తికరమైన పరిష్కారాన్ని కనుక్కోడానికి సహాయపడక పోవచ్చు. ఎందుకంటె నీ మనసు ఆ ప్రశ్న పైనే పరిభ్రమిస్తూ, అన్ని అంశాలను, ఎవరో ఇచ్చిన పరస్పర విరుద్ధమైన సలహాలను, ఉదాహరణలను పరిశీలిస్తూ నిజంగా చేయవలసినదానికి కావలసిన జ్ఞానాన్ని అందుకోకుండా చేస్తుంది. నీవు ఆ సమస్య నుండి బయట పడాలంటే ఆ సమస్యను, దాని పరిష్కారాన్ని, దైవానికి అప్పచెప్పాలి. నీ ఆకాంక్ష అనుక్షణం దైవసంకల్పాన్ని నెరవేర్చడానికి అర్పించి, చేయాల్సిన పనిని అది ఏ విధంగా చేయాలో, ఆ విధంగా చేయటానికి ఆ దివ్యసంకల్పానికి విడిచిపెట్టాలి.

"నాకు ఆ దైవసంకల్పం ఏమిటో తెలియనపుడు, నేను దానిని ఎలా అమలు

చేయగలను?" అని నీ వడుగుతావు, "తనకు తానుగా ఎదురయ్యే సమస్య, దానిని నేను తెలుసుకోవటానికే, నేను ఏమి చేయాలో తెలుసుకునేందుకే. ఆ తరువాత అంతా సులభంగానే ఉంటుంది".

దివ్యసంకల్పం ఒక అధికారి యొక్క ఆజ్ఞలా, కేవలం అమలుపరచి ఊరుకోవడానికి కాదు. ఇక్కడ కావలసినది విధేయత కాదు, అంతకు మించినది — చాలా కష్టసాధ్యమైనది కూడాను. నీ ఇష్టానుసారం నీ జీవితాన్ని మలచుకునేందుకు బదులుగా నీ పూర్తి జీవితాన్ని, మలచబడే విధానాన్ని ఆ దైవం యొక్క చేతుల్లో పెట్టే విషయం. (అది దైవసంకల్పాన్ని అనుసరించే జరిగినా). ఇప్పుడు నేను చెప్పిన విధంగా ఆ అంతరంగ దృక్పథంతో నీ ఆకాంక్షను, తీవ్రంగా, అవిచ్ఛిన్నంగా నిలుపుకోగలిగి నీ పనిని నెరవేర్చగలిగితే, నీ చుట్టూ ఉన్న పరిస్థితులు నీకు అనుగుణంగా మారతాయి. నీవు నీ వృత్తి తప్పనిసరిగా మారవలసివస్తే, పరిస్థితులు కూడా మారతాయి. నీకు సరిపడె వృత్తి వైపు నిన్ను తీసుకువెళ్తాయి. నీవు చేయాల్సిన కార్యాన్ని సాధిస్తాయి.

అయితే అలాంటి దృక్పథం కలిగి ఉండటం చాలా కష్టం. ఎందుకంటే మనకి మనంతట మనమే, మన పద్ధతిలో పనిచేయడానికి అలవాటు పడ్డాం. ఒక సలహాను కాని, ఒక ఆజ్ఞను కాని తీసుకున్నా మళ్ళీ మన పద్ధతి ప్రకారమే పనిచేస్తాం. అందువల్ల విజయం సాధించాలంటే ఒక సమగ్ర నిజాయితీ అవసరం. ఏ మాత్రం దర్పం ఉండకూడదు. దైవం మీద సంపూర్ణ విశ్వాసం, నమ్మకం ఉండాలి.

ఇదే శ్రీమాత నీ ప్రశ్నకు సమాధానంగా నన్ను వ్రాయమన్నారు.

ఆమె నీకు ఆశీస్సులు అందించారు.

19 అక్టోబరు, 1950 పవిత్ర

(Sri Aurobindo circle, No 7, 1957, pp. 161-62)

ఒక సంపూర్ణ సమర్పణ, ఒక సంపూర్ణ సమానత, మినహాయింపులేని అహంభావ నిర్మూలన, అజ్ఞానబంధుర కర్మాచరణ విధానాల నుండి స్వభావానికి పరివర్తనాత్మక విముక్తి — అస్తిత్వం, స్వభావం దివ్యసంకల్పానికి సమర్పణ కోసం అధిరోహించాల్సిన సోపానాలు — సంపూర్ణమైన, సత్యమైన, దాపరికంలేని ఆత్మసమర్పణ.

(CWSA 23: 22) శ్రీఅరవిందులు

అనువాదం డి. సత్యవాణి

అల్పమైన అహం

జగన్మాత నిర్మిత మరబొమ్మ లాంటి అహం,
ప్రకృతి మాత లీలలతో లాభించిన అల్ప అహం,
తన జీవితకాలు ఆమె నమ్మకాన్ని వమ్ముచేసి
అప్పు తీర్చక తప్పుకుంటూ హక్కుల నర్థిస్తున్నది.

జీవిత ప్రతి కదలికలో నిండి వుంది మన అహం,
అస్తిత్వపు అల్లిక ప్రతి తంతువులో నిహితమై.
నిస్వార్థం నా వైఖరి అని అతిగా గొప్పలు పోతే
సందు లేక నింపుతుంది ఆ డాబుల్లో క్షుద్రాంశను.

దారి తెరిచి వుంది, మనో ప్రాణ శరీరాలు కణకణాలు
దైవార్పితమై దివ్య విశ్వ విస్తృతిలో వసించుటకు
ఆ వెలుగులోన కరిగిపోవు అహం నీచప్రభావం
ప్రళయ తాండవ మాపి ప్రకృతి
దివ్యప్రశాంత స్పందనగా మారుతుంది.

(CWSA 2:615)

శ్రీఅరవిందులు
అనువాదం: అందుగులపాటి కైలాసపతి

నీ దైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించుకోవాలి

నీ ఆలోచనల్ని అదుపు చెయ్యడం ద్వారా, వాటిని నీ సాధన వైపు మళ్లించడం ద్వారా, నీ కార్యకలాపాలను నియంత్రించడం ద్వారా, వాటిని కూడా సాధన వైపు మళ్లించడం ద్వారా, అన్ని కోరికలను, పనికిమాలిన బాహ్యంలో చేసే సాధారణ చర్యలకు ఉద్వాసన చెప్పడం ద్వారా, ప్రగాఢమైన అంతరంగ జీవనం ద్వారా, సాధారణ విషయాలు, సాధారణ ఆలోచనలు, సాధారణ ప్రతిచర్యలు, సాధారణ కార్యకలాపాల నుండి నిన్ను నీవు దూరం చేసుకోవటం ద్వారా, నీకు అనువైన వాతావరణాన్ని నీ చుట్టూ సృష్టించుకోగలవు.

ఉదాహరణకు, ఏదో అక్కర్లేని విషయం చదవడం, పనికిమాలిన బాతాఖానీ కొట్టడం, ఏదో ఓ పని చెయ్యడానికి బదులు, దివ్యమార్గాన్ని అనుసరించడానికి తోడ్పడే పుస్తకాలే చదవవచ్చు. దైవాన్ని గుర్తించడానికి తోడ్పడే మార్గంలో నడిపించగలిగే పనులు మాత్రమే చెయ్యాలి. కోరికలు, ప్రలోభాలు, బాహ్యవిషయాలకి సంబంధించిన వాటి మీదకి దారితీసే ఆలోచలను మానుకుని, నీ మానసిక జీవిని ప్రశాంతంగా ఉంచాలి. ప్రాణిక జీవిని శాంతపరచాలి. బయటి నుంచి ప్రవేశించే వ్యతిరేక భావాల్ని నిరోధించాలి. నీ చుట్టూ వున్న మనుషుల కార్యకలాపాలను పట్టించుకోవద్దు. ఈ విధంగా ఎవరూ నీ జోలికి రాకుండా, ఏదీ నిన్ను ప్రభావితం చెయ్యలేని ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించుకోవాలి. అప్పుడు ఏ పరిస్థితులలోను, ఎప్పటికీ దేనిమీదా ఆధారపడని, స్వేచ్ఛగా పనిచేసే ఆధ్యాత్మిక వాతావరణంలో జీవించగలవు. ఎందుకంటే నీ ఆధ్యాత్మిక వాతావరణ ఆవరణలో నువ్వు సురక్షితంగా ఉంటావు. అలా అటువంటి వాతావరణాన్ని ఏర్పరుచుకోగలరు. దృష్టిని సంపూర్ణంగా ఆధ్యాత్మిక దిశగా మళ్ళించుకుని, ఆధ్యాత్మిక జీవితానికి దోహదపడే విషయాలను మాత్రమే చదువుతూ, ఆధ్యాత్మిక జీవితం వైపు నడిపించే పనులు మాత్రమే చేస్తూ, నీకు కావలసిన వాతావరణాన్ని నీవు సృష్టించుకోగలవు. కాని సహజంగా, నువ్వు అన్ని ద్వారాలు తెరిచిపెట్టినట్టయితే, జనాలు చెబుతున్నదంతా వింటూ, వాళ్లు చెప్పింది అనుసరిస్తూ, వాళ్ళ స్ఫూర్తిని తీసుకుంటూ, బయటి విషయాలపై కోరికలతో నిండి వుంటే, నీ కోసం నువ్వు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించుకోలేవు.

మిగిలిన వాళ్ళకు లాగే నీకు కూడా సాధారణ వాతావరణమే మిగులుతుంది.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అనంతం మనకై తెరచియున్నది —
అందులోకి దూకుటయే తరువాయి

నిన్ను ఏదైనా విసిగించినప్పుడు, ఏదైనా బాధ కలిగించినప్పుడు లేక నచ్చనప్పుడు, నీవు అనంతమైన కాలాన్ని గురించి, విశ్వం యొక్క విస్తృతిని గురించి, గతంలో జరిగిన దానిని గురించి, ఇక ముందు జరుగబోయేదానిని గురించి ఆలోచించడం ఆరంభించినట్లయితే, అనంతకాలంలో నీకీ ప్రస్తుత ఘడియ కేవలం ఒక నిశ్వాసం మాత్రమేనని, దానిని గురించి కలవరపడటం హాస్యాస్పదమని అనిపిస్తుంది. దానిని గురించి గాని, దాని ప్రాముఖ్యతను గురించిగాని తెలుసుకునే సమయం కూడా నీవు వెచ్చించవు. అనంత కాలంలో ఒక ఘడియ అంటే ఎంత? ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించగలిగితే, ఈ చిన్న భూలోకంలో వ్యక్తి ఎంత అల్పమైనవాడో, తృటిమాత్ర కాలం నిన్ను బాధిస్తున్న లేక నీకు నచ్చని చర్య నీ ఉనికిలో ఎంత క్షణభంగురమైనదో నీకు అవగాహన ఏర్పడితే, నీవు దానిని పట్టించుకోవు. నీ జీవితమే ఈ అనంత కాలంలో క్షణికం. ఇటువంటి క్షణికమైన జీవితాలను ఎన్నో చూచావు, ఇంకెన్నో చూడబోతున్నావు. నీకు ప్రస్తుతం కలిగిన అనుభూతిని కొంత కాలం తరువాత — ఓ పది సంవత్సరాల అనంతరం — "దానికి అంత ప్రాముఖ్యత ఎందుకిచ్చాను?" అని ఆశ్చర్యపోతావు. ఈ అనంత కాలంలో, ఈ అనంత విశ్వంలో నీ వెంతటి తృటిమాత్రుడివో, ఎంతటి అగోచరుడివో ముందుగానే గ్రహించగలిగి వుంటే, ప్రపంచం యావత్తు నీ ముందు ఆవిష్కరించేది, అవిచ్ఛిన్నంగా ఆవిష్కరిస్తుంటుంది కూడా. వెంటనే నీకు సంభవించినదానికి అంత ప్రాముఖ్యత ఇచ్చి నందుకు, నీ మాటలోని అసంగతకు నీవే నవ్వుకుంటావు. నీకు, నీ జీవితానికి, నీకు జరిగినదానికి ఏమాత్రం ప్రాముఖ్యత నీయుటలోగల తెలివితక్కువతనం నీకు తెలు స్తుంది.. అలా గ్రహించగలిగిన రెండు మూడు క్షణాలలోనే నీకు కలిగిన అసౌకర్య భావన

అంతరించిపోతుంది. తీవ్రమైన బాధ సైతం మటుమాయమవుతుంది. కేవలం ఇలాంటి ఏకాగ్రత వహించడం, అనంతత్వంలో ఉన్నట్లుగా నిన్ను నీవు ఊహించు కోవటం వలన ఇది సాధ్యమవుతుంది. అంతా అంతరించిపోతుంది. పవిత్రుడిగా బయటపడతావు. అన్ని మమకారాల నుండి ప్రగాఢమైన బాధలతో సహా, అన్నింటి నుండి విముక్తుడవుతావు. అయితే నీకు అందుకు సరైన మార్గం తెలియాలి. నీ అల్పమైన అహంకారం నుండి అది నిన్ను ముక్తపరుస్తుంది.

(CWM 6:344-45)

*

ఈ విశాలత్వాన్ని చూసి విచలితుడవు కావొద్దు. అందుకు బదులు ఆనందంగా, ప్రశాంతంగా అందులో ఓలలాడు. మనం మన వ్యక్తిగత చేతన నాలుగు గోడల మధ్య తప్పించుకోలేనంతగా బందీలమై వుంటే, అది ఎంతో విచారకరం, తలమునకలై పోయినట్లుగా నుంటుంది. అయితే అనంతం మనకై తెరచి వున్నది. అందులోకి దూకుటయే తరువాయి.

(CWM 17:188)

శ్రీమాత

అనువాదం; రామినేని సుందరరామయ్య

గతిశీలమైన ధ్యానం

ధ్యానం చేయటం చాలా కష్టము. అందులో అనేక రకాలైన పద్ధతులున్నాయి. ఒక భావంపై దృష్టి నిలిపి ఫలితం కనిపించేదాకా కొనసాగించడమనేది క్రియాశీలమైన ధ్యానము. సాధారణంగా ఒక సమస్య పరిష్కారం కోసమనిగానీ, ఏదైనా రాయాలను కున్నప్పుడుగానీ అసంకల్పితంగా ఇటువంటి ధ్యానం అందరూ చేస్తారు. కొందరు యథావిధిగా కూర్చొని ఒక భావం మీద కాకుండా వారి ఏకాగ్రతను పెంపొందించుకోవ టానికి మాత్రమే ఒక బిందు స్థానం మీద దృష్టి కేంద్రీకరిస్తారు.. ఈ విధంగా చేయ డంలో నీవు కృతకృత్యుడవయ్యావంటే, ఆ క్షణంలో అది మానసిక, ప్రాణిక, దైహిక స్థానాల్లో దేనిమీదైనప్పటికీ వాటిని దాటి వేరే చైతన్యస్థాయిలో ప్రవేశిస్తావు.

మరి కొందరు వారిలో కలిగే అన్ని చలనాలనూ, భావాలనూ, ఆందోళనలనూ, ప్రతిస్పందనలనూ వైదొలగించుకొని నిశ్శబ్ద నీరవ ప్రశాంతతను చేరుకోవాలని ప్రయత్నం చేస్తారు. కాని ఇది చాలా కష్టసాధ్యము; పాతిక సంవత్సరాలు సాధన చేసి కూడా విఫలమనోరథులైన వారున్నారు. ఇది పోట్లగొడ్డు కొమ్ములు పట్టి వంచి స్వాధీనం చేసినంత కష్టము.

ఆలోచనలను అరికట్టే ప్రయత్నం చేయకుండా, సాధ్యమైనంత ప్రశాంతచిత్తంతో ధ్యానం చేసే పద్ధతి ఒకటుంది. సాధారణంగా వచ్చే ఆలోచనలన్నీ కేవలం యాంత్రిక మైనవే కాబట్టి, వాటిని ఆపుదల చేయాలంటే ఏళ్ళు పడుతుంది, పైగా అది ఫలిస్తుందనే నమ్మకం కూడా వుండదు. అలా కాకుండా నీ చైతన్యాన్నంతా కూడదీసుకొని, ప్రశాంత చైతన్యంతో వుండి, బాహ్య విషయాలపై ఆసక్తి లేనట్లు వాటి నన్నిటినీ వదిలేసి వున్నప్పుడు, నీ ఆకాంక్షాజ్వాల వున్నట్లుండి తేజోవంతమవుతుంది. అప్పుడు నీ దగ్గర కొచ్చిన వాటన్నిటినీ అందులోకి విసిరేసి దాన్ని మరింత ప్రజ్వాలింపచేస్తావు. అది అలా పైకెగిసిపడుతున్నప్పుడు నీవు దానితో తాదాత్మ్యం పొంది దాంతోపాటుగా మీదికి వెళ్లి నీ ఆకాంక్షా, చైతన్యాల చరమస్థాయికి చేరుకుంటావు. అప్పుడిక దాని ఫలితాన్ని గురించిగానీ, మరిదేని గురించిగానీ ఆలోచించవు. ఏదో జరగాలనే తాపత్రయం కూడా వుండదు. కేవలం ఆకాంక్ష మాత్రమే అలా పైపైకి ఎగిరిపోతూ, ఆనందాన్ని కలుగచేస్తూ తీవ్రతరమై, నిరంతరంగా కొనసాగే ఏకాగ్రతగా పరిణమిస్తుంది. ఇక అక్కడ నుంచీ జరిగేదంతా నీవు సర్వోత్తమంగానే జరుగుతుందని

నేను హామీ యివ్వగలను. ఇలా చేసినప్పుడు నీకు సిద్ధించగల అత్యుత్తమ ఘటన ఇదే. ఒక్కొక్క వ్యక్తి ననుసరించి సంభావ్యతలు వేర్వేరుగా వుండవచ్చు. ఏమైనప్పటికీ నిశ్శబ్దంగా వుండాలని చేసే ప్రయత్నాలూ, ఆభాసగా తోచిన రూపాలకు అర్థాలు చూసుకోవడమూ, నీ కొచ్చే అనుమానాల నివృత్తికని శక్తులను ఆహ్వానించి, సమాధానం కోసం ఎదురుచూడడమూ మొదలైనవన్నీ కూడా కృత్రిమ భాష్పవాయువు మాదిరిగా మాయమైపోతాయి. ఈ విధంగా మీది కెగిసే ఆకాంక్ష అనే జ్వాలశిఖలో చేతనాత్మకంగా జీవించగలిగితే వెంటనే ఫలితం కనిపించకపోయినా కొంతకాలానికి ఏదో కొంత ప్రతిఫలం దక్కుతుంది.

శ్రీమాత

అనువాదం డా. అమరవాది ప్రభావతి, డా. అమరవాది వేంకటరామ శాస్త్రి

లోచీకటి ప్రవృత్తులు వెలికి తీయాలి

ప్రశ్న: అమ్మా! మీరు గతంలో చెప్పారు — మనలో వుండే దుష్టప్రవృత్తులు మనచేత తెలివి తక్కువపనులు చేయిస్తాయి. ఈ ప్రవృత్తి నీ యెరుకలో వున్నప్పుడు దానిని నీవు వైదొలగించాలని — దానినెలా తీసిపార వెయ్యాలమ్మా?

అందుకు ముందు నీకది స్పష్టమయేలా నీ యెరుకలో వుండాలి. దానితో నీకున్న చైతన్యబంధాన్ని తెగ్గొట్టాలి. ఇదంతా అంతర్గత మనోవైజ్ఞానికశాస్త్రి సంబంధిత కార్యకలాపం.

నిన్ను నీవు శ్రద్ధగా పరిశీలించుకున్నప్పుడే నీకిది అవగతమవుతుంది. ఉదాహరణకి — ఒక రోజు నీవెంతో ఉదారంగా వున్నట్లుగా నీలో నీవే గమనిస్తావు. నీ భావాలలో, స్పందనలలో, ఆలోచనలలో, భౌతిక అంశాల పట్ల ఔదార్యంగా వుంటావు. ఇతరుల లోపాలు, బలహీనతలు, దురభిప్రాయాలు, అసహ్యకరమైన చేష్టలు — వీటి పట్ల ఉదారభావంతో వుంటావు. అప్పుడు నీలో నీవే అనుకుంటావు — ప్రతివాడు తాను చేయగలిగినంతగా శక్తివంచన లేకుండా చేస్తాడు గదా — అని.

మరొక సమయంలో — బహుశః మరుక్షణంలోనే కావచ్చు — నీలో నీవే గమనిస్తావు. దుస్సహమైన కాఠిన్యం, చెడు చేసినవానిని శిక్షించాలనే పగ, ప్రతీకారం

తీర్చుకోవాలనే భావం, ముందు అనుకున్నదానికి సరిగ్గా వ్యతిరేకభావం. మరొకప్పుడు నీకెవరైనా అపకారం చేస్తారు. అప్పుడు అనుకుంటావు "ఆ... మరేం ఫర్వాలేదులే — ఏదో తెలియక చేశాడు పాపం. అది అతని స్వభావం" మళ్లీ మరుక్షణంలోనే — కోపంగా "వాడిని శిక్షించాల్సినదే; తనుచేసిన తప్పు తనకు తెలియాలి" అనుకుంటావు. ఈర్ష్య, అసూయ, సంకుచితత్వం — ఈ ప్రతికూలమైన భావాలు నీలో చోటు చేసుకుంటాయి.

ఇది నీలో వున్న దుష్టప్రవృత్తి. ఇది తెలుసుకుని నిరంహంకారివై, యిది నేను కాదు, ఇది నాలోని నీలినీడే, దీనిని నా నుంచి వైదొలగించుకోవాలి — అని అనుకున్నప్పుడు నీలోని మరో భాగంలో ప్రకాశిస్తున్న వెలుగు నీ దుష్టప్రవృత్తులను మాయం చేస్తుంది. ఇలా మారిన సంఘటనలు వున్నాయి. అందుకు అవకాశం ఉంది. సకృత్తుగానే కావచ్చు. దుష్టస్వభావము మార్పుచెంది వెలుగు ప్రసరించి నీలోని సత్యచేతన బహిర్గతం కాబడే సందర్భాలు వుంటాయి.

తరచుగా కాకపోయినా యిది — జరిగే అవకాశం వుంది. నీవు ఒకటి అనుకోవాలి. అది నీకు చాలా ఉత్తమమైనది. అదేమంటే — ఇది నేను కాదు, ఇది నా స్వభావం కానే కాదు. ఇది నాకెంత మాత్రమూ వద్దు, దీనితో నా కెలాటి సంబంధము లేదు. నాకు సంబంధించినంతవరకు 'అది లేదు' అని అనుకోవాలి. ఆ విధంగా నీలోని దుష్టత్వాన్ని పారద్రోలి విముక్తుడవు కావాలి.

నీ అంతరంగంలో ఈ ఘర్షణను పసికట్టడంలో మాత్రం స్పష్టత, చిత్తశుద్ధి తప్పక వుండాలి. ఈ విషయాలకు సంబంధించి సాధారణంగా శ్రద్ధ వహించరు, పట్టించుకోరు. మనసులో ఆలోచనలు ముసురుకుంటాయి. మంచి ఆలోచనలు, దుర్మార్గపుటాలోచనలు కదలాడుతూ వుంటాయి. ఒకప్పుడు మంచిగా వుంటావు. మరొకప్పుడు దుర్మార్గంగా వుంటావు. ఒకప్పుడు రోజంతా మంచిగా వుంటావు. తర్వాత అకస్మాత్తుగా చెడుగా మారిపోతావు. లోపల కదలాడే దుర్మార్గ, సన్మార్గ ఆలోచనలను పరిశీలనగా గమనించవు. ఆలోచనలు గమనించాలి, పట్టుకోవాలి. వ్యక్తం అవుతూన్నప్పుడే గట్టి పట్టుపట్టాలి. (చైతన్యపు) కాంతిలో వాటిని పరిశీలించి అవగతం చేసుకోవాలి. ఒక దురాలోచనేదైనా మొలకెత్తినపుడు, వెంటనే, — "వద్దు. నాకిది వద్దు. నా నుండి నీవు వైదొలగిపో. దీనితో నాకెలాటి సంబంధము లేదు.పో... వెళ్లిపో. ఇక మళ్లీ తిరిగి రాకు", అనుకోవాలి.

ఈ రకమైన అనుభూతి ప్రతి రోజు నీకు కలుగుతుంది. గొప్ప ఉత్సాహము, ఆకాంక్ష, దివ్యకార్యక్రమ లక్ష్యసాధన దిశగా ప్రేరణ — వీటివల్ల పొందిన గొప్ప శక్త్యానందాలతో బయటపడతావు. మళ్లీ అంతలోనే వింతగా కొంతసేపయాక పనికి మాలిన సామాన్య, అల్ప, స్వార్థపూరిత కామనలను సంతృప్తిపర్చుకునే ప్రయత్నం. ఈ రకంగా యింతకు ముందున్న సలక్షణాలు ఆవిరైపోతాయి, అసలు వాటి వునికి కూడా లేనట్లుగా. ఈ పరస్పర వైరుధ్యభావసంఘర్షణకి అలవాటుపడిపోతావు. వీటి పట్ల శ్రద్ధ లేకపోవటంతో, యివన్నీ — ఉన్నత, నీచ ఆలోచనలు, ఇరుగుపొరుగు వారుగా, హాయిగా సహజీవనంతో ఉంటాయి. ఇది ముందు నీవు కనిపెట్టాలి. చైత న్యంలో వీటి పరస్పర ఆవాసాన్ని నిరాకరించాలి — నీలినీడలు కాంతి నుండి విడ గొట్టాలి. తర్వాత చీకటి దానంతటదే మాయమవుతుంది. వెలుగు మిగులుతుంది.

శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఏకాగ్రతా శక్తిని తీవ్రపర్చటం

ప్రశ్న: చేసే పని శక్తివంచన లేకుండా చేయాలనుకున్నప్పుడు కొంచెం ఎక్కువ సమయం అవసరమవుతుంది. సమయం ఉండదు. హడావిడిగా ఉంటాం. అలా హడావిడిగా ఉన్నా కూడా శక్తివంచన లేకుండా పనిచేయటం ఎలా?

ఇది చాలా ఆసక్తికరమయిన అంశం. ఒకప్పుడు దీనిని గురించి సవివరంగా మాట్లా డాలనుకున్నాను. తొందరలో పనులు సాధారణంగా అసమగ్రంగా, అంత బాగా చేయలేకపోవటం జరుగుతుంది. అయితే ఇక్కడ ఒక మార్గం ఉంది. అది నీ ఏకా గ్రతను తీవ్రపర్చటం. దీనివల్ల నీకు సగం సమయం కలిసివస్తుంది. సాధారణ విషయాన్నే ఉదాహరణగా తీసుకుందాం. స్నానం చేయుటం, వస్త్రధారణ ఈ పనులు చేయటానికి తీసుకునే సమయం వ్యక్తికీ, వ్యక్తికీ మారుతుంది. తొందరపడకుండా కాలయాపన చేయకుండా ఈ పనులు చేయటానికి అరగంట పడుతుందనుకుందాం. నీవు హడా విడిగా చేస్తున్నపుడు — సరిగా స్నానం చేయలేకపోవచ్చు లేదా వస్త్రధారణలో లోపం గలుగవచ్చు. కాని మరియొక పద్ధతి ఉంది. చేసే పనిలో శ్రద్ధ, శ్రమలతో

పాటు ఏకాగ్రత పాటించటం. చేసే పనిలోనే శ్రద్ధ వహించి ఏకాగ్రత పాటించి సరిగ్గా అవసరమైనంత సమయమే తీసుకుని చేసినపుడు, అరగంటలో చేసే పనిని పదిహేను నిముషములలలోనే ముగిస్తావు. మరింత సమర్థవంతంగా చేస్తావు. ఇది నీ తీవ్రమైన ఏకాగ్రతవల్ల సాధ్యం అవుతుంది.

అబ్బో! ఏ పనైనా సమర్థవంతంగా చేయటానికి సమయం పడుతుంది అనుకునే వాళ్లకి ఇది సరియైన సమాధానం. నీవు చేసే పని ఏది కాని — చదువు, ఆట, పని — ఒకటే పరిష్కారం. ఏకాగ్రతాశక్తిని ఇనుమడింపజేయి, తీవ్రతరం చేయి. ఏకాగ్రతా సౌలభ్యం నీవు సంతరించుకున్నప్పుడు నీకు అలసట కూడా అనిపించదు. సహజంగా మొదట్లో కొంత ఉద్వేగం ఉంటే ఉండవచ్చు. అలవాటుపడితే క్రమంగా అదీ తగ్గుతుంది. నీ అలసట ఏకాగ్రతవల్ల కాకపోవచ్చు. వేరే పనులలో నిమగ్నమైన కారణంగా ఏకాగ్రత లోపించడం వల్ల కాకపోవచ్చు. ఏకాగ్రతాశక్తి పనులను మరింత సమర్థవంతంగా, తొందరగాను జరిపిస్తుంది. ఈ రకమైన కార్యనిర్వహణలో నీవు ఉన్నతంగా యెదుగుతావు. లేకపోతే నీలో అనాసక్తత చోటు చేసుకుంటుంది. ఇది మరింత ప్రమాదకరం. అశ్రద్ధ అనాసక్తతకి మారుపేరు అవుతుంది.

*

ప్రశ్న; ఏకాగ్రత అంటే ఏమిటి?

చెదరిన చైతన్యతంతువు లన్నిటినీ సరిగా కూడతీసి ఏకోన్ముఖం గావించి, ఒకే సమగ్రభావనకి కేంద్రీకృతం కావించటం. పరిపూర్ణమైన ఏకాగ్రత సాధించి చేపట్టిన కార్యక్రమ పురోగమనం సత్వరమయి పూర్తి అవుతుంది. శిక్షణలో కండరాలను కూడతీసినట్లుగా, ఏకాగ్రతను కూడతీసి పెంపొందించగలం. శిక్షణా పద్ధతులు, ఏర్పాట్లు వేర్వేరుగా ఉంటాయి. అతిహీనమైన దుర్బలుడు కూడా క్రమశిక్షణతో శక్తివంతుడు కాగల్గుతాడు. ఇచ్ఛాశక్తి నిలకడగా ఉండాలి. రెపరెప లాడకూడదు.

ఇచ్ఛ, ఏకాగ్రత నలవర్చుకోవాలి. క్రమం తప్పని శిక్షణ, అనుసరించే విధానములపై ఆధారపడి ఉంటుంది. చేయాలనే బలమైన ఇచ్ఛ ఉంటే, సాధిస్తావు. ఎందుకిది అంతా! ఏమిటి ఉపయోగం! అనే నీరసమైన ఆలోచనలు రాకూడదు. నేనే పనికీ తగను; నాలో ఆ లక్షణాలు లేవు; ఏమీ చేయలేను — అనుకోవటం శుద్ధ తెలివితక్కువ.

శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి (అఖిల, ఏప్రిలు 2007)

స్థిరశక్తిని ఉపయోగించుట

స్థిరశక్తి అంటూ ఒకటి ఉంటుంది. అది మీకు ఎలా వివరించాలి? చూడండి. క్రీడలలో ప్రత్యర్థుల నుంచి దాడిని ఎదుర్కొనటం, తిరిగి వారిపై దాడి చేయడం అనేవి ఉంటాయి కదా. అలాటిదే స్థిరశక్తికి క్రియాశక్తికి మధ్యనుండే వ్యత్యాసం. అర్థమైందా? స్థిరశక్తి అన్నింటిని ఎదిరించి నిలబడ కలిగేది. దానిపై ఏదీ పనిచేయలేదు. దానిని ఏదీ తాకలేదు, ఏదీ కదల్చలేదు — అది నిశ్చలమైనది, అజేయమైనది. క్రియాశక్తి ఆచరణాత్మకమైనది. అప్పుడప్పుడది ముందుకు దూసుకెళ్ళి ఒక్కోసారి దెబ్బతిన వచ్చు. అంటే క్రియాశక్తి ఎల్లప్పుడు విజయవంతంగా ఉండాలనుకుంటే, దానికి స్థిరశక్తి సుస్థిరమైన ఆధారంగా ఉండాలి.

నీవేం చెప్పాలనుకుంటున్నావో నాకు తెలుసు — మనిషికి శక్తిని గురించి తెలిసేది అది క్రియాశీలకమైనప్పుడేనని; పని చేస్తే తప్ప దానిని శక్తిగా మనిషి పరిగణించడు. పనిచేయకపోతే, దాని వైపు కన్నెత్తైనా చూడడు. ఈ క్రియాశూన్యత వెనుక నుండే మహత్తరశక్తిని అర్థం చేసుకోలేడు — ఎప్పుడూ కూడ. క్రియాశీలశక్తికి మించిన తీవ్రతను కలిగిన అమోఘశక్తిని గమనించడు. దీనిని నీపైనే ప్రయోగించుకొని చూడు. అవాంఛనీయమైనదేదైనా ఎదురైనప్పుడు ప్రశాంతంగా, చలించకుండా, కదలకుండా ఉండగలుగుట చాల కష్టం — అందుకు వ్యతిరేకమైన మాటలుకాని, చేతలుకాని — అంత ఘాటుగా, అంత తీవ్రంగా ప్రతిస్పందించకుండా ఉండగలుగుట కష్టం. ఎవరైనా నిన్ను అవమానించారనుకో. అట్టి అవమానాన్ని ఎదుర్కొంటూ కూడ, నీవు చలించకుండా (కేవలం బాహ్యంగానే కాదు, పరిపూర్ణంగా) ఏ రకంగానూ ప్రభావితుడవు కాకుండా, ఏ ఒక్క సంజ్ఞ కూడా చేయకుండా, ఒక్క మాట కూడా అనకుండా వుండగలుగుతే నీవు మహాశక్తివంతుడవన్న మాట. బాహ్యంగాను, అంతర్గతంగాను, నిన్ను ఏ అవమానము స్పృశించలేదు. నిశ్చల హృదయుడవై ఉండగలుగుతావు. నిశ్చల ప్రశాంతత కలిగి ఉంటావు. ఏమాత్రము కలత చెందవు. నీ బుద్ధి ప్రతిస్పందనలతో సమాధాన మీయదు. ముష్టియుద్ధం చేయాలని నరాలు గట్టిగా బిగపట్టవు. దెబ్బకి దెబ్బ తీయాలనిపించదు. నీవు అలాగ స్థాణువులా ఉండగలుగుతే నీలో స్థిరశక్తి ఉన్నదన్న మాట. మాటకి మాట, దెబ్బకి దెబ్బ, ఆందోళనకి ప్రత్యాందోళన

— వీటన్నిటి కంటె కూడా అది అనంతమైన అతీతశక్తి.

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

తీరిక సమయంలో

నిత్యజీవితంలో మనకు తరచు తీరిక కల్గటం కద్దు. ఈ తీరిక కొన్ని క్షణాలే కావచ్చు లేదా కొన్ని గంటలు కావచ్చు. కొందరు ఈ తీరుబాటు కాలాన్ని సత్కాలక్షేపం, పుస్తక పఠనం లాంటివాటి కోసం వినియోగించవచ్చు. జనసామాన్యం ఈ కాలాన్ని వృథా చేయటం మనం నిత్యము గమనించవచ్చును. ఇందు వయోభేదము లేదు. చిన్నా, పెద్దా అందరికీ వర్తిస్తుందనటంలో సందేహం లేదు.

మనకు లభించిన తీరికను వృథా చేసుకోకుండా చక్కగా వినియోగించుకోవటానికి అనేక మార్గాలు ఉన్నవి. వీటిలో ముఖ్యమైనదే ఆత్మపరిశీలన. గత స్మృతులను విశ్లేషించుకోవటమే. కాస్తంత తీరికి దొరికిన తరువాత "హమ్మయ్య! ఇప్పటికి కాస్త తీరుబడి దొరికింది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఝంఝాటం నుంచి బయటపడి జీవితం సార్థకం చేసుకోవాలి. నిత్యమైన సత్యస్వరూపం ఆకళింపు చేసుకోవాలి" అని తపన చెందాలి. ఈ తపన ప్రతి నిత్యము ప్రతిబింబిస్తే, నీకు మార్గమంతా పూలబాటే. వృథా కాలయాపనతో దుర్వినియోగం చేసుకొంటే జీవిత చరమాంకంలో కాలాతీతమై దుఃఖమే నీకు శరణ్యము. అందువల్ల లభించిన అవకాశా లన్నిటినీ సద్వినియోగంచేసుకొని, జీవితధ్యేయాన్ని గ్రహించుకొని, ఆ లక్ష్యము చేరుకోటానికి కృషి చేయాలి.

మనము కార్యవిహీనులమైనపుడు ఒక విధమైన అశాంతికి లోనుకావటం సహజం. ఆ స్థితి నుండి బయటపడటానికి ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవటం జరుగుతుంది. కొందరు షికారుకి వెళ్ళవచ్చు. మొక్కల పనితో కాలక్షేపం చేయవచ్చు. మరేదైనా చేయవచ్చును. వీటన్నింటినీ మించినది, ఉత్తమమైనది మరొకటి ఉన్నది. సముద్రతీరాన గాని, నదీతీరాన గాని, ఏదైనా చెట్టు క్రిందగాని చక్కని స్థలము ఎంపిక చేసుకొని, స్థిరముగా కూర్చొని నీ జీవిత గమ్యమేమిటి, దానిని ఎలా సార్థకం చేసుకోవాలి, ఈ

సుఖదుఃఖాల వలయం నుంచి ఎలా బయటపడాలి అని విశ్లేషించుకో.

*

ఈ పుడమిన జన్మించటం పూర్వజన్మ విశేషమే. ఈ జగన్నాటకంలో ఉచితమైన పాత్ర పోషించి, జన్మసార్థకం చేసుకోవాలి. ఇందుకు జీవుడు మానసికంగా ఉన్నతస్థితిని అందుకోవాలి. లేకపోతే ఇంతే సంగతులు. జీవుడు చైతన్యవంతుడైనకొద్దీ, వానియందు ఈ తత్వము ఉన్నత స్థితిని చేరుకొంటుంది. ఈ తరుణంలో పూర్వమెన్నడూ గోచరించని విచిత్రమైన మానసికస్థితికి లోనై, తాను కారణజన్ముడన్న భావనతో స్వార్థరహితుడై, కార్యరంగంలోకి దూకటం సంభవిస్తుంది. ఈ జగత్తులో ప్రస్తుతం జరుగుతున్నదిదే. మరో మార్గం కానరాదు. "ఈ పృథ్విపై కాలు మోపాను కాబట్టి నా కర్తవ్యం నిర్వహించాలి. నా చైతన్యస్వరూపంతో ఈ సర్వసృష్టిని చైతన్యవంతం చేయాలి" అని సంకల్పించాలి.

శ్రీమాత

అనువాదం: శ్రీ శరణ్

నిదానించు

మీలో చాలామంది బాహ్యప్రభావాల స్పర్శకి ఉన్మీలనం చెంది సత్యానికి ఉపరితలం లోనే జీవిస్తారు. శారీరక బాహ్యతలానికి అన్వయించుకుని జీవించే బాహ్యజీవనమే మీది. అలాగే నీకు నచ్చని బాహ్యజీవనుడు తారసిల్లినపుడు నువ్వు తలక్రిందులైపోతావు. ఈ బాధ అంతటికీ కారణం నిదానంగా ఒక్క మారు వెనుతిరిగి చూచే అలవాటు లేకపోవటం వల్లనే. నీకెప్పుడూ అంతర్దృష్టి ఉండాలి. అది క్షేమకరం. ప్రపంచంలో కదలాడే బాహ్యశక్తులకు నీవు వశం కాకూడదు. హడావుడిగా ఏ పనినైనా చేయవలసి వచ్చినా కూడా ఒక్క అడుగు వెనక్కివేసి కాస్త నిదానంగా ఉపక్రమించు. అపుడు నీ వెంత త్వరగా విజయవంతంగా పనిచేయగలుగుతావో నీకే ఆశ్చర్యం కలుగుతుంది. నీపై ఎవరైనా కోపగించినా, వాని స్పందనలకి లోబడి ఉండకు. కాస్త నిదానించు. అప్పుడాతని కోపానికి ప్రతిస్పందనలేక, అది బలహీనపడి మాయమైపోతుంది. ఎప్పుడూ నీ సంయమనాన్ని కోల్పోకు. ఏ ఆకర్షణకి లోబడక నిరోధించు. నిన్నే అది అప్పుడు వదిలిపోతుంది. నిదానించకుండా, ఒక్కసారి ఒక్కడుగు వెనక్కి

వేయకుండా నిర్ణయం తీసుకోకు. ఏ కార్యమూ తలపెట్టకు. ఈ లోకంలో అంతా అశాశ్వతమైనది, నిలకడ లేనిదే. అందువల్ల దేనిని గురించి బెంగపెట్టుకుని తలక్రిందు లయే అవసరం లేదు. ఏది శాశ్వతమో, నిత్యమో, నాశనము లేనిదో, అనంతమో అదే నిజానికి నీవు జయించి స్వాధీనపర్చుకోవలసినది. అదియే దివ్యతేజస్సు, దివ్యప్రేమ, దివ్యజీవనము. అదే సర్వోన్నత ప్రశాంతత కూడా. అదియే పరిపూర్ణ ఆనందము, సర్వాధిపత్యము. ఈ భూమి మీద అదే సర్వోన్నత అభివ్యక్తీకరణ. విషయముల తాలుకు అన్యోన్యాశ్రయత్వము, సాపేక్షభావము నీకు కలిగినపుడు నీవొక అడుగు వెనుకకు వేసి నిదానంగా విషయాలు దర్శిస్తావు. నిశ్చలంగా ఉండ గలుగుతావు. దివ్యశక్తిని ఆవాహనం చేస్తావు. జవాబు కోసం ఎదురుచూస్తావు. సరి యైన పరిష్కారం అందుతుంది. ప్రశాంతచిత్తము లేకుండా నీకు సరియైన సమాధానం రాదు. అంతరంగ ప్రశాంతత పొందేందుకు సన్నద్ధమవు. చిన్నదే అయినా ప్రయత్నం ప్రారంభించు. ఒక అలవాటుగా మారేవరకు సాధన చెయ్యి.

*

ఈ సుళ్ళు తిరిగే శక్తుల నుండి వెనుకకు మరలి ప్రశాంతసీమలకు చేరుకున్నప్పుడు నీకిదంతా ఎంత భ్రమయో తెలుస్తుంది. మానవాళి అంతా పరస్పరం ఒకరికి వ్యతిరే కంగా మరొకరు అడ్డుపడుతూ, తడపడుతూ, గ్రుడ్డిగా కలయతిరుగుతూ, తామేం చేస్తున్నామో, ఎందుకు చేస్తున్నామో తెలియక తారట్లాడే పరిస్థితి నీకు తెలుస్తుంది. ఇదే జీవితం అనుకుంటారు. ఇది నిజజీవితం కాదు... అసలైన జీవన కార్యకలాపమూ కాదు. ఇది పనికిమాలిన సంక్షోభం. నేను మాట్లాడే నిశ్శబ్దత అంతరంగ నిశ్శబ్దత. చేసే కర్మల రణగొణధ్వనిలో బంధితులైనవారికి అసాధ్యం చేసే పనికి, దాని చలిత చాలనాలకి అతీతంగా ఉండేవారికే యిది సాధ్యం. అప్పుడే నిత్యసత్యచైతన్యం లోనికి అడుగిడగలుగుతారు. అపుడే వారికేది కర్తవ్యమో తెలిసొస్తుంది.

శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అనుభూతిని పొందేదెలా?

మనము అనేక వేదాంతగ్రంథాలు పఠించవచ్చు గాక. ఆధ్యాత్మిక బోధలు, పురాణ శ్రవణం చేయవచ్చు గాక. ఇవన్నీ ఒక ఎత్తు, దివ్యానుభూతి మరొక ఎత్తు. ఈ అనుభూతి క్షణికమైన, శతకోటి ప్రవచనాలుగాని, బోధలుగాని, ఈ అనుభూతికి సాటిరావు.

అయితే ఈ అనుభూతి ఎలా సాధ్యం. దీని మార్గమేమని ప్రశ్న ఉదయిస్తుంది.

మున్ముందుగా నీవు అంతర్ముఖుడవు గావటం తప్పనిసరి. అటు పిమ్మట నీ అంతరంగంలోని అంతరాంతరాలను చొచ్చుకొనిపోయి, మరుగునపడి ఉన్న ఈ సత్యస్వరూపాన్ని శోధించి గ్రహించుకో. అలా నిన్ను నీవు క్రమక్రమంగా విశ్వమంత విశాలంగా విస్తృతపర్చుకొని అవధులు దాటిపో. ఇది ఎంతో నిశ్చల నీరవ ప్రశాంతతలో జరగాలి. ఈ ప్రశాంతత మనసును నిశ్శబ్దపరిచి, ప్రాణికమును నిశ్చలపరుస్తుంది.

ఈ అభ్యాసం అవిచ్ఛిన్నంగా సాగిపోవాలి. కాలక్రమేణా బాహ్యచైతన్యానికి అంతుచిక్కని ఒకానొక సత్యస్వరూపం నీకు సాక్షాత్కరిస్తుంది.

ఈ పరిణామమంతా ఒకానొక కృపావిశేషమని గ్రహించు. అజ్ఞాన చీకట్లు తొలగిపోగా, సత్యస్వరూపాన్ని గ్రహిస్తావు. ఈ తత్త్వము నీ ముందు నిలకడగా ఉండుటకు నీకు నిత్యము ఈ సాధన తప్పనిసరి.

శ్రీమాత

అనువాదం: శ్రీశరణ్

కృతజ్ఞతా జ్యోతి సదా వెలగాలి.

కృతజ్ఞతతో ఉండడం అంటే — మన లోటుపాట్లు, మన అజ్ఞానం, అపార్థం చేసుకోడం, మన అహంకారం, మన నిరసన, ప్రతిఘటనలను పట్టించుకోకుండా, అత్యంత చేరువైన మార్గంలో ప్రతివారిని వారి దివ్యలక్ష్యం వైపు నడిపించే ఆ అద్భుత దివ్య కృపని ఎన్నడూ విస్మరించకపోవటం.

కృతజ్ఞతా భావం యొక్క పవిత్ర జ్వాల మన హృదయంలో నిరంతరం వెచ్చగా, తీయగా, వెలుగులు విరజిమ్ముతూ సర్వ అహంకారాన్ని, అస్పష్టతలని కరగించడానికి నిరంతరం జ్వలిస్తూ వుండాలి. ఆ పరాత్పరుని కృప ఏదైతే సాధకుడిని అతడి గమ్యానికి చేర్చగలదో, ఆ దివ్యకృపపై కృతజ్ఞతా భావం నిరంతరం కొనసాగాలి. ఆ కృపయొక్క కార్యాచరణను గురించి మరింత కృతజ్ఞతా భావంతో ధన్యవాదాలు తెలుపుతూపోతే, అతడికి గమ్యం చేరువ అవుతుంది.

*

అన్ని కదలికలలోకి ఏ కల్తీ లేని, అహంకారం సోకని, అకళంకమైన మహదానందాన్ని సమకూర్చేది బహుశా సహజసిద్ధమైన కృతజ్ఞతా భావన.

అది చాలా ప్రత్యేకమైనది. అది ప్రేమ కాదు. అది ఆత్మసమర్పణ కాదు, అపారమైన మహదానందభరిత భావనతో ఎంతో నిండైనది.

అదొక అత్యంత ప్రత్యేకమైన ప్రకంపన. దానికదే సాటి. అది నిన్ను తృప్తిపరుస్తుంది, ఎంతో అధికాధికమైనది. మానవచేతనకు చేరువైన అన్ని కదలికలలోకి, ఇది నిన్ను నీ అహంకారం నించి నిస్సందేహంగా బయటపడేసే కదలిక...

దాని పరిశుద్ధ స్థితిలో ఆ ప్రకంపనంలో భాగం కాగలిగితే వెంటనే నీవు దానిని దివ్యప్రేమతో సమానమైన గుణసంపన్నతను కలిగిన ప్రకంపనగా గుర్తిస్తావు: దానికి దిశానిర్దేశం లేదు. చివరికి దివ్యప్రేమ యొక్క అతి ముఖ్యమైన ప్రకంపనలో ఛాయా మాత్ర రూపం కృతజ్ఞత

(CWM 8:40; 6:194-95; White roses Message of 26-6-1964, The Spiritual Significance of Flowers part 1, p. 122)

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఆచరించవలసినది ఇదే

(ఈ ప్రపంచమూ, అందులోని అస్తవ్యస్తాలు, గందరగోళాల గురించి మాట్లాడుతూ శ్రీమాత ఈ క్రింది విధంగా చెప్పారు.)

మనం ఎలా జీవించాలో, రోజులు ఎలా గడపాలో తెలియచెప్పడంలో కొంత గందరగోళ మేర్పడిందని రూఢి అయింది. అంటే ఎప్పుడు ఏం జరగబోతోందో, ఏం జరుగుతోందో అని ఆలోచిస్తూ కాలం గడపక ఏమి చేయవలసివుందో దానిపై దృష్టి పెట్టి ఆ పనిలో నిమగ్నమై వుండాలి. అన్ని రకాల ఆలోచనలూ, ఏర్పాట్లూ, ప్రణాళికలూ క్రమరాహిత్యానికే అనుకూలపడతాయి.

దాదాపు ఏ క్షణానికి ఆ క్షణం జీవితాన్ని గడుపుతూ, అనగా ఆ క్షణంలో చేయవలసినదాని పైనే దృష్టి పెట్టి, ఆ తర్వాత నిర్ణయాన్ని ఆ పరమ చైతన్యానికే వదిలిపెట్టాలి. ఎంత విశాల దృష్టి ఉన్నప్పటికీ విషయాలను పాక్షికంగానే తెలుసుకోగలుగుతాము కానీ, అసలు విషయం తెలుసుకోలేము. అందువలన మన ధ్యాస అటూ ఇటూ చెదురుతుంటుంది; అయినప్పటికీ అనేక విషయాలు ఇంకా మిగిలి వుంటాయి. ఇలా హానికరమైన విషయాలకు ప్రాముఖ్యత ఇస్తున్నావంటే నీవు వాటిని బలపరుస్తున్నావన్న మాట.

(శ్రీమాత ధ్యానస్థితిలోకి వెళ్లారు)

ఇటువంటి అస్తవ్యస్తత, గందరగోళం వంటి ఘట్టాలు నీకు తారసిల్లితే నీవు చేయవలసిందల్లా ఒక్కటే. ఎక్కడైతే నీవు ఏకైక దైవాన్నీ, ఏకైక పరమచైతన్యాన్నీ, ఏకైక శక్తినీ దర్శిస్తూ ఉంటావో ఆ చైతన్యంలో ప్రవేశించు. ఉన్నది ఒకే ఒక ఏకత్వం. ఇదంతా అందులోనే, ఆ ఏకత్వంలోనే జరుగుతున్నది. అల్పమైన మన ఆలోచనలకు, తెలివితేటలకు, నిర్ణయాలకు ఏమీ విలువ లేదు. సకల జగత్తునూ పర్యవేక్షిస్తున్న పరమచైతన్యంతో పోలిస్తే ఇవి సూక్ష్మాతిసూక్ష్మము. ఆ రకంగా ఆలోచిస్తే మనకే కాస్త వివేచనాదృష్టి ఉన్నా ఎందుకు ఇలా విభిన్న వ్యక్తిత్వాలు ఏర్పడి ఉన్నాయో తెలుస్తుంది. అదంతా ఏకత్వం కోసం ఆకాంక్షించడానికీ, దాన్ని నిలబెట్టుకోడానికీననీ, ఇంకా ఆత్మార్పణ, శరణాగతీ, భక్తి, విశ్వాసాలనే వాటికి స్థానం కల్పించడానికనీ అర్థమవుతుంది. ఈ కారణం వల్లనే వ్యక్తినిర్మాణం ఏర్పడింది. కాబట్టి నీవు అత్యంత శ్రద్ధగా, హృదయపూర్వకంగా ఆ విధంగా ఉండే ప్రయత్నం చేయి, కావలసింది

అదే. అదొక్కటే కావలసింది. మిగిలినదంతా వట్టి కల్పన మాత్రమే — ఇంద్రజాల మహిమ.

ప్రతి విషయంలోనూ ఈ విషయమే చెల్లుబాటవుతుంది. నీవు ఏదైనా చేయాలనుకున్నప్పుడుగానీ, ఏదైనా చేయలేనప్పుడు గానీ, నీవు కదిలేటప్పుడుగానీ, కదలలేకపోయినప్పుడు గానీ ఎప్పుడైనా ఏ విషయంలోనైనా గానీ దానినే అనుసరించాలి. అదేమిటంటే పరమ చైతన్యంతో చైతన్యపూరితమైన సంస్పర్శను పొందటం, దానితో ఏకత్వాన్ని పొందటం, ఆ తర్వాత నిరీక్షించడము.

అప్పుడు, అనుక్షణం నీవు చేయవలసిందేమిటో నీకు సూచించబడుతుంది.; అసలు చేయాలో అక్కర్లేదో, క్రియాశీలకంగా ఉండాలో, స్తబ్ధుగా ఉండిపోవాలో, నీకు సూచన అందుతుంది. నీవూ ఉండాలా అక్కర్లేదా అనే విషయం కూడా నీకు బోధపడుతుంది. ఇదొక్కటే పరిష్కారం. ఇంకో రకంగా ఆలోచిస్తే అవివేకమే.

అన్ని కార్యకలాపాలనూ, సంభావ్యతలను ఇలా సహజంగా ఉపయోగపడేటట్లు చేసుకోవచ్చు. ఈ విధంగా నియమ నిబద్ధతలు లేకుండా ఉండే స్వంత ఎంపికలను నివారించవచ్చు. సాధ్యతలు అన్నీ అందుబాటులో ఉంటాయి. గ్రహించినవీ, తెలుసుకున్నవీ కూడా ఆలాగే ఉంటాయి, ఒక్క స్వంత దుందుకుడు చేష్టలు మాత్రం వదిలిపోతాయి. ఇటువంటి స్వంత ఎంపికలు ఒక రకంగా పనికిమాలిన పనులుగా ఉండి బుద్ధిహీనతను తెలియచేస్తాయి — పూర్తిగా అది అజ్ఞానభరితమైన మూర్ఖత్వము.

ఈ ఆందోళన ఈ వాతావరణంలో సుడిగాలిలా తిరుగుతున్నట్లుగా నా కనిపిస్తోంది. పాపం! మానవులు.

ఇదంతా కూడా ప్రపంచమంతా భగవంతుని వైపు మరలాలని బోధించటానికేనని చెప్పవచ్చు. ఎందుకంటే నిజానికి అందుకే కదా, ఈ సృష్టి ఏర్పడింది!

(CWM 11:184-86)

శ్రీమాత

అనువాదం డా. అమరవాది ప్రభావతి, డా. అమరవాది వేంకటరామ శాస్త్రి

మన దైహిక జీవన ఉద్దేశ్యం, దానిని సమగ్రంగా ఫలప్రదం చేసుకొనే మార్గం

ఈ ఏకైకుని మన ఆంతరాత్మలలోను, బాహ్యలక్షణాలలోను దర్శించడం, తెలుసు కొనడం, అలా తయారుగావడం, ఫలప్రదం చేయడం అనేది సదా ఈ దైహిక జీవన రహస్య గమ్యం. ఇప్పుడది మనం యెరుకతో సాధించవలసిన కార్యం అయ్యింది.

మన అస్తిత్వపు భాగాలన్నిటిలో ఆయన చైతన్యం కలగాలి. అలాగే విభజనకారి యైన మనస్సు మన అస్తిత్వానికి బయటివానిగా చూచే వాటన్నింటిలోనూ ఆయనను దర్శించాలి. అలా దర్శించడమే వ్యక్తిగత చేతన యొక్క పరిపూర్ణ లక్ష్యసిద్ధి.

ఆయనకు వశులమై, ఆయనను మనలోనూ, సమస్త వస్తువులలోనూ వశం చేసుకోవడమే సమస్త సామ్రాజ్యాన్ని సాధించడమంటే, స్వాధీనం చేసుకోవడమంటే.

నిష్క్రియత, సక్రియతల, శాంతి, శక్తుల; ఏకత్వ, భిన్నత్వాల సమస్త అనుభవంలో ఆయనను భోగించడంలోని ఆనందం కోసమే ప్రపంచంలో అభివ్యక్తమైన వ్యక్తిగత అంతరాత్మ నిగూఢంగా అన్వేషిస్తోంది.

వైశ్వప్రకృతి తనలో దాచుకొన్న ఏ సత్యాన్ని ఆవిష్కరించ పరిశ్రమిస్తున్నదో, ఆ సత్యాన్ని వ్యక్తిగత అనుభవంగా మార్చడం అనేది పూర్ణయోగ లక్ష్యం యొక్క సంపూర్ణ నిర్వచనం.

మానవాంతరాత్మను దివ్యాంతరాత్మగా, ప్రాకృతిక జీవనాన్ని దివ్యజీవనంగా మార్పుచెందించడం పూర్ణయోగలక్ష్యం.

ఇది సమగ్రంగా ఫలప్రదం కావాలంటే మనలోనే ఆవాసముంటున్న ఆ రహస్యపు అధినేతను కనుగొనడం కచ్చితమైన మార్గం. దివ్యజ్ఞానం, దివ్యప్రేమ కూడా అయిన దివ్యశక్తికి సదా మనం ఉన్మీలనమై, మార్పుచెందించే ప్రభావం చూపగలిగేటట్లు దాని యందు పరిపూర్ణ విశ్వాసముంచాలి.

అహంకార చేతనకు ఇలా చేయడం ప్రారంభంలో కష్టం.

ఒకవేళ చేసినా మన స్వభావపు ప్రతి చిన్న అంశంలోనూ చేయడం కష్టం. దాన్ని పరిపూర్ణంగా చేయడం, ఇంకా కష్టం.

ప్రారంభంలో ఇది యెందుచేత కష్టమంటే, మన అహంకారిక ఆలోచన ఇంద్రియ జన్యజ్ఞానం, సంవేదనలు, మనం తప్పక చేరవలసిన అవగాహనాస్థాయిలను

మరుగుపరుస్తాయి గనుక.

తరువాత కూడా అది యెందువల్ల కష్టమంటే ఈ మార్గంలో అవసరమైన విశ్వాసం, సమర్పణ, ధైర్యం అనేవి అహం వల్ల ఆచ్ఛాదితమైన అంతరాత్మకు అంత తేలికగా లభించవు.

దైవం పనిచేసే విధానం, అహంకారిక మనస్సు కోరుకొనే లేక సమ్మతించే విధానం కాదు. ఎందుచేతనంటే అది సత్యాన్ని చేరుకొనడానికి అసత్యాన్నుపయోగిస్తుంది, ఆనందాన్ని చేరుకొనడానికి వ్యధనుపయోగిస్తుంది. పరిపూర్ణతను చేరుకొనడానికి అపరిపూర్ణతను ఆసరాగా చేసుకొంటుంది.

తానెక్కడికి కొనిపోబడుతున్నదో అహం గ్రహించలేదు. అది తనను నడిపే నాయకత్వాని కెదురు తిరుగుతుంది, నమ్మకం కోల్పోతుంది, ధైర్యం కోల్పోతుంది.

ఈ వైఫల్యాలు పట్టించుకోదగినవి కావు, ఎందుచేతనంటే మనలోని దివ్యమార్గదర్శి మన తిరుగుబాటుకు కోపగించడు. మన విశ్వాసరాహిత్యం వల్ల నిరుత్సాహపడడు. మన బలహీనతలకు వికర్షించడు. అతనికి మాతృమూర్తి కుండే ప్రేమంతా వుంది, బోధకుని కుండే సహనమంతా వుంది.

దేహానికి సంబంధించిన నిమ్నభాగం విషయానికొస్తే, అది ప్రాతినిధ్యం వహించేది ప్రస్తుతంలో, భౌతికం, బాహ్యప్రాణికం. అందులోకి దివ్యక్రియాశక్తి చొచ్చుకుపోయి దానిని వశం చేసుకోవలసి వుందింకా. అది ఏ పరిస్థితుల్లో జరగాలో, ఆ పరిస్థితులు మరింత పూర్ణంగా వృద్ధి అవుతున్నాయి. దేహ సహజ తామసిక జడత స్థానాన్ని యధార్థ శాంతి ఆక్రమించేటట్లు భౌతికం ఉన్మీలనం కావాలంటే ఒక మహోన్నత ప్రశాంతత అవుసరం అవుతుంది. అది దక్కితే తక్కినదంతా నెరవేరుతుంది.

*

పరిణామమంటే జీవాత్మ పదార్థ చేతన మందకొడితనం నుండి పురోగమిస్తూ వెలువడడమే. బయటకు జంతువులా కన్పించే ఈ జీవి నుండి భగవంతుని క్రమానుగత స్వీయావిష్కరణమే.

శ్రీఅరవిందులు
అనువాదం: కె. వి. రావు

బ్రహ్మను వీడిన బ్రహ్మవధు

(వేద గాథ)

నేను మీకు ఈ రోజు వృద్ధులకూ, యువకులకూ కూడా పనికివచ్చే ఆసక్తిదాయకమైన ఒక అతి పూరాతనమైన ప్రాచీన కథను చెప్పబోతున్నాను. ఇది వాస్తవంలో వేదాల లోనిది.[1]

ఒకానొక కాలంలో — నేను కాలం అని చెప్పేటప్పుడు, సహజంగానే, అక్కడ ఏ కాలంకాని, ప్రదేశంకాని లేదు, అది కాల, ప్రదేశాల ఆవిర్భావానికి ముందు మాట, అప్పుడు కేవలం ఒకే ఒక్క మహా అస్తిత్వం, నామరహిత మహా అస్తిత్వం ఉంది — దాని పేరు బ్రహ్మ! మానవ అస్తిత్వాలమైన మనకు అది పరమోత్కృష్టమైన ఉనికి, మహాప్రభువు, దైవం లేక ఏ వ్యక్తైనా తాను ఏ విధంగా పిలవాలనుకుంటే అది అదే. అతడు సూర్యభగవానుడు కూడా, అతడు తేజమయమైన మహాసత్యం, కాంతుల యొక్క కేవల దివ్యకాంతి. అటువంటి సందర్భంలో, ఒకసారి ఈ విధంగా జరిగింది: ఈ ప్రకాశవంతమైన బ్రహ్మ తనను తాను చూసుకున్నవాడై, ఆశ్చర్యచకితు

---

[1] శ్రీమాత ఒకసారి ఈ విధంగా చెప్పారు, ఎవరైనా ప్రజలు అర్థం చేసుకోగలందులకై విశ్వం గురించి కథలు చెప్పదలిస్తే, అవి చిన్న పిల్లల కథలవుతాయి. ఈ కథలను మనం మన పసిపిల్లల చైతన్యం అర్థం చేసుకోగలందులకై ఉపకరణంగా వాడి ఉదహరించవచ్చు, లేనిపక్షంలో అవి మనకు ఎంతగానో దుర్గ్రాహ్యం. ఆమె ఇంకా ఈ విధంగా అన్నారు., ఎవరైనా తమలో తాము దానికి, కనీసం సాక్షికంగానైనా, దాని విశాలమైనటువంటి ప్రధాన లక్షణాలతో అంతరంగంలో రూపకల్పన చేసినా లేక బాహ్యంలో మూర్తిత్వాన్ని కల్పించినా అది వారి అవగాహనకు ఉపయోపడుతుంది. ఫలితంగా విషయాలు ఎందుకు, ఏ కారణాన జరుగుతున్నవనే దానిమీద నియంత్రణ వహించగలుగుతారు. కాని దీనిని ఒక మత సిద్ధాంతంగా విశ్వసించకుండా వారు జాగ్రత్త పడాలి. ఏ వ్యక్తి అయినా ఈ కథలను ఎక్కువగా తాంత్రికపరంగానూ, ఆధ్యాత్మికపరంగానూ అర్థం చేసుకోవచ్చు. ప్రతీకల వెనుకనున్న సత్యాన్ని చూడటం ఎలాగో తెలుసుకుంటే, అతడికి సర్వం అవగతమవుతుంది.
— సంపాదకుడు

(Based on Mother's Talks CWM 1st ed: 9:205. 5:374)

డైనాడు. అతని ప్రకాశం, అతని కళాకాంతులు విహీనమవుతూ ఉండటం గమనించాడు. అతడు మసకబారుతూ, క్రమక్రమంగా విషణ్ణమైపోతున్నాడు. అతడు కలవరంతో తికమకపడ్డాడు. అది ఎందువల్ల జరిగి ఉంటుంది? అప్పుడతడు తన సహచరులైన దేవతలను తలచుకున్నాడు. వారు తక్షణం అతని ముందు ప్రత్యక్షమైనారు, అందులో మొదట వచ్చిన దేవత వరుణుడు: వరుణుడంటే బ్రహ్మాండమైన చైతన్యం, దార్శనికత కలిగినవాడు. అతడు దూరాలను, అత్యంత మారుమూల ప్రాంతాలను అంతుబట్టని భవిష్యత్తును దర్శించగలిగినవాడు. అప్పుడతనికి విషయం ఏమిటనేది తెలియవచ్చింది. అతడు ఈ విధంగా చెప్పాడు: "ఓ, ప్రభూ, మీ దివ్యశక్తి వెళ్ళి పోయింది". బ్రహ్మ మరియు అతడి మహాశక్తి, బ్రహ్మజయ ఒక్కటే, వారిరువురూ కలిసే ఉంటారు, ఎల్లప్పుడూ ఒకరిలో మరొకరు ఇమిడిపోయి ఒకే ఒక్క అస్తిత్వంగా ఉంటారు. వరుణుడు అన్నాడు, "బ్రహ్మ వధువు బ్రహ్మను వీడిపోయింది." ఇప్పుడు అందరికీ బ్రహ్మను ఈ విధంగా అంధకారంలో పడేసి, ఆమె ఎక్కడికి వెళ్ళిందో వెతికే పని పడింది. వరుణుడు, ఎప్పుడూ చేసే విధంగానే, తన దృష్టిని సారించి, సునిశితమైన దూరదృష్టితో పరికించి చూశాడు. బ్రహ్మశక్తి, దివ్య ఆధిపత్య శక్తి దూరంగా, చాలా దూరంగా వెళ్ళిపోయిందని, భూమధ్యభాగం లోలోతులలోకి చొచ్చుకొనిపోయి, భౌతికపదార్థ సముదాయాలలో, తనకు తాను ముక్కలు ముక్కలుగా చెల్లాచెదురైపోయిందని తెలుసుకున్నాడు. ఆమె, మహాపదార్థంగా, అచేతనమై, వెలుగు చొరబడలేనటువంటి పదార్థంగా మారిపోయింది. దేవతలు, ఆమె సాధారణమైన ప్రాణులతో, విషయసంజాతంతో, వస్తువులతో మమేకమై పోయిందని తెలుసుకున్నారు. అప్పుడు వారందరూ కలిసి, విషయాన్ని కూలంకషంగా సంప్రదించుకుని, ఒక నిర్ణయానికి వచ్చారు: "మనం ఆమెను మేల్కొల్పాలి, ఆమెకు తనదైన ఎరుకను కలిగేటట్లు చేయాలి, ఆమె తిరిగి తన మహాప్రభువు, బ్రహ్మ వద్దకు చేరాలి — దాని వలన ఆయన కూడా తిరిగి తన యాదార్థస్థితిని పొంది, తిరిగి వశవర్తియై తన సొంత తాదాత్మ్యస్థితిని పొందుతాడు." ఆ విధంగా దేవతలు ఉద్యమించినప్పుడు సోమదేవుడు మొదట ఆమె చెంతకు వెళ్ళాడు. సోముడు అనగా చంద్రుడు లేక దివ్యానందము, అదే పరమానందము. దేవతలు ఈ విధంగా అన్నారు: పరమానందమైనటువంటి ఆ దివ్యానందం మహాప్రభువును, మహాశక్తిని కలిపి ఒకటిగా చేసింది, కనుక వారి సంయోగం, వారి పునఃసంయోగం కోసం, విషయ యోగ్యత ననుసరించి

సోముడు ముందుగా ఆమె వద్దకు వెళ్లటం సహజంగా నుంటుంది. ఆ విధంగా దేవతలందరు కలిసి ఆమె వద్దకు వెళ్ళారు. ఆమెకు పరిస్థితి విశదపరచారు, వారి వెంట వారి మార్గాలలో అనుసరించి పయనించడానికి ఆమెను ఒప్పించారు, అది చాలా సుదూర ప్రయాణం, సొంత ఇంటికి చేరే తిరుగు ప్రయాణం. ఇక్కడ మనం పార్వతీమాత తాత్కాలికంగా భూమాత ఒడిలో భౌతిక రూపధారణతో తన తల్లితో వసించి, కైలాసానికి తన దివ్యమయుడగు మహాప్రభువును కలవటానికి తిరుగు ప్రయాణం గావించిన గాథను గుర్తు చేసుకోవచ్చు.

వేదాలలో ఇటువంటిదే దీనికి సమాంతరంగా ఇంకొక కథ ఉంది. అది అగ్నిదేవుడు, అతని అదృశ్యం గురించినది. అగ్ని దేవతలలో చాలా ముఖ్యమైన దేవుడు. మీకు తెలుసనుకుంటాను, అతడు వేదక్రతువైన యజ్ఞానికి అధ్యక్షత వహించడమే కాకుండా, యజ్ఞకుండంలో వేసే ఆహుతిని సైతం స్వీకరించేవాడు. అగ్ని లేకుండా ఆహుతిని సమర్పించడం జరగదు. అతడు యజ్ఞపురోహితుడు. ఈ గొప్ప కర్మకాండలో అతడికి ప్రత్యేకించిన అగ్రస్థానంలో యజ్ఞం ప్రారంభానికి ముందు అతడి ఆవాహన చేస్తారు — కర్మకాండను గురించి మొదట మీకు తెలియజెప్పాలి, అది చైతన్యం అభివృద్ధిపథంలో సాగిపోవటానికి చేసే క్రతువు. అది మొదట అగ్నిని జ్వలించడంతో మొదలవుతుంది — అది ఆకాంక్షించే ఇచ్ఛను మేల్కొలిపే ప్రతీక. ఇప్పుడు అసలు కథలోకి వద్దాం: ఆహుతి సమర్పణకు అంతా తయారుగా వుంది, వున్నట్టుండి, ఆహుతిని స్వీకరించే ముఖ్యదైవం అక్కడ లేడు. అందరూ అతని కోసం వెతికారు, అతడెక్కడా కానరాలేదు. అతడు ఎక్కడికో దూరంగా వెళ్ళిపోయాడు. యథాప్రకారం, అప్పుడు తిరిగి దేవతలందరు సమావేశమై, ఉపేక్ష వహించిన అగ్నిని పట్టుకొనటానికి అంతటా శోధించారు. ప్రస్తుతం అందరి సమస్య ఇది: నిజమే, అతడు మాత్రం ఎక్కడికి వెళ్తాడు? కర్మారంభం చేయడం అతడి కర్తవ్యం, కాని అత్యంత కీలక సమయంలో అతడు లేడు. అందరూ అన్ని దిక్కులకూ వెళ్ళారు, చిట్టచివరకు అగ్ని ఒక చోట దాగి ఉన్నట్లు కనుగొన్నారు — ఎక్కడ దాగి ఉన్నట్లు? — నీటి అడుగున. అప్పుడు దేవతలందరు అతనిని సమీపించి, అతనితో చెప్పారు, "ఓ, అగ్నీ, నీవు ఇక్కడ ఎందుకు దాక్కున్నావు? బయటకు రా, నీవు నిర్వర్తించవలసిన

పని సిద్ధంగా ఉంది." అగ్ని బదులిచ్చాడు, "లేదు, నేను రాను, మీరు ఎంతగా అడిగినా నేను ఇక్కడే ఉండిపోతాను" — "కాని, ఎందువల్ల" — "అది చాలా కఠినమైన పని, నా ముందు చాలా మంది ఆ పనిని చేసే ప్రయత్నం చేశారు, ఈ బాధ్యతను వారి భుజాల మీద వేసుకున్నారు. కాని ఏ ఒక్కరూ సఫలురు కాలేదు, సంపూర్తి చేయలేదు. కనుక నేను అదే వైఫల్యాన్ని తిరిగి కొనసాగించే పనిని చేయదలచుకోలేదు. అది కొరగాని ప్రయత్నం". దేవతలు గట్టిగా పట్టుబట్టారు, ప్రార్థించారు, వేడుకున్నారు: "అగ్నిదేవా, అది నీవు చేయవలసిన పని, దాని వలన నీవు పూర్తి లాభాన్ని పొందుతావు, అలా అని నీకు మేము హామీ ఇస్తున్నాము". చివరికి దేవతలు తప్పించుకుపోయిన అగ్నిదేవుని శాంతింపజేసి ఒప్పించడంలో కృతకృత్యులైనారు.

ఆహుతి సమర్పణే త్యాగం — నేను ఇంతకు మునుపు చెప్పిన విధంగా — చైతన్యం ఆరోహించడం. మనం సాధారణ భౌతిక స్థాయి నుండి పైకి లేచి, మన అస్పష్టమైన ఇంద్రియాల కతీతంగా అధికతరమైన మహాప్రకాశానికి అభిముఖంగా తరలిపోయినప్పుడు, అది ఆరోహణ అనబడుతుంది, దానిని త్యాగం అంటారు. మనం ముందుకు పోవడానికి వనరులు లేనటువంటి నిమ్నస్థాయిని, ప్రకృతిస్థాయిని తిరస్కరించి, ఉన్నతస్థాయిలోని వాస్తవాలను సంపాదించుకోవటం. అగ్ని అంటే జ్వలించే నీ హృదయంలోని శక్తి, సాధారణ మర్త్యజీవిని ఎంతో కొంత అధిగమించి పోవాలని కోరుకునే నీ ఆకాంక్ష. కనుక అది వాస్తవంలో ఒక తపస్సు, ఉన్నతిని పొందటానికి చేసే కఠోర పరిశ్రమ — కిందికి దిగజార్చే గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేకం; అవును, అది నిజంగానే కష్టమైన పని. అగ్ని ఆ కష్టాన్ని పొందదలచుకోలేదు, ఎందువల్లనంటే, మనిషి, ముఖ్యంగా మామూలు మనిషి కూడా దానిని నిరాకరిస్తాడు. కాని నేను చెప్పినట్టుగా అంతా సుఖాంతమైంది, ఎందువల్లనంటే ఎట్టకేలకు అగ్ని తన ఆమోదాన్ని తెలియజేశాడు. మనం ఇక్కడ అగ్ని నీటిలో దాగడాన్ని చూస్తాం. నీరు దేనిని సూచిస్తుంది? నీరు ప్రాణాధార శక్తి, జీవశక్తి. అది జీవన-శక్తి. ఇది కూడా అగ్ని వలెనే ఒక రూపధారణ చేసివున్న మహా-చైతన్యశక్తి, కాని అది నిండైన వస్త్రాం ధరించిన చందంగా, భౌతిక పొరలో రహస్యంగా మరుగుపరచబడిన భద్రమైన రూపం. దానిని విడుదల చేసి, పైకి పంపాలి.

మనం ఇప్పుడు మొదటి కథకు వెళ్లాం. దేవతలు బ్రహ్మవధువైన బ్రహ్మజయతో

తిరిగి స్వగృహానికి పయనం సాగించారు. కాని ఈ కథకి ఒక ప్రారంభం ఉంది, అది దీనికి ముందుగా జరిగిన వృత్తాంతం — పూర్వరంగం. దివ్య వధువు తన ప్రభువును వదలి వెళ్ళవలసిన అగత్యం ఎందుకు కలిగింది? ఆమె పారిపోవడానికిగల ప్రబల కారణం ఏమిటి? ఒకప్పుడు పరిపూర్ణ సంయోగంలో ఉన్న ఆమె, ఆయనను ఒంటరిగా వదలివెళ్ళవలసిన కారణం? ఉపనిషత్తులు ఉటంకించినట్లుగా కథ ఇలా సాగుతుంది, ప్రభువైన బ్రహ్మ చాలా కాలం — యదార్థంలో చిరకాలంగా — ఒక్కడుగానే, ఏకాకిగా, ఏకైక మహా ఉనికిగా, ఒకే మహాసత్యంగా, అవిభాజ్యుడిగా, విభజించబడడానికి వీలులేకుండా ఉన్నాడు; కాని, ఆయన ఆ విధంగా చిరకాలంగా ఉంటూ ఉన్న స్థితిలో, ఒకానొక సమయంలో ఆయనకు తాను ఏకాకిగా ఉన్న స్పృహ కలిగింది. అప్పటి వరకు ఆయన అటువంటి ఆలోచనను చేయలేదు. ఒక్కడే ఉన్నాడన్న ఆలోచనకాని లేదా ఇతరులు తన చుట్టూ అక్కడ ఉన్నారన్న ఆలోచనకాని లేదు. ఆయన కేవలం ఆ విధంగా ఉంటూ ఉన్నాడు, ఉనికి మాత్రమే ఉంది. కాని ఇప్పుడు ఆయనకు ఆ అనుభూతి కలిగింది, ఆయన తనను తాను ఏకాకిగా చూసుకున్నాడు., ఒకసారి అటువంటి ఆలోచన వస్తే దానిని ఆపలేము కదా. అప్పుడు ఆయన అన్నాడు; ఏకాకిగా ఉండి ఎవరైనా సంతోషంగా ఉండగలరా? సంతోషంగా ఉండాలంటే తప్పక ఇద్దరుండాలి — ఏకాకి న రమతే. ఒంటరిగా ఉన్నప్పుడు ఆనందాన్ని అనుభవించలేరు. కనుక ఇద్దరు తప్పక ఉండాలి. అందువలన పరమోత్కృష్టుడైన బ్రహ్మ తనను తాను రెండుగా విభజించుకున్నాడు. ఒకటి రెండు విధాలుగా అయింది.: ఒక భాగం పురుషుడు, తక్కిన భాగం స్త్రీ, ఒక భాగం చైతన్యం, తక్కిన భాగం శక్తి ,ఆధిపత్యశక్తి, ఒక భాగం బ్రహ్మ, తక్కిన భాగం బ్రహ్మశక్తి. ఇంత వరకూ రెండు భాగాలుగా ఉన్నా, అవి ఐక్యంగానే ఉన్నాయి, అతుక్కుపోయి, ఒకరి అస్తిత్వంలో మరియొకరిది చొచ్చుకుపోయి ఇమిడి ఉన్నాయి; మహాశక్తి మరియు మహాప్రభువు, అగ్ని మరియు దాని జ్వాల — అవి ఒక్కటే, విభజించలేనివి. కాని, నేను చెప్పిన విధంగా తప్పక రెండుగా ఉండాలనే ఆలోచన వచ్చిందే తడవుగా, యదార్థంలో వారు విడిపోవటం జరిగింది, బ్రహ్మ తనను తానుగా మహాశక్తి నుండి విడిపోయాడు, తన నుండి మహాశక్తిని బయిటకు తీశాడు. మహాశక్తి తనకు తానుగా వెడలిపోయింది, యదార్థానికి ఇద్దురూ విడిపోయారు, ఒకరికొకరు ఎదురెదురుగా నిలుచున్నారు. మీకు గుర్తుండే ఉంటుంది — నా

ఉద్దేశంలో ఇక్కడ ఉన్న పెద్దతరంవారికి — ఇక్కడ నాటక ప్రదర్శనశాలలో నాటకం వేసినప్పుడు, శ్రీమాత దర్శకత్వం వహించారు — 'అతడు మరియు ఆమె' — ఆ నాటకం 'అతడు మరియు ఆమె' ల లీలలో, వారు ఒకటిగా ఏ విధంగా ఉంది, ఏ విధంగా విడిపోయింది, వారి సంయోగం, పునఃసంయోగం ప్రదర్శించబడింది. ఇప్పుడు ఒకసారి విడిపోయిన తరువాత, సమీపం నుంచి జాగ్రత్తగా చూస్తూ ఉంటే ఎక్కువెక్కువగా విడిపోతూ, నెమ్మదిగా దూరం పెరుగుతూ ఉండగా, ఎట్ట కేలకు వారు సంపూర్తిగా విడిపోవటం జరిగింది, మహాశక్తి మహాప్రభువు నుంచి దూరం ఎంత దూరం వెళ్ళిపోయిందంటే, ఆమె మరి ఒక చివరి అంచుకు వెళ్ళిపోయింది — పైన బ్రహ్మ, పరమోత్కృష్ట చైతన్యం, కింద ఆమె, సంపూర్ణ అంధకార బంధురమైన జడపదార్థంగా. బ్రహ్మగూడా పూర్తిగా తన మహాశక్తి నుండి విడిపోయి, వ్యతిరేక దిశలో ఏమీ లేనటువంటిదాని వైపుకు, బౌద్ధులు చెప్పిన శూన్యం వైపుకు, వెళ్ళిపోయాడు.

ఇప్పుడిక తిరుగు ప్రయాణం. ఆ మహాశక్తి చాలా కాలం తన ప్రభువుకు దూరంగా ఉండలేదు, పైగా అదేమీ ఆమెకు అంతిమ గమ్యమేమీ కాదు. ఆమె తన ప్రభువు చెంతకు తిరిగి రావలసిందే. ఇది భౌతిక ప్రకృతికి విమోచనం, ఉన్నతోన్నతమైన ప్రకృతిలోకి, క్రమంగా జరిగే రూపపరివర్తనతో, ప్రభువు చెంత తన స్థితిని తిరిగి పొందే కథ. వేదాలలో వర్ణించి చెప్పబడిన పద్ధతులే గాని లేక మనం తీసుకోవలసిన చర్యలే గాని ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటాయి, మానవులకు సైతం వారి విమోచనకు నిమ్నప్రకృతి నుంచి ఆధ్యాత్మిక ప్రకృతిని తిరిగి పొందటానికై చెప్పేవి అలాగే ఉంటాయి. దేవతలు ఒక్కొక్కరుగా మహాశక్తిని తోడ్కొని వెళ్ళారని వేదం చెప్తోంది. మొదట సోముడు వచ్చాడు, అది ఎటువంటిదంటే, అధఃపాతాళానికి పడిపోయిన ప్రకృతిలోని అంతరాంతరాళాన్ని దివ్యానందం తాకి, ఆమెను మేల్కొలిపి పునరుద్ధానానికై ముందుకు పురికొల్పటం. దివ్యానందం వారి మొట్టమొదటి ఐక్యతకు మూలం కాగా, అదే దివ్యానందం వారి పునఃసంయోగానికి స్ఫూర్తి, సూత్రధారి అయింది. తరువాత, ఆ పయనంలో, అగ్నిదేవుడు తన వంతుగా మహాశక్తిని తనతో పాటుగా తీసుకువెళ్ళాడు. అగ్ని అంటే, నేను ఇంతకు మునుపు చెప్పినట్లుగా, పునరుద్ధానానికై జాజ్వల్యమానమైన వెలుగు, తీవ్రంగా జ్వలించే ఆకాంక్ష. అగ్ని మొదట అజ్ఞానపూరితమైన మహాశక్తికి ఒక మంత్రం

ఉపదేశించాడు. అది సాధారణంగా ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించేటప్పుడు మానవులకు మంత్రోపదేశం చేయడం వంటిదే. నీవు ఒక గురువు చెంతకు వెళ్ళాలి, ఆయన నీ చైతన్యం మేల్కొనటానికి ఒక మంత్రాన్నిస్తాడు. అదే విధంగా అగ్ని కూడా ఇప్పుడు ఒక మంత్రాన్ని, దివ్యవాక్కైన 'బ్రహ్మ' మంత్రాన్ని దైవానికి ప్రతి రూపంగా ఇచ్చాడు. ఆయన చైతన్యంలో ఆమె తాదాత్మ్యం చెందేవరకు ఆ మంత్రం మీద ఆమె ఏకాగ్రం చేయవలసి ఉంది. ఆమె అదే విధంగా చేసింది. కొంత తడవు అనంతరం ఆమెకు తన మహాప్రభువును గుర్తించిన అనుభూతి కలిగి, ఆయనను స్వీకరించింది, అప్పుడు అగ్నిదేవుడు చెప్పాడు: "ఇప్పుడిక నీవు ఇంకా ముందుకు, రెండవ స్థితికి చేరాలి. నీ అస్తిత్వాన్ని విస్తృతపరచు, నీ చైతన్యాన్ని విస్తృతపరచు; ఇప్పుడు నీకు వచ్చిన అనుభవం నీవు బ్రహ్మవని, నీవు అతనితో ఐక్యమై ఒకటిగా ఉన్నావని. ఇప్పుడు నీ అంతట నీవు ఇతర అస్తిత్వాలన్నింటితో, దేవతలందరితో, ప్రాణులన్నింటితో ఐక్యమవాలి, నిన్ను నీవు సార్వజనీనం చేసుకోవాలి". కనుక బ్రహ్మవధువు తన వ్యక్తిగత సాక్షాత్కారం నుండి విశ్వంలోనికి ప్రయాణించి, అక్కడ అన్ని అస్తిత్వాలలోనూ, ప్రతి చోటా అన్ని ప్రాణులలోనూ వసిస్తున్న తన మహాప్రభువును కలిసింది — ఆమె దేవతలందరూ నివసించే భవన సముదాయంలో ప్రవేశించింది.

ఇప్పుడు మీకు తెలుస్తున్నది కదా, మూడు అడుగులున్నాయి, చైతన్యపు మూడు అడుగులు, పరమేశ్వరుని చేరడానికి, మీ అస్తిత్వ ఆరోహణకు మూడు అడుగులు. మొదటిది, మీ సాధారణ ప్రత్యేక వ్యక్తిత్వం, మీ పేరుతో, రూపంతో ఉన్నది, అది వ్యక్తిగతం, ప్రత్యేకం; తరువాత, ఆ గూడు నుంచి బయటపడితే, మీరు అన్ని ప్రాణులతో, మానవజాతితో, అన్ని విషయాలతో కూడా ఏకమైనట్లు తెలుస్తుంది, మీరు సృష్టి అంత విశాలమైపోతారు; అయినప్పటికీ అంతటితో అయిపోలేదు. మీరు ఇంకా దూరం, ఆవలకు, అతీతమనేదాని లోనికి వెళ్ళాలి, అక్కడ మీరు పరమేశ్వరుని దర్శిస్తారు, అది పూర్ణం, మీ అస్తిత్వ పరమోత్తమ మహాసత్యం. ఆ విధంగా, బ్రహ్మ వధువు తన సార్వత్రిక సాక్షాత్కారం నుండి అతీతం లోకి వెళ్ళింది, తన ప్రభువులో లీనమైంది, తన స్వీయ ఆత్మలో అంతర్లీనమైంది. తన అజ్ఞాన భౌతిక రూపధారణ నుంచి ముందుకు పోయే క్రమంలో ఆమె తన వివిధ పరిమాణాలతో కూడిన తన నిమ్నరూపధారణలను వదిలివేస్తూ, శుద్ధమైన, ఉన్నతమైన,

ఇంకా ఎక్కువ మహిమాన్వితమైన రూపాలను ధరించింది. అంతిమంగా, ఆమె మొదట తాను ఏ విధంగా ఉందో, ఎల్లప్పుడూ, వేరుపడటానికి ముందు ఏ విధంగా ఉందో అదే విధంగా తనను తాను చూసింది. ఆ విధంగా వారు కలవటంతో దేవతలు సైతం వారి పరిష్వంగంలో కలపబడ్డారు, చిట్టచివరకు అందరు తమకు తాముగా ఆనందాన్ని పొందారు.

ఈ ఎడబాటు, ఈ పునః, సంయోగం భూమి మీద అధికతరమైన సాఫల్యతను ఇచ్చేదిగా చెప్పబడింది. ఈ ఎడబాటు లేని పక్షంలో, భూమి మీద సాఫల్యత కూడా మృగ్యమయ్యేది. భూమి ఏ విధంగా ఉందో అదే విధంగా ఉండేది, కాని ఈ ఎడబాటు కారణంగా, అనగా, బ్రహ్మ వధువు తన ప్రభువు నుంచి తనకు తానుగా వేరుపడి, మహాపదార్థంలోకి కిందిగి దిగివచ్చి, మహాపదార్థంతో ఏకమవటం మూలంగా, అప్పుడే తప్పనిసరిగా తన వాస్తవికతతో కలిసిపోవటానికీ, వాస్తవికంగా పదార్థంలో బ్రహ్మ ఉండటానికీ సాధ్యమైంది.

దివ్యవధువు కింద భూమి మీద పడిపోయి, పదార్థంలోకి చొచ్చుకుపోయి అందులో ఇమిడిపోయి దానితో ఒకటైపోయింది. ఆమె పదార్థంగా, భౌతిక ప్రకృతిగా, మాంద్యస్థితితో, చీకటిమయంగా మొత్తం తన బరువుతో భారంగా తయారైంది. వేదాలు పేర్కొన్నట్లు ఆమె 'భీమ జయ' అయింది — బ్రహ్మాండమైన శక్తిగా భయానకమైన భార్యగా అయింది — వాస్తవంలో ఆమె మన మహాకాళి. ఆదిలో ఆమె అందమైన భార్యే — సౌమ్య జయ. కాని పురోగమనంతో వృద్ధి జరగవలసి ఉంది. కనుక ఆమె పునరుద్ధానానికై, ముందుకు అడుగులు వేస్తున్నది, ఆమె ఇప్పుడు అత్యంత బరువైన అచేతనాభారాన్ని మోయగల సామర్థ్యాన్ని సంపాదించి, దానిని తనతో పైకెత్తి, క్రమక్రమంగా రూపపరివర్తన చేయగలగింది. అంతిమ సాక్షాత్కారంలో దేవతలందరూ మునుముందుకూ, మానవులందరూ బయటకూ, సూర్యకాంతిలో కేరింతలు కొడుతూ, ఆడుతూ ఉన్నట్లుగా దివ్యవధువు, ఆమె వరుని సంయోగపు దివ్యానందంలో పాలుపంచుకోవటానికి యేతెంచారు.

ఇదే జరుగుతున్న నాటకం, వాస్తవ ఘటనల నాటకం, ఇది కాల్పనిక కథ కాదు. ఇది వేరొక ప్రపంచంలో, సూక్ష్మతర జగత్తులో జరుగుతున్న కార్యక్రమం. వేదాలు చెప్తున్నట్లుగా, ఇదే మరల మరల ఆ 'స్వర్గాల' లో ఆడబడుతున్నది, దాని ఫలితంగా అది ఇంకా ఇంకా ఎక్కువగా భూమి మీద వాస్తవికమై, అంతిమంగా

అది భూమి మీద ఆకృతినీ, భౌతికతనూ సంతరించుకుంటుంది.

ఈ జగన్నాటకంలో ఒక అసాధారణ విషయాన్ని గమనించవలసి ఉంది. అవరోహణ అనేది ఉన్నదంటే అప్పుడు దాని ననుసరించి ఆరోహణ తప్పనిసరిగా జరిగి తీరాలి. మహాశక్తి కేవలం ఒక్కటే వాస్తవంగా కిందికి రావాలి కానీ అసలైన విషయం, ఆమె కేవలం ఒక్కతే ఉండలేదు. ఆమె, పరోక్షంలో రహస్యంగా తన ప్రభువు వెన్నంటిరాగా, కిందికి దిగివచ్చింది. అత్యంత అంధకారమైన జడపదార్థంలోనూ బ్రహ్మ కూడా అక్కడనే ఉన్నాడు, అణుమాత్రమైన రవ్వగా, అత్యంత సూక్ష్మ మైన వెలుగుకిరణం వలె కాని కేంద్రస్థానంలో ఇమిడిపోయి ఉన్నాడు, అంటే పైకి పోవాలనే ప్రేరణా లేదా అమితోత్సాహమూ అయినటువంటి మనం ఆకాంక్ష అని చెప్పేది అక్కడ ఎల్లవేళలా ఉన్నదని అర్థం. యదార్థానికి మహాశక్తి మొత్తం అచేతనంలోని అట్టడుగుకు చేరినప్పుడు అదే జరుగుతుంది, మళ్ళీ పైకెగరడం అనే గమనం ఉంటుంది, అది ఎక్కడి నుంచి వచ్చిందో అక్కడికే వెనుకకు పోయే గమనం లాంటిది. అది జీవం లేని జడమహాప్రకృతికి మేల్కొలుపు, అది ఆమె పరిణామం, పై వైపుకు పోయే పయనానికి ఆమె అంకురార్పణ. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం, ఆమె వృద్ధిలో, ఆమె వికసనం జరుగుతూ ఉండగా, పక్కపక్కనే పరమప్రభువు కూడా వృద్ధిని పొందుతూ ఉంటాడు. దాని అర్థం, పరమ ప్రభువు కూడా ఇంకా ఇంకా ఎక్కువగా తనకు తాను అభివ్యక్తం అవుతూంటాడు: ఈ విధంగా ఇది రెండు విధాలైన అభివ్యక్తత. వారిద్దరూ ఎప్పటికీ వేరు కాలేదు, వారెప్పుడూ ఒకటిగానే ఉన్నారు. కనబడే ఆ ఎడబాటు లేదా మరుగు కేవలం ఒక నాటకం, లీల, ఇంకా అధికాధిక పునః సంయోగానికి.

నాకు తెలియదు కాని, బహుశా, ఈ యుగంలో జీవిస్తున్న మనం దానికి చాలా దగ్గరగా ఉన్నాం, నిజంగా మహాపదార్థం, ఘనీభవించిన, జడమైన, అస్పష్టమైన మహా పదార్థం, మన భౌతిక మాత — వేదాలలోని భీమ జయ — పరివర్తన చెందినప్పుడు, మన మానవజాతికి సైతం ఆ పరివర్తనలో తమ వంతు వాటా ఉంటుందని పూర్వీకులు చెప్పినటువంటి చిట్టచివరి సాక్షాత్కార ద్వారం ముంగిట మనం ఉన్నామేమో. ఇదే విధంగా ఇప్పుడు ఇవన్నీ కూడా, నేను ఇంతకు మునుపు చెప్పినట్లు, వేరు ప్రపంచాలలో, సూక్ష్మలోకాలలో, సూక్ష్మరూపాలలో, సూక్ష్మశక్తులతో పునరావృతమవుతున్నాయి. కాని పూర్తి భౌతికరూపంలో మాత్రం కాదు; బహుశా,

అరుణోదయం వెనుక సిద్ధమవుతున్నదేమో. మీరందరూ, మన మందరం, ఆ లక్ష్యప్రాప్తిలో, కొంత ముందు వెనుకగా, ఏదో ఒక రూపంలో తప్పకుండా పాలుపంచుకుంటాం.


నళినీకాంత గుప్త

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

కోరిక కాదు, ప్రేమానురాగం కాదు, అతనిని నడిపించాల్సింది — దివ్యప్రేమతో తొణికిసలాడే మహా సంకల్పం, దివ్యజ్యోతి నుండి వెల్లివిరిసే దివ్యజ్ఞానం, బ్రహ్మానంద ప్రచోదిత విలాసభరిత శక్త్యుత్సాహం.

(CWSA 23:267)

శ్రీఅరవిందులు



అమ్మ యొక్క అష్టవిధ దర్శనములు

అఖిల

అఖిలభారత పత్రిక

జూలై 2014

8/7/2014

విషయసూచిక



శ్రీమాత, 1958

అమ్మకు కలిగిన అష్టవిధ అంతర్దర్శనములు

1958 సం. మే నెల 28 న అమ్మ గతంలో ఒకసారి తనకు కలిగిన దర్శనం జ్ఞాపకం చేసుకున్నారు. ఆ దర్శనం మహాద్భుత పురుషుడైన పరమేశ్వరుని నుండి ఆవిర్భవించిన ప్రేమమయుడగు దివ్యచైతన్యమూర్తిది. ఈ సృష్టిని క్రమేపి దివ్యచేతన ఉనికికి మేల్కొనునట్లు చేయాలనే లక్ష్యంతో ఆ మూర్తి తన ఆవిర్భావ స్థానం నుండి నేరుగా అచేతనా భూమికలోనికి ప్రవేశించింది. 1958 సం. మే నెల 28 న అమ్మ ఈ సందర్భంలో చేసిన వ్యాఖ్య ఈ సంచికలో మొదటి శీర్షికగా ప్రచురించబడింది.

ఈ దర్శనం గురించి అమ్మ చెప్పిన వృత్తాంతము 1906 సం నవంబరు మాసంలో పారిస్ నగరంలో ప్రచురించబడిన 'Revue Cosmique' అనబడు ఫ్రెంచి మాస సమీక్షా పత్రంలో వెలువరించబడింది. ఆ తరువాత 1906, 1907 సంవత్సరాలలో అమ్మకు మరో ఆరు దర్శనాలు కలిగాయి. వీటి వివరాలు వ్రాత పూర్వకంగా నమోదు చేయబడినా వాటిపై అమ్మ సంతకం లేదు. అయినప్పటికీ, అవి అన్నీ ఒకే రకమైన పదజాలంతో ప్రారంభించబడ్డాయి, ఒకే శైలిలో వ్రాయబడ్డాయి, ఒకే రకమైన అనుభవాన్ని విశదీకరించాయి. ఆ కారణంగా అవి అమ్మకు చెందినవేనని కచ్చితంగా చెప్పవచ్చు.

1980 సం. లో వెలుగులోకి వచ్చిన సాక్ష్యాధారాలవల్ల ఈ నిర్ణయం సరైనదేనని రూఢి అయింది. అందుకు ఆధారంగా ఎనిమిదవ దర్శనం యొక్క వివరాలను అమ్మ వ్రాసిన చిత్తుప్రతి 'Une Vision (8)' లభ్యమయింది. అంతేగాక ఆమెచే స్వయంగా వ్రాయబడిన ఉత్తరాల చిత్తుప్రతులు — ఎనిమిదవ దర్శనానికి పూర్వం కలిగిన దర్శనాలతోపాటు అయిదవ దర్శన పాక్షిక వివరాలు గలవి — లభ్యమయినాయి.

ఈ ఎనిమిది దర్శనాల వివరాలు ఈ సంచకిలో ప్రచుచరించబడ్డాయి.

తనకు కలిగిన దర్శనాలను జ్ఞప్తికి తెచ్చుకోవటంలో, ఫ్రెంచి మాస పత్రం 'Revue' లో ప్రతిపాదించబడిన 'విశ్వతత్వం' (Cosmic Philosophy) నుండి సేకరించబడిన కొన్ని వి శేష పదాలను అమ్మ వాడారు. వీటిని అనువదించడంలో, మూలపాఠంలోని పదాల సాహితీ విలువలకు దాదాపు దగ్గరగా నుండే ప్రయత్నం చేయబడింది.

మూలపాఠంలోని ఈ పదాలు యథాతథంగా పుట క్రింద ఈయబడిన వివరణలలో పొందుపరచబడ్డాయి.

అనువాదం: అందుగులపాటి జానకి

ఒక పురాతన సంప్రదాయము

(*1958 సం. మే నెల 28 నాటి అమ్మ వ్యాఖ్య*)

ఒక అత్యంత పురాతన సాంప్రదాయము గురించి మీకు చెప్పాలి. అది నేటి వరకు మన ఎరుకలో నున్న ఆధ్యాత్మిక, అతీంద్రియ మార్గాలకు పూర్వకాలానికి చెందినది. ఈ రెండు మార్గాలకు మూలమైనదిగా కనిపిస్తుంది. ఈ సాంప్రదాయానుసారం, ప్రతికూల శక్తుల చర్యల ఫలితంగా — హిందూ సాంప్రదాయంలో ఆసురిక శక్తులు అనబడేవి — ఈ ప్రపంచం తన దివ్యతేజోమయ నియమావళికి, తన అంతర్గత సహజ చేతనకు అనుగుణంగా వృద్ధిచెందుటకు బదులు మనకు అవగాహనలో నున్న అజ్ఞానాంధకార, అచేతన, అవిద్యా భూమికలలో మునిగిపోయింది. ఆ విధంగా భ్రష్టు పట్టిన ఈ లోకాన్ని రక్షించడానికిగాను జోక్యం చేసుకోమని దివ్య సృజనాత్మక శక్తి సృష్టికర్తయగు పరమేశ్వరుని వేడుకొంది. ఆ ప్రార్థనకు సమాధానంగా ఆ సృష్టికర్త నుండి దివ్యప్రేమను దివ్యచేతనను సంతరించుకున్న ఒక విలక్షణమైన దివ్య అస్తిత్వం ఆవిర్భవించి తనకు తానుగా అత్యంత అచేతనావృతమైన భౌతికంలోనికి, దానికి మౌలికమైన దివ్యచేతన, దివ్యప్రేమలకు ఉన్మీలనం గావించే పనిని చేపట్టుటకు పూనుకుంది.

ప్రాచీన గాథలలో ఈ దివ్యపురుషుడు ఒక చీకటి గుహ అంతర్భాగాన గాఢనిద్రలో మునిగివున్నట్లుగాను, ఆ దీర్ఘ సుషుప్తావస్థలోనున్న ఆతని నుండి ధగద్ధగాయమానమైన కాంతికిరణాలు వెలువడి క్రమేణా అచేతనా భూమికలోనికి విస్తరించి, అందులోని మూలపదార్థా లన్నింటిలోకి తమంతట తాము ప్రవేశించి స్థిరపడ్డాయి.

ఎవరైనా ఈ అచేతనా భూమికలోనికి ఎరుకతో ప్రవేశించినట్లయితే, ఇంకా గాఢ నిద్రావస్థలో కొనసాగుతూ కాంతికిరణ ప్రసరణను కొనసాగిస్తున్న ఆశ్చర్యం కొలిపే ఆ దివ్యపురుషుని చూడవచ్చు. అతను ఆ కాంతికిరణ ప్రసరణను అచేతన

అజ్ఞానాంధకారం ఈ ప్రపంచం నుండి సమూలంగా అంతమొందేవరకు, సృష్టి యావత్తూ దివ్యచేతనకు ఉన్మీలనమయ్యే వరకు కొనసాగిస్తూనే వుంటాడు.

ఆశ్చర్యం గొలిపే విషయమేమిటంటే, ఈ అద్భుత దివ్యపురుషుడు, ఒకనాడు నా భావనాదృష్టికి, ఏ దివ్యపురుషుడైతే బహుదూరంగా సగుణ సాకార నిర్గుణ నిరాకార తీరాల అంచుల కావల నున్నట్లుగా కనిపించాడో, ఆతనిని బోలినట్లుండుట. అయితే, నా భావనాదృష్టికి కనిపించిన దివ్యపురుషుడు బంగారు జిలుగులు చిందే గులాబి ఛాయలో వెలిగిపోతుంటే, నిద్రావస్థలో దర్శనమిచ్చిన ఈ దివ్యపురుషుడు ధగద్ధగాయమానమైన వజ్రపు శ్వేతకాంతితో రంగురంగుల కాంతికిరణాలను వెదజల్లుతున్నట్లుగా నున్నాడు.

వాస్తవానికి ఈ ఆకృతి సర్వ అవతారాలకూ ఆదిమూలం. ఒక విధంగా చెప్పా లంటే అతనిది ఆద్య విశ్వావతారం. అతను క్రమేణా మరింత అధికాధిక చైతన్యవంత మైన దేహధారణలు పొందుతూ, చివరిగా ప్రపంచం యావత్తు పరిపూర్ణమైన దివ్యతేజాన్ని స్వీకరించి తిరిగి ఒక అవిచ్ఛిన్న పురోగతి క్రమంలో వ్యక్తపరచుటకు సంసిద్ధపరచే కార్యక్రమాన్ని పూర్తిచేయుటకు ఆ సర్వేశ్వరుని నుండి నేరుగా అవ రోహించి, గుర్తింపుపొందిన దివ్యజీవుల పరంపరలో ఒకరిగా సాక్షాత్కారించాడు.

ప్రతి దేశ చరిత్రలోను, ప్రతి సాంప్రదాయంలోను ఈ సంఘటన ఒక విలక్షణ రీతిలో, విభిన్న పరిమితులతో, వివరాలతో, ప్రత్యేక లక్షణాలతో ప్రకటించబడింది. వాస్తవానికి, ఈ కల్పనా గాథలన్నింటికీ అసలు మూలం ఒక్కటే. దీనినే అజ్ఞానాంధకార బంధురమైన భౌతికంలో, మధ్యంతర అవరోధాలను అధిగమిస్తూ దివ్యశక్తులను ఆవాహనచేసి ఆ భౌతికాన్ని వాటికి ఉన్మీలనం గావించటానికి భగవంతుడు చేపట్టిన ప్రత్యక్ష చేతనాపూరిత జోక్యం అనవచ్చు.

వివిధ అవతారాల మధ్యగల కాలాలు పోను పోను తగ్గిపోయినట్లుగా కనిపిస్తాయి. అది ఏ విధంగా ఉంటుందంటే, భౌతికం ఎంత అధికంగా సంసిద్ధమవుతుందో అంతమేరకు కార్యాచరణ కూడా చైతన్యవంతమవుతుంది, క్రియాశీలమవుతుంది, నిశ్చయాత్మకమవుతుంది.

ఆ విధంగా ఈ కార్యక్రమం ద్విగుణీకృతమవుతుంది, తీవ్రతరమవుతుంది

— ప్రపంచమంతా ఆ పరమేశ్వరుని దివ్యావతార క్షేత్రంగా పరిణమించేవరకు.
(CWM 9:332-34)

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మొదటి దర్శనం

నేను నిద్రపోయాను, ఇప్పుడు మేల్కొన్నాను.

పశ్చిమ జలాలపై నిద్రపోయి ఇప్పుడు మహాసాగరపు లోతుల అన్వేషణకై అందు ప్రవేశించాను. దాని ఉపరితలం మరకతమణుల రంగులోను ఆ అంచులు చంద్రకిరణాలు పడటం వల్ల వెండిరేఖల మాదిరిగానూ ప్రకాశిస్తున్నాయి. అడుగున ఉన్న నీరు ఇంద్రనీల కాంతితో ఉంది. అది కాసేపట్లో కొద్దిగా కాంతివంతమవుతుంది.

పట్టువస్త్రపు రెపరెపలు గురిపించే తళుకుల్లా మెరుస్తున్న అలల పాన్పుపై నేను పరుండగా అవి అల్లల్లాడుతూ ఒక పద్ధతిలో ఊగుతూ పశ్చిమ దిశగా జరుగుతున్నాయి. ఒక వైపు నుంచి మరొక వైపుకి ఊగుతూ నేను క్రింద క్రిందకు జారుతుండగా ఆ నీళ్ళు మరింత వెండి వెలుగుల వెల్లువలై ప్రవహిస్తున్నాయి.

ఆ విధంగా చాలా సేపటిదాకా అలల తాకిడితో ఇటు నటు ఊగుతూ క్రిందకు, చాలా క్రిందకు దిగాను.

ఉన్నట్లుండి పైకి చూసేసరికీ ఒక పగడపు ఛాయ కనిపించింది. దాని దగ్గరకు చేరి చూసేసరికి ఒక పెద్ద వృక్షమంత పగడపు పొదను గమనించాను. అది ఒక పెద్ద నీలపు రాతికి అల్లుకొని ఉంది. అక్కడ చాలా జలచరాలు ఇటూ, అటూ తిరుగుతూ కనిపించాయి. ప్రస్తుతం బాగా మెరుస్తున్న ఇసకపై నిలబడ్డాను. ఆశ్చర్యంగా చుట్టూ చూసేసరికి అనేకమైన కొండలూ, లోయలూ, అద్భుతమైన అడవులూ, జంతువుల ఆకారంలో నున్న విలక్షణమైన పూలు, పూల మాదిరిగా కనబడే చేపలూ కనిపించాయి — వాటి మధ్యలో తేడాయే లేదు. స్థాణువులకీ, జంగమాలకీ మధ్యన అంతరం లేదు. ఎక్కడ చూసినా రంగులు; కోమలమైనవీ, మిరుమిట్లుగొలిపేవీ; అయినా కూడా చాలా నిర్మలంగా ఒకదానితో ఒకటి మేళవింపు కలిగి ఇంపుగా

ఉన్నాయి. నేనలా ఆ బంగరు ఇసుకలో వాటి అందాన్ని ఆస్వాదిస్తూ నడుస్తున్నాను. అవన్నీ కూడా ఒక లేత మంద్ర నీలకాంతిలో, మధ్య మధ్య చిన్ని గుండ్రటి ఎర్రని, పచ్చని బంగారు రంగుల బంతుల్లా మెరుస్తూ చాలా ఆహ్లాదంగా కనిపించాయి.

సముద్రగర్భం ఎంత విచిత్రమైనదో! ఎక్కడ చూసినా ఆ పరమాత్మ ప్రత్యక్షత కనిపిస్తూంటుంది. ఆ సమరస భావాలన్నీ ఆ ప్రభువులోనే కదా నెలకొని ఉన్నది.

నేనింకా పశ్చిమ దిక్కుగా వెళ్ళుతూ ఉన్నాను, ఏ రకమైన అలసటగానీ, వేగం కొరవడటంగానీ లేదు. అసాధారణమైన దృశ్యాలు ఒకదాని తర్వాత ఒకటి వస్తూనే ఉన్నాయి; ఒక చోట ఒక వైడూర్యశిల మీద చాలా చక్కని నాజూకు సముద్రపు నాచు కనిపించింది. అది చూడటానికి చక్కని పొడుగాటి ఊదా జుట్టులాగా ఉంది, వేరొకచోట తళతళలాడే వెండిలా మెరుస్తున్న గులాబీరంగు గోడలు కనిపించాయి; పెద్ద పెద్ద వజ్రాలతో చెక్కినట్లున్న పూలున్నాయి. ఇక్కడే గొప్ప నైపుణ్యతగల శిల్పకారులు తయారుచేసినట్లున్న పానపాత్రలున్నాయి. వాటిలో మరకతమణి బిందువుల లాంటివి మెరుస్తూ తళుకుమంటూ కనిపించాయి.

అక్కడ నుంచి రెండు ఇంద్రనీల మణుల మాదిరి మెరుస్తున్న రెండు గోడల మధ్య నున్న వెండిలా మెరుస్తున్న ఇసుక దారిపై ప్రవేశించాను. ఇక్కడి నీరు ఇంకా స్వచ్ఛంగా కాంతు లీనుతూ ఉంది.

ఒక మలుపు తిరిగేసరికి నేనొక గుహ దగ్గరకు వచ్చాను. ఆ గుహ స్ఫటికంతో చెక్కినట్లుగా ఇంద్రధనుస్సు కాంతితో తళుక్కుతళుక్కు మంటోంది.

అక్కడ రంగు మెరుపులు మెరుస్తున్నట్లున్న రెండు స్తంభాల మధ్య ఒక స్ఫురద్రూపియైన వ్యక్తి నిలబడి ఉన్నాడు. మొహం చూస్తే నవయువకుని తలపిస్తున్నాడు. చక్కని చిన్న చిన్న గిరజాల జుట్టు, సముద్రపు పచ్చదనంతో నున్న కళ్ళతో, లేత నీలిరంగు అంగీని ధరించి, భుజాలపై రెక్కల బదులు రెండు మంచులాంటి తెల్లని పొలుసులను ధరించి ఉన్నాడు. నన్ను చూడగానే అతనొక స్తంభం దగ్గరకు తప్పుకొని నాకు దారిచ్చాడు. నేనా ద్వారం దాటీదాటగానే ఒక మృదుమధుర గానం చెవులకు సోకింది. ఇక్కడ నీరంతా కూడా మెరుస్తూ మెస్తూ ఉండి నేలంతా మంచిముత్యాలు జల్లినట్లుంది. ప్రవేశించే చోట ముంగిట్లో గుహ పై కప్పు నుండి నీరు ద్రవించడం వల్ల కప్పు నుండి వ్రేలాడుతున్నట్లుగా కనిపించే సొంపైన స్తంభాలున్నాయి. అక్కడ నుంచి సుగంధ పరిమళాలు వెలువడుతున్నాయి.



పారిస్ నగరంలో శ్రీమాత, 1895-96 ప్రాంతంలో

అక్కడ నుంచి అన్ని వైపులకు నడవలు, గూళ్ళు, వసారాలు ఉన్నాయి కానీ నా ముందు వైపున మాత్రం బ్రహ్మాండమైన వెలుగు కనిపిస్తుంటే నేను అటు వైపుకే నడవటం మొదలుపెట్టాను. ఆ వెలుగు బంగారు, వెండి, ఇంద్రనీలం, పచ్చ, కెంపు కిరణాలతో కూడి దేదీప్యమానంగా సుదూరంగా నున్న ఒక కేంద్ర బిందువు నించి వెలువడుతున్నట్లు గమనించాను; కానీ అన్ని వైపులకు వెలుగులు ప్రసరిస్తున్న ఆ బిందువేమిటో తెలియలేదు. ఏదో అతిశక్తివంతమైన ఆకర్షణ మాత్రం నన్ను అటు వైపుకి తీసుకెడుతోంది.

ఇపుడు తెలిసింది; ఆ వెలుగు కిరణాలకు ఆధారం ఏమీటోనన్నది; అక్కడ అండాకృతిలో నున్న ఒక కాంతి పుంజము, దాని నావరించి ఉన్న ఒక దివ్యమైన ఇంద్రధనుస్సు నాకు కనువిందు కల్గించాయి. ఆ గోళం అడ్డంగా నిలిచి ఉంది: నాకు దాన్ని చూస్తే అక్కడ గాఢ నిద్రలో మునిగి ఉన్న ఒక దివ్యపురుషుడు ఆ గోళం వెనక ఉన్నట్లు స్ఫురించింది. నేనలాగే ఆ ఇంద్రధనుస్సు బాహ్యపు టంచున నిలబడి అంత వైభోగంగా అక్కడ నిద్రిస్తున్నది ఎవరా అని ఆ వెలుగులో నించి తొంగి చూస్తున్నాను. ఎంత చూసినా తెలియకపోయేసరికీ నేనా ఇంద్రధనుస్సు గుండా ఆ తెల్లటి తేజోగోళంలోకి ప్రవేశించాను. అక్కడొక అద్భుత పురుషుని దర్శనమైంది. ఆయన తెల్లని ఈకలతో చేసిన మెత్తపై పవళించి యుండటం చూశాను. సాటిలేని ఆ సుందర మృదుశరీరంపై ఆచ్ఛాదనగా ఒక తెల్లని పొడుగు అంగీ కనిపించంది. ముడిచిన తన చేతి మీద తల ఆన్చి పరుండటం వల్ల ఆ శిరస్సు మాత్రం కనిపిస్తోంది; పండిన ధాన్యపు రంగులో ఉన్న ఆయన కేశపాశాలు భుజాల దాకా వ్రేలాడుతూ కనిపించాయి. ఆ అద్భుత దృశ్యం చూసేసరికి అతిశక్తివంతమైన ఒక మధుర భావన, ఒక ప్రగాఢ భక్తిభావన నన్ను ముంచెత్తివేశాయి.

నా ఉనికి ఆ నిద్రితునికి తెలిసిందా అన్నట్లు ఆయన విలాసంగా లేచి కూర్చు న్నారు. నా వైపు తిరిగి మిలమిల మెరిసే తనన కళ్ళతో నా కళ్ళ వైపు చూశారు. నీలిరంగులు మిలమిలా మెరిసే ఆ కళ్ళు ఎంతో కారుణ్యాన్ని, సౌకుమార్యాన్ని కురిపిస్తున్నాయి. వాత్సల్యపూరితంగా ఆయన మౌనంతోనే నాకు ఆహ్వానమిచ్చేసరికి నా సత్త అంతా హర్షాతిరేకంతో పులకించిపోయింది; నా చేయి పట్టుకొని తను లేచిన పడక దగ్గరకు నన్ను తీసుకొని వెళ్ళారు. ఆ తెల్లని మెత్తపై నేను పడుకోగానే ఆ సౌమనస్య ఆకృతి నాపై వంగి నాపై ఒక దివ్యశక్తిని ప్రసరింపజేసింది. అతి

శక్తివంతమైన ఆ స్వాదు ప్రవాహం నన్ను పూర్తిగా ఆవహించి నాలోని ప్రతి కణాన్నీ, ప్రతి భాగాన్నీ ప్రాణశక్తితో ద్విగుణీకృతం చేసింది.

ఆ విధంగా అద్భుత ఇంద్రధనుస్సు వర్ణాలతో పరివేష్టితురాలనై, శక్తిభరితమైన కటాక్ష వీక్షణాలలో, సుగంధ పరిమళాలలో, సుతిమెత్తని మధుర గీతాలలో మునిగి తేలుతూ నేను సుషుప్తిలోనికి జారిపోయాను. ఆ నిద్రలో నేను అనేకమైన చక్కని విశేషాలను, ఉపయోగకరమైన విషయాలు నేర్చుకున్నాను.

భాషతో అవసరం లేకుండా నేను తెలుసుకున్న ఆ అద్భుత విషయాల్లో ఒక్క దానిని మాత్రం ఇక్కడ పేర్కొంటాను. ఎక్కడైతే సౌందర్యం ఉంటుందో, ఎక్కడైతే తేజస్సు ప్రకాశిస్తుందో, ఎక్కడైతే పరిపూర్ణత కోసం పురోగతి కొనసాగుతుందో అది ఉన్నత శిఖరాలపై యుండే స్వర్గాల్లోనైనా, అగాధాల్లో ఉండే స్వర్గాల్లోనైనా అక్కడ మానవుని పోలిన జీవులు తప్పక కనిపిస్తారు. భూపరిణామ క్రమానికి ప్రధాన ప్రతినిధి మానవుడు.

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

రెండవ దర్శనం

నేను నిద్రపోయాను, ఇప్పుడు మేల్కొన్నాను.

నేను తూర్పు దిశగా అతి వేగంగా పయనిస్తున్నాను. ఒక ఊదారంగు మేఘ శకలం నన్ను తనతో తీసుకొనిపోతున్నది. అది నన్ను పూర్తిగా ఆవరించి యున్నందున దారిలో నాకేమీ కనిపించకుండా అడ్డుపడుతున్నది.

కొంత సమయం తరువాత నన్ను మెల్లగా భూమిపై దింపుతున్నట్టు అనుభూతి కలిగింది. నన్ను ఆలా దింపి మేఘం నిష్క్రమించింది. నేను ఒక ఎత్తైన తెల్లని గోడ ప్రక్కన నిలుచుని ఉన్నాను. ఆ గోడను చూస్తుండగా, కొన్ని ఛాయలు గుట్టు చప్పుడు కాకుండా ఆ గోడ నంటుకొని ప్రాకుతున్నట్లు కనిపించింది — మనుషులు ఒకరి వెనుక ఒకరు, కొంత ఎడంగా, ఇతరులు గమనించడానికి ఇష్ట పడనట్లుగా కదులుతున్నారు. వారు పొడుగాటి ఊదారంగు జుబ్బాలను ధరించారు. గుండ్రని పొడుగాటి టోపీలను తలపై ధరించి ముఖాలు పూర్తిగా కనిపించనట్లుగా

క్రింది వరకు కప్పి వుంచారు. గోడలోని చిన్న ద్వారం గుండా ఒకరి తరువాత ఒకరు అదృశ్యమయ్యారు. అంత జాగరూకతతో వారు ఎక్కడి వెళ్తున్నారో చూడటాని కని, ఎవరికీ కనిపించకుండా నేను వారిని వెంబడించాను.

ఒక తెల్లని వెల్ల వేసిన ఖాళీ గదిని దాటి ఓ పెరట్లోకి ప్రవేశించాను. అ ప్రదేశం చుట్టూ కమాన్లు నిర్మించబడివున్నాయి. చక్కని బంగారు రంగుగల ఫలాలతో నిండిన కమలాఫల వృక్షాలు చుట్టూ వున్నాయి. పెరటి మధ్యన సన్నని జలధారలను పైకి ఎగజిమ్ముతూ ఒక ఫౌంటెన్, చిక్కటి నీలం, ఆకుపచ్చ, తెల్లని రంగులుగల నీటి తొట్టితో చుట్టబడినది కనిపించింది. చిమ్మబడుతున్న సన్నని జలధారల చిరుసవ్వడి మాత్రమే అచ్చట ఆవరించివున్న నిశ్శబ్దాన్ని భగ్నపరుస్తున్నది. కారణం ఆ ప్రాంత మంతా నిర్జనమై వుండటం. దానిని దాటి, మరో రెండు గదులను కూడా దాటి చివ రగా ఒక మెట్ల వరుస క్రింది భాగానికి చేరుకొని, వాటిని ఎక్కి ఒక చతురస్రమైన మిద్దె పైభాగానికి చేరాను.

అక్కడ ఓ మూల, కదలాడుతున్న చిన్న బంగారు వన్నె కాంతి కణాలతో నిండిన దివ్యమైన ఎర్రని తేజోమయ కాంతితో కొంతమేర ఆవరించబడి, అచ్చట అమర్చబడిన మెత్తలపై చేరగిలపడి వున్న ఒక వ్యక్తిని చూసాను. అతను లేచి నిలు చున్నాడు. అతడు చూపులకు అందగాడైన వృద్ధుడు. ఊదారంగు టోపీ క్రింద కని పిస్తున్న అతని శిరోజాలు, అతని గడ్డము, మంచులా తెల్లగా నున్నాయి. ఆతని రూపురేఖలు, అతడు నిలుచున్న తీరు ఔన్నత్యాన్ని, గౌరవాన్ని, హుందాతనాన్ని సూచిస్తున్నాయి. అతనొక వదులుగా నున్న పొడుగాటి ఊదారంగు అంగరకాను ధరించి వున్నాడు. ఎర్రని రంగు పట్టా ఒకటి నడుముకు చుట్టబడి వుంది. చేతిలో బంగారు కత్తెర నొకదానిని ధరించి వున్నాడు. ఎవరి రాకనో నిరీక్షిస్తున్నట్లుగా కని పించాడు.

ఇప్పుడు ఆ వృద్ధుని నేను చూస్తుండగానే, ఇదివరలో గోడ వెంబడి ప్రాకుతూ కనిపించిన మనుషులు ఒక్కరొక్కరిగా ప్రవేశించారు. నిశ్శబ్దంగా వారందరూ ఆ మిద్దె అంచుల వెంబడి వలయాకారంలో నిలుచున్నారు. ఆ తరువాత తెల్లని దుస్తులు ధరించిన మరి కొందరు వచ్చి వారి ఎదుట నిలుచున్నారు.

అందరు కదలకుండా నిశ్శబ్దంగా వున్నారు. ఇంతలో వారి నాయకుడిగా కనిపించే వ్యక్తి ఒకరు ఎంతో సంస్కారవంతంగా వచ్చి మెట్ల ముందు భాగాన నిలబడ్డాడు.

అప్పుడు క్రమక్రమంగా ఒక లేత ప్రకాశం గాలిలో వ్యాపించసాగింది. ఆ వెలుగు ఎక్కడ నుండి ఉత్పన్నమవుతున్నదో కనుగొనాలని నేను కలయచూస్తున్నప్పుడు, దాదాపు పదునాలుగేండ్లు వయసున్న బాలుడొకడు మెట్లెక్కుతూ కనిపించాడు. ఇంద్రధనుస్సు రంగుల చమక్కులు వెదజల్లుతున్న సుందరమైన ధవళ కాంతి అతనిని ఆవరించి వున్నది. లేత పసుపురంగులీనే గోధుమరంగుతో నున్న వంకరులు తిరిగిన ముంగురులు అతని భుజాలపై నాట్యమాడుతున్నవి. అతని శరీరచ్ఛాయ తెల్లగా సుకుమారంగా నున్నది. అతని పొడువైన కనురెప్పలు గులాబీ రంగులు చిందే చెక్కిళ్ళ పైగా వాలివున్నాయి. కారణం అతని నేత్రాలు క్రింది చూపులు చూస్తున్నాయి. అతను ఒక లేత నీలిరంగు అంగరకాను ధరించి, తెల్లని పట్టు త్రాడును నడుముకు బిగించి వున్నాడు. పాదరక్షలు తొడుగుకొని వున్నాడు. నెమ్మదిగా ముందుకు సాగుతూ ఆ వృద్ధుడికి అడుగు దూరంలో ఆగి మౌనంగా తన శిరస్సును వంచి నిలిచాడు. అప్పుడు ఆ వృద్ధుడు లోతైన మృదుమధుర స్వరంతో పలికాడు. అయితే, అతను పలుకుతున్న భాష నాకు తెలియలేదు, అతనేం పలికాడో అర్థం కాలేదు.

నేను నిద్రలోకి జారుకున్నాను. ఇప్పుడు ఆ వృద్ధుడి పలుకులలోని అర్థం అవగతమయింది. అతను ఆ బాలుడితో ఇలా చెప్పాడు: "నీకు నిర్దేశించబడిన కార్యాన్ని దేనినయితే నీవు స్వేచ్ఛగా, ఇచ్ఛాపూర్వకంగా ఒప్పుకున్నావో, దానిని నెరవేర్చబోతున్నావు. ఆ కార్యాన్ని నేను ఇచ్చిన ఆదేశాల మేరకు నిర్భయంగా, నీరసపడకుండా నెరవేర్చాలి. ఎందుకనగా మన మిద్దరము ఒకటేనని నీకు తెలుసు. మన ప్రేమగాని, మన రక్షణగాని నిన్ను ఎప్పుడూ మోసగించవు, విడనాడవు. నీవు చేయబోయే పని యొక్క ప్రాముఖ్యత నీకు తెలుసు. ఈ కార్య నిర్వహణలో ఎదురయ్యే ఒడుదుడుకులూ, అపాయాల గురించి కూడా నీకు తెలుసు. అయితే హృదయాన్ని దిటవుగా నుంచుకోవాలి. ఎందుకనగా నీ పోరాటం కష్టతరమైనది. విజయం మాత్రం తథ్యం. నీవు పశ్చిమ దిశగా ప్రయాణించాలి. మా అమోఘమైన దీవన నీకు తోడుగా నుంటుంది."

ఈ మాటలు పలుకుతూ, అతడు ఆ బాలుడి తెల్లని నుదుటిని ముద్దాడాడు. తరువాత తన బంగారు కత్తెరతో ఆ పిల్లవాడి అందమైన లేత గోధుమవర్ణంగల ఉంగరాల జుట్టును కొంత కత్తిరించి తన అంగరకాలోకి జొప్పుకున్నాడు.



పారిస్ నగరంలో శ్రీమాత (సుమారు 1896 ప్రాంతంలో)

అప్పుడు మరో మాటగానీ, చలనంగానీ లేకుండా ఆ బాలుడు నెమ్మదిగా సంస్కారవంతంగా వెనుదిరిగి, మెట్లు దిగాడు. నేను అతనిని వెంబడించాను. ఇంటిని వదిలి ఆ గోడ వెంబడి, తలను పైకెత్తి తిన్నగా ముందుకు చూస్తూ వేగంగా వెళ్ళిపోయాడు.

హఠాత్తుగా మరోసారి నేను మేఘంతో కప్పబడి, నా చూపుల కేమీ కనపడకుండా కొనిపోబడ్డాను. ఒకే ఒక్కసారి అది తెరుచుకొని నాకు ఆశ్చర్యం గొలిపేలా ఒక పెద్ద నదిని దర్శింప చేసింది. దానిలో నీళ్ళు చంద్రకాంతిలో మెరిసే వెండిలా ప్రవహిస్తున్నాయి. దాని ఇరుప్రక్కల గట్లు అద్భుతమైన పుష్కలంగా పెరిగిన వృక్షసముదాయంతో నిండి వున్నాయి. అక్కడ ప్రతిదీ ఒక అసాధారణ పరిమాణంలో వున్నది. ఆ నది ఒక సరోవరమంత నిడివి గలిగి వుంది. వృక్షశిఖలు నింగిని అంటేటంత ఎత్తుగా ఎదిగి వున్నాయి. వాటి వెనుక పర్వతశ్రేణులు కనుచూపు కందని దూరాలకు విస్తరించి వున్నాయి. వాటి శిఖరాగ్రాలు నిరంతర హిమపాతంతో కప్పబడి వున్నాయి.

ఈ అత్యధిక అపారత మధ్య నేనొక కదులుతున్న అండాకారపు చిన్న ధవళ కాంతిని చూసాను. అది ఆ బాలుడు — ధృడంగా, భద్రంగా, నిర్భయంగా, అలు పెరుగకుండా, తలెత్తి తన దారిన తాను పయనిస్తున్న దృశ్యం.

ఆ దృశ్యం అత్యంత శోభాయమానంగా నుండింది. దానిని స్మృతికి తెచ్చుకుంటూ ఆలోచిస్తూంటే అర్థమయింది. ఒక వ్యక్తి, అపారమైన శక్తియుక్తులు కలవాడయినప్పటికీ, ఏకాకి అయినందువలన సాధించలేనిదానిని, కేవలం ఒక బాలుడు, తనతో ఒకటిగా నున్న వారి శక్తిప్రేమలు తనకు బాసటగా నున్నట్లయితే, ఏ మాత్రం కష్టపడకుండా సాధించగలడని.

దివ్యపురుష వర్గం తోటి సంబంధ బాంధవ్యాలు విజయసాధనకు కచ్చితమైన మార్గమనేది వాస్తవం.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

మూడవ దర్శనం

నేను నిద్రపోయాను, ఇప్పుడు మేల్కొన్నాను.

జ్ఞానసంపన్నమైన ఒక ఐరోపా దేశ రాజధానిలో ఒక గొప్ప పవిత్రమైన చర్చి వుంది. ఉన్నతాశయం వైపు ఎలుగెత్తి పిలుస్తున్నట్లున్న వాద్యాల గంభీర నాదాల సవ్వడికి మేల్కొన్నాను. తల పైకెత్తి చూసాను. ధవళ వస్త్రధారిణియై అందమైన కురులున్న ఒక యవ్వని మతగీతాల గ్రంధం వద్ద కూర్చున్నట్లు కనిపించింది. ఆమె చేతి వ్రేళ్ళు పియానో మీటలను నొక్కుతుంటే ప్రేరణతో నిండిన దివ్యప్రేమ భరిత మధురస్వరాలు ఒకటొకటి ఎగసి ధ్వనిస్తున్నాయి.

క్రిందికి చూసాను. బయటకు వినవచ్చే మధుర స్వరాలకు ఆకర్షితులై కుతూహలులైనవారితో ఆ చర్చి నిండటమూ, అదే సమయంలో వాద్య పరికరాల అంగణమంతా దేదీప్యమానమైన వెలుగుతో నిండటము చూసాను. ఆ వెలుగు భవనంలోని చీకట్లను పారద్రోలి అంతటా వ్యాపించింది. మిరుమిట్లుగొలిపే వెలుగొకటి పూజాపీఠంపై పడింది. ఆ వెలుగు ఒకింత వ్యాపించగానే, ఒక అదృశ్యహస్తం మాయం జేసినట్లు శిలువ, పూజాప్రతిమలు, పూజాద్రవ్యాలు మాయమయినాయి.

అక్కడ వున్న వారంతా భయభ్రాంతులతో నిశ్చేష్టులయ్యారు. ఒక పెద్ద ఊదా రంగు తెర గాయక బృందం ముందు ఏర్పడి దట్టంగా తయారవుతున్న కొద్దీ అందరూ చదివేందుకు వీలుగా దానిపై సువర్ణాక్షరాలతో చెక్కబడిన సందేశ మొకటి, అందరిని సంభ్రమాశ్చర్యాలలో ముంచుతూ కనిపించసాగింది. అది ఈ విధంగా నుండింది.

ఆత్మే నీ దైవం;

నీవాతని ఆవాసం, ఆతని సజీవ దేవాలయం. మేలుకో మానవుడా, మార్పు చెందు అతిమానవుడా, వికసించు, పెంచు నీ నిద్రాణ నైపుణ్యం, సాధించు కరగని సాయుజ్యం దైవంతో, అనూహ్యమగు సర్వేశ్వర సత్యవస్తు సంయోగం సాధించు. స్వగృహమగు పుడమిపైన పునర్జన్మ నెత్తిన అత్యద్భుత అమరుడిగా, మహిమాన్విత మనీషి ద్వారా.

అందరిలో ఆశ్చర్యం పరాకాష్ట నందుకుంది. ఎవరూ భగ్నపరచుటకు సాహసించని నిశ్శబ్దంలో ఒక స్వరం ఖంగు మంటూ పలికింది, "సంగీతం యొక్క బోధను ఆల

కించు" అని. నా దృష్టిని ఆ సంగీత సాధనం వైపు మళ్ళించాను. అయితే ఇదివరలో అక్కడున్న యువతి నాకు కనిపించడం లేదు. ఆమె ధగద్ధ గాయమైన వెలుగుతో పూర్తిగా కప్పబడి వుంది. దూరంగా ఓ మూల రంగులీనే గులాబి పుష్పఛాయలో మనిషికన్నా మూడింతలు పొడుగుగానున్న ఒక దేవదూతను చూసాను. అతడు నీలిరంగు జుబ్బాను ధరించి, తన చక్కని శిరోభాగం పైగా రెండు రెక్కలను ఒక దానిపై ఒకటి వుంచి, తన బాహువుల వెనుక రెండు రెక్కలను చాచి, మరో రెండు రెక్కలను నేలపైకి జార్చి, పాదాలను వాటితో కప్పివుంచాడు.

ప్రస్తుత మానవుని దౌర్భాగ్యాన్ని, బాధను, సందిగ్ధతను ప్రతిబింబిస్తున్నట్లుగా, అస్పష్టంగా, అల్లకల్లోలంగా సంగీత వాద్యనాదాలు మిన్నంటాయి. వెంటనే చీకటిని చీల్చే కాంతిపుంజంలాగా, దుఃఖిత వాతావరణాన్ని ఛేదిస్తూ ఒక స్వచ్ఛమైన స్పష్టమైన సునాదం వినిపించింది. ఆ స్పష్టమైన మధురనాదం సున్నితంగా ప్రారం భమై, అధికతరమై, తీవ్రమయింది. ఆ సుమధుర స్వరాలకు భయంకరమైన అపస్వరా లకు మధ్య ఓ పోరాటం ప్రారంభమైంది. క్రమేణా ఆ అపస్వరాలు, నిశ్చలాంబుధి తరంగ చలనాలు వ్యాప్తి చెందడంలో వినిపించే సున్నితమైన సవ్వడిలో మునిగిపోయి సమసిపోయాయి.

హఠాత్తుగా సుసంపన్న మైన హృదయపూర్వక స్వరమొకటి ఒక నిండైన స్తుతి గీతాన్ని ఇలా అందుకుంది, "ఓ పరంజ్యోతీ, ఓ మహోన్నత మేధాశక్తీ, ఓ ప్రపంచ విమోచనకారీ, దర్శనమివ్వు".

ఆ సంగీత తరంగాలు తీవ్ర వరవడితో, ఆనందాతిశయంగా దొర్లి భవనాన్నంతా అద్భుత స్వరాలతో నింపాయి. రంగురంగుల కిటికీల అద్దాలను సైతం ఆనంద డోలికల్లో ఓలలాడించాయి. మరొక్కసారి ఆ స్వరం వినవచ్చింది, "మేలుకో, ఓ పునర్జన్మ నెత్తిన మానవుడా, మహోన్నత పురుషుడా, నీ దివ్య మేధాశక్తిని వ్యక్తం చేయి, నిరంతరంగా నిలిచే వైభవోపేతమైన వైవాహిక శోభనోత్సవం జరిపించు, ప్రేమను, స్వచ్ఛమైన ప్రేమను విశ్వప్రేమను ప్రసరింపజేయి. — ప్రేమను, దివ్యసామరస్యతను చిందించే ప్రేమను వ్యాప్తి చెందించు, నీ బలాన్ని, జ్ఞానాన్ని కూడగట్టుకొని మేలుకో, సర్వశక్తి సమన్వితుడవైన ఓ దైహిక క్షేత్రాధిపతీ, సమతుల్యతా స్థాపకుడా, దివ్యుడిగా మాననమాత్రుడిగా నున్న మహామనీషి, అమృత స్వరూపుడా, మహా మహిమాన్వితుడా నీకు జయమగు గాక, జయమగు గాక.!"

ఆ విజయ గీతికాలాపనలోని ముగింపు పంక్తులు తన్మయానందాల నిశ్శబ్దతలో లయమైపోయాయి. అక్కడి సమావేశాన్నంతా ఒక గంభీరమైన ప్రశాంతత ఆవరించింది. చర్చిలోని అతి పెద్దదైన భూగృహంలో మెరుస్తున్న పద్మరాగ రంజితమగు పెద్ద పరదాలు వ్రేలాడబడ్డాయి. క్రింద పచ్చని రంగులు చిందిస్తున్న వస్త్రమొకటి పరచబడింది. తళతళ మెరుస్తున్న నీలి తారలు అంతటా తేలి యాడుతున్నాయి. పియానో వద్ద రెక్కలున్న ముప్పై ఆరుగురు దివ్యజీవులు దేవదూత ప్రక్కన, అనుభూతులను రేకెత్తించే ఆ యవ్వనిని క్రమ్మియున్న ధవళకాంతి వలయం చుట్టూ నీలిరంగులు జిమ్ముతూ వృత్తాకారంలో నిలుచున్నారు.

చర్చిలో గుమిగూడిన వారంతా ఆశ్చర్యచకితులై, మెల్లగా మౌనంగా బయట కొచ్చారు. అస్వస్థులుగా నున్నవారు స్వస్థత చెందారు. అశాంతి ఆతురతలతో సతమతమవుతున్నవారు ఊరట చెంది ధైర్యం కూడగట్టు కున్నారు. బలహీనులైనవారు బలం పుంజుకున్నారు. వివేకవంతులు జ్ఞానసంపన్ను లైనారు. అందరూ దివ్యమైన సువర్ణాక్షర సందేశాన్ని చెరగని ముద్రలా తమ స్మృతి పథంలో నిలుపుకొని నిష్క్రమించారు.

అనువాదం: ఎ. కృష్ణ

నాల్గవ దర్శనం

నేను నిద్రపోయి, ఇపుడు మేల్కొన్నాను. ఒక జనాకీర్ణమైన మహానగరంలో దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఒక పెద్ద హాలులో మెలకువ వచ్చేసరికి ఉన్నాను. అచట విందు జరుగుతోంది. ఆహారాపదార్థాలతో నిండుగా ఉన్న ఒక పొడుగైన మేజాబల్ల చుట్టూ పన్నెండుమంది చేరి సంతోషంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వారి మధ్య సంస్కారవంతుడు, పెద్ద గడ్డం, పొడుగాటి తెల్లని జుత్తుతో, దర్పం తొణికిసిలాడే మోముతో కూర్చొని వున్న ఒక వృద్ధుని నేను చూచాను. అతని వాలకం చాలా గంభీరంగా, చాలా సౌమ్యంగా వుండడమే గాక అతని తీరు కూడా చూడగానే ఆకట్టుకొనే విధంగా ఉంది. తెల్లని తెరలుగా జీరాడుతున్న దుస్తులలో చక్కని శిరోజాలతో ఒక యువతి అతని ప్రక్క కూర్చొని వుంది. తతిమ్మా పదిమంది పురుషులు,

తమ గురువు చుట్టూ చేరిన శిష్యులుగా కూర్చొని వున్నారు.

ఆనందంగా విందు జరుగుతుండగా దుస్సంకల్పంతో ఒక దట్టమైన మబ్బు నగరం మీదకు నెమ్మదిగా చేరుకొంటున్న అనుభూతి కలిగింది, చూచాను కూడా.

రాబోయే ప్రమాదాన్ని ఆ యువతి కూడా పసికట్టింది. ఒక్కసారిగా ఆమె యేదో ఆవేశించినట్లు "మనపై పెను విపత్తు విరుచుకు పడబోతోంది. ఒక భయంకర ప్రళయం సంభవించబోతోంది. అదేమిటో కచ్చితంగా నేను చెప్పలేనుగాని అలా అని నాకు తెలుస్తోంది. సర్వ విధాలా ప్రయత్నించి మనల్ని విశ్వసించే వాళ్ళందర్నీ మన వెంట వచ్చేవాళ్ళందర్నీ తీసుకొని మనం ఈ నగరాన్ని వెంటనే వడిచి వెళ్ళి పోవాలి" అన్నది. హాయిగా సాగిపోతున్న సమావేశాన్ని భగ్నం చేస్తూ వినవచ్చిన ఈ గంభీరమైన ప్రకటనను అక్కడున్న వారెవరూ అనుమానించలేదు. అందరూ సంశయించకుండా ఆ మందిరాన్ని వదలిపోవడానికి సంసిద్ధులయ్యారు.

ఇప్పుడు ఆ దృశ్యం నా దృష్టి నుంచి నెమ్మదిగా అదృశ్యమైంది, కొద్ది సేపు నాకేమీ కన్పించలేదు. నాకు తిరిగి యెరుక కలుగగానే మళ్ళీ ఆ చిన్ని బృందం నా కంట పడింది. కాని దృశ్యం ఎంత మారిపోయిందో!

సర్వం ధ్వంసమై శిథిలాలుగా మిగిలిన ఆ నగరాన్ని విడిచి పన్నెండుమందీ వెళ్ళిపోయారు. అదెంత తీవ్రమైన విపత్తో కదా! ఎందుకనంటే మహానగరంలో యేదీ మిగల్లేదు. అగ్ని పూర్తిగా దహించగా, వరదల కన్నీ కొట్టుకొనిపోగా, శతాబ్దాల పర్యంతం అక్కడ పడి వున్నట్లు శిథిలాల శకలాల గుట్టలు మాత్రమే మిగిలి వున్నాయి. భూకంపం, అగ్నిపర్వత విస్ఫోటనం, వరదలు మూడూ యేకమై విజ్ఞానశాస్త్రం, కళలు సృజించిన మహానగరాన్ని అంత ఆకస్మికంగా క్షణంలో సంపూర్ణంగా ధూమ్రవర్ణ లేక ఎర్రరాళ్ళ దిబ్బలుగా పొగచూరిన చిన్న చిన్న గుట్టలుగా మార్చివేసాయి. చూద్దాని కొక పచ్చగడ్డి పరక కూడా లేదు. ఈ విశాల బీడు భూమి మధ్య పరవళ్ళు త్రొక్కుతూ తన దారి కడ్డం వచ్చే సమస్త శిథిలాలను తుడిచిపెట్టుకుపోతూ ఒక ప్రవాహం సాగిపోతోంది. ఈ వ్యధాభరిత దృశ్యం పైన అందమైన, మబ్బులులేని స్వచ్ఛమైన నీలాకాశం పరచుకొని, ఈ శోకతప్తమైన భువిని పరిహసిస్తున్నట్లు చూస్తోంది.

ఈ కల్లోల జలప్రవహం ప్రక్క ఉన్న పచ్చని గట్టు, పంచభూతాల కోపానికి గురై పారిపోయి వచ్చిన వేలాదిమందికి విడిదిగా మారాయి. వారు దరి అంచుగానని

నిర్వేదంలో మునిగిపోయారు. రిక్తహస్తాలు, నిరాశాదృక్కులతో చతికిగల బడిపోయారు, లేదా అల్లాడిపోతూ ముందుకు వెనక్కు పచార్లు చేస్తున్నారు. ఆ కోలుకోలేని వ్యాఘాతం వాళ్ళను స్పృహ కోల్పోయేటట్లు కుదిపేసింది.

ఇందుకు విరుద్ధంగా ఆ చిన్న బృందం మాత్రం ప్రశాంతంగా, ధైర్యంగా వుంది. వాళ్ళ గురువు ఆ ప్రవాహం ప్రక్క తన రక్షణ బాహువును ఆ యువతి చుట్టూ వేసి తనను విశ్వసిస్తున్న శిష్యులతో కలిసి నడుచుకుంటూ పోతున్నారు. దిగ్భ్రాంతికి గురైౖ దౌర్భాగ్యస్థితిలో వున్నవారికి సహాయం చేయలేని తమ నిస్సహాయతకు విచారిస్తున్నారు. ఇంకా ప్రమాదం భయపెడుతూనే వున్నది గనుక వీలైనంత త్వరగా వాళ్ళు ఈ ప్రదేశాన్ని విడిచి వెళ్ళవలసి వుందని ఆ పెద్దాయనకు తెలుసు. నూతన పెనుమార్పులు సంభవిస్తాయి, బహుశా అంతా జలమయమవుతుంది, తప్పించలేని పెను ప్రమాదం నుండి తప్పించుకోడానికి వరదలలో కొట్టుకొచ్చి అక్కడక్కడా పడివున్న కొయ్య పలకల నుపయోగించి నీటిపై తేలిపోయే తెప్పలను తయారుచేసుకోవాలని అతడు జనం వైపు వెళ్ళి బిగ్గరగా, స్పష్టమైన గొంతుతో హెచ్చరించాడు.

అచట నున్న జనసమూహానికి చివరి విచారకర వీడ్కోలు పలుకుతూ ఈ చిన్న బృందం, ఒక రాతికి కట్టివేయబడి వీరి కోసం యెదురు చూస్తున్న ఒక రకమైన నీటిపై తేలియాడే ఇంట్లోకి వీరు దారి చేసుకుంటూ వెళ్ళారు. ఆ పన్నెండుగురు ఈ తాత్కాలిక పడవపై కెక్కారు. వారిలో ఒకడు ఒక పొడుగాటి వాసంతో ఆ పడవను అంటే ఆ యింటిని నెట్టుకుంటూ పోతున్నాడు. వాళ్ళలా పోయి ఉరుకులూ పరుగులూ పెడుతున్న ప్రవాహంలోకి చేరగా, ఆ ప్రవాహం వాళ్ళను బ్రహ్మాండమైన వేగంతో, ప్రవాహం పొడుగునా ఉన్న రాళ్ళు, ప్రవాహంలో తేలియాడుతున్న నావల సకల విధ శకలాల మధ్య నుండి దూరంగా తీసుకుపోయింది.

వారు కళ్లు తిరిగేటంత వేగంతో దూసుకుపోయారు. తెల్లని దుస్తులలో వున్న యువతి తేలియాడుతూపోతున్న యింటికి వెడల్పుగా తెరచుకొనివున్న వైపు నుంచి బయటి దృశ్యాలను చూస్తోంది. ఒక యువకుడు “మనం గనుక సముద్రాన్ని చేరుకోగలిగితే అంతా సర్దుకుంటుంది” అన్నాడు.

మరో వ్యక్తి “అది మరీ ప్రమాదం, ఎందుకంటే సముద్రం దగ్గర్లో రాతి గుట్ట వుంది, దానికి మనం ప్రయాణిస్తున్నది కొట్టుకుంటే తునాతునకలైపోతాం” అన్నాడు.



జపానులో శ్రీమాత, 1917

అప్పుడు గురువు లోతైన గంభీర స్వరంతో "మన ఈ నివాసం మునిగిపోదు అని పూర్తిగా నమ్మండి. ఇది శాశ్వత సత్యానికి ప్రతీక కదా!" అన్నాడు. అనేకమంది యేకకంఠంతో ఇంకా బయటకు చూస్తూ నిలుచుని వున్న యువతిని చూపిస్తూ "ఆమె మన మధ్య ఉన్నంత కాలం మనకేం అపకారం జరుగదు" అన్నారు. అప్పట్నించి ఆమె యింకా పరీక్షగా గమనించడం సాగించింది.

చాలా దూరం పోయాక ఒకప్పుడు చాలా పెద్దదిగా, అందంగా వుండి వున్న నగరం ఈ తేలిపోతున్న యింట్లో వాళ్ళకు కన్పించింది. గాలి, పెనుగాలి, నీరు అగ్ని, హరించి వేసినట్లున్న ఎత్తైన కట్టడాల, గోపురాల, రాజభవనాల శిథిలాల, గోడ లకు సంబంధించిన పెద్ద పెద్ద శకలాలు, ఆకాశం కేసి చూస్తున్న వింతైన తెల్లని భవనాల ఆకారాలు కన్పించాయి. పారుతున్న నీటి మూలంగా నేల కనబడడం లేదు. ఒకప్పుడు నది వున్న ప్రదేశం, లేదా అదృశ్యమైన నౌకాశ్రయం అయివున్న పట్టణ కేంద్రంలో సముద్రయానం చేసిన నౌకల తాలూకు భాగాలు అక్కడ కన్పిం చాయి.

ఒక గొప్ప నాగరికత ధ్వంసమైన బలమైన భావన మనసులో కలిగేటట్లు చేయగలవిధంగా ఆ దృశ్యం ఆకట్టుకొంది. దాన్ని అందరూ మౌనంగా, గంభీరంగా, విచారభరితమైన చింతతో తిలకించారు.

ఆ క్షణంలో నా దృష్టి నుండి అంతా అదృశ్యమైపోయింది. తిరిగి నేను మామూలు స్పృహలో కొచ్చేసరికి సముద్రంపై వున్నానని తెలుసుకొన్నాను. తమ కందుబాటులో కొచ్చినదాన్నంతా స్వాహా చేయాలన్నంత కోపంతో యెగసిపడే పెద్ద పెద్ద అలలతో ఆ సముద్రం అల్లకల్లోలంగా వుంది. ఈ అలల మధ్య కలవరపడుతున్న భయం పుట్టించే వికృత రూపాలను చూసాను. యెగసిపడుతున్న జలరాశుల శక్తిని వాళ్లు తమ స్వశక్తితో మరింత ఉధృతం చేస్తున్నారు. బాగా సన్నిహితంగా పరిశీలిస్తే కొన్ని ముదురు యెరుపు రంగుగల ఆకారాలను పట్టుకోవడం వాళ్ళ వెర్రి ఆవేశం లక్ష్యంగా చేసుకొందని గ్రహించాను. కాని వాళ్ళు తమ ప్రశాంతతతోనే వాళ్ళ నెదుర్కొంటున్నారు. అయినప్పటికీ త్వరలో వాళ్ళ శక్తి హరించుకుపోవచ్చు.

అప్పుడు దూరంగా తేలియాడుతున్న యిల్లు నురుగులు గ్రక్కుతూన్న సముద్రం మీద ఊదారంగులో కన్పిస్తోంది. ఎగుడు దిగుడులు లేని ఉపరితలం మీద జారిపోతున్నట్లు తిన్ననైన దారిలో, సమవేగంతో నీటిపై ఆ యిల్లు సాగిపోతోంది.

యిల్లు దగ్గరకు రాగనే ఆకస్మికంగా ప్రశాంతంగా మారుతున్న అలల మధ్య దాని ముందు వెనుక ప్రకాశవంతమైన ఒక పొడుగాటి రజితవర్ణ మార్గం యేర్పడుతోంది. ఆ దారి కిరుప్రక్కలా అలలు నిజమైన గోడలలాగా లేచి నిలబడుతున్నాయి. కాని ఈ చిన్న బృందానికి ఆశ్రయమిస్తున్న యింటి మీద విరుచుకుపడకుండా ఒక శక్తి వంతమైన క్రియాశక్తి వాటిని వారిస్తోంది. ఇప్పుడు ఒకదాని తర్వాత ఒకటిగా ముదురు ఎరుపురంగు గల జీవులు తమ శత్రువుల తీవ్రప్రయత్నాలను వమ్ము చేస్తూ నీటి నుండి బహిర్గతమై తేలియాడుతున్న యింట్లో ఆశ్రయం పొందుతున్నాయి. అంతా సురక్షితంగా చేరుకొన్న పిదప పెద్ద అలలు వాటి మీదకవే దొర్లుకుంటూ నిరర్థకంగా వాటిని వ్యతిరేకించే అపకారం చేసే జీవుల్ని స్వాహా చేస్తున్నాయి.

క్రమంగా అంతటా శాంతి నెలకొంది. ఉపరితలం మీద చిరు తరంగం కూడా లేని జలరాశి ముదురు నీలవర్ణంగా మారిపోయింది. ఆకాశం సూర్యరశ్మితో ధగద్ధగాయమానంగా వెలిగిపోతోంది. ధవళకాంతి వలయంలో ఆ పడవ తన దారిన తాను సాగిపోయింది.

అందరూ లోన ఆనందపడుతున్నారు. తాము రక్షించినవాళ్ళకు ఆ చిన్నబృందం ప్రేమపూర్వక ఆహ్వానం పలికింది. గురువు తన గంభీరమైన మృదుస్వరంతో "ఆ విధంగా త్వరగాగాని, ఆలస్యంగాగాని అంధకారం మీద వెలుగు, అశాంతి మీద శాంతి, ద్వేషం మీద ప్రేమ విజయం సాధిస్తాయి. ప్రశాంత జగత్తుపై సమ రసం రాజ్యమేలుతుంది" అని ప్రకటించాడు.

అనువాదం: కె. వి. రావు

అయిదవ దర్శనం

నేను నిద్రపోయి, ఇపుడు మేల్కొన్నాను.

కాలగమనంలో చాలా కాలం క్రితం నాటి భూతకాలంలో నేను మేల్కొన్నాను, అప్పుడు నేను గాఢమైన నీలకాంతులు వెదజల్లుతూ అద్దం లాగా ప్రశాంతంగా ఉన్న చెరువు గట్టున ఉన్నాను.

చెరువుకు తూర్పున అరుదైన జాతికి చెందిన చెట్లు, పొదలు, వాటితో పాటు గంభీరమైన వృక్షసముదాయాన్ని చూశాను. వంపులు తిరిగిన వాటి పొడవైన కొమ్మలు నిశ్చలమూ, స్వచ్ఛమైన నీటి ఉపరితలం మీద సయ్యాట లాడుతున్నాయి. ఆ నీటిపై అత్యద్భుతమైన వైవిధ్యభరితమైన రంగులతో కూడిన ప్రకాశవంతమైన పుష్పాలు ప్రతిఫలిస్తున్నాయి. ఆహ్లాదపరచే ప్రకృతి సహజమైన ఈ ఏకాంత ప్రదేశం నీడలో దివ్యకాంతులు వెదజల్లుతూ వికసించిన తెల్ల కలువలు కనుల కింపు చేస్తున్నాయి.

ఆ ఏకాంత ప్రదేశం మొత్తం ఇంద్రధనుస్సు రంగులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. కాంతివంతమైన ఆ వెలుగు మధ్యలో నిగనిగలాడే అందమైన కురులతో, యుక్తవయస్సు కలిగిన మాధ్యమం[1] నిద్రిస్తున్నది. ఆకర్షణీయమైన సొగసుతో అతి విశాలమైన చదునైన ఆకుల మీద ఆమె ఓరగా ఒరిగి ఉన్నది, అందమైన అయిదురెక్కల పువ్వులతో ఒకదాని మీద తన తలను ఆనించి విశ్రాంతిని పొందుతున్నది. ఆమె నడుమును కప్పిన తెల్లని వస్త్రాన్ని బంగారు వడ్డాణం చుట్టి ఉన్నది.

ఆమెకు ఎడమ వైపున, ఈజిప్టు దేశపు ఎర్రకాళ్ళ కొంగ తన ఎర్రనైన ఒంటి కాలి మీద, నిటారుగా, గర్వంగా, కాపలా కాస్తున్న సైనికుని వలె కుదురుగా నిల బడి ఉన్నది. నిద్రిస్తున్న ఆ వనిత మీద రక్షణగా ముదురు పద్మరాగమణి రంగులో నున్న ఆచ్ఛాదన మొకటి వేలాడుతూ ఉన్నది. ప్రశాంతమైన, నిర్మలమైన దివ్యానందం ఆ దృశ్యాన్ని పూర్తిగా ఆవరించి ఉన్నది. ఆ మాధ్యమం ఉల్లాసభరితమైన స్వప్నంలో విశ్రాంతి తీసుకుంటున్నట్లుగా ఉన్నది.

మధురమైవ, ఆహ్లాదకరమైన మందపవనం గలగలమనే చప్పుడుతో ఆకులను కదిలించివేస్తున్నది. అది అత్యంత సుకుమారంగా నీటిలో అలల సుడులను రేపుతున్నది.

---

[1] ఆ అస్తిత్వం సూక్ష్మలోకాలకు ఉన్మీలనమై ఉన్నదని సంకేతం

లాలించే చిరుగాలి గుసగుస లాడుతున్నట్లుగా, "అగాధ జలాల సముద్ర ద్వీపాల మహారాణి, అగాధ జలాల సముద్ర ద్వీపాల మహారాణి" అంటూ పారదర్శకమైన నీలవర్ణంతో కూడిన అపారమైన లోతుల నుంచి శ్రావ్యమైన కంఠం ఒకటి ప్రతి ధ్వనిస్తున్నది.

అప్పుడు నేను నిద్రలోకి జారుకున్నాను, నేను ఒక రాజభవనంలోని అత్యంత విశాలమైన గదిలో మేల్కొన్నాను.

స్తంభాల ఆకృతి, అలంకారాలను బట్టి, విలాసవంతంగా ఉన్నప్పటికీ గోడల మీద సంయమంతో చిత్రీకరించబడిన కథా విశేషాలను బట్టి నేను ప్రాచీన ఈజిప్టుకు చెందిన మెమ్ఫిస్ లేదా థేబ్స్‌ల అత్యద్భుతమైన రాజమహలులో ఉన్నానని తెలిసింది.

విశాలమైన ఆ గది ఆకర్షణీయమైన జనులతో కిక్కిరిసి ఉన్నది. వారి మెరిసి పోతున్న కటివలయ వస్త్రాలు, ఈకలతో తలకు ధరించిన తలపాగాలు, ఆభరణాలు, వేలాడే వస్త్రాలంకారాలు సమస్తం అద్భుతంగా, ఆశ్చర్యకరమైన సామరస్యతతో రూపుదిద్దుకుని ఉన్నాయి. అందరి చూపులూ గది ఉత్తరం దిక్కు వైపుకే మరలబడి వున్నాయి. ఆ గది మధ్యలో పన్నెండు మెట్లతో కూడిన సింహాసనం ఉన్నది, అది మఖమల్ గుడ్డతో కప్పబడి మెరుగులు దిద్దబడి ఉంది. మెట్ల అడుగున బలిష్టమైన, ప్రశాంతంగా ఉన్న యవ్వనంలో ఉన్నటువంటి రెండు సింహాలు రక్షణ నిచ్చేవిగా ఉన్నాయి. సింహాసనం ఎడమ వైపున ఒక తెల్లని ఎర్రకాళ్ళ కొంగ తన కెంపు కాళ్ళ మీద నిలుచుని ఉన్నది. కనులు మిరుమిట్లు గొలిపే కాంతిలో ఆ సింహాసనం ఆవృతమై ఉన్నది, ఈ కాంతి మధ్యలో నేను అందమైన కురులతో ఉన్న యుక్తవయస్కురాలైన మాధ్యమాన్ని తన ఎడమ చేతిలో తెల్ల కలువను పట్టుకొని ఉండగా చూస్తున్నాను.

అక్కడ ఉన్న ప్రతివారు తమ వంతు వచ్చినప్పుడు, మెట్ల దగ్గరకు వచ్చి తలవంచి నమస్కరించి, తమ విధేయతను ప్రకటిస్తున్నారు.

రెండవసారి తిరిగి నేను నిద్రలోకి జారుకున్నాను. మేల్కాంచినప్పుడు నేను ఒక దేవాలయం ముందు ఉన్నాను. అది అత్యద్భుతమై, విశిష్టమైన హిందూ సంస్కృతిని కలిగి ఉంది. మోకాళ్ళ మీద వంగి నిలబడి ఉన్న ఏనుగులు స్తంభాలకు ఆధారంగా చతురస్రాకార ద్వారపు తలుపులకు రెండు వైపులా ఉన్నాయి. తలుపు తెరవబడి ఉంది, తెలుపు, నీలం, ఊదారంగు లేక సింధూర రంగు వస్త్రాలు

ధరించిన మనుషులు ఒక్కొక్కరుగా గాని, గుంపులు గుంపులుగాగాని లోనికి ప్రవేశిస్తున్నారు. నేను వారిని అనుసరించాను, వారి వెనువెంట ఎన్నో కక్ష్యలను దాటి వెళ్ళిన తరువాత, నేను ఒక చిన్న చతురస్రాకారపు గదిని చేరుకున్నాను. ఆ గది ముదురు పద్మరాగమణి కప్పుతో ముప్పై ఆరు ధృడమైన స్తంభాలపై ఆధారితమై ఉన్నది; అక్కడ మనుషులు తాము నిర్వర్తించే విధులు మరియు వారి వారి స్థాయిల ప్రకారంగా సమావేశమై, నిశ్శబ్దంగా ఉన్నారు; వారు ఎవరి కోసమో నిరీక్షిస్తున్నారు. హఠాత్తుగా గదికి ఒక వైపు వేలాడగట్టిన తెర పైకెత్త బడింది, ధగధగలాడే కాంతిలో తెర వెనుకనున్న రూపం ముందుకు వచ్చింది. ఆ రూపం, ముందుకు అడుగువేసి, విభిన్న శ్రేణులకు సంబంధించిన వలయాల మధ్యలో ఆసీనురాలైంది. నేను యుక్తవయస్సులోనున్న ఆ మాధ్యమాన్ని గుర్తించాను, ఆమె తన వదులైన కురుల మధ్య అలంకారప్రాయంగా ఒకే ఒక తెల్లకలువను ధరించి ఉంది. ఆమె మోకాళ్ళ వరకు వచ్చే పొడవైన బిగువైన తెల్లని వస్త్రాన్ని నడుముకు చుట్టబడిన బంగారు తాడుతో ధరించి ఉంది.

మళ్ళీ ఒకసారి నా దృష్టి నుంచి అంతా కనుమరుగైంది. తిరిగి నేను లేచేసరికి, అత్యంత విస్తారమైన ఓక్ అడవి మధ్యలో ఉన్నాను. పొడవైన వాటి బోదెల మధ్య నుంచి ఆకుపచ్చని సముద్రంలో తామ్రవర్ణపు మంటలా అస్తమిస్తున్న అరుణకిరణ సూర్యుడు ద్యోతకమవుతున్నాడు. నేను ఒక పశ్చిమ దేశ ద్వీపంలో ఉన్న అనుభూతి కలిగింది.

ఆ చిట్టడవి గుండా ధవళవస్త్రాలు ధరించిన కన్యలు పొడవైన ఒక వరుసలో బారుతీరి ముందుకు నడచి రావడం చూశాను; ఆ వరుసలో ముందు నడుస్తున్నవారు తమ చేతులలో సంగీతవాయిద్యాలను పట్టుకుని శ్రుతి, ఖంజీర వాయిద్యాల కనుగుణంగా గేయాలను రాగయుక్తంగా పాడుతూ ముందుకు సాగిపోతున్నారు. తరువాత ఆ కన్యలు చేతులు పట్టుకుని నృత్యం చేయడం మొదలుపెట్టారు; వారు ఆ విధంగా వెళ్ళిపోతూ మధ్యలో అన్నింటి కంటె పొడవుగాను, లావుగాను ఉన్న ఒక ఓక్ వృక్షం చుట్టూ గుండ్రంగా తిరుగుతూ నడచి వెళ్ళిపోతున్నారు.

నలుగురు సహచరులు తన వెంట రాగా, ఇప్పుడా అందమైన కురులు కలిగిన, ఆ యుక్తవయస్సులో నున్న మాధ్యమం నడచివస్తున్నది. ఆమె తన చేతిలో బంగారు కొడవలి ధరించి ముందుకు గంభీరంగా, ధ్యానమగ్న యై నడుస్తున్నది. ప్రాచీనమైన

ఆ ఓక్ వృక్షం వద్ద ఆమె ఆగి, తనతో వచ్చిన ఒక బాలుడికి చేతిలోని తన కొడవలిని అందించింది. అతడు ఎంతో కౌశలంతో ఆ చెట్టును గబగబ ఎక్కివేశాడు. ఒకే ఒక్క వేటుతో అతడు ఆ చెట్టును ఆసరాగా చేసుకుని పెరుగుతున్న పరాశ్రయ మొక్క అయినటువంటి బదనికకు (మిస్‌ట్లెటో) వేలాడుతున్న గుండ్రని పెద్ద బంతి వంటి రాశీభూతమైన వృక్షపదార్థాన్ని ఒక్క వేటుతో తెంచివేశాడు. అది యుక్తవయస్సులోని బాలిక దానిని పట్టుకోవటానికి తన చేతిలో పైకి ఎత్తి పట్టుకున్న తాను ధరించిన పొడవైన జుబ్బా జోలెలో పడిపోయింది.

అటు పిమ్మట, ఆ కన్యకామణులు మరల శ్రావ్యమైన గీతాన్ని ఆలపిస్తూ, తాము బయలుదేరిన చోటికి తిరిగి వెళ్ళిపోయారు.

నేను నాలుగవసారి నిద్రలోకి జారుకున్నాను, నిద్ర మేల్కొనగానే ఆ దృశ్యాన్ని ఆడ్రియాటిక్ మహారాణి విలక్షణమైన జీవితాకాలంలోని నిరుపమానమైన, అద్భుతమైన రాజరికపు శోభగా గుర్తించాను.

వెనిస్ ఆశ్చర్యం కలిగించే నగరం, అజేయమైనది — వెనిస్, కళల నగరం, అడ్డు ఆపులేని తీవ్రవాంఛలకు ఆలవాలం — వెనిస్, దాని గోడల నుంచి దురాగతాలు ఉబుకుతుంటాయి, నాటకీయంగా సాగే ఘటనలు ఆ నగర కాలువలలో ఊరుతుంటాయి... ఇక్కడి అత్యంత విలాసవంతమైన రాజమహాళ్ళు ఇప్పటికీ ఆ కాలం నాటి వాటి ఆడంబరమైన నిర్మాణశోభతో ప్రకాశిస్తూ ఎంతో వైభవోపేతంగా ఉన్నాయి. ఇక్కడి సొగసైన గొండోలా పడవలు కులీన కాంతలను, ప్రముఖులైన పురుషులను చక్కని క్రమవరుసలో తీసుకుపోతుంటాయి.

కాని నా లోని శక్తివంతమైన అంతరంగ సంవేదన నన్ను డ్యూకల్ రాజమహలు వైపుకు లాక్కువెళ్ళింది; ఇంతకు మునుపు ఇప్పుడే శతాబ్దాల క్రితం చూసినవారిని అక్కడ నేను చూడగలనని నాకు తెలుసు.

అంతట అప్పుడు నేను పెద్ద ప్రాంగణంలోకి ప్రవేశించాను. అందులో, అసాధారణమైన పొడవును కలిగిన మానవాకారాలు నిలబడి ఉన్న మెట్ల దగ్గర, ఒక స్తంభం వెనుక సగం మాత్రమే కనబడుతూ, ధవళవస్త్రం ధరించి అందమైన కురులతో, యుక్తవయస్కురాలైన మాధ్యమాన్ని చూశాను. ఆమె చక్కనైన ఒక వృద్ధుని భుజానికి అంటిపెట్టుకుని ఉంది. ఆమెను రక్షించటానికా అన్నట్లుగా ఆయన చేతులు ఆమెను చుట్టి ఉన్నాయి. వారి ముఖాలు విచారగ్రస్తమై ఉన్నాయి. వారు గంభీరమైన ఓరి

మిని ప్రదర్శిస్తున్నారు. ఆ విధంగా వారు ఒకరి కొకరు చుట్టుకుపోయి ఉండగా, ధగద్ధగాయమానమైన ఒక ఊరేగింపు నెమ్మదిగా రాజమహలుకు చేరే మెట్ల మీదుగా అడుగులు వేస్తూ కదులుతున్నది. వారికి శత్రువులైనటువంటి మానవులైన ఈ మనుషుల చేతులలోనే వారి భవిష్యత్తు ఉన్నదని నాకు స్పష్టంగా తెలుస్తున్నది.

అప్పుడు ఆ వయోవృద్ధుడు ముందుకు వంగి, ఆ పిల్లను నుదుటి మీద ముద్దు పెట్టుకుని, మంద్రస్వరంతో ఇలా అన్నాడు, "ఎన్నో యుగాలుగా మనం పవిత్రమైన కారణానికీ, మానవజాతి విమోచనానికీ ఎన్నో విభిన్న భూతల క్షేత్రాలలో, మారుతున్న పరిస్థితులలో సంఘర్షిస్తూ, బాధ లనుభవిస్తూ వచ్చాం.

మళ్ళీ ఒక్కసారి తిరిగి మనం మన మహోన్నత లక్ష్యానికై ప్రయత్నించాం, అది వ్యర్థంగా పోదు. మనిషికి శత్రువులైన ఈ మానవులు ఇప్పుడు మన కంటె బలిష్టులు కావచ్చు, కాని తప్పనిసరిగా మన సమయం వస్తుంది, వారు విభజన కోసం, అనృతం కోసం పనిచేశారు; మనం సంఘర్షిస్తున్నవారి కోవకు చెందిన వాళ్ళం, మనం ఎల్లప్పుడూ మహాసత్యం కోసం, సామరస్యత కోసం సంఘర్షణ చేశాం; కేవలం వీరు మాత్రమే అమరులు. యుద్ధం ఎంత కష్టతరమైనదైతే, గెలుపు అంత అధికంగా అనుకూలమౌతుంది. జరగబోయేది కచ్చితమైనప్పుడు ప్రయత్నిం చిన వాటి గురించి విచారించ నక్కర లేదు."

అప్పుడు ఆ పిల్ల సుకుమారంగా సౌమ్య స్వరంతో, "అది వాస్తవమే, భూమి మీద మన తదుపరి ఆగమనంలో మనం గెలుపును దర్శించి తీరుతామనేది తథ్యమని నేననుకుంటున్నాను!"

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



శ్రీమాత (స్వీయ చిత్రీకరణ)

సమభాగాలుగా విడిపోయిన ఒక గోళాన్ని — ఒకటి తెల్లగా, తేజోమయంగాను, మరొకటి సుందరమైన ముదురు ఊదారంగులోను — ముదురు నీలం రంగులో నున్న ఒక చతురస్రాకారపు ఆవరణలో చూసాను.

నిద్రపోయి నందున అర్థమయిందేమిటంటే, నేను సంభావ్యతలను దర్శించగల స్థాయి నుండి సిద్ధిని పొందే సాధనాలను దర్శించగల స్థాయికి చేరుకొన్నానని. మానసిక సమతుల్యతా స్థాయిలో నేను భూమిపై కేంద్రీకరించాను. భూమి మనకు సంక్రమించిన మన వారసత్వం, మనకు శాశ్వత హక్కుగల మన నివాసస్థానం. వెలుగు మరియు శక్తి సామర్థ్యాల మధ్య, మేధోవికసనము మరియు రక్షణ నిచ్చే ఆచ్ఛాదనల మధ్య సమతూకంతో అలరారుతున్న భూమిని క్షుణ్ణంగా పరిశీలించాను. ఆ భూమి యధాతథంగా ఇప్పుడున్న భూమి కాదు, పరిణమిస్తున్న మానవాతీతుల పరంపర యొక్క ఆధ్యాత్మిక వెలుగు, శక్తిసామర్థ్యాలచే ప్రచోదితమైన భూమి.

నా ప్రశాంతత లోతైనది, నిశ్చలమైనది, నా ఆశ అపారమైనది, నా ఆకాంక్ష తీవ్రమైనది. నాల్గవ పర్యాయం నేను మేల్కొన్నాను.

రెండు బలమైన స్తంభాల ఆలంబనతో నున్న ముదురు వంగపండు రంగుగల చతురస్రాకారపు రాజద్వారాన్ని గాంచాను. ఆ ద్వారం మధ్యలో నేలపై ప్రక్క ప్రక్కన అతి సన్నిహితంగా ఏకమై కూర్చున్న రెండు ఊదారంగు గరుడ పక్షులను చూసాను. ఒకటి తూర్పు ముఖంగా మరొకటి పశ్చిమ ముఖంగా తిరిగి వున్నాయి. వాటి తలలపై, ద్వారం మధ్యలో, వైభవోపేతంగా ప్రకాశిస్తున్న తెల్లనైన, సప్తవర్ణాల కిరణాలతో వెలిగిపోతున్న సూర్యబింబ మున్నది.

అపారమైన ఆనందాతిశయంతో ఆ అత్యద్భుత దృశ్యం వంక తేరిపార జూచాను. నా శిరస్సు లోనికి సుందరమైన సూర్యకిరణాలు ప్రవేశించినట్లనిపించింది. నాలోని సమస్తం ప్రకాశవంతమయింది. విజయవంతమయ్యే సంసిద్ధికీ రాజద్వారం ప్రవేశ ద్వారం, చతుర్విధ సంతులనంపై ఆధారితమైన సమతుల్యతలోని నిష్కల్మషమైన, అత్యధిక ప్రకాశమానమైన ద్వైతస్థితిలోనికి ప్రవేశ ద్వారం.

ఈ ద్వారం మధ్యన, ఆకాశంలో ఎగురకుండా భూమిపై స్థిరంగా నిలిచివున్న మేలైన నీల లోహిత వర్ణం గల ఆ రెండు గరుడ పక్షులు ప్రయోజనంలోని శక్తికి, అనగా భూలోక ప్రచండ బలానికి ప్రతీకలు. కరిగిపోని సారుప్యతా బంధంతో అవి ఒకటిగా వున్నప్పటికి, ఒకటి అస్తమిస్తున్న సూర్యుని వైపు, మరొకటి ఉదయిస్తున్న

సూర్యుని వైపు తిరిగి వున్నాయి. ఒక స్థాయి నుండి మరొక స్థాయికి ఎదగడానికి, వెలుగు నుండి మరింత స్వచ్ఛమైన, మరింత ప్రకాశవంతమైన వెలుగులోకి ఆరోహణ నిమిత్తం సరియైన సమతుల్యతా స్థితిలో నుండవలసిన నిద్ర మెలకువలకు, నిష్క్రియత సక్రియతలకు, ప్రతీకలుగా నిలిచి వున్నాయి.

ఏ వైభవోపేత శ్వేత సూర్యుని సమస్త శక్తుల కేంద్రపు అద్భుత ప్రకాశానికై తపిస్తుంటారో, ఎవరి వైభవం ప్రవర్ధమాన మవుతూ వున్నదో అలా ఎల్లకాలమూ ప్రవర్ధమానమవుతూ వుంటుందో, ఆ సూర్యుని రంగులు వెదజల్లుతుండే కిరణపుంజాలు కేవలం ఈ సమతుల్యతతో మాత్రమే పుడమి పుత్రులకు ప్రయోజనం కలుగ జేయ గలవు.

అనువాదం: కె. వి. రావు

ఏడవ దర్శనం

నేను నిద్రపోయాను, ఇప్పుడు మేల్కొన్నాను.

నా ఎదురుగా అందమైన ఒక శ్వేతాశ్వమును అధిరోహించి, స్వర్ణకాంతు లీనుతున్న ఖడ్గమును ఝుళిపిస్తున్న ఒకరిని చూసాను. అతడు తన కెదురుగా నున్న ఒక అంధకారావృతమైన అగాధాన్ని ఒక్క ఉదుటున అశ్వంతో పాటు లంఘించాడు.

ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తుండగానే, 'పూర్వస్థితిని పొందు' అనే ఒక పదం వినిపించింది. ఆ పదంలో ఒక వాగ్దానము, ఒక ఆశ, నిండి వున్నాయి.

అంతలో హఠాత్తుగా ఆ చీకటి అగాధంలో ఒక చీలిక ఏర్పడి వెలుగులు జిమ్ముతున్న ఇంద్రధనుస్సు లాంటి మార్గం ఏర్పడింది. ఎర్రని పాదములుగల తెల్లని కపోత మొకటి అందులో నుండి ఎగిరి వస్తున్నట్లు కనిపించింది. ఆ దృశ్యం చూస్తుండగానే, ఆ చీకటి కావల, మరొక అద్భుత దృశ్యం కనిపించింది.

ఇరువైపులా మెరుస్తున్న కత్తులు దాల్చి, మెరిసే దుస్తులు ధరించిన దేవదూతల సమూహ మొకటి పోరాటానికి సంసిద్ధులై కనిపించారు. వారంతా ఒక దివ్యపురుషుడి నాయకత్వం క్రింద వున్నారు. అంతా ఇంద్రధనుస్సు లాంటి రంగుల దుస్తులతో



శ్రీఅరవిందులు (శ్రీమాత చిత్రలేఖనము)

మెరిసిపోతున్న ఆ నాయకుని సంకేతం కొరకు నిరీక్షిస్తున్నారు.

అంతలో వారిలో అందరికన్నా ఎత్తుగా, హుందాగా నున్న ఒక యువకుడి వైపు నా దృష్టి మళ్ళింది. పద్మరాగమణి కాంతులు విరజిల్లే జిగేలుమని మెరిసే తెల్లని అంచుగల పెద్ద వస్త్రం ఒకటి అతని భుజద్వయంపై కప్పబడి వుంది.

అతను మాట్లాడబోతున్నందున అందరూ శ్రద్ధగా, నిశ్శబ్దంగా నిలుచుని వున్నారు. అతను మాట్లాడాడు. అ స్వరం గంభీరంగా, మధురంగా వినవచ్చింది. అతను చెప్పినది నాకు అర్థమయింది. "సమయం ఆసన్నమయింది. భూలోకవాసుల, సురలోకవాసుల సమూహాలు రెండూ సిద్ధపడుదురు గాక. ఓర్పుతో కృషి సలిపే వారు వారి సహనాన్ని, ధైర్యాన్ని కోల్పోకుందురు గాక. అందరికి కనిపించకపోయినా, కొందరికి కనిపించే రీతిలో పని వేగంగా కొనసాగుతున్నది. ఒక వైపు సమ్మర్ధం ఎక్కువగా నున్న ప్రాంతాలలో ఎలాంటి గందరగోళ, కల్లోల పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, శాంతిభద్రతలు నెలకొంటున్నాయి. మరో వైపు పుడమిపైన ఉత్సాహవంతులు, జ్ఞానవంతులు, సహృదయులైన మనుషుల క్షేత్రాలలో నాటబడిన బీజాలు మొలకెత్తుటకు సిద్ధంగా నున్నాయి. సమయం వచ్చినప్పుడు మనం చేస్తున్న కృషికి తోడ్పడటానికి శౌర్యవంతులైన అతిమానవుల సమూహం సంసిద్ధమై వున్నది. త్వరలోనే విజయాన్ని, కీర్తిని చాటే విజయగీతం ప్రతిధ్వనించ బోతున్నది."

ఈ మాటలకు పరమానంతభరితురాలనై నేను భూతలానికి తిరుగు ప్రయాణం ప్రారంభించాను. ఈ అవరోహణలో ఎర్రని పాదములుగల శ్వేత కపోతం నన్ను వెన్నంటి వచ్చింది.

అంధకారమయమైన అగాధాన్ని దాటిన తరువాత వెనుదిరిగి చూసాను. ఓహ్, ఏమిటా దృశ్యం. అది పెద్దదైన సిలువ ఒకటి ఒక నల్లని పెద్ద మేఘానికి దన్నుగా వున్నది. ఆ సిలువను మేఘాన్ని రెంటినీ, బ్రహ్మాండమైన ఆకారంగల వ్యక్తి ఒకరు మోస్తున్నాడు. ఏ వ్యక్తి అయితే మానవజాతిపై అపారమైన జాలితో అద్భుతమైన రక్షణ కవచంతో మానవాళిని కాపాడ చూస్తాడో అతడే అధర్మం, అరాచక చర్యల వల్ల మానవాళిపై బడే భారాన్ని కూడా మోయవలసి వుంటుంది. అపారమైన వాత్సల్యం, బాధతో కూడిన దృక్కులు సారిస్తూ ఈ ధరణీతలం దిశగా మరలి వున్న ఆతని సుందర ముఖానికి ఇరుప్రక్కల ఆతని పొడుగాటి కురులు జాలువారి వున్నాయి.

ఔను, నిజం! శాపగ్రస్తులగు పుడమి పుత్రులను ఆ నల్లని మేఘం అణగ

ద్రొక్కకుండా అదుపులో నుంచుటకై ఆ మహామనీషి ప్రయాస పడవలసిన అవసరం రానీయకుండా అందరూ ప్రగాఢమైన శక్త్యుత్సాహాలతో పనిచేయవలసిన సమయం తొందరగా రావాలి.

మానవులంతా సత్సంకల్పంతో ఒక్కటై తమ ప్రయత్నా లన్నింటినీ సంఘటిత పరచుదురు గాక. మనుషులందరూ తమ మేధాశక్తిని మేల్కొల్పుదురు గాక. ఎవరిలోనైతే దివ్యజ్యోతి ప్రకాశిస్తున్నదో వారిలో ఆధ్యాత్మికత, ప్రేమతత్వం మేల్కొను గాక — నియమ నిబద్ధత, అకర్తృక భావము లేని ప్రేమతత్వము.

విజయోత్సాహం, కీర్తి, గౌరవాల పరాకాష్ట స్థాయిని ఆనందపారవశ్యంతో ఆలపించే విజయగీతిక అతి త్వరలో ప్రతిధ్వనించాలి!!

అనువాదం: కవితా శ్రీధర్ , అందుగులపాటి కైలాసపతి

ఎనిమిదవ దర్శనం

నేను నిద్రపోయి ఇపుడు మేల్కొన్నాను.

అది చతురస్రాకారంలో నున్న పెద్ద గది. గదిలోకి వెలుతురు ప్రసరించడానికి వీలుగా నైఋతి దిశగా ఒక పెద్ద కిటికీ అమర్చబడి వున్నది. గోడలు ఓక్ చెక్క పలకలతో తీర్చిదిద్దబడి వున్నాయి. పశ్చిమ దిశగా నున్న పలకల మధ్యగా రాతితో చెక్కబడిన బృహత్తరమైన చలి మంట రాజేసే గూడు వున్నది. ఆ గృహం ఒక కొండచరియ అంచున నిర్మింపబడి వుండవచ్చు. ఎందుకనగా కిటికీ నుండి చూస్తే దూరంగా నీలలోహిత వర్ణపు పొగమంచుతో కప్పబడివున్న దీర్ఘమైన పర్వతశ్రేణులున్న భూమ్యాకాశాలు కలిసినట్లుంటే చోటు వరకు విస్తరించి వున్న మైదానం కనిపిస్తుంది. ఆ లోయ క్రింది భాగంలో అస్తమించే సూర్యుని కిరణాల వెలుగులో మెరుస్తూ, నిటారుగా ఎదిగిన చెట్ల మధ్యన మెలికలు తిరుగుతూ నది ఒకటి ప్రవహిస్తున్నది.

ఆ పొద్దుపోయిన సమయంలో, అంత పెద్ద కిటికీ వున్నప్పటికీ గదిలో వెలుతురు మందగించింది. అయినప్పటికీ ఆ కిటికీ వద్ద కూర్చొని వున్న ఒక పడుచు పిల్లను చూసాను. ఆమె తన ఒడిలో చేతులను ముడుచుకొని, తూర్పుదిశగా ఆ గదిలో చీకటి కమ్మివున్న మూల వైపు రెప్పవాల్చకుండా శూన్యదృక్కులను సారిస్తూ

కూర్చొని వున్నది. ఆమె దేని కోసమో నిరీక్షిస్తున్నట్లుంది.

ఆ గదిలో మరో మనిషి వున్నాడు. అతను వయోవృద్ధుడు. చలిమంట గూడు ముందర నిలుచుని వున్నాడు. అతని దుస్తులు ముదురు రంగు ముతక వస్త్రంతో తయారు చేయబడినవి.

నేనా పడుచు పిల్లను పరిశీలించి చూసాను. ఆమెలోని ఆలోచనలు నాకు అద్దంలో కనపించినంత స్పష్టంగా అవగతమయ్యాయి. ఆమె సున్నితమైన భావాలు నా స్వంత భావాలంతగా తెలియవచ్చాయి. ఆమె ఎవరి రాక గురించో వేచి వున్నప్పటికి, ఆ వచ్చేవారెవరో ఆమెకు తెలియదు. అయినప్పటికి, అగంతుకుడు తన కోసమే విచ్చేస్తున్నాడని ఆమె అంతరంగం చెబుతున్నది.

హఠాత్తుగా అతను గదిలోకి ప్రవేశించాడు. తలుపు తెరిచి మూసిన శబ్దం విన రాలేదు. ఆమె కూర్చుని వున్న చోటుకి ఎదురుగా గది చివరన అతను ప్రవేశించాడు. ఆమె కనులకు తప్ప మిగతావారికి అతను ధరించిన దుస్తులు కనిపించుట లేదు. అతనిని అతి సామాన్య మానవుడిగా కనుపడునట్లు చేసే ముదురు ఊదారంగు ఆచ్ఛాదనను ధరించాడు. కాని ఆమె తక్షణం అతని శరీరం నుండి వెలువడి అత నిని చుట్టుముట్టి వున్న మెరిసే ధవళ కాంతిని గమనించింది.

ఒక అనిర్వచనీయమైన దివ్యప్రేమ తనలో పెల్లుబుకుతుండగా, తన అస్తిత్వా న్నంతా కూడ తీసుకొని ఆమె అతనిని గుర్తించింది. కాని ఆమెలో ఉప్పొంగిన ఆ భావావేశ తీవ్రత ఎంత బలంగా నుండిందంటే, ఆమె నిశ్చేష్టితురాలై తాను కూర్చొని వున్న కుర్చీ నుండి లేవలేకపోయింది.

అప్పుడు, ఆ వృద్ధుడు, ఆ యువతి తండ్రి, కొత్తగా ప్రవేశించిన వ్యక్తిని సమీ పించి అత్యంత గౌరవపురస్కారమైన మాటలతో ఆహ్వానించాడు. అపారమైన కాంతిలో వెలిగిపోతున్న ఆ వ్యక్తి ప్రేమాదరణ లొలికే ఆలింగనంతో ఆ వృద్ధుని తన హృదయానికి హత్తుకున్నాడు. ఆలింగనం నుండి విడివడి పరస్పరం దూరంగా జరిగి ఆ వృద్ధుడు కొత్త వ్యక్తిని ఆహ్వానించడానికై ఉపక్రమించినప్పుడు మసకబారిన బూడిదరంగు అంగీని ధరించి వున్నాడు. అయితే, అటు పిమ్మట తిరిగి తన స్థానా నికి చేరేసరికి అతను ఒక దివ్యమైన పసిడిరంగు లీనుతున్న ధారాళంగా జాలువారిన దుస్తులలో నున్నాడు. అచ్చెరువొందిన ఆ పడుచుపిల్ల తన్మయానందాలతో ఎలుగెత్తి, "చూడు, అతను ఎలాంటి అద్భుతాలు చేయగలడో," అని అరచింది.

ఆ వ్యక్తి అప్పుడు ఆమెకు చేరువగా వచ్చాడు. అలా వచ్చేటప్పుడు ఆతని నావరించి వున్న ధవళకాంతి మరింత తెల్లనై తేజోవంతమయింది. అతను స్వయంగా కాంతిలో వెలిగిపోతున్నాడు. అతను ఎంత అతిశయించిన సౌందర్యంతో అలరారుతు న్నాడంటే, ఆ యువతి ఆశ్చర్య పారవశ్యాలకు లోనై ఒకింత స్మృతి కోల్పోయి నేల కొరిగింది. అయితే, త్వరలోనే స్వస్థత పొందింది. అతని దరిజేరుతూ క్రిందికి వొంగి కాలిజోళ్ళలో నున్న అతని పాదాలను ముద్దాడింది. వాత్సల్యభరితమైన స్పందనతో అతను ఆమెను పైకెత్తి తన బాహువులలోకి తీసుకున్నాడు. ప్రేమ పూర్వకంగా ఆమె తన శిరస్సును ఆతని భుజంపై వాల్చింది. ఆ విధంగా ఒకరి బాహువుల్లో ఒకరు ఇమిడిపోయి చాలా సేపు నిలుచుండిపోయారు. వారి చూపులు క్రమక్రమంగా అంతరిస్తున్న అంతిమ సూర్యకిరణాలు వ్యాపిస్తున్న ఆ మైదానం పైగా సాగిపోతున్నాయి.

మౌనంగానే వారు తమ తమ అంతరాత్మల అంతరాంతరాలను, ఆలోచనలను ఇచ్చి పుచ్చుకొన్నారు. మౌనంలోనే తాము నెరవేర్చవలసిన కార్యం యొక్క విశి ష్టతను గురించి, వారికి సంభవించబోతున్న వైభవోపేతమైన విజయం గురించి, తత్కారణంగా ఆతని నావరించి జాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న కాంతి ఏదైతే ఆ విజయానికి మహిమాన్వితమైన హామీ అన్నట్లుగా నున్నదో దానిని గురించి చర్చించుకొన్నారు.[1]

వారి అంతరాంతరాలలో నున్నదంతా కూడా పరస్పర సన్నిహిత సంబంధం కలిగి వుంది, అధికాధికమైన సుఖసంతోషాల సమతుల్యతలో తులతూగుతున్నది. ఆ విధంగా రూపుదిద్దుకున్న ఆ జంట, కిటికి వద్ద నిలుచుని వున్నప్పుడు సౌందర్య సామరస్యతలు కురిపిస్తూ చూడముచ్చటగా నున్నారు. అతను ఎత్తుగా, నాజూకుగా, నల్లని జుట్టు నల్లని గడ్డంతో నున్న స్ఫూర్తద్రూపి. కొండ క్రిందుగా పరచుకొనివున్న మైదానానికి అభిముఖమై, గంభీరము, విషణ్ణమైనప్పటికీ అపారమైన ఆప్యాయత నొలికిస్తూ సౌమ్యత ప్రసరించే చూపులతో నిలుచుని వున్నాడు. ఆమె యవ్వనాన్నొలక బోస్తూ, చక్కని కురులతో, ఆతని భుజాన్ని ఆనుకొని, ప్రగాఢమైన ప్రేమను వెదజల్లే కనులతో ఆతని వంక చూస్తూ నిలుచున్నది. వారిరువురు తపస్సులాంటి సుదీర్ఘ పరస్పర అవలోకనా స్థితి నుంచి తేరుకున్న తరువాత అతను ఆమె వైపు మరలి తన పెదవులతో ఆమె నుదుటిని స్పృశించాడు.

ఇప్పుడు గమనించాను., ఆమె కూడా క్రమంగా ప్రకాశవంతమవుతున్నది. ఆ విషయాన్ని ఆమె గ్రహించి నెమ్మదిగా అతనికి చెప్పింది. అతని సమాధానం, "ఇది మనలను ఏకం చేసిన తీవ్రమైన పరస్పర ఆకర్షణ యొక్క సహజ పర్యవసాన ఫలితం. నీ ఆధ్యాత్మికత కూడా అది సాఫల్యమగునట్లు చేసింది.. 'వ్యక్తి యొక్క ద్వంద్వ వైఖరుల సమతుల్యతలో విజయం దాగి వుంటుంది' అనే నానుడి వినలేదా? ఇప్పుడు మన మా సమతుల్యతను సాధించాము గనుక మన ముందున్న మహోన్నత కార్యం,. లోకంలో సామరస్యత నెలకొల్పే మహత్కార్యం, కచ్చితంగా సాధిస్తాము."

అంతకు ముందుగానే ఆ వృద్ధుడు గదిని వదిలి వెళ్ళాడు. ఇప్పుడు అతను తిరిగి వచ్చి, భోజనం తయారయింది, ఆరగించటానికి రమ్మని ఆహ్వానించాడు.

అయితే, ఆమె ఇలా అన్నది, "నాకు ఏ మాత్రం ఆకలిగా లేదు. నిద్రపోతే చాలా బాగుంటుంది — తన్మయానందాలలో అంతర్లీనమయ్యే నిద్ర."

అతను అందుకున్నాడు. "మాకు భోజనం అవసరం లేదు. మాది అంతర్గత పోషణ", ఆమె వైపు తిరుగుతూ, "పద, విశ్రమిద్దువుగాని" అన్నాడు

వారిద్దరూ ప్రక్క ప్రక్కగా, చేయి చేయి కలిపి, మంచపై వాలి నిద్రలోకి జారి పోయారు.

వారి నుండి వెలువడుతున్న ధవళకాంతి మరింత తీవ్రతరమై, విస్తారం కాసాగింది. గదిలో నుండి బయటకు విస్తరించి ఆ విశాల మైదానంపై సుదీర్ఘంగా వ్యాపించసాగింది.

ఎక్కడైతే సమతుల్యతా స్థితిలో నుండి వెలువడే కాంతి వెలుగుతుంటుందో. అది అక్కడ ఆరోగ్యాన్ని, విశ్వాసాన్ని, సామరస్యతను, సంతోషాన్ని సమకూరుస్తుంది.

శ్రీమాత

(శ్రీఅరబిందో ఇంటర్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి త్రైమాసిక బులెటిన్, 1982, 1983, 1984 నుండి సేకరించబడింది.)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

[1]సంవత్సరాలు గడిచిన పిమ్మట, అనగా 1914 సం. మార్చి, 29 న ఈ సంఘటన భౌతికస్తరంలో సంభవించింది. శ్రీమాత శ్రీఅరవిందులను పాండిచ్చేరిలో కలిసారు.

ఇద్దరు మౌనంగానే వారి అంతరాత్మల అంతరాంతరాలను, ఆలోచనలను ఇచ్చి పుచ్చుకొన్నారు. మౌనంలోనే తాము నెరవేర్చబోయే కార్యం యొక్క విశిష్టతను గురించి, వారికి సంభవించబోతున్న వైభవోపేతమైన విజయం గురించి....

శ్రీమాత ఈ సమావేశం గురించి 1930-31 లో కూడా ప్రస్తుతించారు. "నేను శ్రీఅరవిందులను పాండిచ్చేరిలో మొట్టమొదటిసారి కలిసినప్పుడు కలిగిన అనుభవం గురించి చెప్తాను. నేను అతి తీవ్రమైన ఏకాగ్రత వహించి అతిమానసంలో విషయాలను పరిశీలిస్తున్నాను — ఒక విధంగా నుండాల్సిన విషయాలు, ఏదో కారణంగా, అలా వ్యక్తపడనివాటిని గురించి. నా పరిశీలనలో విశదమయిందేమిటో శ్రీఅరవిందులకు విన్నవించి, అవి వ్యక్తమవుతాయా అని అడిగాను. ఆయన అతి మామాలుగా 'అవును' అన్నారు. తక్షణం, దివ్యచైతన్యం పృథ్విపై అవతరించి, సార్థకమగుట ప్రారంభమవటం నాకు కనిపించింది!'"

— సంపాదకుడు



"ఆర్య"

దైవవాక్కు

దివ్యచైతన్య చరితల ప్రతుల నుండి
మందమతులగు మనుషుల మేలు కొరకు
పుటల పుటలుగ ప్రభవించి పంచబడిన
దివ్యసందేశ సారాల మెరుపు తళుకు

అఖిల

అఖిల భారత పత్రిక

ఆగష్టు 2014

విషయసూచిక

No 1

आर्य

A PHILOSOPHICAL REVIEW

(*English Edition of the "Revue de Grande Synthèse."*)

Editors :

SRI AUROBINDO GHOSE — PAUL & MIRRA RICHARD.

15th August 1914

7, Rue Dupleix, Pondicherry.

INDIA.

MODERN PRESS, PONDICHERRY.

‘ఆర్య’ పత్రికపై ప్రత్యేక సంచిక పరిచయము

వందేళ్ళ క్రింద, 1914 సం. ఆగష్టు 15 న, శ్రీఅరవిందుల 42 వ జన్మదినాన, ‘ఆర్య’ ప్రప్రథమ సంచికతో పాటు దాని అనుబంధ ఫ్రెంచి అనువాద సంచిక Revue de Grande Synthese పాండిచ్చేరి నుండి వెలువడ్డాయి. ఒక సమగ్ర ఆధ్యాత్మిక అనుభవాల సంశ్లేషణాత్మక తాత్విక సమీక్షను పాఠకులకు అందజేయుట దాని ఉద్దేశ్యము

దీనిలోని వ్యాసాలు ప్రధానంగా శ్రీఅరవిందులచే రచింపబడినవి. ఫ్రెంచి అనువాద సంచిక నిర్వహణా బాధ్యత, చందాదారుల వివరాలు, జమాఖర్చుల నియంత్రణ మొదలైనవన్నీ శ్రీమాత చేపట్టారు. ‘ఆర్య’ పాండిచ్చేరిలోని మోడరన్ ప్రెస్ నందు ముద్రించబడి, 7, రూ డుప్లె క్రింది అంతస్తులోనున్న రిచర్డుగారి గృహం నుండి ప్రచురించబడింది. రూ ఫ్రాంస్వా మార్టిన్లో శ్రీఅరవిందుల నివాసమందున్న గృహపు క్రింది అంతస్తులో ఈ రెండు పత్రికల సంపాదకుని కార్యాలయం ఏర్పాటు చేయ బడింది

ఆరున్నర వత్సరాలు, 1914 సం. ఆగష్టు నుండి 1921 సం. జనవరి వరకు, ‘ఆర్య’ నిరాటంకంగా ప్రతి నెలా వెలువడింది. శ్రీఅరవిందుల విశిష్ట సాహితీ కృతులు, దివ్యజీవనము, వేదరహస్యము, యోగసమన్వయము, గీతావ్యాసములు మొదలగు ప్రముఖ రచనలు, ప్రస్తుతం మనకు పుస్తకరూపంలో లభ్యమయ్యేవి, అన్నీ ఈ పత్రికలో ధారావాహికంగా ప్రచురించబడ్డాయి.

శ్రీఅరవిందులు ఈ లోకానికి, సమస్త మానవాళికి ప్రసాదించిన ఈ అపూర్వ కానుక, ‘ఆర్య’ యొక్క ప్రప్రథమ సంచికావిష్కరణ సందర్భాన్ని, ఈ మాసం అత్యంత కృతజ్ఞతాపూర్వకంగా పాటిద్దాం.

సంపాదకుడు

'ఆర్య' యొక్క స్వయం నిర్దేశిత లక్ష్యం

'ఆర్య' ఒక స్వచ్ఛమైన తత్వశాస్త్రి పునః పరిశీలన

దాని స్వయం నిర్దేశిత లక్ష్యం ద్వివిధమైనది:

1. సృష్టియొక్క అతి ముఖ్యమైన సమస్యల శాస్త్రీయ అధ్యయనం.
2. ప్రాక్ పశ్చిమదేశాల మానవాళి యొక్క బహువిధ మత సాంప్రదాయలను సామరస్య పూర్వకంగా విశదీకరిస్తూ, వాటిలోని విషయపరిజ్ఞానం యొక్క విస్తారమైన సంకలనాన్ని రూపొందించటం. అందుకొరకు అనుసరించే విధానం యదార్థవాదం; ఒకే కాలంలో హేతుబద్ధంగా సాగేది, అతీతతత్వంపై ఆధారపడేది. యథార్థవాదం మేధాపరమైన, శాస్త్రి సమ్మతమైన అనుభవాల, మరియు అంతర్బుద్ధితో అనుబంధమైన అనుభవాల సమ్మేళనం.

ఈ సమీక్షా పత్రిక రేకెత్తించే ప్రేరణలతో ఏర్పాటు గావించబడిన వివిధ సంఘాలకు, సమాజాలకు ఇది ఒక ప్రచార సాధనంగా కూడా ఉపయోగపడుతుంది.

'ఆర్య' ప్రథమ సంచికలోని విషయాలు

అనువాదం: రామినేని సుందరరామయ్య

'ఆర్య'లోని విషయ సంగ్రహం

భవిష్య ఆలోచనా ధారను వ్యక్తం చేస్తూ, దాని చక్కని పునాదిని రూపొందించడానికి దోహదం చేస్తూ, ఉత్తమమైన, అత్యంత ముఖ్యమైన గత ఆలోచనా విధానానికి, భవిష్య ఆలోచనా విధానాన్ని జోడించడం ఆర్య యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

CWSA 13:103

ఈ పృధ్వి ప్రాణము, పదార్థము కలిసిన ప్రపంచం. అయితె మనిషి మృగంగాని, మొక్క గాని కాదు. అతడు ఆధ్యాత్మికమైన, ఆలోచనాపరుడైన జీవి. ఈ భూమిపై అతడి ఉనికి తన మృగనమూనాని ఉన్నత ఆశయాలకు ఉన్నత ప్రయోజనాలకు దివ్యమైన పరికరంగా ఉపయోగించటం.

CWSA 13:140

అందువల్ల ఆలోచన యొక్క సమస్య సరైన భావాన్ని, సమగ్రతకు సరైన మార్గాన్ని కనుక్కోవడం; ఆత్మయొక్క సనాతన శాశ్వత సత్యాన్ని పునరుద్ఘాటించి, అది తిరిగి సమస్తాన్ని ఆలింగనం చేసుకుని, వాటిలోకి చొచ్చుకుని, వాటిపై సాధికారత వహించి, మానసిక, భౌతిక జీవితాన్ని మార్చటం. మనిషియొక్క మానసిక, భౌతిక జీవన విధానం తన సంపన్నత, శక్తి వైరుధ్యాల పెంపు ద్వారా ఆధ్యాత్మిక జీవన విధానాన్ని వ్యక్తపరచడానికి శక్తిని, క్రమశిక్షణను, అభివృద్ధిని తీవ్రమైన విధానాల ద్వారా పెంపొందించడం. అంతేకాక తన బాహ్యజీవితం, తన సమాజం, తన సంస్థల యొక్క ఉద్దేశ్యాలను, పద్ధతులను ప్రగతిశీలంగా పునర్నిమిస్తూ, నూతన విధానంలో క్రమంగా ఆత్మ యొక్క సత్యం వైపు అభివృద్ధి చెందుతూ, వ్యక్తి స్వేచ్ఛ, సాంఘిక ఐక్యతతో కూడిన సమగ్రతను అత్యధిక స్థాయిలో అందించడానికి విధానాలను అన్వేషించడం.

CWSA 13:145-46

'ఆర్య' లో మేము ముందుగా నిర్ధారించుకున్న విషయమేమిటంటే గాఢమైన ఆలోచనతో సమస్య యొక్క తాత్వికపరమైన పునాదులను నిర్దేశించటం. ఈ పునాది లేకుండా వాస్తవమైన, పటిష్ఠమైన, శాశ్వతమైన విలువ కలిగిన ఏ విషయాన్ని ఎంత మాత్రం ప్రతిపాదించలేం అని మేము గట్టిగా అంగీకరించాం. ఈ పునాది లేకుండా, మేము ఏమి చెప్పినా దానికి నిజమైన, పటిష్ఠమైన, శాశ్వతమైన విలువ వుండదు

అని, బహుశా కఠినమైన, దురవగాహమైన ఆలోచనకు అధిక ప్రాధాన్యత నివ్వాలేమో నని కూడా అనుకున్నాం.

CWSA 13:103

(ఆర్యలో) మా ఆలోచన, రాబోతున్న మన నూతన యుగానికి అనువైన ఆలోచనా విధానానికి సహాయకారిగా ఉండే తాత్విక విధానాన్ని సమకూర్చటం. మా ప్రారంభం ఒక నూతన ఆలోచనను ప్రతిపాదిస్తుంది. అది బహుశ ఓ గొప్ప మార్పు వైపు కదులుతున్న మానవజాతిని ఓ నూతన జాతిగా మార్చడానికి కారణం కావచ్చు. ఆలోచించే మనుషులున్న అన్ని దేశాల్లోను ఈ ఆలోచన, ఆశ, భిన్నరూపాల్లో వ్యక్తమౌతున్నది. మన లక్ష్యం ఈ మానవజాతి చేపట్టబోయే ఈ ఉద్యమంలో, ఈ ప్రయత్నంలో మార్గదర్శకంగా ఉంటూ వారికి ఆ జ్ఞానం అందే విధంగా, ఆధ్యాత్మిక, మతపరమైన మరియు ఇతర సత్యాల గురించి అన్వేషణ సాగించడం. ఏ ఆధ్యాత్మిక అనుభవం మరియు సార్వజనీనమైన సత్యాల మీద ఆధారపడి అలాంటి ప్రయత్నం సాగాలో, అదంతా మాకు ఇప్పటికే అందించబడ్డాయి. లేకపోతే మాకు ఆ ప్రయత్నం చేయడానికి ఏ విధమైన హక్కు వుండేది కాదు.

CWSA 13:105

మానవుడు సంపూర్ణ దివ్యత్వంలోకి ఎదగడమే మానవ జీవితం యొక్క నిజమైన ధర్మం. పృథ్విపై అతడి అస్తిత్వం దైవం యొక్క ప్రతిరూపంగా పరివర్తన చెందడమే పరిణామం యొక్క అర్థం. ఇదే 'ఆర్య' ప్రధాన సిద్ధాంతం యొక్క తాత్వికత.

ముందుగా భౌతికేతరమైన ఆధ్యాత్మిక కోణంలో ఆ సిద్ధాంతాన్ని పరిశీలించాలి, ఎందుకంటే తత్వశాస్త్రంలో ఆధ్యాత్మిక సత్యం అన్నింటికి మూలబీజం. అది మిగతా వన్నీ ఆధారపడిన లేక రూపుదిద్దుకున్న సార్వత్రిక సత్యాల అంతిమ ప్రకటన. అందుకనే 'ఆర్య' లో మొదటి స్థానం 'దివ్యజీవనం' గ్రంధాని కివ్వబడింది. ఆత్మ, మనసు, జీవితం గురించిన భావాల గురించి, సచ్చిదానందం మరియు ప్రపంచం గురించి, జ్ఞానము మరియు అజ్ఞానం గురించి, పునర్జన్మ మరియు ఆత్మ గురించి, వేదాంతపరంగా వాటి ఆదర్శాలకు ప్రాధాన్యత నిచ్చి, వాటి యొక్క వేదాంతపరమైన స్థాయి నించి ప్రారంభించాం. కాని ప్రజాబాహుళ్యంలో వేదాంతం అంటే జీవితాన్ని తిరస్కరించడం అన్న ధోరణి ప్రాచుర్యం పొంది ప్రాధాన్యత సంతరించుకుందని అనటంలో సందేహం లేదు. ప్రారంభంలో మూలసత్యం నించి మొదలై అంతా

బ్రహ్మం, ఆత్మ అని చెప్పినా, చివరికి ప్రపంచం — బ్రహ్మం కాదని, ఆత్మ కాదని ఒక పరస్పర వైరుధ్య భావనలో వదిలేయడమయింది. దానికి వ్యతిరేకంగా మేము అదే మూలవస్తువుగా తీసుకొని, ఓ సర్వసమగ్ర అద్వైత సిద్ధాంతాన్ని స్థాపన చేయడానికి ప్రయత్నించాం. మనో, ప్రాణ, పదార్థాలు ఆత్మ నుండి ఒక ఆధ్యాత్మిక లేక అతిమనసు ద్వారా, అంటే ఏదైతె ఈ విశ్వ అస్తిత్వానికి నిజమైన ఆలంబనో దాని నుండి ఉద్భవించినవని చూపిస్తూ — మనసును ఆధ్యాత్మిక లేక అతిమనసుగా అభివృద్ధి చెందించుట ద్వారా, మానవుడు ఈ ప్రపంచంలోని ఆత్మ యొక్క అసలైన సత్యాన్ని మరియు జీవితంయొక్క వాస్తవమైన సత్యాన్ని, ఉన్నతమైన ధర్మాన్ని చేరతాడని నిరూపించాము. సచ్చిదానందమే ఆత్మ. దానికి ఈ ప్రపంచానికి మధ్య బాగుచేయలేని పరస్పర వైరుధ్యం లేదు. మనం కేవలం అజ్ఞానంతో ఉన్న కళ్ళతో ఈ ప్రపంచం చూస్తూ ఉంటాం. కాని మనం జ్ఞాననేత్రంతో చూడవలసి ఉంది. పైకి అజ్ఞానంగా కనిపిస్తున్న ఈ పదార్థం అంతర్ముకిళితమైన జ్ఞానమే. పదార్థం తన ముకిళితస్థితి లోంచి బయటకు వచ్చి, అభివృద్ధి చెందుతున్న జ్ఞానంగా తిరిగి తన ఎరుక గల సమగ్రతను పొందడం. ఆ తిరిగి రావడాన్ని సాధించి, ఆధ్యాత్మిక జీవితాన్ని మానవ అస్తిత్వంలో అభివ్యక్తిచేయడానికి ఇవ్వబడిన అవకాశమే పునర్జన్మల పరంపర. పాశ్చాత్య దేశాలవారు ఈ పరిణామంలోని తాత్విక సత్యానికి ప్రాధాన్యత నిచ్చినంతగా కాకుండా మేము పరిణామ సత్యాన్ని, ముఖ్యంగా ముకిళితమై పదార్థంలో ఉన్న జీవం, మనసు, మరియు ఆత్మల ప్రగతిశీల అభివ్యక్తిని ఎక్కువగా అంగీకరిస్తాం. ఈ పరిణామం యొక్క పరాకాష్ట ఆధ్యాత్మిక జీవితం, దివ్యజీవనం.

ఈ సత్యాలకు, సనాతన వేదాంతపరమైన సత్యంతో అసంబద్ధత లేదని చూపడం అవసరమయింది. అందువల్ల మేము వేదాంతపరంగా ఈ రెండు ఉపనిషత్తులు, గీత దృక్కోణంలోని వివరణలను దీనిలో చేర్చాం. కాని ఈ వేద కర్మకాండవాదుల చేత, పండితులచేత అస్పష్టం చేయబడింది. అందువల్ల మేము మా వ్యాసపరంపరలో, ప్రారంభంలో ఇప్పటి వరకు, ఆ వేదాంతపరమైన మార్మిక రచనావిధానం, వారి ప్రత్యేక పద్ధతులు, వారు చూపిన సత్యాలు వివరించాం. ఉపనిషత్తులలో నుంచి 'ఈశ' మరియు 'కేన' లను తీసుకున్నాం, సంపూర్ణంగా ఉండటానికి 'తైత్తరీయను'

కూడా కలిపి ఉండాల్సింది, కాని అది దీర్ఘమైనది కావడం వలన చోటు ఎక్కువగా లేనందున చేయలేదు.

ఆత్మసత్యాన్ని జీవిత సత్యం యొక్క అత్యున్నత అతి కష్టతరమైన స్థితికి చేరటానికి, దానిని ఆచరణాత్మకం చేయటానికి, ఆ ఆచరణ దానిని అధి ఆత్మలో పునరుజ్జీవింపజేసి, ఆధ్యాత్మిక జీవితంతో సామరస్యత సాధించగల శక్తివంతమైన సాధనంగా గీతను ఉపయోగించాము. తత్త్వశాస్త్రంయొక్క సత్యం జీవితంలో ఆచరణలో అనుసరించగలిగితే తప్ప, అది కేవలం వట్టి సిద్ధాంతపరమైన విలువను మాత్రమే కలిగి ఉంటుంది. అందువల్ల మేము 'యోగసమన్వయం' లో ఆధ్యాత్మిక స్వీయక్రమశిక్షణలోని వివిధ మార్గాల యొక్క సిద్ధాంతాలు, పద్ధతులపై అవగాహన పొందటానికి, అది మానవుని ఉనికిలో సమగ్ర దివ్యజీవనం సాధ్యపడటానికి ఎలా దారి తీస్తుందో కనుగొనడానికి ప్రయత్నించాము. కాని ఇదంతా వ్యక్తిగతమైన ఆత్మాభివృద్ధి. అందుచేత మొత్తం మానవుల యొక్క సంఘజీవనంలో ఈ ఆదర్శం ఎలా పనిచేయగలదో చూపడం కూడా అవసరమయింది. 'సాంఘికాభివృద్ధికి మానసిక శాస్త్రం' అన్న గ్రంథంలో మానవసంఘ పరిణామంలో ఈ సత్యాలు ఏ విధంగా ఉపయోగపడతాయో సూచించాం. 'ఐడియల్ ఆఫ్ హ్యూమన్ యూనిటి' లో వర్తమానంలో మానవులను మరింత దగ్గరైన ఐక్యతలోకి నడిపిస్తూ, వారి వైఖరిని ప్రశంసిస్తూ, వారు మరింత పటిష్టమైన, వాస్తవమైన ఐక్యతను సాధించడానికి ఏం చేయాలో దాన్ని చూపడానికి ప్రయత్నించాం.

CWSA 13:107-08

అనువాదం: డి. సత్యవాణి

తయారు చెయ్యవలసినది సాధారణ మానవుని కాదు; దివ్యమానవుని

'ఆర్య' పత్రిక ప్రారంభం కాగానే పట్టభద్రులు వారికి కావలసింది 'మానవుని రూప కల్పన' అని లేఖలు వ్రాసారు. ఈ విషయంలో నేను నా వంతు కృషి ఇప్పటికే చేసి యున్నాను. ఎవరైనా దీనిని కొనసాగించవచ్చు. ప్రకృతే ఈ దిశగా ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్నది. ఒక విధంగా మన దేశంలోనే ఇది కొంత ఆలస్యంగా మొదలైనదని అనుకోవచ్చు.

ఇకపై నేను చేపట్టవలసినది 'సాధారణ' మానవులను తయారు చేయటం కాదు, దివ్యమానవులను రూపొందించడం. నొక్కి వక్కాణించేదేమిటంటే ప్రపంచం ఈ దిశగా పరిణామం చెందటానికి ఇప్పటికే సిద్ధపడుతున్నది. ఏ దేశంలో దీన్ని చేపట్టటం జరిగి విజయవంతమైనా అది మానవాళి కంతటికీ మార్గదర్శకత్వం వహించగలదు.

'ఆర్య' పత్రికలో నేను దర్శించిన ఈ నూతన పరిణామం ఏ పునాదులపై నిర్మితమౌతుందో ఉటంకించాను. దీన్ని సాధించటానికి అవసరమైన యోగం కూడా వివరించాను. నా సందేశాన్ని నేను ఇప్పుడు బహిర్గతం చెయ్యలేను. కాని కఠినమైన, ఉదాసీనమైన రీతిలో రచించినందున ఇది సాధారణ బంగ్లా దేశీయులను ఆకర్షించి ఆశ్చర్యపరచేది కాదని మాత్రం చెప్పగలను. ఆకర్షించే అర్థం అందులో ఉంటుంది. అవగాహన చేసుకోగలిగినవారికి స్పష్టంగానే ఉంటుంది.

ఇందులో మూడు ప్రధానాంశాలు ఉంటాయి.

1. ప్రతి వ్యక్తి త్వరలో రానున్న సత్యయుగాన్ని ఆవిష్కరించగల దివ్యమానవునిగా మారే అవకాశం ఉంటుంది.
2. అటువంటి వ్యక్తులే మానవాళిని ముందుకు నడిపించగలరు.
3. మానవాళిని దివ్యజీవనం వైపు ఆకర్షించి వారికి మార్గదర్శకత్వం చేయగలిగినవారు వారే.

ఈ విషయంలో భారతదేశము — అందునా వంగభూమి — అటువంటి శక్తియుక్తులను కలిగి వున్నది. ఏ శక్తి జర్మనీ దేశాన్ని వక్రమార్గంలో నడిపించిందో అదే శక్తి మన దేశాన్ని సక్రమమైన మార్గంలో ఆధ్యాత్మికత దిశగా నడిపించగలదు. ఇందుకు

ముందుగా మనం పాత ఆలోచనా ధోరణులను మార్చుకోవాలి. ఛాందస భావాలకు స్వస్తి పలకాలి. నూతన ప్రపంచం వైపు దృష్టి సారించాలి. కేవలం పాశ్చాత్య నాగరికతను అనుకరించటం వల్లనే ఇది సిద్ధించదు. బౌద్ధ బిక్షువులు, ఆరామాలు దీన్ని సాధించలేవు. చివరకు 'రామకృష్ణా మిషన్' కూడా శంకరాచార్యుని లేక గౌతమ బుద్ధుని మానవతా విలువలకే, నైతికతకే పెద్ద పీట వేసింది. ఇది ప్రపంచపు గమ్యము కాజాలదు.

ఈ నాటి ప్రపంచం అనేక విపత్తులలో ఉన్నది అని గుర్తు చేసుకోవాలి. మనం అడుగులు జాగ్రత్తగా వేయాల్సి ఉంది. బహుశః ప్రపంచ యుద్ధం త్వరలో ముగింపుకు రావచ్చును. ఒకనాటి చలనరాహిత్యం బీటలు వారుతున్నది. లోనున్న చలనశీలత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నది. యుద్ధం కొనసాగినంత కాలం అంతా శృంఖలా బద్ధులమే. మార్పు యుద్ధం ముగిశాకే వస్తుంది. అదే అభివృద్ధికి నాంది. దానికై మనం ఆతృతతో ఎదురు చూద్దాము.

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

మతం కాదు, మత ధర్మం కాదు — ఒక బహుముఖ ఆధ్యాత్మిక భావన, ఒక సమగ్ర అనుభవం

ఆ పత్రికా విలేఖరి మొదటిసారి పొరపాటు పడివుంటాడు. అతను 'ఆర్య' పత్రికను చదువలేదు కనుక అతనికి పంపిన భాగాన్ని ఒక మతధర్మానికి చెందిన అంశంగా అభివర్ణించడం సహజమే. 'ఆర్య' లో మతధర్మమంటూ ఏదీ లేదని నొక్కి చెప్తాను. మతపరమైన ధర్మాన్నిగాని, విశ్వాసాన్నిగాని సమర్థించేది లేక పెంపొందించేది లేదు. ఓ పాత లేక కొత్త మతం యొక్క సూక్తులను ధృడపరిచేది, చాటేది లేదు. ఆ భాగం యొక్క సారాంశాన్ని ఒక పాండిత్య విశిష్టతగా వర్ణించుటతో, అతను గురి తప్పాడు. అందులోని బోధన గ్రంథాల నుండి సేకరించబడలేదు. తాత్విక భాషలో వ్రాయబడినప్పటికీ అయోగ్యమైన ఆలోచనపైగాని లేక లాంఛనపరమైన తర్కంపైగాని ఆధారితమైనది కాదు. అది ఒక మూలాధార ఆధ్యాత్మిక అనుభవము. ఏదైతే అస్తిత్వ అభివృద్ధికి క్రియాత్మకంగా తోడ్పడుతుందో, ముప్పై సంవత్సరాల

నిరంతర సాధనతో స్థిరపరచబడి, విస్తరించబడి, వివరాలతో పొందుపరచబడిందో, దానిని వ్యక్తపరుస్తుంది. అందువలన దానిని సవాలు చేయలేరు. మేధాపరమైన ప్రశ్నలతో గాని, తార్కికంగా కాని చెల్లదని రుజువు చేయలేరు. ఒక వేళ సవాలు చేయాలన్నా గడించిన అనుభవానికన్నా ఉన్నతమైన, విస్తృతమైన ఆధ్యాత్మికానుభవం అవసరం. అంతే గాక అది ఉపనిషత్తుల కాలం నుండి, ప్లటోనియస్, తొలి క్రైస్తవ సన్యాసులు, సూఫీల కాలం నుండి నేటి వరకు యావత్ ప్రపంచంలో వివిధ సాంప్రదాయాలకు చెందిన వందల ఆధ్యాత్మిక అన్వేషకుల అనుభవాలకు (ప్రకటితమైన వానిలో కాదు, వాస్తవంలో) సరితూగుతుంది. అందువలన, దానిని విశ్వం యొక్క సమస్యాత్మకమైన పదబంధపూరణ లాంటి దాని పరిష్కారం కోసం ఆధ్యాత్మికజ్ఞాన సముపార్జనలో ఒక ప్రారంభకుడు చేసే అనుభవశూన్య ప్రయత్నంగా విస్మరించటం అంగీకారయోగ్యం కాదు. అతను ఇచ్చిన వివరణ వలన తేలిందేమిటంటే అతను ఆ భాగంలోని సారాంశాన్ని అసలు అందుకోలేదనీ, ఆ కారణంగా అతనికి ప్రత్యుత్తరం ఇవ్వడం కష్టమయిందని. కారణం, మనసులు కలిసేందుకు ఏకాభిప్రాయం కుదరనప్పుడు, చర్చ ఫలించదు.

CWSA 28:375-76

శ్రీఅరవిందులు

అనువాదం: వి. సునీత శేఖర్

అతని ఆకాంక్ష సంతృప్తి పరచబడుతుంది. అందుగు తగినట్లు అతడు తన అర్హతను పెంచుకుంటే, అతనిని 'ఆర్య' చదవడం, ప్రతి రోజు దానిపై ధ్యానించడం కొనసాగించనీయండి. ధ్యానంలో తప్పనిసరిగా అతడు దృష్టి పెట్టాల్సింది మొదట తన ఆకాంక్షపై: 1. తను చదివే మూలసత్యాలు తన ఎరుకలో ఉన్న అనుభవంలో యదార్థమవాలని 2, ఆధ్యాత్మిక చైతన్యం యొక్క ప్రశాంతత, విశాలత్వం, బలం, శాంతి, వెలుగు, ఆనందముల వైపు తన బుద్ధి తెరచుకోవాలని.

శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

ప్రథమ సంచిక ప్రారంభ వ్యాసం

మానవ ఆశయం

మనిషిలోని దీప్తివంతమైన ఆలోచనల్లో, పూర్వకాలం నుండి ప్రాధాన్యత సంతరించుకున్న అభిప్రాయం, ఒక విధంగా అనివార్యమైనది, అంతిమమైనది — దీర్ఘమైన సందేహాత్మక సమయాలన్నింటిని అధిగమించి నిలబడగలిగేది, వదిలించుకున్నప్పటికీ తిరిగి పునరుత్పన్నమయ్యేది — అతని ఆలోచనాపటిమ అందుకోగలిగినంత ఔన్నత్యాన్ని కూడా కలిగి వుంటుంది. భవిష్యత్తులో, దైవికమైనదేదో సిద్ధిస్తుందనే నమ్మికలోను, పరిపూర్ణత సాధించాలనే ప్రేరణలోను, స్వచ్ఛమైన సత్యం గురించి, శుద్ధమైన పరమానందం గురించి అన్వేషణలోను, గోప్యమైన అమరత్వ స్పృహలోను ఆ అభిప్రాయం స్వయంగా ప్రత్యక్షమవుతుంది. పురాతన మానవ జ్ఞానోదయాలు ఈ నిరంతర ఆకాంక్షకు సాక్షిగా నిలుస్తాయి. సంతృప్తి పొందిన మానవజాతిని మనం చూస్తున్నాము. కాని ప్రకృతి యొక్క బాహ్యలక్షణాల విజయవంతమైన విశ్లేషణ ద్వారా అది సనాతన ఆశయాలను తిరిగి చేరాలనే ప్రయత్నంలో తృప్తి నొందలేదు. జ్ఞానం యొక్క అతి పురాతనమైన లక్షణమే భావికాలంలో సత్ఫలితాన్ని సమకూరుస్తుందనే ఆశకు ఆధారం.

CWSA 22:3-4

శ్రీఅరవిందులు

అనువాదం: రామినేని సుందరరామయ్య

నిద్రాణువై వున్న తత్వజ్ఞుడు మొదట పిలుపుకు బయటికరాలేకపోయాడు (నేను కలకత్తాలో నున్నప్పుడు). కొన్నేళ్ళపాటు పాదిగే ప్రక్రియ కొనసాగిన పిమ్మట, అతను ఒక అగ్నిపర్వత విస్ఫోటనంలా బయల్పడ్డాడు — నేను 'ఆర్య' వ్రాయటం ప్రారంభించగానే.

(CWSA 35:63)

శ్రీఅరవిందులు

'ఆర్య' పత్రిక ద్వితీయ సంవత్సర ప్రచురణకు ప్రణాళిక

ఎప్పుడైతే తన మనుగడకు వినాశకరమైన ఒక మహావిపత్తు (మొదటి ప్రపంచ యుద్ధం) విరుచుకుపడి అధునాతన ప్రపంచాన్ని ఆవరించిందో అదే సమయంలో ఆ నెలలోనే 'ఆర్య' ఆవిర్భవించింది. విషమమైన కష్టాల గుండా పయనించి తన ప్రథమ వత్సరాన్ని గడిపింది. దురదృష్టవశాత్తు గడచిన ఫిబ్రవరి నెల 1915, నుండి దానికి నిర్దేశకులయిన ఎమ్. పాల్ రిచర్డుకు తిరిగి ఫ్రెంచి సైనికదళంలో చేరవలసిందిగా పిలుపు రావటంతో ఫ్రెంచి భాషా ప్రతిని మేము ఆపివేయవలసిన పరిస్థితులు వచ్చాయి. దానికి బదులుగా ఆంగ్ల 'ఆర్య' పత్రికను అంగీకరించిన మా ఫ్రెంచి చందాదారుల సౌజన్యానికి మేము కృతజ్ఞులం.

మొదటి సంవత్సరంలో పత్రికను దాదాపు పూర్తిగా ఉన్నత వేదాంతానికి, తీవ్రమయిన, క్లిష్టమయన ఆలోచనాసరళికి కేటాయించవలసి వచ్చింది. మా దృష్టిలో ఉన్న గమ్యం సిద్ధించినందున యికపై చదువరులను అంత తీవ్రమయిన సుమారు 64 పేజీల కఠోర మేధా పరిశ్రమ, ప్రయాసకు గురి చేసే హక్కు మాకు లేదని భావించటం జరిగింది. అందువలన తదుపరి సంవత్సరం ఎక్కువ భాగం తక్కువ గంభీరమయిన విషయాలకు కేటాయించి, మరింత జనప్రాచుర్యమైన శైలిలో వ్రాయ దలిచాం. 'ఆర్య' దేనికయితే ప్రాతినిధ్యం వహించి, ఏ ఆధారభూతమయిన వివేచన చుట్టూ కేంద్రీకరించబడి ఉంటుందో ఆ మాదిరిగానే ఇందులోని విషయాలు వేదాంత పునః పరిశీలన నిర్వచన పరిధిలోనే ఉంటాయని వేరే చెప్పవలసిన అవసరం లేదు.

దివ్యజీనవం, యోగసమన్వయం, వేదరహస్యం — యివన్నీ మేము కొనసాగిస్తాము. 'సేకరించిన స్తోత్రాల' బదులుగా 'అత్రి స్తోత్రాలు' (ఋగ్వేదపు 5 వ మండలం) అనువదించి ప్రచురిస్తాం. సామాన్య పాఠకులు వ్యాఖ్యానం లేకుండా వేదమంత్రాలను తెలుసుకుని, అవగాహన చేసుకోవాలనే ఉద్దేశంతో యిలా చేయటం జరిగింది. ఫ్రెంచి ప్రతి ప్రచురణ నిలిపివేతకు కారణమయిన పరిస్థితులే 'విశ్వగతులు' ప్రచురణ ఆగిపోవటానికి కూడా కారణమయ్యాయి. సంతోషకరమైన విషయమేమిటంటే రచయిత కేంద్ర ఉద్దేశం తెలిసేంతవరకూ దానిని తీసుకు రాగలిగాం — పునః జీవించిన దివ్యప్రేమతో ప్రపంచపు నూతన సృష్టి అనేది ప్రస్తుత ప్రపంచం అనుభవిస్తున్న భయానకమయిన బాధల మధ్యలో నిలిచిన మానవుడి విశ్వాసానికి తగిన కారణమదే.

ఏది ఉత్తమమైనదో, దేనిని విసిరివేయాలో తెలిసిన దైవసంకల్పం లేకుండా మన పరిమితమయిన దృష్టితో ఆశించే ఏ మానవ కార్యమూ పూర్తి కాదు. ఆ దైవ సంకల్పమే మా శ్రమ ఫలితానికీ, పత్రిక కొనసాగటానికి దోహదం చేస్తుందని విశ్వసిస్తూ 'ఆర్య' పత్రిక మొదటి సంవత్సరాన్ని ముగిస్తూ, రెండవ సంవత్సరం వేగవంతమై మనం కోరుకునే సౌభాగ్యవంతమయిన మహా ప్రపంచపు మార్పును అందిస్తుందనే ఆకాంక్షతో వేచి ఉందాం. కనిపించే దుష్టత్వం నుండి ఎల్లప్పుడూ సాధ్యమయినంత ఎక్కువ మంచిని సాధించే ఆ 'శక్తి' ఈ భయానకమయిన కూలిపోయే పాత ప్రపంచం నుండి ఉన్నత లక్షణాలైన ప్రేమ, జ్ఞానం, ఏకత్వాల విజయంతో ఒక సరికొత్త ప్రపంచాన్ని సృజించి — మానవజాతి తన అంతిమ గమ్యం వైపు ముందడుగు వేసి — మానవులలో ఆత్మ యొక్క చైతన్యమయమయిన ఏకత్వం, దివ్యత్వాన్ని తెస్తుందని ఆశిద్దాం.

CWSA 13: 101-02


శ్రీఅరవిందులు

అనువాదం: డా. సరోజా ప్రసాద్

పదే పదే స్ఫూర్తి తన మెరుపు పాదాలతో
సర్వం వీక్షించగల శిఖరాల నుండి దూతికలా
అతని నిశ్శబ్ద మస్తిష్కపు లోగిలి దాటివచ్చి
నిగూఢ సత్యాల లయబద్ధ అనుభూతిని తెస్తుంది.
మర్త్య స్వరానికి అతీతంగా ఒక గీతం పలికింది
దివ్యానందపు స్వర్ణ కోశం నుండా అన్నట్లు
వెలుగుల సంతోషమో, ఆకస్మిక దర్శనా మోదమో
పరవశించే అమృత మంత్రపు హర్షాతిరేకం
శూన్య పాత్రవంటి అతని హృదయంలోకి ధారలై కురిసింది.

శ్రీఅరవిందులు (సావిత్రి 38 వ పుట)

అనువాదం: సరోజా ప్రసాద్



ద్రష్ట గంభీర హృదయుడు, నిగూఢ రహస్యముల దివ్యప్రభువు, చిమ్ము పరమాత్మ హృదయజనిత అతీంద్రియప్రేమ ఊట, ఏ పాదములు నడయాడని దారులు వారెరుగుదురు. మహా అవధిని లంఘించు మెరుపులవాణులు, వివేకసంద్రాల అగ్నిజ్వాలల-అలలు. స్వర్గతీరాల ముంచెత్తి తడుపునాతని అపరిమేయ ఆత్మ. తలపులు అగ్నిస్ఫోటములు,తొలగించుచు దాటిపోవు మానవాంధకారములు, మహా ప్రకాశగ్రంథ ప్రభవములు దేవతల ధవళ నక్షత్ర-లేఖనములు అవనీతలమందలి నిరాశాదృక్కుల బాలల కివ్వబడిన పుట వెంబడి పుట

CWSA 2:677

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆర్యను వ్రాసిన విధానం

నేను వ్రాయడానికి ఏ పరిశ్రమా చేయలేదు. నేను కేవలం ఉన్నతోన్నతమైన ఆధిపత్య శక్తిని పనిచేయ నిచ్చాను, అది పనిచేయనప్పుడు, నేను ఏ ప్రయత్నాలూ చేయలేదు. పూర్వం మేథస్సుతోటి పనిచేసే రోజులలో కొన్నిసార్లు నేను విషయాల మీద ఒత్తిడి చేసేవాడిని, కాని నేను యోగం ద్వారా పద్యకవిత్వం, వచనకవిత్వం వ్రాయడం అభివృద్ధి చేసిన తరువాత మాత్రం కాదు. నేను ఇది కూడా నీకు గుర్తు చేయాలనుకుంటున్నాను, నేను 'ఆర్య' వ్రాస్తున్నప్పుడూ, నేను ఉత్తరాలు లేదా సమాధానాలు వ్రాస్తున్నప్పుడు కూడా నేనెప్పుడూ ఆలోచించడం లేదా భావాలు వ్యక్తం చేయాలనుకోవడం లేదా మంచిశైలిలో వ్రాయడానికి ప్రయత్నించడం చేయలేదు. అదంతా నిశ్శబ్దమనస్సులో పైనుంచి అప్పటికప్పుడు తయారయి రూపుదిద్దుకుని వచ్చినదానినే వ్రాసేవాడిని. నేను వ్రాసినదానిని సరిదిద్దుతున్నప్పుడు కూడా అంతే, అదీ ఎందువల్ల జరిగేదంటే, ఆ సవరణ అదే పద్ధతిలో రావడం మూలంగానే. అటువంటప్పుడు అల్ప పరిశ్రమకైనా చోటెక్కడుంది లేదా "నేను చేసే గొప్ప పరిశ్రమలకు" సైతం అవకాశం ఎక్కడుంది? అవునా?

దయచేసి నేను చెప్పేదానిని అర్థం చేసుకో, అతిమేథస్సు (కేవలం అతిమనస్సు మాత్రమే కాదు) ఏ బాహ్యప్రేరణా లేకుండా పనిచేసే స్వయంచాలక క్షేత్రం.

CWSA 27:216-17

ఒక ప్రశాంతత లేక నిశ్శబ్దం దన్నుగా నిలవటం కాని లేదా పనిచేయటం కాని చేస్తుంది — అనే విషయం నాకు తెలుసు, అదే నేను పొంది ఉన్నాను — దానికి ఋజువు, పూర్తి నిశ్శబ్దం పొందిన మనస్సు నుంచే నేను నాలుగు నెలలు వందే మాతరం సంపాదకత్వం నెరపాను, 'ఆర్య' లో ఆరున్నర సంపుటాలు వ్రాశాను. ఇక నేను వ్రాసిన ఉత్తరాలు, సందేశాలు మొదలైనవాటిని గురించి చెప్పనే అక్కర లేదు.

CWSA 28:150

నేను 'ఆర్య' లో వ్రాస్తున్నప్పుడు, నేను మనస్సుకు ఊర్ధ్వమనోదృక్పథాన్ని

చేర్చుతూ, దానిని మానసిక పరిభాషలో పెడుతూ వచ్చాను, అందువలననే కొన్ని మారులు తర్కాన్ని ఉపయోగించవలసి వచ్చింది. ఎందువల్లనంటే అటువంటి పనిలో — మేధస్సుకూ, అతిమేధస్సుకూ మధ్యవర్తిత్వం నెరపేటప్పుడు — తర్కానికీ చోటుంది. పూర్తిగా మానసికమగు తాత్త్విక రచనలలో మాదిరిగా దానికి ఉన్నటువంటి ప్రముఖ స్థానం ఇక్కడ అది పొందకపోయినప్పటికీ మాయావాది తనకు తానుగా తన దృక్పథాన్ని ఋజువు చేయాలని లేదా తన అనుభవాన్ని తీవ్రమైనటువంటి తార్కిక నిర్దుష్టతతో చెప్పాలని శ్రమిస్తాడు. మాయను వివరణాత్మకంగా చెప్పబోయినప్పుడు మాత్రం, అతడు ప్రకృతిని పరిశీలించే వైజ్ఞానిక శాస్త్రవేత్త వలెనే, సార్వజనీనమైన మార్మికతను తన భావాలలో కూర్చడం, వ్యవస్థీకరించడం మాత్రం చేయగలడే కాని అంతకు మించి ఏమాత్రం కాదు. అతడు భ్రమాత్మకమైనటువంటి ఆతని మార్మికమగు మాయ ఏ విధంగా లేక ఎందుకు ఉనికిలోకి వచ్చిందో వివరించి చెప్పలేడు. అతడు కేవలం, "నిజమే, కాని అది అక్కడ ఉన్నది" అని మాత్రం చెప్తాడు.

సహజంగానే అది అక్కడ ఉంది. కాని ప్రశ్న ఇది, మొదట, "అది ఏమిటి? వాస్తవానికి అది భ్రాంతిపూర్వకమైన ఆధిపత్యశక్తి తప్ప మరేమీ కాదా లేక దానిని గురించిన మాయావాది భావం తప్పిదమగు దృక్పథమా, అపరిపూర్ణ మానసిక జ్ఞానమా, బహుశా కేవలం దానికదే భ్రాంతియా?". తరువాతి ప్రశ్న, "ఈ భ్రాంతి అనేది దివ్యచైతన్యం లేదా అతిచైతన్యం వశంలోని ఉన్నతోన్నత ఏకైక ఆధిపత్య శక్తియా".

CWSA 35:248

ప్రశ్న: మీరు 'X' ప్రజలు మిమ్మలను తాత్త్వికుడని పిలిచినా మీరెప్పుడూ తత్త్వశాస్త్రమును అభ్యసించలేదని వ్రాశారు. అలా అయినట్లయితే, మీరు 'ఆర్య' లో ఎంత తాత్త్వికతను వ్రాశారో ప్రపంచంలో కల్లా గొప్ప తత్త్వవేత్త కూడా ఆ విధంగా వ్రాస్తాడని ఊహించలేం. నా ఉద్దేశం నవ్య మహాసత్యమును కిందికి తీసుకురావడం గురించి కాదు, కాని దానిని వ్యక్తపరచటంలోని సామర్థ్యం, మేధస్సూ మరియు తర్కంతో హేతుబద్ధంగానూ, వాదనతోనూ తీర్చిదిద్దిన పద్ధతి.

నా తాత్త్వికతలో చాలా తక్కువ తర్కవాదం ఉంది — కేవలం ఊహాత్మకమైన

వాదనతో పూర్తిగా భావాత్మకమైన పదాలతో అతీత భౌతిక విషయాల సైద్ధాంతికుడు తన ముగింపు పర్యవసానాలకు ప్రయత్నించే విధంగా నేను వ్రాసినదానిలో లేదు. అందులో ఉన్న విషయం, సర్వం హేతుబద్ధంగా కలిసి ఐక్యమైపోయే రీతిలో బహుముఖాల విభిన్న జ్ఞానవిభాగాలను సామరస్యపరచడం, కాని అది హేతువాదనా పటిమతో చేయబడలేదు. అదంతా పరస్పర సంబంధాలనూ, క్రమానుగతంగా వచ్చే జ్ఞానాన్నీ స్పష్టంగా దర్శించడం ద్వారా చేయబడింది.

CWSA 35:65-66

శ్రీఅరవిందులు

'ఆర్య' పత్రిక గురించి దిలీప్‌కుమార్ రాయ్ అనే శిష్యునికి శ్రీఅరవిందుల వివరణ

తాత్వికతా! నేను నమ్మకంగా చెప్పేదేమంటే నేను ఎప్పటికీ, ఎప్పటికీ, ఎప్పటికీ తాత్త్వికుడను కాదు — నేను తాత్త్వికతను వ్రాశానంటే దాని కథాకమామిషు వేరే ఉంది. నేను యోగం ఆచరించక ముందు, పాండిచ్చేరి రావడానికి ముందు తత్త్వ శాస్త్రాన్ని గురించి నాకు తెలిసింది చాలా అల్పం — నేను కవిని, రాజకీయవేత్తను, కాని తత్త్వవేత్తను కాదు! నేను దానిని ఏ విధంగా చేయగలిగాను? మొదటగా, రిచర్డ్ తాత్త్విక సమీక్షలో సహకరించమనే ప్రతిపాదన తీసుకువచ్చాడు — నా సిద్ధాంతం ప్రకారం యోగి దేనినైనా చేయగలడు కాబట్టి, నేను దానిని ఏ మాత్రం తిరస్కరించలేకపోయాను: తరువాత అతడు యుద్ధానికి వెళ్ళవలసి వచ్చింది, నన్ను పీకల దాకా కష్టాలలో పడవేశాడు, నెలకు 64 పుటల తాత్త్వికతను సొంతంగా, ఏకాంతంగా నాకు నేనే వ్రాయవలసి వచ్చింది. రెండవ విషయం, నేను పరిశీలించి, ప్రతిదినం యోగాలో తెలుసుకున్నదానిని నేను కేవలం మేధోపరంగా వ్రాయవలసి రావడం, అంతే, ఏ ప్రేరణా లేక స్వయంచలితంగా, అది తాత్త్వికతైపోయింది. కాని అదంతా తత్త్వవేత్తనై కాదు1

CWSA 35:70

శ్రీఅరవిందులు

అనువాదం డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

'ఆర్య' ను అర్థం చేసుకోడంలో కష్టానికి కారణం

'ఆర్య' పై కూడ అదే ఫిర్యాదు ఉన్నది. ప్రజలు దాని నర్థం చేసుకోలేరు... తన చదువుకంత ప్రాధాన్యం, ఆలోచన ఇవ్వాలని ఎవరనుకుంటారు?

ఈ సందర్భంగా, చాలా కాలం నుండి నా పరిశీలనలో ఉన్న ఒకటి రెండు అంశాలు మీకు చెప్పనీయండి. నా నమ్మక మేమంటే, ఇండియా బలహీనతకు ముఖ్యకారణం, దాని అణచివేత, దారిద్ర్యం. ఆధ్యాత్మికత లేక మతధర్మం లోపించడం కాదు. దాని ఆలోచనా శక్తి తగ్గడం; ఎక్కడ జ్ఞానం పుట్టిందో అక్కడ అజ్ఞానం వ్యాపించడమే. ప్రతి చోట నేను చూస్తున్నా, ఆలోచించడానికి ఒక అసమర్థత లేదా అయిష్టతను, ఒక ఆలోచనా-భయాన్ని. మధ్యయుగంలో ఇది సరి కావచ్చు, కాని ఇప్పుడు, ఈ దృక్పథం, ఒక పతనానికి చిహ్నం. మధ్య యుగం ఒక రాత్రి; కాని అది అజ్ఞానానికి ఒక గెలుపు రోజు. ఈ ఆధునిక ప్రపంచంలో జ్ఞానిదే గెలుపు కాలం. ఎవరైతే ఎక్కువ ఆలోచించి, శోధించి, కష్టపడి, లోనికి చొచ్చుకొని, ప్రపంచ సత్యాన్ని నేర్చుకోగలరో వారే పొందుతారు, ఎక్కువ శక్తిని.

మన నాగరికత, వెనుక నిలబడిన నిల్వ నీరులా అయింది. మన మతం, బాహ్య కట్టుబాట్లకు పుట్టినిల్లైంది, మన ఆధ్యాత్మికత, మసకబారిన వెలుగయింది. లేదా మత్తుతరంగం అయింది. ఇలానే విషయాలు కొనసాగితే, ఇండియాకు శాశ్వత విముక్తి అసంభవం.

(*బెంగాలీ రచనలు,* పుటలు 369-71)

బెంగాల్‌కు 'ఆర్య' లో ఏ ప్రత్యేకత కనబడకపోవడం విచారించతగ్గది, కాని ఆశ్చర్యం కాదు. బెంగాల్ మేధస్సు, ఈ రసాయన మాత్రలు ఘాటైన మసాలా దినుసులు వంటి ఆలోచనలతో ఎంత విసిగిపోయిందంటే, గాఢమైనది, సమృద్ధమైనది, ఏదీ దానికి అరుగదు.

అంతే గాక, ఇండియా ప్రజలు, ఒకరిని అనుసరించి చెప్పిన భావాలకు మాత్రమే అలవాటుపడ్డారు. అందరికి పరియం ఉన్న పాతభావాలు, ఆరు తత్త్వశాస్త్రాలు, పతంజలి మొదలైనవారివి. జీవితం గురించి ఏవైనా కొత్త భావాలు, ఆలోచనలు, యోగం, వారి అంచనాలను తారుమారు చేస్తాయి. అవి అర్థం కావు వారికి.

'ఆర్య' లో భావము, పాఠకుని నుండి నిశితమైన ఆలోచనను కోరుతుంది.

అది అతనిని ఆలోచించి అర్థం చేసుకోవడం అనే కష్టం నుండి మినహాయించదు. ప్రజల బుద్ధి చాలా కాలం నుండి అలవాటు పడింది, — ఆలోచన అనే కష్టం నుండి, విడవడి వుండటానికి. ఎలా కాలక్షేపం చేయాలో. బుద్ధిని ఏలా వాడాలో వారు మరిచిపోయారు.

ప్రస్తుతానికి ఎంతవరకైతే ప్రజలు యోగా అభ్యసిస్తూ, చదివి లాభపడ్తారో, అంతవరకు ఏమీ ఫర్వాలేదు. 'ఆర్య' ఒక కొత్త తత్వాన్ని, కొత్త యోగ విధానాన్ని చూపుతుంది. ఏదైన కొత్తది ప్రజలచే వినబడగల్గడానికి కొంత సమయం పడ్తుంది. కాని నిజానికి, ఇదంతా పాతదే, మళ్లీ తేబడింది. ఎంత పాతది అంటే, అంతా మరిచిపోబడింది. ఎవరైతే దీనిని ఆచరించి, అనుభవం పొందుతారో, వారే మొదట దీని నర్థం చేసికోగలరు. ఒక విధంగా, ఇదే మంచిది. ఎందుకంటె, ఇది ఉద్దేశించబడింది ప్రజల జీవితాలను మార్చేందుకు, కేవలం వారి మేధస్సును తృప్తిపర్చేందుకు కాదు.

CWSA 36:224

వ్యక్తిగత సాధన, అనుభవమే పునాదులుగా గల ఒక ఆధ్యాత్మిక తత్త్వశాస్త్రి ధ్యేయ విశదీకరణమే 'ఆర్య'. ఆధ్యాత్మిక విషయాలను అన్ని కోణాల నుండి ఆలోచించని బుద్ధులకు ఇది ఉద్దేశించబడలేదు.

'ఆర్య' ను అర్థం చేసుకుందుకు తప్పనిసరిగా ప్రతివానికి వుండవలసింది,

1. తగినంతగా శిక్షణ పొంది, అభివృద్ధిపర్చబడిన మేధస్సు, లేదా
2. అనుభవాన్ని ఆలోచనలో పెట్టే సమర్థతో కూడిన అనుభవ పునాది.

CWSA 35:86

శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

అమృతకు శ్రీఅరవిందుల మార్గనిర్దేశనం

అమృత మెట్రిక్యులేషన్ పరీక్షకు సమాయత్తమగుచున్నాడు. అతడు 'లైఫ్ డివైన్' అనే గ్రంథానికి నాంది ప్రస్తావన లాంటి 'ఆర్య' మ్యాగజైన్‌లో ప్రచురించిన ప్రథమ వ్యాసాన్ని చూడటం తటస్థించింది. అతడు తనలోనే మందస్వరంలో చదవ నారంభించాడు.

"ఆ వ్యాసాన్ని పదే పదే చదివాను. గొప్ప ఆలోచనలు గొప్ప పదాలలో ఇమిడి వున్నాయి. నా కేమాత్రం అర్థం కాలేదు! అయినా చదవటానికి ఇంపుగా వుంది. మళ్ళీ చదివాను. నేను చదివింది నాలో ఎవరో అర్థం చేసుకుంటున్నట్లుగా అనిపించింది.

చదవటం ఆహ్లాదంగా వుంది. కాని ఏమి అర్థం కావటం లేదు" అని అమృత బిడియపడుతూ చేసిన వ్యాఖ్యానానికి శ్రీఅరివిందుల వారిచ్చిన సమాధానం: "ఒక్కసారే అర్థం చేసుకోవలసిన అవసరం లేదు. చదువుతూపోవటమే. చదవటంలో ఆనందం పొందితే ఆపనవసరం లేదు." అది ఒక మంత్రం. మంత్రశక్తి ఆ రచనలలో నింపబడింది. దాని అర్థం నిర్నిరోధంగా అంతరాత్మ మూలాలకు అందుతుంది.

'మనసు పెట్టి చదవ ప్రయత్నించె
పరిపూర్ణ సత్యం అవగతం కాకున్నా వెలుగుజాడలు కన్పట్టె
అపుడు సత్యశోధనకు అంతరంగంలో నిశ్శబ్దం ఆవరించె
ఆత్మలోని అంతర్వాణిని తాకె
లయబద్ధంగా ఆ పలుకును పదే పదే పలికె
భావం, దర్శనం, అనుభూతి, అర్థం, దైహిక ఆత్మకు
పలుకకనే పట్టువడె
అమితానందం, అమృతత్వమార్పు కలిగె
శ్రోతకు ఆ వాణి పదభంగిమ అర్థమయ్యె
అందలి భావం విదితమయ్యె' I

On The Mother, p. 119
I Savitri p. 375)

కె. ఆర్. శ్రీనివాస అయ్యంగార్
అనువాదం: ఆకుల కృష్ణ

అవసరమైన సంయోజనం

('ఆర్య' ప్రథమ సంచికలోని 'ఈ మాసపు ప్రశ్న')

ప్రశ్న: వర్తమాన కాలానికి అవసరమైన సంయోజనం ఏమిటి?

నిస్పందేహంగా అది మనిషికి చెందినదే. అతని శక్తిసామర్థ్యాల సంయోజనమే అతని ప్రశాంతతకప అనుకూలమైన స్థితి. వాటి మధ్య నున్న పరస్పర భావైక్యత, సహాయ సహకారత ఆతని పరిపూర్ణతా సిద్ధికి తోడ్పడతాయి. వాటి మధ్య సమన్వయ లోపం ఆతని స్వయంవృద్ధిని కుంటుపరుస్తుంది. వాటి మధ్య వైరభావం ఆతని అస్తిత్వ ప్రకృతిలో అలజడిని రేకెత్తిస్తుంది.

వర్తమాన కాలం ప్రత్యేక లక్షణమేమిటంటే, కారణానికి, నమ్మకానికి మధ్య, తార్కికంగా ఆలోచించే మనసుకి అతంర్బుద్ధితో గ్రహించే హృదయానికి మధ్య, వేర్పాటు చోటు చేసుకోవటం. మొదట్లో వాటి మధ్య వైరభావం ఏర్పడటంతో, తీవ్ర అంతరంగ సంఘర్షణ, నమ్మకం వమ్ము కావటం, సంశయం తీరకపోవటం లాంటి గడ్డు సమస్యలు తలెత్తటం. కాని ఇప్పుడు వాటి మధ్య ఏర్పడిన వేర్పాటు విపరీత ధోరణులను సృష్టించింది. వాటి మధ్య పొడసూపిన పరస్పర తిరస్కార భావన మానవ సంపన్నతను హరించి వేసింది. ఒక వైపు వ్యతిరేకాత్మకమైన, వినాశకర మైన తప్పుల నన్వేషించే మానసిక లక్షణం, మరొక వైపు స్వచ్ఛమైన అంతర్బుద్ధికి ఊహాజనిత మానవ వైఖరికి మధ్య స్వాప్నికంగా ఏర్పడిన వ్యతిరేకత సృష్టించిన మేధాపరమైన నిష్ప్రయోజక దురభిమానం, ఇందుకు కారణం.

అయినప్పటికీ, ఒక యదార్థమైన వేర్పాటు సాధ్యపడదు. అంతర్బుద్ధి, విశ్వాసం లేకుండా విజ్ఞానశాస్త్రం అడుగైనా కదలలేదు. అంతే కాదు, నేడు ఆ స్థితి ఒక కల గానే మిగిలిపోయింది. మతం తనను తాను ప్రగాఢ సత్యాల మేధాపరమైన ప్రకటనలతో సమర్థించు కోలేకపోతే — అవి అంత సరిపోకపోయినప్పటికి — క్షణమాత్రమైనా విలువ లేదు. నేడు, మతం తన ప్రచారసాధనాలను ప్రత్యర్థి భాండాగారం నుండి పుచ్చుకోవటం, మనం చూస్తున్నాము. అయితే, మతాల మధ్య పరస్పర అపార్థాలు తొలగిపోయి, జాతికి సమగ్ర స్వయంవృద్ధి యొక్క పూర్వస్థితి సమకూరాలంటే, ఒక ఉన్నతమైన, సఖ్యతను సమకూర్చే విశిష్ట సత్యం యొక్క సరైన సంయోజనం సమకూరాలి.

అనంతరం, ప్రారంభ సూచకంగా, మతపరమైన అభిలాషకు, విజ్ఞానశాస్త్రపరమైన నైపుణ్యతకు మధ్య సంయోజనం కుదరాలి. పర్యవసానంగా కలిగే పురోగతిలో అంతఃసత్త యొక్క సమగ్రత కూడా సమకూరాలి. దివ్యప్రేమ మరియు జ్ఞానం, భక్తుని ఆనందం మరియు బ్రహ్మజ్ఞాని యొక్క దివ్యశాస్త్ర పరిజ్ఞానం మధ్యన ఐక్యత చోటు చేసుకోవాలి. వాటిలోని ఆనంద పారవశ్యత పొందుటలోనో లేక వాటి అన్వేషణలోనో పాటించే కఠోర నియమపాలన వలన తొలగిపోయే లక్షణమున్న జీవిత పరిపూర్ణతను తిరిగి వశపరచుకోవాలి.

హృదయము, మనసు రెండూ ఒకే ఒక సార్వత్రికమైన దివ్యసత్యం. హృదయంలేని మనసుకాని, మనసులేని హృదయంకాని మానవునికి ఆదర్శప్రాయం కాదు. అలాగే ఎలాంటి పరిపూర్ణత అయినా ఫలవంతం కానిదే యదార్థమైనది యోగ్యమైనది కాదు. అంతరంగంలో ఒక సమగ్రమైన దివ్యసంయోజనం చోటు చేసుకోవాలి, అయినా తత్ఫలితంగా ఒక మార్పు చెందిన ప్రపంచం, ఉదాత్తమైన ఆదర్శాలు, సుఖసంతోషాలతో సంతృప్తి నొందిన మానజాతి వర్థిల్లాలి.

CWSA 12:439-40

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

ధ్యానం

('ఆర్య' మూడవ ప్రచురణలో 'ఈ మాసపు ప్రశ్న' కు ఇచ్చిన సమాధానం నుండి సంగ్రహించబడినది)

ధ్యానం వల్ల అవిరామంగా ఏవేవో ఆలోచనలతో తిరుగుతున్న మనస్సుని సరిచేయ వచ్చు — ఒక వ్యాయామ శిక్షకుడిలా తన శక్తులన్నింటిని పొదుపుచేసి తను కోరుకున్న జ్ఞానాన్ని పొందడానికి క్రమశిక్షణతో మెలగడానికి, అపసరమయిన దాని మీద స్థిరంగా నిలిపి ఉంచగలిగే శిక్షణ మాదిరి. సాధారణ జీవితంలో మనుషులిలాగే చేస్తూ ఉంటారు. కాని మనిషి ప్రకృతి ఇంతకంటె ఉన్నత స్థాయిలో పనిచెయ్యడానికి యోగసాధనలో ధ్యానం తోడ్పడుతుంది, దాని సంపూర్ణ సాధ్యతల వరకు తీసుకుపోతుంది. మనస్సు ప్రకాశవంతమై ఒకే వస్తువు మీద ఆలోచన స్థిరపడేలా చేసే యదార్థాన్ని పరిగణనలోకి

తీసుకుంటుంది. తద్వారా సాధారణ చైతన్యంలో ప్రతిక్రియని జాగృతం చేస్తుంది. అది ఆ వస్తువుని గూర్చిన తన జ్ఞానాన్ని దానిలో నింపడం ద్వార మనస్సుని సంతృప్తిపరుస్తూ ముందుకు పోతుంది. లేదా కనీసం దానిలో కేంద్రీకృతమైన లేదా అవసరమయిన సత్యాన్ని తెలియజేస్తుంది. మనం కూడా ఒక శక్తివంతమైన ప్రతిక్రియలో జాగృతమవుతాం. అది మనం దేనిమీద ధ్యానం చేస్తున్నామో దాని మీద ఆధిపత్యం సాధించడానికి, దానిని సృష్టించడానికి, అది మనలో చురుగ్గా పనిచెయ్యడానికి దోహదం చేస్తుంది. ఆ విధంగా మన మనస్సుని దివ్యప్రేమ మీద లగ్నం చేసి, మనం ఆ సూత్రం యొక్క జ్ఞానానికి, దాని ప్రక్రియలకి దగ్గర కాగలుగుతాం, దానితో అనుబంధం పెట్టుకోగలుగుతాం. దాన్ని మనలో సృష్టించుకుంటాం, దాని ధర్మాన్ని హృదయం మీద, ఇంద్రియాల మీద ఆపాదించుకోగలుగుతాం.

CWSA 13:445-46

శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

'ఆర్య' పద వైశిష్ట్యత

('ఆర్య' మాసపత్రిక 2 వ సంచిక నుండి సేకరించిన 'ఆ మాసపు ప్రశ్న')

ప్రశ్న: 'ఆర్య' పేరుకున్న విశిష్టత ఏమిటి?

అనేక దృక్కోణాల నుండి ఈ ప్రశ్నను సంధించారు. చాలామంది యూరపు పాఠకులకు మన మాసపత్రిక అట్టపై, తమ మనోవృత్తిని బట్టి ఆకర్షణీయంగా లేక వికర్షణీయంగా కన్పించే ఈ పేరు ఒక చిత్రకార లిపిగా కన్పించవచ్చు. భారతీయులకు ఆ పదం సుపరిచితమే. కాని వాళ్ళ తాత ముత్తాతలకు ఆ పదంలో కన్పించిన విశిష్టత వీళ్లకు తెలియదు. పాశ్చాత్య భాషాశాస్త్రం దానిని, ఒక జాతిని తెలిపే పదంగా భిన్న ఉహాగానాలు, భిన్న విలువలను తెలుపడాని కవకాశ మిచ్చే, తెలియని ఒక మానవరాశిని తెలిపే సంకేతంగా మార్చివేసింది. భాషాశాస్త్రవేత్తలలో గూడా కొంత మంది ఆ పదాన్ని ఉపయోగించడం మొదలుపెట్టినపుడు, ఒక జాతి భేదాన్ని తెలిపే దానిగా గాక, ఒక సంస్కృతి భేదాన్ని తెలిపే పదంగా ఉపయోగించారని ఇప్పుడు

గుర్తించ మొదలుపెట్టారు. ఎందుచేతనంటే తమకు తాముగా ఆంతరిక, బాహ్య వ్యవహారం, ఆదర్శం, ఆకాంక్షలకు సంబంధించి ఒక ప్రత్యేక సంస్కృతిని స్వీకరించి అనుజీవించినవారు ఆర్యులు అని వేదంలో ఉంది. భగవంతుని స్వభావం వైపు సాగే మర్త్యుల పెనగులాటలో వారికి తోడ్పడే ఆదిభౌతికశక్తులు ఆర్యుల దేవుళ్ళు. ఆదికాలంలో నాటి మానవజాతి ఉన్నత ఆకాంక్ష లన్నింటినీ, దాని ఉదాత్త మతపరమైన ప్రవృత్తి సంతతినీ, దాని అత్యధిక ఆదర్శవంతమైన ఇచ్ఛాశక్తు లన్నింటినీ ఈ ఒక్క పదంలో నిక్షిప్తంచేసారు.

తరువాతి కాలంలో ఒక ప్రత్యేక నైతిక, సాంఘిక ఆదర్శాన్నీ, నియమనిష్ఠల జీవితాన్నీ, నిష్కపట, సౌజన్య, సౌశీల్య, ముక్కుసూటిగా వ్యవహరించే, ధైర్యముగల, సౌమ్యత, పరిశుద్ధత, మానవత్వం, కరుణ, బలహీనుల రక్షణ, ఔదార్యత, సాంఘిక ధర్మాచరణ, జ్ఞానపిపాస, జ్ఞానులు పండితుల యెడల గౌరవం, సాంఘిక విధుల నిర్వహణా సామర్థ్యాలను 'ఆర్య' పదం వ్యక్తం చేసేది. బ్రాహ్మణ, క్షత్రియ, ఉభయుల ఆదర్శం అది. ఈ ఆదర్శం నుండి ప్రక్కదారి పట్టిన ప్రతిదానినీ, నైచ్యత వైపు, హైన్యం వైపు, అజ్ఞానం వైపు, అనాగరికమైనదాని వైపు, క్రూరమైనదాని వైపు లేదా అనృతం వైపు మొగ్గేదానినంతా అనార్యమని చెప్పారు. ఇంతకంటె ఘనచరిత్ర గలిగిన మరో పదమేదీ మానవభాషలో లేదు.

తులనాత్మక భాషాధ్యయనం జరిగిన తొలినాళ్ళలో చరిత్రకు ముందున్న ప్రజల భాషాచరిత్ర, మాటల చరిత్రలో మేధావులు అన్వేషణ జరిపినపుడు, 'ఆర్య' అనే పదం 'అర్' అనే మూలం నుంచి వచ్చిందని భావించారు. 'అర్' అంటే నాగలి, దున్ను. వేదకాలం నాటి ఆర్యులను, వాయవ్య ప్రాంతంలో, వ్యవసాయాన్ని కాదని, పశుకాపరులుగా, వేటగాళ్ళుగా వుండిపోయిన తమ జ్ఞాతుల నుండి విడివడి పోయినపుడు వాళ్ళను అలా వ్యవసాయదారులు లేక నాగలికి, దున్నడానికి సంబంధం కలవాళ్ళు అని తెలియజేయడానికి ఆర్యులు అని పిలిచేవారు. ఈ చాతుర్యమైన ఊహను బలపరచే ఆధారమేదీ లేదు, కాని ఒక అర్థంలో మనం దాని ఉత్పత్తి అర్థాన్ని ఆమోదించవచ్చు. పరమాత్మ, తన కోసమంటూ తయారుచేసి యిచ్చిన, బాహ్య, ఆంతర — బీడుభూమని కాదు, బీజాలు మొలకెత్తని భూమనీ కాదు — సుక్షేత్రం నుండి పూర్తి పంటను పొందడానికి సేద్యం చేస్తాడు, దానివల్ల అతడు ఆర్యుడనబడతాడు.

'ఆర్య' అనే పదం కేవలం జాతిని తెలిపే పదమే అయితే అందులో నుండి బహుశా ఉత్పన్నమయ్యే అర్థం బలం, లేక పరాక్రమం. 'అర్' అంటే పోరాట పటిమ, గ్రీకుల యుద్ధదేవత 'ఆరెస్' అంటే వీరుడు, లేదా యోధుడు, ఒక పక్షాన 'అరెటీ' అంటే గుణవంతుడు, లాటిన్ భాష లోని 'విర్టస్' అర్థాన్ని స్ఫురింప జేసేదిగా, మొదట భౌతిక బలం, ధైర్యం తరువాత నైతిక శక్తి, ఘనతను తెలియజేస్తుంది. ఈ అర్థాన్ని మనం ఒప్పుకోవచ్చు. 'ఉదాత్త, గంభీర ప్రజ్ఞానాన్ని సాధించుకొనడానికి పోరాడుతాం, అందుచేత మమ్మల్ని వీర యోధులని జనం పిలుస్తారు'. ప్రజ్ఞానంలో, అత్యుత్తమమైనదానిని, అత్యుదాత్తమైనదానిని, అత్యంత తేజోమయమైనదానిని, అత్యంత దివ్యమైనదానిని వరించడం, దానిని గూర్చిన జ్ఞానాన్ని పొందడం అనే అర్థం కూడా యీ పదంలో యిమిడి వుంది. అది సమస్త వస్తువుల గూర్చిన జ్ఞానం. అంటే సమస్తంలోనూ సమంగా నివసించ కోరుకున్న విశ్వజనీన దైవం నిమిత్తం, పైకి యెంత నికృష్టంగా కన్పించినా, వికారంగా వున్నా లేదా అజ్ఞానాంధకారంగా ఉన్న అన్నిటి యందు దయ చూపించాలి, అన్నింటిని గౌరవించాలి అన్న జ్ఞానం అని కూడా దానర్థం. కాని యుక్త కర్మకు సంబంధించిన ధర్మాన్ని యెంచుకోవాలి. ఏది దైవత్వాన్ని దాచి వుంచుతున్నదో దాని కంటె, దైవత్వాన్ని వ్యక్తపరచేదానికి ప్రాధాన్యత నివ్వడం అన్న మాట. ఈ యెంపిక ఒక యుద్ధం, ఒక సంఘర్షణే. దాన్ని తేలికగా యెంచుకోలేం, తేలికగా అమలుపరచలేం.

అలా యెన్నుకొన్న వారెవరైనా, దైవం అనే పర్వతం పైకి అంచెలంచెలుగా యెగబ్రాక కాంక్షించే వారెవరైనా, దేనికీ భయపడక, యే ఆటంకంతోనూ లేక వైఫల్యంతోనూ ఆగిపోరు, వారి బుద్ధికి మించి యెంతో విశాలమైనది గావడం వల్ల, ఆ వైశాల్యతను చూచి కుంచించుకుపోరు, తమ ఆత్మశక్తి కన్న యెంతో ఉన్నతమైనది గనుక ఆ ఉన్నతిని చూచి, అది తమ శక్తి, ధైర్యాన్ని కన్న యెంతో గొప్పది గనుక ఆ గొప్పదనానికి వారు కుంచించుకుపోరు. ఎందుచేతనంటే అతడు ఆర్యుడు, దివ్యయోధుడు, విజేత, ఉదాత్త పురుషుడు, అరిస్టోనస్ గీత చెప్పిన శ్రేష్టుడు. బాగా లోతుకు పోయి దాని సహజసిద్ధమైన, ప్రాథమిక అర్థాన్ని గనుక మనం వెలికి తీస్తే, 'ఆర్య' అంటే కృషి, లేదా ఉవ్వెత్తున యెగసిపడడం, అధిగమించడం.

మానవ పురోగతిని, బాహ్యంలోనూ, అంతరంలోనూ వ్యతిరేకించి నిలిచేదాని నంతటితోనూ పోరాడి జయించేవాడు ఆర్యుడు. అతని స్వభావపు ప్రథమ ధర్మం

స్వ ను జయించడం. తన దేహాన్ని, భువిని జయించి మించువాడు ఆర్యుడు. సామాన్య మానవుడిలా వాటి మందకొడితనాన్ని, జడతను, నిర్జీవ నిత్య నైమిత్తికాలను, తామసిక పరిమితులను అంగీకరించనివాడు ఆర్యుడు. ప్రాణాన్ని, ప్రాణ ఊర్జాలను అధిగమించువాడు ఆర్యుడు. వాటి తీవ్ర వాంఛలకు, వేడుకోళ్ళకు, అవి తనపై పెత్తనం చెలాయించడానికి లేదా వాటి రాజసిక ఆదేశాలకు ఊడిగం చేయ నిరాకరించే వాడు ఆర్యుడు. మనస్సును, మనస్సు అలవాట్లను అధిగమించువాడు ఆర్యుడు. అజ్ఞానపు గూటిలో, వారసత్వంగా సంక్రమించిన దురభిమానాలలో, ఆచారాలలో, హాస పరిహాస భావాలలో చిక్కుకొననివాడు ఆర్యుడు. కాని యెలా అన్వేషించి, యెంచుకోవాలో తెలిసి, దృఢమైన, బలమైన సంకల్పంతో వుంటూనే, పెద్దబుద్ధి, సౌమ్యబుద్ధిని కూడా కలిగి వున్నవాడు ఆర్యుడు. ప్రతిదాని యందు సత్యాన్ని, ప్రతిదానియందు ధర్మాన్ని, ప్రతిదానియందు ఔన్నత్యాన్నీ, స్వేచ్ఛను అన్వేషించు వాడు ఆర్యుడు.

స్వ ను జయించడంలో అతని లక్ష్యం ఆత్మ-సిద్ధి. కాబట్టి అతను జయించినదాని నతడు నాశనం చేయడు, కాని దానిని ఉన్నతీకరిస్తాడు, సఫలం చేస్తాడు. తనకు దేహాన్ని, ప్రాణాన్ని, మనస్సును యిచ్చినది యిప్పుడేమై వున్నాయో ఆ స్థితి కంటె ఉన్నత స్థితిని వాటికి కట్టబెట్టడం అతనికి తెలుసు. అందుకని వాటి కలీతంగా పోయి, వాటి నధిగమించి, వాటి పరిమితులను తిరస్కరించి, అవి యివ్వజూపే లేక యిస్తున్న ఆనందాలను తిరస్కరించాలనీ అతనికి తెలుసు. సర్వోన్నతమైనది, ప్రపంచంలో విలువ లేనిదేదో కాదు, ఇచట అధికాధికంగా వ్యక్తమౌతూ — ఒక దైవేచ్ఛ, దైవచేతన, దైవప్రేమ, దైవ ఆనందం, నిమ్నజీవితపు అవధుల ద్వారా తనను తాను, తనపైన స్వీకరించగల పరిసరాలపైన గ్రుమ్మరించుకొంటున్నదని — వ్యక్తం చేసుకొంటున్నదని తెలుసుకొంటాడు. దాని కతడు సేవకుడు, ప్రేమికుడు, అన్వేషి. దానిని పొందినపుడు, దాని నతడు కర్మ, ప్రేమ, ఆనందం, జ్ఞానాలలో మానవజాతిపై గ్రుమ్మరిస్తాడు. ఎందుకనంటే ఆర్యు డెప్పుడూ ఒక యోధుడే, కృషీవలుడే. ఉన్నతోన్నతమైనదానికై అన్వేషించండంలో గాని, లేదా దానిని సేవించ డంలోగాని, యెట్టి మానసిక, దైహిక శ్రమనైనను లెక్కజేయడు. ఏ కష్టాన్నుండి తప్పించుకు పారిపోడు, అలసట పేరుతో పని మానుకోడు. తనలోనూ ప్రపంచంలోనూ

పొందబోయే ఆ సామ్రాజ్యానికై సదా పోరాడుతుంటాడు ఆర్యుడు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు.

ఈ మధ్య తలెత్తిన ఆర్యుల దండయాత్ర సిద్ధాంతం దేనిని ప్రాతిపదికగా చేసుకొని తయారైందో, దానికి సంబంధించి, వేదంలో ఉన్న సూచనలు పరిణామంలో చాలా అల్పమైనవి, పట్టించుకోదగినంతటివి గావు. అటువంటి దురాక్రమణ యేదైనా జరిగిందనే ప్రస్తావన ఎక్కడా లేదు. పెద్దదిగా చేసి చెప్పే ఆర్యులు, అనార్యులు మధ్య ఉన్న భేదవాదం కూడా, జాతిపరమైన భేదంలో కన్నా సంస్కృతీపరమైన భేదంలో ఉన్న ఋజువుల మీద ఆధారపడి తయారైనదే. ఋక్కుల భాష, ఒక ప్రత్యేక ఆరాధనా విధానం — దివ్య వెలుగు, దివ్య వెలుగు శక్తులు, 'సత్యం' సంస్కృతి మీద ఆధారపడిన స్వయంశిక్షణ — లేక ఆధ్యాత్మిక సంస్కృతిని, ఋతం, అమృతం లను ఆర్యులను వేరుచేసి చూపే చిహ్నమని స్పష్టంగా యెత్తి చూపుతుంది. ఏ విధమైన జాతిభేదాన్ని తెలిపే, ఆధారపడదగిన సూచనెక్కడా వేదంలో లేదు.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

'ఆర్య' పత్రికలో ప్రచురితమైన కొన్ని అంశాలపై శ్రీఅరవిందుల వ్యాఖ్యలు

వేదరహస్యము

వేదరహస్యము అనే శీర్షికతో ఋగ్వేదముపై ఒక కొత్త దృక్పథం 'ఆర్య' లో ప్రచురించబడుతున్నది. వేదానికి సరైన అర్థం ఆధ్యాత్మికమైనదనీ, అది చాలా గంభీరమైనది, రహస్యమైనది కాబట్టి దాన్ని ప్రతీకలతో, సంకేతార్థాలతో, రూపా లంకారాలతో, యజ్ఞయాగాదులలో వాడే వివిధ పలుకుబడులతో కప్పబడివున్నదనే దృక్పథంతోనే ఇందులోని అనువాదాలు జరిగాయి. సాధారణ వ్యక్తులకు అది అగ మ్యగోచరంగా ఉన్నప్పటికీ వేదాధ్యాయులకు మాత్రం అది పారదర్శకమై దానిలో దాగిన పరమ సత్యం యొక్క వివిధాంగాలనూ తేటతెల్లం చేస్తుంది. మనం ఆ

ప్రతిరూపాల వెనుక దాగిన ఆధ్యాత్మిక భావార్థాన్ని గమనించాలి. మనం గనుక ఆ దేవతల రహస్య నామాలను, వారి వారి విధులను, ఆ సంకేత పదాల భావాలను, గోవు, అశ్వ, సోమరసం మొదలైనవాటి అర్థాలను, దైత్యులు, రాక్షసుల చేష్టలను వాటి అంతరార్థాలను, అక్కడి ఉపమానాలను, ఇతిహాసాల ఆవశ్యకతలను కను క్కోగలిగితే వేదాల విశిష్టత దాని ప్రాముఖ్యత చాలా వరకు అర్థమవుతుంది. అయితే దాని యదార్థమైన అంతరార్థం సాధన వల్ల ప్రత్యేక జ్ఞానంవల్ల గానీ బోధ పడదు. సాధన లేకుండా కేవలం వేదాలు వల్లె వేసినంతన మాత్రాన ఏమీ తెలియదు. (బెంగాలీ రచనలు, పుట. 42)

దివ్యజీవనము

యదార్థవాద అద్వైతం, మాయావాద అద్వైతం రెండూ సాధ్యమే. 'దివ్యజీవనం' లోని వేదాంతం అటువంటి యదార్థవాద అద్వైతమే. సత్యము అభివ్యక్తమవటమే ప్రపంచం కాబట్టి అదే వాస్తవము. వాస్తవికత అపరిమితము, అనంతము అయిన దైవము. అదే శాశ్వతుడు, దివ్య చైతన్యశక్తి, దివ్యానంద స్వరూపము. భగవంతుడు తన శక్తితో ప్రపంచాన్ని సృష్టించాడు. ఇంకా చెప్పాలంటే తనలోనే ఈ అనంత రూపాన్ని అభివ్యక్తీకరించాడు. కానీ ఈ పదార్థమయ జగత్తులోనో లేక దానికి ఆధారభూతమైనదానిలోనో, అంటే ఆయన తనకు పూర్తి వ్యతిరేకంగా కనబడే అచేత నత్వం, జడత్వం, అసత్తులలోనో గుప్తమై యున్నాడు. దాన్నే మనం నేడు నిశ్చేత నత్వం అంటున్నాము; అదే తన నిశ్చేతన శక్తి నుండి ఈ పదార్థమయ జగత్తును సృష్టి చేసిందని చెప్తున్నాము. అయితే ఇది బాహ్యదృష్టి. రహస్య జ్ఞానం పనిచేయడం వల్లనే ఈ ఏర్పాట్లన్నీ జరిగాయని చివరకు గ్రహిస్తాము. ఒక శూన్య నిశ్చేతనలో గుప్తంగా ఉన్న ఆ దైవమే మొదట పదార్థంగా, తర్వాత జీవముగా, ఆ తర్వాత మనస్సుగా, చివరకు ఆత్మగా ప్రభవించినట్లు తెలుస్తుంది. నిశ్చేతనా శక్తిగా ఉండి సృష్టి జరుపుతున్నట్లు కనబడే ఆ శక్తి నిజానికి భగవంతుడి చైతన్యశక్తే. దాని చైతన్యాంశ పదార్థంలో గుప్తంగా నిబిడీకృతమై క్రమంగా ప్రాణరూపంగా బయల్పడి, తర్వాత ఇంకా ఎక్కువగా మనస్సు రూపంగా, ఆ తర్వాత తన అసలు రూపంతో ఆధ్యాత్మిక చైతన్యంగా నిర్గమించి తుట్టతుదకు అతిమానస చైతన్యంగా ఆవిర్భవించినప్పుడు మనకు ఆ వాస్తవ సత్యం ఎరుక కలిగి దానిలో ప్రవేశించి ఐక్యం పొందగలము.

దీనినే పరిణామక్రమంగా చెప్పుకుంటున్నాము. అది బయటకు జీవపరిణామక్రమంగా కనబడినప్పటికీ నిజానికి చైతన్యము యొక్క పరమాత్మ యొక్క వస్తుగత పరిణామము. ఈ విధంగానే జీవితానందం మూలంలోని జడత్వం నుండి మొదట పరస్పర విరుద్ధాలైన బాధ, సుఖములుగా వెలువడి ఆ తర్వాత ఆత్మానందంగానూ లేక ఉపనిషత్తులలో చెప్పబడే బ్రహ్మానందంగానూ వికసిస్తుంది. 'దివ్యజీవనం' లోని జగత్తును గురించిన వివరణలో ప్రధాన భావంఇదే.

CWSA 35:91

యోగసమన్వయం

మన ఏకాగ్రత ఒక భావాన్ననుసరించి ప్రారంభమవుతుంది. భావం వల్లనే మనోమయ పురుషుడు వ్యక్తీకరణకు అతీతంగా తానే ఆ వ్యక్తపరచిన విషయంగా అయిపోతాడు. అంటే దేనికైతే భావం ఒక ఉపకరణంగా ఉన్నదో అదేగా అయిపోతాడు. ఒక భావంపై ఏకాగ్రత నిలిపినప్పుడు మానసిక అస్తిత్వంగా ఉన్న మనం మన మనస్తత్వానికున్న అడ్డంకులను తెంచుకుని చైతన్యస్థితిలోకి వెడతాము. ఆ చైతన్యస్థితే చైత్యపురుషుని శక్తి, చిదానందము. ఇటువంటి స్థితికి అనుగుణ్యమైన మన భావం దానికి ప్రతీక, దాని చలనం, దాని లయ.

ఆ అధ్యాయము ప్రతి ప్రస్తుతము నా దగ్గర లేదు కానీ ఇక్కడ ఉటంకించిన మాటలను బట్టి అదే ముఖ్యమైన మానసిక భావంగా కనిపిస్తోంది. ఉదాహరణకు, ఉపనిషత్తులలో చెప్పినట్లుగా భగవంతుడు సర్వవ్యాపి అనే భావనపై ఏకాగ్రత నిలిపినప్పుడు ఒక చెట్టును గానీ లేక చుట్టుపట్లనున్న మరి ఏ వస్తువును గానీ చూసినప్పుడు అది పరబ్రహ్మమేననే భావన ఉంటుంది. ఆ చెట్టు గానీ వస్తువు గానీ కేవలం ఆకృతి విశేషమే. ఆ ఏకాగ్రత సరిగా ఉంటే కొంత సమయం గడిచే సరికి ఎవరో ప్రత్యక్షమై ఉన్న భావన, ఒక ఉనికి ఉన్నదనే భావన కలుగుతుంది. అక్కడున్న చెట్టు గానీ, ఇంకో వస్తువు ఆకృతి గానీ ఏదో డొల్లలుగా మిగిలిపోతాయి; ఆ ప్రత్యక్షత మాత్రమే వాస్తవమైనట్లు తోస్తుంది; భావన నశిస్తుంది; దాని స్థానంలో ప్రత్యక్ష దర్శనం ఉండిపోతుంది. ఇక భావనపై ఏకాగ్రత నిలపవలసిన అవసరం లేదు. ప్రగాఢ చైతన్యంతో చూడగలుగుతాడు. ఇక్కడ గమనించవలసిందేమిటంటే

భావనపై దృష్టి కేంద్రీకరించటం అంటే అది కేవలం ఆలోచించటం కాదు, భావనలోని సారాంశముపై అంతర్గతంగా స్థిరపడటం.

CWSA 35:95

ప్రశ్న: 'యోగసమన్వయం' లో నిర్దేశించిన సాధన ఇప్పుడు మన అభ్యాసంలో అనుసరించ వచ్చునా? 'యోగసమన్వయం' చదువుతుంటే 'ది మదర్' పుస్తకంలో చెప్పినదాని కంటే చాలా భిన్నంగా తోస్తుంది.

'యోగసమన్వయం' లో చెప్పిన విధానం అందరి అనుసరణ కోసం చెప్పినది కాదు. అందులో యోగమార్గాన్ని ఏ అంశానికా అంశం వాటి సాధ్యతాసాధ్యలతో వివరించడం జరిగింది. అంతే కాక అవన్నీ ఎక్కడ కలుస్తాయో కూడా వివరంగా ఉంది. దాని వల్ల జ్ఞానమార్గంతో ప్రారంభించినవారు కర్మయోగం, భక్తియోగం కూడా సాధించవచ్చు. అలాగే ఏ మార్గం అవలంభించినప్పటికీ మిగిలినవి సాధించ గలరు. స్వయం పరిపూర్ణత సాధించిన తర్వాత మిగిలినవాటిని ఎలా సమన్వయం చేసుకోవాలో సూచించారు. అయితే ఇది వ్రాయబడలేదు. ఇంక 'ది మదర్', 'లైట్స్ ఆఫ్ యోగ' విషయానికి వస్తే మొత్తం యోగ సాధనను క్రమపద్ధతిగా అను సరించాల్సిన విధానం వివరించాలని వ్రాసినవి కాదు. దానిలో యోగంలోని అనేక విషయాలను స్పృశించి చూపించారు, అంతే.

గీతా వ్యాసములు

ప్రశ్న: ఇక్కడకు వచ్చే ముందర మీ గీతా వ్యాసములు చదివి నా కోపాన్ని నేను సమర్థించుకున్నాను — నాలో ఉగ్ర ప్రవృత్తి వైఖరి అప్పటికే వెలకొని ఉన్నదని చెప్పాలి — నూతన సృష్టిలో అట్టి తీవ్ర వైఖరికి స్థానముంటుందా?

భగవద్గీతలో విస్తృతి పొందిన సాధారణ కర్మయోగాన్ని 'గీతా వ్యాసము' లలో విపులీకరించారు. అందులో అంతర్గతమైన మార్పుతో సాధారణ జీవితంలో పని చేయటం జరుగుతుంది. అక్కడ కూడా ఉగ్రప్రవృత్తి చోటు చేసుకున్నట్లయితే అది వ్యక్తిగతంగా స్వార్థప్రయోజనాల కోసం అహంకారంతో చేసినట్లు కాదు, అది సాంఘిక జీవనంలోని ఒకానొక వ్యవస్థీకృత క్రమశిక్షణలో భాగంగా మాత్రమే

క్రోధావేశంతోనూ, ఉద్రేకంతోనూ లేదా మరి ఏ వ్యక్తిగత కారణంగానూ చేసిన హింసను ఆధ్యాత్మికంగా సమర్థించలేము. మన యోగమార్గంలో మన లక్ష్యం

సాధారణ మానవ జీవితానికి మించి ఉన్నతంగా ఎదగాలనేది కాబట్టి అందులో ఉగ్ర ప్రవృత్తిని పూర్తిగా తోసివేయాలి.

ప్రశ్న: గతంలో మీరు వ్రాసిన గీతావ్యాసములను రెండు మూడుసార్లు చదివాను. కానీ మరోసారి చదువుతున్నప్పుడు అదివరలో చదవని కొత్త విషయాలు చాలా కనిపించాయి. మళ్ళీ మళ్ళీ చదివితే ఇంకా కొత్త విషయాలు తెలుస్తా యనుకుంటాను.

అది సాధారణంగా అందరికీ కలిగే అనుభవమే. పెద్ద విజ్ఞాన గ్రంథాలు చదువుతుంటే కలిగే ప్రభావమే అది. ఇంచుమించు అన్ని ఆధ్యాత్మికమైన సమస్యలనూ చాలా లోతుగా, క్లుప్తంగా అందులో వివరించి విశదీకరించే ప్రయత్నం ఈ గీతావ్యాసములలో చేశాను.

శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

టావో సిద్ధాంతం

(1915 సం. జూన్ 15 'ఆర్య' లో ముద్రితము)

పురాతన కాలానికి చెందిన నిత్యసత్యమైన 'ఏకత' గురించిన ప్రబోధం భారతదేశంలో అతి పూర్వకాలం నుండి విశిష్టమైన ఆదరణ పొంది వున్నది. అజ్ఞానజనిత, అర్థరహిత అస్పష్టతలు, చిన్నచూపులు, వక్రీకరణలు, పరీక్షలు, సవాళ్ళు వలన, ఇతర దేశ దాడులతో కలిగిన పరిణామాల వలన ప్రభావితమైనప్పటికీ, మనుగడ కోసం పడే ప్రయాసలో భాగంగా ఇతర దేశాలన్నీ దానిని విస్మరించినప్పటికీ, లేక కేవలం అధ్యయనార్థం గ్రంథాలయాలకు పరిమితం చేసినప్పటికీ, మన దేశంలో నేటి వరకు అది అనుసరణీయమై వున్నది. అందువలన అది మన దేశ విలక్షణతగా పరిగణిస్తాము. ఇక ఇతరులు కూడా దానిని పాటించినట్లయితే, అది మననుండి నేర్చుకోబడినట్లుగా భావించడం పరిపాటి. అయితే, అన్ని దేశాలు సర్వకాల సర్వావస్థల యందు ఆ పరమ సత్యం యొక్క ప్రామాణ్యతకు సాక్షులు. అలా కాకపోతే అది నిత్యసత్యమైన దిగా నిలువ గలిగేది కాదు. ఒక తాత్కాలిక విశ్వాసంగానో లేక వ్యక్తిగతమైనదిగానో

లేక దేశకాల పరిస్థితుల కనుగుణంగా ఉత్పన్నమైన విలక్షణ ప్రవృత్తిగానో పరిగణింపబడేది. ఏకతా సిద్ధాంతం పై పూర్వకాలం నుండి నేటివరకు సాంప్రదాయ సంస్థలు, బోధకులు ప్రబోధించినవాటి గురించి క్రీస్తు శకానికి ఆరు శతాబ్దాల పూర్వం జీవించిన లావోసే బోధించిన సిద్ధాంతం గురించి, ఒక ఫ్రెంచి రచయిత వ్రాసిన పుస్తకం నుండి, సంక్షిప్తమైనదైనా ఆసక్తిదాయకమైన అంశాలను, అనువదించి ప్రచురిస్తున్నాము. టావో సిద్ధాంతంపై ప్రతిపాదనలు, మరో ఫ్రెంచి రచయిత ప్రచురించిన 'వూవే' అనే పుస్తకంలోనివి. ఒక చైనా తత్వవేత్తకు, ఒక సత్యాన్వేషకుడైన విదేశీయుడికి మధ్య జరిగిన ఊహాజనిత సంభాషణల రూపంలో నున్నవి ఆ పుస్తకం నుండి సంగ్రహించబడినవి.

టావో

టావో అనగా, నిజానికి మీ విదేశీయులు 'దైవం' అని దేనిని పిలుస్తారో అదే కాని వేరొకటి కాదు. టావో అనగా ఏకము. అదే ఆది, అంతము కూడా. అతనిలోనే సమస్తము నిక్షిప్తము, సమస్తము తిరిగి ఆతనినే చేరుకుంటుంది.

టావో నామరహితము. ఎందుకనగా నికరంగా అది ఒకటే. 'వు' అనగా శూన్యం. టావోను క్షుణ్ణంగా గమనించు. నీకు అర్థం కాలేదా? అయితే విను. ఆద్యంతాలు లేని పరమోత్కర్షమైన వాస్తవిక అస్తిత్వం ఒకటి వుంది. అది మన గ్రహణశక్తికి అందదు. అందువలన అది మనకు శూన్యంగా కనిపిస్తుంది. ఏది మనకు అర్థం కాగలదో, ఏది తులనాత్మక వాస్తవికతగా కనిపిస్తుందో, అది నిజానికి ఒక సాదృశ్యమైనది మాత్రమే. నిజానికి అది పరమోత్కర్షమైన వాస్తవిక అస్తిత్వం యొక్క ఫలితమే. ఎందుకనగా సమస్తము వాస్తవిక అస్తిత్వము నుండి ఆవిర్భవించి తిరిగి దానినే చేరుతుంది గనుక. అయితే, మన కనులకు యదార్థమైనవిగా కనిపించే వస్తువులు అసలు యదార్థమయినవి కానే కావు. దేనినైతే మనము అస్తిత్వము అని అంటున్నామో వాస్తవానికి అది అస్తిత్వరహితము. దేనినైతే మనము అస్తిత్వరహితమైనది అంటున్నామో, వాస్తవానికి అది అస్తిత్వం కలిగి వుంటుంది. ఆ విధంగా మన మొక దట్టమైన అంధకారంలో జీవిస్తున్నాము. ఏది మనము వాస్తవమని ఊహిస్తామో అది వాస్తవం కాదు. అయినా కూడా అది వాస్తవికత నుండే ఉత్పన్నమౌతుంది. కారణం, సమస్తమూ వాస్తవమే. అందు మూలంగా అస్తిత్వము, అస్తిత్వరహితము రెండున్నూ

టావోలే. కాని ఈ పదము ఒక మానవ జీవిచే స్పష్టంగా ఉచ్ఛరించబడిన శబ్దం మాత్రమే. అయితే దాని భావం మాటల్లో చెప్ప వీలు కానిది. జ్ఞానేంద్రియాలు పసి గట్టగలిగేవన్నీ, నీ హృదయంలోని కోరికలన్నీ అవాస్తవాలే. టావో స్వర్గానికి, భూతలానికి మూలం. ఒకటి రెండుకు కారకమౌతుంది. రెండు మూడుకు కారకమౌతుంది. మూడు వేల సంఖ్యలకు కారకమౌతుంది. ఆ వేనవేల సంఖ్యలన్నీ తిరిగి ఒకటిలోకి తిరోగమిస్తాయి....

వృక్షాలకు, పుష్పాలకు, పక్షులకు, సముద్రానికి, ఎడారులకు, పర్వతాలకు, వెలుతురు చీకటికి, వేడి చలికి, పగలు రాత్రికి, వేసవి వర్షాకాలానికి, అన్నింటికీ చివరికి నీ ప్రాణానికి కూడా, టావోయే మూలమని నీకు తెలుసు. ఈ భూతలము, సముద్రాలు అనంతకాలంలో కనుమరుగైపోతాయి. మనిషి అజ్ఞానాంధకారం నుండి బయటపడి, చూడటానికి అనువైన వెలుగులో, క్షణమాత్రం ఆనందాన్ననుభవించి కనుమరుగైపోతాడు. కానీ, ఈ పరిణామాలన్నింటిలోనూ స్వయం వ్యక్తమయ్యేది ఆ ఒక్కటే. టావో సర్వాంతర్యామి. అంతరాత్మల లోతుల్లోని అధి ఆత్మ టావో.

పొరపాటు చేయకు. నీవు ఏది చూస్తున్నావో దానిలో టావో వున్నాడు. కాని నీకు ఆ కనిపించే వస్తువులో మాత్రం కాదు. టావో నీ కనులకు కనిపిస్తాడనుకోవద్దు. టావో నీ హృదయంలో సంతోషాన్ని మేల్కొలుపడు. నీవు ఏ విషయం గురించి బాధపడుతున్నావో దానిని గురించి నీ కన్నుల నుండి కన్నీరుని కారనిచ్చేవాడు టావో కాదు. ఎందుకనగా మానసికావేశాలన్నీ మనిషి దృక్పథంపై ఆధారపడి వుంటాయి, అవాస్తవమైనవి.

వూవే

నేను మీతో వూవే గురించి, అక్రమ అధికారాన్ని అడ్డుకోకుండా వుండటాన్ని గురించి, టావో నుండి ప్రభవించినట్లుగా నీలోని మానసిక ప్రేరణచే ప్రచోదితమైన సహజ స్పందనను గురించి ప్రస్తావిస్తాను. టావో సహజ సౌందర్యం లాగా, సముద్రం ఎంత ఉత్సాహంతో పొంగుతుందో, పుష్పం ఎంత ఉల్లాసంగా వికసిస్తుందో, అదే విధంగా మనుషులు కూడా తమ జీవితాన్ని దానంతట దానిని సాగిపోనిచ్చినట్లయితే, మనుషులు నిజమైన మనుషులుగా నిలుస్తారు. ప్రతి మనిషిలోను టావో నుండి ఉత్పన్నమై తిరిగి టావో వద్దకు కొనిపోయే కదలిక పట్ల సుముఖత కనబరచే

లక్షణం వుంటుంది. కాని మనుషులు వారి ఇంద్రియ సంవేదనలతో, ప్రబల మనోవాంఛ లతో గ్రుడ్డివారై పోతున్నారు. ఏకైకమైన దానిని కోరుటలో వారు అనేకాన్ని కోరు తున్నారు. కొన్ని సార్లు వారు వివేకవంతులుగా నుండాలని, మంచివారుగా నుండా లని వాంఛిస్తారు. అయితే అదే అన్నింటిలోకి అతిచెడ్డ లక్షణం.

ఒకే ఒక పరిష్కారమేమిటంటే, ఉత్పన్నమయ్యే మూలానికి తిరిగి చేరటం. టావో మనలోనే వున్నది. టావో విశ్రాంతికి ఆటపట్టు. కేవలం కోరికను పరిత్యజించుట వల్లనే — మంచిగా వుండాలి, జ్ఞానులం కావాలి అనే కోరికతో సహా — మనం దైవికమైన విశ్రాంతిని పొందవచ్చు. ఎవరికైతే టావో అనగా ఏమిటోనన్న అవగాహన కలిగి వుంటారో, వారు చెప్పరు, ఎవరైతే చెప్తారో వారికి టావో గురించి తెలియదు. నేను మీకు టావో ఏమిటో చెప్పను. దానిని తెలుసుకొనడానికి నిన్ను నీవు తీవ్రోద్వేగాల నుండి, ఆపేక్షల నుండి ముక్తం చేసుకొని, ఎలాంటి బాహ్య ప్రేరణలకు ప్రభావితుడవు కాకుండా, జీవితం గడపాలి. అసహజమైన ప్రయత్నాలను విసర్జించాలి. అప్పుడే అది సాధ్యపడుతుంది. ఆకస్మిక భయాందోళనలకు గురి కాకుండా, తీవ్రమైన ప్రయాస లకు లోను కాకుండా, నిండు నడి సముద్రమంత నిశ్చలత గలిగి, టావో దరి చేర డానికి ఉపక్రమించాలి. టావోను తిరిగి చేరాలంటే ఆ విధంగా నుండటం అవసరం. దానిని నీవు తిరిగి చేరుకున్నప్పుడు, అది నీవు తెలుసుకోలేవు. ఎందుకనగా, నీవు స్వయంగా టావో అయిపోతావు గనుక.

*

ఏ మనిషీ టావోను నిర్మూలించలేడు. ఆ అవినాశమైన అంతరాత్మ వెలుగు మన ప్రతి ఒక్కరిలో ప్రకాశిస్తుంటుంది. మనిషిది వక్రబుద్ధి. అది ఎంతో ఘనమైనది, శక్తి వంతమైనదని అనుకోకు. శాశ్వతుడగు టావో మనందరిలోను వసిస్తున్నాడు. ఒక జ్ఞానిలోను, ఒక కవిలోను ఎంత మేరకు వుంటాడో ఒక హంతకునిలోను, ఒక వేశ్యలోను కూడా అంతకు ఏ మాత్రం మినహాయించి వుండడు. ఈ రాతి పైనున్న రెండు ఇసుక రేణువులు ఎలా ఏక రీతిగా వుంటాయో, వారంతా వారి అంతస్తత్వంలో అలా ఏకరీతిగా నుంటారు. ఎవరూ టావో నుండి శాశ్వతంగా బహిష్కరింపబడరు. కారణం, అందరూ స్వయంగా టావోను తమలో నిలుపుకొని వుంటారు గనుక.

వారందరి పాపాలు భ్రమజనితాలు, పొగమంచులా అవాస్తవమైనవి. చెడుగా నుండలేరు. అంతకు మించి మంచిగా కూడా నుండలేరు. ఈ నీటి బిందువు

సముద్రజలాల్లో లీనమవాలని ఎలా ఆరాటపడుతుందో, వారంతా టావో వైపుకి అంత ప్రబలంగా ఆకర్షితులవుతారు. అందుకు కొందరికి మిగతావారికన్నా ఎక్కువ సమయం పట్టవచ్చు. అంతే... టావో మంచి కాదు, చెడు కాదు. టావో పరమ సత్యం.

ఉన్నది టావో ఒక్కటే. అవాస్తవ విషయాల జీవితకాలం కృత్రిమమైన విభిన్న తత్వాలతోను, కృత్రిమమైన సంబంధాలతోను కూడి వుంటుంది. పైగా దానికి స్వతంత్రమైన ఉనికి వుండదు, సరికదా తీవ్ర తప్పిద స్థితికి దారితీస్తుంది. అందువలన, అన్నింటిని మించి మంచిగా నుండాలని కోరకు. అదే విధంగా నిన్ను నీవు దుష్టుడవని కూడా అనుకోకు. వూవే – ప్రయత్నంతో పనిలేనిది. నీలో అంతర్గతమై వున్న దివ్యశక్తితో కొనసాగుతుంది. నీవు ఆ విధంగానే వుండాలి. మంచిగా కాదు చెడ్డగా కాదు, అల్పంగా కాదు అధికంగా కాదు, హీనంగా కాదు గొప్పగా కాదు. అలా వుండగలిగినప్పుడే – సాధారణ భావనలో నీవు నీవుగా నుండే స్థితి ముగిసిపోయినప్పటికీ, నీకు నిజమైన ఉనికి లభిస్తుంది. పైకి కనిపించే బూటకపు వేషాల నుండి, తీవ్రమైన కామనల నుండి, అన్ని కోరికల నుండి విముక్తి పొందినప్పుడు నీకు తెలియకుండానే నీ స్వయం ప్రేరణలతో కొనసాగుతావు. ఈ స్థితి, నీ అంతట నీవు స్వేచ్ఛగా, ఎట్టి ఆటంకం లేకుండా, టావో దిశగా కదలడమనేదే నిజమైన ఏకైక జీవన సూత్రం. మన మీద నున్న చిన్న మబ్బుతెర ఏ మాదిరిగా మాయమౌతుందో, ఈ చలనం కూడా అంత సులువుగా, అంత ఎరుక లేకుండా సంభవిస్తుంది.

*

ఈ జ్ఞాన పిపాసను గురించి మాట్లాడకు. ఎక్కువగా తెలుసుకోవాలని కోరకు. ఎందుకనగా, అలాంటప్పుడు మాత్రమే నీకు అంతర్ దృష్టితో అవగాహన చేసుకోవటం కొద్ది కొద్దిగా సాధ్యపడుతుంది. అసహజమైన ప్రయాసతో చేసే జ్ఞానసముపార్జన నిన్ను టావో నుండి దూరం చేస్తుంది.... ముఖ్యంగా ఆనందం పొందాలనే అత్యాతురత కూడదు. ఏదో దురదృష్టం దాపురించబోతుందని భయపడకు. కారణం, ఈ రెండున్నూ వాస్తవం కావు. టావోను అదృష్టంగానో లేక దురదృష్టంగానో, సంతోషంగానో లేక బాధగానో వర్ణించినట్లయితే, టావో టావో కాదు, ఎందుకనగా టావో ఒక సంపూర్ణత, దానిలో వైరుధ్యాలకు తావుండదు.

ఆ విధంగా మొదటిసారి వూవేగా తయారైనప్పుడు – కటువుగా చెప్పాలంటే ఉనికిని కోల్పోయినప్పుడు – నీ విషయంలో సర్వం సక్రమంగా జరుగుతుంది.

మన ముందర వున్న విశాల సముద్ర మధ్యమంత ప్రశాంతమైన, సహజమైన కదలికలా సునాయసంగా నీ జీవితాన్ని దాట గలుగుతావు. నీ ప్రశాంతతను ఏదీ భంగపరచలేదు. కలలు నీ నిద్రను భంగపరచవు. మేల్కొన్నప్పుడు ఎలాంటి వ్యాకుల తలు తలెత్తవు. నీవు టావోను అన్నింటిలోను చూడగలుగుతావు. ఉనికి వున్న సమ స్తముతో నీవు ఒకటిగా నుండ గలుగుతావు. నీతో నీవు స్వయంగా ఎంత సన్నిహితంగా నుంటావో సమస్త ప్రకృతితో అంత సన్నిహితంగా మెలగ గలుగుతావు. ఒకటి తరువాత ఒకటి చోటు చేసుకునే పగలు రాత్రి, వేసవికాలం వర్షాకాలం, పుట్టుక మరణాలను ప్రశాంతమైన సమర్పణ భావంతో దాటుతూ, ఏదో ఒకనాడు అట్టి పర్యాయా లుండని టావో లోకి ప్రవేశిస్తావు. దేని నుండైతే ఒకప్పుడు పవిత్రుడిగా ప్రభవించావో దానినే — టావోను — అంత పవిత్రంగా తిరిగి చేరుకుంటావు.

ప్రేమ

ప్రేమ అంటే ఏమిటో నీకు తెలియదు. ప్రేమించటమంటే ఏమిటో కూడ నీకు తెలియదు. నేను నీకు చెప్తాను. ప్రేమ టావో యొక్క లయబద్ధమైన హృదయ స్పందన తప్ప వేరొకటి కాదు.

నేను నీకు ఇదివరలో చెప్పాను. నీవు ఉత్పన్నమయింది టావో నుండి అని, నీవు తిరిగి చేరవలసింది టావోనేనని... స్త్రీ తనకై తాను నీ కళ్ళ యెదుట ప్రదర్శించు కుంటుంది.. నీ వనుకుంటావు ఆమెయే లక్ష్యంగా నిన్ను నీ హృదయస్పందన కొనిపోతుందని. కాని ఆమె నీది అయినప్పటికీ, నీవు ఆమె స్పర్శచే పులకరింతలకు లోనైనప్పటికీ, నీలోని హృదయస్పందన శమించలేదనే అనుభూతి కలుగుతుంది. దానిని శమింపచేయాడానికి నీవు ఆ స్పర్శానుభూతిని మించిన స్థితికి చేరాలని తెలుసుకోగలుగుతావు. కావాలంటే దానిని ప్రేమ అని పిలుపు. పేరులో ఏముందిలే? నేను దానిని టావో అంటాను.

స్త్రీ సౌందర్యం కేవలం నిరాకార టావో సౌందర్యం యొక్క అస్పష్ట ప్రతిబింబం. నీలో ఆమె రేకెత్తించే భావోద్రేకం, ఆమె అందచందాల సొబగుల్లో నీకై నీవు పూర్తిగా హత్తుకుపోవాలనే కోరిక.... నన్ను నమ్ము, అది టావో హృదయస్పందన తప్ప వేరొకటి కాదు, అయితే అది నీకు తెలియదు. నీ ఆనందాన్ని ఆడదానిలో ఆశించకు. టావో తనను తాను స్వయంగా నీకు నివేదించుకొనుటయే ఆమెగా ప్రత్యక్షమగుట.

టావో ప్రకటితమయ్యేది ప్రకృతిలోని అతి పవిత్రమైన ఆమె దర్శనీయ రూపంతోనే. ఆమె నీలో రేకెత్తించే శక్తియే టావో యొక్క హృదయస్పందన. అయితే ఆమె తనకు తానుగా నీలాగా ఒక అత్యల్ప జీవి. ఇక ఆమె నీకు ఏ విధంగా ప్రకటితమౌతుందో నీవు కూడా ఆమెకు అలాగే ప్రకటితమవుతావు. ఆ ప్రకటన టావో యొక్క అపరిమితమైన నిరాకార రూప ప్రకటన. ఆ ప్రకటన నీలో కలిగించే ఆనంద పారవశ్యతలో నీ అంతరాత్మ కాంక్షించే విచిత్రమైన, అనిర్వచనీయమైన అనురాగపూర్వక భావన. కేవలం ఆ దివ్య సౌందర్యం తోటి, ఆ దివ్య సౌందర్య మూలం తోటి సంయోగం తప్ప వేరొకటి కాదు. — అనగా టావోతో సంయోగం.

అంతరాత్మ తన ప్రియతముడిని కోల్పోయింది — టావోను. పూర్వం ఆ రెండూ ఏకమై వుండేవి. అంతరాత్మ టావోతో పునస్సంయోగాన్ని కోరుతుంది. టావోతే ఒక సంపూర్ణమైన పునస్సంయోగం — అది ఒక అపరిమితమైన దివ్యప్రేమ కాదా! నీవు పూర్తిగా, నిశ్శేషంగా నీ ప్రియతమునికి, ఆతను నీకు స్వంతమైనట్టి సంపూర్ణ సంయోగం — అంతటి సంపూర్ణ శాశ్వత సంయోగం, పుట్టుకగాని మరణం గాని విడదీయలేనంతటి సంయోగం, ఎంతటి ప్రశాంతమైనది స్వచ్ఛమైనదంటే అది నీలో కామన అనేదానిని అసలు రేకెత్తించనంతటిది. ఎందుకనగా దివ్యమైన ఆనందం సమకూరినందువలన అక్కడ ప్రశాంతత, ఒక పవిత్ర, నిశ్చల, కాంతిమంతమైన ప్రశాంతత, మాత్రమే నెలకొని వున్నది. టావో అంతరాత్మ యొక్క ఏకైకమైన, శాశ్వతమైన, అతి పవిత్రమైన అనంతత్వం, అపారత.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

టావో సిద్ధాంతంపై శ్రీమాత ప్రసంగాలు

(శ్రీమాత ఆశ్రమవాసుల నుద్దేశించి చేసిన రెండు ప్రసంగాలలో 'వూవే' అనే పుస్తకాన్ని (టావో తత్వంపై లావోసే రచించిన నవల) సూచనప్రాయంగా పేర్కొన్నారు. వాటి నుండి సంగ్రహించబడిన అంశాలను క్రింద ప్రచురిస్తున్నాము.)

15 ఆగష్టు, 1956

విశ్వంయొక్క ఉనికికి సంబంధించిన సమస్యకు పరిష్కారం కనుగొనాలనే కోరిక కలిగినప్పుడల్లా మానవునికి అవలంభించ వీలైన వైఖరులు రెండు ఎదురయ్యేవి. క్రియాశీల దృక్పథంతో పరిశీలిస్తే విశ్వం ఉనికిని కలిగి యున్నందున, ఆ ఉనికి యథాతథంగానే వున్నందున, దానిని యథాతథంగానే స్వీకరించుట ఉత్తమమైన పద్ధతి. ఆ పద్ధతి సంతృప్తికరంగా లేనట్లయితే, సరే, దానిని మెరుగుపరచే ప్రయత్నం చేయాలి. అయితే, ఇట్టి క్రియాశీల పద్ధతి నవలంభించినప్పటికీ, సమస్య పరిష్కారం కాదు, అలాగే వుంటుంది. ఏ విధంగా దానిని మెరుగుపరచాలి? అప్పుడు, పరిష్కరించ వీలుగానిదిగా అనిపించే అదే సమస్యను మరోమారు ఎదుర్కోవాలి. అందుకు పరిష్కారం ఇది:

దైవేచ్ఛ — దానికి సాక్షీభూతమైన దైవానుగ్రహం — అది సర్వశక్తి సమన్వితము. ఈ దైవేచ్ఛ, దానిని వ్యక్తపరచే దైవానుగ్రహం అభివ్యక్తం చేసేవి తప్ప వేరొకదాని ఉనికికి వీలులేదు. హేతుబద్ధమైన వైఖరి — ఐది నేను మీకు శుక్రవారాలలో చదివి వినిపించే వూవే అనే చిన్ని పుస్తకంలో ఏది ఉటంకించబడినదో కచ్చితంగా అదే — ఒక పరిపూర్ణ ప్రశాంతత, ఒక సంపూర్ణ సమర్పణ. అన్ని ప్రయత్నాలను, అన్ని వ్యక్తిగత సంకల్పాలను, విసర్జించి తనను తాను దైవసంకల్పానికి అర్పించుకొని, స్వయంగా తన ద్వారా దానిని నిర్వహించ నిచ్చుట.

గుర్తుంచుకో, ఇది అంత సులభసాధ్యం కాదు, కనిపించినంతటి సామాన్యమయింది కాదు. అయినప్పటికీ, ఎవరైనా దీనిని చిత్తశుద్ధితో అవలంభిస్తే, ఒక అంతరంగ ప్రశాంతత, ఒక స్వచ్ఛమైన దివ్యానందం. వెంటనే సిద్ధిస్తుందనుట తథ్యం. నీ జీవితంలో సంభవించే సంఘటనలు ఎంత క్లిష్టమైనప్పటికీ, వాటిపట్ల నీకు సంపూర్ణ ఉదాసీనతను కలుగజేస్తాయి. వ్యక్తిగత ముక్తిని పొందటానికి ఎల్లప్పుడూ

ఈ వైఖరినే సిఫార్సు చేస్తారు. ఈ సందర్భంగా నేను చెప్పే మరో విషయ మేమిటంటే, ఈ చిన్ని పుస్తకంలో ఆ జ్ఞాని తాను పేర్కొన్న సమర్పణా స్థితిని తీవ్రమైన పీడన ప్రభావంతో కల్లోలితమైనప్పటికీ, సరైన క్షణంలో ఉప్పొంగి, సరైన క్షణంలో అణిగిపోయే, నిశ్చల, ప్రశాంత, విస్తారమైన నీలి సముద్రంతో పోల్చాడు — నిజంగా ఇది ఆదర్శప్రాయమైన వర్ణన. అయితే, ఒక క్రియాశీలమైన వాస్తవ దృక్పథంగల మనస్సు వెంటనే అంటుంది, “సరే, మంచిదే, కాని సముద్రంలో గాలివానలు, తీవ్రమైన తుఫానులు, అలల ఆటపోట్లు, తటాల్న ముంపుకు గురి అయ్యే లంకలు కూడా వుంటాయి. బహుశా అది భగవంతుని మరో రకమైన దర్శన విశేషం కావచ్చు, కాని అది శాంతిని సమకూర్చదు. కనీసం అది ఆ జ్ఞాని ప్రతిపాదించిన విధంగా నుండదు. ఆలాంటి పరిస్థితుల్లో వ్యక్తి ప్రశాంతంగా వుండటానికిగాను మరో రకమైన చేతనాస్థితిలో వుండాల్సి వుంటుంది. తనను తాను సముద్రంతో పోల్చుకోకూడదు.” ఆ విధంగా సమస్య పునః ప్రత్యక్షమవుతుంది.


ఈ విషయాన్ని శ్రీఅరవిందులు ‘దివ్యజీవనం’ లో సమూలంగా చర్చించారు. వారంటారు, ప్రగతిశీల పరిణామ సంకేతాలు కచ్చితంగా కనిపిస్తున్నాయని. పరిణామం ఒక లక్ష్యసాధనను ధ్యేయంగా పెట్టుకొని కొనసాగటం సహజం. అది ప్రగతిశీల పరిణామమయినట్లయితే, అదంతా భగవంతుని కృపాకటాక్ష అభివ్యక్తత అనే ఆలోచనను కొనసాగించవచ్చు. అయితే, అదే సమయంలో అంతా ఏ విధంగానైతే వుండాలో ఆ విధంగా నుండదు. ప్రతి విషయం దైవసంకల్పానికి అనుగుణమైనదే కాని ప్రతి విషయం వుండవలసిన విధంగా నుండదు. అలా కాకపోతే, విషయాలకు కదలిక అనేది అసలుండదు.

29 ఆగష్టు, 1956


మీలో అధిక శాతం శుక్రవారాలలో వచ్చేది పూవే పఠనం వినడాని కనుకుంటాను. మీరు విని వుంటే, మీకు గుర్తుంటుంది., ‘తనకు తానుగా’ వుండటం గురించి ఏదో చెప్పబడిందని, తనకు తానుగా జీవించటమంటే నిజజీవితాన్ని నిజమైన జీవితమార్గంలో జీవించుట అని.

లావోసే తనకు తాను అని దేనిని అంటాడో, అది ఇది: ఒక వ్యక్తిగత సంకల్పంతో ప్రేరేపించబడుటకు బదులు — మానసిక, ప్రాణిక భౌతిక సంకల్పం — వ్యక్తి

శ్రీఅరవిందుల టైపు మిషను



శ్రీఅరవిందులు 'ఆర్య' పత్రికను వ్రాయటానికి పై టైపు మిషనును ఉపయోగించారు. ఈ టైపు మిషను విషయము శ్రీమాత ఒక సాధకునికి ఈ క్రింది విధముగా వ్రాసారు.



You seem to forget
that Sri Aurobindo wrote
for so many years the
whole of the Arya in
perfect mental silence
leaving the inspiration
from above to go through
and manifest through his
hands on the typewriter

శ్రీఅరవిందులు పరిపూర్ణ మానసిక నిశ్శబ్దస్థితిలో, ఊర్ధ్వలోకాల స్ఫూర్తిని టైపు మిషను మీద ఉంచిన తన చేతులు ద్వారా అవధరింపచేసి, అనేక సంవత్సరాలు మొత్తం 'ఆర్య' పత్రికను వ్రాసారని నువ్వు మరచిపోయినట్లుగా కనిపిస్తున్నది.

బాహ్య ప్రయత్నానంతటిని ఆపివేసి, చైనీయులు దేనిని టావో అని అంటారో, దేనిని దివ్యత్వాన్ని పోలినదానిగా పరిగణఇస్తారో — లేక దైవం లేక భగవత్ తత్వం, లేక అన్నింటికి ఆదిమూలం లేక సృజనాత్మక పరమ సత్యం, నిజానికి మానవపరమైన దైవం గురించి వున్న సర్వ సంభావ్యతలు, సాధించవలసిన లక్ష్యంగా పరిగణిస్తారో, దాని మార్గదర్శకంతో ప్రేరణ పొందటం. తనకు తానుగా వుండటమంటే ఆలోచనా ప్రక్రియను, వ్యవస్థీకరించుటను, నిర్ణయించుటను ఆపివేసి వ్యక్తిగత సంకల్పంతో సాధించ ప్రయత్నించటం.

నిజమైన 'తనకు తాను' గా వుండటమంటే ఏమిటో మీకు అర్థమవటానికి నేను రెండు ఉదాహరణలు ఇస్తాను. ఒకటి — మీ కందరికి అదేమిటో నిస్సందేజంగా తెలుసు — శ్రీఅరవిందులు 1914 లో 'ఆర్య' రచనలు ఆరంభించిన కాలం నాటిది. వారు వ్రాతపూర్వకంగా నమోదు చేసింది ఒక మానసిక జ్ఞానం కాని మానసికంగా సృష్టించిన విషయంగాని కాదు. వారు వారి మనసును మౌనపరచి, టైపి మిషను ముందు కూర్చున్నపుడు, పైనుండి, ఊర్ధ్వస్తరాల నుండి, వ్రాతపూర్వకంగా నమోదు కావలిసనదంతా సర్వసన్నద్ధమై క్రిందికి దిగి వచ్చింది. కేవలం ఆ టైపు మిషనుపై వారు వారి చేతివ్రేళ్ళను ఆడించితే చాలు, ఆ విషయమంతా నమోదు కాబడేది. ఇలాంటి మౌన మానసిక స్థితి ఏదైతే పదబంధంతో సహా పైనుండి అందిన జ్ఞానసంపదను వ్యాప్తి చెందించిందో, దానినంతా వారు 'ఆర్య' లో వ్రాసారు — నెలకు 64 అచ్చు వేసిన పేజీల ద్వారా. అందువల్లనే వారు చేయగలిగారు. అది మానసికమైన వాక్యనిర్మాణమైనట్లయితే అసలు సాధ్యపడేది కాదు.

సహజంగానే, ఇది అంత సుళువైనది కాదు. అందుకు సర్వసన్నద్ధత అవసరం.

ఇక వ్యక్తి కార్యాచరణ రంగంలోకి దిగితే, అది మరింత కష్టతరమౌతుంది. ఎందుకనగా సాధారణంగా ఎవరైనా హేతుబద్ధంగా వ్యవహరించాలని అనుకున్నట్లయితే, మామూలుగా ఏమి చేయాలనుకుంటున్నారో దానిని గురించి ముందుగానే ఆలోచించి అందుకు ఉపక్రమిచే ముందు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. లేనట్లయితే, వూవేలో ఉటంకించబడిన ప్రేరితాలోచనకు దూరమైన కోరికలు, ప్రవృత్తులతో ఇటు అటు ఊగిసలాడవచ్చు. ఆ కదలికలు కేవలం నిమ్నప్రకృతి ప్రేరితాలతో కార్యాచరణకు పురిగొల్పేవి. అందువలన, ఏ వ్యక్తి అయినా, ఈ కథలో పేర్కొనబడిన చైనా తత్వవేత్త ప్రతిపాదించిన జ్ఞానస్థితిని,

నిస్వార్థ స్థితిని అందుకోగలిగితే తప్ప. దైనందిన కార్యాచరణలో తనకు తానుగా వ్యవహరించుట శ్రేయస్కరం కాదు. కారణం, అస్తవ్యస్తమైన ప్రేరణలకు, ప్రభావాలకు ఆటవస్తువుగా మారే అపాయముంటుంది గనుక.

అటు పిమ్మట పూవేలో పేర్కొనబడినదానితో సామరస్యంగా నుండటానికి, ఏది అవసరమో, ఏది చేయవలసివున్నదో అనే విషయంపై స్పష్టత ఏర్పరుచుకొని, కార్యాచరణలో అతి తీవ్రతనుగాని, అతిశయించిన ఆసక్తినిగాని కనబరచకుండుట ఉత్తమం. ఎందుకనగా అధికాసక్తత చూపటంతో దివ్యచేతన వ్యక్తి ద్వారా స్వయంవ్యక్తమగుటకు అవసరమైన నిశ్చల నీరవత స్థితికి హాని చేకూరుస్తుంది. దీనినంతా ఈ విధంగా సంక్షిప్త పరచవచ్చు:

సమతుల్యత ఆవశ్యకము. తీవ్ర వైరుధ్యాలను జాగ్రత్తగా తప్పించుకొనే మార్గం ఎన్నుకొనుట అనివార్యం. అసహనం నీ పురోభివృద్ధిని ఆపుతుంది, అంతేగాక, నీలోని మాంద్యం నీవు వేసే ప్రతి అడుగుకు అవరోధ మేర్పరుస్తుంది.

CWM 8 265-66, 282-85

అనువాదం అందుగులపాటి కైలాసపతి

'శ్రీఅరబిందో' పేరుపై ఒక వివరణ

'శ్రీఅరబిందో ఘోష్' పేరులో 'శ్రీ' అక్షరం యొక్క విశిష్టతను వివరిస్తూ ప్రప్రథమంగా 'ఆర్య' పత్రికలో , ఒక సందర్భంలో నళినీకాంత గుప్తగారు 30 నవంబరు 1961 లో వ్రాసిన జాబు సారాంశం:

'శ్రీ' అన్న అక్షరం మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న సమస్య గురించి దివ్యమాతకి మీరు వ్రాసిన జాబు ఆమె నాకు చూపించగా అర్థమయింది. ఆ విషయాన్ని గూర్చిన వివరణ ఆమె ఆదేశానుసారం మీకు తెలియజేస్తున్నాను. సరే! సూటిగా స్పష్టంగా తెలియజేస్తాను. 'శ్రీ' అనేది అరబిందో పేరుకి ముందు గౌరవార్థంగా చేర్చినది అని అనుకోవడం పొరపాటు. అది సహజమైన పేరు. మీరనుకున్నది కాదు. 'శ్రీ' అంటే మిస్టర్, ముషియర్ లేక సర్ లాంటిది కాదు. అది పేరులో విడదీయరాని భాగము. 'శ్రీఅరబిందో' అన్నది విభజించలేని పదము. 'శ్రీఅరబిందో'

స్వయంగా తన పేరు కిచ్చిన తుది రూపము. ఆ రూపంలో ఒక మంత్రశక్తి ఇమిడి ఉన్నదని చెప్పగలను.

'శ్రీ' అనేది అనేక భారతీయ, యూరో అమెరికన్ పదాల కంటె కష్టమైన పదం కాదు. నా అభిప్రాయం ప్రకారం సన్నిహిత సూచకంగా గాని లేక మనుషులలో మార్పుకు గాని అట్టి సంబోధన మంచిదనే మిషతో ఓ సగటు యూరోపియన్ లేదా అమెరికన్ స్థాయికి దిగజారటం ఎప్పుడూ ఆరోగ్యవంతం కాదు. అదొక వ్యర్థమైన భ్రమ అని నా అభిప్రాయం. అంతకన్నా సగటు మనిషిని సత్యాన్ని యథాతథంగా ఎదుర్కొనడానికి ఉత్తేజపరిచే ప్రయత్నం చేయడం ఉత్తమం.

నేను మీకు చేసిన హెచ్చరికను దివ్యమాత చూసారు. ఆమె దానికి పూర్తి అంగీకారం తెలియజేసారు.

Reminiscenses, 180-81

నళినీకాంత గుప్త

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

ఆంతరిక శక్తుల విడుదల



అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2014

5/9/2014

ఆంతరిక శక్తుల విడుదల

విషయసూచిక

మనిషి అతిమానవ స్థాయిని అందుకొనుటకు మార్గం తెరుచుకొనేది ఎప్పుడంటే, తాను ఇంతవరకు సాధించినదానితో పాటు తాను గర్వపడుతున్న అహంకారయుతమైన మేధాశక్తితో తాను సంతృప్తి చెందలేదని ధైర్యంగా ప్రకటించగలిగిన నాడు. అంతేగాక తనలో అంతర్గతమై వున్న ఈ మహోన్నత శక్తి ముసుగును తొలగించి దానికి విముక్తి కలిగించటం అతడు ముందుగా నెరవేర్చవలసిన అతి గొప్ప కార్యం. అప్పుడు అతని తత్వచింతన, కళానైపుణ్యత, శాస్త్రపరిజ్ఞానం, నైతికత, సామాజిక ఉనికి, ప్రాణిక పరమైన అన్వేషణలు, మనసు, జీవితం తమ కోసం పరస్పర తీవ్రతతో చేసే కసరత్తులా గాక వాటి శక్తిని మన మానవ ఉనికి లోనికి కొనితేవటానికి ఉపకరిస్తాయి.

(CWM, Vol 2, p. 164)

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

సరియైన వైఖరిలోని శక్తి

సరియైన వైఖరి అంటే ఒక విశ్వాసయుతమైన వైఖరి, ఒక విధేయతాపూర్వకమైన వైఖరి, సమర్పణాయుతమైన వైఖరి.

CWM 7:32

సమస్యకు అత్యుత్తమమైన ఫలితం లభించాలంటే అది ఒక విశిష్టమైన సమస్య అయి ఉండాలి. ఆ విశిష్టత ఒక దేశానిది కావచ్చు లేక ఒక మనిషిది కావచ్చు. అంతా పూర్తిగా వ్యక్తిగత వైఖరి పైన ఆధారపడి ఉంటుంది. కొన్ని పరిణామాలు సంభవించబోతున్నపుడు మీరు సాధ్యమయినంత ఉన్నతమయిన మనోవైఖరిని కలిగి ఉంటే, అంటే మీ చేతనను మీరు అందుకోగలిగినంత ఉత్తమమైన చైతన్యంతో అనుసంధానించ గలిగితే, మీకు అత్యుత్తమమైనదే సంభవిస్తుందనేది ఖాయం. మీరు ఆ చేతనాస్థాయి నుండి ఒక నిమ్నమయిన స్థితికి జారిపోయినపుడు కచ్చితంగా ఉత్తమమయినది జరగదనేది విదితమే. అందుకు అతి సాధారణమయిన కారణం మీరు అత్యుత్తమమైన చేతనలో ఉండకపోవటమే. సరైన దృక్పథం తన తక్షణ ప్రభావంతో ప్రతి సంఘటననూ లాభదాయకంగా మార్చగలిగే శక్తిని కలిగి ఉండటమే కాక ఆ సంఘటనను సైతం మార్చగలిగేదిగా ఉంటుందని నేను గట్టిగా నొక్కి చెప్పగలను.

మీలో ప్రతి ఒక్కరూ మీకు అత్యంత సాధ్యమయినది చేసినపుడు సరైన సహకారం లభించి సత్వరమైన ఫలితాలు సిద్ధిస్తాయి. సరైన వైఖరి యొక్క శక్తిని నిరూపించటానికి నా దగ్గర చాలా నిదర్శనాలున్నాయి.

గుంపులో కేవలం ఒక వ్యక్తి సరైన మనోవైఖరి కలిగి ఉంటే గుంపులోని వారంతా విపత్తు నుండి కాపాడబడతారు. కానీ ఆ వైఖరి శరీరాన్ని తన మానాన తన ప్రతి స్పందనలకు వదిలేసి ఎక్కడో అత్యున్నతమైన శిఖరాలలో ఉండేది కాకూడదు. మీరలా ఎత్తులో నిలిచి 'భగవదేచ్ఛ ఏదో అదే జరగనీ' అని అంటూ ఉంటే మీకు మరణం సంభవించవచ్చు. ఎందుకంటే మీ శరీరం యింకా దివ్యత్వాన్ని పొందలేదు కనుక, అది భయంతో వణుకుతూ ఉంటుంది. అక్కడ కావలసింది, శరీరం సత్యచేతనను

అందుకోగలిగి, ఏమాత్రం భయం లేకుండా దివ్యమైన శాంతితో నిండి ఉండాలి. అపుడే నిజంగా ఏ ప్రమాదం జరగదు.

CWM 154-55

... మీరు ప్రగతి కోసం చేసే ప్రయత్నాన్ని, ప్రగతి కోసం చేసే ప్రయత్నం పట్ల మీకుండే ఆపేక్ష కోసం చెయ్యాలి. ఫలితంతో ప్రమేయం లేకుండా, కేవలం ప్రయత్నం వలన కలిగే ఆనందం, ప్రగతికై వుండే ఆకాంక్ష మాత్రమే తృప్తి నివ్వాలి. నిజానికి జీవితంలో ఎల్లప్పుడూ, అన్ని విషయాల్లోనూ ఫలితం మనకు చెందదు. మనం సరైన వైఖరి నవలంబించాలంటే చాలా యాదృచ్ఛికంగా పని చేయాలి, ఆలోచించాలి, భావించాలి, శ్రమించాలి, అంతే కాని ఫలితాన్ని దృష్టిలో ఉంచుకొని కాదు.

ఫలితం గురించి ఆలోచించగానే మనం బేరసారాలాడటం మొదలు పెడతాం. దానితో మన ప్రయత్నంలోని నిజాయితీని కోల్పోతాం. మీరు ప్రగతి కోసం ప్రయత్నం ఎందుకు చేస్తారంటే, మీలో దాని అవసరాన్ని గుర్తిస్తారు కనుక. మీలో సాధన, ప్రగతుల అవసరం యొక్క వత్తిడికి మీరు లోనవుతారు గనుక.

CWM 9:316

పరివర్తన చెందాలా? వద్దా? అని, ప్రగతికై ప్రయత్నించాలా లేక అలసట చెంది ప్రయత్నం పట్ల ఉదాసీనంగా వుండాలా అని ఊగిసలాడుతున్నంతవరకూ యదార్థమైన వైఖరి కలగదు.

CWM 16:177

ప్రశ్న: సరియైన మానసిక స్థితి అంటే ఏమిటి?

శ్రీమాత: అది విషయంపై ఆధారపడి ఉంటుంది. సరియైన మానసికస్థితి అంటే తనను తాను పరిపూర్ణం చేసుకోవాలనే సంకల్పం లేదా నిశ్చలంగా ఉండాలనే సంకల్పం లేదా... అది పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ప్రతి పరిస్థితిలోనూ ఒక మానసిక స్థితి సరియైనది ఉంటుంది. దానినే మీరు కలిగి ఉండాలి, అది మీరు అంతరంగంలో కలిగి ఉండవలసిన వైఖరి. అది విషయంపై ఆధారపడి ఉంటుంది.

ఉదాహరణకి మీరు శారీరకమైన అసమతుల్య తరంగాన్ని గుర్తించినపుడు,

ఒక అస్వస్థత మిమ్మల్ని సమీపించినపుడు, సరైన మానసికస్థితిలో ఏకాగ్రం కావటమంటే, మీ ఆంతర్యపు నిశ్చలతతో ఏకాగ్రత వహించటం, భగవత్ కృపలో విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగి ఉండటం, శారీరకమయిన సమతుల్యతను, మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలనే సంకల్పాన్ని కలిగి ఉండటం. ఇదే సరైన మానసిక స్థితి. మరొక సందర్భంలో కోపోద్రేకమో, ఆవేశమో బయట నుండి మిమ్మల్ని ఆవహిస్తున్నపుడు, మీరొక అంతరంగ నిశ్చలతలోకి ప్రవేశించాలి, బాహ్యమయిన వాటినుండి విముఖులై, కేవలం ఉన్నత స్తరాల నుండి వచ్చినదానినే వ్యక్తపరచే సంకల్పంతో భగవదేచ్ఛ కెపుడూ విధేయులై ఉండాలి. ఇదే సరైన మానసిక స్థితి. ప్రతి విషయంలోనూ ఆ విధంగానే ఉండాలి.

కానీ ఒక చోట మీరు నిశ్చలత్వం కావాలనుకోవచ్చు, వేరొక చోట శక్తి కావాలనుకోవచ్చు, మరొక చోట ఆరోగ్యం, ఇంకొక చోట బయటి వత్తిడులను తట్టుకోవాలని అనుకోవచ్చు.

మీరలా తికమకపడినపుడు, మీరొక ఎంపిక చేసుకోవలసి వచ్చినపుడు, మీకు ఏది సరైనది అని తెలియనపుడు, మీరు రెండు, మూడు లేదా నాలుగు నిర్ణయాల మధ్య ఎంచుకోవలసి వచ్చినపుడు, వాటిలో ఏది సరైనదో తెలియనపుడు, మీకు వీలయినంతగా మీ చైత్యపురుష సత్తతో మరియు మీలోనే వున్న దివ్య ఉనికితో సంస్పర్శ కలిగి మీ సమస్యను చైత్యపురుష చేతనకు నివేదించి, దైవేచ్ఛకు అనుగుణంగా నుండే సరియైన వెలుగుకై నిర్ణయానికై అర్థించాలి, దానిని విని తద్వారా స్ఫూర్తిని పొందటానికి ప్రయత్నించాలి. ప్రతి విషయంలోనూ అదే సరైన వైఖరి.

CWM 6:340-41

ప్రశ్న: శ్రీమాతా, ఈ క్రీడోత్సవాలు, పోటీలు మన ప్రగతికి ఆవశ్యకమా?

శ్రీమాత: నైతిక విద్యాపరంగా చూస్తే అవి అత్యంత ఆవశ్యకమనే చెప్పాలి. ఒక వ్యక్తి సరైన దృక్పథంతో క్రీడలలో పాల్గొనటం వలన అది అహాన్ని అధిగమించటానికొక మహదవకాశం కాగలదు. తమ బలహీనతలను నిమ్న లక్షణాలను అధిగమించకుండా ఆటలాడటం వలన క్రీడల ద్వారా ఒక వ్యక్తి లబ్దిని పొందలేడు. దాని వలన మంచి ఏమీ జరగదు. కానీ సరైన వైఖరితో ఆడగలిగినపుడు — నిమ్నమైన భావనలు వదిలి — అసూయ, తృష్ణ లేకుండా సత్క్రీడా స్ఫూర్తితో ఉంటూ, తనకు సాధ్యమయి

నంత నేర్పుతో ఆడుతూ ఫలితాన్ని ఆశించకుండా ఉన్నట్లయితే; అత్యుత్తమమయిన ప్రయత్నం చేస్తూ విజయం సాధించలేనపుడు, పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు, నీరుగారిపోకుండా తలక్రిందులు కాకుండూ ఉండగలిగితే, అపుడు క్రీడలు ఎంతో ఉపయోగకరం. ఈ క్రీడలు, పోటీల వలన మరింత మహోన్నతమైన ఆత్మనిగ్రహంతో, ఫలితాలకు అతీతంగా బయటకు రావచ్చు. అది ఒక అసాధారణమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవటానికి ఉపకరిస్తుంది. సహజంగా సామాన్యమయిన పద్ధతిలో మామూలు ప్రతిస్పందనలతో, అసహ్యాకరమైన రీతిలో ఆడినట్లయితే అది ఏ విధంగానూ ఉపయోగ పడదు. వ్యక్తి ఏ కార్యం చేసినా ఇదే వర్తిస్తుంది — అది క్రీడారంగం కావచ్చు, మేధాపరమైనదైనా కావచ్చు. ఎక్కడైనా ఒక వ్యక్తి సాధారణ పద్ధతిలో ప్రవర్తిస్తే అతను తన సమయాన్ని వృథా చేసుకున్నట్లే

కానీ ఈ క్రీడోత్సవ పోటీలలో పాల్గొనేటపుడు సరైన దృక్పథాన్ని కలిగి ఉన్నట్ల యితే అది చాలా ఉత్తమమైన విద్యాభ్యాస మవుతుంది. ఎందుకంటే అది మిమ్మల్ని విశిష్టమయిన ప్రయత్నం చేయటానికి ప్రేరేపించి, మీ సాధారణ హద్దులను కొంత అతిక్రమించటానికి దోహదం చేస్తుంది. తప్పకుండా క్రీడలు మీలో అచేతనంగా ఉండే ఎన్నో కదలికలను చైతన్యవంతం చేసే ఒక అమూల్యమైన అవకాశం.

సహజంగానే క్రీడలు ప్రగతికొక సాధనమూ, ఒక మహదావకాశమనే విషయాన్ని విస్మరించ కూడదు. మీరు మామూలు పద్ధతిలో ఆడటమన్నది మీ సమయాన్ని వృథా చేసుకోవటమే అవుతుంది. ఇదే అన్నిటికీ వర్తిస్తుంది. కేవలం క్రీడలకే కాదు, చదువైనా, మరే విషయమైనా సరే. ప్రతిదీ ఎల్లపుడూ మనం ఏ విధమయినా పద్ధతిలో చేస్తున్నామనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఏమి చేస్తున్నామనే దానికన్నా ఏ స్ఫూర్తితో చేస్తున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది.

CWM 9: 97-98

దివ్యచైతన్యం మానవ పద్ధతిలో పనిచేయదు. మీ కాఫీలో ఎంత చక్కెర వేసుకోవాలనేది అది నిర్ణయించదు. అది మిమ్మల్ని క్రమంగా పనులలో, విషయాలలో సరైన వైఖరిలో ఉంచుతుంది. సమర్పణా భావం, మృదుత్వం, ఆరోహణ, ఆకాంక్ష, సహృదయత, నమనీయత, ప్రగతికై పరిశ్రమించటం — మీరు క్షణ క్షణం తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలకన్నా యిది గణనీయమైనది. సత్యానుసారంగా చేయవలసినదేదో తెలుసు

కోవటానికి ప్రయత్నించాలి. కానీ ఈ విషయాలు మానసికమయిన తర్జనబర్జనలతోనో లేదా మానసికమయిన సమస్యలుగానో వీటిని పరిష్కరించలేము. ఒక సామరస్యమయిన వాతావరణాన్ని సృజించగల అంతరంగ వైఖరి వలన ఒక ప్రగతిశీలమైన సామరస్యత — దేనిలో అయితే చేసే ప్రతి పని ఆ పరిస్థితులలో అత్యుత్తమమైనదిగా చేయగలిగే టట్టు ఉంటుందో — అది. అందుకు ఆదర్శం బాహ్యమయిన హేతువుతో నిర్దేశించబడినది కాదు, అప్రయత్నంగా జరిగే పనికి వలసిన పరిపూర్ణమైన వైఖరి. అటువంటి ఆదర్శం కోసమే ఆకాంక్షించాలి. కొంతకాలం తర్వాత అది సిద్ధిస్తుంది.

అంతవరకూ సరియైన వైఖరినీ, సత్యమైన ఆకాంక్షను కలిగి ఉండేటట్లు జాగ్రత్త వహించాలి. అది జిమ్నాస్టిక్ మార్చింగ్ కు వెళ్ళాలా? లేక మరొక క్లాసుకు వెళ్ళాలా? అని నిర్ణయించుకోవటం కన్నా ముఖ్యం. ఎందుకంటే ఈ విషయాలు స్వయంగా ఏ విధమయిన ప్రాముఖ్యతను కలిగి ఉండవు, కేవలం సాపేక్షమయిన ప్రాముఖ్యతను మాత్రమే కలిగి ఉంటాయి. ముఖ్యమైన విషయ మేమిటంటే మీ ఆకాంక్షలో సత్యమైన అవగాహనను, ప్రగతి కోసం సజీవమైన సంకల్పాన్ని కలిగి ఉండటం.

CWM 9: 30-31

శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

సరైన దృక్పథంతో చేసినదెపుడూ సరైనదిగానే ఉంటుంది.

మీకు తటస్థించే దేనినయినా మీరు సరైన వైఖరితో తీసుకున్నపుడు, అది అత్యుత్తమమైనదిగా పరిణమిస్తుంది.

CWM 15: 226-27

శ్రీమాత

ఏకాగ్రతలోని శక్తి

ప్రశ్న: ఏకాగ్రత అంటే ఏమిటి?

అది చెల్లాచెదరుగా ఉన్నటువంటి చైతన్యదారాల నన్నింటిని, ఒకే ఒక్క బిందువు మీదకు, ఒకే ఒక్క భావం మీదకు తీసుకురావడం. ఎవరైతే శ్రద్ధతో మనసును పరిపూర్ణంగా అభిముఖం చేయగలుగుతారో, వారు ఏ కార్యం చేపట్టినా సఫలు లవుతారు; వారు త్వరితగతిని పురోభివృద్ధిని పొందుతారు. కండరాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తామో కచ్చితంగా అదే విధంగా ఈ విధమైన ఏకాగ్రతను అభివృద్ధి చేయవచ్చు; ఎవరికి వారు భిన్న మైన క్రియారీతులను, భిన్న మైన శిక్షణా పద్ధతులను అనుసరించవచ్చును. ఉదాహరణకు, ఈ రోజులలో అత్యంత దయనీయ పరిస్థితులలో నున్న బలహీనులు సైతం తక్కినవారు ఎంత ధృడంగా ఉన్నారో అంతగా తయారు కావచ్చు, కాని వారి ఇచ్ఛ మైనం దీపంవలె కంపించిపోతూ మట్టుకు ఉండకూడదు

ఇచ్ఛను, ఏకాగ్రతను తప్పక అలవరచుకోవాలి; అదంతా అనుసరించే పద్ధతి, క్రమబద్ధమైన అభ్యాసం మీద ఆధారపడి ఉంటుంది. నీకు చేయాలనే బలమైన ఇచ్ఛ ఉంటే తప్పక చేయగలవు.

కాని "దాని వల్ల ఉపయోగమేమిటి" అనే ఆలోచనతో ఇచ్ఛను బలహీనపరచే ప్రశ్న మట్టుకు ఎంత మాత్రమూ తలెత్తకూడదు. ఒక వ్యక్తి నిర్దిష్టమైన ఒక లక్షణంతో జన్మిస్తాడనే భావనతో, అతడు ఆ విషయంగా దానికై ఏమీ చేయలేడు అని అనడం బుద్ధి హీనత

CWM 4:5

ఏకాగ్రతను హృదయంలో గావించు. దాని లోనికి ప్రవేశించు; నీ లోపలికి, అట్టడుగుకు, దూరంగా, నీవు వెళ్ళగలిగినంత దూరంగా వెళ్ళు. విస్తారంగా పరచుకుని ఉన్న నీ చైతన్యపు పోగుల నన్నింటిని ఒక చోట పోగు చేయి, వాటి నన్నింటిని చుట్టుచుట్టి, ఒక్కసారి దూకి, మునిగిపో.

హృదయంలోని గాఢమైన నిశ్చలతలో ఒక అగ్ని ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. అది నీ లోని దైవత్వం — నీ నిజమైన అస్తిత్వం. దాని వాణిని విను, దాని ఆదేశాలను ఔదలదాల్చు.

ఏకాగ్రతకు ఇతర కేంద్రాలు కూడా ఉన్నాయి, ఉదాహరణకు, ఒకటి శిరస్సు మీద, మరి యొకటి కనుబొమల మధ్య. దేని సామర్థ్యం దానిదే. అవి నీకు వాటి వాటి ప్రత్యేకమైన ఫలితాల నిస్తాయి, కాని అస్తిత్వ కేంద్రం హృదయంలో ఉంటుంది. హృదయంలో నుంచి అన్ని గమనాలు బయలుదేరుతాయి — క్రియాశీలమైనదంతా, పరివర్తనకు ప్రేరేపించేది, సాక్షాత్కారం చేసుకోగలిగిన శక్తి.

CWM 3:1

ఒక సమస్యను పరిష్కరించాలన్నా, ఒక పాఠం నేర్వాలన్నా చాలా ఎక్కువ ఏకాగ్రత, శ్రద్ధ అవసరం అవుతాయి. ఆ విషయం ప్రతివారికీ తెలుసు — మేధస్సును శ్రద్ధతో అభిముఖం చేయడంతో పాటుగా ఏగాగ్రత వహించటం. కాని ఏకాగ్రత కేవలం మేధోవ్యాసంగం మాత్రమే కాదు, దానిని అస్తిత్వపు అన్ని కార్యకలాపాలలో కనుగొనవచ్చు, శారీరక సంబంధమైన కార్యకలాపాలలో కూడా. నరాల మీద ఎటువంటి నియంత్రణ ఉంచవచ్చునంటే, అది నీవు చేసే పని మీద పూర్తి ఏకాగ్రతను కుదురుస్తుంది. కేవలం అటువంటి తీవ్రమైన ఏకాగ్రత ద్వారానే, నీవు బాహ్యస్పర్శలకు తక్షణం జవాబును పొందగలుగుతావు. ఈ ఏకాగ్రతను పొందడానికి ఎరుకతో నీవు నీ శక్తులను నియంత్రించవలసిన ఆవశ్యకత ఉంది.

CWM 4:4

ఋజుపద్ధతిలో ఐక్యతతో కలిసి చేసిన ఏకాగ్రత గొప్ప శక్తి కాగలదు. ప్రాచీనకాలపు మాట ఒకటుంది, చిత్తశుద్ధితో పన్నెండుమంది తమ ఇచ్ఛను, తమ ఆకాంక్షను ఒకటిగా చేసి, దైవాన్ని పిలిస్తే, దైవం తప్పనిసరిగా అభివ్యక్తమై తీరుతాడు. కాని ఇచ్ఛ ఒక్క విషయం మీదనే కేంద్రీకృతమై ఉండాలి, ఆకాంక్ష చిత్తశుద్ధితో కూడి ఉండాలి. ఈ విధంగా ప్రయత్నం చేసేవారు జడత్వంలోనూ లేదా కేవలం పొరపాటు లోనూ లేదా వక్రీకరించిన కోరికతో కూడా ఒకటిగా అవగలుగుతారు. అయితే దాని ఫలితం గొప్ప విపత్తుకు దారితీసే అవకాశం ఉంది.

CWM 3:98

ప్రశ్న: ధ్యానానికీ, ఏకాగ్రతకూ మధ్య తేడా ఏమిటి?

ధ్యానమనేది పూర్తిగా మానసికమైన క్రియాకలాపం, అది కేవలం మానసిక అస్తిత్వానికి ఇష్టమైనదిగా ఉంటుంది. ధ్యానం చేస్తూ కూడా ఒక వ్యక్తి ఏకాగ్రం చేయవచ్చు: కాని ఇది మానసికమైన ఏకాగ్రత; ఒక వ్యక్తి నిశ్శబ్దాన్ని పొందవచ్చు, కాని అది పూర్తిగా మానసిక నిశ్శబ్దత, అప్పుడు ఇతర శరీర భాగాలు కదలకుండా, అచేతనంగా ఉంచబడతాయి, దాని వలన ధ్యానానికి విఘాతం కలుగదు. నీవు రోజులో ఓ ఇరవై గంటలు ధ్యానంలో గడపవచ్చు. కాని తక్కిన నాలుగు గంటలు నీవు పూర్తిగా సాధారణ వ్యక్తివి, ఎందువల్లనంటే కేవలం మనస్సు మాత్రమే దానిలో నిమగ్నమై ఉంది — దానిని అస్థిరపరచకుండా ప్రాణికమూ, భౌతికమూ అయినటువంటి తక్కిన అస్తిత్వమంతటినీ తొక్కిపెట్టడం జరిగింది. ఆ ధ్యానంలో అస్తిత్వంలోని ఇతర భాగాలకు సూటిగా ఏమీ చేయడం జరగదు.

ఈ విధమైన అప్రత్యక్ష చర్య వల్ల కచ్చితంగా కొంత ప్రభావం ఉండగలదు, కాని... నేను నా జీవితంలో చాలామందినే చూశాను, వారు ధ్యానంలో చెప్పుకోదగ్గ సామర్థ్యం కలిగినవారు, ధ్యానంలో లేని సమయంలో వారు పూర్తిగా సాధారణ మనుషులు, వారు ఇంకా ఒక్కొక్కప్పుడు అసభ్య ప్రవర్తనను కూడా కలిగి ఉంటారు, వారిని గనక ధ్యానంలో అస్థిరపరచడం జరిగితే ప్రచండ కోపావేశులవుతారు. ఎందువల్లనంటే వారు కేవలం మనస్సును స్వాధీనం చేసుకున్నారు, తక్కిన అస్తిత్వాన్ని మట్టుకు కాదు.

ఏకాగ్రత అధిక శక్తివంతమైన క్రియాశీల స్థితి. నీవు మానసికంగా ఏకాగ్రత వహించవచ్చు. నీవు ప్రాణికంగా, చైత్యపరంగా, భౌతికంగా ఏకాగ్రతను వహించవచ్చు, నీవు సమగ్రంగానూ ఏకాగ్రత వహించవచ్చు. ఏకాగ్రతతో కూడి ఉండటం లేదా ఒక బిందువు మీద తనను తాను కూడగట్టుకునే సామర్థ్యం, ధ్యానం కంటే కష్టమైనది. నీవు అస్తిత్వంలో లేక చైతన్యంలో కొంత భాగాన్ని ఒకటిగా కలిపి కూడగట్టవచ్చు లేక మొత్తం నీ చైతన్యాన్ని కలిపి కూడగట్టవచ్చు లేక దానిలో కొన్ని ముక్కలనైనా; ఆ విధంగా, ఏకాగ్రత పాక్షికమూ, సంపూర్ణము లేదా సమగ్రము అవగలుగుతుంది. ప్రతి సందర్భంలోనూ ఫలితం వేరుగా ఉంటుంది.

నీకు ఏకాగ్రం చేయగలిగిన సామర్థ్యం ఉంటే, నీ ధ్యానం చాలా కుతూహలంగాను, తేలికగానూ ఉంటుంది. కాని ఏకాగ్రత లేకుండానే ఎవరైనా ఒక వ్యక్తి ధ్యానం చేయవచ్చు, అధిక శాతం ధ్యానంలో తమ భావాలను వరుసగా

గొలుసుకట్టుగా అనుసరిస్తూ ఉండవచ్చు — అధి ధ్యానం అవుతుంది కాని ఏకాగ్రత కాదు.

CWM 4:7-8

ప్రశ్న: ఒక్కొక్కప్పుడు మనం ఒక విషయం మీద దృష్టిని నిలుపుతాం, ఆ క్షణంలో సమస్తం మరచిపోతాం, ఒక వేళ ఏదైనా గందరగోళ ధ్వని సంభవిస్తే మాత్రం కలత చెందుతాం, ఆ స్థితి ఏమిటి?

అమ్మ: ఏకాగ్రత! అదే ఏకాగ్రతకు అసలైన సూత్రం. నీవు అప్పటికప్పుడు ఒక్కసారిగా దానిని చేయగలవా?

సమా: చేయగలను, చాలా మార్లు.

అమ్మ: అవునా, అది చాలా మంచి విషయం!

సమా: అయినాకాని, ప్రియమైన మాతా, నేను ఆ క్షణంలో ఆలోచించినదానిని ఒడిసి పట్టుకోలేకపోతున్నాను.

అమ్మ: ఆహా,... నీవు హఠాత్తుగా దాని నుంచి బయటకు లాగబడితే ఆ ఆలోచన అదృశ్యం అవుతున్నదన్న మాట?

సమా: అవును.

అమ్మ: అది ఎందువల్లనంటే, నీవు సాధారణ స్థితి కంటె ఒక విధమైన చైతన్యస్థితిలోకి ప్రవేశిస్తున్నావు. బహుశా ఆ రెండింటి మధ్య లంకె ఏర్పరచబడలేదు. దానికి సమయం పడుతుంది. అది ఎటువంటిదంటే ధ్యానం చేసే వ్యక్తి వాటి మధ్య ఒక వంతెనను నిర్మించవలసి ఉంటుంది. లేని పక్షంలో, అతడు ఒక వైపుకో, మరియొక వైపుకో హఠాత్తుగా దూకడం జరిగి, ఆ దూకడంలో అక్కడ ఉన్నదానిని మరచిపోతాడు. అతడు అక్కడే తన అనుభవాన్ని వదలివేస్తాడు. కాని అది పద్ధతి ప్రకారం చేయడం జరిగితే, అనగా నీ సాధారణ స్థితికి చైతన్యస్థితికి మధ్య సంబంధం నెలకొల్పడానికి గాని, ప్రతిరోజు నియమబద్ధంగా పది లేక పదిహేను నిమిషాలు కేటాయించగలుగుతూ, ఆ విధంగా చేస్తూ ఉంటే, కొంతకాలం తరువాత అతడు సఫలీకృతుడౌతాడు, అప్పుడతడు దానిని గుర్తుంచుకో గలుగుతాడు, అది చాలా ఉపయోగకారి అవుతుంది. నీ ఏకాగ్రతా శక్తి సంపూర్ణమైనదైతే, అప్పుడు నీవు పరిష్కరించలేని సమస్యే ఉండదు — నేను అంకగణిత సమస్యల గురించి మాట్లాడటం లేదు (నవ్వు), నేను

చెప్పేదాని అర్థం, అతడి జీవనంలోని సమస్యలు, నిర్ణయం తీసుకోవడంలోని సమస్యలు, పరిష్కరించవలసిన మానసిక సమస్యలు. ఈ ఏకాగ్రతాశక్తిని అడ్డుకోగలిగినది ఏ ఒక్కటీ ఉండదు.

CWM 5:398-399

ప్రశ్న: ఒక మనిషి ఒక పని చేస్తున్నప్పుడు, అతడు దానిని అత్యుత్తమముగా తన సామర్థ్యంతో చేయాలనుకుంటే, అతడికి చాలా సమయం అవసరమవుతుంది. కాని సాధారణంగా, ఎవరికీ అంత సమయం ఉండదు, అందరమూ చాల తొందరలో ఉంటాం. తొందరలో ఉన్న వ్యక్తి తన సామర్థ్యంతో ఆ పనిని అత్యుత్తమంగా చేయడం ఎట్లా?

ఇది చాలా కతూహలం కలిగించే విషయం.... సాధారణంగా మనుషులు తొందరలో ఉన్నప్పుడు, వారు చేయవలసిన పనిని సంపూర్తిగా చేయరు, లేదా వారు చేయవలసి ఉన్న పనిని లోపభూయిష్టంగా చేస్తారు. అయినప్పుడు, మూడో మార్గం కూడా ఉంది, అది తమ ఏకాగ్రతను తీవ్రతరం చేయడం. నీవది చేస్తే నీకు సగం సమయం కలిసి వస్తుంది, అది ఎంత ఎక్కువ సమయం పట్టేదైనప్పటికీ. ఒక సర్వ సాధారణమైన ఉదాహరణనే తీసుకో, నీవు స్నానం చేసి బట్టలు వేసుకోవాలి; దానికి సమయం మనుషుల్ని బట్టి మారుతుంటుంది, కాదంటావా? కాని ఈ విధంగా ఆలోచించు, ఆ పని అంతా పూర్తవటానికి, సమయం వృధా కాకుండా, తొందరపడకుండా అర్థ గంట సమయం పడుతుందనుకుందాం.

ఇప్పుడు, నీవు తొందరలో ఉంటే గనుక, రెండు విధాలుగా జరుగుతుంది. నీవు సరిగ్గా తోముకోవు లేదా అస్తవ్యస్తంగా బట్టలు వేసుకుంటావు! కాని ఇంకొక మార్గం ఉంది — తన శ్రద్ధను, తన శక్తియుక్తులను దాని మీద ఏకాగ్రం చేయడం, కేవలం తాను చేస్తున్నదాని గురించే ఆలోచించడం, మరి దేనినీ ఆలోచించకపోవడం, అతిగా కదలికలు చేయకపోవడం, కచ్చితమైన కదలికను అత్యంత కచ్చితమైన విధంగా చేయడం, (ఇది నేను వాస్తవంగా అనుభవించినది, దాని గురించి నేను ధృఢమైన నమ్మకంతో చెప్పగలను) నీవు పూర్వం అర్థగంటలో చేసే దానిని ఇప్పుడు నీవు పదిహేను నిమిషాలలో చేయగలవు. అదీ చాలా చక్కగా చేస్తావు, ఒక్కొక్క సమయంలో ఇంకా చాలా బాగా, మరచిపోకుండా, దేనినీ వదలిపెట్టకుండా, కేవలం

తీవ్రమైన ఏకాగ్రతతో అంతా జరిగిపోతుంది.

"ఓహ్, పనులు బాగా చేయాలంటే, ఒకరికి వాటికి వలసినంత సమయం ఉండాల్సిందే" అని అనేవారికి ఇది అత్యుత్తమమైన సమాధానం. వారనుకునేది నిజం కాదు. నీవు చేయాలనుకునే దాని కంతటికీ — చదువు, క్రీడ, పని — అన్నింటికీ ఒకటే పరిష్కారం: తమ ఏకాగ్రతా శక్తిని పెంచుకోవటం. ఒకసారి గనుక ఏకాగ్రతను అలవరచుకుంటే, అది ఇక ఏ మాత్రమూ అలసటను కలిగించదు. సహజంగానే, మొదట్లో అది నీకు ఒత్తిడిని కలిగిస్తుంది, కాని దానికి అలవాటు పడినప్పుడు, ఒత్తిడి తగ్గిపోతుంది. ఆ విధంగా జరుగుతూ ఉండగా ఒకానొక సమయం ఆసన్నమౌతుంది, అప్పుడు అలసటతో నిన్ను నీరసానికి గురి చేసేది మాత్రం ఆ విధమైన ఏకాగ్రత కాదు, నిన్ను నీవు చెల్లాచెదరు చేసుకోవడం, నీవు చేసే పని మీద ఏకాగ్రత వహించకుండా అన్ని రకాలైన విషయాలతో నిన్ను నీవు కబళించబడి వేయడానికి ఆమోదించడం.

ఏకాగ్రతా శక్తి వలన తాము చేసే పనులను ఇంకా బాగా చేయడంలో, ఎక్కువ వేగంగా చేయడంలో విజయం సాధించగలుగుతారు. ఈ విధంగా నీవు పనిని పురోభివృద్ధికి సాధనంగా ఉపయోగించుకోవచ్చు. లేని పక్షంలో నీకు 'నిర్లిప్తంగా' మాత్రమే తప్పక పనులు చేయవలసి ఉంటుందనే అస్పష్టభావన ఉంటుంది, కాని అందులో గొప్ప ప్రమాదం ఉంది, ఎందువల్లనంటే చాలా త్వరగా నిర్లిప్తతను ప్రాముఖ్యత లేనిదానిగా వ్యక్తిని గందరగోళంలో పడవేసే అవకాశం ఉంది.

CWM 4:137-38

నీవు పని చేస్తున్నప్పుడు, నీవు గనుక ఏకాగ్రత వహించగలిగితే, ఒక గంటలో పట్టే పనిని పది నిమిషాలలో పూర్తి చేయగలవు. నీవు సమయాన్ని ఆదా చేసి లాభం పొందాలనుకుంటే, ఏకాగ్రతను వహించడం తెలుసుకోవాలి. పని యందు శ్రద్ధను కలిగి ఉంటే ఆ వ్యక్తి త్వరగా ఇంకా బాగా పనులను చేయగలుగుతాడు. నీకు ఒక అర్ధగంట పట్టే విధాయకమైన పని ఒకటి ఉన్నదనుకుందాం — సహజంగానే నేను అర్ధగంటలో వ్రాయవలసి ఉన్నదానిని గురించి మాట్లాడటం లేదు — కాని నీవు దానిని గురించి ఆలోచించవలసి ఉండి, నీ మనస్సు పరిపరి విధాలుగా అనేక విషయాలలో తేలిపోతూ సాగిపోతున్నప్పుడు, నీవు చేస్తున్నదాని గురించే కాకుండా,

నీవు చేసినదానిని, నీవు చేయవలసి ఉన్నదానిని, ఇంకా ఇతర విషయముల యందు; అప్పుడు అదంతా నీ విధాయక పనిని చేయడానికి పట్టే కాలాన్ని మూడు రెట్లు కోల్పోయేటట్లు చేస్తుంది. నీవు చాలా ఎక్కువ పని చేయవలసి ఉన్నప్పుడు, నీవు చేసే పని మీద ప్రత్యేకమైన ఏకాగ్రత వహించడమెలాగో నీవు అవశ్యం నేర్చుకోవాలి, నీ పని మీద నీ శ్రద్ధను తీవ్రతరం చేయడంతో, ఒక గంటలో పట్టే పనిని నీవు పది నిమిషాలలో చేయగలవు.

CWM 5:124

... నీవు జీవితంలో ఏమి చేయాలనుకున్నా, పూర్తిగా ఆవశ్యకమైనది ఒకటి ఉంది, ప్రతిదానికి ఆధారంగా నీ శ్రద్ధను ఏకాగ్రం చేయగల సామర్థ్యం. నీవు గనుక శ్రద్ధ, చైతన్యాల కిరణాలను కలిపి ఒక బిందువు మీద ఏకాగ్రం చేయగలిగితే, ఈ ఏకాగ్రతను పట్టు వీడని ఇచ్ఛతో కొనసాగించగలిగితే, దానిని ఏదీ అడ్డుకోలేదు — అది ఏదయినా కావచ్చు, అత్యంత ప్రాపంచికమైన భౌతికాభివృద్ధి నుంచి మహోన్నతమైన ఆధ్యాత్మికత వరకు.

కాని ఈ నియమాన్ని నిరంతరం తప్పక అనువర్తించాలి, అది కూడా నిర్వికారంతో చేయాలని చెప్పవలసి ఉంటుంది. అంత మాత్రాన నీవు ఒకే విషయం మీద ఎప్పుడూ ఏకాగ్రత వహించి ఉండాలని కాదు — నేను చెప్తున్నదానికి అర్థం అది కాదు, నా ఉద్దేశం ఏకాగ్రత వహించడం తెలుసుకుని ఉండాలని మాత్రమే.

ప్రాపంచికంగా చదువులకు, ఆటలకు, సమస్తమైన భౌతిక లేక మానసిక వికసనానికి, అది పూర్తిగా ఆవశ్యకం. ఒక వ్యక్తి విలువ అతడు ఎంత శ్రద్ధను పెడతాడు అనేదాని నిష్పత్తిలో ఉంటుంది.

ఆధ్యాత్మిక దృక్కోణం నుంచి చూస్తే అది ఇంకా ఎంతో ప్రాముఖ్యమైనది. ఏకాగ్రత వలన జనించి చొచ్చుకుపోయే శక్తిని అడ్డుకోగలిగిన ఆధ్యాత్మిక అవరోధం ఏదీ లేదు.

ఉదాహరణకు, చైత్య అస్తిత్వాన్ని కనుగొనడం, అంతరంగ దైవంతో సంయోగం పొందడం, ఉన్నతసీమలకు ఉన్మీలనం, అన్నీ తీవ్రమైన, మొండి పట్టుదలతో కూడిన ఏకాగ్రతా శక్తి వలన పొందగలవు — కాని అది ఏ విధంగా చేయాలనేది అవశ్యం తెలుసుకోవాలి.

మనిషిలోను లేదా అతిమానస క్షేత్రంలోను ఏకాగ్రతా శక్తి కీలకం కాకుండా లేనిదంటూ ఏదీ లేదు.

నీవు ఆ కౌశలంతో అత్యుత్తమ క్రీడాకారుడవు కావచ్చు, అత్యుత్తమ విద్యార్థివి కావచ్చు, ప్రతిభాశాలివైన కళాకారుడవు, సాహిత్యకారుడవు, వైజ్ఞానికుడవు కూడా కావచ్చు. నీవు అతి గొప్ప సాధుపుంగవుడవు కావచ్చు. ప్రతి వ్యక్తికీ తమలో అది అతి స్వల్పంగా మొదలవుతుది — ప్రతి ఒక్కరికీ అది ఇవ్వబడింది, కాని జనులు ఆ కౌశలాన్ని వృద్ధి చేసుకోరు.

CWM 9:360-61

మీ అంతరంగంలోని తలుపులను తెరవడానికి నేను అత్యంత జాగ్రత వహిస్తాను, దాని వలన ఏకాగ్రతా గమనం అతి స్వల్పంగా ఏ మాత్రం జరిగినా, మీరు కదల కుండా మూసివేయబడిన తలుపు వద్ద సుదీర్ఘ సమయాలు నిరీక్షించవలసిన అవసరం వుండదు, దానిని తెరవటానికి మీ వద్ద తాళంచెవి లేదు, సరి కదా మీకు దానిని తెర వడం ఎట్లాగో కూడా తెలియని పరిస్థితి.

తలుపు తెరవబడింది, మీరు కేవలం ఆ వైపు దృష్టి సారించాలి. మీరు దాని నుండి వెనుకకు మళ్ళరాదు.

CWM 13:84

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఏకాగ్రత లేకుండా ఎవరూ ఏమీ సాధించలేరు.

CWM 12:135

శ్రీమాత

సంకల్ప శక్తి

మనలో లేని శక్తులను సాధించాలన్నా, ఇంత వరకూ తెలియనివానిని తెలుసుకోవాలన్నా, ఎన్నడూ చేయలేనివి చేయగలగాలన్నా దృఢమైన సంకల్పం ఉండాలి. స్వలాభాపేక్షకు లోనుగాని ప్రశాంతత యొక్క వెలుగులో ఈ ప్రగతి కొనసాగాలి.

మనలో దృఢమైన సంకల్పం ఉన్నట్లయితే, దానిని తగిన వైపుగా త్రిప్పుకోవాలి. ఇంతవరకు లేకుంటే ముందుగా దాన్ని తన కోసం ఏర్పరుచుకోవాలి. ఇది కొంత కష్టసాధ్యమైనది; సమయం కూడ పట్టవచ్చు.

*

ఆలోచనలు ఎంత బాగున్నా స్థిరచిత్తం లేకుండా ముందుకు వెళ్ళలేము. దృఢచిత్తంతో అట్లాంటి ఆలోచనలను మన మనోభావాలలో, ప్రతిస్పందనలలో మరియూ కర్మలో ప్రతిఫలించే అలవాటు చేసుకోవాలి. లేకుంటే ముందుకు సాగలేము.

*

ప్రశ్న: అమ్మా, నాలోని నిమ్నప్రకృతి మరలా మరలా తప్పులనే చేయిస్తున్నది. దీన్ని మార్చటం మీ వలననే సాధ్యం అవుతుంది. నియమాలు సెలవిస్తారా?

సమా:

1. ముందుగా నీవు మారగలవనే నమ్మకాన్ని పెంపొందించుకో.
2. నిమ్నప్రకృతిని త్రోసిరాజనగల దృఢసంకల్పాన్ని అభివృద్ధి చేసుకో.
3. ఎన్ని కష్టాలు ఎదురైనా నీ సంకల్పం మారకూడదు.
4. దైవ సహాయం లభిస్తుందనే విశ్వాసం పెంపొందించుకో.

CWM 14:158-59

*

ప్రశ్న: మధుమయీ, సంకల్పాన్ని దృఢతరం చేసుకోవటం ఎలా సాధించాలి?
జవాబు: సాధించాలని దృఢంగా సంకల్పించుకోవడమే! (నవ్వుతూ) దీన్ని ఛలోక్తి అనుకోకు; ఇది నిజంగా సత్యమే. ఆకాంక్ష లేనపుడు దానిని ఎలా సాధించగలవు? ఒక విషయం ఎలా వుందో తెలుసుకోవాలంటే దానిపై దృష్టి కేంద్రీకరించాలి గదా!

జాగ్రత్తగా దాన్ని పరికిస్తేనే అది ఏమిటో, అందులో బహిర్గతం కాని విషయం ఏమిటో, అది ఎలా కట్టలు తెంచుకుని బయట పడటానికి ఆరాటపడుతున్నదో

తెలుస్తుంది. నీలో నిజాయితీయే ఉంటే నీలో దాగియున్న శక్తి నీకు అసాధ్యం అను కొని వదలివేసిన దాన్ని సుసాధ్యం అయ్యేలా చేస్తుంది.

నీకే గనుక తీవ్రమైన వాంఛ ఉంటే ప్రపంచంలోని ఏ శక్తీ నిన్ను నిలువరించలేదు. చాలా మందికి వాంఛించటమే తెలియదు. తెలిసినా ఏం చెయ్యాలో అనే సంధిగ్ధంలో ఉంటారు. అలా కాకుండా స్థిరచిత్తంతో ఉన్ననాడు ఈ ప్రపంచంలో ఏ శక్తీ నీ సంకల్పాన్ని చెదరనీయదు.

అసలు విషయం ఏమిటంటే చాలామందికి దేన్ని కోరాలో తెలియదు. వారికి దృఢంగా కాంక్షించటమే తెలియదు, దౌర్బల్యమైన ఇచ్ఛ ప్రతిదానికీ తటపటా యిస్తుంది. "అది ఇలా వుండచ్చు, సరే మంచిదే. నీవు దాన్ని కావాలనుకోటం కూడా మంచిదే. కాని అది ఈ విధంగా వుంటే ఇంకా బాగుండవచ్చు."

ఇట్లాంటి బలహీనపరచే మాటలు 'వాంఛ'ను సరిగా ప్రకటించ లేవు. అంతే కాదు, నీ మనసులో ఏ మూలనో ఏదో శంక దాగి వుండి నీ సంకల్పాన్ని చెదర గొడుతుంది. అది "అది నా కెందుకు, లేకపోతేనే బాగుంటుందేమో". ఇట్లాంటి అనుమానం నీలో దాగి వుంటుంది. ఇట్లాంటి అపోహలు, శంకలు, అనుమానాలు వేలాదిగా నీ సంకల్పాన్ని బలహీనపరచి నిన్ను వక్రమార్గం పట్టిస్తాయి. నీ ఆలోచనకు వ్యతిరేకమైన వాటిని నీచే చేయిస్తాయి. నీవు కాస్త తటపటాయించినా నీ ముందు వాలి నీ సంకల్పాన్ని బలహీనపరచి నిన్ను లోగొంటాయి

కాని ఎవరైనా నిజాయితీతో సంకల్పిస్తే, ఒక లక్ష్యాన్ని ఎంచుకొని తీవ్రంగా వాంఛిస్తే, దానికి దీటుగా తన సంకల్పాన్ని మలచుకుంటే, అట్టి వారిని ప్రపంచంలోని ఏ శక్తీ ఆపలేదు. వారు దేన్నైనా సాధించి తీరుతారు; అది ఆచరణ సాధ్యం అవుతుంది.

దేన్ని వాంఛించారో దాన్నే తీవ్రంగా కోరాలి. ఇచ్ఛాశక్తిని దానిపై కేంద్రీకరించాలి. (తల పంకించి) "అలా వుంటే బాగుంటుంది, చక్కగా వుంటుంది. చూడ ముచ్చటగా వుంటుంది". కాని వ్యక్తి బలహీనుడు కాగూడదు. తన చేతగానితనాన్ని మరొకరికి ఎందుకు ఆపాదించాలి? బయట ప్రభావాలకు ఎందుకు లోను కావాలి?

మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలను గమనించండి. ఒక తెలియని చేతన దాన్ని నడుపుతున్నది. మనకు "నాకు ప్రమేయం లేకుండానే జరుగుతున్నదే,' అనిపిస్తుంది.

అలాంటి వానికి మన అంగీకారం అవసరం లేదు. దానిపై మన సంకల్ప ప్రభావమే లేదు.

'వాంఛ' కూడా ఒక విద్యయే. వాంఛించటం నేర్చుకోవాలి. అది ముఖ్యమైన విద్య. నిజంగా ఆకాంక్షించేవారు వారి శక్తినంతా కూడగట్టుకోవాలి, శక్తులను సమీకరించుకోవాలి. వ్యతిరేక భావాలకు లోను గాకూడదు. అవి నిన్ను ఆ వైపూ, ఈ వైపూ లాగుతుంటే నీ జీవితకాలంలో ముప్పావు భాగం నీవు ఏమి చేస్తున్నావో, ఏమి చేయాలో గమనించలేవు. నీ మీద నీకు అవగాహన లేనంత కాలం నీకు అస్తిత్వం వున్నట్లవుతుందా? నిజానికి సంకల్పం అనే స్పృహ లేనంత కాలం నీవు వ్యక్తివి కాలేవు. నీ సర్వ శక్తులూ ఏకం చేస్తేనే నీవు దేన్నైనా దృఢంగా సంకల్పించ గలవు.

ప్రశ్న: ఇచ్ఛాశక్తిని దృఢతరం చేయటం ఎలా మాతా?

సమా: కండరాలను చేసినట్లే! ఏదైనా చేయాలన్నా లేక వదిలించుకోవాలన్నా నిదానంగా మొదలు పెట్టాలి. అవసరం లేని అంశాన్నయినా నిత్యం అలవాటుగా చేస్తున్నట్లయితే పట్టుదల పెరిగి కొనసాగిస్తావు. బరువులు ఎత్తటం ఇటువంటిదేగా? దీనికి ఆంతరంగిక పట్టుదల అవసరం. మొదట్లో చిన్న చిన్నగా ప్రారంభించి క్రమంగా శక్తిసామర్థ్యాలను పెంచుకుంటూ కొనసాగిస్తావు. క్రమేణా కష్టతరమైన ప్రయోగాలు ప్రారంభిస్తావు. ఈ విధంగా క్రమం తప్పక సాధన కొనసాగిస్తే నీదైన సంకల్పం బలపడుతుంది.

ప్రశ్న: శ్రీమాతా, సంకల్పం, వాంఛల మధ్య ఉన్న వ్యత్యాసం వివరించండి.

సమా; సంకల్పం వేరు, వాంఛ వేరు. ఏదైనా మంచి పని చేయాలంటే అది మంచిదా కాదా అని నీ హేతుబద్ధతను సంప్రదిస్తావు. నీ బుద్ధికి అది సబబు అనిపిస్తే దానిని చేయటానికి అవసరమైన వాటిని సమకూర్చుకుంటావు. నీ సంకల్పం నీచే ఆ పని చేయిస్తుంది. అదే కార్యనిర్వాహకత్వం కూడా వహిస్తుంది. వివేచనా జ్ఞానం ద్వారా నిర్ణయించినదాన్ని నీ లోని సంకల్పం ఒక పథకం ప్రకారం కార్యరూపంలో పెడుతుంది. ఇదంతా సమన్వయముతో జరిగే స్వతంత్ర వ్యవస్థ.

ఇక వాంఛ వేరు. అది ఉద్రేకానిక సంబంధించినది. వాంఛ నిన్ను పూర్తిగా వశం చేసుకుంటుంది. దీనిలో ఆలోచనకు అంతగా స్థానం ఉండదు. ఉద్రేకపూరిత స్పందనలు వ్యక్తి కాంక్షించే లేక వాంఛించేదాన్ని స్వంతం చేసుకునేలా ప్రోత్స

హిస్తాయి. నీ సంకల్పశక్తి దానికి ఉపకరిస్తుంది. కాని సంకల్పము, వాంఛ ఒకటి కావు. చాలామంది చాలా వాటిని కాంక్షిస్తూ ఉంటారు. కాని సంకల్పశక్తి వారికి అంతగా ఉండకపోవచ్చును. అట్లాంటి వారు, వారి వాంఛలు తీరక శుష్కించి పోతారు. వారి సంకల్పశక్తి కూడా నిరుపయోగం అవుతుంది.

సంకల్పశక్తికి నిర్వహణా సామర్థ్యం కూడా వుంటుంది. అది ఏ పని చేయాలన్నా ఉపయోగపడుతుంది. కచ్చితమైన ప్రయోజనం పొందాలంటే సంకల్పశక్తి కూడా కావాలి. వాంఛ ఉద్రేకంతో కూడి వుంటుంది. అది నిన్నంతా ఆవహిస్తుంది. దేన్నో ఒకదాన్ని పొందాలనే కోరికను పుట్టిస్తుంది. దానికి ఆలోచనతో నిమిత్తం లేదు. బలంతో పొందాలని ప్రోత్సహించే శక్తి అది. ఇందుకు నీవు నీ సంకల్పాన్ని కూడా ఉపయోగించవచ్చు. కాని సంకల్పం వేరు వాంఛ వేరు. అనేక మంది వాంఛలతో నిండియుండి వారి ఇచ్ఛాశక్తిని వాంఛలు తీర్చుకోటానికి వినియోగిస్తూ ఉంటారు.

'ఇచ్ఛ' ఒక వ్యవస్థను నడిపే శక్తి. దాన్ని ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. అది బలంగా వున్నచోట ఒక నిర్దిష్ట కారణం కూడా అక్కడ ఉన్నట్లే. 'ఇచ్ఛ'నే 'కాంక్ష' లేక 'వాంఛ' అనుకునే భ్రమలో పడరాదు. 'కాంక్ష' లేక 'వాంఛ' ఒక ఉద్రేకం. అది వ్యక్తిని ఆవేశించి దాని ప్రభావంలో అతనిని పెట్టుకుంటుంది.

నీవు గనుక 'వాంఛ' లను వాటి ఇష్టానికి వదలివేస్తే అవి ఏమైనా చేస్తాయి. అందుకు నీ ఇచ్ఛాశక్తిని వాడుకుంటాయి. వాంఛలకు హింసోద్రేకాలతో దగ్గర సంబంధం ఉంటుంది. అవి క్షణికమైనవి కూడా. వాటికి ఒక వ్యవస్థ, స్వయంచాలక శక్తి ఉండవు. అవి స్వయంగా మనుగడ సాగించలేవు. వాంఛల ప్రభావంలో పడినవారు ఏదైనా చేస్తారు; వారి చిత్తం వచ్చినట్లు.

CWM 6:410

'సంకల్పశక్తి' అంతరంగానికి సంబంధించినది. ఔన్నత్యము, గంభీరత దాని లక్షణాలు. విజ్ఞానాన్ని వెలికి తెచ్చి ఆచరణలో సాధ్యం చేసే శక్తి దానికి ఉంది. అది సహజంగా, అప్రయత్నంగా నేరుగా పనిచేస్తుంది.

లోని విజ్ఞానాన్ని వెలువరించి బహిరంగ చర్యలలో దానిని ప్రవేశపెట్టటమే నిజమైన శక్తి.

అందుకే ఒక నానుడి ఉన్నది: 'మనసుంటే మార్గం వుంటుందని'. ఇది ఎంత

ప్రసిద్ధమో అంత సత్యం కూడా. శక్తిని కూడగట్టుకోవటం అంటే దృఢంగా సంక ల్పించటమే. ఈ సందర్భంలో 'వాంఛ' అంటే 'ఇష్టపడటం' కాదు. ఇష్టపడటం వాంఛలకు సంబంధించినది. 'ఇచ్ఛ' ఒక విజ్ఞానం, ఒక నిర్వహణా సామర్థ్యం. అది ఒక అప్రతిహత శక్తి.

జీవితంలో 'ఇష్టపడటాన్ని' వ్యక్తం చేయాలంటే కృషి ఉండాలి గదా? దీనికి వ్యక్తి యొక్క కృషి అవసరం. అట్టి కృషి ద్వారానే ఏ వ్యక్తి అయినా జీవితంలో తాను కోరుకున్నవి సాధించగలుగుతాడు.

కాని అలాంటి 'ఇష్టపడటం' అనేది లేకపోయినా, నిజమైన 'వాంఛ' నిజమైన విజ్ఞానాన్ని వ్యక్తం చేసే విషయంలో ప్రత్యేకంగా కృషి చేయడమే ఉండదు. అది సహజంగా జరుగుతుంది. అప్పుడు 'సంకల్పబలం' సర్వశక్తిమంతంగా ఉండి దేన్న యినా నిర్వహించగలదు.

CWM 8:360

శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

భావనా శక్తి

భావన వాస్తవంగా మానసిక కల్పనాశక్తి. ఎప్పుడైతే ఈ శక్తి దైవకార్యార్థం నియోగించ బడిందో అప్పుడది కాల్పనికమే కాదు సృజనాత్మకం కూడా అవుతుంది. ఏమయి నప్పటికీ, అవాస్తవమైన కల్పన అనేది లేదు. ఎందుకనగా ప్రతి ప్రతిరూపం మానసిక స్తరంలో ఒక వాస్తవికత. ఉదాహరణకు, నవల యొక్క ఇతివృత్తం సర్వసంపూర్ణంగా మానసిక స్తరంలో అది వరకే రూపొంది వుంటుంది. దాని ఉనికి భౌతికస్తరంపై ఆధా రపడి వుండదు.

మనలో ప్రతి ఒక్కరం ఎంతో కొంత మేరకు నవలా రచయితలా, మానసిక స్తరంలో రూపకల్పన గావించ సమర్థత గలవారమే. నిజానికి, మన జీవితంలో అధిక భాగం మన భావనాజనిత ఫలితాలతో కూడి వుంటుంది. భయాందోళనలకు రూపకల్పన చేస్తూ, ప్రమాదాలను, అవాంతరాలను ఊహించుకుంటూ నీ భావనా

పటిమను అవాంఛిత మార్గాల వైపు ప్రసరించినపుడల్లా, నీ భవితను నీవే చేజేతులా నాశనం చేసికున్నట్లవుతుంది.

అలా కాకుండా, నీ భావన ఎంత ఆశాజనకంగా నుంటే నీ లక్ష్యసిద్ధికి అవకాశం అంత ఎక్కువగా నుంటుంది. ముషియర్ కావె ఈ శక్తివంతమైన సత్యాన్ని చేజిక్కించుకొని వందల జనానికి వారి దురవస్థల నుండి దూరమైనట్టుగా ఊహించుకొనుటను నేర్పి, వారికి స్వస్థత చేకూర్చాడు. ఒకప్పుడు జుత్తు రాలిపోతున్న వనిత ఉదంతం చెప్పాడు. ఆమె తనకు తాను తన జుత్తు రాలడం ఆగిపోయి కచ్చితంగా దిన దినాభివృద్ధి చెందుతున్నదని సూచించుకోవటం ఆరంభించింది. అలా నిరంతరం ఊహిస్తుండటం వలన ఆమె వెంట్రుకలు నిజంగానే పెరగటం ప్రారంభించి, స్వయం సూచనను మరింత కొనసాగించుటతో, ఇతర స్త్రీలు ఈర్ష్యపడేటంత పొడవుగా పెరిగాయి.

మానసిక రూపకల్పన యోగమార్గంలో కూడా అధికంగా ఉపయోగపడుతుంది. మనసు ఎప్పుడు దైవసంకల్పంతో అనుసంధానం చెందుతుందో, అతిమానస పరమ సత్యం, మనసుకు అత్యున్నత దివ్యతేజానికి మధ్యనున్న పొరల గుండా దిగిరావడం ప్రారంభమౌతుంది. అది మనసును చేరగానే అచ్చట రూపకల్పనా శక్తుల ఉనికిని గమనించి, అతి సులభంగా రూపొంది, నీలో ఒక సృజనాత్మక శక్తిగా స్థిరపడుతుంది.

అందువలన నేను నీకు చెప్పేది: ఎప్పుడూ నిరాశ నిస్పృహలకు గురికాకు, నీ భావనా పటిమను సర్వదా ఉన్నత పరమసత్యపు ఒత్తిడికి ఆశాజనకంగా సంతోషంగా మలచబడటానికి వీలుగా నుంచు. ఆ విధంగా పరమ సత్యం తన సృజనాత్మక తేజస్సును నీవు భరించడానికి అనువైన పాత్రగా సర్వసన్నద్ధంగా నుంచాలి.


భావనా పటిమ ఒక కత్తి లాంటింది. దానిని మంచి పనులకు లేక చెడ్డ పనులకు ఉపయోగించవచ్చు. నీవు ఎల్లప్పుడు పరివర్తన చెందబోతున్నాననే భావనలో మునిగి వుంటే, అప్పుడు యోగప్రక్రియకు తోడ్పడతావు. అందుకు భిన్నంగా, నీవు నిరుత్సాహానికి లోనై, నేను పనికి రానని లేక నాకు సాధించే సమర్థత లేదని దుఃఖిస్తుంటే, నీ అస్తిత్వాన్ని నీవే విషపూరితం చేసుకుంటావు.

CWM 3:256-57


ప్రశ్న: భావనాత్మకమైన కలలకు ఏమైనా విలువ వుంటుందా?
అది భావన యొక్క లక్ష్యంపై ఆధారపడి వుంటుంది. భావనా పటిమను వృద్ధి చేసుకొనుట మంచిదే అని అనుకోవటం సత్యమే, కాని ఒక అసత్యమైన భావన తలెత్తకుండా జాగ్రత్త వహించాలి.
CWM 4:154

ప్రశ్న: భావన నిర్వహించే పని ఏమిటి, అది సమకూర్చే ప్రయోజన మేమిటి?
వ్యక్తికి దానిని ఏవిధంగా వాడాలో తెలిసినట్లయితే, నేను చెప్పినట్లుగా, అతను స్వయంగా తన అంతర్గత మరియు బాహ్యజీవితాన్ని తానే నిర్మించుకోగలడు. దానిని ఏ విధంగా వాడాలో తెలిసి, అందుకు శక్తి కలిగి వుంటే, అతను తన ఉనికిని తానే ఏర్పరుచుకోగలడు. నిజం చెప్పాలంటే, అది ఈ లోకంలో విషయాలను సృష్టించటానికి, రూపకల్పన గావించటానకి ప్రాథమికమైన విధానం. వ్యక్తికి భావనా సమర్థత కొరవడినట్లయితే అతను ఎలాంటి అభివృద్ధిని సాధించలేడని నేనెప్పుడూ అనుకుంటుంటాను. నీ జీవితగమనంలో నీ భావన ఎప్పుడూ నీ కన్నా ముందుగా అడుగేస్తుంది. నీ గురించి నీవు ఆలోచించినప్పుడు, మామూలుగా నీవు ఏ విధంగా రూపొందాలనుకుంటున్నావో దానిని గురించి ఊహించుకుంటావు కదూ. ఈ ఊహ కొనసాగుతుంది. దానిని నీవు అనుసరిస్తావు. అది ఇంకా ముందుకు సాగడం కొన సాగుతుంది, నీవు దానిని అనుసరిస్తూనే వుంటావు. భావనా పటిమ నీకు దేనినైనా సాధించగలిగే మార్గాన్ని తెరుస్తుంది. భావనా శక్తి లేనివారిలో కదలిక కలిగించడం చాల కష్టం. వారు వారి ముక్కు ముందర వున్నదానినే చూడగలరు, ఏ క్షణాన వారు ఏమిటో, అంత మాత్రమే వారూహించగలరు. వారు ముందుకు సాగలేరు, కారణం. ప్రత్యక్ష విషయానికే వారు కట్టుబడి వుంటారు కనుక. అది చాలావరకు, వ్యక్తి దేనిని భావనగా పరిగణిస్తాడో అన్న దానిపై ఆధారపడి వుంటుంది....

ప్రశ్న: శాస్త్రవిదులైనవారికి తప్పకుండా భావనా పటిమ ఉండాలి!
విశేషంగా నుండాలి. లేనట్లయితే వారు కనుగొనలేరు. నిజానికి భావన అనునది, సాధించబడిన విషయాల పరిధిని అధిగమించి సాధించవలసిన విషయాలపై తన ఆలోచనా శక్తిని ప్రసరంపజేసి, తద్వారా వాటిని సాధించడం. వ్యక్తి తప్పనిసరిగా ప్రగతిశీల భావాలు, తిరోగమన భావాలు రెండూ కలిగి వుంటాడు. ఎల్లప్పుడూ



శ్రీమాత



శ్రీఅరవిందులు

సంభవించగల రకరకాల దుర్ఘటనల గురించి ఊహిస్తుండే మనుషులుంటారు. దురదృష్టమేమిటంటే వాటిని సంభవింపజేసే శక్తి కూడా వారికి ఉంటుంది. అది ఎలా గుంటుందంటే, ఇంకా అనుభవసిద్ధం కాని లోకంలోకి స్వర్గానుభూతిని పొందగల పరికరాలను పంపి అక్కడ నుండి ఏవో కొన్నింటిని సంగ్రహించి కొనితేవటంలా వుంటుంది.. ఆ విధంగా భూవాతావరణానికి అదనంగా సమకూర్చట మవుతుంది. ఇవి బహిర్గతమవటానికి మొగ్గుచూపుతాయి. భావన ఉపయోగపడటానికి అనువైన విధంగా తీర్చిదిద్దబడగల పరికరం లాంటిది, దానిని సంకల్పానుగుణంగా వాడుకోవచ్చు, కావలసిన విధంగా మలచుకోవచ్చు, ప్రయోగించవచ్చు, ప్రయోజనం పొందవచ్చు. అది వ్యక్తి తనలో తాను స్వయంగా పెంచుకొని ఉపయోగించ వీలైన లక్షణాలలో ఒకటి, అనగా, ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం వాడబడేది.

CWM 7:228-29

... వ్యక్తికి చురుకైన భావనాశక్తి వుండాలి, కారణం — నేను మూఢ విషయాలు చెప్తున్నట్లుంది, కాని అవి పచ్చి నిజాలు — నీకు మహత్తరమైన రూపకల్పన గావించగల ప్రపంచ మొకటుంది. అది నీదైన ప్రత్యేక ప్రాణిక ప్రపంచం. నీవు దానిని దివ్యమైన అలంకారాలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దగల సమర్థుడవు. ఈ నీ లోకాన్ని ఒక మహా గొప్ప అద్భుతంగా రూపొందించగలవు — నీ భావనా పటిమను సక్రమంగా ఉపయోగించుట తెలిసినట్లయితే, నీలో ఒక కళాత్మకమైన, కవితా యోగ్యమైన చైతన్యం వున్నట్లయితే, నీవు సౌందర్య సామరస్యతలను ఆరాధించే వాడివైతే, భౌతికంగా ప్రత్యక్షమయ్యే ఒక అత్యాశ్చర్యకరమైన అసంభావ్యమైన కళాఖండం ఈ లోకంలో ఊడిపడేలా చేయగలవు.

నా చిన్నతనంలో దీనిని 'నీకు నీవు కథలు చెప్పుకోవటం' అనేదాన్ని. అది మాటలతో నీ మస్తిష్కంలో చెప్పుకొనేదేదో కాదు. అది ఒక నవ్యమైన, పవిత్రమైన మస్తిష్కంలోకి ప్రవేశించి అక్కడ ఒక మహాద్భుతమైన కథను అల్లటం.

ఈ విధంగా నీకు నీవు కథను చెప్పుకోవటం ఎలాగో తెలిస్తే, ఆ కథ నిజంగా అందమైనది, సామరస్యత గలది, శక్తివంతమైనది, సమన్వయించబడినది అయినట్ల యితే, అది నీ జీవితంలో సార్థకమవుతుంది — బహుశా, పూర్తిగా నీవు కూర్చిన

విధంగా కాకపోయినా, నీ కథానిర్మాణానికి ఇంచుమించుగా కొద్దిపాటి మార్పులు చేర్పులతో....

అందుకు కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు, కాని నీ కథ నీ జీవితాన్ని వ్యవస్థీకరించ టానికి దారి తీస్తుంది.

అయితే ఒక అందమైన కథను చెప్పగలిగినవారు బహుశా, కొద్దిమంది మాత్రమే వుంటారు. అదీ గాక, చెప్పేవారు కూడా భయానక సంఘటనలను కథలకు జోడిస్తారు. తరువాత అలా చేసినందుకు చింతిస్తారు.

ఒక దివ్యమైన కథను, భయానకమైనదేదీ లేకుండా కేవలం రామణీయత తప్ప మరేమి లేనిదానిని నిర్మించగలిగితే, ఆ కథ ప్రతివారి జీవితంపై గణనీయమైన ప్రభావం చూపగలుగుతుంది. అందరికీ ఈ విషయం తెలియదు.

వ్యక్తికి ఈ శక్తిని ఎలా ఉపయోగించాలో తెలిసినట్లయితే, ఈ సృజనాత్మక శక్తిని ప్రాణికమైన నిర్మాణాలతో కూడిన ప్రపంచంలో ఎలా వాడాలో తెలిసినట్లయితే, ఆ అవగాహన ఆతని పసితనం నుండి ఏర్పడినట్లయితే ఎంత బాగుంటుంది! కారణం, ఆ కాలంలోనే ఎవరైనా వారి భవితను రూపొందించుకుంటారు గనుక. అయితే నీ చుట్టూ సాధారణంగా వుండే మనుషులు, ఒక్కోసారి స్వయంగా నీ చిన్ననాటి స్నేహితులు కూడా, ఎక్కువగా నీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలుగజేసుకుని పూర్తిగా చెడగొడ్తారు — ఎంతగానంటే నీ భవిత యొక్క రూపకల్పనకు చాలా అరుదుగా సంపూర్ణ సాఫల్యత లభిస్తుంది.

అలా కాకుండా, ఒక పసివానికుండే సహజమైన నిష్కాపట్యంతో చేసినట్లయితే, స్వయంగా నీకు నీవు ఒక అద్భుతమైన జీవితం ఏర్పాటు చేసుకోగలవు — నేను మాట్లాడేది భౌతిక ప్రపంచ జీవితం గురించి.

చిన్ననాటి కలలు యుక్తవయస్సు యొక్క వాస్తవాలు.

CWM 8:117-18

భావనా పటిమ ఒక రూపకల్పనా శక్తి. నిజానికి భావనాశక్తి లేనివాళ్ళు మానసిక దృక్పథంలో ఏదీ రూపొందించలేరు, వారి ఆలోచనలకు ఒక దృఢమైన శక్తిని సమ కూర్చలేరు. భావన కార్యాచరణకు ఒక శక్తివంతమైన మార్గం. ఉదాహరణకు, నీకు ఎక్కడో బాధ కలిగితే, నీవు ఆ బాధ లేకుండా చేస్తున్నాననో లేక దానిని

నిర్మూలిస్తున్నాననో, లేక తీసివేస్తున్నాననో ఊహించినట్లయితే — ఆలాంటి రకరకాల దృశ్యాలను ఊహించుకుంటే — సరే, నీవు సఫలీకృతుడవౌతావు. తలవెంట్రుకలు అనూహ్యంగా రాలిపోతున్న వ్యక్తిని గురించిన కథ ఒకటుంది. రాలిపోయే తీవ్రత ఎంతగా నుండిందంటే కొన్ని వారాల్లోనే పూర్తిగా బట్టతల ఏర్పడేటంతగా నుంది. అప్పుడు ఆమెకు ఎవరో చెప్పారు, "నీవు నీ జుత్తును దువ్వుకొనేటప్పుడు, అది పెరుగుతున్నదని, అతి వేగంగా పెరుగుతుందని ఊహించు". అదే విధంగా, ఆమె జుత్తును దువ్వుకున్నప్పుడల్లా, "ఓహ్! నా జుత్తు పెరుగుతోంది! చాలా వేగంగా పెరుగుతోంది1..." అనుకుంది. నిజంగా ఆలాగే జరిగింది! కాని, మామూలుగా జనులు చేసేదేమిటంటే వారికి వారు ఇలా చెప్పుకుంటారు: "ఆహా, నా జుత్తు మళ్ళీ రాలిపోతోంది, నాకు బట్టతల ఏర్పడటం ఖాయం, అది జరిగి తీరుతుంది!" అందువల్ల అది తప్పక జరుగుతుంది!

CWM 9:380

శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

భావనాశక్తి, స్వభావ సిద్ధంగా, యదార్థమైన చేతన యొక్క సంభావ్యతను సూచించగలిగే అంతర్బుద్ధి నైపుణ్యతకు ఒక ప్రత్యామ్నాయం. మనసు సత్యచేతన దిశగా ఎదుగుతున్న కొద్దీ, ఈ మానసిక శక్తి ఒక యదార్థ భావనగా మారుతుంది. ఆ భావన ఇతః పూర్వమే సిద్ధించి రూపుదిద్దుకున్న పరిమితమైన చాలీచాలని జ్ఞానంలోకి ఉన్నత సత్యం యొక్క వన్నెను, వెలుగును కొనితెస్తుంది. చివరిగా, ఇట్టి పరివర్తనాత్మక వెలుగులో అత్యున్నతమైన సత్య-శక్తులకు తావిస్తుంది లేదా స్వయంగా తనకు తానే అంతర్బుద్ధిగా, దివ్యావేశంగా పరిణామం చెందుతుంది.

CWSA 21:453

శ్రీఅరవిందులు

భావోద్వేగ సమతులనంలోని శక్తి

సాంఘికపరమైన సంబంధాలలో ఒక పెద్ద బలహీనతఉంది. ఆ కారణంగానే క్రోధావేశంతో ఒళ్ళుమరచి అనకూడని మాటలు అంటుంటారు. బలహీనత లేనివారు ఎప్పటికీ ఆవేశానికి లోనుగారు. బలహీనత, తీవ్ర ఆవేశం రెండూ జతగా ఉంటాయి. దృఢంగా ఉండేవారు ఎన్నడూ దుడుకుగా ఉండరు. ఇది ప్రతివారూ గుర్తుంచుకోవలసిన విషయం. ఆవేశం ప్రదర్శించాలంటే ఎక్కడో ఓ చోట బలహీనత ఉన్నట్లే. అయితే కండలు తిరిగిన ఒక మనిషి మరొకరిని చావబాది పడేయటం చూసి వాడు చాలా బలవంతుడు అనుకోవటంలో నిజం లేదు. కండరాలున్నప్పటికీ వాడు నైతికంగా బలహీనుడే., శారీరక బలం ఉన్నా మానసిక బలహీనత ఉండవచ్చు. ఈ పరిస్థితి సర్వసాధారణం.

జంతువులను గమనించ గలిగితే చాలా బలంగా ఉండే జంతువులు ఎంతో ప్రశాంతంగా ఉంటాయి. వేటాడేటప్పుడు ఎంతో శక్తి ప్రదర్శించినప్పటికీ అది తీవ్ర ఆవేశం కాదు, కేవలం శక్తి నుపయోగించటమే. ఒక సింహాన్ని ఎప్పుడైనా గమనించినట్లయితే దానికి పని లేనప్పుడు అది చికాకు చెందదు. దానికి జబ్బు చేసినప్పుడు స్థిమితంగా ఉండదు. కాని ఆరోగ్యంగా వున్నట్లయితే, అది చలించదు, స్థిమితంగా వుంటుంది. — ఒక యోగిలా (నవ్వుతారు)

ఆందోళన, ఆవేశం, క్రోధం మొదలైనవన్నీ బలహీనత గుర్తులే. ముఖ్యంగా మాటల్లో ఒళ్ళెరుగకుండా అనరాని మాటలు అన్నట్లయితే అది నిజంగా ఒక భయంకర మైన మానసిక, ప్రాణిక దౌర్బల్యానికి సూచన. ఎంతో అవమానకరమైన మాటలు విన్నా, మనుషులు నిన్ను చేతనైనన్ని మూర్ఖపు కూతలు కూసినా నీవు బలహీనుడవు కానట్లయితే, నీవు సంస్కారవంతుడవు కాబట్టి పైకి ఏమీ అనకపోయినా లోలోపల నవ్వుకుంటావు, ఆ దుర్భాషలను పట్టించుకోవు. దానిక్కారణం ఇక్కడ అలవాటైన సంస్కారం; అసలు సంగతి నీకు అవగాహన ఉంటుంది కాబట్టి. ఏది విన్నప్పటికీ స్థిమితంగా ఉండగలవు. నీలో ఏ రకమైన కలత సూచనప్రాయంగానైనా కలగదు, అంతా నిశ్చలంగా ఉంటుంది. కానీ చూసేవాళ్ళు మాత్రం తప్పక నవ్వుతారు.

ఎవరైనా నీపై తన క్రోధాన్ని, ఆవేశాన్నీ వెళ్ళగ్రక్కినప్పుడు, దానికి నీవు ప్రభావితుడవైతే, వెంటనే ప్రతిస్పందిస్తావు, ఇక నీలో కూడా ఉద్రేకం కలిగిందంటే

దాని అర్థం నీవూ అతనంత బలహీనంగా ఉన్నట్లే.

CWM 6:372-73

ఎవరో వచ్చి నిన్ను తిట్టి, అవమానిస్తూ మాట్లాడారనుకో, నీవు వెంటనే వారికి సమానంగా కోపంతో, పగతో ఊగిపోతే నీవు చాలా నీరసంగా, శక్తి లేనట్లుగా అయిపోతావు, దానితో మూర్ఖుడిలాగా తయారవుతావు. అలా కాక నీవు గనక స్థిరచిత్తంతో, ముఖ్యంగా మనస్సును నిశ్చలంగా ఉంచుకోగలిగితే అప్పుడు ఈ ప్రకంపనాలు నిన్ను తాకవు, అంతేకాక నీకు పెద్ద బలం వచ్చినట్లనిపిస్తుంది. అప్పుడు ఎదుటి వ్యక్తి నిన్ను చికాకుపరచ లేడు. నీవు శారీరకంగానూ, మానిసికంగానూ నిశ్చలంగా ఉండిపోగలిగితే, నీపై దౌర్జన్యం జరపాలని చూసినప్పటికీ నిశ్శబ్దంగా, స్థిరంగా, స్థిమితంగా ఉండిపోతావు. అది నీ పైనే కాకుండా ఎదుటి వ్యక్తిపై కూడా శక్తివంతంగా పనిచేయగలదు. ఈ విధంగా అంతర్గతమైన ప్రతిస్పందనలు లేకుండా ఎక్కడైనా నీలో నీవు నిశ్చలంగా ఉండగలిగితే తక్షణమే దీని ప్రభావం ఎదుటివారిపై పడుతుంది.

దీని వల్ల నిశ్చలత్వమనేది ఎంత శక్తివంతమో నీకు తెలుస్తుంది. ఇది సాధారణంగా రోజూ జరిగేదే తప్ప పెద్ద ఆధ్యాత్మిక జీవిత విశేషం కానే కాదు, కేవలం బాహ్య వస్తువిషయ జీవితానికి సంబంధించినది.

నిశ్చలత్వం మానసికంగానూ ఇంద్రియ విషయాల్లోనూ దైహికంగాను ఉన్నప్పుడు అపారమైన శక్తి వస్తుంది. నీవు కదలక మెదలక నిశ్చలంగా ఒక గోడలా నిలబడిపోతే ఎదుటివారు నీ మీదకు ఏమి పంపినా అది తిరిగి వారి పైనే పడుతుంది. అది తక్షణం జరిగే చర్య. దానికి ఎంత శక్తి వుంటుందంటే నీ పైకి వచ్చిన హంతకుని చేతిని కదలనీయదు. అయితే లోలోపల ఉడికిపోతూ బయటకు స్థిమితంగా ఉన్నట్లు కనిపిస్తే లాభం లేదు. నేను చెప్తున్నది సమగ్రమైన నిశ్చలత.

CWM 8:67-68

ప్రశ్న: అమ్మా! ఒక అనుభవం యొక్క అభ్యుదయాత్మక స్థితి, వ్యతిరేకాత్మక స్థితి అంటే ఏమిటి?

సమా: నీలో కొన్ని లోపాలుండి అవి నీ పురోగతికి అవరోధంగా ఉన్నాయనుకో. వ్యతిరేకాత్మక స్థితి అంటే నీవు వాటిని పోగొట్టుకొనే ప్రయత్నం చేయడము.

అభ్యుదయాత్మక స్థితి అంటే నీవు అభివృద్ధి పొందటానికి అవలంబించవలసిన వాటిని నీలో కల్పించుకోవడము.

సత్యం చెప్పకపోవడమనే దుర్గుణం నీ కున్నదనుకో. ఈ అబద్ధాలు చెప్పే అలవాటు పోగొట్టుకోవాలంటే దాన్ని ఎదిరించాలి; అసత్యాన్ని నీ చైతన్యం నుంచి నెట్టివేసి, నిజం చెప్పకపోవడం, నిజం చూడలేకపోవడం అనే అలవాటు పోగొట్టుకోడానికి కష్టపడాలి. అది జరగాలంటే నిజం చెప్పటమనే అలవాటు చేసుకో, నిజాన్ని గ్రహించే అలవాటును, ఎల్లప్పుడూ సత్యాన్నే చెప్పే అలవాటును క్రమంగా సాకారం చేసుకో. లోపాన్ని తరిమికొట్టడమనేది వ్యతిరేకాత్మకత, నిజాన్ని గ్రహించాలనే అలవాటు అభ్యుదయాత్మకత.

అన్ని విషయాల్లోను అదే విధంగా ఉంటుంది. ఉదాహరణకు నీలో ఎక్కడో ఒక చోట ఒక రకమైన అసహ్యభావన, అజ్ఞానం, దురహంకారము, అస్పష్టమైన ఏవగింపు, పై నుంచి వచ్చినదాన్ని తిరస్కరించడం ఉన్నదనుకో. వ్యతిరేకాత్మక వైఖరి అంటే ఆ స్వభావాన్ని ఎదిరించి అది వ్యక్తం కాకుండా నిరోధించడము. అలా కాకుండా దాన్ని ఏమీ చేయకుండా నీలోనే సమర్పణా భావం పెంచుకొని, నివేదన, ఆత్మార్పణ, ఇంకా దివ్యశక్తులతో సహకరించటం ద్వారా నిన్ను మార్చుకోవడం అభ్యుదయాత్మక వైఖరి. అర్థమైంది కదా!

ఇంకా చెపుతున్నాను. కొంతమంది కోపగించుకునే వారుంటారు. కోపావేశంతో ఊగిపోయేవారు... అది పోగొట్టుకోవడానికని చాలా తంటాలు పడతారు. కోపాన్ని వ్యతిరేకిస్తారు, ఆ ప్రకంపనలు వారిలో ప్రవేశించకూడ దనుకుంటారు. కానీ దానికి బదులు చెరిగిపోని నిశ్చలత, పూర్ణమైన ఓరిమి, ఎదుటివారిని అర్థం చేసుకోగలగటం, ప్రశాంతదృష్టి, నిశ్చలమైన నిర్ణయము అలవడితే అది అభ్యుదయాత్మకమైన వైఖరి.

CWM 7:202-03

మానవ ప్రకృతి చాలా పరిమితమైనది, ఎన్నో వ్యతిరేక భావాలతో, పాసగని గుణాలతో కూడినది. ఉదాహరణకు ఎవరైనా నిమ్నస్థాయి ప్రేమను, అంటే మానవులకు సాధారణంగా అనుభవంలో నున్న ప్రేమను గర్హించాలనుకునే ప్రయత్నం చేస్తే, తమకున్న ప్రేమించే గుణాన్ని పూర్తిగా కోల్పోయి ఒక బండరాయి లాగ తయారవు తారు. ఆ తర్వాత ఎంతో కాలం తర్వాత గానీ ప్రేమను తెలుసుకొని తమలో

ప్రతిష్ఠించుకొని వ్యక్తపరచగలిగిన జ్ఞానం తిరిగి రాదు.

కాబట్టి ఏమి చేయాలంటే, ప్రేమ ఏ రూపంలో అంకురించినప్పటికీ దాని బాహ్య స్వభావాన్ని నిశితంగా పరిశీలించి దాని వెనుక నున్న, దాని ఉనికికి కారణమైన ఆ దైవతత్వాన్ని తెలుసుకోవాలి. సహజంగానే ఇందులో చాలా ఉచ్చులు, అడ్డంకులు ఉన్నప్పటికీ అది ప్రయోజనకారి; తన ప్రేమ హీనప్రేమ అవుతుందేమోనన్న భయంతో ప్రేమనే తిరస్కరించకుండా, హీనమైన ప్రేమను విరమించి సవ్యమైన ప్రేమను వాంఛించాలి.

మానవుల మధ్య ప్రేమలు అనేక రకాలు: పిల్లలపై తల్లిదండ్రుల కుండే ప్రేమ, పిల్లలకు పెద్దలపై ప్రేమ; అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ మధ్య ప్రేమ; స్నేహితుల మధ్య ప్రేమ, ప్రేమికుల ప్రేమ మొదలైనవన్నీ కూడా అజ్ఞానం, స్వార్థం, ఇంకా అనేక అనర్థాలతో కూడి ఉంటాయి, అది మానవ బలహీనత; అందువల్ల పూర్తిగా ప్రేమకు దూరం కాకూడదు. శ్రీఅరవిందులు ఏం చెప్పారంటే అలా దూరం చేసుకోవడం కష్టతరమే కాక హృదయం బీడువారి పోవటం తప్ప మరే ప్రయోజనం ఉండదు. అందువలన ఎలా మంచిగా ప్రేమించాలో తెలుసుకోవాలి: అంకితభావంతో, సమర్పణాభావంతో, ఆత్మనిగ్రహంతో ప్రేమించాలి. ప్రేమ పట్ల తిరస్కారం కాకుండా దాని విపరీత భావాలపై, అంటే వాటిని అనుసరించి ఉండే స్వార్థం, అనుబంధం, ఆధిపత్యభావం, అసూయ మొదలైన వ్యతిరేక భావాలను నిరోధించాలి. అన్నీ ఆధీనంలో ఉంచుకోవాలనీ, అజమాయిషీ చేయాలని అనుకోకూడదు. తన ఇచ్ఛ ప్రకారమే జరగాలనీ, తన కోరికలు తీరాలనీ, అన్నీ పొందాలనీ కాకుండా తనే ఇవ్వాలి. ఎదుటివారి ప్రతిస్పందన కోసం చూడకుండా తనకుండే ప్రేమతోనే తృప్తిచెందాలి. తన కోరికలు, స్వప్రయోజనాలు, తన సుఖసంతోషాల కోసం చూడకుండా తన ప్రేమానురాగాలను ప్రతిఫలాపేక్ష లేకుండా పంచిపెట్టాలి. కేవలం ప్రేమించడంలోనే ఆనందం పొందాలి. అంతే.

CWM 8:301-302

బాహ్యదృష్టికి ఒక మనిషి అవయవాలన్నీ చక్కగా పనిచేయగల స్థితిలో నుండి అతనికి మానసిక సంతులనం కూడా ఉన్నట్లయితే, అతనికి అంటువ్యాధులను తట్టుకునే నిరోధకశక్తి ఉంటుంది. ఏ కారణం వల్లనైనా లేక మానసిక ఆందోళన,

అసంతృప్తుల వల్లగానీ నైతికమైన కష్టాలు భరింపలేని అలసట వలనగానీ అసమతాస్థితి చెడితే, అది అస్వస్థతకు దారితీస్తుంది.

CWM 9:122

పరిపూర్ణతే సామరస్యము, అదే సమతుల్యము. ఈ సమతుల్యం అంటే ఏమిటి? ఇక్కడ భౌతికశాస్త్రం ఎవరు చదివారు?

సాధకుడు: ఒక త్రాసులో రెండు వైపులా సమాన భారాన్ని ఉంచినప్పుడు అది సమతుల్యంగా ఉంది అంటారు.

అమ్మ: అదే కదా. అయితే పరిపూర్ణత అనేది సమతుల్యం అంటే దానికి ఏమి చెపుతారు?

సాధకుడు: ఒకానొక పరిస్థితిలో సిద్ధి కలుగకుండా ఏదైనా వ్యతిరేకిస్తున్నప్పుడు దాన్ని చేతనాశక్తితో జయించినప్పుడు తత్ఫలితంగా ఆత్మసిద్ధి వ్యక్తమవుతుంది.

అమ్మ: అవును. అంతే... పరిపూర్ణత్వమనేది ఒక స్తబ్ధస్థితి కాదు. అది పురోగామియైన శక్తిచాలన సమతుల్యము.

CWM 4:14, 15

*

మనం మంచి చెడులని చెప్పుకునేదాంట్లో అర్థం తక్కువ. అంతకంటే నిర్మాణాత్మకత, నిర్మూలాత్మకత అనవచ్చు; పురోగాత్మకం, తిరోగాత్మకం అనవచ్చు. అదే ముఖ్యం కొంతమంది చాలా ప్రకాశవంతంగా, సంతోషంగా నవ్వుతూ ఉంటే కొంతమంది మందకొడిగా కుంగిపోయి, ద్వేషపూరితంగా, అసంతృప్తిగా, చీకటి నీడల్లో ఉంటారు. అక్కర్లేనివాటి నన్నిటినీ అకర్షిస్తారు. దీప్తివంతంగా ఉండేవారు, అది ఆధ్యాత్మిక దీప్తి కాకపోయినప్పటికీ వారు మంచితనాన్ని, సమతులనాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ, జీవించడంలోని ఆనందాన్నీ వెదజల్లుతారు. జీవించడంలో ఆనందాన్ని చవిచూచేవారు ప్రకృతి సామరస్యంతో ఏకమై యుంటారు కాబట్టి వారు ఆకస్మిక ప్రమాదాలకు లోను కారు, వ్యాధులు వారి దగ్గరకు రావు. ఈ ప్రపంచ స్థితిగతుల్లో వారి జీవితం ఎంత శోభాయమానం కాగలదో అంతగానూ అవుతుంది.

CWM 6:3

మానవుని సంతోషపెట్ట గలిగేది ధనం కాదని మళ్ళీ మళ్ళీ చెపుతున్నాను. అది

కేవలం అంతర్గతమైన శక్తి సమతులనం, మంచి ఆరోగ్యం, మంచి భావాలు.
CWM 13:174

శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

ఆత్మ చైతన్య శక్తి

మన అస్తిత్వంలోని అత్యల్పమైన భాగానికి మాత్రమే మనం ఎరుక కలిగి ఉంటాం, చాలా వరకు మనం అచేతనులమై ఉంటాం. ఈ అచేతనే మనలను మనం తిరిగి సంస్కరించుకోకుండా నిమ్నప్రకృతికి కట్టి పడేసి, మనం ఆ స్థితిని పరివర్తన చేసుకోకుండా, రూపాంతరం చేయకుండా అడ్డుకుంటుంది. ఈ అచేతనత్వం ద్వారానే దైవవ్యతిరేక శక్తులు మనలో ప్రవేశించి, మనలను వాటికి బానిసలుగా చేసుకుంటాయి.

నీ గురించి నీవు ఎరుకతో ఉండాలి, నీలోని స్వభావానికి, నీలోని కదలికలకి నీవు ఎరుకతో ఉండాలి, నీవు చేసే పని కాని లేదా ఆలోచన కాని ఎందుకు చేస్తున్నావో, దేని కోసం చేస్తున్నావో తెలుసుకుని తీరాలి. నిన్ను కదిలించే నీ ఉద్దేశ్యాలు, ప్రేరణలు గుప్తమైనవి. పైకి కనిపించే శక్తులు అన్నింటిని అర్థం చేసుకోవాలి. నిజానికి ఈ అస్తిత్వం అనే పూర్తి యంత్రాంగంలోని ప్రతి చిన్న అంశాన్ని, భాగాన్ని పరిశీలించి తెలుసుకోవాలి.

ఒకసారి ఆ ఎరుక నీకు కలిగినపుడు, ఏ శక్తులు నిన్ను క్రిందికి లాగుతున్నాయో, ఏవి నీకు సహాయకారిగా ఉన్నాయో, వాటి మధ్య తేడా నీవు గమనించి, వాటిని మార్చుకోగలవు. నీకు సరైన దానికి పొరపాటుకి, సత్యానికి అసత్యానిక, దివ్యమైనదానికి దివ్యం కానిదానికి మధ్య తేడా తెలుసుకోగల్గినపుడు, నీవు నీ పరిజ్ఞానంతో అక్కర్లేనివి వదిలి మిగతావాటికి సమ్మతించగలవు. ఆ విధమైన ద్వంద పరిస్థితి ప్రతి అడుగులోను ఎదురౌతుంది, అందువల్ల నీవు ప్రతిసారి రెండింటి మధ్య ఎన్నుకోవలసి ఉంటుంది. నీవు చాలా సహనంతో పట్టు విడవకుండా ఉండాలి, మెలకువతో 'నిద్రపోకుండా' అంటే పెద్దలు చెప్పినట్టు జాగురూకుడవై యుండాలి. నీవు ఎప్పుడూ దివ్యశక్తులకు వ్యతిరేకమైన ప్రతికూల శక్తులకు అవకాశం ఇవ్వకుండా తిరస్కరించాలి.
CWM 3:2

నీ స్వయం పరిపూర్ణత కోసం చేసే కృషిలో మొదటి మెట్టు నీ గురించి నీకు చైతన్యం కలగటానికి ప్రయత్నించటం. దానికి తోడు, నీ అస్తిత్వపు వివిధ భాగాలను గురించి, అవి నెరవేర్చవలసిన పనుల గురించిన అవగాహన కూడా పెంచుకోవాలి. నిన్ను కార్యాచరణకు పురిగొల్పే కదలికలు, ప్రేరణలు, ప్రతిస్పందనలు, పరస్పర విరుద్ధమైన కోరికల మూలమేమిటో తెలుసుకోగలుగుట, ఆ వివిధ భాగాలను ప్రత్యేకంగా గుర్తించగలుగుట నేర్చుకోవాలి.

ఇది చాలా శ్రద్ధాసక్తులతో కూడిన పని. అందుకు చాలా పట్టుదల, చిత్తశుద్ధి అవసరం. మనిషి స్వభావం, ముఖ్యంగా అతని మానసికస్థితి, అతను ఏ విషయం గురించి ఆలోచించినా, అనుభూతి చెందినా, మాట్లాడినా, నిర్వహించినా, అందుకు అనుకూలమైన వివరణ నిచ్చి సమర్థించుకొనుటకు అప్రయత్నంగానే ఉపక్రమిస్తుంది. ఈ కదలిక లన్నింటిని కలిసికట్టుగా క్షుణ్ణంగా పరిశీలించి వాటిని చిత్తశుద్ధితో కూడిన సంకల్పంతో, మన అత్యున్నత ఆదర్శానికి అనుగుణంగా వున్నాయా లేదా అని విచారించగలిగినప్పుడే, మనకు పొరపాటుపడ వీలులేని విశ్లేషణ గావించే అవకాశం ఏర్పడుతుంది.

నిజంగా మనం పురోగమించాలని, మన అస్తిత్వపు సత్యం తెలుసుకోగలిగే సమర్థతను పొందాలని అనగా, మనం ఎందుకోసం సృష్టించబడ్డామో, లోకంలో మనం చేపట్టాల్సిన ఉద్యమమేమిటో — కోరుకున్నట్లయితే, మనమొక క్రమమైన, అవిచ్ఛిన్నమైన పద్ధతిలో మన ఉనికి యొక్క యదార్థతను వ్యతిరేకించేదానిని, అందుకు ప్రతికూలమైనదానిని, మనలో నుండి పెరికివేయాలి. ఈ విధంగా, కొద్ది కొద్దిగా, మన అస్తిత్వంలోని అన్ని భాగాలు, అన్ని మూలపదార్థాలు మన మానసిక కేంద్రం చుట్టూ ఒక సక్రమమైన రీతిలో పరిపూర్ణంగా వ్యవస్థీకరించవచ్చు.

ఈ సమరూపతను కల్పించే కార్యం కొంత మేరకైనా సమగ్రంగా రూపొందించటానికి చాలా కాలం పడుతుంది. అందువలన దానిని సాధించటానికి మనం చేసే ప్రయత్నం సఫలీకృతం కావటానికి అవసరమయ్యేంత కాలం జీవితం కొనసాగాలని మనలను మనం సహనంతో, ఓరిమితో దృఢచిత్తులం కాగలగాలి

CWM 12:3-4

... ఈ రకమైన ఆత్మ చైతన్యం తాను స్వయంగా తన కార్యాచరణని పర్యవేక్షించే

అవకాశం, అంటే మనం ఏ పనైనా ఎందుకు చేస్తున్నామో, ఏ విధంగా చేస్తున్నామో, దాన్ని అర్థం చేసుకుంటూ వాటి మీద నియంత్రణ కలిగి, అవసరానికి అనుగుణంగా మార్చగలగటం. అది మనసుకు, కొంతవరకు మనిషికి సంబంధించింది.

మనిషికి మృగానికి మధ్య ఉన్న ముఖ్యమైన తేడా ఇదే — మనిషి తనకు తాను ఎరుక కలిగి ఉంటాడు, అతడిని కార్యాచరణకు పురికొల్పే శక్తి యొక్క ఎరుక కలిగి ఉంటాడు — ఎరుకతో ఉండడమే కాదు, దానిని నియంత్రించగలడు కూడా.

CWM 8:60

నీవు ముందుగా నీ గురించిన ఎరుకతో ఉండాలి. తరువాత ఆలోచించాలి, ఆ తరువాత కార్యాచరణ చేపట్టాలి అని శ్రీఅరవిందులు చెప్తారు. అస్తిత్వం యొక్క అంతరంగ సత్యదర్శనం కార్యాచరణకి పూర్వమే కలగాలి — ముందుగా సత్యం యొక్క దర్శనం, తదుపరి ఆ సత్యం ఆలోచనగా రూపొందడం, తరువాత ఆలోచన కార్యరూపం దాల్చడం. అది సాధారణంగా సాగే ప్రక్రియ.

CWM 8:396

నీ పరిశీలనా శక్తి — అత్యంత అధికంగా కోరతగినదై ఉండి తీరాలి అని నేను చెప్ప గలను. అది నీవు ఏ విషయం గురించి కార్యాచరణ చేస్తున్నావో దాన్ని పరిశీలించడానికి ఆ కార్యాచరణకి ఏ పద్ధతిని ఉపయోగిస్తున్నావో, ఏ ఫలితాలు పొందావో, ఆ అను భవం నించి నీవు ఏమి తెలుసుకున్నావో, నీవు ఏ పాటి జ్ఞానాన్ని సంపాదించావో, ఇవన్నీ అర్థం చేసుకోడానికి. కాని వీటన్నింటినీ వదిలేసి కేవలం నీ కార్యాచరణను గమనించడం కాదు. మనలను మనం పరిశీలించుకునే విధంగా తయారుకావడం అనే ఈ కదలికే నిజానికి ప్రమాదకరమైనది. ఇది ఎప్పుడూ చాలా విచారకరమైన పరిస్థితికి, కొన్నిసార్లు చాలా తీవ్రమైన ఘటనకు కారణమౌతుంది. చాలామంది తమను తాము గమనించుకొంటూ, తామేం చేస్తున్నారో, ఎలా జీవిస్తున్నారో గమనిస్తూ కాలం వెళ్ళబుచ్చుతారు. దీనినే ఆంగ్లంలో 'సెల్ఫ్ కాన్షస్' మనుషులని పిలుస్తూ ఉంటాం, అంటే వారు చేసే పనిలో నిజాయితీగా ఉండడం, ఏది చేస్తున్నారో దానిలో సంపూర్ణంగా నిమగ్నమై వుండుటకు బదులుగా, వారిని వారు ఎలా పని

చేస్తున్నారో చూసుకుంటూ, వారిని వారు ప్రశంసించుకోడమో, లేదా తక్కువ చేసుకోడమో చేస్తూ ఉంటారు — వారి వారి ప్రత్యేక స్వభావానికి అనుగుణంగా.

కొందరు వారి కార్యాచరణని ప్రసన్నచిత్తంతో, అత్యధిక సంతృప్తితో చూస్తూ, వారిని వారు అతి విశిష్ట వ్యక్తులుగా భావించుకుంటారు. మరికొందరు దానికి విరుద్ధంగా విమర్శనాత్మక మనసుతో, వారిని వారే ఎల్లప్పుడు విమర్శించుకుంటూ ఉంటారు. నిజానికి ఆ రెండింటిలో ఏ ఒక్కటి మంచిది కాదు. ఈ రెండు చెడ్డవే. ఉత్తమమేమంటే, నీ గురించి నీవు ఆలోచించుకోకుండా ఉండటం.

మనకేదైనా చేయవలసిన పని ఉంటే, ఆ పనిపై దృష్టిని నిలిపి, దానిని చక్కగా చేయడానికి ప్రయత్నించడం. అది చేయడం ఎప్పుడూ మంచిదే. కాని — బాగా చేసానా లేదా అని కాని — దానిని తానే చేస్తున్నట్టు భావించి ప్రశంసించుకోవడం గాని నిరసించుకోవటంగాని చేయకూడదు. అది వట్టి నిరర్థకమైన, ఏమాత్రం ఉపయోగంలేని పని.

ఏ పనిని ఎలా చేయాలి, దాన్ని చేయడానికి ఏది ఉత్తమమైన పద్ధతో, దానిని కనుక్కోవడం చాలా ఉపయోగకరం. కాని ఆ పనిని మనమే చేస్తున్నామన్న భావంతో పొగుడుకోవడం లేదా బాగా చేయలేదని కించపరుచుకోవడం, వట్టి పనికిరాని పనే కాదు, దురదృష్టకరం కూడా.

CWM 7:19

శ్రీమాత

అనువాదం డి. సత్యవాణి

ప్రారంభంలో చాలా మంది అంటారు, "నీవు చెప్పే ఈ అంతరంగ చైతన్యం అంటే ఏమిటి? అది నాకు తెలియదు"? దీనివల్ల వారి సామాన్య చైతన్యం కంటె ఉన్నతస్థాయి చైతన్యం గురించి వారికి ఎరుక లేదని తెలుస్తూనే ఉంది. దాని అర్థం అందుకు సిద్ధపరచే అనేక స్థితులు, ఎరుక కలిగించే స్థాయిలు అవసరమని.

CWM 7:1

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

అంతర్ మార్గ నిర్దేశకత శక్తి

తమ బుద్ధి, వస్తువులు, వ్యక్తులను గురించి, సరైన అభిప్రాయాలను, సరైన నిర్ణయాలను, సరైన దృక్పథాలను సూచిస్తున్నదా, తమ నడత లేదా కర్మ చేసే పద్ధతికి సరైన సూచనలు యిస్తున్నదా లేదా అని తెలుసుకొనే ప్రయత్నం జనం చేయడం లేదనేది అసలు విషయం. వాళ్లకో భావం యేర్పడుతుంది. దానినే సత్యమని అంగీకరించి లేదా అది తమ భావం గనుక మంచి చెడూ చూడకుండా ఆ ప్రకారం నడచుకొంటారు. మనస్సుతో పొరపాట్లు చేసామని గ్రహించినప్పుడు కూడా దాన్ని ముఖ్య విషయంగా పరిగణించరు లేదా మానసికంగా అదివరకటి కన్న మరింత జాగ్రత్తగా వుండడానికీ ప్రయత్నించరు...

మనుషులు తమ బుద్ధి ననుసరించే జీవిస్తారని భావిస్తాం. ఏ విధమైన నియంత్రణ లేకుండా తప్పైనా రైటైనా తమ భావాలనే పట్టుకొని జీవిస్తారు. మనిషికిగల అత్యున్నత ఉపకరణం బుద్ధి అన్నారు. దాని భావాల ననుసరించే అతడు ఆలోచించాలి, కర్మ చేయాలి. కాని ఇది యదార్థం కాదు. మార్గం చూపించడానికి ప్రాణికం లాగానే దానినీ పరిశీలించి మార్గదర్శకం చేయడానికి ఒక అంతరంగ వెలుగు అవసరం. బుద్ధిని మించినదేదో ఒకటుంది. దాని నతడు ఆవిష్కరించుకోవాలి. యదార్థ జ్ఞానానికి మూలమైనదాని కర్మ జరగడానికి మధ్య ఉండేది మాత్రమే బుద్ధి.

CWSA 32:617-18

*

మానవుని చింతన మనస్సుకు, ప్రతిదానికీ అనేక పార్శ్వాలు కన్పిస్తాయి. అవి తమ మొగ్గుదల, లేక అభిమానం, దానికి అలవాటైన భావాలు లేదా ఏది అత్యుత్తమమని తనను తాను బుద్ధికి చూపుకొనే యేదో కారణాన్ని బట్టి అది నిర్ణయిస్తుంది. మరేదో దాని లోనికి ఒక ఉన్నత వెలుగును ప్రసరించినపుడు — అంతరాత్మిక శక్తి లేదా అంతఃస్ఫూర్తి దానిని స్పర్శించినపుడు, అనుభూతి చెందేటట్లు, లేదా దర్శించేటట్లు చేసినపుడు — మాత్రమే దానికి నిజమైన సత్యం లభిస్తుంది.

SABCL 24:1247

*

చెదరని ప్రశాంతితో సమస్తాన్నీ చూడాలి. 'మంచి' 'చెడు' లు రెంటినీ ఉపరితలం

మీది ప్రకృతి చలనంగా చూడడం సరైన పద్ధతి. పొరపాటు లేకుండా లేక అహంకారం లేక తప్పుడు ప్రతిచర్యలు లేకుండా యదార్థంగా అలా చేయడానికి, వ్యక్తిగతం, పరిమితం కానటువంటి చేతన, జ్ఞానం అవసరం.

SABCL 24:1267

*

మేధస్సుతో అర్థం చేసుకొనేది నిమ్నబుద్ధి మాత్రమే. మేధస్సు కానిది, అంతర్ దృష్టికి సంబంధించిన మరో ఉన్నతమైన బుద్ధి ఉన్నది. అది క్రింది స్థాయి నుండి పై స్థాయిలో నున్నదానిని అర్థం చేసుకోవడం వంటిది కాదు. జ్ఞానంలో పైన నిలవడం. అది జ్ఞానాన్ని వెతుక్కోదు, పరిశీలించిన సమాచారానికి లోబడి జ్ఞానాన్ని పొందదు. కాని అది అదివరకే సత్యాన్ని వశంచేసుకొని వుండి, తనకు తాను ఆంతరంలో వ్యక్తమయ్యే, అంతఃస్ఫురిత ఆలోచన ద్వారా దానిని బహిర్గతం చేస్తుంది.

CWSA 23-24:311

శ్రీఅరవిందులు

*

నీ తీర్పు కాధారం యేది? నీవు నిర్ణయించడానికి యే జ్ఞానం నీకు అనుమతినిస్తుంది? “ఇది చేయాలి లేక అది చేయాలి, ఇది చెప్పాలి లేక అది చెప్పాలి లేక నేనేం చెప్పగూడదు” అంటూ నీ ముందుకొచ్చే లెక్కలేనన్ని సంభావ్యతలా నీ తీర్పు కాధారం? నీవు ఆ విషయం వంక నిశితంగా చూస్తే, ప్రతి అడుగులోనూ నీకేం తెలియదనే విషయాన్ని గ్రహిస్తావు. ఏ ఆధారంపై నీ తీర్పు వుంటుంది?

నీ లోపలకి వెళ్ళే అలవాటు నీకుంటే, ఆంతర అంతరాత్మ చేతనకు విన్నవించుకొని దానిని నిర్ణయించనిచ్చి, చేయదలచుకొన్నదానిని, కృతనిశ్చయంతో, సంశయం లేకుండా ఏ ఒక్క సమస్య లేకుండా చేస్తావు. ఇదీ చేయవలసింది, తెలిసిందా! దాన్ని గురించి మీరేం ప్రశ్నించగూడదు, అదొక్కటే మార్గం. నీ అంతరాత్మ సంబంధమైనది యెరుకతో సదా నీకు దారి చూపుతుంటే, నిరంతరం యెరుకతో దాన్ని చేయగలుగుతావు. కాని చేయవలసింది మాత్రం అలానే...

నీలో తెలుసుకొనివున్నది ఒకే ఒకటి వుంది. అదే అంతరాత్మ శక్తి. అది పొరపాటు చేయదు. అది వెంటనే క్షణంలో నీకు చెప్తుంది. మారుమాట గాని, నీ భావాలు, వాదనలు గానీ లేకుండా అది చెప్పినట్లు చేస్తే, నీవు సరైనదే చేసేటట్లు చేస్తుంది.

కాని యింకా యేది చేసినా... నీ పని అయిపోయినట్లే.

ఏం చదవాలనుకొంటున్నావు, ఏది చదవొద్దనుకుంటున్నావు, ఏ పని చేద్దామను కొంటున్నావు, ఏ మార్గ మనుసరిద్దా మనుకొంటున్నావు? అన్నింటి విషయంలోనూ అలానే చేయాలి. కాని అప్పుడు నీ ముందు సమస్త సంభావ్యతలు వచ్చి నిలుస్తాయి. నీవు జీవితంలో నేర్చుకొన్నదంతా, యెదుర్కొన్నదంతా, నీవు స్వీకరించిన, అన్ని ప్రక్కల నుంచి వచ్చిన సూచనలు, వున్నవన్నీ అలా నీ చుట్టూ గంతులేస్తుంటాయి, వాటిలో దేనితో నీవు నిర్ణయిస్తావు?

పూర్తిగా నిజాయితీపరులు, ముందుగా యేర్పరుచుకొన్న అభిప్రాయాలు, దురభిమానాలు, యాంత్రికంగా నిత్యం అనుసరిస్తూండే నియమ నిబంధనలు లేనివాళ్ళ విషయం, సత్యం తెలుసుకోవాలని అసలే మాత్రం కృషి చేయనివాళ్ళ విషయం, తమ మానసిక కల్పనే సత్యమనుకొనే వాళ్ళందరి విషయం నేను మాట్లాడుతున్నాను. అప్పుడది చాల తేలిక, తన దారిలో తాను ముక్కుసూటిగా పోతాడు, ముక్కు గోడకు కొట్టుకొని చితికిపోయేదాకా ఆ విషయం గమనించడు. అలా గాకపోయినా అది మహా కష్టం.

అజ్ఞానంలో మనిషి సదా నివసిస్తుంటాడు, అజ్ఞాన మనస్సు స్థానంలో జ్యోతి ర్మనస్సును నిలుపకపోతే, యదార్థ మార్గాన్ననుసరించలేడు, ఏ విధమైన సమగ్ర రూపాంతరీకరణ జరగడానికైనా ముందు ఈ విధమైన సంసిద్ధత అనివార్యం, అని శ్రీఅరవిందులు చెప్పినదాని కర్థం.

CWM 7:221-22

*

లోతైన శాస్త్రీయ జ్ఞానం మీద, చాలినంత నిష్పాక్షికత మీద తీర్పులు ఆధారపడినపుడు సాధారణంగా అంతా సవ్యంగా జరిగిపోతుంది. మామూలుగా నిర్వివాదమైనదిగా పరిగణించబడే ఇంద్రియ అవగాహన మీద ఈ తీర్పులు ఆధారపడి వుంటాయి. ఏదైమైనప్పటికీ ఈ అవగాహనా విధానమే స్వయంగా అనిశ్చితం. జ్ఞానేంద్రియాలు వాటి నుపయోగించే వ్యక్తి మానసిక స్థితి ప్రత్యక్ష ప్రభావం క్రింద వుంటాయి. అందుచేత ఇంద్రియ అవగాహనలు, చూచిన వస్తువును గురించి చూచినవానికి కలిగిన సంవేదనలచే ఏదో విధంగా మారతాయి, అసత్యం అవుతాయి, వికృతం అవుతాయి.

ఉదాహరణకు ఒక బృందానికి లేదా సంఘానికి చెందిన సభ్యులు అదే బృంద సభ్యులతో అతి సౌమ్యంగా లేక అతి కాఠిన్యంతో వ్యవహరించవచ్చు. సత్యమైన దృష్టి నుంచి చూస్తే, అతిసౌమ్యతగాని, కాఠిన్యతగాని ఏదీ మరొకదాన్ని మించి మంచిది గాదు. ఎందుకనంటే రెండు సందర్భాలలోను తీర్పు సంవేదన మీద ఆధారపడిందే గాని వాస్తవాలను, విషయపరమైనవిగా అనాసక్తితో చూడడం మీద ఆధారపడి వుండదు. ఇది చాలా స్పష్టం. ఇంత దూరం కూడా పోకుండా చెప్పాలంటే, ఏ మానవుడూ ఈ ఆకర్షణ వికర్షణల నుండి స్వతంత్రుడు కావడం. ఇది ఒక జాగృతమైన చేతనకే అరుదుగా కన్పిస్తాయి. అయినప్పటికీ, ఇంద్రియాల పని తీరు మీద గొప్ప ప్రభావం చూపుతాయి.

CWM 12:263-64

*

స్వార్థచింతన, అహంకారిక ప్రతిచర్యల మీద ఆధారపడిన మానవ తీర్పుల తెలివి తక్కువతనాన్ని మనకు బాగా తెలిసేటట్లు చేస్తుంది ఇదంతా.

మనుష్యులు తమ ప్రస్తుత అజ్ఞాన దశలో వున్నంతకాలం, వాళ్ళతీర్పులు అభిప్రాయాలు పరమ సత్యం ముందు యెందుకూ కొరగావు, వాటినలాగే పరిగణించాలి.

CWM 10:296

*

ప్రాణిక నిజాయితీ: మన తీర్పును తారుమారు చేయడానికి మన కర్మను నిర్దేశించడానికి మన భావోద్రేకాలను, కోరికలను అనుమతించకపోవడం.

CWM 14:201

*

వీలైనన్ని యెక్కువ దృక్కోణాల నుండి ఒకే విషయాన్ని గమనించడం చాలా అవసరం. ఇది సాధించడం కోసం ఆలోచనకు గొప్ప మార్దవాన్ని, ఉన్నతిని కట్టబెట్టేందుకు ఒక కసరత్తు వుంది. అదిలా చేయాలి. స్పష్టంగా రూపమివ్వబడిన ఒక సిద్ధాంతాన్ని తీసుకోడానికి వ్యతిరేకంగా దాని ప్రతికూల సిద్ధాంతాలను అంతే సునిశితంగా తయారుచేసి పెట్టు. అపుడు జాగ్రత్తగా విచారణ జరుపడం ద్వారా పరస్పర విరుద్ధాలైన ఆ రెండూ ఒక విశాల ఉన్నత సర్వతోముఖ భావంతో సంయోజనమొందే

వరకూ సమస్యను విస్తృతం చేసుకొంటూ లేదా, దాని కలీతంగా పోవాలి.

CWM 12:15

*

ఒక విషయం మీద ఒక కచ్చితమైన, దృఢమైన, స్పష్టమైన, నిర్దిష్టమైన భావాన్ని యేర్పరచుకోవడంలో సఫలం కావాలంటే నీవు అందుకు తగిన ప్రయత్నం చేయాలి. నీవు నీ మొత్తం అస్తిత్వాన్ని ఒక చోటికి చేర్చుకోవాలి, దృఢంగా తయారై విషయంపై యేకాగ్రత నిలపాలి. మొట్టమొదటిసారి చేస్తున్నపుడు అది అక్షరాలా బాధ కలిగిస్తుంది, అలసిపోయేటట్లు చేస్తుంది. దాన్ని గనుక నీవు అలవాటు చేసుకొనకపోతే నీ జీవితం అంతా దేనినీ తీర్మానించుకొనలేని స్థితిలో గడిపివేస్తావు. వ్యావహారిక విషయాల కొస్తే, అవి యెదురైనప్పుడు — ఎందుకనంటే అన్నింటినీ ప్రక్కన పెట్టినప్పటికీ యెవరికైనా అలా అవి యెదురుగాక తప్పదు — అనేక సమస్యలు, ఫక్తు వ్యావహారికమైనవి పరిష్కరించవలసి వచ్చినప్పుడు సమస్యకు సంబంధించిన మూల అంశాలను విడివిడిగా తెలుసుకొనగలగడానికి బదులు, వాటి నొకదాని కెదురుగా మరొకదాన్ని పెట్టి సమస్యను ప్రతి వైపు నుంచీ చూసి, దాని కలీతంగా పోయి, పరిష్కారాన్ని చూడటానికి బదులు, యేదో పొగలాంటి అనిశ్చితమైన దాని సుడులలో పడి నీవు కొట్టుకుపోతావు. అంతేగాక నీతలలో అనేక సాలెపురుగులు పరుగులు పెడ్తున్నట్లుంటుంది — కాని నీవు పరిష్కారాన్ని కనుగొనడంలో విజయం పొందలేవు.

CWM 8:182

*

ప్రశాంతంగా, మౌనంగా ఉండడం నేర్చుకొనటానికి.... పరిష్కరించవలసిన సమస్య ఒకటెదురైనపుడు, సమస్త సంభావ్యతలు, సమస్త పర్యవసానాలు, చేయదగిన, చేయదగని సమస్త సంభవతల గురించి ఆలోచిస్తూ నీ బుర్రలో చక్కర్లు గొట్టకుండా, శుభం జరగాలనే ఆకాంక్షతో, వీలైతే శుభేచ్ఛ అవసరం అనుకొంటూ, నీవు ప్రశాంతంగా వుంటే పరిష్కారం చాలా త్వరగా లభిస్తుంది. నీవు మౌనంగా వున్నావు గనుక దానిని నీవు వినగలుగుతావు.

నీవు యిబ్బంది పడుతున్నపుడు ఈ పద్ధతిని ప్రయత్నించు. అలజడి చెందడానికి బదులు, అనేక ఆలోచనలను నెమరువేస్తూ, పరిష్కారాలను చురుకుగా అన్వేషిస్తూ, విచారిస్తూ, చిరుబురు లాడుతా, నీ బుర్రలో ఇక్కడికీ, అక్కడికీ పరుగులు పెడుతూ

— బాహ్యంగా అని కాదు, ఎందుకనంటే బహిరంగంగా ఆ పని చేయగూడదని తెలిసేంత లోకజ్ఞానం నీ కుండే వుంటుంది, కాని లోపల, నీ తలలో — ప్రశాంతంగా వుండు. నీ స్వభావాన్ననుసరించి, ఆవేశంతో లేక శాంతంగా, తీవ్రమైన లేక విశాలమైన లేదా వీటన్నింటినీ ఒక చోటికి చేర్చి దివ్యవెలుగుకై ప్రార్థించు, అది వచ్చేంతవరకు దాని కోసం వేచి వుండు.

ఈ విధంగాచేస్తే మార్గం చెప్పుకోదగినంతగా సుగమమవుతుంది.

CWM 9:422-23

*

ప్రశాంతత, శాంతిలో మాత్రమే చేయవలసిన ఉత్తమమైనదేదో తెలుస్తుంది.

CWM 14:138

*

...నీవు ఒంటరిగా, ప్రశాంతంగా కూర్చోవాలి. నిశ్శబ్దంగా తయారుగావడానికి ప్రయత్నించాలి. చాలా నిశ్శబ్దంగా, చాలా ప్రశాంతంగా తయారై ఫలితం కోసం నిరీక్షించాలి.

ఫలితం లభిస్తుందనే అనుకొంటున్నాను. ఎందుకనంటే అది నీకు కలిగిన యిబ్బంది స్వభావం మీద ఆధారపడి వుంటుంది. పరిష్కరించవలసినది సమస్యే అయ్యుంటే పరిష్కారం లభిస్తుంది. అది ఒక ఆంతరిక చలనమైతే, తప్పుదారి పట్టినదేదో అయితే, మామూలుగా దీన్ని చాలా చిత్తశుద్ధితో చేసినట్లైతే, అప్పుడు దాని సరైన స్థానంలో అది కుదురుకొంటుంది. అదేదైనా నిర్ణయం తీసుకోవలసి వున్నదైతే, చేయవచ్చా, చేయగూడదా అనేవి తెలియని విషయమైతే అప్పుడు కూడా చాలా ప్రశాంతంగా వుంటే అవునా కాదా అనేది తెలుస్తుంది. అది 'అవును' లేక 'కాదు' అని వస్తుంది. అప్పుడు ఇహ దానిని గురించి యేమాత్రం చర్చించగూడదు. 'కాని, అయితే...? ఆ తర్వాత...' అని మనస్సు అనగూడదు, యెందుకనంటే అపుడది పొగమంచులాగా తయారవుతుంది. 'మంచిది' అని అనుసరించాలి. కాని ఇలా జరగడానికి చిత్తశుద్ధి కలిగి వుండాలి, అంటే నీ కంటూ యిష్టాయిష్టా లుండగూడదు.

CWM 7:105

*

కాబట్టి యిటువంటి పరిస్థితులలో, ఇది సత్యం, ఇది అసత్యం, ఇది మనల్ని గమ్యానికి

దూరం చేస్తుంది, ఇది మనల్ని గమ్యానికి దగ్గర చేస్తుంది అని చెప్పడం సాధ్యం గాదు.

ప్రతిదానినీ పురోగతి కుపయోగించుకోవచ్చు. ప్రతిదీ దాన్నెలా ఉపయోగించుకోవాలో తెలిస్తే అది మన కుపయోగపడుతుంది.

ప్రధాన విషయమేమిటంటే నీవు సాకారం చేసుకోవాలనుకొన్న ఆదర్శాన్ని, ప్రతి పరిస్థితిని ఈ పని కుపయోగించుకోవడాన్ని మరచిపోకు.

చివరకు చేయవలసిందేమిటంటే విషయాలకు అనుకూలంగా లేక ప్రతికూలంగా యే నిర్ణయమూ తీసుకోగూడదు. సాక్షిలా నిష్పాక్షికంగా, శుభం జరగడానికే నిర్ణయాలు తీసుకొనే అవసరమైనదాన్నే చేసే దివ్యజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని, సంఘటనలు యెలా పరిణమిస్తున్నాయో గమనిస్తూ వుండు.

CWM 12:821

*

ప్రశ్న: ప్రియమైన అమ్మా! అహం యొక్క సంకల్పాన్ని తొలగించుకోవడం యెలా?

అహం యొక్క సంకల్పాన్ని తొలగించడానికి ముందు — దానికి చాలా కాలం పడుతుంది. ప్రతి సందర్భంలోనూ, చివరకు, నిరంతరంగా అహం సంకల్పాన్ని దైవసంకల్పానికి సమర్పించుకొంటుండాలి. మన ఆధ్యాత్మిక ప్రగతికే గాక శారీరక సంక్షేమం కోసం కూడా అంటే, దేహారోగ్యానికి, మన అస్తిత్వానికి సంబంధించిన సకల కార్యక్రమాల సక్రమ నిర్వహణకు కూడా యేది మంచిదో, మనకు యదార్థంగా యేది అవుసరమో మన కంటె బాగా దైవానికి తెలుసు అనేది మనం తెలుసుకోవడం మొదటి అడుగు.

సహజంగానే యిది అహం అభిప్రాయం కాదు. తనకు కావలసిందేమిటో ఇతరుల కంటే తనకే బాగా తెలుసునని, తీర్పు చెప్పడానికి గాని, నిర్ణయం తీసుకోవడానికి తనకు స్వేచ్ఛ వున్నదని అహం ప్రకటించుకొంటుంది. అది అజ్ఞాని గనుక ఆ విధంగా ఆలోచిస్తుంది., అనుభూతి చెందుతుంది. అందుచేత దాని గ్రహణశక్తి, అర్థం చేసుకొనే శక్తి యదార్థంగా తెలుసుకొనడానికి బాగా పరిమితమైనవని, గ్రుడ్డివీ, సత్యాన్ననుసరించనివీ, కేవలం కోరికల ననుసరించేవి, వాటి ఆధారంగానే అది తీర్పు చెపుతుందనీ, దానికి క్రమంగా నచ్చచెప్పాలి.

ఎందుకనంటే కోరక లనేవి అవసరాలను గాక, యిష్టాయిష్టాలను తెలుపుతాయి.

CWM 16:224-25

శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

పలుకుల రూపము లేని గుసగుస ఆమెను నడుపు
దాని క్రియాశక్తినే గాని, అర్థము నామె సంవేదించలేదు
అతికొద్ది ప్రకటనలు మార్గదర్శకాలుగా నేతెంచు.

సావిత్రి, పుట 51

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

శ్రద్ధాంజలి

'అఖిల' పాఠకలోకానికి చిరపరిచితులు, శ్రీమాతారవింద సాహిత్యసేవలో సుదీర్ఘకాలం గడిపినవారు, విదుషీమణి, విజయనగర శ్రీఅరవింద కేంద్ర వ్యవస్థాపకులలో ఒకరైన నడిమింటి విజయలక్ష్మిగారు, 2014 సం. జూలై, 26 న విజయనగరంలో గుండెపోటుతో శ్రీమాతారవిందుల పాదసన్నిధిని చేరుకున్నారు.

పాఠకలోకం, 'అఖిల' కార్యవర్గం వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.



శ్రీఅరవిందుల బోధన – ఆచరణ – ఆరంభించుట ఎలా

అఖిల

అఖిల భారత పత్రిక – అక్టోబరు 2014


20/10/2014

విషయసూచిక

ప్రథమ భాగము: ప్రధాన విషయాలు

రెండువ భాగము: శ్రీఅరవిందుల బోధనలు: ఆచరణ విధానము

మూడవ భాగము: ప్రారంభించుట ఎలా



శ్రీఅరవిందుల కార్యక్రమం గురించి శ్రీమాత వివరణ

బండరాయి మొక్కగా, మొక్క జంతువుగా, జంతువు మానవుడిగా ఎదిగే పరిణామ ప్రక్రియ ప్రకృతిలో చోటు చేసుకొన్నది. అయితే ఈ ఎదుగుదల పరిణామ క్రమంలో ఈ క్షణాన మానవుడు అత్యున్నత స్థాయిని ఆక్రమించుకొని వున్నందున ఈ ఊర్ధ్వ గమనంలో తాను చేరుకున్నది చిట్టచివరి దశ అని, తన కన్నా మించిన స్థాయి మరొకటి లేదని అతని విశ్వాసం. ఈ విశ్వాసం ఒక పొరపాటు. తన భౌతిక ప్రకృతిలో అతను ఇప్పటికీ పూర్తిగా జంతువే — ఆలోచించగలిగే, మాట్లాడగలిగే జంతువు — తన అలవాట్లలో, ప్రకృతిలో ఒక జంతువుగానే మసలుతున్నాడు. ఇలాంటి అసంపూర్ణ ఫలితంతో నిస్సందేహంగా ప్రకృతి సంతృప్తి చెందలేదు. జంతువుతో పోలిస్తే మనిషి ఎలా వుంటాడో, అలాంటి అస్తిత్వమున్న జీవిని రూపొందించడానికి ప్రకృతి ప్రయాస పడుతుంది. ఆ జీవి బాహ్యప్రకృతిలో మనిషిగా నున్నప్పటికీ ఆతని చైతన్యము అతని మానసిక స్థాయిని అజ్ఞానాంధకార బానిసత్వం నుండి ఉన్నత స్థాయికి కొనిపోతుంది. మనుష్యులకు ఈ సత్యమును వెల్లడి చేయుటకే శ్రీఅరవిందుల పృథ్వీ-ఆగనమనము. వారు మానవాళికి బోధించినదేమిటంటే, మనిషి కేవలం మానసికచేతనలో జీవిస్తున్న ఒక అవస్థాంతర జీవి అని అయితే ఒక నూతన చైతన్యాన్ని పొందగలిగే సంభావ్యత అతని కున్నదని. అదే సత్య చైతన్యము. అతను ఒక సంపూర్ణ సామరస్యతతో కూడిన, సవ్యమైన, అందమైన సంతోషంతో నిండిన, పూర్ణ చైతన్యవంతమైన జీవితం గడపగలడు. ఈ పుడమిపై నున్నంత కాలము, శ్రీఅరవిందులు తమ సమయాన్నంతటినీ తాము దివ్యచైతన్యమని పేరిడిన ఈ చైతన్యాన్ని తమలో స్థిరపరచుకొనటానికి తన చుట్టూ ఉన్నవారికి దానిని సాధించటానికి వలసిన సహాయాన్ని అందించటానికి వెచ్చించారు.

ఇప్పుడు, సర్వమూ నీ యొక్క ఇచ్ఛ మరియు చిత్తశుద్ధి పైనే ఆధారపడి ఉంటుంది. సామాన్య మానవాళికి ఇక ఏమాత్రం చెందకూడదని, కేవలం వికసన మొందిన జంతువులాగా ఇకపై వుండకూడదని, శ్రీఅరవిందుల అతిమానస ఆదర్శాన్ని సిద్ధింప చేసుకొనే నవ్య మానవజాతికి చెందాలని, ఒక నవ్య పృథ్విపై ఒక వినూత్న ఉన్నత జీవితం గడపాలనే దృఢ సంకల్పం నీ కున్నట్లయితే, నీ లక్ష్యాన్ని సాధించుటకు

అవసరమైన సహాయమంతా నీ కిక్కడ లభిస్తుంది.

CWM 12:116-117

శ్రీమాత

అనువాదం: కవిత, అందుగులపాటి కైలాసపతి

పరిణామం — భగవంతుని ప్రగతిశీలమైన స్వయం వికాసం

పదార్థ చేతనామయమైన ఆత్మ యొక్క ప్రగతిశీల వికసనంతో పాటు పశుప్రాయుడైన జీవిలో దైవం తనకు తానుగా అభివ్యక్తమగుటయే పరిణామం.

*

పరిణామమంతా వాస్తవానికి ప్రాణులలో ఆవిష్కరించబడిన చైతన్యశక్తి యొక్క ఉన్నతి అయి ఉంది. అందువలన ఇంకా అవతరించని మరింత మహత్తరమైన తీవ్రత లోకి, పదార్థం నుండి ప్రాణం, ప్రాణం నుండి మనసు, మనసు నుండి ఆత్మలోకి ఉద్ధరించబడుతుంది.

*

పరిణామమంటే భగవంతుడు తనను తాను ప్రగతిశీలంగా అచేతన, అజ్ఞానాల నుండి స్వయం విదితమయిన పరిపూర్ణత లోనికి అనేక రూపాలుగా ప్రకటింప చేసుకోవటమే.

*

పరిణామ సారాంశం బాగా వ్యవస్థీకరించబడిన శరీరాన్ని లేదా దక్షత గల జీవితాన్ని మరింతగా పెంపొందించుకోవటం కాదు. అది కేవలం దాని యాంత్రిక ప్రక్రియ, బాహ్య పరిస్థితి మాత్రమే. పరిణామమంటే పదార్థంలో నిద్రావస్థలో నున్న దివ్యచైతన్యం జాగృతి చెందుటకు, స్వేచ్ఛను పొందుటకు చేసే సంఘర్షణ; తనను తాను కను గొని తన సాధ్యాసాధ్యతలను విశాలంగా, అత్యధికంగా అత్యున్నతంగా, కట్ట కడవరకూ పొందగలగటం. పరిణామమంటే స్వయం వ్యక్తమగు ఆత్మ రహస్యాన్ని దివ్యరూప

ధారిగా, దివ్యశక్తియుతమైనదిగా పరిణతి నొందించి, నెమ్మదిగా దైవంగా ఆవిష్కరింప చేసి ఆత్మోన్నతిని సాధించటం.

ఈ పరిణామంలో మానసికమయిన మనిషి గమ్యం తుదిమెట్టు కాదు. సంపూర్ణ విలువ అత్యున్నతమైన చిట్ట చివరి వైశిష్టత కాదు. ఈ ప్రకృతి యొక్క కఠోర పరిశ్రమకు మకుటాయమానం కావటానికి అతడు మరీ అల్పుడు, అపరిపూర్ణుడు.

ఊర్ధ్వ చేతనతో కూడిన అధి ఆత్మ అచేతన పదార్థంలో ముకిళించుకపోవుటయే ఈ కనిపించే దృశ్య ప్రపంచపు రహస్య కారణం. ఈ పృథ్వి యొక్క చిక్కు సమస్యకు జడమైనదిగా గోచరిస్తూ తీక్షణంగా నడిపించబడే అచేతన ప్రకృతికి కీలక మంత్రం, నిగూఢమైన అనంత చైతన్యపు క్రమవికసనం. ఈ పృథ్వి జీవనం మహత్తరమైన దైవత్వం స్వయంగా ఎన్నుకొన్న నివాసం. దానిని ఒక అంధకారం నుండి తన అద్భుతమైన మహాభవ్యంగా ఒక ఉన్నత స్వర్గాన్నందుకొనే ఆలయంగా మలచాలని ఆయన యుగ యుగాల సంకల్పం.

*

తనలోనే సమస్తాన్నీ కలిసి, పెంపొందే అతిమనస్సు పరబ్రహ్మం యొక్క విస్తృతమైన ఆత్మ పరివ్యాప్తి. భావనా మాత్రం చేత ఈ త్రిగుణాత్మకమయిన ఉనికి, చేతన, ఆనందాలను వాటి అవిభాజ్యమైన ఏకత్వం నుండి పెంపొందిస్తుంది. వాటి మధ్య తారతమ్యం గుర్తిస్తుంది గానీ విభజించదు. అదొక త్రిమూర్తిత్వాన్ని ప్రతిష్ఠిస్తుంది. అది వృద్ధిపరచే, పరిణమింపచేసే, అభివ్యక్తీకరించే శక్తిని కలిగి ఉంటుంది. ఆ శక్తి తనలో ముకుళించుకొనే, ఆవరించగల అర్థగర్భంగా ఉండగల శక్తిని కూడా కలిగి వుంటుంది. ఒక విధంగా చెప్పాలంటే ఈ సృష్టి అంతా రెండు ముకుళింపుల మధ్య జరిగే వ్యవహారం. సమస్తాన్ని తనలో యిముడ్చుకొని ఉండే ఆత్మ నుండి క్రిందకు ఆవలి ధ్రువమైన పదార్థం వరకూ దేనిలో అయితే అన్నీ అవ్యక్తంగా అణగి మణగి ఉన్నాయో ఆ పదార్థం నుండి ఊర్ధ్వంగా ఆత్మ యొక్క మరొక ధ్రువానికి పరిణమిస్తుంది.

CWSA 12:334, 22:754-55; (SABCL 19:726), 12:219, 12:166, 12:1613, 21:137(SABCL 18:128-29

శ్రీఅరవిందులు

ఆవిష్కరణ — దైవ వదనము, దేహము

ఈ జగత్తు యాదృచ్ఛికం కాదు, అనామకు లెవరో చేసిన అర్థంలేని సృష్టి కాదు, లేదా అనాలోచితంగా సంభవించినది కాదు. అది తనలో దివ్యవాక్కును వహిస్తుంది, ఒక నిగూఢమైన దైవ ప్రవాసమై నిండి ఉంది.

ఈ జగతి ఎలానో వచ్చి, ఏ కారణమూ, అర్థమూ, ఆశయం లేకుండా భ్రమిం చటం మొదలు పెట్టిన ఒక గ్రుడ్డి యంత్రం కాదు. ఈ సృష్టి రెక్కలు విచ్చుకుంటున్న పరమసత్యం యొక్క క్రమానుగతమైన ఆవిష్కరణ, తనలో నిబిడీకృతమైన వాస్తవికత యొక్క పరిణామం.

ఈ జగత్తు ఒక భ్రమ కాదు, కారణం లేని, అర్థం లేని మాయ కాదు, కర్తవ్యం లేని మనుగడ కలది కాదు. మనలేని లేదా లేకుండానే ఉన్నట్టుగా కనిపించేది కాదు. ఒక మహత్తరమైన వాస్తవికత ఈ అద్భుతమైన విశ్వంలో తనను తాను ఆవిష్కరించు కుంటుంది.

*

ఆ ఆవిష్కరణ శాశ్వతత్వంలో చోటు చేసుకొనే ఘటన మాత్రమే కాదు. అది నాశ రహితమైన ఆయన వైభవపు వదనమూ, శరీరము, ఆయన శక్తి, ఆనందాల ఖేల.

*

మనం ఆరాధించే దైవం ఎక్కడో సుదూరంగా విశ్వాతీతంగా ఉండే సత్యం కాదు; ఈ విశ్వంలో మనకు దగ్గరగా అరమరుగున ఉన్న ఆవిష్కృతి కూడా. ఈ జీవనం యింకా అసంపూర్ణమైన దైవావతరణ క్షేత్రం — ఈ జీవితంలో భూమి మీద, శరీ రంలో 'ఇహైవ' అనగా యిక్కడనే అని ఉపనిషత్తు నొక్కి వక్కాణించినట్టు. దివ్యత్వం తెరను తొలగించాలి. దాని విశ్వాతీతమైన మహత్తు, వెలుగు, మాధుర్యాన్ని మన చేతనకు వాస్తవం చేయాలి. దివ్యత్వాన్ని సొంతం చేసుకొని వీలైనంతగా అభివ్యక్తం చెయ్యాలి.

*

మనో ప్రాణ శరీరాలలో తనను తాను కనుగొని పరిపూర్ణం చేసుకునే ప్రవర్ధమాన ఆత్మే మానవుడు.

CWSA 12:218,219: 23:74 (SABCL 20:68); 25:125 (SABCL 15:16)

శ్రీఅరవిందులు

జీవిత దివ్యీకరణం

మనం ప్రకృతి దివ్యీకరణం అని చెప్పేది ఒక రూపాంతరీకరణం. ఇది కేవలం ఒక విధమయిన అతీత మానవత్వంలోకి ఎదగటం కాదు. ఇది అజ్ఞాన ప్రకృతి యొక్క అసత్యం నుండి దైవీ ప్రకృతి యొక్క సత్యంలోకి మార్పు చెందటం.

*

దివ్యీకరణం అంటే మానవ లక్షణాలను నాశనం చేయటం కాదు. వాటిని అంగీకరిస్తూ వాటికి తమ నిజమైన పరిపూర్ణతకు దారి చూపటం. వాటిని శుద్ధి చేసి పరిపూర్ణం చేసి సంపూర్ణ శక్తి, ఆనందాలలోకి పైకి లేవనెత్తటం. అనగా ఈ ప్రాపంచిక జీవితాన్నం తటినీ సంపూర్ణ శక్తి, ఆనందాలలోకి ఉద్ధరించటం.

*

జీవితాన్ని దివ్యీకరణ గావించడమంటే నిజానికి అది ఒక మహత్తరమైన జీవ కళ. ఎందుకనగా ప్రస్తుత జీవన కౌశలం అహంకారం, అజ్ఞాన జనితమై, పోల్చి చూస్తే చాలా హీనము, మూఢము, అపరిపూర్ణము అయినది (మానవ మనస్సు, ప్రాణికాలకి అధిక ఆకర్షణీయమైనదిగా కనిపించే నిమ్నస్థాయికి చెందిన చిత్రకళ, సంగీతం, సాహిత్యంలో) కేవలం ఆధ్యాత్మికత, చైత్యపురుష వికాసం, సంస్కరణ వలననే అది తన నిజమైన పరిపూర్ణతను అందుకో గలదు. దివ్య రోచిస్సు జ్వాలలో పునీత మైనపుడే తన దట్టమైన కల్మషాలను పోగొట్టుకొని లోహం తన నిజరూపాన్ని పొందు తుంది.

CWSA 12:365; SABCL 22: 125

శ్రీఅరవిందులు

అనువాదం: డా. సరోజా ప్రసాద్

దైవం — అతిమానసం

సర్వాన్నీ వెల్లడి చేసేదే దైవం, అందులోనే సమస్తమూ వసిస్తుంది. ఇప్పుడు మహా అజ్ఞానంతో ఆచ్ఛాదించబడినదైన ఆ దివ్యసత్యానికి తిరిగి పోవటమే జీవితంలో ఆత్మలక్ష్యం. తన పరమోత్తమ సత్యంలో దైవం నిరపేక్షం, అనంతమైన శాంతి, చైతన్యం, ఉనికి, ఆధిపత్య శక్తి మరియు మహదానందం.

*

దైవం అన్ని చైతన్య లోకాలలోనూ ప్రతి చోటా ఉన్నాడు, అనేక భిన్నమార్గాల ద్వారా, దృక్పథాల ద్వారా ఆయన అస్తిత్వాన్ని మనం దర్శిస్తున్నాం. కాని ఈ లోకాలన్నింటికీ, దారులకూ, దృక్పథాలకూ పైగా పరమోత్కృష్టమైనది ఒకటుంది.

*

దైవం ప్రతి చోటా, సమస్తమునందూ కొలువై యున్నాడు — కాని ఇది మహా అజ్ఞాన ప్రపంచం. అందులో ప్రతి ఒక్కరు తమలో తమ అహంకారంతో దైవం నుండి వేరై యున్నారు. వారు అహంకారం ప్రకారంగా పని చేస్తారు కాని దైవం ప్రకారంగా కాదు. అందరిలోనూ దైవాన్ని దర్శించినప్పుడు, ఆ తర్వాత అతడు సరియైన చైతన్యం పొందడం ఆరంభమవుతుంది, అతడు స్వతంత్రుడవుతాడు.

*

దైవం అనంతం. దైవం యొక్క సమస్త సత్యాన్ని ఒక అనుభవం కాని, అనుభవం లాంటి అనుభూతి కాని సమగ్రంగా తెలియజేయలేదు. ద్రష్టలైన ప్రతివారు దివ్య వాస్తవికత ఒక దృక్పథాన్ని లేదా దృక్పథాలను అనుభవించారు. ఒక నీతికథలో కొంతమంది గుడ్డివారు ఏనుగును తాకిన అనుభూతిని, ఏ భాగాన్నైతే వారు స్పృశించారో దానినే వారు భిన్న భిన్నరూపాలలో వర్ణించిన విధంగా, వారి మానసిక వైరుధ్యాలు అటువంటివి. యదార్థమైన సంపూర్ణానుభవం కావాలంటే ఒక వ్యక్తి ఏకంగా మనస్సును దాటి ఆవలకు పోవాలి, ఆధ్యాత్మిక మనస్సును సైతం దాటి పోవాలి. శ్రీకృష్ణుడు చెప్పాడు, "సాధకులలో చాలా అరుదుగా కొద్దిమంది మాత్రమే నా సంపూర్ణత్వంతో నా అసిత్త్వంలోని పూర్ణసత్యాన్ని తెలుసుకుంటారు". యదార్థానికి, కేవలం అతిమానస ప్రకాశం లోనే వ్యతిరేకతలన్నీ అదృశ్యమైపోతాయి, దృక్పథాలన్నీ విభజించబడనివై బ్రహ్మాండంలో ఏకీకరించబడతాయి. వ్యక్తి తప్పక జ్ఞానాన్ని

విస్తృతపరచుకుంటూ పోతూ ఉండాలి, అనుభవాలను ఒకదానితో మరియొక దానిని పరిమితి అదృశ్యమయ్యే పర్యంతమూ కలుపుకుంటూ పోవాలి.

*

దైవానికీ, పరమ సత్యానికీ ఎల్లప్పుడూ వ్యక్తిగతమైనదీ, వ్యక్తిగతం కానిదీ ఉంటాయి. వ్యక్తిగతం కానిదే నిజమైనది లేదా ముఖ్యమైనది అని అనుకోవటం పొరపాటు — ఎందువల్లనంటే అది ఒక వైపే సంతృప్తిని కలిగిస్తూ అస్తిత్వంలో కొంతభాగంలో శూన్యతతో అసంపూర్ణతకు దారి తీస్తుంది. వ్యక్తిత్వరహిత తత్త్వం మేధోమనస్సుకూ, అచల ఆత్మకూ సంబంధించినది కాగా, వ్యక్తిత్వ తత్త్వం ఆత్మకూ, హృదయానికీ, క్రియాశీలమైన అస్తిత్వానికీ సంబంధించినది. వ్యక్తిత్వ సహితమైన దైవాన్ని ప రిగణన లోనికి తీసుకోక తిరస్కరించేవారు అపారమైన గాఢతతో నిండినదానినీ, అత్యావశ్య కమైనదానినీ ఉపేక్షించినట్లే.

*

ఎక్కడెక్కడ దైవం ఉంటుందో, అక్కడ సర్వం ఉంటుంది — అది కేవలం గుప్తమై ఉంటుంది, అది ఉనికిలో లేనటువంటిది మాత్రం కాదు. అచేతన అడుగున కూడా దైవం ఉంది — మనస్సు, జీవితం పదార్థంలో గుప్తంగా ఉన్నాయి, అదే విధంగా అతిమనస్సు, సచ్చిదానందములు కూడా. కింద ఉన్నటువంటిదేదో అది దైవ అస్తిత్వానికి వెలుపల ఉన్నదేమీ కాదు. కేవలం మహామనస్సు అవతరించి సృష్టిలో దానిని విస్తృతపరచినప్పుడు మాత్రమే పదార్థంలో మనస్సు అభివ్యక్తమైన విధంగా, అతిమనస్సు విషయంలోనూ అంతే.

*

దైవం అన్ని చైతన్యపు టంతస్తులలోనూ ప్రతి చోటా ఉండగలదు. ఉన్నది, ముసుగులో మరుగున ఉన్నది లేదా పాక్షికంగా అభివ్యక్తమై ఉన్నది లేదా అభివ్యక్తమవటానికి ఉపక్రమించబోతున్నది; ఏ మారువేషంలోనూ లేదా ముసుగులోనూ లేకుండా తన స్వస్వరూపంతో అది అతిమానసంలో అభివ్యక్తమవటానికి ఉపక్రమిస్తున్నది.

*

దైవంతో ఒక వ్యక్తి మనోసీమలో ఏకం కాగలడు. దైవం భూమి మీద అభివ్యక్తం కావ టానికి అతిమనస్సు తప్పనిసరి.

*

....అతిమనస్సు దాని అసలైన లక్షణం ప్రకారం అది మహాసత్య-చైతన్యం, మహా సత్యం తనకు తానే తన అధీనంలో ఉంచుకున్నది, స్వయం తన ఆధిపత్యశక్తితో తనకు తానే సఫలీకృతం అవుతూ ఉండేటటువంటిది.

CWSA 28:5-14; SABCL 22:13

శ్రీఅరవిందులు

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

చైత్యపురుష భావన

మనలో ఈ అంతరాత్మ అన్న అంశం నేరుగా దైవం నుండి వచ్చి సదా దైవంతో సంబంధాన్ని కలిగి ఉంటుంది. మూలతః ఇది దైవీ సంభావ్యతలను నింపుకొని ఈ నిమ్నస్తర మనో ప్రాణిక శరీరమయ సృష్టికి ఆధారభూతమై వుంటుంది. జీవించే సమస్త ప్రాణులలోనూ ఈ దివ్యాంశ ముంటుంది. కానీ... సాధారణ ఉపరిచేతనకు వెనుక దాగి ఉంటుంది. మొదట్లో ఇది వికసించి ఉండదు. ఒక వేళ క్రమేణా ఎదిగినా... బయటకు లేదా ముందుకు కనబరుచు కోలేదు. అరుదుగా తక్కిన కోశాలు (మనస్సు ప్రాణికం) వాటి సాధనాల ద్వారా వాటికున్న పరిమితులకు లోబడి తమను తాము వ్యక్తపరచుకొంటాయి. దైవీ సంబంధమైన అనుభవాల ద్వారా చేతనలో ఎదుగుతుంది. మనలో ఉన్నతమైన కదలిక కలిగినప్పుడల్లా బలాన్ని పుంజుకొంటుంది. ఆఖరికి ఈ లోతైన ఉన్నతమైన కదలికలను ప్రోగు చేసుకుంటూ ఒక ప్రత్యేకమైన చైత్య పురుష వ్యక్తిత్వం రూపుదిద్దుకొంటుంది. దానినే సాధారణంగా మనం అంతరాత్మ లేదా చైత్యపురుషుడని పిలుస్తాము. ఎల్లప్పటికీ ఈ అంతరాత్మ యధార్థమైనది. అయినప్ప టికీ మనిషి ఆధ్యాత్మిక జీవనం వైపునకు మళ్ళటానికి, దానిలో అతను లబ్ధి పొందటానికి అది రహస్యకారణం. కాబట్టి చేతనకు వెనకనున్న ఈ దివ్యాంశాన్ని యోగంలో ముందుకు తెచ్చుకోవాలి.

ఆంగ్లభాషలో 'సోల్' 'సైకిక్' అన్న శబ్దాలు ఒక అస్పష్టమైన భిన్నమైన అర్థాలను స్ఫురింప చేస్తాయి. చాలా వరకు ఆ భాషలో ఒక సుస్పష్టమైన భేదం ఆత్మకు మనస్సుకు మధ్య కనిపించదు. అంతకన్నా మించిన గందరగోళ మేమిటంటే కోరికలతో

నిండిన ప్రాణికాన్ని — నకిలీ ఆత్మను లేదా కామనాత్మను — 'ఆత్మ' 'జీవతత్వం' తలంచటం జరుగుతుంది. ఈ శబ్దాల ద్వారా మనం చెప్పుకుంటున్న ఈ నిజమైన అంతరాత్మ, చైత్యపురుషుడు అన్న అర్థం ధ్వనించదు. ఈ చైత్యపురుషుడు అన్నది మనస్సుకు, ప్రాణిక పురుషుడికి పూర్తిగా భిన్న మైనది.ఏ హృదయస్థానంలోనైతే మనస్సు ప్రాణమయ కోశాలు కలుస్తాయో, ఆ ప్రదేశానికి వెనుక ఇది ఉంటుంది. అది వాటికి కేంద్రస్థానం. అక్కడే హృదయానికి కొంచెం వెనుక అన్నమాట. నిజంగా మనం హృదయం అని చెప్పుకునే భాగం భావోద్వేగాలకు ఆసనం. మానవ భావోద్వేగాలన్నీ మానసిక ప్రాణికమైన ప్రేరేపణలు, సాధారణంగా వాటి నైజంలో చైత్య వ్యక్తిత్వం ఉండదు. ఇది పూర్తిగా వెనుక నుండే రహస్య శక్తి, మనస్సు, ప్రాణశక్తి కంటే భిన్నంగా ఉండే నిజమైన అంతరాత్మ, మనలోని చైత్యపురుషుడు. అయితే ఈ చైత్యపురుష శక్తి ఏ విధంగానైనా మనో ప్రాణశరీరాలపై పని చేయగలదు. మన ఆలోచనలను, గ్రహణశీలతను, భావోద్వేగాన్ని, (ఆ భావోద్వేగం అప్పుడు అంతరాత్మ చేతనావస్థగా మారుతుంది) అనుభూతిని కార్యాచరణను, మనలో ఉన్న ప్రతి అంశాన్ని పరిశుద్ధం చేస్తూ దివ్య కదలికలుగా వాటిని సమాయత్త పరుస్తుంది.
CWSA 28:103

శ్రీఅరవిందులు

*

ప్రశ్న: ఒక మనిషి ఎలా తన చైత్యపురుష వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోగలడు?
సమా: జీవితంలోని అన్ని అనుభవాల ద్వారా ఈ చైత్యపురుష వ్యక్తిత్వం రూపొందుతుంది, పెరుగుతుంది, అభివృద్ధి చెందుతుంది. అఖరికి ఒక సంపూర్ణమైన సచేతనమైన స్వేచ్ఛాయుతమైన అస్తిత్వంగా తయారవుతుంది.

ఈ వికాస ప్రక్రియ అసంఖ్యాకమైన జన్మల గుండా అవిశ్రాంతంగా కొనసాగుతూనే ఉంటుంది. ఇదంతా మనిషికి తెలియదు. ఎందుకంటే తన చైత్యపురుష సత్తను గురించే అతడికి తెలియదు. అది తెలియడమే అత్యంత ఆవశ్యకమైన ప్రారంభాంశం. ఏకాగ్రత, అంతర్ముఖడవు కావడంతో తనలోని చైత్యపురుషుడితో సచేతనమైన అనుబంధాన్ని కలిగించుకోవాలి. ఈ చైత్యపురుషుని ప్రభావం ఎల్లప్పుడూ అతని బాహ్య వ్యక్తిత్వంపై ఉంటుంది. కానీ అది గుప్తంగా, చూడడానికి, గ్రహించడానికి,

అనుభూతి చెందడానికి చిక్కదు. నిజమైన కొన్ని ప్రత్యేక సందర్భాలలోనే అనుభవ వేద్యమవతుంది.

ఈ అనుబంధాన్ని దృఢపరచుకొని, సాధ్యమైతే సచేతనమైన చేతనాయుత వ్యక్తిత్వాభివృద్ధికై మనిషి దానిపై దృష్టిని కేంద్రీకరిస్తూ దాని వైపు మరలి, దానిని తెలుసుకొనేందుకు దానిని అనుభూతి చెందేందుకు ఆకాంక్షించాలి. అంతరాత్మ యొక్క ప్రభావాన్ని స్వీకరించేందుకు ఉన్మీలన మవ్వాలి. దాని నుండి సంకేతాన్ని అందుకొనే ప్రతిసారి దానిని అత్యంత శ్రద్ధతో, చిత్తశుద్ధితో అనుసరించటానికి జాగ్రత్త వహించాలి. ఈ మహోన్నతమైన ఆకాంక్షతో జీవించడానికి సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తూ, తనకు సంబంధించిన అన్ని వ్యవహారలలో సంపూర్ణమైన నిజాయితీని పెంపొందించుకోవడానికి ఎల్లప్పుడూ జాగ్రత్తను వహించాలి. ఇదే చైత్యపురుషసత్త ఎదగడానికి ఆవశ్యకమైన అతి ప్రధాన పరిస్థితి.

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

శ్రీఅరవిందుల బోధన

బాహ్యరూపాలకు వెనుక నుండే వాస్తవికత

ఈ దృశ్యమానమయే ఈ జగత్తును వెనుక నుండి నడిపిస్తున్నది పరమ సత్యము, పరచైతన్యమేననీ అదే అన్నింటా ఉండే ఏకైక శాశ్వత ఆత్మ అనీ భారతీయ ఋషులు కనుగొన్న సత్యం ఏదైతే ఉందో అక్కడ నుంచే శ్రీఅరవిందుల బోధన ప్రారంభమవుతుంది. జగత్తులోని సమస్త జీవులూ ఆ ఏకైక పరతత్వంలో ఏకీకృతంగా ఉన్నప్పటికీ ఒక విభక్త చైతన్యంతో విడిపోయి ఉన్నారు. వారి నిజ ఆత్మను, మనస్సులోని పరమ వాస్తవికతను తెలుసుకోలేక పోతున్నారు. మానసికశిక్షణ ద్వారా ఆ విభక్త చైతన్యపు ముసుగును తొలగించుకొని లోనున్న పరమ సత్యాన్ని, దైవాన్ని గుర్తెరుగ వచ్చు.

ప్రకృతిలో పరిణామపు ఎదుగుదల

ఏకైక పరతత్వము, పరమ చైతన్యము ఇక్కడి పదార్థమయ జగత్తులో చిక్కు పడిపోయి ఉన్నదని శ్రీఅరవిందులు చెప్తారు. పరిణామ క్రమమే తనను తాను విడిపించుకునే మార్గము. అచేతనం అనిపిస్తున్న చోటనే చైతన్యం కనిపిస్తుంది. అలా కనిపించిన చైతన్యం స్వయం ప్రేరితమై అత్యంత పరిపూర్ణ దిశగా విస్తరించి ఇంకా ఇంకా ఉన్నతత్వాన్ని పొందాలని వృద్ధి పొందుతుంది. ఈ దిశగా ప్రకృతి తీసుకున్న మొదటి అడుగు జీవము, మనస్సు రెండవది అయితే ఈ పరిణామము మనస్సుతో ఆగిపోదు. అది అక్కడ నుండి విడుదలై అంత కంటే ఘనమైన ఆధ్యాత్మిక, అతిమానసిక చైతన్యంగా రూపొందటానికి వేచి వుంటుంది. ఆ పరిణామము యొక్క తదుపరి ఘట్టం చైతన్య జీవునిలో అతిమానసము, అతిమానస పురుషుడు ఆధిపత్య శక్తిగా అభివృద్ధి చెందటమే. అప్పుడిక పదార్థమయ జగత్తులో చిక్కుపడి ఉన్న దైవత్వం పూర్తిగా విడుదలై పోయి, జీవకోటికి పరిపూర్ణతను ఆవిష్కరించగల సాధ్యత ఏర్పడుతుంది.

పరిణామ క్రమం తొలి దశలో చేతనాత్మక సంకల్పం లేకుండానే వృక్ష జంతు జాతులలో ప్రకృతి పురోగమించింది. కానీ మనిషి విషయంలో ప్రకృతి అతనిలో చేతనాత్మక సంకల్పం ద్వారా మాత్రమే పరిణామం జరుపగలదు. అయితే మనిషిలో మానసిక సంకల్పం ఉన్నంత మాత్రాన ఇది పూర్తిగా జరుగదు, ఎందుకనగా మానవుని మనస్సు కొంత వరకే వెళ్ళి అక్కడే గిర గిర తిరుగుతూ ఉండిపోతుంది. చైతన్యంలో మార్పు తీసుకొని రావడం ద్వార మనస్సును ఒక ఉన్నత విధానంలోకి మళ్ళించ వచ్చు. ప్రాచీన యోగవిధానంలో క్రమశిక్షణను అభ్యసించటం ద్వారా ఇది సాధించే వారు. పూర్వపు రోజుల్లో ప్రాపంచికజీవితం నుండి దూరమై సాధన ద్వారా పరమా త్మలో లీనమయేవారు. శ్రీఅరవిందులు ఏమి చెప్పారంటే పై నుంచి ఒక మహోన్నత తత్వం భూమి పైకి దిగి రాగలదనీ అది కేవల దివ్యాత్మను ప్రపంచం నుంచి విముక్తం చేయడమే కాక దానిని ఈ లోకంలోనే విడుదల చేయగలదు అని. ఇంకా అది మనస్సు అజ్ఞానం స్థానంలో లేక పరిమిత జ్ఞానం స్థానంలో అతిమానస సత్య చైతన్యాన్ని నింపగలదు. అలా జరిగినప్పుడు అంతర్గత దివ్యాత్మకు మనస్సు సరైన ఉపకరణం కాగలదు; మానవుడు బాహ్యాంతరాలు రెండింటిలోనూ సకల బలోపే

తుడై అంత వరకూ ఉన్న మృగ మానవత్వంలో నుంచి బయటపడి దివ్యమానవునిగా ఎదగగలడు. దాని కోసమై యోగమార్గంలోని మానసిక క్రమశిక్షణను అవలంభించి, తనలోని సమస్త భాగాలనూ వివృతం చేసుకొని అంత వరకూ ప్రచ్ఛన్నంగా ఉన్న అతిమానస శక్తిని గ్రహించి తద్వారా పరివర్తన చేసుకొనగలడు.

యోగవిధానము

అయితే ఇది అంత సులభంగా అనుకోగానే సాధ్యపడే మాయా మంత్రం కాదు. ఈ పరివర్తన జరగాలంటే అతిమానసము దిగి వచ్చేవరకూ చాలా సాధన అవసరమవుతుంది. మానవుడు తన జీవితంలో అధిక భాగం బహిర్ముఖమగు మనసు, ప్రాణము, శరీరంలోనే గడుపుతాడు. కాని ఏదైనా సాధించగల అంతులేని సామర్థ్యంగల అంతర్జీవి అతనిలో ఉంటాడు. అతను తన లోపలి మనిషి ఎరుకను పొందవలసి ఉంది. ఇప్పటి దాకా ఆ అంతర్జీవి నుండి పరిమితమైన శక్తిని మాత్రమే పొందు తున్నాడు. దాని ప్రభావం వల్లనే తాను అధిక సౌందర్యం, సామరస్యం, అధికారం, జ్ఞానం కోసం నిరంతరం అన్వేషిస్తూ ఉంటాడు. యోగవిధానంలో ప్రథమంగా చేయవలసింది ఆ అంతర్జీవి పరిధుల నన్నిటినీ తెరిచి అంతరంగ వెలుగులో, ఆ శక్తితో బాహ్యజీవితాన్ని నడిపించుకోవాలి. ఆలా చేస్తున్నప్పుడు తన లోని నిజమైన ఆత్మను కనుక్కోగలుగుతాడు; అది బయటకు కనిపించే దైహిక, ప్రాణిక, మానసిక పదార్థాల సమిశ్రమం కాదనీ, వాటికి వెనుకనున్న వాస్తవ సత్యమనీ, అది దివ్యాగ్ని నుంచి వెలువడిన ఒక విస్ఫులింగమనీ తెలుసుకుంటాడు. ఇక అతను తన ఆత్మలో వసించడం నేర్చుకోవాలి. పరమ సత్యం వైపు దారి తీసేదాని ప్రభావంతో స్వభావాన్నం తటినీ శుద్ధి చేసి సంస్కరించుకోవాలి. అప్పట్నుంచీ ఒక ఊర్ధ్వముఖ ఉన్మీలనం ఏర్పడి పైనుండే పరతత్వపు అంశం ఒకటి దిగి రావటం ప్రారంభమౌతుంది. అయితే అప్పుడు కూడా అది సంపూర్ణమైన అతిమానస తేజస్సు, శక్తి కానేరదు. ఎందుకనగా సాధారణ మానవుని మనస్సుకూ, అతిమానస సత్యచైతన్యానికి మధ్య అనేక చైతన్య శ్రేణులున్నాయి. మధ్య మధ్యలో ఉన్న ఈ శ్రేణు లన్నిటినీ తెరిచి వాటి శక్తిని మానవ శరీరంలోకీ, మనస్సులోకీ, ప్రాణంలోకి తీసుకొని రావాలి. ఆ తర్వాతే సత్య చైతన్యపు శక్తి పూర్తిగా స్వభావంపై పనిచేయడం ప్రారంభిస్తుంది. అందువల్లనే ఈ పద్ధతికి కావలసిన స్వయంశిక్షణ, సాధన సుదీర్ఘమే కాక చాలా కష్టసాధ్యము.

అయితే ఏ కాస్త చేసినప్పటికీ ఫలితం బాగా కనిపిస్తుంది., దాని వల్ల అంతిమ ముక్తి, పరిపూర్ణత సులభ సాధ్యమవుతుంది.

ప్రాచీన వ్యవస్థల లోని విషయాల ఆవశ్యకత

ప్రాచీన వ్యవస్థలకు సంబంధించిన అనేక విషయాలు మనకీ మార్గములో అవసరము — విశాలత్వం కోసం, ఆ పరతత్వాన్నీ, నిరవధికత్వాన్నీ అర్థం చేసుకునేటట్లుగా మనస్సును ఉన్మీలనం చేసుకోవడం; విశ్వచైతన్యమని చెప్పబడుతున్నదానిలోకి ప్రవేశించడం; కోరికలు, ఉద్వేగాలపై ఆధిపత్యం మొదలైనవి. బాహ్యసన్యాసం కాకుండా కోరికలు, బంధాలపై గెలుపు; దేహము, దైహిక అవసరాల పైనా, సహజాత వాంఛలు దురాశల పైనా నియంత్రణ అనివార్యం. పాత వ్యవస్థలతో సమిశ్రమమైన పద్ధతి ఉంది. అవి కనబడేదాన్నీ వాస్తవాన్నీ వేరు చేయడం ద్వారా మనసులో జ్ఞానము కలిగించుకోడం, హృదయంలోని భక్తి, ప్రేమ, అంకిత భావము, స్వలాభాపేక్ష లేకుండా సత్యం కోసం ఆరాటపడటం; అహం కోసం కాకుండా పరమ వాస్తవం కోసం పాటుపడటం మొదలైనవి. ఇదంతా కూడా సంపూర్ణ జీవికి శిక్షణ ఇచ్చినప్పుడు అవకాశం వచ్చి ఆ దివ్య తేజస్సు, శక్తులు స్వభావంపై పని చేయాలనకున్నప్పుడు అది ప్రతిస్పందించి పరిణామం చెందగలదు.

ఇందులో గురువు పాత్ర

ఈ శిక్షణ పొందాలంటే గురువు నుంచి ప్రేరణ, క్లిష్టదశలలో ఆయన సాన్నిధ్యము, వారి నియంత్రణ తప్పనిసరిగా ఉండాలి. లేని పక్షంలో గమ్యానికి దూరం చేసే తప్పులు, తడబాట్లు తప్పించుకొని ముందుకు సాగడం అసాధ్యము. ఒక ఉన్నత చైతన్యాన్నీ, ఉన్నత తత్వాన్నీ అందుకున్నవారే గురువులు. ఇంకా చెప్పాలంటే వాటిని వ్యక్తీకరించే ప్రతినిధులు. కేవలం బోధించడమే కాక అంతకు మించి ఆదర్శంగా ప్రభావితం చేయటం, అతిశక్తివంతంగా తమ అనుభవాన్ని ఇతరులకు అందచేయటం వారి లక్షణాలు.

సంక్షిప్తంగా ఇది శ్రీఅరవిందుల బోధన, దాని ఆచరణ క్రమము: ఏదో ఒక మతాన్ని అభివృద్ధి చేయాలని గానీ, పాత మతాలన్నిటినీ ఒకటిగా కలపాలనీ గానీ లేక ఏదో ఒక కొత్త మతాన్ని స్థాపించాలని గానీ వారి లక్ష్యం గాదు. ఇందులో

ఏదైనా కూడా వారి ముఖ్యోద్దేశానికి దూరమే అవుతుంది. వారి యోగములోని ప్రధానోద్దేశము అంతర్గత ఆత్మాభివృద్ధి. ఈ యోగాన్ని అనుసరించేవారు తప్పకుండా అందరిలోనూ ఉన్న పరమాత్మను తెలుసుకోగలరు. మనస్సుకు మించిన ఉన్నత చైతన్యాన్ని పొందగలరు. అదే చిదాత్మ చైతన్యము, అతిమానస చైతన్యము. అది మానవ ప్రకృతిని పరివర్తన చేసి దివ్యత్వం చేయగలదు.

శ్రీఅరవిందులు

అనువాదకులు: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

పూర్ణయోగంలోని క్రొత్తదనం

నేను దీనిని పూర్ణయోగమని సంబోధించాను. దాని అర్థం అది పాతవిధానాలలోని అనేక పద్ధతులను, వాటి సారాంశాన్ని స్వీకరించి తనలో ఇముడ్చుకుంటుందని. దాని క్రొత్తదనం దాని లక్ష్యంలో, దాని దృక్పథంలో, దాని కార్యాచరణ విధానంయొక్క సర్వోతముఖ సమర్థతలో నుంది.

పాత విధానాలతో పోలిస్తే, అది వినూత్నమైనది, ఎందుకనగా:

1) దాని లక్ష్యం ఈ లోకం నుండి, జీవితం నుండి వైదొలగి స్వర్గారోహణ దిశ గానో లేక ముక్తి మార్గాన్నో అనుసరించడం కాదు. జీవితంలోను, అస్తిత్వంలోను ఒక మార్పు చోటు చేసుకోవాలని — ఏదో విధంగా లొంగిపోయినట్లుగానో లేక సందర్భానుకూలంగానో గాక ఒక కచ్చితమైన, ప్రధానమైన ప్రయోజనం పొందడానికి. ఇతర యోగాలలోని అవరోహణా క్రమం కేవలం యోగమార్గంలోని పర్యవసాన ఫలితం మాత్రమే — ఆరోహణా క్రమమే అసలైన విషయం. పూర్ణయోగంలో ఆరోహణ తొలిమెట్టు, అయితే అది అవరోహణకు ఒక సాధన. అది ఆరోహణా క్రమంలో సిద్ధించే నూతనచైతన్య అవరోహణ — అదే సాధన యొక్క ముద్ర, గుర్తు. తాంత్రిక మరియు వైష్ణవ సాంప్రదాయాలకు కూడా జీవితం నుండి విముక్తి గమ్యం, కాని పూర్ణ యోగ లక్ష్యం జీవన సాఫల్యత.

2) సాధించవలసిన లక్ష్యం ఒక వ్యక్తిగతమైన దివ్యానుభవ సిద్ధి కాదు. ఈ పృథ్వీ చైతన్య ప్రాప్తి కొరకు చేసే ప్రయత్నం గనుక, అది విశ్వగతమైన సిద్ధిగాని

లోకాతీతమైనది కాదు. లబ్ది పొందాలనుకున్నది కూడ పృథ్వీతత్వంలోను, ఆధ్యాత్మిక జీవితంలోను ఇప్పటి వరకు ప్రత్యక్షంగా క్రియాశీలం గానటువంటిది, ఇక మీదట వ్యవస్థీకరించి ప్రత్యక్షంగా క్రియాశీలం చేయాలనుకున్న దివ్యచైతన్య శక్తిని రాబట్టు కొనుటకు ఉద్దేశించబడినది.

3) ఈ ప్రయోజనం సిద్ధించడానికై నిర్దేశించబడిన లక్ష్యం ఎత సంపూర్ణమైనది, సమగ్రమైనదో, అందుకు బహిరంగంగా వ్యక్తపరచబడిన విధానం కూడా అంత సంపూర్ణమైనది, సమగ్రమైనది. అనగా, చైతన్యము స్వభావము, రెండున్నూ సంపూర్ణంగా సమగ్ర మార్పు చెందటానికై పాత పద్ధతులను పాక్షికంగానూ మిగతా విశిష్టమైన వాటికి ప్రత్యక్షంగా సహాయపడుటకు ఉపయోగిస్తుంది. పాతయోగాలలో ఈ పద్ధతి సంపూర్ణంగా అమలుపరచినట్టు గాని, సాఫల్యత సాధించినట్టుగాని నాకు కనిపించలేదు. కనిపించినట్లయితే క్రొత్త మార్గాలను ఏర్పాటు చేయడానికై 30 సంవత్సరాల అన్వేషణలో, ఆంతరకి సృష్టిలో 30 సంవత్సరాల కాలాన్ని వృధాపరచే వాడిని కాదు. తేజోమయమైన, నిర్మితమైన, రేఖాపటంగా రూపొందించబడిన, పటిష్టమైన, సురక్షితమైన, జనప్రయోజనార్థం వినియోగించబడిన బాటల్లో అవలీలగా పయనించి నా గమ్యం చేరుకొనేవాడిని.

CWSA 35:154-56

*

ప్రశ్న: పూర్ణ యోగమనగా ఏమిటి?

అది పరమేశ్వరుని పరిపూర్ణ దివ్య సాక్షాత్కార సాధనకు మార్గం. ఒక సంపూర్ణ ఆత్మ నివేదనకు, మన అస్తిత్వ మరియు చైతన్యాల సంపూర్ణ సాఫల్యతకు, మన స్వభావ సంపూర్ణ పరివర్తనకు మార్గం. ఇది ఈ లోకంలో ఒక సంపూర్ణ జీవిత పరిపక్వతనే కాక మరెచ్చటనైనా ఒక శాశ్వత పరిపూర్ణ స్థితికి తిరిగి చేరుటను సూచిస్తుంది.

ఇది దీని లక్ష్యం. అయితే, విధాన విషయంలో కూడా అదే సమగ్రత చోటు చేసుకుంటుంది. ఎందుకనగా, విధానంలో పరిపూర్ణత లేకుండా, ఒక సంపూర్ణమైన మార్పు లేకుండా, ఒక ఉన్మీలనం, మన అస్తిత్వంలో, మన స్వభావంలో, పద్ధతులలో, కదలికలలో ఆత్మసమర్పణా భావన చోటు చేసుకోకుండా లక్ష్య పరిపూర్ణతను సాధించ వీలుపడదు.

మన బుద్ధి, సంకల్పం, హృదయం, శరీరం అంతర్ బహిశ్చ ఉనికి, అతిచేతన,

అవచేతనలే కాక మనలోని చేతనావృతమగు సర్వభాగాలు ఈ సాక్షాత్కారానికి, ఈ పరివర్తనకు గురి కావాలి, సాధనాలుగా ఉపకరించాలి, క్షేత్రాలు గావాలి. మానవ చేతన దివ్యచేతనగాను, మానవ స్వభావం దైవిక స్వభావంగాను మార్పు చెందాలి.

ఇదే పూర్ణయోగం యొక్క లక్షణం.

CWSA 12:358

శ్రీ అరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

పృథ్వీ చైతన్యం దివ్యచైతన్యంగా రూపొందుట — వ్యక్తిగతమైన వ్యవహారం కాదు

దివ్యచైతన్యాన్ని కేవలం నా కోసమే సిద్ధింప చేసుకోవాలనే ఉద్దేశ్యం నాకు లేదు — నాకు ఎలాంటి వ్యక్తిగతమైన అవసరం లేదు కాబట్టి కేవలం నా గురించి నేనేమీ చేయటం లేదు. మోక్షంగాని, దివ్యచైతన్య మార్పునిగాని కోరటం లేదు. నేను దివ్యచైతన్య మార్పుని ఆశిస్తున్నది, ఆ మార్పు పృథ్వీ చైతన్యంలో కలగాలి గనుక. ఆ మార్పు ముందుగా నాలో జరుగకపోయినట్లయితే, ఇతరులలో జరిగే వీలుండదు. నాలో దివ్యచైతన్యం రూపొందుట, పృథ్వీ చైతన్యం దివ్యచైతన్యంగా రూపొందటం కోసం మూసి వున్న తలుపుల గడియను తెరిచే బీగం లాంటిది. ఆ ప్రయత్నం పృథ్వీ చైతన్య మార్పు కోసం కాకుండా కేవలం దివ్యచైతన్య ఆవిష్కరణకే పరిమితమైతే, అది పూర్తిగా నిష్ప్రయోజనమౌతుంది. అయితే, ఒక షరతుగా నాలో దివ్యచైతన్య అవతరణ చోటు చేసుకుంటేనే మిగతా వారందరిలో దివ్యచైతన్యం అవతరిస్తుందనే తీర్పుకు రాకూడదు. ఇతరులు కూడా అందుకు సన్నద్ధులై వున్నప్పుడు మాత్రమే వారిలో దివ్యచైతన్య సాక్షాత్కారం సాఫల్యమవుతుంది. అయినప్పటికీ, నాలో అది సిద్ధించినట్లయితే, ఇతరులకు అందుకోసం చాలా వరకు ఉపకరిస్తుంది.

అందువలన, దానిని అభిలషించడం సక్రమమే. అయితే, అలాంటప్పుడు:

1) ఆ వ్యక్తి ఆ ప్రయత్నాన్ని అత్యంత వ్యక్తిగతమైనదిగానో లేక అహంకార

పూరితమైనది గానో చేయగూడదు.

2) ఆ వ్యక్తి లక్ష్యసాధనకు ఆవశ్యకమైన అన్ని పరిస్థితులను, దశలను అనుభవించ డానికి సంసిద్ధుడై వుండాలి.

3) ఆ వ్యక్తి చిత్తశుద్ధితో సాధనను దైవాన్వేషణలో భాగంగాను, సాధనా ఫలితంగా దైవసంకల్పం తనలో ఆవిష్కరిస్తుందనే దానిపైనే ధ్యాసను నిలపాలి. ఆ దైవసంకల్పం సాఫల్యం చెందాలని తప్ప అంతకు మించి మరేదీ కోరకూడదు — మానసిక మార్పును గాని, ఆధ్యాత్మిక పరివర్తనను గాని, దివ్యచైతన్య ఆవిష్కరణను గాని. దానిని వ్యక్తిగతంగా లభించిన అవకాశంగానో, వ్యక్తిగత సాఫల్యంగానో కాకుండా, ఈ లోకంలో దైవకార్య సాఫల్యతగా పరిగణించాలి.

CWSA 35:283-84

శ్రీ అరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

పరిపూర్ణత సాధించుటకు ఆధ్యాత్మికత ఒక్కటే అంతిమ అవకాశం

పరిపూర్ణత పొందటానికి మనకున్న చిట్టచివరి ఒకే ఒక అవకాశం – – వ్యక్తి కోసం గాని, సమాజం కోసం గాని ఆధ్యాత్మికతలోనే వుంది. అది తన ప్రత్యేక సంతృప్తి కొరకు ఈ లోకం నుండి, దాని కార్యకలాపాల నుండి విముఖత కనబరిచే మానసిక స్థితి కాదు. అది వీటికి అతీతమైనది అయినా, వాటికి సమ్మతించి వాటిని సాఫల్యం చేసే మహోన్నత మానసిక స్థితి. అట్టి ఆధ్యాత్మికత మనిషి యొక్క హేతువాదాన్ని, ఉత్తమ అభిరుచిని, నైతికతను, జీవవాదాన్ని, భౌతికవాదాన్ని జ్ఞానసముపార్జనకై ఆతని అభిలాషను, అతని సౌందర్య పిపాసను, ప్రేమ కోసం అతను పడే తపనను, పరిపూర్ణతకై అతను పడే ఆరాటాన్ని, అస్తిత్వము జీవితముల నిండుదనాన్ని, వాటి శక్తి కోసం అతని కుండే ఆపేక్షను, తనలో ఇముడ్చుకొంటుంది. ఈ లక్షణాలను పెడత్రోవ పట్టించే శక్తులకు దివ్యజ్ఞానాన్ని వ్యక్తపరచి వాటిని ఒకదానితో ఒకటి రాజీపడ జేసి, గుడ్డిగానో లేక దృష్టి దోషంతోనో నీలినీడల్లో మసకబారిన వెలుతురులో సాగే

వాటి పయనం సుగమమయ్యేందుకు బాటను తేజోమయం చేసే ఆధ్యాత్మికత అది. అది మనిషి యొక్క అతిశయించిన స్వయంసమృద్ధి చెందిన హేతువాదం సైతం అంగీకరించగల శక్తి, లేదా ఏదో ఒక రోజున అత్యంత మేలైనదిగా అంగీకరించ బడి తన అనంతమైన మూలాన్ని దివ్యమైన వెలుగుతో దానిలో చూడగలుగుతుంది. ఎందుకనగా అది చివరికి కచ్చితంగా మనిషి వ్యక్తిగతంగాను, సామాజికంగాను ప్రయత్నిస్తున్న అనివార్యమైన లక్ష్యప్రాప్తికి హేతుబద్ధమైన చివరి ప్రక్రియగా తనకుగా తాను అభివ్యక్తమౌతుంది.

ఆధ్యాత్మికతను సంతరించుకున్న సమాజం మాత్రమే వ్యక్తిగతమైన సామరస్యత, సామాజిక సుఖసంతోషాలతో కూడిన వాతావరణాన్ని నెలకొల్పగలదు, లేదా కారణ కారకంగానో లేక గాఢావేశ మూలంగానో మాటలు దుష్ప్రయోగం గావించబడినప్ప టికీ, అవి వ్యక్తపరచటానికి అందుబాటులో నున్న అత్యుత్తమ మాధ్యమం కావున, ఒక వినూత్నమైన ఆత్మ పరమాత్మల సంయోగం, భువిపై దేవుని రాజ్యం, మనుషుల మనసుల్లో, హృదయాల్లో దివ్యత్వం తొణికిసలాడే మానవజాతి పరిపాలనను స్థాపించగలదు.

CWSA 25:182-83

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

జడమైన శిల నుండి మనసు నధిరోహించే ఓ మానవుడా
ఇంకా నువ్వు జయించని అద్భుత శిఖరాలను ఎదుర్కో.

CWSA 22:1595

శ్రీఅరవిందులు

అనువాదం డా. సరోజా ప్రసాద్

అభ్యాస పద్ధతి

ఆధ్యాత్మిక అన్వేషణ ప్రథమ యదార్థ లక్ష్యం

ఆధ్యాత్మిక జీవితాన్ని, ఆధ్యాత్మిక సత్యాన్ని అన్వేషించడానికి మొదటి కారణం నిజానికి, దైవాన్ని కనుగొనడం. మనకు అనివార్యంగా కావలసిన లక్ష్య మదొక్కటే, అది లేకపోతే తక్కినదంతా నిష్ప్రయోజనమే. ఒకసారి కనుగొన్న దైవాన్ని అభివ్యక్తం చేయడం — అంటే అన్నింటి కంటె ముందు తన పరిమిత చేతనను దైవచేతనగా రూపాంతరీకరించడం, అనంత మహాశాంతి, దివ్యవెలుగు, దివ్యప్రేమ, దివ్యబలం, దివ్యానందంలో నివసించడం, తన అసలైన స్వభావంలో అదిగా కావడం, తత్ఫలితంగా తన క్రియాశీల స్వభావంలో దానికి పాత్రగా, వాహకంగా, ఉపకరణంగా తయారై వుండడం. పదార్థ వేదిక మీద యేకత్వం సూత్రాన్ని క్రియాశీల మయ్యేటట్లు చేయడం, లేదా మానవజాతి కోసం పనిచేయడం, అనేది పరమ సత్యాన్ని మానసికంగా అపార్థం చేసుకోవడమే అవుతుంది. ఇవి ఆధ్యాత్మిక అన్వేషణకు ప్రథమ యథార్థ లక్ష్యం గాదు. మనం పరమాత్మను, దైవాన్ని కనుగొనాలి. అప్పుడే మన నుండి పరమాత్మ లేక దైవం యేం కావాలని కోరుతున్నదో మనకు తెలుస్తుంది. అంతవరకు మన జీవితం, మనం చేసే కర్మ దైవాన్ని కనుగొనడానికి ఒక సహాయం లేక సాధనోపాయం అవుతుందే గాని మరే ప్రయోజనం వుండదు. మనం అంతర చేతనలో వికసించినకొద్దీ, లేదా దైవాన్ని గూర్చిన ఆధ్యాత్మిక పరమ సత్యం మనలో పెరుగుతున్నకొద్దీ, మన జీవనం, కర్మ, నిజంగా తప్పకుండా దాని నుండే అధికాధికంగా జాలువారాలి, దానితో కలిసిపోవాలి. అవి యెలా, యేమై వుండాలో అనేదానిని ముందుగానే మన పరిమిత మానసిక అవగాహనలతో నిర్ణయించడమంటే, అంతరంగంలో ఆధ్యాత్మిక పరమ సత్య వికసనాన్ని అడ్డుకోవడమే అవుతుంది. అది పెరుగుతున్నకొద్దీ, దైవ వెలుగు, పరమ సత్యం, దైవశక్తి, క్రియాశక్తి, దైవ పరిశుద్ధత, పరమ శాంతి, మనలో పని చేస్తున్నాయనీ, మన కర్మలతో, అలాగే మన చేతనతో, వ్యవహరిస్తున్నాయనీ, దైవ ప్రతిరూపంగా మారడానికి మనల్ని నూతనంగా రూపు దిద్దడానికి వాటి నుపయోగిస్తున్నాయనీ, చెత్తాచెదారాన్ని తొలగించివేస్తూ, దాని స్థానంలో పరమాత్మ మేలిమి బంగారాన్ని వుంచుతున్నాయనీ మనకు అనుభూతి కలుగుతుంది. మనలో దైవసన్నిధి

సదా నిలిచి వున్నపుడు, చేతన రూపాంతరం చెందినపుడు మాత్రమే, పదార్థ వేదిక మీద దైవాన్ని అభివ్యక్తం చేయడానికి మేము సిద్ధంగా వున్నాం అని చెప్పే హక్కు మనకు దక్కుతుంది. ఒక మానసిక ఆదర్శాన్ని లేదా సూత్రాన్ని పట్టుకొని ఆంతరంలో జరుగుతున్న సాధన మీద విధించడం జరిగితే, మనలని ఒక మానసిక సాక్షాత్కారానికి పరిమితం చేసుకొనే లేదా యదార్థ యెదుగుదల జరుగుతుండగా దైవంతో మనం పూర్తి సమాచార సంబంధం పెట్టుకొనడానికి, ఏకమయ్యే స్థితి కెద గడానికి, మన జీవితంలో స్వేచ్ఛగా, అతి సన్నిహితంగా ఆతని సంకల్పం వెలువడ డాన్ని మధ్యలోనే అడ్డుకోవడం లేదా దానిని అనృతీకరించడం జరిగే ప్రమాదాన్ని కొనితెస్తుంది. ముందుగా ఒక మానసిక ఆదర్శాన్ని లేక సూత్రాన్నీ పట్టుకొని ప్రారం భించడం అనేది మన ప్రారంభ కేంద్రా న్నెంచుకోవడంలో మనం చేస్తున్న పొరపాటు, కాని ఈనాటి మనస్సు ముఖ్యంగా యిదే పొరపాటు చేయడానికి మొగ్గు చూపుతుంది. అత్యంతావశ్యకమైన ఒకే ఒక విషయాన్నుండి మనల్ని పెడదారి పట్టించే ఈ అల్ప విషయాలకు చోటిచ్చే దానికన్నా, ఆయన సాక్షాత్కారం ప్రసాదించే పరమ శాంతి లేక దివ్య వెలుగు, లేక బ్రాహ్మానందం కోసం దైవం దగ్గరకు చేరడం చాలా చాలా ఉత్తమం. పదార్థ సంబంధ జీవితాన్ని అలాగే ఆంతరిక జీవితాన్ని దివ్యీకరించడం దైవ ప్రణాళికలో భాగం అని మనం దర్శించాం. కాని అది లోపలి నుండి వెలుపలకి యెదుగుతూ వచ్చేదాని ద్వారా ఆంతరిక సాక్షాత్కారాన్ని బాహ్యానికి ప్రవహింప జేయడం ద్వారా మాత్రమే అది నెరవేరుతుంది కాని ఒక మానసిక సూత్రాన్ని అనుసరిస్తూ జీవించడం ద్వారా కాదు.

మానసిక అన్వేషణను ఒక ఆధ్యాత్మిక అనుభవంగా మార్చే శిక్షణా విధానం

మానసిక అన్వేషణను ఒక సజీవ ఆధ్యాత్మిక అనుభవంగా మార్చుకొనడానికి ఏ శిక్షణా విధానాన్ననుసరించాలని నీ వడిగావు. మొట్టమొదట, నీ చేతనను నీలోనే కేంద్రీకరించుకోగలిగేటట్లు అభ్యాసం చెయ్యాలి. సాధారణ మానవ మనస్సు ఉపరితలం మీద నిర్వహించే వ్యవహారాలతో నిజ ఆత్మను తెరమరుగు చేస్తుంది. కాని, ఉపరితలం వెనుక ఒక రహస్యచేతన దాగి వున్నది. ఆ చేతనలో మనం, నిజ ఆత్మను, ప్రకృతి విశాల, లోతైన సత్యాన్ని తెలుసుకొంటాం, ఆత్మను వాస్తవం చేసుకొని, ప్రకృతిని

ముక్తం చేసి రూపాంతరీకరించ గలుగుతాం. ఉపరితల మనస్సును ప్రశాంతపరచి, ఆంతరంలో నివసించడం ఈ ఏకాగ్రత లక్ష్యం. బహిర్లగ్న మై యున్న దాని కన్న యదార్థమై యున్న చేతనకు రెండు ప్రధాన కేంద్రాలు మనలో వున్నాయి. ఒకటి హృదయంలో (భౌతిక గుండె కాదు, వక్షస్థలం మధ్యలో వుండే హృదయ కేంద్రం). మరొకటి శిరస్సులో వుంది. హృదయం మధ్యలో వున్నది లోపలే తెరుచుకుంటుంది. ఈ అంతర్ముఖ ఉన్మీలనాన్ని అనుసరించడం ద్వారా లోతుకుపోయి అంతరాత్మను, లేక చైత్యపురుషుని, వ్యక్తిలోని దివ్యాంశను కనుగొంటాం. ఈ అంతరాత్మ లేక చైత్యపురుషుడు, ప్రకృతిని పొందడానికి, దానిని దాని చలనాలన్నింటిని పరమసత్యం వైపు, దైవం వైపు మార్చి ఊర్ధ్వంలో వున్నదాని నంతా తనలోనికి దిగి రావాలని ఆవాహన చేయడానికి, తెర తొలగించబడింది గనుక, ఈ దివ్యాంశ ముందుకు రావడం మొదలు పెడ్తుంది. దివ్య సన్నిధి చైతన్యం, అత్యున్నతమైన దైవం యెడల అంకిత భావాన్ని తీసుకొస్తుంది, మనకు పైన వేచి వున్న ఒక మహనీయ శక్తిని, దివ్యచేతనను ఆహ్వానిస్తుంది. దైవానికి తనను తాను నివేదన చేసుకొంటూ హృదయ కేంద్రంలో కేంద్రీకరించడం, ఈ అంతర్ముఖ ఉన్మీలనానికి, హృదయంలో దివ్య సన్నిధి కోసం ఆకాంక్షించడం చేయగలిగితే అది మొదటి మార్గం, సహజమైన ఆరంభం అవుతుంది. దాని ఫలాన్ని గనుక ఒకసారి పొందితే అది ఇంకో విధంగా మొదలుపెట్టినదాని కంటే, ఆధ్యాత్మిక మార్గాన్ని చాలా సులభతరం, సురక్షితం చేస్తుంది.

ఆ మరో మార్గం, శిరస్సులో, మానసిక కేంద్రం మీద కేంద్రీకరించడం. దీని వల్ల ఉపరితల మనస్సు నిశ్చల నీరవం అయితే, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక అనుభవాన్ని స్వీకరించగల, లోపలే ఉన్న ఒక ఆంతర విశాల లోతైన మనస్సు తెరచుకొంటుంది. ఒకసారి దీని మీద కేంద్రీకరిస్తే, నిశ్చల నీరవ మానసిక చేతనను ఊర్ధ్వం వైపుకు, మనసుకు పైనున్న దాని కంతటి కోసం ఉన్మీలనం చేయాలి. కొంత కాలం జరిగాక, చేతన ఊర్ధ్వం వైపుకు లేస్తున్నదని అనుభూతి చెందుతావు. దేహంలో యిప్పటిదాకా మూసివేసి వుంచిన మూత కావలకు, చివరకు, పోయి, యెచట అది అనంతునిలో ముక్తమవుతుందో, ఆ కేంద్రాన్ని శిరసుపైన కనుగొంటుంది. అచట అది జగదాత్మతో, పరమశాంతితో, దివ్యవెలుగుతో, దివ్యజ్ఞానంతో, బ్రహ్మానందంతో సంపర్కం లోనికి రావడం మొదలు పెడ్తుంది. దానిలో ప్రవేశించి దానిగా

మార్పుచెంది ప్రకృతిలోనికి ఇది దిగి వస్తున్న అనుభూతి చెంద నారంభిస్తుంది. మనస్సులో ప్రశాంతత కోసం, ఊర్ధ్వంలో వున్న పరమాత్మను, దైవాన్ని సాక్షాత్కా రింప జేసుకోవడం కోసం ఆకాంక్షతో శిరస్సులో కేంద్రీకరించడం, ఏకాగ్రత వహించ డానికి రెండోమార్గం. ఏదేమైనా శిరస్సులో చేతనను కేంద్రీకరించడం అనేది ఊర్ధ్వంలో నున్న కేంద్రానికి లేవడానికి సన్నద్ధత మాత్రమే అని మనం గుర్తుంచుకోవడం ముఖ్యం. లేకపోతే అతడు తన స్వీయమనస్సులోనూ, దాని అనుభవాల్లోనూ మూసుకు పోయి వుండిపోతాడు లేదా మహా అయితే, ఆధ్యాత్మిక అతీత స్థితిలో నివసించేందుకు ఉద్ధరితం గావడానికి బదులు, ఊర్ధ్వంలో వున్న పరమ సత్యపు ప్రతిబింబాన్ని మాత్రమే పొందుతాడు. కొంతమందికి మానసిక ఏకాగ్రత తేలిక, మరి కొంతమందికి హృదయకేంద్రంలో కేంద్రీకరించడం తేలిక. ఇంకొంతమంది ఒకదాని తర్వాత మరొకటిగా రెండు చేయగలుగుతారు, అలా చేయగలిగితే, హృదయకేంద్రంతో మొదలు పెట్టడం వాంఛనీయం.

ప్రకృతి కార్య క్షేత్రాలకు సంబంధించిన క్రమశిక్షణ

క్రమశిక్షణకు గల మరో పార్శ్వం, ప్రకృతి, మనస్సు, ప్రాణ-ఆత్మ లేక ప్రాణికం, భౌతిక అస్తిత్వ కార్య క్షేత్రాలకు సంబంధించినది. ఇంక్కడుండే సూత్రమేమిటంటే ప్రకృతి, ఆంతరిక సాక్షాత్కారం, రెండింటినీ యేకత్రాటిపై నడచేటట్లు చేయడం. అలా చేస్తే అతడు రెండు పరస్పరం విరోధించుకొనే భాగాలుగా విడిపోకుండా వుంటాడు. ఇది సాధ్యమయ్యే చాలా శిక్షణా విధానాలు, లేక ప్రక్రియలు వున్నాయి. అందులో ఒకటి: సమస్త కర్మలను దైవాని కర్పించడం, ఆంతరిక మార్గదర్శకత్వం కోసం, ఒక ఉన్నత మహాశక్తి ప్రకృతిని హస్తగతం చేసుకొనేందుకు ఆవాహన చేయడం. అంతర్ముఖంగా అంతరాత్మ తెరచుకోవడం జరిగితే, చైత్యపురుషుడు ముందుకొస్తే, అప్పుడు పెద్దగా యిబ్బంది వుండదు — దానితో పాటు, చివరకు, సమస్త అపరిపూర్ణ తలను బహిర్గతం చేసి, ప్రశాంతంగా, ఓర్పుతో, అన్నింటినీ తొలగించే పాలన, ఒక చైత్యసంబంధ విచక్షణా జ్ఞానం లభిస్తుంది, నిరంతరంగా సూచనలందుతూ వుంటాయి. అది సరియైన మానసిక, ప్రాణిక కదలికలను కలిగించి, భౌతిక చేతన రూపాన్ని కూడా తీర్చిదిద్దుతుంది. మరొక పద్ధతి: మనస్సు, ప్రాణికం, భౌతిక అస్తిత్వ కదలికలనుండి నిస్సంగత్వంతో వాటికి వెనుకగా నిలబడడం, మన నిజ

అస్తిత్వంలో యే భాగానికీ చెందనివిగా, వ్యక్తిలో, గత కర్మలచే విధించబడిన సర్వ సామాన్య ప్రకృతికి అలవాటుగా రూపొందిన వాటి కార్యకలాపాలను, మన నిజ అస్తిత్వంలో ఏ భాగమూ కాని వాటిగా పరిగణించడం. ఇందులో వ్యక్తి సాధించే విజయానికి తగిన నిష్పత్తిలో నిస్సంగునిగా తయారౌతాడు. అలా తయారై, మన స్సును, దాని కార్యకలాపాలను తనవిగా చూడడు. దేహం దాని కార్యకలాపాలాను తనవిగా చూడడం, మనలోనే వున్న ఒక ఆంతరిక — ఆంతర మానసిక, ఆంతర ప్రాణిక, ఆంతర భౌతిక — జీవిని ఆతడెరుగ గలుగుతాడు. ఆ ఆంతర జీవి, నిశ్చల నీరవంతో, ప్రశాంతంగా, బంధరహితుడు, నిస్సంగుడై, ఊర్ధ్వంలోని యదార్థ ఆత్మను ప్రతిబింబిస్తాడు, దానికి ప్రత్యక్ష ప్రతినిధి అవుతాడు. ఈ ఆంతర నిశ్చల నీరవ పురుషుని నుండి తిరస్కరించ వలసినదాని నంతా తిరస్కరించడం జరుగు తుంది, దేనిని నిలుపుకొని రూపాంతరీకరించదగునో దానికి మాత్రమే అనుమతి వుంటుంది. ప్రకృతి పరివర్తనానికి యేది అవసరమో దానిని చేయడానికి, ప్రతి అడుగులోనూ పరిపూర్ణత కోసం, ఒక అంతరాంతర దివ్యసంకల్పానికి, లేదా దివ్యశక్తికి పిలుపు వుంటుంది. అది మనస్సును, జీవితాన్ని, దేహాన్ని, అంతరాంతర లోతులలోని అంతరాత్మిక అంశానికి మార్గదర్శకత్వాన్ని వహించే దాని ప్రభావానికి, లేదా దాని ప్రత్యక్ష మార్గదర్శకతకు తెరచిపెడ్తుంది. చాలామంది విషయంలో ఈ రెండు పద్ధ తులూ వెలుగులో కొచ్చి, కలిసి పనిచేస్తాయి, చివరకు విడదీయలేనంత ఒకటిగా కరగిపోతాయి. అతడు దేనితోనైనా, ఏది అతనికి అత్యంత సహజం, అనుసరించడం సులభం అనిపిస్తుందో, దానితో అతను మొదలుపెట్టవచ్చు.

చివరకు, కష్టాలన్నింటిలో యెక్కడ పురుష ప్రయత్నానికి ఆటంకం కలుగుతుందో, అక్కడ గురువు సహాయం జోక్యం చేసుకొని, సాక్షాత్కారానికి యేది అవసరమో, లేదా మరు క్షణం వేయవలసిన అడుగుకు యేది అవసరమో దాని నందిస్తుంది.

SABCL 23:516-19

*

ఈ దైవచేతనకు ఉన్మీలన మయ్యేందుకు, అందులో ప్రవేశించేందుకు అనేక మార్గా లున్నాయి. ఒక నిరంతరాభ్యాసం వల్ల తన లోనికి అంతర్ముఖంగా పోవడం, దైవం యెడల ఆకాంక్షతో ఉన్మీలనం గావడం, ఒకసారి దాని చర్యను యెరుగగలిగితే, దానికి పూర్తిగా తనను తాను అర్పించుకోవడం అనే మార్గాన్ని నేను యితరులకు

చూపిస్తాను. ఈ ఆత్మార్పణకు అర్థం, దైవచేతనతో నిరంతర సంపర్కం, లేదా ఐకమత్యం తప్ప మరి దేన్నీ అర్థించకుండడం, దాని శాంతికి, శక్తికై, వెలుగు, ఆనందం కోసం ఆకాంక్షించడం, ప్రపంచంలో అది అతని కిచ్చిన యే కార్యాన్నైనా చేయడానికి, దాని ఉపకరణంగా మాత్రమే కాగలిగేటట్లు గాక మరి దేన్నీ అర్థించ కుండడం. మనస్సులో, హృదయంలో, దేహంలో పనిచేస్తున్న దైవ క్రియాశక్తికి, పరమాత్మ మహాశక్తికి ఒకసారి ఉన్మీలనమై, అనుభూతి చెందితే, మిగిలినదంతా దానికి విశ్వాసపాత్రమై జీవించడం, సదా దానిని ఆవాహన చేస్తుండడం, అది వచ్చి నప్పుడు దాని పనినది చేసుకోనివ్వడం, నిమ్నచేతనకు, నిమ్నప్రకృతికి సంబంధించిన యితర ప్రతి అధమ క్రియాశక్తిని తిరస్కరించడం జరుగుతుంది.

శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

స్వప్రయత్నం తప్పనిసరి

ఈ విశ్వంలో జరిగేదాని కంతటికీ దైవం తన శక్తి ద్వారా సమస్త క్రియాకలాపాలకూ వెనుకగా ఉన్నాడు. కాని ఆయన తన యోగమాయతో మరుగుపరచబడినవాడై, నిమ్మప్రకృతిలోని జీవుని అహంకారం ద్వారా పనిచేస్తూ ఉన్నాడు.

యోగంలో కూడా దైవమే సాధకుడు, ఆయనే సాధన; ఆయన మహాశక్తి తన ప్రకాశం, ఆధిపత్య శక్తి, జ్ఞానం, చైతన్యం, పరమానందంతో, ఆధారం మీద పనిచేస్తూ ఉండగా, ఎప్పుడైతే అది ఆమెకు ఉన్మీలనం చేయబడుతుందో, అప్పుడు ఈ దివ్యశక్తులు అందులో కుమ్మరించబడినందు వలన, సాధన సాధ్యపడటానికి సావకాశం కలుగుతుంది. కాని నిమ్నప్రకృతి ఉత్తేజితమై ప్రేరేపిస్తున్నంత వరకు సాధకుడి వ్యక్తిగత ప్రయత్నం తప్పనిసరిగా ఉండవలసి వస్తుంది.

తప్పనిసరియైన ఈ వ్యక్తిగత ప్రయత్నం మూడు విధాలు — ఆకాంక్ష, నిరా కరణ, అర్పణ.

ఆకాంక్ష జాగరూకతతో, నిరంతరమై, ఆగిపోనిది, మనస్సు యొక్క ఇచ్ఛ, అన్వేషించే హృదయం, ప్రాణిక అస్తిత్వ సమ్మతి, భౌతిక చైతన్యాన్నీ, ప్రకృతినీ

ఉన్మీలనం చేయాలనుకునే, మృదుత్వపరచాలనుకునే ఇచ్ఛ.

నిమ్నప్రకృతి గమనాల నిరాకరణ — మనోభావాలనూ, అభిప్రాయలనూ, ఇష్టాయిష్టాలనూ, అలవాట్లనూ, నిర్మాణాలనూ నిరాకరించుట; ఫలితంగా నిశ్శబ్ద మనస్సులో నిజమైన జ్ఞానం నిరాటంకంగా ఆవిర్భవించే చోటుకు అవకాశం, — ప్రాణిక ప్రకృతి కోరికలు, హక్కుభుక్తంగా పట్టుబట్టి అడిగేవి, వెంపర్లాటలు, సంవేదనలు, తీవ్రోద్రేకాలు, స్వార్థపరత్వం, గర్వం, పొగరుబోతుతనం, పశువాంఛలు, అత్యాస, అసూయ, ఓర్వలేనితనం, సత్యంతో వైరం మొదలగువాటి నిరాకరణ, ఫలితంగా నిజమైన శక్తి, ఆనందాలు పై నుంచి సమృద్ధిగా ప్రశాంతమైన, విశాలమైన, ధృఢమైన, భగవదర్పితమైన ప్రాణిక అస్తిత్వంలోకి ప్రవహించే అవకాశం, — భౌతిక ప్రకృతిలోని బుద్ధిహీనత, సందేహం, అవిశ్వాసం, అస్పష్టత, మొండిపట్టుదల, అల్పత్వం, బద్ధకం, మార్పుకు అనంగీకారం, తామసముల నిరాకరణ, ఫలితంగా నిజమైనటువంటి నిలకడతో కూడిన మహాప్రకాశం, ఆధిపత్యశక్తి, మహదానందం ఎల్లప్పుడూ ఇంకా ఎక్కువ దివ్యత్వానికై వృద్ధిపొందే శరీరంలో తనకు తాను స్థిరపడే అవకాశం.

తనకు తాను, ఏదై యున్నదో, ఏది పొంది యున్నదో ఆ సమస్తమూ, చైతన్య స్తరాల నన్నింటినీ, ప్రతి గమనమునూ ఆ పరమ దైవానికి, ఆ మహాశక్తికి అర్పించు కోవటం.

CWSA 32:6 (SABCL 25:6-7)

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

“ఈ యోగంలోని రెండు మహోన్నత దశలలో ఒకటి శ్రీమాత రక్షణను పొందటం” అని శ్రీఅరవిందుల ప్రవచనం. అటు పిమ్మట ఒక సందర్భంలో మహోన్నతమైన రెండవ దశ ఏమిటి అని అడిగినప్పుడు, “దివ్య జీవనానికై సాధకుడి అభిలాష” అని వారి సమాధానం.

CWSA 32:36

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

దైవానికి సమగ్ర సచేతన సమర్పణ

మనో ప్రాణ శరీరాలు దైవానికి సచేతనమైన సమగ్రమైన సమర్పణ చేసుకోవటం నేర్చుకొన్నప్పుడు మాత్రమే యోగమార్గం సురక్షితం, సులభం, వేగవంతం అవుతుంది.

ఈ సమర్పణ, ఉన్మీలన మవడం దైవానికి మాత్రమే, మరి ఏ ఇతర శక్తికీ కాదు. కారణం, మనలోని కల్మషమైన ప్రాణికశక్తి లేదా మసకబారిన మనస్సు అదైవిక శక్తులకు, ప్రతికూల శక్తులకు సమర్పించుకోవటానికి వాటినే దైవంగా పొరబడడానికి ఎక్కువ అవకాశం ఉన్నది. ఇంతకంటే పెద్ద విపత్కర తప్పిదం వేరే లేదు. కాబట్టి మనం చేసుకొనే శరణాగతి గ్రుడ్డిది, నిస్తేజమయినదిగా ఏదో ఒక ప్రభావానికి లేదా ఎదురయ్యే ఎన్నో అచేతనమైన, జడమైన ప్రభావాలకు లోనయ్యేదిగా ఉండకూడదు. శరణాగతి చిత్తశుద్ధితో గూడిన, సచేతనమైన, అప్రమత్తమైన, ఒకే ఒకటైన, సర్వోన్నతమైన భగవంతునికే గావాలి.

ఆత్మ సమర్పణ మన్నది జగన్మాతకు, దైవానికే గావించుకోవాలి. అది ఎంత కఠోరమైనప్పటికీ అది మాత్రమై క్రియాశీలమైన సాధనం, ఏకైక ఆశ్రయం. జగన్మాతకు ఆత్మను సమర్పించుకోవటం అంటే మన స్వభావం ఆమె కరాచాలలో ఒక పరికరం అయిపోవాలి, ఆత్మ అమ్మ ముంజేతుల్లో పసిబిడ్డలా మారాలి.

CWSA 12:170-71

*

నిస్తేజంగా, నిరాసక్తంగా జరిగే అర్పణ నిజమైన సమర్పణకు కచ్చితంగా భిన్నమయినది. ఇటువంటి జడమైన, ఉదాసీన సమర్పణ వల్ల అసలైన శక్తివంతమైనదేదీ సంభవించదు. భౌతిక స్వభావంలోని ఈ రకమైన అశక్తమైన శరణాగతి స్వభావాన్ని గందరగోళమైన అదైవిక ప్రభావాల పాలుచేస్తుంది. దైవశక్తి పని చేయాలంటే దృఢమైన సానుకూలమైన సమర్పణ అవసరం. సత్యోన్ముఖుడైన, పరిణతి చెందిన శిష్యుని విధేయత, అంతర్గత అస్పష్టతా అసత్యాలకు విరుద్ధంగా పోరాడే అంతరంగ యోధుడికుండే విధేయత, విశ్వాసపాత్రుడైన భగవంతుడి సేవకుడిలో ఉండే విధేయత వుండాలి.

CWSA 32:5

శ్రీఅరవిందులు

అత్యంత ముఖ్యమైన శరణాగతి అంటే నీ వ్యక్తిత్వాన్ని, నీ నడతను సమర్పించుకోవటం. తద్వారా అది పరివర్తన చెందుతుంది. నీ దైన స్వభావాన్ని నీవు సమర్పించుకోకపోతే... ఇక నీ స్వభావం మార్పు చెందదు. ఇదిగో ఇదే చాలా ముఖ్యం. నీ కంటూ కచ్చిత మైన అవగాహనా మార్గలు స్పందించే ధోరణులు, అనుభూతి చెందే పద్ధతులు, అభివృద్ధి చెందడానికి నికరమైన పద్దతులు ఉన్నాయి. వీటన్నింటినీ మించి జీవితాన్ని ఒక ప్రత్యేకమైన కోణంలో చూడటం, దాని నుండీ కొన్ని నిర్దిష్టమైన అంశాలను ఆశించటం కూడా ఉంటుంది. మంచిదే కాని... దీనినే సమర్పించాలి. నీవు నిజంగా దివ్యప్రకాశాన్ని పొంది పరివర్తన చెందాలనుకుంటే నీ దనుకున్న సమస్తాన్ని సమ ర్పించాల్సిందే. నిన్ను నీవు ఆ ప్రకాశానికి తెరుచుకోవటం ద్వారా సమర్పించుకోవాలి. ఎంత మేరకు సాధ్యం అయితే అంత మేరకు దివ్యచేతనను స్వీకరించటానికి వీలుగా, తద్వారా ఆ దివ్యచేతన నీవెలా ఉండాలో అలా నిన్ను ఉంచడానికి తోడ్పడి, తానే నేరుగా పనిచేస్తూ ఈ నీ ప్రకృతి చర్యల నన్నింటిని మరింత సహజమైన, నిజమైన చర్యలుగా మార్పు చేస్తుంది. నీ ఆంతర సత్యంలో నిన్ను మేళవింపు చేస్తుంది. ఇది నీవు చేసే సమర్పణ కంటే మిక్కిలి ప్రాముఖ్యత కలిగినది. నీవు చేసేది ముఖ్యం కాదు (వ్యక్తి చేస్తున్నది కూడా ఎంతో ముఖ్యం. అది విదితమే) దాని కంటే ప్రధానమైనది నీవెలా ఉన్నావో ఏ స్థితిలో ఉన్నావో అది ముఖ్యం. చేసే పని ఏదైనా గానీ, అది నీవే పద్ధతిలో చేస్తున్నావనేది కాదు, ఏ చైతన్యస్థాయిలో ఉండి చేస్తున్నావనేది ఇక్కడ ప్రధానం.

CWM 4:372

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన రాజు

ప్రతి క్షణం, ప్రతి కదలిక పవిత్రీకరణ

మన అస్తిత్వం యొక్క ప్రతి కదలికని, ప్రతి క్షణాన్ని పవిత్రీకరించి, భక్తిశ్రద్ధలతో కూడిన అవిచ్ఛిన్న ఆత్మసమర్పణగా ఆ దైవానికి అర్పించుకునేలా నిర్ణయించుకోవాలి. మన క్రియాకర్మలన్నీ — అతి గొప్పవి, అసాధారణమైనవి, అత్యంత ఉదాత్తమైన విషయాల నుంచి, అతి చిన్నవి, అతి సామాన్యమైన చిల్లర విషయాల దాకా — అన్నీ దైవకైంకర్యం చేయాలి. వ్యక్తిగతమైన మన స్వభావం, మనకు అతీతమైన మన అహాన్ని మించిన ఒక మహోన్నతమైనదానికి సమర్పితంగా అంతర్గతంగాను, ఉపరితలంలోను సాగే కార్యాచరణ యొక్క ఏకైక చేతనతో నుండాలి. మనం ఎవరికి ఏ కానుకగా ఇచ్చినా, ఇది ఎలాంటిదైనా ఆ బహుమతి ప్రదాన ప్రక్రియలో, దానిని అందరిలోను వున్న ఆ దివ్యపురుషునికి సమర్పిస్తున్న భావన ఉండాలి. మన అతి సామాన్యమైన లేదా అతి కఠినమైన భౌతికచర్యలు కూడా ఈ ఉన్నత నడతను కలిగి వుండాలి. మనం తింటున్నప్పుడు, ఆ ఆహారం మనలో ఉన్న దైవానికి సమర్పిస్తున్నట్టుగా భావించాలి. మన దేహమనే దేవాలయంలో కొలువై ఉన్న దైవానికి చేసే పవిత్ర సమర్పణగా భావించాలి. మన భౌతిక అవసరం తీర్చడానికో, లేదా మన స్వయంతృప్తి కోసమో చేస్తున్నామనే భావం మన నుంచి తొలగిపోవాలి.

ఎంత మహత్తరమైన కార్యంలోనైనా లేదా ఉన్నత వర్తనా నియమావళిలోనైనా, కష్టతరమైన లేక ఉదాత్తమైన ఉద్యమంలోనైనా అది మన కోసమైనా, ఇతరుల కోసమైనా, మన జాతి కోసమైనా, అది కేవలం మన కోసం, మన జాతి కోసం అన్న భావం దగ్గర ఆగిపోకూడదు. మనం చేస్తున్న ఆ కార్యాన్ని ఎరుకగల చైతన్యంతో ఒక యజ్ఞకార్యంగా భావించి సమర్పించాలి. ఆ సమర్పణ సూటిగా కేవలం ఆ ఒకే ఒక్కడైన పరాత్పరునికి మనలో నివసించే ఆ దైవానికి — (పైకి కనిపించకపోయినా) పరోక్షంగా ఈ నామరూపాల వెనక దాగివున్న దైవానికే — మన ఆత్మలో, ప్రత్యక్షంగా కనిపించకపోయినా మన మనసులో, మన భావంలో సదా నిలిచి ఉండే అతడికి మాత్రమే సమర్పించాలి. మన కర్మలు, వాటి ఫలితాలు కూడా మనలోని అనంతుడైన, ఆ పరాత్పరుడైన, అతడి చేతుల్లో పెట్టాలి. అతడి ఉనికి కారణంగానే మన ఆకాంక్ష, మన కృషి సంభవమయ్యాయి. ఎందుకంటే సర్వం అతడి అస్తిత్వంలోనే జరుగుతుంది. అతడి కోసమే ఈ ప్రకృతి మన నించి తీసుకున్న ఈ ఆకాంక్షలను, ఈ కృషిని

అతడి దివ్య పీఠం ముందు సమర్పిస్తుంది. కొన్ని కార్యాల్లో కేవలం ప్రకృతే అసలైన కార్యకర్తగా శ్రమిస్తూ ఉంటుంది. మనం కేవలం ఆమె పనిని సాక్షీమాత్రంగా చూస్తూ, ఆమెకు సహాయకారులుగా ఉంటాం. అప్పుడు కూడా మన చైతన్యంలో, అదంతా ఆ దివ్యాచార్యుని కార్యమనే నిరంతర ధ్యాస వుండాలి. మన ఉఛ్వాసనిశ్వాసాలకు, మన గుండె చప్పుళ్ళకు కూడ మన కార్యాచరణ ఒక సజీవమైన లయబద్ధమైన విశ్వయజ్ఞ ఆహుతి అనే ఎరుక కలగాలి.

తరువాత, ఈ యోగాభ్యాసంలో కావలసినది ముఖ్యమైన విముక్త జ్ఞానంయొక్క నిరంతర అంతరంగ స్ఫూర్తి. క్రియాశీలమైన కార్యకలాపాల్లో ఆ స్ఫూర్తి, ఆ జ్ఞానం నిరంతరం ఆ జ్ఞాపకాన్ని దృఢపరస్తుంటుంది. అందరిలో ఉన్నది ఒకే పరమాత్మ, అనేకంగా ఉన్నది కూడా ఆ ఒక్క దైవమే. అందరూ ఉన్నది దైవంలోనే, అందరూ దైవమే — దైవం తప్ప ఈ విశ్వంలో ఏదీ లేదు — అన్న ఈ ఆలోచన, ఈ విశ్వాసం, సాధకుని సమస్త చైతన్యంలో పూర్తిగా స్థాపితమయ్యే వరకు, అదే అతడి సాధనా నేపథ్యంగా వుంటుంది.

ఈ నిరంతర స్ఫురణ ఆత్మోన్ముఖమైన ఈ రకమైన ధ్యానం చివరి ప్రగాఢమైన నిరంతర దర్శనంగా నిలుస్తుంది; మనం ఎంతో శక్తితో జ్ఞాపకం చేసుకునే, లేదా మనం నిరంతరం ధ్యానం చేసే ఆ స్పష్టమైన, సర్వాన్ని ఆలింగనం చేసుకునే చైతన్యంగా నుంటుంది.

ఎందుకనగా ప్రతి క్షణం సమస్త అస్తిత్వపు మూలానికి, సంకల్పానికి, కార్యాచరణకు నిరంతర సూచికగా నిలుస్తుంది. అప్పుడు ఒక్కసారిగా ఆ పరతత్వంలోని నామ రూపస్థితులను వాటికి కారణభూతమైన, వాటిని ఆదుకునేదానిని తనలో ఇముడ్చుకుంటుంది, వాటిని మించిపోతుంది.

CWSA 23:111-13 (SABCL 20:102-04

శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

ఆవశ్యకమైన మొదటి రెండు విషయాలు

మొదటి అవసరమైనది దైవం కొరకు ఆకాంక్ష. తదుపరి నువ్వు చేయవలసింది దానిని జాగ్రత్తగా కనిపెట్టి వుండటం. దానిని సదా అప్రమత్తంగా, సజీవంగా వుంచటం. అందుకు అవసరమైనది ఏకాగ్రత. ఒక పరిపూర్ణ సమగ్ర అర్పణా దృక్పథంతో దైవేచ్ఛ పైనా, దైవ ప్రయోజనం పైన ఏకాగ్రత.

*

యోగానికి ఉపక్రమించినపుడు నీ మొత్తం మానసిక నిర్మాణాలను, మొత్తం నీ ప్రాణిక చక్రాలను పటాపంచలు చేయాలి. నీ విశ్వాసం తప్ప ఏ ఆధారం లేకుండా గాలిలో నిలవడానికి నీవు సిద్ధం కావాలి. గతాన్ని అంటిపెట్టుకుని వుండే నీ వ్యక్తిత్వాన్ని పూర్తిగా మరచిపోవాలి. దానిని నీ చైతన్యం నుండి బయటికి పెకిలించివేసి కొత్తజన్మ నెత్తి ప్రతిబంధకాల నుండి విముక్తుడవు కావాలి. మునుపు నువ్వెలా వున్నావో ఆలోచించకు. నువ్వేది కావాలని ఆకాంక్షిస్తున్నావో దానిని ఆలోచించు. నువ్వేది సిద్ధింప చేసుకోవాలనుకుంటున్నావో మొత్తం దానిలోనే వుండు. గతించిన నీ గతం నుండి మరలి భవిష్యత్తు వైపు దృష్టి సారించు. నీ మతం, దేశం, కుటుంబం అక్కడే వుంది. అదే దైవం.

*

ఎరుకతో కూడిన ఆకాంక్ష స్థితిలో వుంటూ, నిజాయితీగా వుంటే నీ చుట్టూ ఉన్న ప్రతి విషయమూ నీ ఆకాంక్షలో నీకు తోడ్పడటానికి అమర్చబడుతుంది. అది ప్రత్యక్షంగా కావచ్చు, లేదా పరోక్షంగా కావచ్చు. అనగా నిన్ను పురోగమించడానికి తయారుచేస్తూ నవ్యమైన దానితో అనుబంధం ఏర్పర్చడానికి కావచ్చు, లేదా నీ స్వభావం నుండి అదృశ్యమవవలసిన భాగాన్ని తీసివేయడానికి కావచ్చు. ఇది ఒక గణనీయమైన విషయం. నువ్వు నిజంగా తీవ్రమైన స్థితిలో వుంటే ఈ ఆకాంక్షను వాస్తవం చేసుకోవడానికి నీకు ఎటువంటి పరిస్థితియైనా తోడ్పడుతుంది.

CWM 1:83-84, 6:76

శ్రీమాత

ప్రథమ చలనం — అంతర్ముఖమగుట

మనుష్యులు బాహ్యవిషయాలలో మునిగి వుంటారు. అంటే చైతన్యం బాహ్యవిషయాల వైపు మళ్ళి వున్నదన్న మాట. దివ్య ఉనికిని, లోతైన సత్యాన్ని తెలుసుకునేందుకు అంతర్ముఖంగా మళ్ళడానికి బదులు బాహ్యంలో చూసేవి, తెలుసుకునేవి, చేసే విషయాల వైపు చైతన్యం మళ్ళుతుంది. ఇది ప్రాథమిక చలనం. నువ్వు చేసే అన్ని పనులతో, నీ చుట్టూ వున్న వ్యక్తులతో, నువ్వు ఉపయోగించే వస్తువులతో విరామం లేకుండా వుంటావు. తరువాత నీ జీవితంలో నిద్ర, తినటం, మాట్లాడటం, కొంచెం పని చేయడం, కొంచెం సరదాలు తీర్చుకోవడం లాంటివి. తర్వాత మళ్ళీ మొదలు పెడతావు. నిద్ర పోవటం, తినటం మొదలైనవి. వీటన్నింటితో నిమగ్నమై వుంటావు. ఇతను ఏమి చెప్పాడు, అతను ఏమి చేశాడు, అసలు ఏం చేయాలి, ఏ పాఠం నేర్చుకోవాలి, ఏ అభ్యాసం చేసుకోవాలి అన్నదాని గురించి మనుష్యులు ఆలోచిస్తారు. అంతేకాక ఆరోగ్యంగా ఉన్నారా లేదా, సరిగ్గా ఉన్నారా లేదా అన్నవాటి గురించి సాధారణంగా ఆలోచిస్తారు.

అందువల్ల మొదటి చలనం అంత సులభం కాదు. జరిగిన దాన్నంతా వెనుకకు పంపించి, ఒక్క విషయాన్ని లోపలకు తీసుకొని దానిని ముఖ్యమైన విషయంగా చైతన్యం ముందుకు తీసుకురావాలి. ఎందుకు ఉన్నాము, ఎందుకు జీవిస్తున్నాము, మన మేమిటి, వీటన్నింటి వెనుక ఏమున్నదని జీవితం, ఉనికి ముఖ్య ప్రయోజనం యొక్క అన్వేషణ జరగాలి. ఇది మొదటి మెట్టు. ప్రకటన కన్నా కారణం మీద, లక్ష్యం మీద ఎక్కువ శ్రద్ధ చూపించడం, బాహ్యంగా కనిపించే విషయాలతో మన చైతన్యం తాదాత్మ్యం చెందడం నుండి దానిని విరమింప జేయాలి. మనం అన్వేషించాలనుకునే దానిపై అంతర్ముఖంగా ఏకాగ్రత సాధించాలి. ఇది ప్రాథమిక చలనం.

మొదట వ్యతిరిక్త మార్గాన్ని తీసుకోవడం అవసరం, అంటే ప్రకటించ వలసిన పరమ సత్యాన్ని తనలో కనుక్కోవటానికి అంతర్ముఖమయ్యే మార్గాన్ని, జీవితం నుండి విరమించుకోవడం అవసరం. ఎవరూ ఒక్కసారిగా ఈ దశకు ఎదగలేరు.

CWM 7:349-50

శ్రీమాత

అనువాదం: వి. సునీత శేఖర్

శ్రీమాతకు ఉన్మీలనం గావాలి; శ్రీమాత ఆశ్రయం పొందాలి

(అత్యంత సమగ్రమైన సాధన)

శ్రీమాతకు భౌతికంగా ఉన్మీలనమై వున్నట్లయితే కర్మాచరణకు కావలసినది లేక సాధనకు కావలసినదంతా క్రమానుసారంగా వృద్ధి చెందుతుంది. సాధన రహస్యాలలో ప్రధానమైన, అతి ముఖ్యమైన రహస్యం ఇదే.

CWSA 32:154

*

సర్వోరోగ నివారిణి అనేది వున్నది, అయితే ఒక్కటి మాత్రమే వున్నది... పరిపూర్ణ నిర్భరమైన వైఖరియే అత్యంత సమగ్రమైన సాధన యొక్క అతి గొప్ప రహస్యము.

'నిర్భరము' అనగా ఎలాంటి కష్టాలలోనైనా లేక పరిస్థితులలోనైనా దైవంపై నమ్మకముంచడం. అంతా సవ్యంగా జరిగిపోతున్నప్పుడు 'నిర్భరము' అనే దానికి విలువ అంతగా నుండదు. అది ప్రతి ఒక్కరూ అలవరచుకోవలసిన స్థితి. నీవు అందులోకి ఎదగాలి.

శ్రీఅరవిందులు

(*శ్రీఅరవిందులతో నిరోద్ బరన్‌గారి ఉత్తర ప్రత్యుత్తరాలు*, రెండవ సంపుటి పే. 650-57)

*

ఎవరికైనా వారి అంతరాత్మలో దైవంపై విశ్వాసముండి, ఏ పరిస్థితులలోనైనా దైవ కృప తనకు అండగా వుంటుందని, కాపాడుతుందనే నమ్మకం వున్నట్లయితే, వారు ఆ విశ్వాసాన్ని వారి జీవితాంతం, అన్ని వేళలా, అంటిపెట్టుకొని వుండాలి. ఈ నమ్మకంతో అతను అన్ని కష్టాలనూ దాటగలడు, అన్ని అపాయాలనూ ఎదుర్కొనగలడు. ఎందుకంటే దైవకృప తనపై వున్నదనే విశ్వాసం వున్నట్లయితే ఏదీ అతనిని కదిలించలేదు. అది అనంత బలశాలి, అధిక చైతన్యవంతమైనది, చివరిదాకా కొనసాగే శక్తి. అది నీ దైహిక దారుఢ్యం పైన ఆధారపడదు. కేవలం దైవకృపపై తప్ప మరేదాని పైనా ఆధారపడదు. అందువలన ఆ పరమ సత్యం వైపే మొగ్గు చూపుతుంది. ఏది కూడ దానిని కదిలించలేదు.

CWM 5:297

శ్రీమాత

ఆత్మార్పణకు మూలకారణం దైవంపై విశ్వాసం, నమ్మకం. "నాకు దైవం తప్ప మరేది వద్దు. నన్ను నేను పూర్తిగా అతనికి అర్పించుకోవాలని నా కోరిక, నా ఆత్మ కూడా అదే కోరుతున్నది గనుక. నేను అతనిని తప్పక సిద్ధింప చేసుకుంటాను. నేను దానిని తప్ప, నన్ను అతని దరి చేర్చడానికి, నాలో అతని కార్యాచరణను తప్ప — అది రహస్యంగా లేక బాహాటంగా జరిగినా, ప్రత్యక్షంగానైనా లేక పరోక్షంగా జరిగినా — మరేదానిని కోరను. నాకు అనువైన విధంగానో, నా సమయానుకూలంగానో అది జరగాలని పట్టు పట్టను. అంతా తనకు అనువైన కాలంలో, అనువైన విధంగా చేయనీ. నాకు అతనిలో నమ్మకముంది, అతని ఇచ్ఛను అంగీకరిస్తావు, అతని వెలుగు, సన్నిధి, ఆనందం కోసం ఎడతెగకుండా ఆకాంక్షిస్తుంటాను. అందుకోసం అన్ని కష్టాలను, అవాంతరాలను అనుభవిస్తాను. అతనినే నమ్ముతాను, నా ప్రయత్నాన్ని ఆపను. నా మనసు ప్రశాంతంగా వుండి, అతనిని విశ్వసించనీ. దానిని అతడు తన దివ్యప్రకాశానికి ఉన్మీలనం చేయనీ, నా ప్రాణికం ప్రశాంతంగా వుండి ఆతని దిశగా మాత్రమే మరలనీ, దానిని అతడు తన నిశ్చలత, ఆనందాలకు ఉన్మీలనం చేయనీ. సర్వం ఆయనకే, నేను కూడా ఆయనకే. ఏది జరిగినా ఈ నా ఆకాంక్షను, ఆత్మార్పణ భావాన్ని నిలుపుకుంటాను, అది సఫలీకృతమవుతుందనే పరిపూర్ణ నమ్మకంతో కొనసాగుతాను".

ఎవరైనా ఎదగవలసింది ఇలాంటి వైఖరిలోనే

SABCL 23:587

*

ఈ యోగంలో అనుసరించాల్సిన అతి ముఖ్యమైన సూత్రం, దైవప్రేరణకు తనను తాను తెరచుకోవటం. అది నీ పైనే వున్నదనే చేతన నీలో ఒక్కసారి కలిగిందంటే, అది క్రిందకు నీలోకి దిగి రావాలని పిలవాలి. అది దివ్య ప్రశాంతతగా, దివ్యవెలుగుగా, క్రియాశీలమైన దివ్యశక్తిగా, సాకార లేక నిరాకార దైవ సమక్షంగా, దివ్యానందంగా నీ మనసులోకి, నీ శరీరంలోకి దిగి వస్తుంది. ఈ స్పృహ కలగటానికి ముందు ఎవరికైనా విశ్వాసం ఉండాలి, ఉన్మీలనానికై ఆకాంక్షించాలి. ఆశయము, పిలుపు, ప్రార్థన అనేవి అన్నీ ఒకే విషయానికి వివిధ రూపాలు, అన్నీ ఫలప్రదమైనవే. వీటిలో నీకు ఏది తోచినట్లయితే, ఏది సులభమని అనిపిస్తే, దానిని అవలంభించవచ్చు. మరో మార్గమేమిటంటే ఏకాగ్రత. నీ చైతన్యాన్ని హృదయంలో కేంద్రీకరించి (కొందరు

శిరస్సులోనో లేక దానికి ఎగువగానో కేంద్రీకరిస్తారు) హృదయంలో శ్రీమాతను ధ్యానిస్తూ, అందులోకి ఆహ్వానిస్తారు. ఈ రెండింటిలో దేనినైనా అనుసరించవచ్చు, లేదా రెండింటినీ అనుసరింవచ్చు, వేర్వేరు సమయాల్లో — ఏది సహజంగా నీకు తోస్తుందో, లేక ఆ క్షణాన నీకు ఏది అనుసరించాలనే స్పందన కలుగుతందో. ఆరంభదశలో ప్రత్యేకంగా శ్రద్ధ వహించాల్సింది మనసును ప్రశాంతంగా వుంచుకోవడం: దానితో పాటు ధ్యానసమయంలో సాధనకు సంబంధించని ఆలోచనలను, కదలికలను తిరస్కరించాలి. మనసు ప్రశాంతంగా నున్నప్పుడే అది అనుభవానికి క్రమక్రమంగా సిద్ధపడుతుంది. అది సత్వరం సాధ్యపడకపోతే అసహనానికి లోను కాకూడదు. మనసులో ప్రశాంతత నెలకొనటానికి సమయం పడుతుంది. నీ చైతన్యం సిద్ధమయ్యే వరకు ప్రయత్నిస్తూ ఉండాల్సిందే.

SABCL 23: 604-05

శ్రీఅరవిందులు

*

ప్రశ్న: మానసిక మరియు శారీరక విద్యావిధానానికి ఒక క్రమానుసార పద్ధతిగల సాధనలున్నట్లే, శ్రీఅరవిందుల యోగ పురోభివృద్ధికి అలాంటి పద్ధతి లేదా?

సమా: దైహిక, మానసిక, ప్రాణిక అభివృద్ధికి ఒక యాంత్రికమైన క్రమపద్ధతితో గూడిన నిర్దిష్ట ప్రణాళిక తప్పని సరి. అయితే ఈ యాంత్రిక కాఠిన్యత ఆధ్యాత్మికోన్నతిపై ఏ మాత్రము ప్రభావం చూపలేదు. అక్కడ అతి సహజమైన పరిపూర్ణ శ్రద్ధాసక్తులు తప్పనిసరి....

అయితే నిన్నా మార్గంలో పెట్టడానికి ప్రాధమికంగా అవసరమయ్యే సహాయం ఈ విధంగా నుంటుంది.

1) నిద్ర లేవగానే, దినచర్య ప్రారంభించక ముందుగానే ఆ రోజును దైవార్పణ గావించాలి. నీవు ఆలోచించేదంతా, నీదైన దంతా, నీవు చేసే దంతా దైవానికి అర్పణ చేయాలి.

2. రాత్రి, నిద్రపోయే ముందు ఆ రోజున చోటు చేసుకుంటున్నదంతా పునః సమీక్షించాలి. నీ ఆత్మను, నీ కార్యాచరణను దైవార్పణ గావించుటకు మరచిన లేక అశ్రద్ధ వహించిన సందర్భాలను మననం చేసుకొని, అటువంటి పొరపాట్లు మరో మారు చేయకుండా వుండటానికి ఆకాంక్షించాలి.

ఇది చేయవలసిన కనీస కర్మ, అత్యంత స్వల్పమైన ఆరంభం. ఈ ప్రక్రియ నీ సమర్పణా భావం పైన శ్రద్ధ వృద్ధిచెందిన కొలదీ పెరుగుతుండాలి.

CWM 16:315-16

శ్రీమాత

అనువాదం: రామినేని సుందరరామయ్య

అంతరంగంలోని దైవత్వాన్ని తెలుసుకో — నిజమైన ఆత్మను

అహంకారం గాకుండా అంతరంగంలో వెలుగొందు ప్రత్యగాత్మను తెలుసుకునే వరకు స్వభావాన్ని జయించటం స్వేచ్ఛను పొందటం అన్నది వాస్తవం కాదు, పరిపూర్ణం కాదు — 'ఆత్మవాన్'. ఆ పరాప్రకృతే మనసు ద్వారా, జీవితం ద్వారా, శరీరం ద్వారా వ్యక్తమయ్యేందుకు ప్రయాస పడుతోంది. ఆ ప్రకృతే తనపై అస్తిత్వ నియమాన్ని విధించుకొని స్వభావ రూపంలో పనిచేస్తోంది. ఆ ప్రకృతే మనలో ఆత్మ పరిణామానికి, బాహ్య గమ్యానికి రూపమిస్తోంది. అందువల్ల ప్రత్యగాత్మను తెలుసుకున్నపుడు మాత్రమే అతని స్వభావము ఒక చేతనా సాధన మవుతుంది. భగవత్ సాక్షాత్కారానికి జ్ఞానోదయ శక్తి అవుతుంది.

CWSA 19:554

శ్రీఅరవిందులు

*

దివ్యత్వాన్ని అంతర్గతంగా ఆవిష్కరించేందుకు పూనుకున్న వారికి కొన్ని ఉపయోగ కరమైన హితవాక్యాలు.

ఆధ్యాత్మిక విషయాలను నిర్ణయించుటలో మనసు అశక్తమైనది అన్న విషయం ప్రథమాంశం. ఆధ్యాత్మిక విషయాలపై వ్రాసిన వారందరు ఇలాగే చెప్పారు. అయితే ఆచరణలో పెట్టినవారు బహు కొద్దిమంది మాత్రమే. ఆధ్యాత్మిక మార్గంలో పురోభివృద్ధి చెందాలనుకుంటే మానసిక అభిప్రాయాలను, ప్రతి చర్యలను వర్జించవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది.

ఈ మార్గంలో పయనించేవారు వ్యక్తిగత సౌకర్యాలను, సంతృప్తిని, సంతోషాలను

ఆశించటం మానుకోవాలి. ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కావలసిన నిరంతర తపన మాత్రమే వుండాలి. నీ పురోభివృద్ధికి నీకు లభ్యమయిన ప్రతిదాన్ని ఒక సాధనగా గైకొని కావలసినంత పురోభివృద్ధిని వెంటనే సాధించాలి.

మీరు చేసే అన్నింటిలో ఆనందం పొందే ప్రయత్నం చేయాలి. కాని ఆనందం కోసం మాత్రమే ప్రయత్నించకండి. ఉద్రేకాలకు, బలహీనతలకు, ఆందోళనలకు లోను గాకండి. పరిస్థితు లన్నింటిలో ప్రశాంతత, స్థితప్రజ్ఞత కలిగి వుండండి. ఇంకా సాధించవలసిన పురోభివృద్ధి ఆవిష్కరణ కోసం జాగరూకతతో మెలగండి. సమయాన్ని వృధా చేయకండి.

ముఖ విలువను బట్టి భౌతిక సంఘటనలకు ప్రాదాన్య మీయకండి. అవి ఏదో తెలియజేయాలని పనికిరాని ప్రయత్నాలు చేస్తాయి. అసలు విషయం మన అనగాహ నకు రాకుండా చేస్తాయి. ఒకరిని నడిపించేందుకు అతని స్వభావాన్ని మార్చే శక్తి మీకు లేకున్న, వారి ప్రవర్తనపై ఫిర్యాదు చేయకండి. మీకు మార్చగల శక్తి వున్నట్లయితే ఫిర్యాదు చేయడానికి బదులు అతన్ని మార్చండి.

మీరేమి చేస్తున్నా మీ ముందున్న గమ్యమేమిటో మరవకండి. ఇటువంటి బృహదాన్వేషణలో కొనసాగించే ప్రయాణానికి చిన్న, పెద్ద అంటూ వుండదు. అన్నీ సరిసమానంగా ముఖ్యమైనవే. అవి విజయసాధనను త్వరితం గావించవచ్చు లేక ఆలస్యం గావించవచ్చు. భుజించే ముందు కొన్ని సెకన్లు మీరు భుజించే ఆహారం మీ శరీరానికి కావలసిన శక్తిని, స్థిరత్వాన్ని, పట్టుదలను ఇవ్వాలని ఆకాంక్షించండి.

మీరు నిద్రించే ముందు కొన్ని సెకన్లు అలసిపోయిన నరాలకు నిద్ర, ప్రశాంత తను,మెదడుకు నెమ్మదిని ఇవ్వాలని, మీరు నిద్రనుండి లేవగానే పుంజుకొన్న శక్తిచే తిరిగి ప్రయాణం కొనసాగాలని ఆకాంక్షించండి.

మీ ఆవిష్కరణ ప్రయత్నారంభం ముందు ఆ ప్రయత్నం మీకు దోహదపడాలని లేక కనీసం ఏ విధంగాను ఆటంకపరచకూడదని ఆకాంక్షించండి.

మీరు మాట్లాడేటప్పుడు, మీ నోట మాటలు వచ్చే ముందు వాటిని నియంత్రించా లని ఏకాగ్రత వహించి అవసరమైన పదాలను మాత్రమే వాడునట్లు అవి మీ పురోభివృద్ధికి ఏ విధంగాను హానికరం గాకుండునట్లు ఆకాంక్షించండి.

సంక్షిప్తంగా చెప్పాలంటే మీ జీవిత ఉద్దేశ్యమేమిటో, గమ్యమేమిటో మరచిపోకండి. ఈ మహోన్నతమైన అన్వేషణకై సంకల్పభారం సదా నీపైన నీవు చేసే కార్యకలాపాల

న్నింటినీ విహంగ వీక్షణం సారిస్తూ ఈ అస్తిత్వపు కదలిక లన్నింటిపై ఆధిపత్యం వహించాలి.

CWM 12:32-35

శ్రీమాత

అనువాదం: ఎ. క్రిష్ణ

పని యోగంలో ఒక భాగం

మీరు ఏమీ చేయకున్న, మీకు ఎటువంటి అనుభవము వుండదు. యావత్ జీవితము ఒక అనుభవ రంగం. నీవు వేసే ప్రతి కదలిక, నీవు తలచే ప్రతి తలంపు, నీవు చేసే ప్రతి పని, ఒక అనుభవం కావాలి, తప్పక కావాలి. అంతరంగంలో మనం ప్రయత్న పూర్వకంగా సాధించే అభివృద్ధిని పని అనే కార్యరంగంలో వర్తింపజేయాలి.

CWM 7:287

*

మనం గంటల కొలది చేసే ధ్యానంలో ఏకాగ్రతలో మన బాహ్యజీవితం మన నిత్య కృత్యములోని ప్రతీ క్షణం ఆవశ్యకమైన అనుబంధం కావాలి. ఎందుకనగా? ధ్యానానికి ఏకాగ్రతకు సంయోగం అనే ఫలితం సమకూరుతుంది — వికసించే పుష్పంలా మన పనిలోని అంశాలన్నీ శుద్ధి కావడానికి, మెరుగుపరచడానికి, కావలసిన రీతిలో మలచబడటానికి నిత్యకృత్య నిర్వహణ అనే దాగిలిపై సమ్మెట పోట్లు తినాల్సిందే.

అందుబాటులోకి వచ్చిన చిన్న చిన్న అవకాశాలను కూడా, అసంఖ్యాకమైన అంశాలను అనువైన విధంగా మలచుకొనడానికి, స్వార్థరహితం గావించడానికి, స్వలాభాపేక్ష, త్యాగబుద్ధి, భక్తి, దయ, సౌమ్యతను నేర్పటానికి వినియోగించుకోవాలి. అవి అస్తిత్వాన్ని మార్చి, సంస్కరించి తిన్ననైన మార్గంలో నడిచేటట్లుగా చేస్తాయి. అయితే లక్ష్యాన్ని సాధించటంలో ఎవ్వరు కూడా అసంఖ్యాకమైన అనేక రకాల అనుభవాలను, సంఘటనలను తప్పించుకోలేరు.

CWM 1:6-7

శ్రీమాత

*

పని యోగంలో ఒక భాగం. దైవ సాన్నిధ్యాన్ని, దివ్యప్రకాశాన్ని, దివ్యశక్తిని అన్ని ప్రాణికమైన కార్యాలలో నింపటానికి మంచి అవకాశమిస్తుంది. పని అనుభవ రంగాన్ని, శరణాగతి అవకాశాన్ని పెంపొందిస్తుంది.

SABCL 25:200-01

శ్రీఅరవిందులు

అనువాదం: ఎ. క్రిష్ణ

అగ్ని జ్వలించే విశ్వాసమే నిజమైన ఊతకర్ర

ఈ యోగ ప్రారంభానికి అనుభవం కన్నా విశ్వాసమే బలంగా ఉండాలి. ఈ సత్యం ఆధ్యాత్మిక జీవితంలోను, నిత్య జీవితంలోనూ వర్తిస్తుంది. కర్మ సిద్ధాంతాన్ని అనుసరించేవారు, అన్వేషణలు చేసేవారు, శాస్త్రవిజ్ఞానం ద్వారా నూతన విధానాలు కనిపెట్టేవారు, జ్ఞానద్రష్టలు ఈ విధంగానే ముందుకు సాగిపోతారు. అనుకున్నది సాధించేవరకూ ఎన్ని అడ్డంకులు వచ్చినా, విమర్శలు, అపజయాలు ఎదురైనా, వారు లెక్క చేయరు. వారి అచంచల విశ్వాసమే వారిని నడిపిస్తుంది.

ఒకసారి "గ్రుడ్డి నమ్మకం మంచిదేనా" అని శ్రీరామకృష్ణ పరమహంసను ఎవరో అడిగారట. శ్రీరామకృష్ణులు తడుముకోకుండా "మూఢమైన విశ్వాసమే అసలైన విశ్వాసం" అని కరాఖండిగా చెప్పారట. విషయం ఏమిటంటే తర్కంగాని లేక దాని మీద ఆధారపడిన విజ్ఞానం గాని, నిరూపించబడినందున నమ్మిక కలిగించేవి గాని, రూఢిపరచబడిన విజ్ఞానంగాని విశ్వాసం అనిపించుకోవు.

ఇంకా సాధించని లేక ప్రకటితము కాని సత్యాన్ని ముందుగా దర్శించగల ఆత్మసాక్షియే విశ్వాసం అంటే. అవి జరుగుతాయనీ, వాటిని తప్పక సాధించవలసిన అవసరం ఉందనీ అంతరాత్మకు తెలిసే వుంటుంది. మనసులో నమ్మకం కుదరక పోయినా, ప్రాణికశక్తుల వలన కలిగిన ఆటంకాలను ఎదుర్కోవటంలో విఫలమైనా, అంతరాత్మ స్థిరంగానే వుంటుంది.

ఈ వ్యతిరేక శక్తులను, అవి కల్పించే ఆటంకాలను, కలుగజేసే అంధకారాన్ని ఎదుర్కొనవలసిన అవసరం రానివారు ఈ యోగంలో ఎవరైనా ఉన్నారా? అని

మీకు సందేహం రావచ్చు. ఒకవేళ అలాంటివారు ఉంటే వారిని ఏదో అతీతశక్తి నడిపిస్తూనే ఉండాలి గదా? వారి మార్గం సత్యమార్గమనీ, కేవలం భావన మాత్రమే కాదనీ ఆ అంతరంగ శక్తికి తెలిసే వుంటుంది.

ఈ యోగానికి దైవం యొక్క ఉనికిపై అంచచల విశ్వాసము, దాని ప్రాధాన్యతపై నమ్మకము పునాదులు వంటివి. ఇది ఆత్మానుగతంగా వుండాలి. దీనికి సరితూగగల విషయం జీవితంలో మరొకటి వుండదు. ఆధ్యాత్మిక జీవనంపై విశ్వాసం ఉన్నంత వరకూ, కష్టనష్టాలను, వ్యతిరేకతలను ఎదుర్కొనవలసి వచ్చినా, ఏండ్ల తరబడి పోరాడవలసి వచ్చినా ఆధ్యాత్మిక జీవితంలో అంతిమ విజయం తథ్యం.

నిజంగా కావలసినదీ, అభివృద్ధి పరచుకో వలసినదీ కేవలం విశ్వాసం మాత్రమే. కాని అది హేతుబద్ధంగా సహజంగా వుండాలి. దైవం నిన్ను దివ్యజీవన మార్గంలో సాగిపొమ్మని ఆదేశిస్తే, ఎన్ని కష్టాలొచ్చినా నిన్ను నడిపించి గమ్యం చేర్చే శక్తి ఒకటి నీకు తోడుగా ఉన్నట్లే! వ్యతిరేకశక్తుల మాటలను వినకూడదు. ఓటమిని సూచించే ప్రాణికశక్తుల అసహనాన్ని, వాటి ప్రతిధ్వనులను పట్టించుకో గూడదు. కష్టాలు వస్తే విజయం లభించదని నిరుత్సాహపడ కూడదు. దైవసాక్షాత్కారం లభించకపోతే, ఎప్పటికీ ఇంతేనని ప్రయత్నం మానుకోకూడదు. కష్టాలకు క్రుంగకుండా విశ్వాసంతో ముందుకు సాగాలి. పట్టుదలతో విజయం సాధించాలి. నిజంగా విశ్వాసం ఉన్నవాడే దైవాన్ని నమ్మగలడు; అచంచల విశ్వాసంతో యోగంలో ముందుకు సాగగలడు.
SABCL 23:572-73

*

ఇదే 'శ్రద్ధ' అంటే. దీనికి సరియైన ఆంగ్ల పర్యాయపదం లేదు. అత్యున్నత శక్తియైన ఆ వెలుగే అతిమానస ఆహ్వానము. అది నిమ్నత్వాన్ని ఉన్నతం చేస్తుంది. అల్ప జీవనం నుండి ఆత్మ సాక్షాత్కారానికి మార్గమైన జీవన విధానానికి రమ్మని ఆహ్వానిస్తుంది. కేవలం మేధస్సు ఈ పిలుపును గ్రహించలేదు. ఇది హృదయజనితమైనదీ కాదు. ప్రాణశక్తి కూడా కాదు. అంతరంగమే ఈ ఆహ్వానాన్ని గుర్తించి, ఆ ప్రభావాన్ని అందిపుచ్చుకొని, సత్యమార్గంలో పయనించగలిగేది — అది కేవల అంతరంగమే.
CWSA 22:774

శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు



సాధనకు సహాయపడే పుస్తక పఠనం

ప్రాథమిక మానసిక దశలో మంచి పుస్తకాల పఠనం సహాయపడుతుంది. మంచి పుస్తకాలు మనసును సన్నద్ధం చేస్తాయి, దానిని సరైన వాతావరణంలో నిలుపుతాయి. పాఠకుడు సున్నిత మనస్తత్వం గలవాడయితే, మానసిక స్తరంలో కొన్ని వాస్తవమైన అనుభవాల క్షణిక దర్శనాలను కలిగిస్తాయి. తరువాత వాటి ప్రయోజనం సన్నగిల్లు తుంది — ఇక జ్ఞానసంబంధమైన ప్రతి ఒక్క విషయాన్ని, అనుభవాన్ని నీలోనే కనుగొనాలి.

*

అది పుస్తక లక్షణంపై ఆధారపడి వుంటుంది. వేదాంతం కొన్ని విషయాల్లో మనసును నేర్పరిగా చేస్తుంది — లేదా చేయాల్సి వుంటుంది. అది హాని కలిగించేది ఒకే ఒక సందర్భంలో — మనసు ప్రత్యక్షానుభవం దిశగా ముందుకు పోవటానికి బదులు ఊహాగానాలను అంటిపెట్టుకొనుటను ఆరంభించినప్పుడు.

*

చదవటం ఆరంభించే సమయాన దైవాన్ని స్మరించి నీ పఠనాన్ని దైవార్పణం గావించు. తిరిగి చదవటం పూర్తి అయిన పిమ్మట మరోసారి ఆ విధంగానే చేయాలి.

*

చదవాలని లేక అధ్యయనం చేయాలని తీవ్రోత్సాహం మనసులో గట్టిగా నాటుకున్న ప్పుడు, ఆ వ్యక్తి సమయాన్నంతా అందులోనే గడపాలనుకుంటాడు. అది తనను తాను సంతృప్తిపరచు కోవాలనుకొనే ఒత్తిడి — ఇతర ఒత్తిళ్ళలాగా — చైతన్యాన్ని తన ప్రయోజనం కోసం వశపరచుకుంటుంది. ఎవరైనా ఈ ఒత్తిళ్ళు తమను వశపరచు కోనీయకుండా, తామే వాటిని ఉపయోగించుకోవాలి. అందుకోసం తన దరి చేరే శక్తులన్నింటినీ సర్వదా తన నియంత్రణలో వుంచుకోగల కేంద్ర సత్త ఒకటి వుండాలి. దేనిని స్వీకరించాలో, దానిని ఏలా ఉపయోగించాలో, దాని కార్యాచరణ ఎలా ఏర్పాటు చేయాలో స్వయంగా నిర్ధారించే అవకాశం ఆ సత్తకే వుండాలి. లేనట్లయితే, ప్రతి ఒత్తిడి మనిషి యొక్క వ్యక్తిత్వంలోని ఏదో ఒక భాగాన్ని చేజిక్కించుకొని (విద్యార్థి, సామాజిక స్ఫూర్తిగల వ్యక్తి. శృంగార పురుషుడు, పోరాట పటిమగల

వ్యక్తి) ఆ వ్యక్తి నియంత్రణలో ఉపయోగపడటానికి బదులు అతనిని వశపరచుకొని వాడుకుంటాయి.

*

సాధనే ప్రధానమైనదిగా నుండాలి. సాధన అంటే స్వభావ ప్రక్షాళణ. అస్తిత్వాన్ని దైవార్పితం చేయడం, మనసును, అంతర్బుద్ధిని, ప్రాణికాన్ని దైవానికి ఉన్మీలన గావించటం, దైవసంబంధం పెంచడం, దైవ సాన్నిధ్యాన్ని సిద్ధింప చేసుకోవడం, అన్నింటిలోను దైవానుభూతిని పొందడం, సమర్పణ, భక్తి, వ్యక్తిగత చైతన్యాన్ని విశ్వగత చైతన్యంగా విస్తృతపరచడం, పరమాత్మ అందరిలోను ఒక్కడుగా వున్నాడనే నమ్మకం కలగడం, స్వభావంలో ఆధ్యాత్మిక, మానసిక పరివర్తన కొనిరావడం.

SABCL 24:1273, 1280, 1275, 1271

శ్రీఅరవిందులు

*

జీవితాన్ని అర్థం చేసుకోగోరేవారు, దాని ప్రయోజనాన్ని, గమ్యాన్ని తెలుసుకోవాలను కునే వారు బహు కొద్దిమంది మాత్రమే. అటువంటి వారికి అన్నింటిలోకి శ్రీఅరవిందుల పుస్తకాల పఠనం అత్యుత్తమం.

*

ఎవరైనా శ్రీఅరవిందుల రచనలను శ్రద్ధగా చదివినట్లయితే, అతను తెలుసుకొనగోరే అన్నింటికి సమాధానాలు లభిస్తాయి.

*

ప్రతి రోజూ నీవు ప్రశాంతంగా వుండగల ఒక సమయాన్ని నిర్దేశించు.

శ్రీఅరవిందుల పుస్తకాలలో ఒక దానిని తీసుకో; ఒకటో లేక రెండో వాక్యాలను చదువు. మౌనంగా వుండి ఆ వాక్యాలలోని అంతరార్థాలను అర్థం చేసుకొనుటకు ఏకాగ్రత వహించు. మానసిక మౌనం సాధ్యపడనంత మేర ఏకాగ్రత పాటించు. ఫలితం దక్కే వరకు ప్రతి రోజూ ఈ ప్రక్రియను ప్రారంభించు.

అయితే, సహజంగా నిద్రలోకి జారిపోకు.

CWM 17:359; 13:224; 12:205

శ్రీమాత

అనువాదం; అందుగులపాటి జానకి

చదివినది ఆచరించు

ఏమి జరిగి ఉండేది; పుస్తకాలు, అచ్చు యంత్రాలు లేని రోజుల్లో ఒక గురువు, లేదా ప్రారంభకులు వద్ద మాత్రమే ఉండేది విజ్ఞానం. వారు ఇచ్చేవారు దానిని అర్హత ఉన్నవారికి మాత్రమే. దానిని 'పొందే అర్హాత' ఎవరికి ఉన్నది అని వారు భావిస్తారో, వారికి మాత్రమే — 'పొందే అర్హత' అంటే నేర్చుకున్నది చిత్తశుద్ధితో ఆచరణలో పెట్టుట — వారు ఇచ్చారు నీకొక సత్యాన్ని.చిత్తశుద్ధితో దానిని నీవు ఆచరణలో పెడ్తావని ఆశించేవారు. నీవు దానిని ఆచరణలో పెట్టాక, వేరొకదాని నివ్వడానికి అనుమతి నిచ్చేవారు.

ఇప్పుడు విషయాలు వేరేలా జరుగుతున్నాయి. ఎవ్వరైనా, లేదా ప్రతివారు పొందవచ్చు, ఒక పుస్తకాన్ని. దానిని చదవొచ్చు, వెంటనే ఆచరణలో పెట్టొచ్చు లేదా వెంటనే విడిచి పెట్టొచ్చు స్వేచ్ఛగా. ఇదంతా బాగానే ఉంది. కాని, చాలమందిలో, ఒక గందరగోళాన్ని ఇది కలిగిస్తుంది. ఎక్కువ పుస్తకాలు చదివినవారు 'ఇది చాలు' ఇక మనకు అద్భుతాలు జరుగుతాయి తప్పకుండా అనుకుంటారు ఎందుకంటే వారు చాల పుస్తకాలు చదివారు, వాటిని ఆచరణలో పెట్టే కష్టపడ నక్కర్లేకుండా. వారు చాలా ఆందోళన చెందుతారు. 'ఏమిటిది ఇంత చదివాను, ఇంకా మొదటిలానే ఉన్నాను' అవే కష్టాలు — ఏమీ పొందలేదు — సాధించలేదు. నేను తరచుగా వింటా ఈ విధమైన మాటలను.

వారుఒక విషయం మరిచిపోతారు . సంపాదించారు విజ్ఞానాన్ని, మేధోపరమైన, బుద్ధిపరమైన విజ్ఞానాన్ని, దానికి అర్హత పొందకుండా అంటే — చదివినవి ఆచరణలో పెట్టకుండా — సహజంగానే వారిలో ఏర్పడింది ఒక విభేదం — ఒక అగాధం — వారి చైతన్య స్థితికి, వారు మాట్లాడే భావాలకు విజ్ఞానానికి, వారు ఆచరణలో పెట్టని విజ్ఞానానికి మధ్య.

ఇందుకు నేను చెప్పేదేమంటే, నీవు ఆందోళన చెందకు, నీవు అర్థం చేసుకో తప్పనిసరిగా. నీవు విజ్ఞానం పొందాలి అంటే, ఏది ఏమైనా, దానిని నీవు ఆచరణలో పెట్టాలి. అంటే నీ నైజాన్ని నీవు క్రమశిక్షణలో పెట్టాలి. దాని వల్ల నీవు నీ విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టగలవు, వ్యక్తపరచగలవు.

నీవు ఎక్కువ ఎరుకలో ఉన్నట్లున్నావు, నీవు తప్పక చేయాల్సినవి, చేయకూడని

వాటిపై. కాని నీలో చిక్కు ఎక్కడ ప్రారంభమౌతుందంటే దానిని ఆచరణలో పెట్టేటప్పుడు. నీవు తప్పక అడాగాల్సింది ఎక్కువ విజ్ఞానం కొరకు కాదు; నీవు తెలిసిన కొద్దిపాటి విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టడానికి — ధైర్యంగా, బలంగా, శ్రద్ధగా, తు.చ తప్పకుండా.

'ధర్మపథంలో సహస్రాలు' అనే పుస్తక ప్రారంభం చెప్తుంది. నీకు శాంతినిచ్చే ఒక పదం — ఒకే ఒక్క పదం — అర్థం లేని వేలాది పదాల కన్నా ఎక్కువ విలువైనది. దీనిని ఎవరైనా అర్థం చేసుకోగలరు. కాని అది ఇంకా చెప్పింది — నీకు శాంతి నిచ్చే ఒక పదం — నీ బుద్ధి చర్యలను సంతృప్తిపరచి, నీ సత్తపై మానసిక ప్రభావం ఏ మాత్రం కలిగించలేని వేలాది పదాల కంటే ఎక్కువ విలువైనది.

నిజం చెప్పాలంటే, నీ జడత్వం ఎరుక లేకపోవడంపై విజయం సాధించే శక్తిగల దేనినైనా నీవు కనుగొన్నప్పుడు తప్పకుండా నీవు చివరి ఫలితాన్ని పొందేవరకు నీవు కనుగొన్న పదము లేక పదసమూహం లేక పదసమూహం ఇవ్వగల ఫలితాలన్నీ పూర్తిగా పొందిన తరువాత మాత్రమే — ఇతరమైన వాటికి ఎదురు చూడాలి.

ఆచరణలో పెట్టని అనేక సిద్ధాంతాలు, భావాలతో, తలను నింపుకోవాలని ప్రయత్నించడం కంటే, మనసులో ఏదో విధంగా కలిగిన ఒక భావాన్ని ఆచరణలో పెట్టి, అది ఇచ్చే ఫలితా లన్నిటిని నిశ్శేషంగా శోధించడం చాలా ముఖ్యం. ఈ భావాలన్నీ చాల ఉపయోగకరంగా ఉండొచ్చు, వాటి వాటి సమయాల్లో. ముఖ్యంగా వీటిలో ఒక క్రియాశీల భావాన్ని, తగిన సమయంలో ఉపయోగపడ నిచ్చితే, అది నిన్ను అంతర యుద్ధంలో విజేతగా చేయగలదు. అంతర విజయం చేపట్టగలదు. నీకు ఒక ముఖ్యాధ్యేయం ఉండాలి, అదే తెలిసిన భావాన్ని ఆచరణలో పెట్టడం — ఆచరణలో లేని విజ్ఞానాన్ని పోగు చేసుకోడం కాదు.

*

సముద్రమంత సిద్ధాంతాలు, సలహాలు, మంచి నిర్ణయాల కంటే — ఒక బొట్టు ఆచరణ చాలా గొప్పది.

శ్రీమాత

అనువాదం; యస్. వై. సోమయాజులు

శరణాగతి అంటే నీ జీవిత బాధ్యతను భగవంతునికి అప్పగించే నిర్ణయం. ఈ నిర్ణయమన్నది తీసుకోకుండా ఏదీ సాధ్యం కాదు. నిన్ను నీవు సమర్పించుకోవటం అన్నది జరుగకుండా యోగసాధన అన్న ప్రశ్నే లేదు. ఏదైనా దాని తరువాతే లభిస్తుంది. ఎందుకంటే మొత్తం ప్రక్రియ మొదలయ్యేది సమర్పణతోనే. నీవు జ్ఞానం ద్వారా లేదా భక్తి ద్వారానైనా శరణాగతి పొందవచ్చును.

శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన రాజు

*

ఈ విశ్వానికి వాస్తవమైన పునాది ఒక భద్రమైన సర్వసామరస్యమైన ఈ సత్యం — జీవితం ఒక పుట్టుకలేని జీవాత్మ పరమాత్మల అభివ్యక్తి. జీవితం యొక్క నిగూఢ రహస్యాన్ని ఛేదించే కీలక సూత్రం, ఈ పరమాత్మ తాను స్వయంగా సృష్టించిన సృష్ట్యాదులతో తనకున్న సంబంధం.

CWSA 23:115

శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

*

చదవాలి: యోగానికి ఏది సాయపడుతుందో లేదా పనికి ఏది ఉపయోగపడుతుందో లేక దైవప్రయోజనార్థం ఏది సామర్థ్యాన్ని పెంపొందిస్తుందో, దానిని

చదవకూడదు: విలువలేని విషయాలను లేక కేవలం వినోదం కోసమో లేక విలాసార్థమో, మేధాపరమైన జిజ్ఞాస ఏదైతే మానసికమైన సారా సేవనం లాంటిదో అట్టి సాహిత్యం.

SABCL 24:1279

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి జానకి


7/11/2014.

భగవత్ స్పర్శ



అఖిల

అఖిల భారత పత్రిక – నవంబరు 2014



The Mother's Feet

7/11/2014

విషయసూచిక

దివ్యస్పర్శ

(శ్రీమాతారవిందుల రచనల నుండి యెన్నబడినవి)

మీ కంఠస్వరము ఒక శ్రావ్యమైన గీతాలాపనలో నా హృదయపు నిశ్శబ్ద నిశ్చలతలో వినవచ్చింది. ఆది పదముల రూపంలో నా మస్తిష్కంలోకి అనువదించబడింది. ఆ పదములు భావాన్ని అందించలేకపోయినా మీతో ప్రభావితమైనాయి. అవి భూమాతకు సంబోంధించబడి ఈ విధంగా తెలియజేస్తాయి — ఓ అభాగ్యురాలవు, శోకార్తురాలవైన భూమాతా, నేను నీలో ప్రత్యక్షంగా మున్నానని గుర్తుంచుకో. విశ్వాసం కోల్పోకు. ప్రతి ప్రయత్నం, ప్రతి దుఃఖం, ప్రతి సంతోషం, ప్రతి బాధ, నీ హృదయంయొక్క ప్రతి పిలుపు, నీ ఆత్మయొక్క ప్రతి అభిలాష, నీ రుతువుల ప్రతి పునఃప్రారంభం, అన్నీ ఎట్టి మినహాయింపు లేకుండా, ఏది నీకు శోకార్తమని తోస్తుందో, ఏది ఆనంద దాయక మనిపిస్తుందో, ఏది వికార మనిపిస్తుందో, ఏది సుందరమైన దనిపిస్తుందో సమస్తమూ పొరపాటు పడకుండా నిన్ను నా దిశగా నడిపిస్తాయి. నేనే అంతులేని దివ్యానందాన్ని, నీడలేని దివ్యకాంతిని, సమగ్రమైన దివ్యసామరస్యతను, దైవికమైన విశ్వాసాన్ని, దైవికమైన విశ్రాంతిని, మహోత్కృష్టమైన దైవానుగ్రహాన్ని.

ఆలకించు ఓ భూమాతా, వినవస్తున్న ఆ విలక్షణ కంఠస్వరాన్ని ఆలకించు.

ఆలకించి నవ్య ధైర్య సాహసాన్ని చేజిక్కించుకో.

CWM 1:14

శ్రీమాత

సార్వజనీనమైన మన జీవితంలోని నిరాటంకమైన దివ్యానందం మనలను పిలుస్తున్నప్పటికీ పెడసరమైన మూర్ఖత్వంతో మనం మన నిస్సారమైన, ఖండమైన, అజ్ఞానాంధకారం చుట్టుముట్టిన, చింతలు — చుట్టుముట్టిన దానికే అంటిపెట్టుకుని ఉంటాం. ఇది భగవంతుని అంతుపట్టని రహస్యాల లోని అత్యాశ్చర్యం గొలిపే విషయం. దానికి సమానమయేది అనంత మైన అజ్ఞానంతో మనం మన స్వార్థపూరితమైన అహం నీడను ప్రపంచం మొత్తం మీద పడవేసి, అదే మన సార్వజీన అస్తిత్వం అనటం. ఈ రెండు అజ్ఞానాంధకారాలు మహామాయ యొక్క అంతస్సత్వము, శక్తి.

శ్రీఅరవిందులు

తలపులు — సూక్తులు

*

స్వార్థపూరితమైన అహం, అజ్ఞాన, మూర్ఖత్వాలతో అలసట నొందిన తర్వాతనే మనం మనలను భగవంతుని చరణాలకు అర్పించుకుని ఆయనను, మన ఏకైక ప్రభువు కమ్మని అడుగుతాం.

CWM 2nd ED Vol.10: p. 361

శ్రీమాత

అమ్మ చరణాలు

పరివర్తన క్రియాశీలశక్తి

ప్రశ్న: మాతా, నేను నీ చరణాల నుంచి శక్తి ప్రవహిస్తున్న అనుభూతి పొందుతు న్నాను. ఆ కిరణాల కాంతితో, ప్రశాంతితో స్థిరత్వాన్ని పొందినదాన్ని బట్టి, అది కార్యకారిగా లేదా గమనశీలిగా అవుతున్నది. ఉపశమనం కలిగించే ప్రేమతో, మాధుర్యంతో నీ చరణాలు అస్తిత్వానికి ఓదార్పు నిస్తున్నాయా అని అనిపించే విధంగా ఉన్నది. మాతా, అదే సమయంలో ఒకరు ఎన్నో రకాలైన అనుభూతులు పొందవచ్చు. కాని అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆ శక్తి చాలా కార్యకారియే, రూఢిగా సామర్థ్యం కలదే.

సమా: అవును బిడ్డా, కచ్చితంగా అది అదే; ఎందువల్లనంటే అది పరివర్తన శక్తి, అందువలననే అది కార్యాకారి. అక్కడ ఉన్న కాంతి మహా అచేతనలోని జడపదార్థరాశిని ప్రకాశవంతం చేయడానికి చొచ్చుకుపోతుంది, అక్కడ ఉన్న శక్తి తమస్సుకు ప్రేరణ కలిగిస్తుంది, అక్కడ వున్న ఆనందం దానికి ఎరుకను కలిగిస్తుంది. ఈ శక్తి వక్రగతితో పెడసరమై, అనృతంలో మునిగి ఘనమై, అస్పష్టమై, కఠినమైన ఈ అచేతనామయమగు జడపదార్థరాశి అట్టడుగు వరకూ, అపారమై, అభేద్యమై ఏమాత్రం చెక్కుచెదరని కాఠిన్యం కలిగినటువంటి సత్యమనేదే లేని శక్తులతో వ్యతిరేకించే ఈ శాశ్వత అర్థరహిత అస్పష్టతలోకి కాంతిని తీసుకురావడానికి తప్పక చొచ్చుకు పోవలసి ఉంది.... అక్కడ ఒక పరమోత్కృష్టమైన ఉనికి లక్షల సంఖ్యలలోని సన్నని తాళ్ళతో పదార్థంలో బిగించి కట్టబడి యున్నది. అక్కడ అది ఒక నిగూఢమైన అతీంద్రియశక్తితో బంధీ చేయబడి యున్నది. దానికి దాని నుంచి విముక్తి కలిగించటం చాలా కష్టసాధ్యం. చలనరహితమై, అది పదార్థంలో విశ్రమించి యున్నది, ఏ కద లికా లేని చోట, ఎప్పటికీ ఏమీ చేయడానికి అనుమతించబడని చోట,ఒక అజేయశక్తి వ్యతిరేకతతో ప్రతిదీ అడ్డగించబడే చోటయినటువంటి అచేతనా అగాధాలలో అది ఏ హేతుబద్ధతా లేక బలవంతంగా ఉంచబడింది. అందువలననే ఈ పరివర్తనాశక్తి పదార్థం సమగ్రంగా అనుభూతి చెందేవరకు, ఇంకా ఎక్కువగా నా ఉనికినీ, వ్యాప్తమౌ తున్న కాంతి ఎరుకనూ కలిగి ఉండేటట్లుగా దానికి వలసిన బలము నొసగే ఆధిపత్యశక్తితో తప్పక తన కార్యమును కొనసాగించవలసి యుంటుంది. కాంతి యదార్థంగా

పదార్థం హృదయకేంద్రంలోకి చొచ్చుకొనిపోయేటట్లుగా నేను దానిని కిందిగి గట్టిగా నొక్కి ఒత్తిడిని కలుగజేస్తాను.

నీకు తెలుసా, నేను భూమి మీద వేసే ప్రతి అడుగు, ప్రతి చోటా, ప్రతి చోటా, నేను ఈ శక్తిని, ఈ పరివర్తనకాంతిని నా పాదాల కింద ఉన్న పదార్థంలోని అణువులలోకి, పరమాణువులలోకి ఆవశ్యకమైనటువంటి ఈ పరివర్తనా కార్యంలో వాటిని మేల్కొలపటానికై బలంగా నొక్కుతాను. స్పర్శానుభూతిలేని తిమ్మిరితో స్తంభించినటువంటి అచేతనలో నిద్రావస్థలో ఉన్నటువంటి ఈ పదార్థ జడంలోనికి, దానిని సామరస్యతాపూర్వకమైన లయకూ, సౌందర్యమయమైన సత్యమయమైన చైతన్యానికీ మేల్కొల్పటానికి భూమి మీద ఉద్దేశపూర్వకంగా నేను వేసిన ప్రతి అడుగు ప్రకంపనలను పంపించింది, ఏ విధంగానంటే వినబడుతూ, తిరిగి వినబడుతూ ఉండే ప్రతి ధ్వనుల మాదిరిగా....

...ఇటువంటి విపరీత క్షణాలలో పీలగా ఒక గొంతును ఒకరు వింటారు, భూమిలో ఒక వణుకును గ్రహిస్తారు, మేల్కొలిపే దివ్యత్వపు ప్రకంపనను, అణువుల అగాధాలలో నుంచి కాంతి కోసం ఉవ్వెత్తున లేచే గాఢమైన ఆకాంక్షను ఒకరు అనుభూతి పొందుతారు.

ఒక అవ్యాజ కరుణ్యమయ దైవానుగ్రహం; ఒక సర్వోత్కృష్ట ప్రశాంతత!

ఏమి ఆ అవ్యాజ కారుణ్యమయ దైవానుగ్రహం! ఏమి ఆ సర్వోత్కృష్ట ప్రశాంతత! అణువులలో నివసిస్తూ తీవ్రమగు చిత్రహింసలకు గురైన ఈ అతి అల్ప అస్తిత్వాలకు ఏమి స్వాంతనము! ఎటువంటి అనుగ్రహపూర్వక ఆశీర్వాద క్షణాలు! ఇటువంటి ధూళికణాల కోసమే నేను నా పాదాలు మోపాను — పరివర్తనా కాంతితో, గెలుపొందే ఆధిపత్యశక్తితో, అవి స్పృశించబడ్డాయి. మొదట అవి సమస్థితిని కలిగించే ప్రయత్నం చేస్తాయి, తరువాత అవి ఈ కారుణ్యమును వ్యాపింపజేయ ప్రయత్నిస్తాయి, వాతావరణంలోని గందరగోళం వలన అస్థిరత నొందిన కారణంగా సంక్షోభంలో పడిపోయి తమ పక్కన ఉండేవారి లోనూ మార్పు తీసుకురావటానికి అవి క్రియాశీలమై ఉంటాయి.

నీకు తెలుసా, ఎక్కడెక్కడ నేను నడిచానో, ఎక్కడైనాగాని నేను నా పాదాన్ని

మోపి ఉంటామో, భూమి మీద మా పాదాలు నేలను ఎక్కడ తాకి ఉంటామో, ఆ చోటు పవిత్రమై, పరిశుద్ధిని పొంది, మా స్పర్శనూ, వాస్తవమైనటువంటి అచేతనా అగాధాలలో పని చేయగలందులకై మా నుంచి నిర్గమించిన, మేము ప్రసరింపజేసిన పరివర్తన మహాశక్తినీ గ్రహించగలిగిన స్థితిని పొందింది. మా నుంచి బయలుదేరిన ఆ కాంతి లక్షల సంవత్సరాలుగా నిద్రాణమై, మాంద్యస్థితిని పొందిన ఈ అతి అల్పరేణువులను నూతన చైతన్యానికీ, తెలియని మహదానంద ప్రకంపనకూ మేల్కొల్పాయి. అవి ఈ మహా చైతన్యాన్ని, మహదానందాన్ని తమలో అట్టిపెట్టుకుని, చుట్టూ తమ పరిసరాలలో మార్పును సిద్ధింపజేయడానికై సర్వత్రా వ్యాపింపజేస్తాయి — దివ్యమాధుర్యంతో నిండిన దాని ప్రభావంతో ఈ పరమాణువులు తమలో నుండి బయటకు వ్యాపింపజేస్తున్నాయా అనే విధంగా... అవని ఆత్మను, ఈ పదార్థం ఆత్మను నేను స్పృశించాను, అది నన్ను కృతజ్ఞతా భావంతో అభినందిస్తూ, పోల్చ వీలులేని సమర్పణా భావంతో తనను తాను వెలువరించుకున్నది, అంతే కాకుండా బంధనం నుండి విమోచనకై నన్ను ఆహ్వానించింది....

ఏ చోటనైనా నేను నా పాదాలను ఉంచటం జరిగిందో, అక్కడ పరివర్తనా శక్తి క్రియాకలాపం ఉంటుంది, అది భూచైతన్యాన్ని ప్రకంపింప జేస్తుంది. ఇటువంటి అస్పష్టమైన, కరుడు గట్టిన అచేతనలో ఏ విధంగా — ఈ అజ్ఞానపురాశిలో, దుర్గ్రాహ్యమై చొరబడడానికి వీలులేని తమస్సులో, కాంతి అనేది ఎన్నడూ చూడబడని చోట — చిట్టచివరికి ఈ పదార్థరాశిలో ఒక నిర్మలతనూ, దానితో పాటుగా ఒక కాంతి కిరణం ఈ అతి అల్పపదార్థరాశిని తేజోవంతం చేయడం ఇప్పుడు ఎవరైనా చూడగలరు. ఈ అణువుల వాస్తవ అగాధాల మూలబీజంలో, నిశ్చలమై చుట్ట చుట్టుకుని ఉన్న శక్తులతో బంధింపబడిన ఈ కదలిక లేని పదార్థరాశి అచేతనలో, అస్పష్టమై శాశ్వతమై అజ్ఞానంలాంటి దానిలో, వణుకును బోలిన స్పందనతో మేల్కొలిపే అగ్నిని నేను రగిలింప జేశాను. అది ఏమీ లేనటువంటి ప్రపంచాన్ని గోచరింప జేస్తుంది. ఇటువంటి పదార్థపు ఈ అంధసీమలలో ఎక్కడైతే అది కదలక, మూగగా, జీవితం అనేది లేక గాఢనిద్రలో పడి ఉన్నదో, పరమోత్కృష్టమైన మహాయిచ్ఛ నుంచి అక్కడ ఒక ప్రకంపన బయలు వెడలుతుంది, అప్పుడు పదార్థం వణుకుతూ, కంపించుతూ, ఒక పారవశ్యంలో మేల్కొంటుంది.

భూమి కృతజ్ఞతతో జ్ఞాపకముంచుకుంటుంది:

...కృతజ్ఞతతో నేను భూమి మీద నడచిన కారణంగా కలిగిన పరివర్తన ప్రభావాన్ని ఆమె తనలో పట్టి ఉంచుకుంటుంది; అందువలననే ఆమె వ్యక్తపరచలేని సంతోషంతో తనను తాను వ్యక్తపరచుకుంటుంది.

...మేము ఎక్కడ మా పాదాలను ఉంచామో, ఏ ప్రదేశంలో మా పాద ముద్రలను వదిలామో, ఆ అణువులు తమ నుంచి అనేక కిరణాలను వెదజల్లుతూ తమ సమీపంలోని ఇతర అణువులనూ ప్రభావితం చేస్తాయి, ఈ విధంగా రూపాంతర పరివర్తన అప్రతిహతంగా సాగిపోతుంది.

నీవు సరిగానే చెప్పావు. అధికతరమైన తీవ్రతతో కూడిన శక్తి నా పాదాల నుంచి బయలువెడులుతుంటుంది, ఎందువల్లనంటే, ఈ శక్తి భూ ఉపరితలపు కరడుగట్టిన మట్టిపొరలు గుండా ప్రయాణించడానికీ, గొప్ప అవరోధం నుంచి అచేతనను చేరి దానిని తాకటానికీ. ఈ కారణంగానే ఆ శక్తి సూటిగా వెడుతుంది. అలా కాకుండా, నేను నా చేతితో దీవెన నివ్వటం జరిగితే, నేను ఈ శక్తిని నియంత్రిస్తాను, నేను దీవిస్తున్నప్పుడు ప్రతివారికి వారి అవసరానికి తగినంత ప్రసాదిస్తాను. కాని శ్రీఅరవిందులది మరియొక పద్ధతి: ఈ విధంగా, దూరం నుంచి, ఆయన, శక్తిని సూటిగా నయం చేయటానికీ, మరింత ఉన్నతి నివ్వటానికీ లేక ఆశీర్వదించటానికీ, — నేను దానిని అనేక సందర్భాలలో చూడటం జరిగింది — ఇదంతా ఏమాత్రం ఆయన స్పర్శ లేకుండానే. కాని నా విషయంలో నన్ను నేను కొద్దిగా పరిమితి చేసుకుంటాను, నేను కచ్చితంగా వారు అందుకోగలిగినంత మట్టుకూ, ఎంత మట్టుకు వారు ఇముడ్చుకో గలుగుతారో, ఎంత మట్టుకు జీర్ణించుకో గలుగుతారో అంతే ఇస్తాను. నేను వ్యక్తి సామర్థ్యాన్ని బట్టి, ఎక్కువ కాకుండా, తక్కువా కాకుండా ఇవ్వడంతో వారు సంతోషంగా ఉంటారు. కాని అప్పుడప్పుడు, నేను చాలా ఎక్కువ తీవ్రతతో, శక్తితో పంపించవలసి ఉంటుంది, ఎప్పుడైనా, ఎవరైనా చాలా దూరం నుంచి సహాయాన్ని అర్థించినప్పుడు, ప్రపంచం అవతలి వైపు నుంచి — ఇంకో చివరి నుంచి. నేను ఏదైనా ప్రార్థన వింటే, నేను ఒక శక్తిని, ఒక ఇచ్ఛను చాలా ఎక్కువ తీవ్రతతో పంపిస్తాను, అది ఏది ఆవశ్యకమో దానిని నిర్వర్తిస్తుంది లేక ఒక వ్యక్తిని రక్షించటంగాని చేస్తుంది. నా నుంచి ఒక ప్రకంపన బయలుదేరుతుంది,

ఒక సెకను కంటె తక్కువ కాలంలోనే అది విధి నిర్ధారిత పనిని చేబూనుతుంది, అది ప్రపంచం అవతలి వైపునైనా కాని. ఆ క్షణంలో, అది ఐచ్ఛికంగా, సూటిగా నేను ప్రకంపనలో నిక్షిప్తం చేసిన ఇచ్ఛను నెరవేర్చుతుంది. వాస్తవంగా చెప్పాలంటే, నేను పంపించగా ఆ వ్యక్తి మీద పనిచేసేది చాలా బలమైన శక్తి — అది అతనిని మృత్యువు నుంచి సైతం రక్షిస్తుంది. కాని నేను ఆ శక్తిని అంత తీవ్రతతో తరచూ పంపించటం జరగదు.

(కొంత తడవు తరువాత) కాని నీకు తెలుసా, నేను ఇక్కడ పైన ఉన్నాను, ఈ విధంగా (సంజ్ఞ) నీ తలపైన సర్వదా నీవు ఈ తలుపును తెరిచినప్పుడు నేను నీ లోనికి పూర్తిగా, నీతో తాదాత్మ్యం చెందేందుకు ప్రవేశించటానికి వీలుగా. దాని తరువాత నేను ప్రతిదీ, ప్రతిదీ నీలో చేస్తాను. దానికి నీవు పవిత్రంగా, చిత్తశుద్ధితో ఉండాలి, నీ జీవితాన్ని పాలించటానికి చైత్యపురుషుడు ముందుకు రావాలి. నీ చేతలన్నీ నీ గాఢ అస్తిత్వాన్ని, నీ అంతరంగ జీవితాన్ని తప్పక వ్యక్తీకరించేవయ్యుండాలి. అప్పుడు నా కాంతి పైనుంచి చొచ్చుకుపోయి, నీ చైత్యపురుషునితో కలిసి సంభాషించగలగటమే కాకుండా, నీ చైతన్యంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకురాగలదు.

(The Supreme, Conversations with the Mother recollected by Mona Sarkar, 1st ed., pp. 59-69)

ప్రభువు పాదాలచెంత సమర్పించటంలోని ఆనందం

ప్రశ్న: కాని నాకు సరియైన చర్య చేస్తున్నానా అనే విషయం తెలియటం లేదు.

సమా: (కొంత నిశ్శబ్దం అనంతరం) కాని నీవు దైవంతో సంబంధం పెట్టుకోవాలని అనుకుంటే, ఎటువంటి చర్యను చేపడతావు?

నన్ను నేను నీ పాదాల చెంత ఉంచుతాను.

(శ్రీమాత నవ్వి, తనలోకి అంతర్ముఖమైంది)

CWM 11:330

పొర్లిపోతున్న కృతజ్ఞతతో నీవు అనర్హుడవన్న భావన నిన్ను ముంచెత్తి, నిన్ను

శ్రీఅరవిందుల పాదలచెంత పారవశ్యంతో కూడిన సంతోషంతో పడవేస్తే, అప్పుడది నిజస్థానం నుంచి వచ్చిందని నీవు తెలుసుకోగలవు, కాని, దానికి వ్యతిరిక్తంగా, నిన్ను దైన్యంలోకి నెట్టివేసి, దాగుకునే, పారిపోయే ప్రేరణలను అది తీసుకువస్తే అప్పుడు నీవు కచ్చితంగా వాటి మూలం ప్రతికూల శక్తులలో ఉంది అని తెలుసుకోవచ్చు; మొదటి దానికి ఇష్టపూర్తిగా తెరుచుకోవచ్చు. రెండవదానిని తప్పక తిరస్కరించవలసినదే.

CWM 14:235

అహాన్ని మటుమాయం చేసే విధానం

దైవానికి ఆత్మ-సమర్పణను చేయడానికి మూడు విలక్షణమైన రీతులు:

1) మొత్తం ఆభిజాత్యాన్నంతా వదలివేసి, పరిపూర్ణ వినమ్రతతో ఆయన పాదాలకు సాష్టాంగ దండప్రమాణ మాచరించడం.

2) ఆయన ముందు తన అస్తిత్వపు పొరలను విడదీసి విన్నవించుకోవడం, తల నుంచి పాదాల వరకూ తన మొత్తం శరీరాన్ని ఒక పుస్తకం తెరచినట్లుగా తెరవడం, తనలోని కేంద్రాలను వాటి కదలికల నన్నింటినీ మరి ఏవీ ఇక దాగి ఉండే వీలులేని రీతిలో కనపడే విధంగా పూర్తి చిత్తశుద్ధితో తెరచి ఉంచటం.

3) ప్రేమతో, సంపూర్ణ ధృఢ విశ్వాసంతో ఆయన బాహు పరివేష్టనంలో ఒదిగిపోయి, ఆయనలో మిళితమై పోవడం.

ఈ మూడు గమనాలు మూడు సూత్రాలను అనుసరిస్తాయి. లేదా ఏదైనా ఒక దానిని సందర్భానుసారంగా అనుసరిస్తాయి:

1) నాది గాక, నీ ఇచ్ఛయే జరుగును గాక.

2) నీ అభీష్టమే, నీ అభీష్టమే.

3) శాశ్వతంగా నేను నీ వాడిని.

సర్వసాధారణంగా, సరియైన పద్ధతిలో ఈ గమనాలు జరగడం సంభవించినప్పుడు, వాటిని పరిపూర్ణ తాదాత్మ్యమూ, మిళితమైపోయిన అహమూ అనుసరించి, ఒక మహదానందానికి కారణభూతం చేస్తాయి.

CWM 1:102-103

ఈ అస్తిత్వంలో ఏదో ఒకటి నీకు చెబుతున్నది, ఓ ప్రభూ,

"నా కేమీ తెలియదు,

నేనేమీ కాను,

నేనేదీ చేయ అశక్తుడను,

నేను అచేతనా అంధకారంలో ఉన్నాను".

ఇంకొకదానికి దేనికో తెలుసు ఇది మీరే, దాన్ననుసరించేదే పరమోత్కృష్టమైన పరిపూర్ణత అని.

దాని నుంచి ఏం జరగబోతున్నది? ఆ స్థితి ఏ విధంగా అంతమౌతుంది? అది జడత్వమా లేక నిజమైన ఓరిమో నాకు తెలియదు; కాని ఏ తొందరా లేక కోరికా అనేది లేక నేను మీ చరణాల వద్ద నిరీక్షిస్తున్నాను.

CWM 1:147
146

నా నిశ్శబ్ద నమస్కృతులు, వినమ్ర ఆరాధన....

నేను మీ వైభవం ముందు తలవంచి నమస్కరిస్తున్నాను, ఎందువల్లనంటే, అది మిరుమిట్లు గొలిపే ఉజ్జ్వల కాంతితో నన్ను అధీనం చేసుకుంటున్నది....


ఓ దేవా, మీ చరణాల చెంత నన్ను అదృశ్యమైపోనీ, మీలో కరిగిపోనీ.

CWM 1:203
200

నాకుగా నేను మీ చరణాల చెంత పడి ఉందును గాక, మీ హృదయంలో కరిగిపోయి, అదృశ్యమైపోదును గాక, మీ దివ్యానందంలో నామరూపాలు లేక నాశనమైపోదును గాక, లేక మరేదీ కోరక, కేవలం మీ బంటుగా ఉందును గాక, మరి దేనికీ నాకు కోరికా, ఆకాంక్షా లేదు. కేవలం మీరా సేవకునిగా ఉండటమనేదానినే నేను అడుగుతున్నాను.

CWM 1:211
208

శ్రీమాత



ఆమె చేతులు పారవశ్యసూచకంగా బారగా సాచి ఉన్నాయి, శాశ్వతి అగు శ్రీమాత తన అత్యంత పరిశుద్ధ ప్రేమను తుషార బిందువుల వలె అప్రతిహతంగా ప్రపంచం మీద కుమ్మరిస్తూనే ఉంటుంది.

CWM 1:367

362.

శ్రీమాత

మార్మికంగా భయం నుంచి విముక్తి పొందే మార్గం

ఎవరికైతే ఒక దైవంలో, వారి దైవంలో, విశ్వాసం ఉందో, ఎవరైతే తమను తాము పూర్తిగా అర్పించుకున్నారో వారి కోసం మూడవ పద్ధతి: వారు ఆయనకు సంపూర్ణంగా చెంది ఉంటారు. వారి జీవితంలోని అన్ని సంఘటనలు దైవేచ్ఛ అభివ్యక్తాలు, వారు ఆయనను ఆమోదించేది కేవలం ప్రశాంతంగా ఆయనకు లోబడి ఉండటంలో మాత్రమే కాదు, కృతజ్ఞతాపూర్వకంగా కూడా లోబడి ఉండటం, ఎందువల్లనంటే, వారికి ఏమి జరిగినా ఎల్లప్పుడూ అది స్వయం వారి మంచికేనని వారు నమ్మకం పొంది ఉన్నారు. వారికి దేవుడి మీద ఆయనతో వారికిగల వ్యక్తిగత సంబంధం మీద ఒక మార్మికమైన విశ్వాసం ఉండి వారి ఇచ్ఛను సంపూర్ణంగా ఆయన ఇచ్ఛకు సమర్పించుకున్నారు, వారు జీవితంలోని ప్రమాదాలకూ, మృత్యువుకూ సంపూర్ణంగా స్వతంత్రమైన ఆయన మార్పులేని ప్రేమ, రక్షణల అనుభూతి పొంది ఉన్నారు. వారి అత్యంత ప్రేమపాత్రుని పాదాల చెంత సంపూర్ణ ఆత్మ-సమర్పణను కలిగి లేక ఆయన చేతులలో లాలించబడుతున్నట్లుగా ఉండి పరిపూర్ణ భద్రతను ఆనందిస్తూ పడివున్న ఆనుభవం నిరంతరంగా వారికి ఉంది. వారి చైతన్యంలో ఇక ఏ మాత్రమూ భయానికీ, ఆందోళనకీ లేదా యాతనకు తావు లేదు; అదంతా ప్రశాంతమైన, ఆహ్లాద భరితమైన దివ్యానందంతో పునః స్థాపించబడింది.

CWM 12:84

సాధకురాలు పిల్లి పంథా

నా దగ్గర ఒక పిల్లి ఉండేది — ఆ రోజుల్లో నేను నేల మీద నిద్రించేదానిని — అది ఎప్పుడూ వచ్చి, దోమతెర కిందనుంచి దూరి, నా పక్కన పరుండేది. అంతేనా, అది అన్ని పిల్లుల మాదిరిగా నిద్రించేది కాదు. ఈ పిల్లి పొడుగ్గా పడుకునేది; అది తలను ఇక్కడ ఆనించి, ఈ విధంగా (సంజ్ఞ), నా కాళ్ళ పక్కన, దాని ముందు రెండు కాళ్ళు ఈ విధంగా, వెనుక చిన్ని రెండు కాళ్ళు పూర్తిగా నిలువుగా సాచి పడుకునేది. దానిని గురించి చాలా, చాలా కుతూహలం కలిగించే విషయం ఉంది, ఒక రాత్రి నేను అది చూశాను. నన్ను నేను ప్రశ్నించుకునేదానిని, అది ఎందుకు ఈ విధంగా ఉంది అని. అప్పుడు ఒక రోజు రాత్రి, చిన్న వయస్కురాలైన ప్రజా

సంఘాలకు చెందిన ఒక రష్యా వనితను జంతుచర్మం, బొచ్చుటోపీతో తన ముగ్గురు చిన్నపిల్లలతో సహా చూశాను. ఈ వనిత తన పిల్లల మీద ఒక విధమైన ప్రేమభావన కలిగి ఉండేది, ఎల్లప్పుడూ దానిని ఉంచటానికి ఒక సురక్షితమైన ప్రదేశం కోసం చూసేది; అదేమిటో నాకు తెలియదు, ఆ కథ ఏమిటో నాకు తెలియదు, కాని అమెను నేను ముగ్గురు పిల్లలతో సహా చూశాను, చాల చిన్నపిల్లలు, ఆమెతో... ఒకరు ఇంత, ఇంకొకరు ఇంత, మరి ఒకరు అంత (శ్రీమాత తన చేతులతో వారి ఎత్తులలో తేడాను చూపిస్తున్నది), ఆమె తనతో వారిని పట్టి లాగుతూ, వారిని సురక్షితంగా ఒక మూల ఉంచటానికి వెతకసాగింది. తప్పకుండా ఆమెకు ఏదో జరిగి ఉంటుంది. ఆమె ఉన్నట్టుండి చనిపోవడం తటస్థించింది, అదీ ఒక విధమైన సహజసిద్ధమైన జంతుసంబంధమైన మాతృప్రేమతో చనిపోయి ఉంటుంది, కాని పూర్తిగా భయంతో — భయం, తీవ్రపరితాపం, వ్యధ — ఇదేదో తప్పక అక్కడి నుంచి వచ్చి ఉంటుంది, అది ఏదో విధంగా పునర్జన్మ నెత్తింది. అది ఒక గమనం, వ్యక్తి కాదు, తెలిసింది దా, అది ఆ వ్యక్తికి సంబంధించిన గమనం, అదే ఈ పిల్లిలో తప్పక చేరి ఉంటుంది. అది ఏదో అక్కడ ఉంది, గమనిస్తున్నావా, అది ఏ విధంగా జరిగిందో నాకు తెలియదు, నాకు దాని గురించి ఏ మాత్రం తెలియదు, కాని ఈ పిల్లి దాని ప్రవర్తనలో పూర్తిగా మనిషిలాగే ఉంది. దాని తరువాత చాలా శీఘ్రంగానే దానికి మూడు పిల్లలు కలిగాయి; అది చాలా అసాధారణ రీతిలో ఉండేది, అది వాటిని వదలి ఉండటానికి ఇష్టపడేది కాదు, వదలటానికి నిరాకరించేది, అది, పూర్తిగా... అది తినేది కాదు, దాని కాలకృత్యాలకు వెళ్ళేది కాదు, ఎప్పుడూ తన చిన్నారులను కనిపెట్టుకుని ఉండేది. అలా ఉంటుండగా, ఒక రోజు దానికి ఒక ఆలోచన వచ్చింది — దానికి ఎవరూ ఏమీ చెప్పలేదు, సహజంగానే అనుకో — అది ఒక పిల్లను తీసుకుని, మెడను నోటితో పట్టి తెచ్చేవిధంగానే, తీసుకువచ్చి, నా పాదల మధ్య పెట్టింది, నేను కదలలేదు, అని తిరిగి వెళ్ళిపోయింది, రెండవదానిని తెచ్చింది, అక్కడే పెట్టింది, మూడవదానినీ తీసుకువచ్చింది, అక్కడే పెట్టింది, మూడింటినీ అక్కడికి చేర్చిన తరువాత, అది నా వంక చూసింది, 'మ్యావు' అని వెళ్ళిపోయింది. ఆ పిల్లలు పుట్టిన తరువాత మొదటిసారి అది బయటకు వెళ్ళింది; అది తోటలోకి, తన కాలకృత్యాలు తీర్చుకొనటానికి, ఆహారానికి వెళ్ళింది, ఎందువల్లనంటే, దాని కిప్పుడు ప్రశాంతత చిక్కింది, దాని పిల్లలు నా పాదాల మధ్య ఉన్నాయి. అవి

కొద్దిగా పెరిగి వయసు రాగానే, అది వాటిని ఆడవారిలాగా తన వీపున మోయాలని చూసేది. అది నా పక్కన పడుకున్నప్పుడు, తన వీపు మీదే పడుకునేది. అది ఎప్పుడూ పిల్లిలా లేదు.

CWM 7:97-98

ఇది ఈ విధంగా మొదలైంది. ఒక పిల్లి ఆయన (శ్రీఅరవిందులు) ఇంటిని ఎంచుకుంది, ఇతర సభ్యులు దానిని రానీయకుండా ఉండటానికి శాయశక్తులా ప్రయత్నం చేశారు, కాని అది తాను అనుకున్నదానిలో ధృడనిశ్చయం కలిగి మొత్తానికి విజయం సాధించింది.

శ్రీఅరవిందులు పిల్లి-చైతన్యం మీద పని చేయాలని అనుకున్నారు కూడా. ఈ సాధిక పిల్లి, తనకు, తన సంతానానికి ఒక ఇంటిని కనిపెట్టింది.

పిల్లులు ఏర్పరుచుకున్న ఈ నివాసం గురించి పేర్కొనాలంటే పెద్ద అధ్యాయమే అవుతుంది, దానికి ఇక్కడ అవకాశం లేదు. కనుక నేను ఒక్క దానికి మాత్రం పరిమితమవుతాను, దాని పేరు బుషీ, అది శ్రీఅరవిందుల వలన అమరమైంది, కవి సార్వభౌముని 'మెట్ల మీద నైరాశ్యం' (Despair on the Stair case) అనే పద్యకవితలో.

బుషీ శ్రీమాత, ప్రభువుల గొప్ప భక్తురాలు. తన ఈ జీవితానికి అది శ్రీమాతను ఒక విశ్వాసం కలిగిన కుక్కలాగ అనుసరించే నియమం పెట్టుకుంది. ఎప్పుడైనా శ్రీమాత తన సూప్ ప్రసాదాన్ని ఇవ్వడానికి గాని లేక సాధారణంగా జరిగే ధ్యానానికి గాని కిందకి దిగి వచ్చినప్పుడు. బుషికి ఉండేటటువంటి గొప్ప మనోవాంఛ లేదా ఆకాంక్ష ఏమిటంటే తన పిల్లలను శ్రీమాత, వీలైతే ప్రభువు చెంతకు తీసుకువచ్చి వారి పాదాల ముందు తన నివేదనగా సమర్పింటడం.

ఆ కారణంగానే అది తన చిన్నపిల్లలను పైన మెట్ల మధ్యలో, మూలనున్న బీరువా కింద ఉంచింది. ఇక్కడ నుంచి, అది ఎప్పుడైనా సరే తలుపు తెరవబడి, శ్రీమాత బయటకు వచ్చిన వెనువెంటనే వాటిని తీసుకువచ్చి, ఆమె పాదాల చెంత ఉంచేది. అది, వాస్తవంలో, చాలా హృదయాన్ని కదిలించే దృశ్యం. పిల్లి సైతం ఏ విధంగా తన కిష్టమైనవాటిని దివ్యమాతకు నివేదించటానికి ఆకాంక్షించింది!

(A few Reminscences, Pujalal, p.81)

మెట్ల మీద నైరాశ్యం

అది మూగబోయి ఉంది, చిట్టచివరి మెట్టుపై ఒంటరిగా,
ఒక అద్భుత నైరాశ్య ప్రతిబింబం;
అతిశయించిన శోకతప్త తలంపు
మేల్కొనే మహిమాన్వితమగు దాని కనుల.
దాని మూగ సౌందర్యభరిత ప్రభావ భంగిమ చూసితి నేను
దాని విషాదభరిత నిగూఢ మనస్సును.
అయినను అది గంభీర, దర్ప, పూర్ణదయార్ద్ర వదన.
దాని నిశ్చల వదనం ఒక దీర్ఘాలోచనా పరివేషం.


దాని వాలము నిటారుగ అజేయపతాకమును బోలెను;
దాని ఠీవి ఎరగదు వాలానికి అటునిటు కదలే హక్కుందని.
ఆ పశుప్రాణి అద్భుత మానవీయత,
ఆకర్షణీయ, అలౌకిక బొచ్చు-పాదముల బ్రహ్మము,
అది ఆత్మనా, స్త్రియా లేక ఒక మార్జాలమా,
నా మనంబు నిప్పుడు కొట్టుమిట్టులాడు ప్రశ్న.

CWSA 2:639

శ్రీఅరవిందులు

శ్రీఅరవింద చరణారవిందాలపై ఒకింత దృష్టి

శ్రీఅరవిందులు తన శరీరం పైభాగం మీద ఎప్పుడూ వస్త్రం ధరించేవారు కాదని నేను చెప్పి ఉన్నాను. ఇందులోనూ, ఎన్నో ఇతర అలవాట్ల వలెనే, ఆయన పూర్తిగా భారతీయుడు, ఆంగ్లేయ పద్ధతిలో ఆయన పెరిగినప్పటికీ. ఉదాహరణకు, ఆయన గదిలో చెప్పులను వాడేవారు కాదు, ఆయన కాళ్ళకు ఏమీ లేకనే తిరిగేవారు. ఒకసారి ఇంట్లో వాడుకునే ఒక జత పాదరక్షలను ఆయనకు అర్పించటం జరిగింది, దానికి ఆయన "నేను వాటిని వాడను, వాటిన నళినికి ఇవ్వండి, అతను చెప్పులను ఇష్టపడతాడు" అని ఆయన అన్నారు. వణికే చలికాలంలో కూడా ఆయన ఒక



నేను అన్నింటిలోకిచొచ్చుకపోతాను. ప్రతి అణువు హృదయంలో జీవిస్తూ అక్కడ పవిత్రీకరించి, రూపాంతరీకరించే అగ్నిని జ్వలింపజేస్తాను. ఆ అగ్ని ఎప్పటికీ ఆరిపోనిది, అది మీ దివ్యాశీస్సుల సందేశ జ్వాల, సర్వ సమగ్ర పరిపూర్ణతలను సార్థక పరిచేది.

ఓ అగ్రాహ్య దివ్యతేజమా, అప్పుడు ఈ ప్రేమ మౌనంగా ధ్యాన మగ్నమై మీ దిశగా తిరిగి, పారవశ్య స్థితిలో మీ వినూత్న దివ్యసాక్షాత్కారానికై వేచి వుంటుంది.

CWM 1:164

శ్రీమాత

దుప్పటినే వాడేవారు. ఆయన తన పాదాలను ఎప్పుడు దుప్పటి బయటే ఉంచటం నన్ను తీవ్రంగా ఆలోచింప జేసేది. అది ఎంతో విరుద్ధంగా అనిపించేది, ఎందువల్లనంటే, మిగతా శరీరభాగాలకంటే కాళ్ళకు ఎక్కువ చల్లదనం అనుభూతి కలుగుతుంది కదా. అంటే దానర్థం, అన్ని సమయాలలో, రాత్రి పూట కూడా, దైవం పాదాలు ఆర్తులకు, భక్తులకు ఆశ్రయం ఇవ్వడానికి తప్పక అందుబాటులో ఉండాలనా? ఎన్నో అస్తిత్వాలు తమ సూక్ష్మ శరీరాలతో ఆయన పాదాలకు ప్రణామం చేయడానికి వస్తాయనుకోవడం ఏమంత విచిత్రమైన విషయమేమీ కాదు. నా ప్రతిపాదన కూడా ఏ మాత్రమూ కాల్పనికమైనది కాదు, ఎందువల్లనంటే, శ్రీమాత ఇప్పుడు మాకు తెలిపిన విషయం. శ్రీఅరవిందులు సూక్ష్మభౌతిక లోకంలో నివాసం ఏర్పరుచుకున్నారని, మాలో చాలామందిమి ఆయనను రాత్రి వేళల్లో సూక్ష్మశరీరాలలో సందర్శించుకుంటూ ఉంటామని. శ్రీమాత ఇంకా ఏమని చెప్పారంటే, నిద్రలో ఉన్నప్పుడు మేము ఆమెను సందర్శిస్తామని లేదా ఆమె మమ్ములను సందర్శిస్తూ ఉంటుందని. ఉదయం పూట తరచు ఆమె అడగట జరిగేది, "మీ కేమైనా దాని గురించి తెలుసా". సహజంగానే, ఇదంతా నిజం అయినప్పుడు, కచ్చితంగా అస్తిత్వాలు తమ సూక్ష్మ రూపాలలో శ్రీఅరవిందులకు ప్రణామం చేయడానికి వస్తూ ఉండవచ్చు. ఒకరు ఒక ప్రశ్న అడగవచ్చు, "కాని ఆచ్ఛాదన లేని పాదాలేల?" "అది భారతీయ సంస్కృతి" అనేది నా సమాధానం.

(Twelve years with Sri Aurobindo, Nirodbaran, p. 62)

స్వస్థతను చేకూర్చే శ్రీమాత చరణస్పర్శ

సందర్భం 24 ఏప్రియల్ 1956. శ్రీమాత 1955 లో అతిమానస అవతరణం గురించి నాతో చెప్పింది, అది 24 ఏప్రియల్ 1956 న జరుగుతుందని ఆమె ముందుగానే ఊహించింది. కాని అది 29 ఫిబ్రవరి 1956 న అవతరించింది; కాని ఆ సంవత్సరం 24 ఏప్రియల్ 1956 న దాని అవతరణ గురించి మొదట ప్రకటించటం జరిగింది. నిషికాంత శ్రీమాతకు వ్రాసిన ఉత్తరంలో తనను ఆ రోజు వరకు బ్రతికించమని కోరాడు, దానికి శ్రీమాత మాట ఇచ్చారు. కాని అప్పటికి 3 రోజులు మాత్రమే మిగిలి ఉంది, అతడు తన మరణశయ్య మీద ఉన్నాడు. ఏదో విధంగా అతడు దర్శనం రోజు వరకు ఇంకా బతికే ఉన్నాడు. దర్శన సమయం అయిన వెంటనే

మేము ఆయనను ఒక చట్రంపై పరుండబెట్టి శ్రీమాత దర్శనం కోసం తీసుకు వచ్చాము. చట్రాన్ని మెట్ల మొదట్లో ఉంచాం. ప్రణబ్ తదితరులు వెంట రాగా శ్రీమాత దిగి వచ్చారు. మేము మంచాన్ని పైకి ఎత్తాం. నిషికాంత తన దుర్బలమైన చేతులను పైకెత్తాడు. శ్రీమాత ఒక్కసారిగా అతని చేతులను తన రెండు చేతులతో కలిపి పట్టుకుని, తన వైపుకు లాక్కుని, కళ్ళను బాగా వెడల్పు చేసి దీనంగా వేడు కుంటూ చూస్తున్న అతని కళ్ళల్లోకి నిశ్శబ్దమైన చిరునవ్వుతో చూసింది. తరువాత ఆమె తీవ్ర పరితాపంతో ఉన్న అతని నుదుటి మీద తన మృదువైె వేళ్ళతో రాసింది. అది ఎలా ఉందంటే, అజ్ఞానంతో తెలియక చేసిన దుష్కర్మ లన్నింటినీ తుడిపివేసినట్లుగా ఉంది. నిషికాంత ఒక్కసారిగా తన వక్షస్థలాన్ని చూపుతూ తటపటా యిస్తూ, "మాతా, మీ పాదాలు ఇక్కడ" అని అన్నాడు. చట్రం కిందికి దించబడింది. శ్రీమాత ప్రణబ్ చేతిని ఆసరాగా తీసుకుంటూ, తన కుడిపాదాన్ని అతని వక్షస్థలం మీద నెమ్మదిగా ఉంచింది. నిషికాంత వణుకుతూ, ఆ పాదాన్ని తన రెండు చేతు లతో గట్టిగా గుండెకు హత్తుకున్నాడు.

నా మనస్సులో శ్రీఅరవిందుల మార్మిక వాక్యం మెదిలింది;


"నిరంతర వ్యధభరిత తీవ్రకంపనా జీవితమును ఆమె పాదస్పర్శతో మాన్పు".

సాయంత్రం నేను నిషికాంతను చూడటానికి వెళ్లినప్పుడు, అతడిలో ఏ మాత్రం జ్వరతీవ్రతతో కూడిన వ్యాకులత లేదు. అతని ముఖం, శరీరం ప్రశాంతంగా ఉన్నాయి. సన్నటి గొంతుతో అతడు అన్నాడు, "లోపల ఉన్న ఆ మంటతో కూడిన నరకయాతన సమసిపోయింది. ఆహా, శరీరం మంచులా చల్లగా అయి పోయింది. ప్రతి కణం ప్రశాంతితో, ప్రశాంతితో ఉపశమించింది".

ఈ అద్భుతం మా కనుల ముందు 1956 లో జరిగింది. దాని తరువాత నిషి కాంత మరి 17 ఏళ్ళు ఎక్కువ బతికాడు!

Memorable Contacts with the Mother, Nirodhbaran, p. 120

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ



నిరంతర సన్నిధి

పరాత్పరుని, దివ్యజనని కనుచూపు క్రిందనే వున్నట్లుగా సదా జీవించు. దైవసాన్నిధ్యాని కర్హత లేనిదేదీ చేయకు, దేనినీ సంవేదించకు, దేనినీ ఆలోచించకు.

CWSA 32:172

శ్రీఅరవిందులు

దైవస్పర్శ

శ్రీమాత స్పర్శ కష్టాలను అవకాశాలుగా మార్చగలదు

నిన్ను నీవు సమర్పించుకున్నప్పుడు, సంపూర్ణంగా సమర్పించుకో, కోరిక లేకుండా, షరతు విధించకుండా, దాపరికం లేకుండా — నీలో సర్వస్వమూ ఆ శ్రీమాతకే చెందునట్లుగా, నీ అహానికి గాని, మరే శక్తికి గాని ఏమి మిగల్చకుండా.

నీ విశ్వాసము, చిత్తశుద్ధి, సమర్పణల మోతాదు ఎంత సమగ్రము, సంపూర్ణంగా నుంటుందో అంత అధికమైన శ్రీమాత కృపాకటాక్షము, రక్షణ నీకు లభిస్తాయి. ఆమె కృపాకటాక్షము, రక్షణ నీ కున్నప్పుడు ఇక నిన్ను అంటుకునే దేముంటుంది? నీవు ఎవరికి భయపడాలి? ఆ కృపాకటాక్షాలు స్వల్పాతి స్వల్పంగా నీపై వున్నా, అది నిన్ను అన్ని కష్టాల నుండి, ఆటంకాల నుండి, అపాయాల నుండి గట్టెక్కిస్తుంది. వాటి సంపూర్ణ రక్షణ వలయం నిన్ను కాపాడుతుంటే, నీవు భద్రంగా నీ దారిన నీవు నడువవచ్చు. కారణం, ఆ దారి ఆమెది గనుక. ఎలాంటి ప్రమాదం దాపురిస్తుందనే చింత లేకుండా ఇహలోకంనుండి గాని, కంటికి కనిపించని పరలోకాలనుండి గాని — ఎంతటి తీవ్రతకైనా ప్రతికూలతకైనా చలించకుండా సాగిపోవచ్చు. వాటి స్పర్శ చాలు, కష్టాలను అవకాశాలుగా, ఓటమిని విజయంగా, బలహీనతను మొక్కవోని శక్తిగా మలచటానికి, ఎందుకనగా, దివ్యమాత యొక్క అనుగ్రహం ఆ పరమాత్మ ఆమోదముద్ర. నేడు గాని, రేపు గాని దాని ప్రభావం నిశ్చయం, అది ఒక దైవశాసనం, అనివార్యం, అపశక్యం కానిది.

SABCL 25:10

శ్రీఅరవిందులు

సాధనా మార్గంలో భౌతిక పద్ధతుల ప్రయోజనం

దర్శనము, ప్రణామ మాచరించే టప్పుడు చోటు చేసుకొనే భౌతిక స్పర్శ లాంటి పద్ధతులు దైవప్రేమ, దైవారాధనలకు ఉద్దేశించిన క్రియాకలాపాలలో వాడవచ్చు, వాడబడుతున్నాయి కూడా. అవి కేవలం మానవ బలహీనతకు రాయితీగా మాత్రమే అనుమతించబడ లేదు. చైత్యపురుష సత్తకు చెందిన మార్గంలో వాటికి చోటు లేద నడం కూడ వాస్తవం కాదు. అందుకు భిన్నంగా, దైవానికి సన్నిహితం గావడానికి,

దివ్యప్రకాశాన్ని అందుకొనడానికి, చైత్యపురుష సత్తతో సంపర్కం సిద్ధింప జేసుకొనడానికి వున్న సాధన మార్గాలలో అది కూడా ఒకటి. వాటిని సవ్యమైన స్ఫూర్తితో నిజమైన ప్రయోజనాన్ని ఆశించి ఉపయోగించినట్లయితే, వాటికి సముచిత స్థాన ముంటుంది. వాటిని దుర్వినియోగం చేసినప్పుడో లేక అశ్రద్ధ నిరుత్సాహం, లేక ఏవగింపు, ప్రతికూల భావన లేక అనైతిక వాంఛ వాటిని మలినపరచి నప్పుడో, అవి అనుచితమై ప్రతికూల ప్రభావం చూపుతాయి.

SABCL 23:756

ఎవరు కూడా ప్రణామం ఒక లాంఛనప్రాయంగా ఒనరించే నిత్యకృత్యం గానో లేక అవశ్య కర్తవ్యంగా నెరవేర్చే తంతుగానో లేక తప్పనిసరిగా నిర్వర్తించ వలసిన బలవంతపు చర్యగానో పరిగణించకూడదు. ప్రణామం యొక్క లక్ష్యం సాధకులు అనునిత్యం శ్రీమాతకు భక్తితో నిర్వర్తించే దినచర్య కాదు. అది సాధకులు శ్రీమాత ఆశీస్సులతో పాటు వారు స్వీకరించి జీర్ణించుకోగల శక్తి మేరకు ఆధ్యాత్మిక తోడ్పాటును లేక ప్రభావాన్ని అందుకో గలుగుటకు. అ ప్రయోజనం పొందటానికి ఒక ప్రశాంతమైన నిశ్చల వాతావరణం నిలబెట్టుకోవడం కీలకం.

CWSA 32:530

ఎప్పుడైతే ఒక వ్యక్తి శ్రీమాత యొక్క భౌతిక స్పర్శానుభూతి అవసరం లేకుండా తన అంతరంగంలో ఆమె స్పర్శానుభూతి పొందగలుగుతాడో అప్పుడు మాత్రమే ఆ భౌతిక స్పర్శానుభూతి యొక్క యదార్థ ఆవశ్యకత నిజంగా క్రియాశీలం కాగలదు. లేని యెడల అది కేవల స్వప్రయోజనార్థం ఆమె నుండి ప్రాణాధార శక్తిని లాక్కోవడమో లేక తాత్కాలికంగా ఉత్తేజం కలిగించే కృత్రిమ ప్రేరకమో అయ్యే ప్రమాదముంది.

CWSA 32:564

శ్రీఅరవిందులు

అంతరంగ మరియు బాహ్య సంపర్కము

శ్రీమాతతో అంతరంగ సంపర్కనము వృద్ధ చెందనీ. అంతరంగ సంపర్కము ఏర్పడినప్పుడే అసంఖ్యాకమైన బాహ్యసంపర్కాలు అతి సులభంగా ఒక దినచర్య కార్యక్రమ స్థాయికి దిగజారిపోతాయి.

CWSA 32:456



అయస్కాంత ఆకర్షణ ఆమె కరకమలముల స్పర్శ. అతీంద్రియము, అతి సున్నితము అయిన వాటి అలౌకిక శక్తి మనో ప్రాణ శరీరాలను సంస్కరిస్తుంది. ఆమె పదకమలముల నెచట నిలుపునో, అచ్చట మానవాతీతమగు పారవశ్య దివ్యానంద ఝురులు ప్రవహిస్తాయి.

CWSA 32:21

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

అంతరంగ సంపర్కము అని నేనటంలోని అర్థం, వ్యక్తి శ్రీమాతతో ఒకటైపోయినట్టి అనుభూతినైనా పొందాలి లేదా అతనికి ఆమెతో సంపర్కంలో నున్నట్టి భావనైనా కలగాలి లేదా ఆమె ఉనికి యొక్క ఎరుక అయినా ఏర్పడాలి లేదా కనీసం సదా ఆమె దిశగా మరలి వున్నట్టుగా నైనా భావించాలి.

CWSA 32:459

అంతరంగ సంపర్కమనగా అంతరంగంలో శ్రీమాత ప్రభావ అనుభూతిని పొందటం.

SABCL 25:291

ప్రశ్న: మీకు లేఖ వ్రాయటంలో ఉన్నతమైన విషయపరిజ్ఞానం వృద్ధి చెంది దృఢపడుతుంది, ఎందుచేత?

సమా: అందుకు కారణం లేఖ వ్రాస్తున్నప్పుడో లేక ప్రారంభంలోనో నీకు శ్రీమాతతోను, దివ్యశక్తితోను సంపర్కమేర్పడటమని నేను భావిస్తాను.

SABCL 25:292-93

శ్రీమాత

శ్రీమాత రెండు విధాలుగా ఇస్తుంది. మానసికపరమైన వాటికి కనుల ద్వారా, భౌతికపరమైన వాటికి చేతి ద్వారా.

CWSA 32:530

ముఖ్యమైన విషయ మేమిటంటే, బాహ్యపరిస్థితుల ప్రభావానికి లోను గాకుండా, అంతరంగ వైఖరిని స్థిరంగా నిలుపుకోవాలి. అంతరంగంలో శ్రీమాత స్పర్శను సిద్ధింప చేసుకోవాలి. ఆ విధంగా చేయడమే అవసరమైనదాని నంతా సమకూరుస్తుంది. యోగాభ్యాసంలో పూర్తిగా నిమగ్న మైనవారు శ్రీమాతను దైహికంగా ఎక్కువగా దర్శించేవారు కారు. ప్రణామ మాచరించటానికి, సాయంత్రపు వేళల్లో ధ్యానం సల్పడానికి వచ్చేవారు కాక, కేవలం సంవత్సరానికి ఒక్క మారు వచ్చినప్పటికీ శ్రీమాతకు నిరంతరం అతి చేరువగా నుండేవారు కొందరున్నారు

CWSA 32:496

శ్రీమాత కృపాకటాక్షం పొందటం ఒక విషయమైతే, మార్పు చెందటానికి పిలుపు నందుకోవటం మరో విషయం, ఆమెకు దగ్గరవటానికికై ఒత్తిడి పెరగటం వేరొక విషయం. ఆమెకు భౌతికంగా దగ్గరగా నుండేవారు ఆ విధంగా నుండటానికి కారణం వారిపై ఒక ప్రత్యేకమైన కృప లేక అనుగ్రహం వుండి కాదు. కేవలం దగ్గరగా

నుండటం వారి కర్మాచరణకు అవసరం గనుక. ఈ విషయాన్ని ఇక్కడి వారందరూ అర్థం చేసుకోవటానికి లేక నమ్మడానికి ఇష్టపడరు. కాని అది సత్యం. ఆ సామీప్యత, దానంతట అదే ఒక ఒత్తిడిని కలిగిస్తుంది. అందువలన మేరే ప్రయోజనం లేకపోయినా, వారి చేతనను శ్రీమాత చేతనకు అనుగుణంగా మలచుకొనేటట్లు చేస్తుంది. అనగా మార్పు చెందటం. అయితే అది వారికి కష్టతరం, ఎందుకనగా ఆ రెండు చేతనల మధ్య, ప్రత్యేకంగా భౌతికస్థాయిలో అంతులేని వ్యత్యాసముంది. వారు ఆమెను కలుసుకోవటం కూడా భౌతికస్థాయిలోనే జరుగుతుంది. కనుక ఆ వ్యత్యాసం మార్పును కష్టతరం గావిస్తుంది.

CWSA 32:501

శ్రీమాత సంపర్కం అహోరాత్రాలు కొనసాగుతుంది. ఎవరైనా రోజంతా అంతరంగంలో ఆమెతో సరైన విధంగా సంపర్కం నిలుపుకోగలిగితే ప్రణామం సరైన ఫలితాన్నిస్తుంది. కారణం, స్వీకరించడానికి నీవు సరైన స్థితిలో నుంటావు గనుక.

SABCL 25:288

శ్రీఅరవిందులు


ప్రశ్న: ఈనాడు శ్రీమాతకు చేరువలో ఆమెకు అతి దగ్గరగా వుండటానికి, పైనున్న ఆమె గదులకు వెళ్ళాలనే ప్రగాఢమైన కోరక కలిగింది.

సమా: శ్రీమాతకు దగ్గరగా రావటమనేది అంతరంగపు గదులలో జరగాలి గాని బాహ్యగదులలో కాదు. ఎందుకనగా, అంతరంగపు గదుల్లోకి ఎవరైనా అన్ని వేళలా ప్రవేశించవచ్చు. అక్కడే చిర కాలం వుండే ఏర్పాటు కూడా చేసుకోవచ్చు.

SABCL 25:292

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి



నీ దుఃఖాన్ని సమర్పించు

పరిస్థితులు సందర్భానుసారంగా రూపుదిద్దుకోవచ్చు కాని కచ్చితంగా అవే కారణభూతం కానేరవు. కారణం అనేది దైవేచ్ఛలో ఉంటుంది., దానిని ఏదీ మార్చలేదు.

కనుక విలపించకు, నీ దుఃఖాన్ని దైవం పాదాల చెంత సమర్పించు. ఆయన నీకు శాంతిని, విముక్తిని ప్రసాదిస్తాడు.

CWM 15:122

శ్రీమాత

యథార్థ దైవసన్నిధి

భగవంతుని శాంతి నిన్ను పైకొన్నపుడు, దైవసన్నిధి నీలో వున్నపుడు, ఒక మహాసాగరంలా బ్రహ్మానందం నీ పైకి దుముకుతూ వచ్చి పడినపుడు, గాలిలో తేలిపోతున్న ఆకులా దైవశ్వాస నిన్నుఅల్లల్లాడిస్తున్నపుడు, సమస్త సృష్టిపై నీలో నుండి ప్రేమ పుష్పవృష్టి కురిపిస్తున్నప్పుడు, అంతకు ముందు అంధకారం, విషాదభరితం, అజ్ఞానమయంగా వున్నదంతా ఒక్క క్షణంలో ప్రకాశింప జేసే, రూపాంతరీకరించే దివ్యవెలుగుతో దైవజ్ఞానం నిన్ను వరదలా ముంచి వేసినపుడు, ఉన్నదంతా ఒకే ఒక్క అభివ్యక్త పరమ సత్యంలో భాగంగా భాసించినపుడు, నీ చుట్టూ అభివ్యక్త సత్యం పరివేష్టించి వున్నపుడు, ఆధ్యాత్మిక స్పర్శతో ఆంతరిక దృష్టితో ప్రకాశమయమై దర్శనం కలిగించు ప్రభావంగల భావంతో, ప్రాణిక సంవేదనతో, భౌతిక విజ్ఞానం ద్వారా కూడా ప్రతి చోటా, కేవలం దైవాన్ని మాత్రమే దర్శిస్తావు, వింటావు, స్పృశిస్తావు.

CWSA 28:329

*

ప్రశ్న: కాని అయ్యా! గతరాత్రి నాకు కలిగిన అనుభూతి మాటేమిటి? నా నుదుటిపై ఒక నునువెచ్చని స్పర్శ, దర్శన సమయంలో మీ పాదస్పర్శ లాంటిది. ఆ స్పర్శ జరిగిందా లేదా అని సందేహించేటంత ఆకస్మికంగా సంభవించింది. అటువంటి స్పర్శలు సంభవమా?

సంభవమా! అని అడుగుతున్నావా! ఎంత అర్థంలేని ప్రశ్న! సాధనలో అటువంటి సంస్పర్శలు సామాన్య అనుభవం లోనివే. అదే కాదు, యింకా విభిన్న మైన స్పర్శలు కూడా వున్నాయి. కొన్ని సమయాల్లో అది వ్యక్తి స్పర్శ లాగ వుంటుంది, మరి కొన్ని సందర్భాల్లో అది దివ్యశక్తి లేక దివ్యసన్నిధి స్పర్శగా వుంటుంది. ఒక నును వెచ్చని స్పర్శనే గాదు, చాలామంది నునువెచ్చని దేదో పైనుంచి దిగి వస్తున్న ఒక తరంగంలా అనుభూతి చెందారు.

(శ్రీఅరవిందులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిరోద్ బరన్ పుటలు 390-91)

బాహ్యస్పర్శ సహాయకారిగా వుంటుంది. ఒక విధమైన దృఢత్వంతో స్వీకరించ డాని కలవాటు పడితే ఆంతరిక స్పర్శ మరింత సహాయకారిగా అవుతుంది. అంతేగాక



శ్రీమాత

బాహ్యస్పర్శ యెల్లప్పుడూ నిండుగా సాధ్యం కాదు. కాని ఆంతరిక స్పర్శ యెల్లపుడూ వుంటుంది.

*

ఆంతరికంలో పని జరగడానికి సహాయపడడాని కుద్దేశించినదే బాహ్య మార్గదర్శకత, ముఖ్యంగా ఏదైనా అపసవ్య చలనాన్ని సరిచేయడానికి, కొన్ని సందర్భాలలో సరైన మార్గాన్ని చూపడానికి. ప్రారంభ దశలో మానసిక ప్రశ్నించడాలను సంతృప్తి పరచేందుకో లేదా మానసిక కార్యశీలతను ఉత్తేజపరచేందుకో తప్ప మరి దేనికీ ఉద్దేశించబడదు.

*

నా స్పర్శ యెప్పుడూ వుండనే వుంది. ఒక మాధ్యమంగా బాహ్యస్పర్శతో మాత్రమే గాకుండా — కలం స్పర్శ — మనస్సు, హృదయం, ప్రాణికం, దేహం మీద దాని ప్రత్యక్ష చర్యను సంవేదించడాన్ని నీవు తప్పక నేర్చుకోవాలి. అప్పుడు .యిబ్బంది అత్యల్పంగా వుంటుంది. అసలు యిబ్బందంటూ లేకనే పోవచ్చు.

CWSA 35:446-48

*

ప్రశ్న: అమ్మా! ప్రతిఫలంగా దేనినీ ఆశించని మాతృమూర్తి ప్రేమ మీది అని మీరు చెప్పడం యుక్తమే, ఎందుకనంటే మీది స్వయం సమృద్ధ జీవితం. కాని నేను ప్రతిదాన్నీ యింకా సాధించుకోవలసి వుంది, నా మానవ మనుగడను, యింకా సంతృప్తిపరచు కోవలసి వుంది. నేనింకా నా అంతరాత్మను, పరమాత్మను తెలుసుకోవలసి ఉంది. దైవం దివ్యత్వాన్ని తెలుసుకొని ప్రేమించవలసి ఉంది. అది దివ్యజనని ఇచ్ఛ అయినట్లయితే, నా జీవితంలో ఆమెను సాకారం చేసుకోవలసి వుంది, లోకాలను గురించి తెలుసుకోవలసి వుంది. కాని అన్నింటి కంటె ముందు నేను జగజ్జననిని, ఆద్యశక్తి మహాకాళిని దర్శించాలి. నాకేది ఉత్తమమైనదో ఆమెకు తెలుసు. ఆమె పాదాల చెంతకు చేర్చే గురువు లేకుండా ఇదంతా నేనెలా సాధించగలను!

మహాశక్తి పాదల కడకు నిన్ను నడిపేందుకు, శ్రీఅరవిందుల కంటె అధికంగా అర్హత కలిగిన వారెవరూ ఈ ప్రపంచంలో నాకు కన్పించడం లేదు.

ప్రేమ, ఆశీస్సులతో.

ప్రశ్న: ప్రియాతి ప్రియమైన అమ్మా! నేను రాసులు రాసులుగా ప్రేమను పంపిస్తున్నాను. నా హృదయ కమలంలో, మీ పాదపద్మాలు ప్రేమపీఠంపై శాశ్వతంగా ప్రతిష్ఠితమై వుండేటట్లు అనుగ్రహించవా తల్లీ!

సమా: ముద్దుబిడ్డా! నీ ప్రేమ మూలంగా నీ హృదయం చాల మధురమైన స్థానమైంది — నీ అస్తిత్వం మొత్తం వెలుగు, ప్రేమ, ఆనందాలతో నింపివేయడాని కనువుగా సదా నన్నక్కడ తిష్టవేయనివ్వు.

నీకు నా ప్రేమ, ఆశీస్సులు.

*

ప్రశ్న: ఓ దేవీ! ఓ తల్లీ! నా హృదయ అంతరాంతరాలలో నేను ఆరాధించే దివ్యజనని అవతారానివి నీవే ననే సహజమైన నమ్మకం వుంది. దాని యెరుక నా కెల్లపుడూ వుంటూనే వుంది. ఆమె పాదపద్మాల ద్వారా తప్ప ఆమెను గురించి నాకు తెలియదు. నీ పాదపద్మాలలో నా కనులు ఆమెను చూడాలని తపించడానికదే కారణం. మీ పాదపద్మాలే తన కాశ్రయమని నా హృదయానికి తెలుసు గనుక, వాటిని హత్తుకొనాలని నా హృదయం తహతహ లాడుతోంది.

సమా: ప్రియాతి ప్రియమైన బిడ్డా! ఒక సచేతన దృఢ విశ్వాసానికి సంబంధించిన దివ్య వెలుగు, సర్వకాల సర్వావస్థల లోనూ నిలిచి వుండే దివ్యసన్నిధి ఆనందం — ఘనిష్టంగా — దివ్యప్రేమ మాధుర్యం సదా నీతో వుండు గాక!

CWM 16:207-09

ప్రశ్న: మాధుర్యమయి మాతా! గురుదేవుని సమస్తాంగముల (కనులు, చేతులు మొదలైనవాటి) నుండి దివ్యకృప జాలువారిన నప్పటికీ వారి పాదముల నుండి వెలువడేది, అత్యంత క్రియాశీలమైనదనీ, కరుణా కటాక్షాలతో నిండి వుంటుందనీ ఈ మధ్యనే విన్నాను. అందుచేత భారతీయ సంప్రదాయం గురుపాదపద్మాలకు ప్రణమిల్లాలని ఆదేశిస్తుందనీ చెప్పగా విన్నాను. ఇది నిజమేనా?

సమా: నీ వడిగిన దానికి శ్రీఅరవిందుల సమాధానం యిదిగో. ఆమె తన పాదముల నెచట నిలుపునో, మోహపరవశులను చేసే మహదానందపు అద్భుత ఝురు లచట పారాడతాయి.

అంతే గాదు,

ఆమె పాదస్పర్శతో జీవన వేదనను బాప
సమస్త ప్రకృతి మూగగా ఆమెను ఆవాహన చేస్తుంది.

CWM 17:390

శ్రీమాత

నేనున్నాను నీతో

నేను నీతో ఉన్నాను, యెందుకంటే నేను నీవే లేక నీవు నేనే.

నేను నీతో వున్నాను అనే పదానికి నానావిషయ మహా ప్రపంచాని కున్నంత విశిష్టత వుంది. ఎందుకనంటే ఊర్ధ్వంలోని పరాత్పర చేతన దగ్గర్నుండి క్రింద నున్న నా అత్యంత భౌతికచేతన వరకు గల సమస్త అంతస్తులందు, భూమికలందు నేను నీతో వున్నాను. ఇక్కడ పాండిచేరిలో నా చేతనను పీల్చకుండా నీవు గాలి కూడా పీల్చలేవు. దాదాపు పదార్థ రూపేణ అది వాతావరణమంతా సూక్ష్మభౌతికంలో నిండిపోయి పది కిలోమీటర్ల దూరంలోనున్న సరస్సు వరకూ, విస్తరించుకొని వుంది. పదార్థస్థాయికి దగ్గరగా వుండే ప్రాణికంలోనూ, మానసిక భూమికలోనూ, ఇతర వున్నత భూమికలలోనూ ప్రతి చోటా నా చేతనను సంవేదించగలవు. నేను మొట్టమొద టగా యిచటి కొచ్చినప్పుడు పదిమైళ్ళు దూరంలోనే, కిలోమీటర్లు కాదు, నావికుల భాషలో పది మైళ్ళు దూరంలో వుండగానే శ్రీఅరవిందుల వాతావరణ సంవేదన కలిగింది. అది చాలా ఆకస్మికంగా జరిగింది, చాలా వాస్తవంగా, పరిశుద్ధ, ప్రకాశమయ, తేజమయమైన — నిన్ను ఉత్తేజపరచే తేజమయ వాతావరణ సంవేదన అది.

శ్రీఅరవిందులు ఆశ్రమంలో ప్రతి చోటా గుర్తు చేసేందుకు యెప్పుడో పెట్టించిన ఈ విషయం మీ అందరికీ తెలుసు. "దివ్యజనని మీ వంక చూస్తూ వున్నట్లుగానే యెల్లప్పుడూ ప్రవర్తించండి, యెందుకనంటే నిజంగా ఆమె అలా వేంచేసియే వుంటుంది".

ఇది కేవలం ఒక పదబంధం కాదు, మాటల అల్లిక కాదు, అదొక వాస్తవం. చాలా ఘనిష్టమైన రీతిలో నేను మీతో వున్నాను. సూక్ష్మదృష్టి వున్నవాళ్ళు నన్ను దర్శించగలరు.

సర్వసామాన్య రీతిలో నా దివ్య క్రియాశక్తి సదా పని చేస్తూనే వుంటుంది. నీ అస్తిత్వపు మనోవిజ్ఞాన సంబంధమైన అంశాల పరస్పర సంబంధ బాంధవ్యాలలో

మార్పులను తీసుకొచ్చే విధంగా వాటిని సదా అటూ యిటూ మారుస్తూ, దేన్ని పరివర్తన గావించాలో, అభివృద్ధి చేయాలో, తిరస్కరించాలో... నీవు చూడగలిగేటట్లు నీ స్వభావపు వివిధ పార్శ్వాలను నీకు నిర్వచిస్తూ, సర్వ సామాన్య రీతిలో నా దివ్య క్రియాశక్తి సదా పనిచేస్తునే ఉంది.

నిజానికి ప్రతి వ్యక్తి బాధ్యత నాదే. నా జీవితంలో ఒక్క క్షణం మాత్రమే నన్ను కలిసిన వారి బాధ్యత సైతం నాదే.

ఇక్కడొక విషయం మరచిపో గూడదు. శ్రీఅరవిందులు, నేను ఒకే చేతన, ఒకే మూర్తిత్వం. ఒకటే అయిన ఈ క్రియాశక్తి లేక ఈ సన్నిధి నీ వ్యక్తిగత చేతనలో నుండి సాగిపోతున్నపుడు మాత్రమే అదొక రూపం ధరిస్తుంది, ఒక ఆకారాన్ని దాలుస్తుంది. ఆ రూపం, ఆ ఆకారం నీ ప్రవృత్తిని, నీ ఆకాంక్షను, అవసరాన్ని నీ అస్తిత్వపు ప్రత్యేక మొగ్గుదలను బట్టి భిన్నంగా వుంటుంది. నీ వ్యక్తిగత చేతన ఒక వడపోత పరికరం లాంటిది, ఒక సూచిక లాంటిది. చెప్పదలచుకుంటే. అనంత దివ్యసంభావ్యతలలో నుండి ఒక సంభవతను యెంచుకొని స్థిరపరుస్తుంది. వాస్తవానికి, ప్రతి వ్యక్తికీ, అతడు దైవం నుండి దేనిని ఆశిస్తున్నాడో దానినే అతడు యిస్తాడు. దైవం యెక్కడో దూరంగా చాలా దూరాన వున్నాడు, కఠినుడు అని నమ్మితే అతడు దూరంగానే వుంటాడు, కఠినంగానే వుంటాడు. ఎందుచేతనంటే నీవు భగవంతుని ఆగ్రహానికి గురి కావడం చివరకు నీ సంక్షేమాని కవసరం గనుక. అతడు కాళీ ఉపాసకులకు కాళి, భక్తునికి పరవశింపజేసే మహదానందం. అతడు జిజ్ఞాసికి. సమస్త-జ్ఞానం, భ్రాంతివాదికి విశ్వాతీతమైన అకర్తృకత. అతడు నాస్తికునితో నాస్తికుడు, ప్రేమించువానికి ప్రియుడు. అతడు సోదరభావం కలవాడు, సన్నిహితుడు, యెల్లప్పుడు విశ్వసనీయతగల మిత్రుడు. ప్రతి క్షణమందు ఆంతర మార్గదర్శిగా ఆతనిని సంవేదించువానికి సదా రక్షించ సంసిద్ధుడై వుంటాడు. ఆతను సమస్తాన్నీ కడిగివేస్తాడని నీవు నమ్మితో, నీ దోషా లన్నింటినీ, నీ పొరపాట్ల నన్నింటినీ అలుపెరుగకుండా కడిగివేస్తాడు. అంతేగాదు ప్రతి క్షణం ఆతని అనంత కృపాకటాక్షాన్ని నీవు సంవేదించ గలుగుతావు. నీ ప్రగాఢమైన ఆకాంక్షలో ఆతనిని నీవు దేనిగా భావిస్తున్నావో అదే నిజానికి దైవం.

ఒకే ఒక్క చూపుతో సమస్తాన్నీ యెచట దర్శిస్తావో, మనిషికి దైవానికి మధ్యగల బాంధవ్యాల అనంత నానాత్వాన్ని చూస్తావో ఆ చేతన లోనికి నీవు ప్రవేశించినపుడు

ఉన్నదాన్నంతా సవివరంగా, యెంత అద్భుతమైనదో నీవు గ్రహిస్తావు, మానవజాతి చరిత్రను చూడ గలుగుతావు. అప్పుడు మానవులు దైవాన్ని అర్థం చేసుకొన్నదానిని, కోరుకొన్నదానిని, ఆశించినదానిని, కల గన్నదానిని అనుసరించి దైవం యెంతగా పరిణమించాడో దర్శిస్తావు. ఆయన పదార్ధవాదితో యెలా పదార్థవాదిగా పరిణమించాడో, నీవు చూడగలుగుతావు. మానవచేతన తనను తాను విశాలం చేసుకొన్నదానిననుసరించి ప్రతి రోజూ ఆయన యెలా వృద్ధి చెందుతాడో, సన్నిహితునిగా మరింత ప్రకాశమయునిగా తయారవుతాడో చూడగలుగుతావు. ప్రతిదానికీ యెంచుకొనే స్వేచ్ఛ వుంది. భగవంతునితో మనిషికి గల వైవిధ్య సంబంధబాంధవ్యాల అనంత పరిపూర్ణత ప్రపంచ చరిత్ర యందంతటా గల ఒక అనిర్వచనీయ అద్భుతం. అదంతా కలిపితే, మొత్తం దైవ అభివ్యక్తిలో ఒక్క క్షణం మాత్రమే.

నీ ఆకాంక్ష ననుసరించి దైవం నీతో వుంటాడు. అలా అని ఆతడు నీ బాహ్య ప్రకృతి చాపల్యాలకు లొంగుతాడని అర్థం కాదు. ఈ అస్తిత్వ సత్యాన్ని గురించే నేనిక్కడ ప్రస్తావిస్తున్నాను. అయినప్పటికీ కొన్ని కొన్ని సమయాల్లో నీ బాహ్య ఆకాంక్షలకు అనుగుణంగా ఆతడు తనను తాను మలచుకొంటాడు. భక్తుల లాగా నీవు యెడబాటు, కలయిక, పరవశం, విరహాలలో మారి మారి జీవిస్తుంటే నీ నమ్మకాన్ని బట్టి దైవం కూడా నీ నుంచి యెడంగా పోతాడు, కలుస్తుంటాడు. ఆ విధంగా, వైఖరి చాలా ముఖ్యం — బాహ్య వైఖరి కూడా. విశ్వాసం ఎంత ముఖ్యమైనదో, అది ఎంత అద్భుతమైనదో, అద్భుతాలను సృష్టించగలదో మనషులకు తెలియదు. ప్రతి క్షణం ఆతడు నిన్నుద్ధరించాలని, నీవు దైవం వైపుకు లాగబడాలని నీ వనుకొంటే ఆతడు అతి సన్నిహితంగా, మరింత సన్నిహితంగా, సదా మరింత కింత సన్నిహితంగా వుండి నిన్నుద్ధరించడానికి తప్పక వస్తాడు.

శ్రీమాత

అనువాదం కె. వి. రావు

అమ్మ కంఠస్వరము

ప్రేమ, వెలుగు, కరుణలతో నిండిన కంఠస్వరం

నా కంఠస్వరం సామాన్యమైనది కాదు. స్పష్టమైన, స్వచ్ఛమైన, నిశ్చలమైన, ప్రేమభరితమైన, తేజోమయమైన, పైపెచ్చు అపార కారుణ్యంతో నిండిన ఈ కంఠస్వరం విన్న వారందరికీ వాటి అనుభూతిని అందజేస్తుంది. ఆ స్వరం ఎంతటి విశ్వాసాన్ని కలిగిస్తుందంటే, అందరి హృదయాలలో ఓ గాఢ ఆకాంక్ష రేకెత్తిస్తుంది. దానికి దివ్యమైన స్వస్థత కల్గించే శక్తి ఉంది, దాని ప్రకంపనలు కష్టాలను తొలగించి, ఓ సమ్మోహనాత్మక శక్తితో అడ్డంకులను మాయం చేస్తాయి. ప్రజలు ఓ పెద్ద భారం నించి నివారణ పొందినట్టు భావిస్తారు. నా స్వరం అజ్ఞానపు ఆచ్ఛాదనను ఛేదించి తెలియకుండానే హృదయంలోకి చొరబడి చైతన్యాన్ని జాగృతం చేస్తుంది. ఆ స్వరం మన శిరస్సులో భారంగా ఉండి, హింసపెట్టే మానసిక ప్రభావాలు, ఆందోళనల నించి విముక్తి కల్గించి మనలో ఉన్న ప్రగాఢ శక్తిని మరియు నిద్రాణమై అణగి ఉన్న వ్యక్తిగత ప్రావీణ్యతలను వెలికి తెచ్చి వాటికి స్వేచ్ఛ నిస్తుంది. అది దైహిక తమో గుణాన్ని కుదిపి, మన అచేతనలోని భయాన్ని తరిమి కొడుతుంది, మనకి ప్రతికూలమైన అడ్డంకులను తొలగిస్తుంది, పునాదిని పటిష్ఠం చేసి మనలను మన లక్ష్యం వైపు సాగేందుకు కావలసిన శక్తి నిస్తుంది.

ఈ స్వరం పరాత్పరుని నించి వస్తున్నది

నా స్వరం అందరి హృదయాలలో నిశ్చలమైన దృఢవిశ్వాసాన్ని మేల్కొల్పుతుంది. ఈ స్వరమే చైతన్యం. అది అచేతనలోని చైతన్యాన్ని జాగృతం చేస్తుంది. నా స్వరం ఆ పరాత్పరుని నుండి వస్తుంది. అతడు నా ద్వారా తనను తాను వ్యక్తపరచు కొంటాడు. ఆ ప్రభువు యొక్క సంకల్పాన్ని మాత్రమే వ్యక్తపరిచిన ఈ స్వరం, పరమ సత్యాన్ని తప్ప మరి దేనినీ ఉచ్చరించని ఆ స్వరం, దివ్యశక్తులను ప్రకటించుటకు అత్యద్భుత శక్తులతో ప్రభావితమై ఉంటుంది. అది దాని ప్రకంపనల ద్వారా మన ఆకాంక్షకు ప్రేరణ నిస్తుంది, మన నమ్మకానికి హామీ నిస్తుంది, అన్నింటికీ మించి చెడుసంకల్పాల మబ్బులను చెదరగొడుతుంది.

ఈ స్వరం — మృదుమధురం, స్పష్టం, శుద్ధం, తీక్షణం, చురుకుదనం

కలది. అది దివ్యసంకల్ప శక్తులను నిర్దేశించి ప్రసారం చేయుటకు సమృద్ధి చెంది నిశ్చల స్పష్టతను సమకూరుస్తుంది. అది బాధాతప్త హృదయాలకు ప్రేమతో ఉపశమనం కల్గించే ఉన్నతమైన మనశ్శాంతి, ఉజ్జీవింపజేసే శ్వాసలా ఉంటుంది. నా స్వరం ప్రసరింప చేసే ప్రకంపనం హృదయంలో దైవం కోసం ఆకాంక్షను మేల్కొల్పుతుంది. అది సృష్టించిన ధ్వని తరంగాలు, ప్రతిధ్వనిస్తూ, ఓ స్వరమాధురిగా అంతరంగంలోకి చొరబడి, పునరావృతమై సాగి శరీర కణాలను జాగృతం చేసి, చైతన్యాన్ని ఆ దివ్యసంపర్క పారవశ్య కాంతికి ఉన్మీలనం చేస్తుంది. ఈ స్వరం అనంతం నించి వచ్చి తిరిగి అనంతంలోనే లయిస్తుంది. ఈ విశ్వంలోని ప్రతి మూలతత్వానికి తనదైన ఒక స్వరం ఉందన్న సంగతి నీకు తెలుసా. కొందరు దానిని వినగలరు, కొందరికి అది వినబడదు. అయినప్పటికీ ప్రతి మూలతత్వం తన స్వీయ ఆకాంక్షను వ్యక్తపరుస్తుంది. ఆ భూమికలకు తెరుచుకుని ఉన్నవారు దానిని వినగలరు.

మధురమైన స్వాంతన నిచ్చే స్వరం

నీకు సుపరిచితమైన ఈ స్వరం, ఒకేసారి స్పష్టంగాను, నిరాడంబరంగా నున్నప్పటికి, అనన్య సామాన్యమైన నమ్మికను కలిగించేది — అతీతం వైపు పయనించాలన్న సంకల్పానికి కావలసిన హామీ నిస్తుంది. పిరికివాళ్ళ హృదయాలలో నా స్వరం ఎదురులేని ధైర్యాన్నిస్తుంది. గాఢ ఆకాంక్షాపరులలో అది సత్సంకల్పాన్ని, దయను పెంపొందించే భావనలను జాగృతం చేస్తుంది. పరితపించే ఆత్మల్లో ఆ స్వరం ఆకాంక్షా జ్వాలను లేదా పవిత్రీకరించే జ్వాలను రగిలిస్తుంది. ఈ స్వరంలో ఆజ్ఞాపించే అధికారం ఉంది. అదే సమయంలో అది మధురము, స్వాంతనాపూరితము.

అది ఓ ప్రగాఢ ఆకాంక్షను మేలుకొలుపుతుంది

నా స్వరం మీలో ఓ ప్రగాఢ ఆకాంక్షను ఉత్తేజపరిచే వాతావరణం చేత ఆవరింపబడి ఉంటుంది. అది లక్ష్యాన్ని చేరేదాకా శ్రమించే సంకల్పాన్ని, భక్తి భావాన్ని, దివ్య ప్రేమభావాన్ని బలపరుస్తుంది. అది హృదయాల లోకి చొచ్చుకునిపోయి కేంద్రసత్తాను జాగృతం చేసి చైత్యపురుష జ్వాలను కప్పివేసిన తెరను తొలగించి, చైతన్యాన్ని మన అస్తిత్వ ప్రభువు వైపుగా నడిపిస్తుంది. నా స్వరం అసాధారణమైన శక్తి కలది, అది ఒక సామరస్యమైన, ప్రశాంతమైన, కాంతివంతమైన, సమృద్ధమైన స్థితిని

విస్తృతపరచి, దానిని ఆనందపారవశ్యంలో దైవాన్ని తెలుసుకోవాలంటూ హర్షపులకిత మైన ప్రతి జీవకణంలోనూ ప్రతిధ్వనిస్తూ, ప్రకాశిస్తుంది.

ఆ స్వరం అతీంద్రియజ్ఞాన ప్రపంచాల వాతావరణంలో ప్రతిధ్వనించి తరంగాలుగా పయనిస్తూ ఒక సమృద్ధిని సమకూరుస్తుంది.

(శ్రీమాతతో సంభాషణలు, మోనా సర్కార్ జ్ఞాపకాల్లోంచి పేజీలు 28-30)

శ్రీమాత స్వరం వినడం

ప్రశ్న: 'బేసిస్ ఆఫ్ యోగా' లో 'నిరంతరం మీ తోను, మీలో ఉండే శ్రీమాతతో మీరు సంభాషిస్తారు' అని చదువుతాం దయచేసి శ్రీమాతతో సంభాషించడం ఎలాగో వివరిస్తారా?

సమా: ఎవరైనా స్వరాన్ని లేదా ఆలోచనని అంతర్గతంగా మాట్లాడటం విని అంతర్గతంగానే సమాధాన మిస్తారు. అయితే ఈ విధానం సాధకునికి ఎల్లవేళలా క్షేమకరం కాదు – అతనికి తన అహంలోను, కోరికలోను, దర్పంలోను, ఆశలోను నిజాయితీ లోపించినపుడు. కారణం, అలాంటప్పుడు అతను తానే ఓ స్వరాన్ని లేదా ఆలోచనను నిర్మించుకొని దానిని శ్రీమాతకు ఆపాదించవచ్చు. అది అతడిని ఆనందపరచడానికి అతడు మెచ్చే విషయాలు చెప్పి అతడిని పెడదారి పట్టించవచ్చు లేదా అతడు మరో స్వరాన్ని శ్రీమాత స్వరమని పొరపడవచ్చు.

CWSA 35:133-34

ప్రశ్న: కేవలం అంతరంగంలోని ఆ స్వరంపై ఆధారపడి, ఆ విధంగా శ్రీమాత మార్గదర్శనం పొందవచ్చా?

సమా: అది శ్రీమాత స్వరం అయితే; కాని అది శ్రీమాత స్వరమేనని నీకు కచ్చితంగా తెలియాలి.

CWSA 32:291

ప్రశ్న: అంతరంగంలో శ్రీమాత స్వరం విని, అది ఆమెదేనని గుర్తించడం సులభం అనే విషయం వాస్తవం కాదా?

సమా: కాదు, శ్రీమాత స్వరం అంతరంగంలో విని గుర్తుపట్టడం సులభం కాదు.

SABCL 25:100-01

ప్రశ్న: అంతరంగంలో శ్రీమాత స్వరం వినడానికి ఒకరు సిద్ధపడి ఉన్నారని ఎప్పుడు చెప్పవచ్చు?

సమా: అతనికి సమత, విచక్షణ, తగినంత యోగానుభవం ఉన్నప్పుడే — లేనప్పుడు ఏ స్వరాన్నైనా శ్రీమాత స్వరంగా పొరపడవచ్చు.

SABCL 25:101

శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

అమ్మ ఆలోకనము

పరాత్పరుని వీక్షణము

నేను ఏకాగ్రతతో తీక్షణంగా చూచినపుడు ఆ చూచేది నేను కానే కాదు, నా కళ్ళతో చూసేది ఆ పరాత్పరుడే. ఆలా చూచినప్పుడు నీకు ఏ బాహ్య ఆకారం కానీ, ఏదైనా పదార్థయుతమైనది గాని కనిపించవు, వస్తుగతమైన ఆత్మ మాత్రమే నాకు కనిపిస్తుంది. నా కళ్ళ ముందు నుంచి సమస్తమూ అదృశ్యమైపోయి, వస్తుగత మైన ఆత్మ మాత్రమే ఉంటుంది. నేను భాషించేది దాని తోనే కాబట్టి అన్ని విషయాలను ఓ క్షణంలో నాకు తెలియచేస్తుంది. అది ఎంతో స్ఫుటంగా, క్లుప్తంగా, తేటతెల్లంగా, నిక్కచ్చిగా, స్వతస్సిద్ధంగా, వాస్తవమైనదిగా ఉంటుంది. ఆ పరమాత్మ దృష్టితో నా ముందు నుంచి అనేక విషయాలు దొర్లడం నేను చూస్తాను. వాటికీ నేను మామూలుగా చూచేవాటికీ పోలికుండదు. కాని అది వాస్తవమైన దివ్యసంకల్పంతో ముడిపడినది. ఆ దృష్టి కొన్ని సంఘటనలను నిలిపివేయగలదు, దుర్నిరీక్ష శక్తితో విధికృతాన్ని మార్చగలదు, ప్రతికూల శక్తులను నాశనము చేయగలదు, నూతన సృష్టికి అవసరమైనవాటిని సృష్టించగలదు; భగవంతునికి సహకరించడానికై మార్పుకు లోనుగానవసరమైనవాటి నన్నిటినీ భద్రపరచగలదు.

ఈ శ్రీమాత చూపు దైవ వీక్షణం. పరస్పరాధారితమై సృష్టిలోని దివ్యానందాన్ని, దివ్యసౌందర్యాన్ని ఏ మాత్రం కలుషితం కాకుండా ప్రతిబింబించే దివ్య చైతన్యంతో విలీనమై పోతుంది. ఈ చూపు నుండి ఉనికిలోని ఆనందం, పరమ సత్య అభివ్యక్తశక్తి,

దివ్యకరుణ, సంపూర్ణ సంయోగ ప్రేమ, అవ్యాజమైన దైవ కారుణ్యము, దానితో బాటే భగవంతుని ఆగ్రహం కూడా ప్రసరితమవుతాయి.

దివ్యప్రేమ స్వతస్సిద్ధంగా ఎడతెగని ప్రవాహంగా పొంగి పొర్లుతుంది.

ఇది దివ్య చైతన్యపు కటాక్ష వీక్షణము. ఇక్కడ నుంచి మానవులు జంతుజాలమనే తేడా లేకుండా వారిపై అనంతమైన కారుణ్యంతో ప్రపంచాన్ని రక్షించడం కోసం ప్రేమ ఎడతెగని ప్రవాహంలా పొంగిపొర్లుతుంది. తనను తాను మరచి ఆనందతరంగాలలో తేలుతూ జనస్థానంలోని అనంతత్వ లక్షణాలను వెదజల్లుతుంది. రెండు ఆశ్చర్యకర అద్భుత ప్రపంచాల హద్దుల్లో అజ్ఞాత అగోచరమైన లోకాల మధ్య వెలువడిన ఈ కటాక్ష వీక్షణము వాటి అంతర గుహల్లో ప్రకాశిస్తున్న సూర్యుల తీక్షణ కాంతిలో వసిస్తుంది. దాని దృష్టి ప్రపంచాల సామాన్య విషయాలను అధిగమించి, ఆ లోకాలను నిర్మించిన శక్తులతో సన్నిహిత సంభాషణలు నెరపి, అక్కడి లోతులలోకి ప్రవేశించి, నిగూఢంగా వేయబడి వున్న ముద్రలను బద్దలుచేసి, ఆకాంక్ష రహస్యంగా పుట్టిన చోటు చేరుతుంది.

అగణితానందం, ప్రేమ అనంతవాహినిగా ముప్పిరిగొని ప్రకాశవంతం చేసిన దర్పణాల వంటివి ఈ కళ్లు ఎక్కడ పరమ సత్య దివ్యసీమల ఆనంద సామరస్యాలలో ఆత్మ తేలియాడుతూ ఉంటుందో ఆ ఉన్నత శిఖరాల పైకి ఈ వీక్షణం ఆరోహిస్తుంది. మహదానందానుభూతి తనకు తానుగా కళ్ళలో వ్యక్తమవుతుంది. భగవత్కారుణతో నిండిన ఈ వీక్షణం ప్రతికూల శక్తులకు ఆలవాలమైన ఈ కఠిన ప్రకృతిలోని మానవుల, జంతుజాలముల కష్టాలను, దుఃఖాలను తనలోకి తీసుకుంటుంది. ఆ విధంగా కష్టాలను తీసేసి వారికి ఆహ్లాదమూ, ప్రేమపూరితము అయిన ఆవాసాన్ని కల్పిస్తుంది, అలా కాని ఈ ప్రపంచం నిజానికి ఒక నరకమే.

(శ్రీమాతతో మోనా సర్కారు సంభాషణలు అనే గ్రంథం నుండి పుట. 88-90)

ఒక దర్శనము

శ్రీమాత ఇలా అంటారు: "ఇటు నా వైపు చూడు, నేను వచ్చేశాను. సరికొత్త దేహం ధరించి వచ్చాను, — దివ్యంగా, రూపాంతరీకరింపబడి, వైభవోపేతంగా.

అయినప్పటికీ నేను ఆ వెనుకటి మాతనే, ఇంకా మానిసినే. ఏ మాత్రం చింతించకు. స్వయంగా నీ గురించి గాని, నీ ప్రగతిని గురించి గాని, నీ సిద్ధిని గురంచి గాని, ఇతరుల గురించి గానీ ఆలోచించకు. నేనున్నాను గదా! నా వైపు చూడు, పరికించి చూడు, నా లోనికి పూర్తిగా చొరబడు, నా అస్తిత్వంలో కలిసిపో, నీ ప్రేమతో బాటు నా ప్రేమలోకి జారిపో. నీ సమస్యలన్నీ తీరిపోవడం గమనిస్తావు, అన్నీ జరుగుతాయి. మిగతాదంతా మరిచిపో, ఈ ప్రపంచాన్ని మరిచిపో, నన్ను మాత్రమే గుర్తుంచుకో. నాతో నా ప్రేమతో చేరి పో"

(Nolinikanta Gupta Birth centenary Vol. 6, p. 259)

నళినీ కాంత గుప్త

ఏకాగ్రతతో నా కళ్ళలోకి గాఢంగా చూడు

బాబూ, నీ దృష్టిని కేంద్రీకరించి నా కళ్ళలోకి లోతుగా చూడగలిగితే నీవు తెలుసుకోవాలనుకున్నవన్నీ నీకు తెలుస్తాయి. అర్థం చేసుకోవాల్సినవన్నీ అర్థమౌతాయి, సిద్ధింపజేసుకోవాలనుకున్నవన్నీ సిద్ధిస్తాయి — తీక్షణంగా ఏకాగ్రత వహించినంత మాత్రాన, నీ నేత్రాల ద్వారా వ్యక్తపడే నీ సంకల్పశక్తి వలన నీవు ఆకాంక్షించినదంతా, నీకు అవసరమైనదంతా నీకు లభ్యమౌతుది. ఈ ప్రపంచాన్నంతా నా కళ్ళలో చూడగలవు. జగత్తంతా నా కళ్ళలోనే విశదమవుతుంది. ఈ ప్రకృతిలో నుండే అందాలే కాక స్వర్గ సౌందర్యాలు కూడా నా కళ్ళలో దర్శనమిస్తాయి. ప్రపంచంలో నీవు చూడాలనుకునే దర్శనీయ కమనీయతల కోసం పలుచోట్లకు వెళ్ళనక్కర లేదు. అన్నీ నాలో ఉన్నాయి, అవన్నీ తమకు తాముగా నా ద్వారా అభివ్యక్తమవుతాయి. నన్ను ఇక్కడ చూసే ప్రయత్నం చేయి. (శ్రీమాత తన హృదయం వైపు నిర్దేశిస్తారు.) అన్నింటినీ, అన్నింటినీ నా కళ్ళ ద్వారా చూడగలవు.

నేను కారణభూతురాలిని, మహాసృష్టి కర్త్రిని

కుమారా, పట్టుపడని మహా అగ్రాహ్యామైనది నేనే, అయినప్పటికీ పట్టుబడటానికి సమ్మతిస్తాను. ఎరుకపడని దాన్నే అయినా నన్ను తెలిసినట్లు జనం నటిస్తారు. నేను ఆద్యంతాలు లేనిదాన్నైనా ఒక భౌతిక దేహంతో దేశ కాలాలకు పరిమితమగుటకు

నిర్బంధించుకున్నాను. నేను శాశ్వతత్వాన్నే అయినా పరిణామగతికి కట్టుబడి ఉన్నాను. భూపరిణామాలన్నిటినీ అనుభవించటానికై భూమిపై వివిధ రీతులలో పుట్టటానికి ఒప్పుకున్న ఆ ఏకత్వం దిశగా అధిరోహించటికై నాకు అమృతత్వ మున్నప్పటికీ నశించిపోయే అనేక జీవాలుగా ప్రభవిస్తున్నాను. అన్నీ అదృశ్యమైపోయే శూన్యతనే నేను, నా ఉనికే లేదను అచేతనత్వాన్ని కూడా నేనే. అయినప్పటికీ ఆ అజ్ఞాన పదార్థంలోని ప్రతి అణువూ నా చైతన్యంతో తొణికిసలాడుతుంది. నేను మహా మాయను – కాని దానికి విరుద్ధంగా ఈ ప్రపంచ, విశ్వాంతరాళ పరిణామంలో దైవం అభివ్యక్తమైన తీరును గురించిన అసంగత విషయాలను బహిరంగపరచుట ప్రారంభించాను. అతిమానసము నిరవధికంగా భూమి పైకి దిగి రావటమనే వాస్తవంతో సామాన్య మానవుని బాధిస్తున్న ద్వంద్వాలు, వైరుధ్యాలు ఇంకా అనేక ఇతర విష యాలు క్రమక్రమంగా పరిష్కారమవడాన్ని దూరదృష్టితో మేము దర్శించ గలుగు తున్నాము.

బాబూ, నేనే కారణభూతురాలిని, నా నుండే సర్వం వెలువడే మహాస్సృష్టికర్త్రిని. నీవు భావించగలిగేదంతా కూడా నేను సృష్టించినదే, నాచే కల్పించబడినదే. నా కోసమే అది ఉంటుంది. నాలో లేనిదంటూ ఏమీ లేదు. నేనేమిటో అర్థం చేసుకోవాలంటే వందల కొద్దీ జన్మలెత్తాల్సి ఉంటుందని అర్థం చేసుకో. ఐనప్పటికీ నన్ను ప్రేమించే నా భక్తులకు నేనేమిటో తెలియ చెపుతాను. అప్పటికి కూడా నేను పట్టుబడకుండానే ఉండిపోతాను.


(శ్రీమాత సంభాషణలు, మోనా సర్కార్ జ్ఞాపకాల నుంచి, మే 92-93)

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

మనస్సు కావలగా నుండే మహా మర్మాన్ని నేను.
సూర్యుల కఠినతర ప్రయాస గమ్యాన్ని నేను.
నా తేజము, నా మాధుర్యములే జీవకారకాలు.

శ్రీఅరవిందులు (సావిత్రి, పేజీ 335)

అనువాదము: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి



Sri Aurobindo's Feet

గతం నుండి విముక్తి



అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2014

విషయసూచిక

... దర్శనీయమైన ఆకృతులుగా వికసన మొందుట సమర్థమైన అభివ్యక్తతకు నియమం. అయినప్పటికి, అతి కచ్చితంగా రూపొందించినదేదైనా పాతబడి, పూర్తిగా కాకపోయినా చాలా వరకు, తన వైశిష్ట్యాన్ని కోల్పోతుంది. అది ఒక కొత్త జీవితం పొందాలంటే, చనిపోయిన లేక చనిపోతున్న వ్యక్తిని తిరిగి చైతన్యవంతునిగా గావించునట్లుగా, నూతనోత్సాహ ప్రసారాలతో నిరవధికంగా పునరుద్ధరింపబడాలి. శాశ్వతంగా పునర్జన్మిస్తుండటం భౌతిక అమరత్వానికి ఆవశ్యకం.

(CWSA 23:5) SABCL 20:1

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

శ్రీఅరవిందుల దీప్తివంతమైన కవిత

49. నాశమొందక తప్పదు పాతబడినదంతా.
అంతరించిపోతుందది నామరూప రహితమై.
మానవ పురోగతిని ఎదగనీక బంధించిన
శృంఖలాల సడలించి అడ్డును తొలగించాలి.

52. కలికాలం గడిచిపోయె. గతియించిన గతం యొక్క
అంతిమ విశ్వాసం చాలును కదిపివేయ దేశాలను.
ప్రక్షాళన చెంది భూమి తన సుందరమగు కనుబొమలను
అందముగా ఎగురవేసి చాటును తన ప్రాభవాన్ని.

53. కలికాలం రూపుదిద్దు స్వర్ణయుగం ఇదే,
మానవ పురోగతిని చాటు చక్కనైన చిహ్నమిదే.
మనిషిలోని మార్గదర్శి జీవయాత్ర నడుపుగాన
మనిషి విడవాల్సిన వాటిని పాపాలని పిలుస్తాము.

54. చెడు మనిషిని అంటివుండి పునరావృతమౌతుంది గాన
బాధపడుతు పోరాడుతు అతడు వదులుతాడు దాన్ని.
ఆ బాధా మంటల్లో ఆమూలం కాలి చెడు
మధురంగా మారి మరింత చేకూరిస్తుంది బలం

CWSA:243-44 (SABCL 5:61

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

గత అరుణోదయాలు, భావి మధ్యందిన మార్తాండ తేజస్సులు

గతం అభివృద్ధికి ప్రతిబంధకంతో పాటు బలపర్థకం కూడా

గతం అభివృద్ధికి ప్రతిబంధకమే కాదు బలవర్ధకం కూడా. వర్ధమానాన్ని తయారుచేసేదీ అదే, భవిష్యత్తును తయారుచేసే శక్తిలో అధిక భాగం కూడా అదే. కారణం, గతం అంతరించలేదు. దాని రూపురేఖలు మాసిపోయాయి, మాసిపోవలసిందే. లేనట్లయితే వర్థమానం ఉనికిలోకి వచ్చేదే కాదు. కాని, దాని ఆత్మ, దాని శక్తి, దాని సారం సజీవంగా వుంది, వర్ధమానపు ముసుగులో దాయబడి వుంది, నిరంతరం పెరుగుతూ వుంది, వృద్ధి చెందుతూ వుంది. లోతుకు నాటుకుంటూ వుంది, భవిష్యత్తులోను మనుగడ కొనసాగిస్తుంది. ప్రతి మానవజీవి తనలోను, తన వెనుక తన స్వజాతి గతాన్ని, మానవజాతి గతాన్ని, స్వయంగా తన గతాన్ని నిలుపుకొని వుంటాడు. ఎందుకనగా ఈ మూడు విషయాలు అతని ప్రారంభస్థానాన్ని నిర్ణయిస్తాయి, జీవిత కాలం అతని అభివృద్ధిని వెంటాడుతుంటాయి. అతని గతం యొక్క శక్తితో, ఆ శక్తి యొక్క అపారమైన విలువలు ఇచ్చే బలంతో అతను అంధకారబంధురమైన భవిష్య అగాధాలను ఎదుర్కొంటాడు, సాధించబడని అనంతత్వాల లోతుల్లో ముందుకు దూకుతాడు. అయితే అది ఒక ప్రతిబంధకం కూడా, కారణం, పాక్షికంగా మానవుడు తనకు తెలియనిదానిని గురించి భయభ్రాంతుడై వుంటాడు, తనకు కచ్చితమైన అవగాహన వున్న పాతవాటికి అంటిపెట్టుకుని వుంటాడు. తన పాదాల క్రింద సురక్షితంగా నున్న పాత పునాదులను, ఎన్నో సంబంధ బాంధవ్యాలు పెనవేసుకొని వున్న తన పాత ఆధారాలను విశ్వసిస్తాడు. అంతే గాక గతశక్తులు అతనిని పెడదారిన పోనీయకుండా నిలువరించి అభివృద్ధిని అడుగంటనీయకుండా ఆపుతాయి.

భవిష్యత్తు మనలను ఆపలేనంతగా ఆకర్షిస్తున్నప్పటికీ అదే సమయాన నివారిస్తుంది కూడా. ఈ నివారణ పాక్షికంగా తెలియనిదాని నుండి దూరంగా నుండే మన సహజ లక్షణం వలన జరుగుతుంది ఎందుకనగా ఈ అవిదిత క్షేత్రంలో వేయబోయే ప్రతి అడుగు జీవన్మరణాల మధ్య జరిగే ద్వంద్వ యుద్ధం లాంటిది. మనం తీసుకొనే ప్రతి నిర్ణయం మన ప్రస్తుత స్థితియొక్క, మనం అలవాటుపడ్డ నామరూపాలయొక్క వినాశనానికో లేక అధిక సాఫల్యతకో దారి తీయవచ్చు. అయితే అది భవిష్యత్తుకు

కూడా చెంది వుంటుంది. కారణం, ఆ భవిష్యత్తును నిర్ణయించేవాటిలో వాటిని సాఫల్యం చేయడానికి మనలను ఆపలేనంత తీవ్రతతో ఆకర్షించే శక్తులు వుండటమే కాక మనం స్వాధీనపరచుకోవలసినవే అయినా అందుకు అంగీకరించని శక్తులు కూడా వుంటాయి. భవిష్యత్తు రెండు మనసులుగల ఒక వింత జంతువు, తనను తాను ఇవ్వజూపి మళ్ళీ నిరాకరించే శక్తి, తనను తాను సమర్పించుకొని మళ్లీ నిరోధించే శక్తి, మనలను గద్దె ఎక్కించి తిరిగి దింపబూనే శక్తి. అయినా, స్వాధీన పరచుకొనే ప్రయత్నం చేసి తీరాలి, సవాలనును స్వీకరించి తీరాలి. భవిష్యత్తు మనకు అందచూపే మరణాన్నే కాక అందచూపే జీవితాన్ని కూడా ఎదుర్కోవాలి. అందుకు మనం కలవరపడ నవసరం లేదు. కారణమేమిటంటే మన పాత నామరూపాలకు స్వస్తి పలకటంతోనే మనం మరింత ఉత్సాహంతో మరింత గొప్ప నవ్య నామరూపాలతో జీవించవచ్చు. మనం మన మనుగడ తప్పక కొనసాగించాలి, లేనట్లయితే, మనం నిశ్చలంగా వున్నా మనే భ్రాంతికి లోనయినా, కాలమే మనలను ముందుకు తోస్తుంది. ఇది అన్నింటిలోకి దయనీయమైన ప్రమాదకరమైన పరిస్థితి. కారణం ప్రేతాత్మలను, కరిగిపోతున్న గతం యొక్క శకలాలను మన ప్రాణాలను కాపాడమని గొంతు చించుకొని అర్థిస్తూ ఖండఖండాలుగా విడిపోతున్న గతాన్ని అంటిపెట్టుకొని నిస్సహాయంగా ముందుకు త్రోయబడేదాని కన్నా దయనీయమైన స్థితిని మించిన దేముంటుంది? చలించడమే సహజ స్వభావం గలదానిపై నిశ్చలత్వాన్ని బలవంతంగా రుద్దుడం కన్నా అపాయకరమైన దేముంటుంది? దీని అర్థం భయానకమైన కుళ్ళును పెంచడం, సజీవమైన స్వయం పునరుజ్జీవనమొందే శక్తివంతమైన ప్రాణికి బదులు కుళ్ళిపోయి కంపుగొట్టే శవాన్ని పట్టుకవేళ్ళాడే ప్రయత్నం చేయడం. అందువలన, అతి గొప్ప ప్రతిభాశీలు రెవరంటే, భవిష్యత్తు అంటే భయం లేనివారు, దాని సవాలును ఎదుర్కొని పణంగా ఒడ్డేవారు, వారికి ఈ ప్రపంచాన్ని నడిపించే భగవంతుని పైన, ఆ దివ్యశక్తి పైన అపారమైన నమ్మకనుంటుంది, వారి ఆత్మకు అనంతత్వంతో పెనుగులాడి అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలిగే అమోఘమైన తెగువ వుంటుంది, అవతారమూర్తులకు, ప్రవక్తలకు, అతి గొప్ప మార్పులను కల్పనలను పునః సృష్టిని

చేయగల సమర్థులకు గల అనుభవంతో కూడిన జ్ఞానంతో పాటు ఒక సైనికుడి కుండే ప్రగాఢ విశ్వాసం, ధైర్యం వుంటుంది.

CWSA 13:129-30 (SABCL 16:317-19)

శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి

గత రూపాలను కాలపురుషుడు లయం చేస్తాడు

ఏదైనా కాలం మీద, భగవంతుని తక్షణ కార్యం మీద యెంతో ఆధారపడి వుంటుంది. కనుక, మన స్వీయదృక్పథాలకు, మనమిచ్చే విలువను బట్టి గాక అతని కార్య మేమిటో తెలుసుకోవడానికి మనం అత్యంత ప్రాధాన్యత నివ్వాలి. కాలపురుషుడు, కాలాత్మ, మృత్యుదేవుడు, ఒక ప్రపంచ విలయానికి, వృద్ధికి — లోకక్షయకృత్ వ్రి వృద్ధాస — తన ఘోర కర్మను ఇనుమడింప జేయ నడుం బిగించాడు. ఆతని భీభ త్సాన్ని, మహాశక్తినీ, అప్రతిహతత్వాన్ని నిలువరించగల వాడెవడున్నాడు? అది వరకే ఉన్న ప్రపంచాన్ని లయం చేయడం మాత్రమే గాక, రాబోయే ప్రపంచాన్ని సృజించడం కూడా చేస్తాడు. అందువలన అతను లయింపజేసే వాటిని కనుగొని వాటిని గురించి వగచే బదులు ఆతను నిర్మించేదానిని కనుగొని సహాయపడటం అధిక లాభదాయకం. ఆతని కార్యగతిని తెలుసుకోవడం అంత తేలిక గాదు. మనం తాత్కాలిక నిర్మాణాలను అధికంగా ప్రస్తుతిస్తుంటాం. అవి ఈ కురుక్షేత్రంలోని వీరయోధుల కొరకు నిర్మితమైన, కేవలం తాత్కాలిక గుడారాలు మాత్రమే. వాటినే మనం భవిష్యత్తుకై నిర్మించబడిన శాశ్వత భవనాలని భావిస్తున్నాం.

సత్యయుగంలోని విధానాలకూ, కలియుగంలోని విధానాలకు మధ్య భేదాన్ని పండితులు చూపించడం సబబే. కాని ఈ జ్ఞానాన్ని జీవితానికి అన్వయింప జేయడంలో వారు సదా వివేకంతో, సంపూర్ణ జ్ఞానంతో వ్యవహించ లేదు అని నా కనిపిస్తుంది. ఏ విధంగానూ రక్షించుకొనలేని గతాన్ని సర్వశక్తులూ ఒడ్డి రక్షించుకోవాలని చూచేది కాదని అది ఒక విలయానికి, పునఃసృష్టికి సంబంధించిన కలియుగమని వారు మరచిపోయైనా వుండాలి లేదా వారికి తెలియకపోయైనా వుండాలి. కలి వర్తించవలసిన

విధి విధానాల కందకంలో తమంత తాముగా పడిపోయారు. కాని కలిలోని బలహీనతలే కాదు, గతకాలంలో సాధించిన సామరస్యాని కుండే బలాలను కూడా నిషేధించాలని, వర్జించాలని వాళ్ళు మరచిపోయారు. ఒక సుస్థిర ఆవాస స్థానానికై నిరీక్షిస్తూండడానికి మార్పు అనే సాగరతీరాన మనం నిర్మించుకొన్న కేవలం ఒక తాత్కాలిక వేదికను మాత్రమే మనం రక్షించుకొన్నాం. కాని అది కూడా యేదో ఒకనాడు ఆ సాగర తరంగాల పోటులకు కుప్ప కూలిపోక, చుట్టుముట్టి ముంచివేయు సాగరజలాలలో అదృశ్యమై పోక తప్పదు. అటువంటి విలయానికి సమయమాసన్న మైందా? ఆసన్న మైందనే మేం భావిస్తున్నాం. ఆ జలాల ఘోషను వినండి, అతి భీకర దండ యాత్రల పదఘట్టనలను మించిన శబ్ద మది. నెమ్మదిగా, చిరచిరలాడతూ సాగించే పరితాపరహిత సమూల విధ్వంసాన్ని గమనించు. తుప్పు పట్టి, కిర్రు కిర్రు శబ్దాలు చేస్తూ, అలల తాకిడులకు కదలాడుతూ, భగ్నమౌతున్న నిశ్శబ్దంగా లేక, ఫెళ ఫెళార్భటులతో, ఆకస్మికంగా లేక కొంచెం కొంచెంగా కుంగిపోతూ, ఆ ప్రళయ భీకర అలల నురుగుల లోనికి మునిగిపోతున్న, ఒకదానిపై మరొకటి దొంతరలా ఎలాగో లాగ పేర్చి, ఒక దానితో మరొక దానికి సరైన అనుసంధానం లేకుండా ఊగిసలాడేటట్లు నిర్మించిన నిర్మాణాన్ని సరిగా చూడు. నూతన నిర్మాణానికి సమయ మాసన్న మైందా? ఆసన్న మైందనే మేం చెప్తున్నాం. మానవజాతి హడావిడిగా యిటూ, అటూ పరుగులు పెడ్తూ చేసే సందడి గమనించు, అతి వేగంగా కూడబెట్టాలని, శోధించాలని, లోతులకు పోవాలని, దేన్నో పాదుకొల్పాలని, అవతారాలు, మహనీయ విభూతులు, ఒకటి వెంట మరొకటి అడుగులో అడుగు వేస్తూ రావడాన్ని గమనించు. కలిలో ప్రథమ యుగమైన సత్యయుగాన్ని ప్రతిష్టించడం కోసం అన్నింటినీ మించిన మహనీయ అవతారం వస్తుందనేదానికి చిహ్నాలు కాదా? ఆ విషయాన్నవి మనకు తెలియజేయడం లేదా?

CWSA 12:55-56

*

రేపటికి సంబంధించిన మనం ఒక నూతన పరిణామానికి అగ్రభాగాన నిలచి వున్నాం. ఆ పరిణామం అటువంటి నూతన విశాల సంయోజనానికి తప్పక దారి తీస్తుంది. త్రివిధ సంప్రదాయాలలో దేనికో ఒక దానికి సంబంధించిన పూర్వాచారపరాయణులైన వేదాంతులలాగా వుండాలని లేదా గీతకు సంబంధించిన నాలుగు గోడల మధ్య

మనల్ని మనం సుసంపన్నం చేసుకోవాలని మనకు ఆ నూతన పిలుపు రావడం లేదు. అలా చేస్తే మనల్ని మనం పరిమితీకరించుకొని మన ఆధ్యాత్మిక జీవితాన్ని మన స్వీయ సత్తా నుండి, ఆంతరిక శక్తిసామర్థ్యాల నుండి నిర్మించుకోవడానికి బదులు ఇతరుల సత్తా, జ్ఞానం, స్వభావాల నుండి, గతానికి సంబంధించినవారి నుండి దానిని సృజించుకోవడానికి ప్రయత్నించడం అవుతుంది. మనం భవిష్యత్తుకు చెందిన మధ్యందిన మార్తాండ తేజస్సుకు చెందినవారమే గాని గత ఉషస్సులకు సంబంధించినవారము గాము. నూతన ద్రవ్యరాశి మన లోనికి నిరంతరంగా ప్రవహిస్తోంది. మనం, ప్రపంచ, భారతదేశ మహోన్నత ఆస్తిక మతాల ప్రభావలను, బౌద్ధమత భావంలో మనం తిరిగి కనుగొన్న అర్థాన్ని వంటబట్టించుకొనడం మాత్రమే గాక, ఆధునిక విజ్ఞానం, అన్వేషణల బలీయమైన — పరిమితమైనవే అయినప్పటికీ — ఆవిష్కారాలను సంపూర్ణంగా స్వీకరించాలి. పైగ మృతమైనదిగా కన్పించిన, ఏ నాటిదో అయిన అనాదికాలంనాటి గతం కూడా మానవజాతి చేతననుండి యేనాడో తొలగిపోయి యిప్పుడు తెర మరుగు నుండి తిరిగి బయటపడుతున్న అసంఖ్యాక ప్రకాశమయ రహస్యాల వాసనలతో మనల్ని పైకొంటున్నది. ఇదంతా కూడా ఒక నూతన సుసంపన్నమైన ఒక అత్యంత విశాలమైన సంయోజనం వైపు మన దృష్టిని మరల్చమని చెప్పే సూచన కాదా? మేధోపరంగా, ఆధ్యాత్మికపరంగా మనం పొందిన ప్రయోజనాల ఒక నూతన, విస్తృతాలింగతమైన, భవిష్యత్తులో ఆవశ్యకమయ్యే సామరస్యకరణ వైపు చూపుతోంది.

CWSA 19:9-10

*

పరివర్తనా చక్రం: వ్యష్టి, తరచుగా సమాజం, తన జీవనకాలంలో యే క్షణంలోనైనా, శాస్త్రం నుండి దూరమవ్వడం జరుగుతుంది. శాస్త్రం యెడల విముఖత చూపడం జరుగుతుంది. దాని సంకల్ప రూపాన్ని, దాని యందు విశ్వాసాన్ని కోల్పోయి, సరియైన జీవన నియమంగా, ఇప్పుడు అంగీకరిస్తున్నట్లుగా అధికంగా చూపుకొనే, సృష్టి కత్యంత ఆయువుపట్టుగా పరిగణింపబడే, మరో ధర్మాన్వేషణలో పడిపోతుంది. అది వరకు సుప్రతిష్టితమైన వున్న శాస్త్రం సజీవంగా నిలబడ లేకపోయినపుడు, దిగజారి పోయినపుడు, లేదా ఆచారాల, సంప్రదాయాల రాశిగా బిగుసుకు పోయినపుడు ఇలా జరుగవచ్చు. అటువంటప్పుడు ఒక నూతన సత్యం, జీవన ఊతకర్రగా

ఒక నూతన ధర్మం తప్పక అవసరమయ్యే స్థితి యేర్పడుతుంది. అది గనుక అది వరకే భువిపై వుండి వుండకపోతే, మొత్తం జాతి అంతా కృషిచేసి దాన్ని ఆవిష్కరించు కోవాలి, లేదా జాతి ఆకాంక్షను, అన్వేషణను, తన రూపంగా చేసుకొన్న యేదో ఒక మహనీయ, దివ్యతేజస్సుతో ప్రకాశింప జేయబడిన వ్యక్తి మనస్సు దానిని ఆవిష్కరించాలి. వైదిక ధర్మం ఒక సంప్రదాయంగా తయారైనపుడు, తన అష్టాంగమార్గంతో నిర్వాణాన్ని గమ్యంగా చేసుకున్న ఒక బుద్ధుడు ప్రత్యక్షమౌతాడు. అతడు దానిని తన స్వకపోల కల్పితంగా గాక, జాగృత ఆత్మ, దివ్యజ్ఞానం పొందిన మనస్సు, ఆత్మజ్ఞాన సిద్ధుని చే సదా తిరిగి ఆవిష్కరించబడే ఆర్యుని జీవన యదార్థ నియమంగా దాని నతడు ప్రతిపాదించాడనేది గుర్తుపెట్టుకోవాలి. క్రియాత్మకంగా దీనర్థం యేమిటంటే, మతం, దార్శనికత, నైతికత, మనిషిలోని యితర శక్తులన్నీ ఆంతర బాహ్య జీవితానికి సంబంధించిన జీవన విజ్ఞానశాస్త్రం, కళలకు సంబంధించిన నూతన ప్రకటనలలో, ఒక నూతన శాస్త్రంగా యే సత్యానికి, సంసిద్ధికి రూపం కల్పించడానికి పెనగులాడుతూ కృషి చేస్తున్నాయో ఆ సత్యానికి, ఆ సంసిద్ధికి సంబంధించిన మతపరమైన నానా వర్ణ శోభిత ధర్మం, నైతిక పరమైన, సాంఘిక పరమైన, ధర్మనిరతి, సంకుచితం, అపరిపూర్ణమని నిందించబడింది. పైగా దానినలా నిందించడం ఇప్పుడొక సంప్రదాయంగా తయారైంది. దాని స్థానాన్ని ఆక్రమించడానికి క్రీస్తు ధర్మం వచ్చి, వెంటనే దాన్ని రద్దు చేయాలని, పట్టుబడ్తోంది. అంటే అపరిపూర్ణ రూపాన్ని రద్దుచేసి, అది లక్షించిన జీవన దివ్యనియమాన్ని ఒక ప్రగాఢమైన, విశాలమైన వెలుగులో, శక్తిలో, దాని ఆత్మను సాకారం చేయాలని పట్టుబడ్తోంది. మానవ అన్వేషణ అంతటితో ఆగిపోదు. ఈ వ్యవస్థీకరణలను గూడా వదలివేసి అది తిరస్కరించిన యేదో ఒక గతించిన సత్యం దగ్గరకు పోతుంది, లేదా వాటిని ఛేదించుకొంటూ ముందుకు పోయి ఒక నూతన సత్యం, శక్తి దగ్గరకు చేరుకుంటుంది. కాని అదెప్పుడూ దాని సంసిద్ధి సూత్రాన్ని, దాని సమ్యగ్ జీవనధర్మాన్ని సంపూర్ణ ఉన్నత సారభూత ఆత్మను, స్వభావాన్నే అన్వేషిస్తూ వుంటుంది.

CWSA 19:478c79

*

ఆత్మ సత్యం, ఒకటేమై వుండాలి, కాని అభివ్యక్తమయ్యే రూపాలు ఆత్మకు ప్రయోజనం కలిగించేవిగా వివిధంగా వుండవచ్చు. రూపం మీద మాత్రమే పట్టుబడితే

అది భారతీయ సమాజం మీద, దాని నాగరికత మీద ఒక విధమైన మార్పు కంగీకరించని కాఠిన్యతగా పెంపొంది దాని ఆత్మకు బందిఖానాగా తయారై పతనావస్థను గొనితెచ్చి నట్టుగా వర్తిస్తుంది. రూపవైవిధ్యతలున్నా, అవన్నీ ఒకే ఆత్మను కలిగివున్న కాలంలో, భారతదేశం అత్యంత శక్తివంతమైనదిగా, అత్యంత సజీవంగా ఉండింది. ఆలీపూరు చెరసాలలో నాకు కలిగిన భవిష్యద్దర్శనం అది, ఇప్పటి వరకూ తద్భిన్నమైన మరో దర్శనమేదీ కలుగలేదు. భవిష్యత్తులో గూడా యింతే అని నేను భావిస్తున్నాను.
CWSA 36:238

*

ఆచారాన్నీ, ధర్మాన్నీ మార్చవచ్చు: సనాతనులను చూచినపుడు యెవరికైనా విస్మయం కలుగుతుంది. అస్తిత్వం కలిగినదాన్నంతా దైవంగా చేయడానికి వాళ్ళు నానా తంటాలు పడ్డారు. హిందూసమాజానికి, కొన్ని యేర్పాట్లు, కొన్ని అలవాట్లు వున్నాయి, అవి కేవలం ఆచారాలకు సంబంధించినవే. ప్రాచీనకాలంలో అవి వున్నా యనే దానికి ఋజువేం లేదు. అవి భవిష్యత్తులో గూడా వుండాలనేదానికి కారణం కూడా యేదీ లేదు... సనాతనం, ఆధునికం సత్యానికి ధృవీకరణ గాదు, లేదా ప్రయోజకతను నిరూపించేది గాదు, ఋషులందరూ గతానికి చెందినవారు గాదు. అవతారాలు యింకా వస్తాయి, నూతన జ్ఞానదర్శనాలు కొనసాగుతూనే వుంటాయి... ఆధునిక సమాజంలో మనువును పూర్తిగా తిరిగి తీసుకొద్దామనుకోవడం, గంగను వెనక్కు తిరిగి హిమాలయాల లోనికి ప్రవహించమని అడిగినట్లు అవుతుంది. నిస్సందే హంగా మనువు ఒక జాతీయవాదే, కాని అలానే, జంతుబలి, అగ్నిలో వేల్చడం కూడా జాతీయమైనవే. గతంలో ఒకటి జాతీయమై వున్నది గనుక అది భవిష్యత్తులో గూడా జాతీయమైనదిగా వుండిపోవలసిన అవసరం లేదు. మారిన పరిస్థితులను గుర్తించకపోవడం తెలివితక్కువతనం అవుతుంది.... ప్రతి దానికీ, సమస్తానికీ, ఒక రోజు, ఒక పరిమితి వుంటాయి. సుదీర్ఘ కాలం కొనసాగిన ఆచారా లన్నింటికీ వాటి కాలంలో బ్రహ్మాండమైన ప్రయోజనమే వుంది. జాతి చిహ్నంగా సజీవ, నిర్జీవ రూపాలను తీసుకొని వాటిని ఆరాధించిన విధానాలకూ, బహు భర్తృత్వానికీ కూడా వాటి కాలంలో అధిక ప్రయోజనమే వుంది. గతంలో ప్రయోజనం కలిగించిన వాటిని మనం విస్మరించ గూడదు, కాని వాటి కంటె వర్తమానంలో భవిష్యత్తులో ఉపయోగపడే వాటికే మనం అత్యధిక ప్రాధాన్యమివ్వాలి.

అటువంటి సందర్భాల్లో ఆచారాలు, ధర్మం మార్పుకు లోను గావచ్చు. ప్రతి యుగానికి దాని శాస్త్రం ఒకటి వుంటుంది. ఇప్పటికిప్పుడు ప్రత్యక్షంగా దానిని మార్చివేయాలని మనం వాదించలేం, లేదా మార్పు అవసరమైనప్పటికీ అదొక నిర్దిష్ట దిశలో జరగాలి. సంఘసంస్కర్తల అజ్ఞానమయ అత్యుత్సాహం యెవరికైనా యేవగింపు కలిగిస్తుంది. అసంపూర్ణంగా అరిగించుకోబడిన ఐరోపియా సామాన్య భావాల కలగూర గంప వారి మనస్సు. యూరపు గురించి యేమైన తెలిసింది వారిలో చాలా కొద్దిమందికే. అచటకి, పర్యటించినవాళ్లు కూడా దాన్ని గురించి చెడుగా తెలుసుకొన్నవారే, యూరపు విషయాలు లేదా భావాలకు విరుద్ధంగా వుండే వాటన్నింటినీ మూఢనమ్మకాలనీ, అనాగరికమనీ, అపకారం కలిగించేవనీ, అజ్ఞానయుతమనీ, చెప్పి అంగీకరించరు. యూరపులో హేతుబద్ధమైనవనీ, జ్ఞానదాయకమైనవనీ ప్రస్తుతించబడిన వాటిని కొనసాగించడానికీ అంగీకరించరు.

CWSA 12:50-52

శ్రీఅరవిందులు

మన గత జన్మల ఆత్మల వారసత్వ నిరాకరణ

ఎందుకంటే జన్మించని ఆత్మ యొక్క కాలాతీత శక్తి మాత్రమే కాలంలో జన్మించినందు వల్ల ఆమెపై (సావిత్రిపై) విధించబడిన, మోపబడిన భారాన్ని తొలగించగలదు.

ప్రకృతిలోని ఆత్మ రూపమైన ఈ దేహాన్ని తయారుచేసే పరమాత్మ మాత్రమే అనంతంగా స్థిరంగా సాగిపోతున్న ఈ బంధాన్ని త్రుంచివేయగలడు. ఆ బంధమే ఈ మారిపోతుండే నామరూపాలను, అసంఖ్యాక జీవితాలను ఒకదాని కొకటి అనుసంధిస్తోంది. అంతేగాక మన సచేతన చర్యల్లో ఇంకా పాత, మనం మరచిపోయిన ఆలోచనల కర్మల జాడను దాచిపెడ్తునే వుంది. సమాధి చేయబడిన మన పూర్వ జీవితచర్యలు ఒక్కొక్కటి ఒక్కొక్క సంస్కారంగా మనలో నిలిచి వుంటాయి. వాటి ప్రభావాన్ని ఆత్మ స్వీకరించ నిరాకరిస్తుంది. 'నాది కాదు, నా కవసరం లేదు' అని చెప్తుంది. ఆత్మ కర్మబద్ధము కాదు కనుక అలా చెప్పగలుగుతుంది. దేహం, దేహాంతరాత్మ గ్రుడ్డిగా స్వీకరించిన, అంతర్ధానమైపోయిన మన రూపాల భారానికి

తాను హక్కుదారును కానని ఆత్మ నిరాకరిస్తుంది.

ప్రారంభం కోల్పోయిన, ఉద్దేశ్యం దాచి పెట్టబడిన పథకం గల ఒకనాడు జీవించిన కథా ప్రభాం కలగినది మన ప్రస్తుత జీవితం. అంటే గత శక్తులకు పర్యవసానంగా, గత జన్మలో సాధించిననాటి ఫలితంగా ఈ జీవితం ప్రాప్తించింది జ్ఞాపకంలేని బృహత్కార్యంలోని ఒక కథానిక.

విశ్వసంఘటనల దృశ్య పరంపర, ఒక పద్ధతిలో ఒకదాని తర్వాత ఒకటిగా జరిగేటట్లు స్థిరీకరించబడింది. అవి ఒకదానితో ఒకటి కనుపించని లింకులతో బంధించబడ్డాయి. వీటి నన్నింటినీ ఆమె వేటికవిగా విడగొట్టి వేయాలి, లింకులను ఛేదించాలి. అమృతత్వం వైపు నడిచే మార్గం మీద అడ్డుగా పడి దారిని మూసివేసిన బండరాయి ఆమె గతం. దాని నామె అంతరాత్మ శక్తితో తొలగించివేయాలి. మార్గాన్ని సుగమంగా చేసుకొని ముందుకు సాగుతూ తన విధిని నూతనంగా మలచుకోవాలి.

సావిత్రి, పుట 12

శ్రీఅరవిందులు

(ఈ అనువాదం శ్రీ కోనేరు వెంకటేశ్వరరావుగారి 'సావిత్రి' అనువాదం నుండి సేకరించబడింది)

గతం యొక్క ప్రయోజనం

పురోగమనానికొక మెట్టు

సర్వదా గతమంతా కేవలం ఒక మెట్టుగా లేక నిచ్చెనలా మిమ్మల్ని ముందుకు నడిపించేదిగా ఉండాలి. మిమ్నల్ని మున్ముందుకు నెట్టడం కాకుండా దానికి మరే యితర ఉపయోగమూ వుండగూడదు. మీరు దానిని గ్రహించి, మీ వెన్నును గతం వైపు త్రిప్పి మీరేం చేయదలచుకున్నారో దాని వైపు దృష్టి సారించండి. అపుడు మార్గమధ్యమంలో సమయం వృధా చేయకుండా మరింత వేగంగా ముందుకు సాగిపోగలుగుతారు, వర్తమానాన్ని విడిచి చేయకుండా గడిచిపోయినదానిలో మీకు మంచిది, అందమయినదని అనిపించినవాటికి అంటిపెట్టుకొని ఉండటమే మీకు సమయాన్ని కోల్పోయేటట్లు చేస్తుంది. అది మీకు సహాయపడాలి అంతే. దానిని తిరస్కరించనూ కూడదు. అది మీరు ముందుకు వెళ్ళటానికి దోహదం చేయాలి.

మరొక అడుగు ముందుక వెయ్యటానికి ఆసరా మాత్రమే.

ఇపుడొక నిర్దిష్ట సమయంలో అంతరమూ, బాహ్యము అయిన కొన్ని పరిస్థితుల పరంపర ఒక వ్యక్తిని కొన్ని ప్రకంపనలను గ్రహించేటట్లు చేసినపుడు – ఉదాహరణకు నక్షత్రాలను పరికిస్తున్నపుడో, అందమైన దృశ్యాన్ని వీక్షిస్తున్నపుడో, ఒక పుస్తకం చదువుతున్నపుడో, లేదా ఒక ఉపన్యాసాన్ని వింటున్నపుడో అకస్మాత్తుగా ఒక అంత రమైన సత్యానుభూతి, ఒక అనుభవం, ఆ వ్యక్తికి ఏదో స్ఫురించి, ఒక కొత్త విషయానికి తెరుచుకున్న భావన కలిగిస్తుంది. కానీ మీరు దానిని గట్టిగా పట్టుకొని ఉండాలనుకుంటే మీరు మొత్తం పోగొట్టుకుంటారు. ఎందుకంటే మీరు గతాన్ని పట్టి ఉంచలేరు. ఎపుడూ ముందుకే కదిలి వెళుతూ ఉండాలి మున్ముందుకు... మున్ముందుకు. ఈ ఉద్దీపన కొత్త స్తరంలో మిమ్మల్ని మీరు పూర్తిగా వ్యవస్థీకరించటానికి సిద్ధం చేసి, ఏదో ఒక రోజు అకస్మాత్తుగా ఒక పై మెట్టుకు లంఘించే సామర్థ్యాన్నిస్తుంది.

CWM 7:35

గతాన్ని అంటిపెట్టుకొని ఉండటం సాధారణంగా చేసే పొరపాటు

మీ కుపకరించినట్లయితే గతం యొక్క జ్ఞాపకాలను ఉంచుకోవటం మంచిదే. కానీ అది మీ ప్రగతిని నివారించేది కాకూడదు. ఒక సమయంలో ఉత్తమమయిన బోధన మరొక సమయంలో కాదనేది పూర్తిగా కచ్చితం.

కానీ మామూలుగా గతాన్ని అంటిపెట్టుకొని ఉండేవారు గతాన్ని అలానే ఉంచు కోవాలనుకుంటారు. ముందుకు సాగిపోవాలనుకునే మరి కొందరు అన్నిటినీ తిరస్క రించి వారు కనుగొన్నదానిని మాత్రమే పదిలపరచు కోవాలనుకుంటారు. వీరిరువురు ఒకే విధమయిన పొరపాటును చేస్తారు. అదేమిటంటే తమ చేతనను విస్తృతం చేసుకోడానికి బదులు దానిని సంకుచితపరచి తమను తాను పరిమితం చేసుకుంటారు.

CWM 7:745

*

వాటి ప్రకంపన లున్నంత వరకూ పాత రూపాలు నిలిచి ఉండవచ్చు. కానీ వాటి ఉద్దేశ్యం చారిత్రకంగా క్షణికమయినదే. ఒక కొత్త అడుగు ముందుకు వెయ్యటానికి ఒక రూపం స్థానే మరొక రూపం వచ్చి చేరుతుంది. మానవత చేసే తప్పిదమేమిటంటే గతించినదానికి అంటిపెట్టుకొని గతాన్ని అపరిమితంగా నిరంతరం కొనసాగించాలను

కోవటం. దానిని కేవలం అవసరమయిన సమయంలోనే ఉపయోగించుకోవాలి. ప్రతి వ్యక్తిగత ప్రగతికీ ఒక చరిత్ర ఉంటుంది. ఆ శిక్షణ ఏ క్షణంలో ఉపయుక్తమో వినియోగించుకొని మీరా దశను దాటి వెడతారు. ఆ స్థితిని దాటిన తరువాత మరొకదాని లోనికి ప్రవేశించవలసి ఉంటుంది. ఆ తర్వాత అది కేవలం చారిత్రాత్మకంగా ఉపకరించిన దవుతుంది, ప్రస్తుతం కాదు. ఉదాహరణకు ఒక స్థాయి ప్రగతిని, మానసిక నియంత్రణను సాధించినవారికి నేను కచ్చితంగా, 'మీరు దమ్మపాదను చదవండి, దానిపై ధ్యానించండి' అని చెప్పను. ఎందుకంటే దాని వలన వారి సమయం వృధా అవుతుంది. ఆ స్థాయిని చేరనివారికే, అవసరమయిన వారికే దానిని యిస్తాను. కానీ మనిషి ఎపుడూ తన భుజాల మీదకి మోయలేనంత బరువును ఎత్తుకుంటాడు. గతం నుండీ దేనినీ విడిచిపెట్టకుండా, అనవసరమయిన భారం క్రింద మరింత క్రుంగిపోతాడు.

ఒక దారిలో ఒక మార్గదర్శకుణ్ణి తీసుకొని వెళ్తున్నపుడు ఆ భాగం ప్రయాణం ముగిసిన తర్వాత, ఆ మార్గాన్ని, మార్గదర్శినీ వదిలి ముందుకు సాగిపోవాలి. ఇలా చేయటం మానవులకు కష్టతరంగా ఉంటుంది. ఏదైనా తమకు సహాయకారిగా ఉన్నపుడు దానిని పట్టుకొని ముందుకు కదలకుండా ఉండి పోవాలనుకుంటారు. క్రైస్తవమత సహాయంతో ప్రగతి చెందినవారు దానిని వదలాలని అనుకోరు, దానిని తమ భుజాలపై మోస్తూ ఉంటారు. అలానే బౌద్ధమతం వలన పురోగతి చెందినవారు దానిని విడిచి పెట్టాలని భావించరు; భుజాలపై మోస్తూ ఉంటారు. అందువలన అది మీ పురోగమనాన్ని ఆటంకపరచి అనిశ్చితంగా ఆలస్యం చేస్తుంది. మీరా దశను దాటిన తర్వాత విడిచి పెట్టేయ్యండి. దానిని వెళ్ళనివ్వండి, ముందుకు నడవండి.
CWM 9:198

*

మీరొక మతపరమైన బోధనకూ, ఆధ్యాత్మిక బోధనకూ మధ్య అయోమయానికి గురి కావద్దు. మతపరమైన బోధనలు గతానికి చెందినవి. అవి మీ ప్రగతిని నిలిపివేస్తాయి. ఆధ్యాత్మిక బోధన భవిష్యత్తుకు సంబంధించినది. అది మీ చేతనను ఉద్దీపింపచేసి భవిష్యసిద్ధికి సన్నద్ధం చేస్తుంది. ఆధ్యాత్మిక బోధన మతానికి అతీతంగా విశ్వజనీన

సత్యం వైపుగా కృషిని సాగిస్తుంది. అది సూటిగా దైవంతో అనుబంధంలోకి ప్రవేశించట మెలానో బోధిస్తుంది.

CWM 12:120

*

ప్రశ్న: శ్రీమాతా! నేను రామాయణ, మహాభారత కథలకూ, కబీరు, మీరా భజనలు మొదలైనవాటికి ఎక్కువ ప్రాముఖ్యత నిస్తున్నాను. ఈ పాత విషయాలను కొనసాగించటం మీ మార్గానికి విరుద్ధమా?

సమా: అసలు ఏ మాత్రం కాదు. ఇక్కడ మీ వైఖరి ముఖ్యం. గతం అనేది భవిష్యత్తులోకి దూకటానికొక ఆలంబన కావాలి. అంతే కానీ మీ పురోగమనాన్ని ఆపే సంకెళ్ళు కాకూడదు. నేను చెప్పినట్లుగా అది గతం పట్ల మీ వైఖరిపై ఆధారపడి ఉంటుంది.

CWM 12:147

*

అన్ని అధ్యయనాలు, లేదా అధ్యయనాల గరిష్ట భాగం గతాన్ని గురించి నేర్చుకోవ టమే అయి ఉంటుంది. ఎందుకంటే అది ప్రస్తుత స్థితిని బాగా అర్థం చేసుకోగలరనే ఆశాభావం వలన. కానీ విద్యార్థులు గతాన్ని అంటిపెట్టుకొని భవిష్యత్తును చూడటానికి నిరాకరించే ప్రమాదాన్ని నివారించాలంటే మీరు ఎంతో జాగ్రత్త వహించి, గతంలో జరిగినదంతా ప్రస్తుతం జరుగుతున్నదానికి వారిని సంసిద్ధం చేయటం కోసమేననీ, ప్రస్తుతం జరుగుతున్నది భవిష్య మార్గానికి సన్నద్ధత అనీ, అదే నిజానికి మనం సంసిద్ధం కావలసిన అతి ముఖ్యమయిన విషయమనీ వారికి తెలియ చెప్పాలి.

మీ అంతఃస్ఫురణ లేదా ప్రజ్ఞ అభివృద్ధి చేసుకోవటం ద్వారా భవిష్యత్తు కోసం జీవించటానికి సన్నద్ధమవుతారు.

CWM 12:168

*

ప్రశ్న: శ్రీఅరవిందుల యోగాన్ని సాధన చేసేవారు, గతానికి, ప్రస్తుతానికి సంబంధించిన వివిధ దేవతామూర్తుల ఆరాధన పట్ల ఎటువంటి వైఖరిని కలిగి ఉండాలి? ఒక వేళ అలా ఆరాధించటాన్ని కొనసాగించడం వారి ప్రగతి కేమైనా అవరోధం అవుతుందా? లేక అతని ఆశయ సిద్ధిని అది నివారిస్తుందా?

సమా: అన్ని విధాలయిన దేవారాధకుల పట్ల ఒక సౌజన్యపూరితమైన సహృదయత,

అన్ని మతాల పట్ల ఒక ప్రభాసమానమయిన ఉదాసీనత కలిగి ఉండాలి.

మీరు అధిమానస దేవతలతో ఇతః పూర్వమే అనుసంధానమై ఉంటే ప్రతివారి విషయంలో ఒక ప్రత్యేక పరిష్కారముంటుంది.

CWM 12:308

*

గత పరిమితులు అదృశ్యమయి కొత్త సాధ్యతలు ఆవిష్కృత మవుతాయి. సాధ్యతల కలయికల సంపూర్ణ సమూహంలో ఒక కొత్త విషయం పరిచయమయి, కొత్త సాధ్యతలు వచ్చి చేరి గత పరిమితులు అదృశ్యమయి, కొత్త సాధ్యతలు ఆవిష్కృత మవుతాయి, గతం యొక్క సాధ్యతలు అపరిమితంగా ద్విగుణీకృత మవుతాయి.

CWM 8:313

శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

స్వభావంలో రూపుదిద్దుకున్న గతకాలపు ఆకృతులను మార్పుచేయడం

ఆ విధంగా నుండవద్దు అని అనుకునేవాటిని సాధ్యమైనంత వరకు పూర్తిగా మర్చిపో.

ఒక వ్యక్తి గత జీవితం ఏదైన్నప్పటికీ, ఎలాంటి తప్పులను చేసినప్పటికీ, ఎటువంటి అజ్ఞానంలో జీవించినప్పటికీ, ఆ వ్యక్తి తన అంతరంగం లోలోతులలో పరమ పవిత్రతను కలిగి ఉంటాడు, అది తనకు తానుగ అద్భుతమైన సాక్షాత్కారంగా ప్రకటితమవగలదు.

విషయం మొత్తం ఏమిటంటే, దానిని గురించే ఆలోచించడం, దాని మీదే ఏకాగ్రత వహించడం, కష్టాలు, ఆటంకాలు, ప్రతిబంధకాల గురించి పట్టించుకోక పోవడం.

నీవు ఏమి అవదలచుకున్నావో దాని మీద ప్రత్యేకించి ఏకాగ్రత వహించు, నీవు వద్దనుకునేదానిని సాధ్యమైనంత వరకు మర్చిపో.

CWM 3:215

శ్రీమాత

ప్రశాంత మనస్సు మరియు ప్రశాంత ఇచ్ఛల అవసరం

ఆవశ్యకమైనది ప్రశాంత మనస్సు, ప్రశాంతమైన ఓరిమి, పట్టుదలగల ఇచ్ఛ. ఉద్వేగానికి గానీ నిరుత్సాహానికి గాని లోను గాకుండా వాటిని తిరస్కరించడం, కాని ఎల్లప్పుడూ అస్తిత్వంలో అవసరమైన మార్పు ప్రశాంతంగా జరగవలసిందేనని పట్టుబట్టడం. ఇటువంటి లక్షణంతో కూడిన ప్రశాంతమైన ఇచ్ఛ చివరికు వైఫల్యం చెందబోతు. దాని పరిణామం అనివార్యం.

మొదట అది ప్రాణిక అస్తిత్వానికి అలవాటుగా ఉన్న చేతలనే కాకుండా, వాటి వెనుక నున్న ప్రేరణలను సైతం, తనలో అవి అభివ్యక్తమైనా అవి తన వ్యక్తిత్వానికి బాహ్యంలో నుంచి వచ్చినవిగా అవగాహన చేసుకొన్నవాటిని మెలకువగా వున్న స్థితిలో తిరస్కరించాలి, అంతే కాకుండా ఆ ప్రేరణల వెనుక నున్న సూచనలను కూడా అది తిరస్కరించాలి. ఆ విధంగా అవి తిరస్కరించబడగా, అలవాటుగా ఉన్న ఆలోచలు, గమనాలు తిరిగి స్వప్న-లోకంలో సాక్షాత్కరిస్తాయి, కారణం, మానసికసూత్రం ప్రకారం మెలకువలో అణచబడినవి లేక తిరస్కరించబడినవి తిరిగి నిద్రలోనూ, స్వప్నంలోనూ పునరావృతమయ్యే అవకాశం ఉంది, ఎందువల్లనంటే, అవి ఇంకా అస్తిత్వపు అధోచేతనలో ఉంటాయి. అయితే, మెలకువ స్థితిని సంపూర్తిగా పరిశుభ్రపరిస్తే, ఈ స్వాప్నిక గమనాలు, క్రమక్రమంగా తప్పక అదృశ్యమౌతాయి, ఎందువల్లనంటే, అవి వాటి ఆహారాన్ని కోల్పోతాయి, అధోచేతనలో వాటి గుర్తులు క్రమక్రమంగా నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకు పోతాయి....

1. ఒక విషయం బాగా అర్థం చేసుకో, ఇవన్నీ నీలో నిజంగా నీతిమాలిన నీ భ్రష్టత్వం నుంచి రావడం లేదు. అది ఎప్పుడు జరుగుతుందంటే నీ మనస్సు కూడా భ్రష్టత నొంది, పెడదారి పట్టిన ప్రాణిక ప్రేరణలకు దన్నుగా నిలచినప్పుడు. మనస్సు, ఇచ్ఛ తిరస్కరించిన ఆ చోట, నైతిక అస్తిత్వం ఆరోగ్యంగా ఉంటుంది, అప్పుడది కేవలం ప్రాణిక భాగాల లేక నరాల వ్యవస్థ యొక్క పూర్తి బలహీనత అవుతుంది.

2. గతం మీదనే ఎప్పుడూ ధ్యాస పెట్టవద్దు, కాని ఓర్పుతో కూడిన ఆశావహ దృష్టితో, విశ్వాసంతో కూడిన నిబ్బరంతో నీ తలను భవిష్యత్తు వైపు తిప్పి వుంచు. గత వైఫల్యాలను గురించే తలపోస్తూ ఉండటం నీవు నీ ఆరోగ్యాన్ని తిరిగి పొందటానికి

ఆటంకం అవుతుంది. ఆత్మ-విజయానికీ, నీ శీలపునర్నిర్మాణానికీ ప్రతిబంధకమవుతూ నీ మనస్సునూ, ఇచ్ఛనూ బలహీన పరుస్తుంది.

3. విజయం తక్షణం అందుకోలేకపోతే నిరుత్సాహానికి తావు ఇవ్వవద్దు. ఓర్పుతో, నిలకడగా అనుకున్నది సాధించేవరకూ కొనసాగిస్తూ ఉండు.

4. నీ బలహీనతనే ఎల్లప్పుడూ చింతిస్తూ నీ మనస్సును తీవ్ర బాధకు గురి చేయవద్దు. అవి నిన్ను జీవితంలో లేదా మానవ ఆదర్శాన్ని సఫలం చేయడంలో అసమర్థుణ్ణి చేస్తున్నాయని ఊహించుకోవద్దు. అవి అక్కడ ఉన్నాయనే సంగతి ఒకసారి గుర్తెరగడం జరిగిన తర్వాత నీ బలం మూలాలను అన్వేషించు. కచ్చితంగా విజయం సాధించగలననే ధీమా మీద మనస్సును లగ్నం చేయి.

CWSA 36:306 (SABCL 24:1658)

శ్రీఅరవిందులు

*

చైతన్యం తలక్రిందులగుట

ప్రశ్న; చెడ్డవాడు, దుష్టుడు అయిన ఒక వ్యక్తి, హఠాత్తుగా మారాలనుకుంటే, అతడు తన అంతరంగంలో నుంచి తప్పు చేసినప్పుడల్లా హెచ్చరించే మంద్రస్వర వాణిని వినగలుగుతాడా?

ప్రతిదీ వ్యతిరేక దిశలో వెనుకకు మరలిన విధానం పైన అంతరంగంలో మార్పిడి జరిగిన విధానం మీద ఆధారపడి ఉంటుంది. ఆ మార్పు హఠాత్తుగా జరిగితే, నిజమే, అతనికి తక్షణం ఆ మంద్రస్వరం ఎరుక కలుగుతుంది, కాని అది క్రమంగా జరిగితే, అత్యంత శుభపరిమాణాలు కూడా అంతే క్రమగతిన వస్తాయి. అది పూర్తిగా ఆయా వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుంది, ఎవరూ ఇదమిద్ధమని చెప్పలేరు. ఒక రకంగా వేగంగా చీలినట్లై, ప్రకాశం ప్రవర్తనమానమైతే, అప్పుడు నిజమే, ఆ వ్యక్తికి తక్షణం అంతరంగం నుంచి సూచన లభిస్తుంది. అది గడచిపోయినవాటి నుంచి కూడా జరుగవచ్చు. అర్థం, గతంలో చేసినవాటిని గురించి ఆలోచిస్తున్నప్పుడు, అతడు అప్పుడు ఏ విధంగా ఉన్నాడు, ప్రస్తుతం ఏ విధంగా ఉన్నాడు అనే విషయం అతడి దృష్టికి రావచ్చు. అంతేకాక, దోషాన్ని అధిగమించిన ప్రతిసారి, అస్తిత్వంలో నిజమైన మార్పు చోటు చేసుకున్న ప్రతిసారి, అతడికి మొత్తం విషయా

లన్నీ ఒకప్పుడు ఎంతో సహజంగా అనిపించినవి, ప్రస్తుతం ఒక నల్లటి మచ్చతో కూడిన దృశ్యంగా తెర మీద సాగిపోయేవి, స్పష్టంగా కనిపిస్తాయి. నీవు వాటి మూలం, కారణాలు, ఫలితాలు చూడగలుగుతావు. నీకు దానిని గురించిన స్పష్టత, కచ్చితమైన జ్ఞాపకం కొంతకాలంగా వున్నట్లయితే సుమారు ది సంవత్సరాల వరకు అనుకో, నిన్ను నీవు పరివర్తనకై అధికాధికంగా సమర్పణకై చిత్తశుద్ధితో పరిశ్రమ చేసుకున్నట్లైతే, నీవు గతంలో ఏ విధంగా ఉన్నావనే దానిని తిరిగి గుర్తు చేసుకోగలిగితే, అప్పుడు నీవు, "అది ఎలా సాధ్యపడింది, నేను ఆ రకంగా లేనే" అని అంటావు. కాని నీవు ఆ విధంగానే ఉన్నావు. గతంలో ఉన్నదానికి, గతంలో నీకు అత్యంత సహజమనిపించినదానికి, ఇప్పుడు నీకు సహజమైనదిగా, అనిపించేదానికి ఎంతో దూరం వున్నప్పటికీ, నీవు అదే వ్యక్తివి అన్న విషయం నమ్మలేవు. నీవు నిజంగా అభివృద్ధి చెందావనటానికి ఇది కచ్చితమైన సూచన.

CWM 4:102

*

ప్రశ్న: స్వభావం తప్పక మారాలని, అస్తిత్వంలోని విభిన్న విభాగాలను స్వాధీనం చేసుకోవాలని, ఎరుక కలిగి ఉండటమనేది ఒకే విషయం, ఒకే పనియేనా?

సమా: ఒకదాని వెనుక మరి యొకటి ఉంటుంది. మొట్టమొదటగా అతడు తప్పక ఎరుక గలిగి ఉండటం. తరువాత నియంత్రణ, వాటిని ఆ విధంగా స్వాధీనపరుకుంటూ ఉండగా, అతడు తన స్వభావాన్ని మార్చుకుంటాడు. స్వభావం మార్పు ఆఖరులో వస్తుంది. మొదట చెడు అలవాట్లను నియంత్రించాలి, పాత అలవాట్లు వదలటానికీ, స్వభావం మారటానికీ చాలా కాలమే పడుతుంది. ఉదాహరణకు, మనం తరచు ఒక కుంగుబాటుకు లోనయ్యే వ్యక్తినే తీసుకుందాం. అతను అనుకున్న విధంగా కచ్చితంగా విషయాలు లేకపోతే, అతడు కుంగుబాటుకు లోనవుతాడు. కాబట్టి, మొదట అతడికి తప్పక తన కుంగుబాటు ఎరుక లోకి రావాలి — కేవలం కుంగుబాటు మాత్రమే కాకుండా, కుంగుబాటు కారణాలు, వాటితో బాటుగా అతడు తాను ఎందుకు తేలికగా కుంగుబాటుకు లోనవుతున్నాడు అనేదీ తెలుసుకోవాలి. అప్పుడు, ఒకసారి అతడికి ఎరుక కలిగిన తర్వాత, అతడు తన కుంగుబాటును తప్పక స్వాధీనపరచుకోవాలి, కుంగుబాటుకు తగిన కారణం ఉన్నప్పటికీ కుంగుబాటుకు లోను కాకుండా తప్పక దానిని ఆపేయాలి — అతడు తన కుంగుబాటును తప్పక

వశం చేసుకోవాలి, అది రాకుండా ఆపాలి, అప్పుడు చిట్టచివరకు చాలా కాలం పాటు ఈ పని చాలినంతగా జరిగిన తర్వాత, అతడి ప్రకృతి కుంగుబాటుకు లోనయే అలవాటును కోల్పోతుంది, పూర్వం మాదిరిగా అదే పద్ధతిలో ప్రతిస్పందించడు, స్వభావం మారిపోతుంది.

CWM 4:340-41

*

గతకాలపు తప్పుల పర్యవసానాల నుంచి తప్పించుకో

ఒక వ్యక్తి తన తప్పులను మరల మరల చేస్తున్నంతకాలం, దేనినీ తొలగింప శక్యం కాదు, ఎందువల్లనంటే, ప్రతి క్షణం అతడు వాటిని పునః సృష్టిస్తుంటాడు. ఒక వ్యక్తి ఒక తప్పును, అది తీవ్రమైనది కావచ్చు, కాకనూ పోవచ్చు, చేసినప్పుడు, అతని జీవితంలో దాని పర్యవసానా లుంటాయి, ఒక 'కర్మ' ఉడిగిపోవాలి, కాని దైవానుగ్రహం వైపుకు అతడు మరలితే, అది పర్యవసానాలను తెంపివేయగలదు. కాని ఇది జరగాలంటే ఆవశ్యం ఆ తప్పు పునరావృతం కాకూడదు. అవే బుద్ధిహీనమైన చేష్టలను అనిశ్చితంగా అంతూపంతూ లేకుండా చేస్తూపోతే, అదే విధంగా దివ్యానుగ్రహం కూడా అంతులేకుండా పర్యవసానాలను రద్దు చేస్తుందని అనుకోకూడదు, అది ఆ విధంగా జరగబోదు!

CWM 8:58

భవిష్యత్తు వైపుకు దూకటానికి గతాన్ని గెంతు వేయటానికి తటాలున పైకి లేచే సాగుడు పలకను ఉపయోగించే విధంగా వాడు.

CWM 15:70

శ్రీమాత

ప్రశ్న: గత చేతలు సాధనలో అడ్డు రావా?

సమా: గతంలో ఒక వ్యక్తి ఏ విధంగా ఉన్నా దైవానికి సంపూర్ణ సమర్పణ దానిని తుడిచి వేస్తుంది.

CWM 15:72

*

నా ప్రియమైన బిడ్డా, నీ ప్రార్థన ఆలకించబడింది. నీ గతం అదృశ్యమైపోయింది. చైతన్యంలో, ప్రకాశంలో, ప్రశాంతిలో వృద్ధి పొందడానికి సంసిద్ధుడవుకా. మా ఆశీస్సులు నీతో ఎల్లప్పుడూ ఉంటాయి.

CWM 15:72

*

సర్వోత్కృష్టమైన ప్రేమ మొత్తం గతాన్నంతటినీ రద్దు చేయగలదు. దాని సారంలో, దాని మూలంలో, ప్రేమ ఒక జ్వాల లాంటిది, అది ఒక ధవళ కాంతి ప్రకాశం, అది అన్ని ప్రతిరోధాలను అధిగమిస్తుంది. నీవు దానిని అనుభూతి పొందవచ్చు: నీ అస్తిత్వంలో ఎటువంటి ఇబ్బంది ఉన్నా, ప్రోగు చేసుకున్న దోషాల మోత బరువు, అజ్ఞానం, అసమర్థత, దుష్టబుద్ధి ఎలా ఉన్నా ఒక సెకను మాత్రపు పవిత్రమైన, ఆవశ్యకమైన, సర్వోత్కృష్ట ప్రేమ దానిని సర్వ శక్తివంతమైన ప్రజ్వలన ప్రకాశంలో రద్దు చేస్తుంది; ఒక్క క్షణంలో మొత్తం గతమంతా కనుమరుగు కాగలదు; దాని అంతస్సత్వంలో దానిని నీవు ఒక్క క్షణం స్పృశించటం జరిగినప్పుడు, మొత్తం దుర్విధి అంతా హరించబడుతుంది.

CWM 10:72-73

*

భవిష్యత్తుకు నిన్ను నీవు ఇచ్చుకో

ప్రశ్న: మాతా, ఎంతో బరువుతో వేళ్ళాడుతున్న గతాన్నుంచి ఏ విధంగా విముక్తుణ్ణి అవగలనో నాకు దయచేసి తెలియజేయి.

సమా: గతం నుంచి విముక్తుడవటం ఒక విధంగా చాలా కష్టమైన విషయం, అది చాలా మట్టుకు అసాధ్యమనిపిస్తుంది.

కాని నీవు నీవుగా, పూర్తిగా, ఏ విధమైన మినహాయింపులు లేకుండా భవిష్యత్తుకు

ఇచ్చుకొని, ఆ సమర్పణకు నిరంతరం పునరుజ్జీవం పోస్తూ ఉంటే, గతం దానికదే పడిపోతుంది, ఇక ఏ మాత్రమూ నిన్ను అడ్డగించదు.

CWM 16:364

*

పాత అలవాట్లు, రూపుదిద్దుకున్న ఆకృతులు

ప్రశ్న: శ్రీఅరవిందులు చెప్పే 'పాత అలవాట్లు' 'రూపుదిద్దుకున్న ఆకృతులు' మధ్య తేడా ఏమిటి?

సమా: చాలా మట్టుకు రెండూ ఒకటే, ఉదాహరణకు, నీ శరీరం చలికి, వేడికి, ఆకలికి ఒక విధమైన ప్రతిక్రియలను చేస్తుంది. ఈ ప్రతిక్రియలు నీకు అలవాటుగా మారిపోయి, నీ భౌతిక ప్రకృతిలో ఒక రకమైన రూపాన్ని సంతరించుకుంటాయి, అనగా, ఒక మడతను, నిర్దుష్టమైన మడతను శరీరం మీద ఏర్పరుస్తుంది. రూపాలు అలవాట్ల ఫలితంగా రూపుదిద్దుకునేవి. అదే విధంగా నీ స్వభావపరంగా ఏర్పడే 'రూపా' లున్నాయి. ఉదాహరణకు, నీకు ఇష్టం లేని విషయం జరిగినప్పుడు నీకు కోపం వచ్చే అలవాటుంటే, ఈ అలవాటు నీ ప్రకృతిలో ఒక విధమైన అంతర్గత మడతను తయారుచేస్తుంది. నీకు ఇష్టం లేనిది జరిగిన ప్రతిసారి, దానంతటదే, ఏ నియంత్రణా లేకుండా, నీకు కోపం వస్తుంది. దీనినే 'రూపం' అంటారు, అవన్నీ అలవాట్లు; నీ స్వభావంలో భాగమైపోయాయి.

CWM 4:344

*

చిత్తశుద్ధి మీమాంస

కాని ఒక వ్యక్తి తనలో చిత్తశుద్ధిని కలిగి తనకు నయం కావాలనుకుంటే, అతడికి అడ్డంకిని అధిగమించటానికి నిజమైన ఆకాంక్ష ఉంటే, ఉన్నతిని కోరుకుని, తనను మించి పైకి పోవాలి, తనను కిందకు దిగలాగే వాటన్నింటిని వదలివేయాలి, పరిమితులను బద్దలుకొట్టి ఛేదించాలి, స్పష్టత నొందాలి, తనలో దానిని అడ్డగించే వాటన్నింటినీ పరిశుభ్ర పరచాలి. అతడికి నిజంగా గతంలో చేసిన తప్పులనే మళ్ళీ చెయ్యకుండా ఉండాలని అంధకారం, అజ్ఞానం నుంచి ఒక్కసారిగా బయటపడాలని, వెలుగులోకి

పైకి ఎగబాకాలని, మానవజాతికి సంబంధించినవి, చాలా అల్పమైనవి, చాలా అజ్ఞానమయమైన వాటన్నింటినీ తీసిపార వేయాలని తీవ్రమైన ఆకాంక్ష వుంటే అప్పుడది పనిచేస్తుంది. అది పనిచేయటమే కాదు, చాలా శక్తివంతంగా పనిచేస్తుంది. కొన్ని సమయాలలో అది నిర్దుష్టంగా, సంపూర్ణంగా పనిచేస్తుంది. కాని ఏదీ పాతగమనాలనే పట్టుకుని వేలాడుతూ ఏమాత్రం ఉండకూడదు. ఆ క్షణంలో ప్రశాంతంగా ఉండి, తనకు తాను దాక్కుని, తరువాత ప్రత్యక్షమై, "అవును, చాలా బాగుంది, నిజమే, నీ అనుభవం చాలా బాగుంది, కాని ఇప్పుడు నా వంతు" అని అనడం జరగకూడదు. ఒక వేళ, అది జరిగితే, నేను దానికి సమాధానం చెప్పను, ఎందువల్లనంటే, ఒక్కొక్కప్పుడు, దాని ప్రతిక్రియ అధోగతికి దారి తీస్తుంది. అందువలననే, నేను మొదటికే వచ్చి చెప్పే మాట, ఎప్పుడూ అదే చెబుతాను: ఒక వ్యక్తి తప్పక నిజంగా చిత్తశుద్ధి కలిగి ఉండాలి, నిజంగా.

అతడు సంసిద్ధుడై ఉండాలి, ఏదైనా ఒకటి పట్టుకుని వేలాడుతుంటే, గట్టిగా పట్టుకుని వేలాడుతుంటే, అతడు తప్పక దానిని పూర్తిగా చీల్చివేయడానికి సంసిద్ధుడై ఉండాలి. వెనుక దాని ఆనవాళ్ళు కూడా ఏమీ మిగలకూడదు. ఈ కారణంగానే, ఒక్కొక్కసారి అతడు చేసిన తప్పే చేయడం జరిగి, దానినే తిరిగి చేస్తూ, బాధానుభవం పరాకాష్ఠను చేరే వరకు కొనసాగించి, అప్పుడు పూర్తి చిత్తశుద్ధితో దాన్ని ప్రభావితం కావిస్తాడు. కాని ఆ పద్ధతిని ప్రయత్నించకూడదు, అది చెడ్డది. అది చెడ్డది ఎందువల్లనంటే, అది ఎన్నింటినో నాశనం చేస్తుంది. అది చాలా శక్తిని వృథా చేస్తుంది, చెడ్డ ప్రకంపనలను వ్యాప్తి చేస్తుంది. కాని ఎవరైనా మరే దారి లేకపోతే, చేసేదేమంటే, తీవ్రమైన బాధానుభవంతో పరిపూర్ణమైన చిత్తశుద్ధికి వలసిన ఇచ్ఛను తెలియగలుగుతాడు. ఒక్క క్షణం ఉంటుంది — ప్రతివారి జీవితంలోను ఒక క్షణం ఉంటుంది — నిర్దుష్టమైన ఇటువంటి ఎంపికతో పరిపూర్ణ చిత్తశుద్ధి అవసరం కలిగే సమయం వస్తుంది. వ్యక్తిగత జీవితంలో ఒక క్షణం, అతడు ఒక వర్గానికి చెందినవాడైతే సమిష్టి జీవితంలోనూ ఒక క్షణం, ఎంపిక తప్పనిసరి అయ్యే క్షణం, తప్పక పరిశుద్ధి జరగవలసిన కాలం ఆసన్నమౌతుంది. ఒక్కొక్కప్పుడు, అది చాలా గంభీరస్థాయికి చేరుకుంటుంది, అది ఆ వర్గానికి చాలా మట్టుకు జీవన్మరణ సమస్యగా

పరిణమిస్తుంది: అప్పుడు అది తప్పక నిశ్చయాత్మకంగా అభివృద్ధిని పొంది తీరాలి... అది బతికి బట్ట కట్టలాంటే.

CWM 6:146

*

తన నీడతో దోబూచులాట

ప్రశ్న: మాతా, కిందటిసారి చెప్పినప్పుడు, తరచుగా మనలోన ఒక దుష్టమూలకం ఉంటుంది... అది మనకు సూచన నిస్తుంది... అది మన చేత బుద్ధిహీనమైన పనులను చేయిస్తుంది అని అన్నారు. అటువంటప్పుడు ఒక వ్యక్తి దాని ఎరుకను కనుక కలిగితే, దానిని తప్పక లాగి బయటపడేయాలి అని మీరు చెప్పారు. కాని లాగి బయట పడేయాలంటే అర్థం... ఉదాహరణకు, ఒక వ్యక్తికి ఈ దుష్ట మూలకం ఎరుక కలిగితే, అతని చేత బుద్ధిహీనమైన పనులను చేయిస్తున్నదని తెలిస్తే, అప్పుడు, కొంత ఇచ్ఛతో కూడిన ప్రయత్నంతో అతడు దానిని చేయకుండా, నిగ్రహించుకోగలిగితే, అప్పుడతడు దానిని లాగి బయట పడేశాడని అనుకోవచ్చా?

సమా: దానికి, మొట్టమొదట, నీకు దాని ఎరుక తప్పక కలగాలి, తెలుస్తున్నదా, దానిని నీవు నీ ఎట్ట ఎదుట నిలబెట్టాలి, దానికీ నీ చైతన్యానికీ పట్టి ఉంచే లంకెలన్నింటినీ తెంచి వేయాలి. అంది అంతరంగ మనస్తత్వం పని, తెలిసిందా.

ఏ వ్యక్తి అయినా తనను తాను అప్రమత్తంగా గమనిస్తే, అది అతడు చూడ గలుగుతాడు.... ఉదాహరణకు, నిన్ను నీవు పరిశీలించుకుంటే, నీవు ఒక రోజు చాలా ఉదారంగా ఉండటాన్ని చూస్తావు, మనం దీని సంగతే చూద్దాం, అది తేలికగా అర్థం అవుతుంది. ఒక ఉదారత: నీ అనుభూతులలో ఉదారత, నీ ఉద్వేగాలలో ఉదారత, నీ ఆలోచనలలో ఉదారత, అంతేగాక భౌతిక విషయాలలో సైతం; అంటే అర్థం, నీవు ఇతరుల దోషాలను అవగాహన చేసుకోగలవు, వారి ఉద్దేశాలు, వారి బలహీనతలు, అంతేకాక వారి అసహ్యమైన చేష్టలను సహితం. నీవు ఇవన్ని బాగా చూస్తావు, నీవు ఎంతో సంపూర్ణంగా చక్కని అనుభూతులతో, ఉదారంగా ఉంటావు. నీకు నీవు చెప్పుకుంటావు, “అంతే కదా... ప్రతి వ్యక్తి తాను చేయగలిగినంత బాగా చేస్తాడు” ఆ విధంగా ఉంటావు.

మరో రోజు — లేదా బహుశా వెంటనే మరు నిమిషం — నీలో ఒక రకమైన కాఠిన్యం, స్థిరమైనపోయిన జడత్వం, ఒక విధమైన క్రూరత, ఎవరినీ వదలకుండా న్యాయనిర్ణయం చేసేది, ఏదో పగను మోస్తున్నట్లుగా, బద్ధవైరం ఉన్నట్లుగా, దుష్టమైన పనిని చేసినవారు శిక్షింపబడాలని, చాలా మట్టుకు ప్రతీకారం తీర్చుకోవాలనే అను భూతులతో; ముందు చెప్పుకున్నదానికి పూర్తి వ్యతిరేకతలో! ఒక రోజు నీ కెవరైనా హాని చేస్తే, అప్పుడ నీవు, "ఏం పరవాలేదు! అతడికి తెలియదు" ... లేక "అతడు మరో విధంగా చేయలేడు కదా... లేక "అది అతడి స్వభావం"... లేదా ... "అతడికి అర్థం కాలేదు!" అంటావు. మరుసటి రోజు — లేక బహుశా ఒక గంట తరువాత — నీవు "అతడు తప్పక శిక్ష పొందాలి! అతడు చేసినదానికి తప్పక అనుభవించాలి! అతడు తప్పు చేశాడని అతనికి తెలిసివచ్చేటట్లు చేయాలి" అంటావు, ఒక రకమైన కోపోద్రేకంతో; విషయాలను నీ చెప్పుచేతలలోకి తీసుకోదలుస్తావు. వాటిని నీలో ఉంచుకోదలుస్తావు, అసూయ, శత్రుత్వం, సంకుచితత్వంల అనుభూతులన్నీ నీలో ప్రస్ఫుటమౌతాయి తెలుస్తున్నదా, మునుపు చెప్పిన అనుభూతికి పూర్తి వ్యతిరేకం.

ఇది అవతలి వైపు ఉన్న చీకటి కోణం. అటువంటప్పుడు, అతడు దానిని చూసిన క్షణంలో, దానిని చూసి, "అది నేను" అనకుండా, "అది నేను కాదు, అది నా నీడ, దానిని నేను నా నుంచి తోసి పారవేయాలి" అని దాని మీద తన ఇంకొక పార్శ్వపు ప్రకాశాన్ని ప్రసరిస్తే, ఆ రెండింటిని ముఖాముఖి చేయగలిగితే, ఆ మరియొకదాని జ్ఞాన, ప్రకాశాలలో, అతడు దానిని ఎక్కువగా నచ్చజెప్పే ప్రయత్నం చేయకుండా — ఎందువల్లనంటే, అది చాలా కష్టసాధ్యం — కాని అతడు దానిని ప్రశాంతంగా ఉండమని బలవంతం చేస్తూ... మొదట దాని నుంచి విడివడి దూరంగా జరిగిపోయి, అది తిరిగి రాకుండా, దానిని దూరంగా విసిరి వేస్తాడు — దాని మీద గొప్ప వెలుగును ప్రకాశింప జేస్తాడు. వాటిని మార్చగలిగిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. కాని అది చాలా అరుదు. కొన్ని సందర్భాలలో ఆ వ్యక్తి అస్తిత్వం మీద — లేక ఆ నీడ మీద — ఎంత తీవ్రమైన వెలుగును ప్రసరింప జేస్తాడంటే, దానితో అది పరివర్తన చెందుతుంది, అది నీ అస్తిత్వసత్యంగా మారిపోతుంది.

కాని అది అరుదైన విషయం... అది చేయడం సాధ్యమే, కాని అది అరుదు. సాధారణంగా, అత్యుత్తమమైన పద్ధతి, "లేదు నేను అది కాదు! నాకు అక్కర లేదు! ఆ గమనంతో నాకే సంబంధం లేదు, అది నా కోసం లేదు, అది నా ప్రక్క

తికి వ్యతిరేకం!" ఆ విధంగా దానికి గాట్లు పెట్టి, పట్టుబట్టి, నిశ్చయంతో దాన్ని దూరంగా విసిరివేస్తే, చిట్టచివరకి అతడు దాని నుంచి వేరవుతాడు.

CWM 6:262

*

ఆవశ్యకమైన మార్పు: తనకు తాను మారడం

సంవత్సరపు ఈ చివరి రోజున, మనం ఒక తీర్మానం చేద్దాం, మన బలహీనతలన్నీ, పెడసరమై అర్థరహితమైనవన్నీ, మన నుంచి ముగిసిపోతున్న ఈ సంవత్సరంలో అంతరించి పోవాలి.

CWM 14:239

*

ఒక దృఢమైన, సమర్థవంతమైన తీర్మానం, అవే తప్పులను తిరిగి ఏమాత్రమూ చేయకూడదనుకోవడం, దైవం యొక్క అనుగ్రహంలో సంపూర్ణ విశ్వాసం ఉంచడం అనేవి మాత్రమే కేవల నివారణ.

CWM 14:239

*

బాహ్యమార్పులు ఒకరికి అవసరం అయితే, అతడు అంతరంగంలో అభివృద్ధి పొందటం లేదని అర్థం. ఎందుకంటే ఎవరైతే అంతరంగంలో అభివృద్ధిని పొందుతారో, అతడు అదే బాహ్య పరిస్థితులలో ఎల్లప్పుడూ జీవిస్తూనే ఉంటాడు, అవి అతనికి నిరంతరం నూతన సత్యాలను బయల్పరుస్తూ ఉంటాయి.

అంతరంగ పరివర్తనతో అనివార్యమైన అభివ్యక్తంగా బాహ్యంలో మార్పు అంతా తక్షణం జరిగి తీరుతుంది. సామాన్యంగా, భౌతిక జీవితంలో మెరుగుపడే పరిస్థితులన్నీ అంతరంగంలో సాక్షాత్కరించుకున్న అభివృద్ధి బాహ్యంలో వికసించడమే.

CWM 14:216

*

ఇల్లు మారినంత మాత్రాన స్వభావం మార్చుకోలేవు. నీ స్వభావం మార్చుకుంటే,

నీ పరిసరాలను మార్చవలసిన ఆవశ్యకత లేదు.

CWM 14:217

*

ఒక వ్యక్తి ' సాధన' కు బాహ్యవిషయాలు ముఖ్యమైనవి కానే కావు. అవసరమైన అంతరంగ ప్రశాంతత ఎటువంటి పరిసరాలలోనైనా స్థాపించుకోవచ్చు.

CWM 14:217

*

...ఎవరైనా గాని ఎన్నడూ అధైర్యానికి లోను కాకూడదు, లేక అతడు ఒక వేళ చాలాసార్లు తప్పులు చేసి ఉంటే, అతడు తిరిగి ఆ తప్పులు ఏ మాత్రం చేయకూడదని గట్టి నిశ్చయంతో కూడిన ఇచ్ఛను కలిగి ఉండాలి, కచ్చితంగా ఒక రోజు కాకపోతే మరొక రోజైనా అతడు తన ఇచ్ఛలో దృఢంగా ఉంటే అతడు కష్టాలను అధిగమించి గెలిచి తీరుతాడు.

CWM 6:289

శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

నీ హృదయంలో విచారం అలుముకుంటే, దీర్ఘకాలంగా నీవు ఏ అభివృద్ధిని పొందకపోతే, నీ బలం మందగించి, అసంతృప్తి పై గొంటే, మన సర్వోత్కృష్ట ప్రేమికుడు, పరమ ప్రభువు సనాతన వాణిని ఎల్లప్పుడూ జ్ఞప్తి నుంచుకో, "నిన్ను నేను సమస్త పాపాల నుంచి, చెడు నుంచి విముక్తుణ్ణి చేస్తాను; దుఃఖపడవలదు."

CWM 12:461

శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

గతానికి బద్ధులై ఉండవద్దు

భవిష్యత్తుపై విశ్వాసం లేనివారే గతాన్ని పట్టుకొని వ్రేలాడుతారు

అవును బిడ్డా, మనలో విశ్వాసం సన్నగిల్లింది. విశ్వాసం ఉన్నవారు మాత్రమే 'దివ్యజీవనాన్ని' కోరుకుంటారు. మనం మాత్రం భయపడుతున్నాం. ఎప్పుడైతే భయం వీడుతుందో, చిత్తశుద్ధి ఏర్పడుతుందో అప్పుడే నిజమైన మార్పు కనబడుతుంది.

మనం అనుకుంటాము: "మాకు ఈ జీవనం ఇక వద్దు (నవ్వుతూ) దీన్ని పట్టుకొని వ్రేలాడేదో వుంది!" ఇట్టి వారు పాతభావాలను వదిలించుకోలేరు. వాటిని వదిలించు కోవాల్సిందే. కాని మనకు భయం!

దివ్యత్వం మనసు యొక్క ఊర్ధ్వం పై చిన్న పిల్లవాడిలా క్రీడిస్తూనే వుంటుంది. నాకు అలా చిత్రం వేయాలని వుంది. వేస్తే ఎంత బాగా వుంటుందో! ఒక్కొక్కసారి మన మందబుద్ధులకు "దైవానిది తప్పు, అతను అలా చేసి యుండకూడదు" అనిపిస్తుంది. అంతా తమాషాగా ఉంది కదా?

(మౌనం)

నాకు తోచిన ఒకే పరిష్కారం — అది చాలా తేలిక అయినది కూడా — ఒకటి ఉంది. "అంతా నీ ఇచ్ఛ, అంతా నీ ఇచ్ఛ" అని నిజాయితీగా విశ్వసించటమే. అప్పుడే అవగాహన మొదలౌతుంది. ఇది కేవల మానసిక అవగాహన మాత్రమే కాదు. అది ఇక్కడ లేనూ లేదు (తలను స్పృశిస్తూ) "అంతా నీ ఇచ్ఛ"

CWM 11:312

*

ముందే ఒక అభిప్రాయానికి రాకూడదు

మనం ఎటూ చెందకుండా వుండటమే మంచిది. ముందే ఏ అభిప్రాయాలూ, నియమాలు పెట్టుకో గూడదు. నీతిసూత్రాలైనా, మరేవైనా సరే, సాంఘిక, మానసిక ఏ కట్టుబాట్లు ఏవైనా అవి అన్నీ అడ్డంకులే. ఈ నియమాలు, కట్టుబాట్లలో ఒక్కదాన్ని దాటి పోవటానికి కొందరికి దశాబ్దాలు కూడా పట్టింది. అందుకని మనం విముక్త మనస్కులమై యుండాలి. నిరాడంబరతకు సిద్ధంగా ఉండాలి — అజ్ఞానిని అని అవగాహన

కలిగిన నిరాడంబరత. అప్పుడు మనం ఎలా అజ్ఞానంలో పడ్డామో మనకు తెలుస్తుంది. దాని వలన క్రొత్తదానికి ఆహ్వానం వస్తుంది. ఏదైనా మార్పు సంభవించటం అప్పుడే మొదలౌతుంది. అభివృద్ధి కోరాలంటే జ్ఞానపిపాస, మార్పుపై ఆకాంక్ష సహజంగా ఉండాలి. అన్నిటినీ మించి సత్యాన్వేషణ, ప్రేమలయందు మనసు లగ్నం అయితే త్వరగా ముందుకు సాగవచ్చు. ఒక బలమైన కోరిక, తృష్ణ అవసరం.

తాను నమ్మిందే నిజమనుకోవటం, తన అలవాట్లను వదులుకో లేకపోవటం, అవసరాలను ప్రక్కన పెట్ట లేకపోవటం, కేవలం ప్రపంచాన్నే అంటిపెట్టుకొని వుండటం లాంటివే బంధనాలు అంటే. ఒకదాని తర్వాత మరొకటిగా వీటి నుండి విముక్తులము కావాలి.

నేను ఇది కొన్ని వేల సార్లు చెప్పాను. కాని అదంతా బూడిదలో పోసిన పన్నీరైపోయిది. ఇంకా అంతా పాత దారిలోనే పోతున్నారు. ఇతరులకు బోధలు చేసే వారు సైతం తమ ధోరణులను మార్చుకో లేకపోతున్నారు. పాత విధానాలకే పరిమిత మౌతున్నారు. అవే ఆలోచనలను చేస్తున్నారు. తమ విధానమే అసలైనది అని నమ్ముతున్నారు. బంధనలను వీడండి; స్వేచ్ఛగా జీవించండి. అన్నిటినీ వదలటానికి సిద్ధం కండి — ఆకాంక్ష, తృష్ణలను మినహా!

నాకు ఇప్పుడు బోధపడుతున్నది. కొందరికి 'దివ్యత్వం' పై నమ్మకం లేదు. ఉన్నా అది ప్రాక్పశ్చిమల భావజాలంలో కూరుకు పోయిది. ఎంత దుర్భరం. వాళ్ళ జీవితాలను ఇదే అయోమయంలో పడేస్తున్నది. మీ కెందుకులే. మీకు కావలిసినది వేరు. అది 'ప్రేమ'; అది 'సత్యం'. అది ఉన్నతమైన పరిపూర్ణత్వం. ఇవి చాలు. మీకు ఎంత తక్కువ నియమాలుంటే అంత మంచిది. "పరిపూర్ణత్వం" ఒక్కటే చాలు. అది మీకు తృప్తి నిస్తుంది. మధ్యే మార్గాలు వీడండి, ముందుకు సాగిపోతారు. మీ మార్గం మీదే. దాని ప్రాధాన్యతను సంశయించవద్దు. ఈనాటి అమెరికా యువతీయువకుల విపరీత ధోరణులూ ఒక విధానమే! మనకు అవి అనవసరం. మీ మార్గాన ముందుకు సాగండి మీరు.

CWM 11:5

శ్రీమాత

*

దివ్యత్వం గురించి ఇదివరకటి భావాలను అధిగమించాలి.

"పూర్ణయోగం" గురించి తెలుసుకోవాలంటే ముందుగా దివ్యత్వమే పరిపూర్ణమైన భావన అని గ్రహించాలి. మీ హృదయాలు మీ ఆకాంక్షలను స్వీకరించ గలిగినంత విశాలంగా ఉండాలి. సంకుచితత్వం ఏ మాత్రం ఉండకూడదు. మతాలను, వాటి శాఖలను దూరంగా వుంచటమే చాలదు. వర్ణనాతీతమైన సత్యాన్ని గ్రహించలేని పాక్షిక వేదాంత భావాలేవైనా సంకుచితాలే ఔతాయి.

CWSA 23:82

శ్రీఅరవిందులు

*

ప్రశ్న: శ్రీమాతా, పరిపూర్ణ దివ్యత్వ భావన అంటే శ్రీఅరవిందుల ఉద్దేశ్యంలో ఏమిటి?

సమా: ప్రతి వ్యక్తీ తనకు అనుకూలంగా, తన తెలివితేటలకు అనుగుణంగా దివ్యత్వ భావనను రూపొందించుకుంటాడు. వాళ్ళు కోరుకున్న దేవుళ్ళని వారు ఊహించు కుంటారు. ఏ దైవానికి సమీపంలో ఉండాలనుకుంటారో ఆ దైవాన్నే ఊహించు కుంటారు. ఈ విధంగా దివ్యత్వ భావన చాల పరిమితులకు లోబడి పోతుంది.

ఎప్పుడు 'దివ్యత్వం' అంటే మనం అనుకున్నదే కాదు. ఇంకా విస్తృతంగా వుంటుంది అని ఎప్పుడూ అనుకుంటామో అపుడు మనం 'పరిపూర్ణత్వం' అనే భావన దిశగా ఎదుగుతాము. ఇది సాధారణ మానవచేతనకు అందదు. సాధారణ మానవచేతన తన పరిధిని దాటి పోలేదు. కాని, తనకు అనుగుణంగా తన చేతనను ఎవరు మలుచుకోగలరో వారికి కొద్ది కృషితో 'పరిపూర్ణత్వం' అనేది అవగాహన లోనికి వస్తుంది.

నీకు అనుకూలమైన దివ్యత్వ భావనను నీవు అన్వయించుకుంటావు కదా? కాని నిజంగా నీ మనస్తత్వం నుండి బయటపడి పూర్ణయోగ సాధన మొదలు పెట్టా లంటే 'దివ్యత్వం' నీవు భావించిన విధంగానే ఉండకపోవచ్చుననీ, ఇతరుల భావనలకు కూడా అవకాశం ఉండవచ్చుననీ నీవు ముందుగా గ్రహించాలి. ఇంతే కాదు అది ఎవరూ ఊహించలేని విధంగా కూడా ఉండవచ్చు. ఇది గ్రహించాలి. ఇది అర్థం చేసుకున్నపుడే పూర్ణయోగం దిశగా అడుగులు వేయగలవు. మనకు తెలియకుండా

అది మనం భావించినట్లు ఉంటుందని సహజంగానే ఊహిస్తాము. ఇది దివ్యత్వం అనీ, ఇది కాదనీ నిర్ణయిస్తాము కూడా. అలాంటి వాళ్ళకు తెలిసినది నిజంగా ఎంత?

ఇంతే కాదు కొందరు ఇక్కడకు వచ్చి ఆశ్రమ కార్యకలాపాలను చూచి, ఆశ్రమానికీ దివ్యత్వానికి సంబంధమే లేదనుకుంటారు. వారికేం తెలుసని వారు అలా భావిస్తారు? దివ్యత్వం అంటే మీ అభిప్రాయం ఏమిటి అని సూటిగా అడిగా మనుకోండి. వారు ఏమీ చెప్పలేక తెల్లముఖం వేస్తారు. అసలు విషయం ఏమిటంటే మనకు ఎంత తక్కువ తెలిస్తే అంత ఎక్కువ నిర్ణయాధికారం వచ్చినట్లు భావిస్తాము. కాని బాగా తెలిసినవాళ్ళు ఇదమిద్దమని దేన్నీ తేలికగా అంచనా వెయ్యలేరు. నిండుకుండ తొణకదు. ఏ విషయాన్నైనా అర్థం చేసికోటానికే ఎక్కువ సమయం పడుతుంది. మంచిచెడ్డలు నిర్ణయించుటం ఎంతో కష్టమని తెలుస్తుంది కూడా. అవగాహన పెరిగిన కొద్దీ విషయాల మధ్య ఉన్న సంబంధాలు, వాటి ప్రాధాన్యతలూ, గమ్యానికి, మనకూ ఉన్న దూరం నెమ్మదిగా తెలుస్తాయి. కాని ప్రపంచంలో అస్తవ్యస్త భావన మాత్రమే ఉన్నది. అందరూ శ్రద్ధగా గమనించాలే గాని, దేన్నీ ఇదమిద్ధమని నిర్ణయించటం తగదు.

ఇది దివ్యత్వమా కాదా అనే విషయాన్ని నిర్ద్వందంగా తేల్చటం సాధ్యపడదు. ప్రపంచం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకున్నపుడు, కూలంకషంగా అవగాహన చేసుకున్నప్పుడు దేన్నీ కాదనలేము, దేన్నీ పరిహరించలేము. అలా చేస్తే మన అవగాహనను మొత్తంగా చెదిరేలా చేసుకున్నట్లే.

శ్రీమాత

అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు

భవిష్యత్తులోకి దూకటానికి గతాన్నొక స్ప్రింగ్ బోర్డుగా వాడుకోవాలి.

CWM 15:70

శ్రీమాత

భవిష్యత్తుకు బాట

నూతన జీవితంలో పునర్జీవించాలంటే గతాన్ని వదిలేయాలి

ఓ ప్రభూ, ఈ సంవత్సరాంతంలో మేం చేసే ఈ సామూహిక సమావేశంతో బాటు, మాకు ఉన్న అనేక బంధాలు, అనుబంధాలు, భ్రమలు, బలహీనతలు, మా జీవితాల్లో ఇంక ఏ మాత్రం ప్రయోజనం లేనివన్నీ అంతరించి పోవడానికి ఈ సందర్భం మాకు సహకరించేలా అనుగ్రహించు. ప్రతి క్షణం గతాన్ని దులిపిన ధూళి వలె విదిలించుకోవాలి, అప్పుడే అది ప్రతి నిమిషం మా ముందు తెరుచుకొనే నిష్కళంకమైన మార్గాన్ని పాడు చేయకుండా ఉంటుంది.

మాలో అంగీకరించబడి, సరిచేయబడిన మా తప్పులు ఇక పైన నిష్ఫలమైన ఎండమావులుగా శక్తివిహీనమై ఎలాంటి పర్యవసానాలకు దారి తీయకుండా ఉండు గాక. స్థిరంగా వేసే మా అడుగులతో ఉండకూడని వాటిని, అజ్ఞానాన్ని, సమస్త అస్పష్టతను, అహంకారాన్ని అణిచివేతుము గాక. మేం ఈ యాత్రలో ధైర్యంగా మరింత ఉన్నత స్థితులకు, మరింత గాఢ ప్రకాశం వైపు, మరింత పరిపూర్ణ కారుణ్యం వైపు, మరింత రాగరహిత ప్రేమ వైపుగా నీ వైపుగా సాగుదుము గాక.

ఓ ప్రభూ, నీక జయమగు గాక, మా జీవితాలను నడిపించే నాయకుడా, ఈ పృథ్వి మొత్తం నీ పాలనగా బహిరంగంగా ప్రకటించాలని కోరుతున్నాను.

*

ప్రతిక్షణం మనం సమస్తాన్ని పొందడానికి ఎలా అంతటిని వదులుకోవాలో తప్పక తెలుసుకోవాలి. మనం మన గతాన్ని మృతప్రాయమైన శరీరం వలె విసర్జించ గలగాలి. అప్పుడే మనం అధిక సమృద్ధితో, పునర్జీవితులం కాగలం... అప్పుడే అంతరంగ అస్తిత్వం యొక్క నిరంతర ఆకాంక్ష తనకు తానుగా వ్యక్తపడగలదు. అది 'నీ' వైపు తిరిగి సర్వదా పవిత్రమైన అద్దంలో నిన్ను ప్రతిబింబింప చేయాలని కోరుతుంది.

మీ మరపులేని దివ్యానందం దానిలో ఒక నిరుపమానమైన, ప్రగాఢమైన చోదకశక్తిగా మారిపోగలదు. ఈ శక్తి అత్యంత బాహ్య అస్తిత్వంలో ఒక ప్రశాంతమైన దృఢ సంకల్పంగా పరివర్తన చెందుతుంది. దానిని ఏ అవరోధం అడ్డగించలేదు.



దైవాన్ని మాత్రమే పట్టుకుని ఉండు, గతాన్ని కాదు.

నీ మనస్సును సంపూర్ణంగా శూన్యం చేసి, ఆ దివ్యశక్తిని అందుకో. దైవాన్ని ఒక్కడినే పట్టుకుని ఉండు, గతాన్ని కాదు. దైవమే సత్యం, దైవమే ప్రేమ, దైవమే సుఖం, సంతోషం....

Mother you said so, p.88

శ్రీమాత

ప్రతి క్షణం ఈ విశ్వం నూతనంగా సృష్టించబడుతుంది.

ప్రతి క్షణం మనం ఎదురు చూడనిదంతా, అనుకోనిదంతా, తెలియనిదంతా మన ముందుంటుంది. ప్రతి క్షణం ఈ విశ్వం సంపూర్ణంగా క్రొత్తగా సృష్టించబడుతుంది — దాని ప్రతి భాగంలో కూడా.

నీ సర్వశక్తిమయత్వంపై, నీ సంపూర్ణ వాస్తవికతపై మాకు సజీవమైన నమ్మకం, దృఢమైన విశ్వాసం ఉంటే, ప్రతి క్షణం నీ అభివ్యక్తి రూఢిగా తెలుసుకోగలిగితే, దాని వల్ల ఈ మొత్తం ప్రపంచమంతా పరివర్తన చెందుతుందనేది రూఢి అవుతుంది. అయితే మా చుట్టూ ఉన్న ప్రతి విషయానికి, మా కళ్ళ ముందు కదిలిన ప్రతిదానికి, మేము బానిసలమై తాము. ఈ అభివ్యక్తిలోని సమస్తం వల్ల ప్రభావితులమౌతాం. అంతేకాక మా విశ్వాసం ఎంత బబహీనమంటే, ఈ ఆకృతుల రూపాంతరం అనే గొప్ప అద్భుతానికి మాధ్యమాలుగా ఇప్పటికీ సహాయపడ లేకుండా ఉన్నాం.... కాని ప్రభూ, ఏదో ఒక రోజు ఆ శుభదినం వస్తుందని నాకు తెలుసు. మా దరి చేరిన వారి నందరిని నీవు పరివర్తన చేసే ఒక రోజు వస్తుందని నాకు తెలుసు. మీరు వారి నందరినీ ఆమూలాగ్రంగా పరివర్తన చెందించి, గత బంధనాల నించి సంపూర్ణంగా విడుదల గావించి, వారిని సంపూర్ణంగా నీలో జీవించడం ప్రారంభించునట్లు చేస్తారు. మీ వలన పొందిన జీవితానికి మీరే సర్వ సార్వభౌమునిగా తెలుసుకుని జీవిస్తారు. ఆ విధంగా అన్ని ఆందోళనలు ప్రశాంతపడతాయి, క్రోధమంతా శాంతిగా మారుతుంది, అన్ని సందేహాలు నిశ్చితాలుగా మారుతాయి. వికారమంతా సామరస్యంగా, అహంకారమంతా ఆత్మసమర్పణగా, అంధకారమంతా ప్రకాశంగా, దుఃఖమంతా మార్పుచెందని సౌఖ్యంగా పరివర్తన చెందుతాయి.

*

ప్రభువు అతడి సంకల్పాన్ని వ్రాయడానికి అతడి ముందు తెల్లకాయితం వలె శూన్యంగా ఉండు.

ఓహ్, ప్రభూ, మీ ముందు నేను ఎల్లప్పుడు ఒక సంపూర్ణంగా, శూన్యంగా ఉన్న పేజీ వలె ఉంటాను. అప్పుడు మీ సంకల్పం ఏ కష్టం లేకుండా ఏమాత్రం కలుషితం కాకుండా నాలో స్వచ్ఛంగా వ్రాయబడుతుంది.

నిరంతరం సాగే ఈ నీ నిత్య నూతన నిర్మాణంతో కూడిన నీ కార్యానికి ఏ అవరోధం లేకుండా ఉండాలంటే ఆలోచన నుంచి గతం లోని అనుభవా లన్నింటిని వాటి జ్ఞాపకాలని ఒక్కసారిగ సంపూర్ణంగా తుడిచిపెట్టాలి. ఆ కారణంగానే అన్యో న్యాశ్రితమైన ఈ ప్రపంచంలో 'మీ' పరిపూర్ణ అభివ్యక్తి వీలుపడుతుంది. తరుచుగా మనం ఒక విలువైన అనుభవం పోగొట్టుకుంటామనో లేదా మరింత విస్తృతమైన, ఉన్నతమైన చైతన్యాన్ని కోల్పోతామో అన్న భయంతో మళ్ళీ ఆ నిమ్నస్థితి లోకి పడిపోతూ, దాన్నే పట్టుకుని వేళ్ళాడుతూ ఉంటాం.

అయినా నీ వాడైనవాడు దేన్ని గురించి భయపడాలి? అతడు ఆనందంతో ఉన్న ఆత్మతో, వెలిగే కనుబొమలతో, మీరు అతడి కోసం వేసిన బాటలో నడవలేడా? అది ఏదైనా సరే, ఆ మార్గం అతడి పరిమిత హేతువుకి గ్రాహ్యం కాకపోయినా ఏమాత్రం సరే స్వీకరించలేడా?

ఓ ప్రభూ, ఆ గతించిన పాత యోచనా చక్రాలని ఛేదించు. గత అనుభవాలని నిర్మూలించు, నీవు అవసరమని భావిస్తే ఆ చైత్య సంయోజనాలని కరిగించు, ఎందుకంటే అప్పుడే నీ కార్యం నిత్యప్రవర్ధమానమై సాధించబడుతుంది. ఈ పృథ్వి పై నీ సేవ పరిపూర్ణమౌతుంది.

గతం మరణించి నూతన జీవితం ఆవిర్భవించాలి

అంతర్ముఖమైన స్థితిలో తిప్పివేస్తున్న ఈ పేజీ గడిచిపోయిన స్వప్నంలోకి లయమై సర్వశక్తి సంభావ్యతలతో సంపన్నమైన కొత్త పేజీలో నూతనంగా భవిష్య స్వప్నంలో ఆవిష్కృతమౌతున్నది చూసాను. నీ శాశ్వత ప్రకాశంలో చూసినప్పుడు ఇది ఎంతో సామాన్యంగా, పరిణితిలేని పసితనంగా, ప్రాముఖ్యత లేనిదిగా కనిపిస్తోంది. ఒకే ఒక ముఖ్యమైన విషయం 'మీ' ప్రభుత కు ఆనందంతో, ప్రేమతో విధేయులమై ఉండడమే అని తెలుసుకున్నాను.

తన బాహ్యరూపంలో గతమంతా అసంగతమైనదిగా, హేతుబద్ధం కానిదిగా నాకు కనిపిస్తోంది, అయినా దాని కాలంలో అది ఉపయోగపడిందని నాకు తెలుసు.

కాని ఇప్పుడంతా మారిపోయింది, ఒక నూతన రంగం ఆవిష్కృతమయింది.

*

నేను ఒక నూతన జన్మ పొందినట్లుగా అనిపిస్తోంది. గతంలోని పద్ధతులు, అలవాట్లు

ఇప్పుడింక ఏమి ఉపయోగపడ వనిపిస్తోంది. నేను ఫలితాలుగా భావించినవి కేవలం ప్రయత్నాలు తప్ప మరేం కాదని తెలుస్తోంది. నే నింకా ఏం చేయలేదనట్లుగా భావిస్తున్నాను. నేనింకా ఆధ్యాత్మికంగా జీవించటం లేదని, అందులోకి నడిపించే మార్గంలోకి మాత్రమే ప్రవేశించానని అనిపిస్తోంది. నాకేం తెలియదని, దేనిని రూపొం దించడానికి నాకు సమర్థత లేదని, ఇంకా అనుభవం ప్రారంభం కాలేదని, నేనింకా అనుభవం పొందలేదని తెలుస్తోంది. అది నా మొత్తం గతం అన్నకోశాన్ని విసర్జించి నట్టుగా ఉంది. అందులోని పొరపాట్లు, విజయాలు, అన్నీ మాయమై ఇప్పుడు నూతనంగా జన్మించిన బిడ్డకు ఆ ప్రదేశాన్ని ఖాళీ చేసి ఇచ్చినట్లుగా ఉంది. ఎందుకంటె ఆ బిడ్డ మొత్తం జీవితాన్ని ఇంకా జీవించాల్సి ఉంది. ఇప్పటి దాక అతడికి 'కర్మ' మొదలు కాలేదు. అందువల్ల నేర్చుకోడానికి అనుభవం లేదు. ఇప్పుడు సరిచేయాల్సిన పొరపాటు కూడా లేదు. నా శిరస్సు జ్ఞానమంతటి నించి, సర్వ ప్రగాఢ విశ్వాసాల నించి, అనవసరపు ఆలోచనల నించి శూన్యమైంది. నేను ఈ స్థితిని ఎదుర్కొందుకు ప్రయత్నం చేయకుండా సమర్పణ చేయడం నేర్చుకోగలిగితే, నేను తెలుసుకొనుటకు గాని నేర్చుకొనుటకు గాని ప్రయత్నించకపోతే, నేను పూర్తిగా అజ్ఞానంతో నిజాయితీగా ఉన్న చిన్న పిల్లవాడిలా ఉండటానికి సమ్మతిస్తే, ఓ నూతన సంభావ్యత నా ముందు తెరుచుకుంటుందని నా కనిపిస్తోంది. నేనిప్పుడు ఏ షరతులు లేకుండా నన్ను నేను నిశ్చితంగా సమర్పించుకొని, మీ ఆలోచన, మీ సంకల్పం, తెల్లని కాగితంపై అడ్డంకి లేకుండా, ఎట్టి వైక్లవ్యానికి లోను కాకుండా వ్రాయబడటానికి వీలుగా నుండాలని తెలిసింది.

*

ఈ చివరి రోజుల్లో చోటు చేసుకున్న తీవ్రత కన్నా హెచ్చుగా గతం మృతప్రాయ మయింది. అది ఒక నూతన జీవితపు కిరణాల క్రింద పూడ్చబడినట్టు ఉంది.

ఈ పుస్తకంలోని పేజీలను చదువుతూ ఇప్పుడే చివరిసారిగా వెనుకకు తిరిగి చూచినప్పుడు ఈ మరణం గురించి గట్టి నమ్మకం ఏర్పడింది. ఓ నా దివ్యప్రభూ, ఓ పెద్ద భారం తొలిగి నేను తేలిగ్గా ఈ సంపూర్ణ నిరాడంబరత్వంతో, పసిబిడ్డ వంటి నగ్నతలో నీ ముందు నిలిచినపుడు... అప్పుడు కూడా నేను గ్రహించగలిగిన ఒకే ఒక్క విషయం ఆ నిశ్చలత మరియు ఆ పవిత్రమైన విస్మృతి.

*

నీ మృత గతం నించి వైదొలగి సూటిగా భవిష్యత్తు వైపు చూడు. యోగమార్గానికి వచ్చినపుడు నీవు నీ మానసకి నిర్మాణాలను నీ ప్రాణిక మంచెలను తునాతునకలు చేయడానికి సిద్ధంగా ఉండాలి. నీవు గాలిలో ఏ ఆలంబన లేకుండా, కేవలం నీ విశ్వాసం తప్ప మరేం లేకుండా నిలబడడానికి తయారుగా వుండాలి. నీవు నీ గత వ్యక్తిత్వాన్ని, అది అంటిపెట్టుకొని వున్నవాటిని పూర్తిగా మరిచిపోవాలి, వాటిని నీ చైతన్యం నించి పెకలించివేసి, నూతనంగా జన్మించాలి. అన్ని రకాల బంధాల నించి స్వేచ్ఛను పొందాలి. గతంలో నీవు ఏమిటన్నది ఆలోచించకు, నీవు ఏం కావాలని ఆకాంక్షిస్తున్నావో, నీవు దేనిని సాక్షాత్కరింప చేసుకోవాలని కోరుతున్నావో పూర్తిగా దానిలో లీనమై ఉండు, మృతగతం నుంచి వైదొలగి సూటిగా భవిష్యత్తు వైపు చూడు, నీ మతం, నీ దేశం, నీ కుటుంబం ఉపస్థితమై ఉన్నాయి — అదే దైవం.

CWM Vol. 1: 42, 282,54,277,114,116,123; Vol.3: 83-84

శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఏన్నడూ నిరుత్సాహపడవద్దు

శక్తి వున్నపుడు అమంగళకరమైనదాన్ని మంగళకరంగా మార్చవచ్చు. అలా మార్చగలిగేది ఒక అపరిమిత శక్తి. ఒకడు తప్పు చేసినట్లైతే, అది తీవ్రమైన తప్పిదమైనా, ఈ సత్యచేతనను, ఈ అతిమానస చేతనను దింపగలిగిన శక్తి వుండి దానిని పనిచేయనిస్తే అది బ్రహ్మాండమైన పురోగతి కొక సందర్భం అవుతుంది.

CWM 6:289

శ్రీమాత



వెలుగు ప్రసరించింది, మార్గం తెరుచుకొన్నది; అమిత శ్రమాభరితమైన గతానికి కృతజ్ఞతతో నమస్కరిస్తూ నీవు బార్లగా తెరిచిన క్రొత్త దారిన మేము వడి వడిగా ముందుకు సాగుతాం. మిక్కిలి సచేతనమైన సువిశాల సిద్ధి సాఫల్యతమనే ఆచరణ ముంగిట ఓ పరమేశ్వరా! సమగ్ర సమర్పణ, ఆరాధనలతో నీ ముందు మోకరిల్లుతున్నాము. అసలేమీ మిగిల్చుకోకుండా మమ్ములను మేము పరిపూర్ణంగా మీకే సమర్పించుకొంటున్నాం.

CWM 1:230

శ్రీమాత

గతంలో చేసిన తప్పిదాలతో పొరపాట్లతో వ్యవహరించవలసిన సూత్రాలు

గత పొరపాట్లను సరిదద్దుకోవడం

గతానికి చెందిన మూసలని ఛేదించుకొని గతం నుండి గడించిన లాభాలను దాని అంతర్ భావ శక్తిని భద్రంగా ఉంచు. లేకుంటే నీకు భవిష్యత్ ఉండదు.

CWM 10:283

*

జరిగే పొరపాట్లను, తప్పులను క్షణ క్షణం తుడిచివేయ లేకపోతే ప్రపంచానికి విముక్తి అనే ఆశ ఉండదు.

CWM 14:234

*

నీవు జీవితంలో ఒక్క తప్పు గనుక చేస్తే — దానికి జీవితాంతం బాధపడవలసి వుండవచ్చు. అంటే — దీని అర్థం ప్రతి ఒక్కరూ అలా బాధలు పడతారని కాదు. కొందరు తప్పులు చేసుకుంటూ పోయేవారుంటారు. అయినా ఎటువంటి బాధలను ఎదుర్కోరు. కానీ, ఎవరైతే ఆధ్యాత్మిక జీవితం గడపటానికి పుడతారో... వాళ్ళు చాలా జాగ్రత్తగా ఉండాలి.

CWM 14:234-35)

*

నీ తప్పును నీవు తెలుసుకోవటం మంచిది, కానీ వాటి వల్ల నిన్ను నీవు అతిగా బాధించుకో కూడదు. నీవు బాధపడ కూడదు, దానికి బదులుగా తప్పులను సరి చేసుకోవాలి.

CWM 14:237

*

ఎప్పుడైనా ఒక పొరపాటు జరిగితే, ఎల్లప్పుడూ దానిని మనల్ని మనం అభివృద్ధి పరచుకోవటానికి ఒక ఉపకరణంగా వాడుకోవాలి. ఒక్కసారి మార్పు యొక్క అవసరం

అనుభవం లోకి వచ్చిందంటే ఆ తప్పూ, దానికి గల కారణం కూడా అదృశ్యం అయిపోతాయి. అది పునారావృతం కాదు.

CWM 14:238

*

ప్రతి రాత్రి నిద్రించే ముందు ఈ రోజు నీ వల్ల జరిగిన తప్పులు మళ్ళీ భవిష్యత్ లో జరుగకుండు గాక, అని ప్రార్థించాలి.

CWM 14:239

*

ఒక్కొక్కసారి పూర్వపు అనుభవానికి చెందిన జ్ఞాపకాన్ని మనోఫలకం నుండి తుడిచివేయాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఆ స్మృతి కూడా పరిపూర్ణమైన దివ్యావతరణను అనుమతించే నిరంతర పునర్నిర్మాణ కార్యానికి అడ్డు తగలకుండా వుండటానికి.

CWM 15:70

*

తరచుగ క్రితం రాత్రి కలిగిన అనుభవం నుండి కలిగిన ఫలితాన్ని నష్టపోతామేమోనన్న భయంతో దాన్నే అంటిపెట్టుకుని ఉండి, ఆ కారణంగా ఒక విశాలమైన, ఉన్నతమైన చేతనను చేజార్చుకుని అట్టడుగు స్థాయికి మళ్ళీ పడిపోతాం. అందుకే ఎప్పుడూ మనం ముందుకే చూడాలి, ముందడుగు వేయాలి.

CWM 15:283

*

గతం గురించి ఎప్పుడూ పశ్చాత్తాప పడకూడదు. భవిష్యత్ ఎలా ఉంటుందోనని ఊహించకూడదు. ఎంతగా వీలైతే అంతగా మీ ఆలోచనల్లోని నిరాశావాదాన్ని అదుపులో వుంచుకొని, స్వయంగా ఆశావాదిగా మారాలి.

CWM 12:141

*

ప్రతి క్షణం సమస్తాన్ని పొందడానికై నీకు ఉన్నదాన్నంతా నష్టపోవటం ఎలాగో తెలుసుకోవాలి. చచ్చిన శరీరంలా గతాన్ని రాల్చివేసి మళ్ళీ మహోన్నతమైన పూర్ణత్వంలో జన్మ ఎత్తటం తెలుసుకోవాలి.

CWM 15:71

ప్రతి వ్యక్తీ తాను స్థిరంగా నుండే గతానికి చెందినవాడా లేక ప్రస్తుతం గడిచిపోతున్న వర్ధమానానికి చెందిన వాడా? లేదా... పుట్టడానికి తహ తహ లాడుతున్న భవిష్యత్ కు చెందిన వాడా అన్నదానిని తెలుసుకోవటంపై అంతా ఆధారపడి ఉంటుంది.

CWM 15:71

*

ఉదారమైన హృదయం ఎల్లప్పుడూ గత తప్పిదాలను మరిచిపోతుంది, చెదిరిన సామరస్యాన్ని మళ్ళీ కూడగట్టటానికి సిద్ధమౌతుంది. తేజోవంతమైన భవిష్యత్తును అంది పుచ్చుకోవడానికి మనల్ని మనం సిద్ధపర్చుకొనే నిమిత్తం గతంలోని చీకటి వికృతాల నన్నింటినీ మరిచిపోదాం.

ప్రేమాశీస్సులతో

CWM 16:357

శ్రీమాత

*

జీవితానికి భద్రత, గత తప్పిదాల పర్యవసానాలను తప్పించుకోగల త్రోవ సచేతనంగా దివ్యసన్నిధితో మమేక మవ్వడానికి నడుపుకొనిపోయే ఆంతరికాభివృద్ధి. అదే ప్రభావ వంతమైన మార్గదర్శి. మనలోనూ, అన్య సమస్త ప్రాణుల్లోనూ అలరారే సత్యం.

శ్రీమాత

*

యోగం చేయాలంటే ముఖ్యమైన వాటిల్లో సాధించవలసిన ప్రధానమైనది గతానికి సంబంధించిన అన్ని బంధనాలను త్రెంచివేసుకుని విముక్తుల మవడం.

గతాన్ని గతానికే విడిచిపెట్టు. నీవు ఎలాంటి అభివృద్ధిని కోరుకొంటున్నావో ఆ అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించు. భగవంతునికి శరణాగతుడవ్వడమే నీవు సాధించవలసింది.

*

గతానికి చెందిన అలవాట్లను, నమ్మకాలను బ్రద్దలకొడితే తప్ప భవిష్యత్ వైపుకు వేగంగా పోగల చిరు ఆశ అన్నది చిగురించదు.

*

గతానికి చెందిన తరంగాలు నీ నుండి దూరంగా సాగిపోనీ... వాటితో పాటే బంధనాలను,



జీవితంలో ఉన్న ఒకే ఒక రక్షణ, గత పొరపాట్ల పర్యవసానాల నుండి తప్పించుకొనే ఒకే ఒక మార్గం, దైవసాన్నిధ్యానికి దారి తీసే చేతనాపూర్వక ఐక్యతను వికసింపజేసే అంతరంగ అభివృద్ధి. అదే క్రియాశీలమైన మార్గదర్శి, మన అస్తిత్వానికి, సమస్త అస్తిత్వాలకు చెందిన పరమ సత్యం.

CWM 10:275

శ్రీమాత

బలహీనత లన్నింటినీ తీసుకొని పోని. దివ్యచైతన్యానికి చెందిన తేజోమయమైన ఆనందం వాటి స్థానాన్ని చేపట్టేందుకు తయారుగా ఎదురు చూస్తున్నది.

గతం గతంగానే మారిపోని
చిరంతనమైన దానిపైనే దృష్టి నిలుపు.
అశీస్సులు

*

ప్రశ్న: ఈ జీవితంలోను గత జన్మలలోను చాలా కాలంగా దైవాన్ని మరిచాను. నీ కృపాసాగరంలోని ఒక్క బొట్టు నేను పోగొట్టుకొన్న కాలాన్నంతా మరల్చుకో గల సమర్థతను నాలో కలుగ జేయగలదా?

సమా: జరిగిపోయింది ఏమన్నా కానీ! భగవంతునితో బాంధవ్యాన్ని ఏర్పరచుకోవడానికి కాలంతో పని లేదు. ఉండవలసింది చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్ష.

CWM 15:71-72-; 16:371

శ్రీమాత
అనువాదం; హర్షవర్ధన్